# అన్నమాచార్య సంకీర్తనములలోని వర్ణనలు

డా॥ గుమ్మా సాంబశివరావు

# అన్నమాచార్య
# సంకీర్తనములలోని వర్ణనలు

1985లో నాగార్జున విశ్వవిద్యాలయము
పిహెచ్.డి. పట్టము పొందిన సిద్ధాంత గ్రంథము.

డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఎం.ఎ., పిహెచ్.డి.

# అన్నమాచార్య సంకీర్తనములలోని వర్ణనలు

నాగార్జున విశ్వవిద్యాలయము నుండి పిహెచ్.డి పొందిన సిద్ధాంత గ్రంథము

రచయిత :

డా॥ గుమ్మా సాంబశివరావు ఎం.ఏ., పిహెచ్.డి.,
ఆంధ్రోపన్యాసకులు, ఆంధ్రాలయోలా కళాశాల,
విజయవాడ – 8.

(C) డా॥ గుమ్మా సాంబశివరావు

ప్రథమ ముద్రణ : ఆగష్టు 1990
ప్రతులు : 1000
వెల : 80/-

ప్రతులకు :

శ్రీమతి శశికళ B.Com.
C/o గ్రంథకర్త
కళాసుషమా ప్రచురణలు
భారతీనగర్, విజయవాడ – 8

ముద్రణ : విజేత ప్రింటర్స్, 3/1 బ్రాడీపేట, గుంటూరు – 2

ఈ సిద్ధాంత గ్రంథము

శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారి

'ధార్మిక గ్రంథ ప్రచురణమునకిచ్చు ఆర్థికసాహాయ్యమున'

ముద్రితమైనది.

ఈ గ్రంథ ముద్రణమునకు

ఆర్థిక సాహాయ్యమందించి ప్రోత్సహించిన వారు

తెలుగు విశ్వ విద్యాలయము, ఆంధ్రప్రదేశ్.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| | విషయ సూచిక | IV |
| | అంకితము | V |
| | ఆమోదం | VI |
| | కృతజ్ఞతాంజలి | VII |
| | భూమిక | VIII |
| 1. | అన్నమయ్య జీవిత విశేషములు | 1—18 |
| 2. | వర్ణనలు — లాక్షణికులు | 19—33 |
| 3. | అన్నమాచార్య సంకీర్తనములలోని వర్ణనలు - వర్గీకరణ | 34—59 |
| 4. | అన్నమాచార్య సంకీర్తనములలోని వర్ణనలు | 60—274 |
| 5. | అన్నమయ్య — ఇతర కవులు | 275—306 |
| 6. | ఆంధ్ర సాహిత్యములో అన్నమాచార్యుని స్థానము | 307—327 |
| | ఉపయుక్త గ్రంథ సూచిక | 328—332 |



శ్రీ యస్. గంగప్పగారు　　శ్రీమతి పార్వతీగారు

四年

[illegible]

[illegible]

# అంకితము

సీసమాలిక : రాయలేలిన మేటి రతనాల సీమలో
రత్నమై జన్మించి రాశికెక్కి
కోలాచలమువారి గొప్పదనమునెల్ల
సిద్ధాంత గ్రంథాన చెప్పినారు
'క్షేత్రయ్య కవిత' సూక్ష్మేక్షికన్ రచియించి
బహుమతి తొలిసారి బడసినారు
'రాజరాజ ప్రశస్తి' రమ్యమ్ముగా కూర్చి
బుధులచే సన్నుతుల్ పొందినారు
'తెలుగు పద కవిత' ధీయుక్తి విరచించి
మలిసారి బహుమాన మందినారు
'వేయి పడగల'ను విశ్లేషణము చేసి
వివరించి శిష్టులై వెలిగినారు
జనపద సాహిత్య సౌరభ పేటికల్
పాఠక లోకాన పరచినారు
నాటక సాహిత్య నైజమ్ము గ్రహియించి
'తెలుగు నాటకము'న తెలిపినారు
సాహిత్య జలధిని సతతమ్ము మథియించి
జాతీయ స్థాయి ఆచార్యులైరి

తే॥గీ॥ గురువు గంగప్ప గారిట్లు కోర్కె మీర
శారదా సమారాధన సలిపివారు
ఇన్ని గుణముల రూపింప నిట్లు హేతు
వయ్యె, వీరిపత్ని, సుమతి, పార్వతమ్మ

తే॥గీ॥ పార్వతీశుల వోలె శబ్దార్థ రీతి
నిరతమన్యోన్య మైయుండు నిపుణమతులు
ఘనులు పార్వతీ గంగప్ప గార్లకిపుడు
అంకితమ్మిత్తు మద్గ్రంథ మతుల రీతి

డాక్టర్ గుమ్మా సాంబశివరావు

ఆచార్య ఎస్. గంగప్ప
ఎం.ఏ.,పిహెచ్.డి.
యు.జి.సి జాతీయాధ్యాపకులు
అధ్యక్షులు
తెలుగు ప్రాచ్య భాషా విభాగం
నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జున నగర్ — 522 512

# ఆమోదం

తెలుగు సాహిత్యంలో పదసాహిత్యానికి ప్రత్యేక స్థానముంది. ఈ పద సాహిత్యానికి పట్టం గట్టిన ప్రముఖ వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. "అన్నమాచార్యుల సంకీర్తనములలోని వర్ణనలు అనే సిద్ధాంత గ్రంథం పరిమిత కాలంలో నా పర్యవేక్షణలో పూర్తి చేసి పిహెచ్.డి. పట్టం పొందిన వర్ధిష్ణువు డా॥ గుమ్మా సాంబశివరావు. విద్యార్థిగా, పరిశోధకుడుగా తెలివితేటల్ని, ప్రతిభపాటవాన్ని ప్రకటించి అధ్యాపకుల ప్రేమాదరణలకు, ప్రశంసలకు పాత్రుడయ్యాడు. పట్టుదల, దీక్ష, అతనిలోని మెచ్చదగ్గ గుణాలు మాత్రమేకావు. అతని అభివృద్ధికి హేతువులు.

ప్రబంధాలలో వర్ణనల ప్రాధాన్యముండడం సహజమే. కానీ అన్నమాచార్యులు సంకీర్తనల్లో వివిధ వర్ణనలు మధుర మంజులంగా చేయడం విశేషం. ఆ వర్ణనా వైదగ్ధ్యాన్ని ఈ సిద్ధాంత గ్రంథంలో చూడగలము. అన్నమాచార్యుల జీవిత వివరాలతో పాటు, సంకీర్తనల్లోని వివిధ వర్ణనలను వర్గీకరించి, లాక్షణికులు చెప్పిన వర్ణనా రీతుల కంటే అధికంగానే సోదాహరణంగా సమన్వయించి. విశ్లేషించి దర్శింప చేయడంలో, ఇతర కవులతో అన్నమాచార్యులను పోల్చడంలో, ఆంధ్రసాహిత్యములో అన్నమాచార్యుల స్థానం నిర్ణయించడంలో డా॥ సాంబశివరావు ఉత్తమ పరిశోధకుడుగా నిరూపించుకొన్నాడు. పరిశోధన శాస్త్రీయంగా సాగి అనుకార్యయోగ్యంగాఉంది.

ఇలాంటి ఉత్తమ సిద్ధాంత గ్రంథ దౌహిత్రిని నా సహధర్మచారిణి నేను అంకితంగా స్వీకరించడానికి అమితానందాన్ని, ఆమోదాన్ని ప్రకటిస్తున్నాము.

వర్ధిష్ణువు డా॥ సాంబశివరావు సిద్ధాంత గ్రంథం పండితామోదం పొందగలదనీ, మరిన్ని ఉత్తమ గ్రంథాలు రచించి యశస్వి కావాలనీ, ఆకాంక్షిస్తున్నాను, ఆశీర్వదిస్తున్నాను.

1-8-1990 (సం) ఎస్. గంగప్ప

# కృతజ్ఞతాంజలి

పదకవితపై ప్రత్యేకాభిమానము కలిగించి, సిద్ధాంత వ్యాసములోని ప్రత్యక్షరమును పరిశీలించి, ఈ రూపములో దిద్దితీర్చిన సాహితీ కృషీవలులు, పదకవితా విమర్శకాగ్రేసరులు, జాతీయాచార్యులునైన మద్గురు వర్యులు ఆచార్య ఎస్. గంగప్పగారికి శత సహస్ర వందనములు. అన్ని వేళల అన్నపూర్ణాదేవివలె ఆదరించిన శ్రీమతి పార్వతి గంగప్పగారికి నా వినయాంజలి.

పరిశోధనకు అవకాశము కల్పించిన శిష్యవత్సలులు, విశ్రాంత ప్రాచార్యులునైన తూమాటి దొణప్పగారికి నా వినమ్రాంజలి.

నాపరిశోధన కొనసాగుటకు కావలసిన గ్రంథములను, నాగార్జున విశ్వవిద్యాలయ గ్రంథాలయమునకు ఉచితముగ పంపించిన తిరుమల తిరుపతి దేవస్థానము వారికి ప్రభుత్వ గ్రంధాలయము (గుంటూరు) గౌతమీ గ్రంథాలయము (రాజమండ్రి) నాగార్జున విశ్వవిద్యాలయ గ్రంథాలయాధికారులకులకు నాకృతజ్ఞతాంజలి.

అన్ని వేళల నాశ్రేయస్సు నాకాంక్షించు డా॥ S. మస్తాన్ భాయికి నాసలాములు.

ప్రాథమిక విద్యాగురువులైన శ్రీ చిలకపాటి పూర్ణచంద్రరావుగారికి నానమస్సులు.

అన్ని విధముల నా విద్యావ్యవసాయము కొనసాగుటకు కారకులైన నా తల్లిదండ్రుల, సోదరుల ఋణము తీర్పలేనిది.

నామీది అనురాగముతో ఈ సిద్ధాంత గ్రంథమును అంకితము తీసికొనుటకు అంగీకరించిన ఆచార్య గంగప్ప దంపతులకు నాకైమోడ్పులు.

ముద్రణ సమయమునందు నాకు అన్నివిధముల సహకరించిన నా శ్రీమతి శశికళకు అభినందనలు.

ఈ సిద్ధాంత గ్రంథ ముద్రణకు ఆర్థికముగ సహకరించిన తిరుమల తిరుపతి దేవస్థానము, తెలుగు విశ్వవిద్యాలయాధికారులకు కృతజ్ఞతలు.

నాకు అన్నివిధముల ప్రోత్సాహ మిచ్చుచున్న మా 'ఆంధ్ర లయోల కళాశాల' ప్రిన్సిపాల్, రెవరెండ్, ఫాదర్ అన్నయ్యగారికి నానమస్సులు.

అన్ని విధముల నాపై అభిమానమును చూపుచున్న డాక్టర్ యార్లగడ్డ లక్ష్మిప్రసాద్, మధురకవి శ్రీశనగన నరసింహస్వామి, నా శ్రేయోభిలాషులైన జి. చంద్రశేఖరరావు డా॥ వి. వల్లభరావు టి. శ్రీకృష్ణ బి నాగేశ్వరరావు శామ్యూల్ జాన్ గార్లకు నాకృతజ్ఞతలు.

ఎంత జాగరూకత వహించినను కొన్ని అచ్చుతప్పులు తప్పలేదు, దీనికి సహృదయుల సౌమనస్యమే శరణ్యము.

అందముగ ముద్రించి ఇచ్చిన శ్రీవిజేత ప్రింటర్స్ (8/1 బ్రాడీపేట, గుంటూరు) అధినేత శ్రీ కె. వి. సుబ్రహ్మణ్యం గారికి అభినందనలు.

# భూమిక

నేను పరిశోధకునిగ చేరిన క్రొత్తలో, గురువర్యులు డా॥ గంగప్పగారు అన్నమాచార్యుని సంకీర్తనమైన "కాలములారును కలిగెనీకు నిదె
బాలకియందే పైపై నీకు" (26–88) అను సంకీర్తనమును ఉదహరించి ఒక్క నాయిక యందే ఋతు సంపద నంతటిని వర్ణించిన అన్నమయ్య వర్ణనా నైపుణ్యమును వివరించి, పదకవితపై ప్రత్యేకాభిమానము కలిగించినారు. ఇంతకు పూర్వము అన్నమయ్య సాహిత్యముపై కొంత పరిశోధన జరిగినది. కాని అన్నమయ్య సంకీర్తనములలోని వర్ణనలపై పరిశోధన జరుగలేదు. ఆవిధముగ జరుగక పోవుట 'మత్పురాకృత శుభాధిక్యము'గా భావించి అన్నమయ్య వర్ణనలపై పరిశోధన ప్రారంభించితిని

భక్త కవిగా, పదకవితా పితామహునిగ ప్రసిద్ధి పొందిన అన్నమయ్య తిరుమల నివాసుడైన శ్రీనివాసుని కొనియాడుచు 32వేల సంకీర్తనములు రచించెనని ప్రతీతి. అన్నమయ్య రచించిన సంకీర్తనములలో అల్పాక్షరములలో అనల్పార్థము గోచరించును. పదసాహిత్యమునందు ప్రౌఢకవులను మించిన వర్ణనలు గావించిన అక్షర శిల్పి అన్నమయ్య. సంకీర్తనాచార్యుని శృంగారాధ్యాత్మిక సంకీర్తనములలోని బహుముఖీనమైన వర్ణనలను సహృదయుల కందించుటకు ప్రయత్నించితిని.

నాయీ సిద్ధాంత గ్రంథము ఆరు ప్రకరణములుగ విభజింపబడినవి. మొదటి ప్రకరణమున అన్నమయ్య జీవితవిశేషములు పదకవితా పరిచయముగావింపబడినవి. రెండవ ప్రకరణమున వర్ణనలను గూర్చి సంస్కృత లాక్షణికుల, తెలుగు కవుల, లాక్షణికుల అభిప్రాయములు వివరింపబడినవి. మూడవ ప్రకరణమున అన్నమాచార్యుని సంకీర్తనములలోని వర్ణనలు ప్రధానముగా శృంగార, ఆధ్యాత్మిక, శృంగారాధ్యాత్మిక సంబంధి వర్ణనలుగా వర్గీకరింపబడినవి. ఇట్లు వర్గీకరింపబడిన వర్ణనల సమన్వయము నాలుగవ ప్రకరణమున గావింపబడినది. ఇది ఈ సిద్ధాంత గ్రంథమునకు హృదయ స్థానము. ఐదవ ప్రకరణమున అన్నమయ్యకు ఇతర కవులకు, పదకర్తలకు గల సామ్యములు విశదీకరింపబడినవి. ఆరవ ప్రకరణమున అన్నమాచార్యునికి ఆంధ్ర సాహిత్యమున గల సానము నిర్ణయింపబడినది. ఇది ఈ సిద్ధాంత గ్రంథమునకు ఉపసంహారము వంటిది.

ఈ సిద్ధాంత గ్రంథమున సాధ్యమైనంత వరకు క్రొత్తగా ముద్రింపబడిన సంకీర్తన సంపుటముల నుండియే ఉదాహరణలు ఇవ్వబడినవి. ఈ సిద్ధాంత గ్రంథము సరళ గ్రాంథికములో వ్రాయబడినది.

సూచికలు ప్రకరణాంతములలో చేర్చబడినవి. చివర ఉపయుక్త గ్రంథ సూచిక అనుసంధింపబడినది.

—డాక్టర్ గుమ్మా సాంబశివరావు

# అన్నమయ్య జీవిత విశేషములు

"ఏవేల్పు సర్వేశుఁ డేవేల్పు పరమేశుఁ
డేవేల్పు భువనైక హిత మనోభావకుఁడు
యేవేల్పు కడు సూక్ష్మమే వేల్పుకడు ఘనము
ఆవేల్పు తిరు వేంకటాద్రి విభుఁడు"(1-75)—అని

తన్మయత్వముతో శ్రీ వెంకటేశ్వరుని కొనియాడిన పరమభక్త శిఖామణి తాళ్ళపాక అన్నమయ్య. ఆయన జీవిత కాలమున భారతీయ సాహిత్యాకాశమంతయు భక్తి గీతములతో మారుమ్రోగినది. ఆనాడు ఏప్రాంతమున పరికించినను ఆయా ప్రాంతీయ భాషలలో మధురాతి మధురములైన భక్తి గీతముల ననంఖ్యాకముగ రచించిన భక్త కవులెందరో దర్శనమిచ్చినారు. అన్నమయ్య అవతరణముతో ఆంధ్ర సాహిత్యమున నూతన కాంతి పుంజములు వెల్లి విరిసినవి. తనకు పూర్వమున్న పురాణానువాద పద్ధతిని కాని, కావ్యానువాద విధానమును కాని స్వీకరింపక సరిక్రొత్త రీతిలో సంకీర్తన సాహిత్యమును సృష్టించిన సౌమ్యశీల అన్నమయ్య. శ్రీ వేంకటేశ్వరుని ఆస్థాన కవియైన అన్నమయ్య రచించిన ఒక్కొక్క పదము ఒక్కొక్క ప్రబంధము. అల్పాక్షరములలో అనల్పార్థ రచన గావించి వర్ణనా నైపుణ్యమును ప్రకటించిన పదకవితా పితామహుఁ డన్నమయ్య. ఆయన సాహితీ ప్రపంచమున పరివ్యాప్తమైన అసంఖ్యాకములైన వర్ణనల పరిశీలనము ప్రస్తుత సిద్ధాంత వ్యాస ప్రధానోద్దేశము. ఆయన సాహితీ జీవిత పరిశీలనమునకు ముందు ఆయన జీవిత విశేషములను గూర్చి తెలిసికొనుట ఆవసరమేనని భావింపవచ్చును.

అన్నమయ్య జీవితమును గూర్చి తెలిసికొనుటకు ఆయన మనుమడైన తాళ్ళపాక చిన తిరువేంగళనాథుడు (చిన్నన్న) రచించిన 'అన్నమాచార్య జీనిత చరిత్రము' ఆధారమగుచున్నది. మనుమడే తాతగారి జీవిత చరిత్రను రచించుట వలన అది విలువగల ప్రామాణిక గ్రంథముగ పరిగణింపబడినది. తన అనుభవములో ఉన్న, ఇతరుల ద్వారా తెలిసికొన్న విషయముల నాధారముగ చేసికొని చిన్నన్న అన్నమయ్య జీవిత విశేషములను వివరించినాడు. 'అన్నమాచార్య జీవిత చరిత్రము'నకు ముందు ఆంధ్ర సాహిత్య

ములో కొందరి జీవిత చరిత్రలు వెలసినవి. బసవ పురాణము, పండితారాధ్య చరిత్రము తిక్కన చరిత్రము మొదలగునవి ప్రసిద్ధములైనవి. కాని మొదటగ మనుమడే తాతగారి జీవిత చరిత్రను రచించిన కీర్తి ఆంధ్ర సాహిత్య చరిత్రలో చిన్నన్నకే దక్కిన దనవచ్చును.

అన్నమయ్య జన్మ స్థలము కడపజిల్లా రాజంపేట తాలూకాలోని తాళ్ళపాక గ్రామము. అదే వారి ఇంటి పేరుగ ప్రసిద్ధి పొందినది. అన్నమయ్య తల్లి లక్కమాంబ తండ్రి నారాయణ సూరి. ఆ పుణ్య దంపతులకు స్వామి నందకాంశమున జన్మించిన కారణ జన్ముడు అన్నమయ్య. వారు నందవరీక బ్రాహ్మణులు. ఋగ్వేదులు. ఆశ్వలాయన సూత్రులు. భారద్వాజగోత్రులు.

అన్నమయ్య జనన కాలమును గూర్చి భిన్నాభిప్రాయములున్నవి. అన్నమయ్య జనన కాలమును నిర్ణయించుచు డా॥ ఎస్. గంగప్పగారు "అన్నమయ్య క్రీ॥శ 1424 క్రోధి సం. వైశాఖ శుద్ధ పూర్ణిమనాడు విశాఖ నక్షత్రమందు జన్మించినట్లు కీ. శే. ప్రభాకరశాస్త్రి గారు వేర్కొని యున్నారు. శాస్త్రిగారే వేంకటేశ్వర వచనములకు పీఠిక వ్రాయుచు (1945 పీఠిక 12, 13) అన్నమయ్య జన్మకాలము క్రీ॥శ 1408 అని వ్రాసి, అన్నమాచార్య చరిత్ర పీఠిక (1949 పీఠిక పు 2,3) లో దానిని సవరించి క్రీ.శ. 1424 అని వ్రాసినారు. డా॥ వేటూరి ఆనందమూర్తి గారు 'తాళ్ళపాక కవుల కృతులు–వివిధ సాహితీ ప్రక్రియలు' అనే గ్రంథమున (పు 60–65) దీనినే బలపరచుచు శ్రీ సాధు సుబ్రహ్మణ్య గారి నిర్ణయమును, శ్రీ చాగంటి శేషయ్యగారి నిర్ణయమును త్రోసిపుచ్చిరి.

"1408 విరోధి వైశాఖ శుద్ధ పూర్ణిమ విశాఖా నక్షత్రమున జన్మమనుట సబబు. విరక్తుడగు అన్నమయ్య ఈ విధముగా లెక్కించెననుట సమంజసము.

"అన్నమాచార్యుడు కొండ నెక్కినాటికి పదహారేండ్ల వాడని చెప్పిన ప్రభాకర శాస్త్రిగారి మాటలను అంగీకరింపక అన్నమాచార్యుని మనుమడు చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో చెప్పినట్లు కొండనెక్కినరికి ఎనిమిదేండ్లే అనిభావించి ఐదో ఏటనే ఉపనయనం జరిగినట్లు విశ్వసించి దానికి తగిన ఉపపత్తులు గౌతమ ధర్మ సూత్రాల నుంచి ఉదాహరించి, పై చెప్పిన దానిని ఈ విధంగా స్థాపించారు శ్రీ గౌరిపెద్ది రామ సుబ్బ శర్మగారు.

"ఇక దుర్బలాహారులగు నేటి వారు గూడ కాలి నడకన ఎనిమిదవ ఏటనే కొండ నెక్కుచుండుట ప్రత్యక్షమైన విషయమే. అట్లు అన్నమయ్యయు, పుట్టిన దాది యెనిమిదవ యేటనే కొండ నెక్కి యుండుట వింతగాదు.

"ఈ లీల ఎనిమిది యేడుల పిన్న
బాలుఁడయ్యును నిష్ఠఁబనిఁబూని యతఁడు
వితత వృత్తంబుల వేంకట పతికి
శతకంబు కుతుకంబు సపకూరఁదీర్చి
సదమలాచారుఁడై సనుచెంచి యతఁడు"

(అన్నమాచార్య చరిత్రము, పు. 23,24)

అని చిన్నన్న తాతగారి చరిత్రమును దగ్గర ధగ్గర కాలములో విన్నవాడు చెప్పుచుండగా శ్రీ శాస్త్రిగారు కోమల మతులు గాన, అన్నమయ్యను సుకుమారునిగా భావించి ఎనిమిదవ యేట కొండ నెక్కుటకు సందేహించిరి. అని తెలుపడం సముచితమే కాబట్టి అన్నమాచార్యుని జననం 1408 అనడమే సమంజసమని నేను సైతం భావిస్తున్నాను." (తెలుగులో పదకవిత పుట 55, 56) అని వివరించినారు.

అన్నమయ్య జనన కాలము క్రి.శ 1424 అని శ్రీ అబ్బూరి గోపాలకృష్ణగారు అభిప్రాయపడినారు [1] అన్నమయ్య జన్మ సంవత్సరము క్రి.శ 1408 అని డా॥సర్వోత్తమన్ గారి అభిప్రాయము. [2]

అన్నమయ్య క్రి.శ 1408 నుండి 1503 వరకు జీవించి యున్నాడని భావించినచో ఆయన జీవిత కాలము 95 సంవత్సరములు. ఆయన దినమున కొక సంకీర్తన చొప్పున చెప్పినట్లు చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో తెలిపినాడు. అన్నమయ్య సంకీర్తన రచనను 16 సంవత్సరముల ప్రాయమున ప్రారంభించెనని భావించినచో 79 సంవత్సరములాయన సంకీర్తన రచన గావించి యుండును. సంవత్సరమునకు 365 దినములు చొప్పున 79 సంవత్సరములలో ఆయన 28,835 సంకీర్తనములు వ్రాసియుండును. కొన్ని సంవత్సరములకు 366 దినములుండును కావున ఇంకను 20 సంకీర్తనములను కలిపినచో 28,855 సంకీర్తనములగును. ఆయన జీవిత కాలములో 32 వేల సంకీర్తనములు రచించినాడని చెప్పుట వలన పై సంఖ్యకు దీనికి సుమారు మూడు వేల సంకీర్తనములు సంఖ్యా భేదము కన్పించుచున్నది. ఒక వేళ అన్నమయ్య 8 సంవత్స

రముల ప్రాయమున కొండనెక్కి, స్వామిని దర్శించి సంకీర్తన రచన చేసినాడని భావించినచో కేవలము 223 సంకీర్తనముల సంఖ్యా భేదము కన్పించుచున్నది. అన్నమయ్య ఎనిమిది సంవత్సరముల ప్రాయమున కొండనెక్కి వేంకటేశ్వరుని దర్శించి 'కంటినయ్య ఖిలాండకర్త' అని సంకీర్తనములు చేసినట్లు చిన్నన్న చెప్పెనాడు. అందువలన ఎనిమిదవ ఏటనే అన్నమయ్య సంకీర్తన రచనకుద్యమించెనని భావింపవచ్చును. సంకీర్తనముల సంఖ్యను గమనించినపుడు అన్నమయ్య జీవిత కాలము క్రీ.శ 1424-1503 అనెడి వాదము కొంచెము దూరముగ ఉన్నది. కావున ఆయన జీవిత కాలము క్రీ.శ 1408-1503 అనెడి వాదము సముచితమని భావింపవచ్చును.

అన్నమయ్య తిరుమలేశుని వరప్రసాదమున జన్మించినాడు కావున 'వెన్నుని వరముచే విద్య లన్నియును మితెంబులగుచు జిహ్వా రంగ సీమపై నర్తనమాడుట' ప్రారంభించినవి. ఆయన ఆడిన మాటెల్ల అమృత కావ్యము కాగ, పాడిన పాటెల్ల పరమ గానమయ్యెడిది. అన్నమయ్యకు బాల్యమున తల్లిదండ్రులు వదినెయన్నలు పనులు చెప్పెడివారు. ఒకనాడు పశువుల మేతకు అన్నమయ్యను పొలము పంపెనారు. పొలములో గడ్డి కోయుచున్న అన్నమయ్యకు పొలము ప్రక్కన బాటలో తిరుపతికి పోయెడి భక్తబృందముల గీతములు వినిపించినవి. ఆయన మనసు వేంకటాద్రి పతిపై నిలిచినది గడ్డి కోయుటకు బదులు చేతివ్రేలు కోసికొనినాడు. రక్తము కారుచున్నది. కర్తవ్యము గుర్తుకొచ్చినది,

"హరి చరా చరదేహియని పెద్దలనఁగ
నిరవొంద నెఱిఁగియు నిటు సేయఁదగునె
చిఱు ముడి నేమి చెసెదనంచు చేతి—
కొడవలి నేల గక్కున, బాఱవైచె"[3]—వెంటనే

తిరుపతి యాత్రికుల గుంపులో కలసినాడు. ఆనందపారవశ్యములో భక్తులతో పాటు దేవదేవుని కీర్తించినాడు. దిగువ తిరుపతి పొలిమేరలో ఉన్న గ్రామదేవత గంగమ్మకు నమస్కరించి ఏడుకొండలు ఎక్క నారంభించినాడు. ఎత్తుగ విశాలముగ వ్యాపించి యున్న పర్వత శిఖరములను దర్శించినాడు. సంతోషముతో 'హరివాసము'ను కీర్తించినాడు. ఆ తరువాత అన్నమయ్య 'పెద్ద ఎక్కుడు' నెక్కి గాలి గోపురము చేరినాడు. కొంత దూరములోని కర్పూరపు కాలువ నుండి కమ్మని వాసనలు వ్యాపించినవి

దట్టముగ ఉన్న చెట్లను పొదలను, జలజల ప్రవహించుచున్న ప్రవాహములను తిలకించుచు మోకాళ్ళ కొండ చేరినాడు అప్పటికే మిట్ట మధ్యాహ్నమైనది. ఎండ ఎక్కువైనది. బాలుడైన అన్నమయ్య అలసి పోయినాడు. గుబురుగ అలుము కొన్న వెదురు పొదల కింద చెప్పుల కాళ్ళ తోడనే శయనించినాడు. వెదురు బొంగులలో దూరిన గాలి వేణునాదము వలె ఉండి అన్నమయ్యకు జోల పాడినట్లనిపించినవి.

కొండ నెక్కుటలో అలసి పోయిన అన్నమయ్య నిద్రాదేవి ఒడిలో ఒరిగినాడు. ఆకలితో అలసిపోయిన అన్నమయ్య స్థితిని జగదంబ అలమేలుమంగ గమనించినది. అన్నమయ్యకు ప్రత్యక్షమై అన్నమయ్య కాళ్ళకున్న చెప్పులను తొలగింపు మన్నది. వెంటనే ఆయన తన పాదరక్షలను తొలగించినాడు. పసివాని ఆకలిని పసిగట్టిన జగదంబ అన్నమయ్యకు ఆప్యాయముగ ప్రసాదాన్నములు తినిపించినది. అప్పుడే అన్నమయ్యకు చెట్టు చెట్టులో మునిపుంగవులు, మృగములలో దేవతలు గోచరించినారు. పర్వతమంతయు తేజోమయముగ దర్శన మిచ్చినది. అన్నమయ్య పవిత్రమైన పర్వతమునకు నమస్కరించినాడు. జగదంబ ఒసగిన ప్రసాద ప్రభావముతో 'పరమ సారస్వత పారీణుడై సరస కవిత్వ వాచా ప్రౌఢి మెరయగా' అలమేలు మంగకు అనువుగ ఒక్క శతకమును చెప్పినాడు.

ఆతరువాత అన్నమయ్య స్వామి పుష్కరిణిలో స్నానము చేసినాడు. ఆవెనుక వరహ స్వామిని దర్శించినాడు. వరహ స్వామి సేవానంతరము వేంకటేశ్వరుని కోవెలకు వెళ్ళినాడు. అక్కడ నీడ తిరుగని చింత చెట్టుకు మ్రొక్కినాడు. గరుడ గంభమునకు నమస్కరించినాడు. పెద్ద పెద్ద సంపెంగ మ్రానులతో నిండియున్న చంపక ప్రదక్షిణమును చుట్టినాడు. శ్రీనివాసునకు నమస్కరించినాడు. భాష్యకారులను ప్రశంసించినాడు. నరసింహుని సేవించినాడు. జనార్దనుని సన్నుతించినాడు. అలిమేలు మంగకు అభివందన మాచరించినాడు. యాగశాలను తిలకించినాడు. కళ్యాణ మంటపమును గాంచినాడు. వాహన మండపములో ఉన్న అశ్వమును, బంగారు గరుత్మంతుని ఆరాధించి అందముగ నిలచియున్న ఆదిశేషునికి నమస్కరించినాడు. బంగారు పంజరములలోని పంచవన్నెల రామచిలుకలప్పుడు

"........... వేంకట శైల భర్తకును
గుట్టున మది మ్రొక్కి కోరొ కానుకలు
పెట్టరో దండముల్ పెట్టరో యిపుడె
కోరిన కోర్కె చేకూరు నటంచు"[4] పలుకుచున్నవి.

అప్పుడన్నమయ్య తన పంచె కొంగున అతి జాగ్రత్తగ దాచుకొనిన ఒక కాసు తీసి బంగారు గాదెలకు నమస్కరించి వడ్డి కాసుల వానికి అర్పించినాడు.

అన్నమయ్య స్వామి సన్నిధిలో బంగారు వాకిళ్ళ వద్ద నిలచినాడు శ్రీనివాసుని దర్శించినాడు. వేంకటేశుని దివ్య మంగళ విగ్రహము నదే పనిగ తిలకింపసాగినాడు. హృదయము పొంగులు వారినది.

"కంటి నయ్య ఖిలాండ కర్త నేనధికుఁ
గంటి నాయఘము నిక్కము వీడు కొంటి
పావనంబైన పాప వినాశనమ్ము
కోవిదుల్ కొనియాడు కోనేరు గంటి
నా వంటి దీను విన్నప ముద్ధరించు
శ్రీ వేంకటేశ్వరు సేవింపఁ గంటి
అనునర్థమలవడ నా దేవు నెదుట
ననువుగా సంకీర్తనంబులు సేయు"[5] —గా కీర్తనములు

వినిని అర్చకులు ఆశ్చర్యచకితులైనారు. బాలుని ప్రశంసించి తీర్థ ప్రసాదములిచ్చి శఠకోపము తలమీద ఉంచినారు. ఆ రోజున అన్నమయ్య ఒక మండపములో విశ్రమించినాడు. ఆమరునాడు 'కుమార ధారా' తీర్థమును తిలకించినాడు. అంజనాదేవి హనుమంతుని గన్నచోటును, ఆకాశగంగను చూచినాడు. పాపవినాశనము జలపాతములో స్నానము చేసినాడు. ఆ సమయమున తడి బట్టలను ఆరబెట్టెడివాడు. అవి యారునంతలో ఆశువుగ వేంకట పతిపై శతకము చెప్పెడివాడు.

ఒకనాడు అన్నమయ్య స్నాన సంధ్యాదులు ముగించికొని వేంకటేశ్వర దర్శనార్థము గుడికి వెళ్ళినాడు. బంగారు వాకిళ్ళకు తాళములు బిగింప బడినవి. వెంటనే

"వేంకట పతిమీద వివరస్తవముగ
వేంకట శతకంబు విన్నవించుటయు
గాలింపుఁ జిక్కులు గదియించునట్టి
తాళముల్ వీడియుఁ దనుదానె వడిన
అలర తలుపులు పెళ పెళన(ని) తెలచుటయు[6]—

అర్చకులు ఆశ్చర్య చకితులై అన్నమయ్యను ప్రశంసించినారు. ఆయన అక్కడ వేంచేసి యున్న గరుడాళ్వారు, విష్వక్సేనుల, సుగ్రీవుడు, హనుమంతుడు మొదలైన భక్తులను సీతారామలక్ష్మణ మూర్తులను తిలకించుచు వేంకటేశ్వర స్వామి యెదుట నిలిచినాడు ఆసమయమున

"వేంకటప్పకు విన్నవించిన తొంటి
వేంకట శతకంబు విన్నవించుటయు
పెట్టిన ముత్యాల పేరా యశోద
పట్టి పాదములపైఁ బడఁ బ్రసాదించె
అది చూచి యర్చకుండరుదంది వచ్చి"[7]— తీర్థ

ప్రసాదములిచ్చి, బాలకుని మెచ్చి ఆశీర్వదించినాడు. అన్నమయ్య ఆనాడు స్వామి మహిమలు తలచు కొనుచు వరాహ స్వామి కోవెలలో విశ్రమించినాడు.

మహాభాగవతుడైన ఘన విష్ణువు అను వైష్ణవయతి ఆ రోజులలో తిరుపతిలో ఉండెడివాడు. శేష జీవితమును శేషాద్రికే అంకితము చేసిన ఆయతికి స్వామి కలలో కన్పించి తన భక్తుడైన అన్నమయ్య గుర్తులు చెప్పి ముద్రాధారణము చేయవలసినదని పలికినాడు. మరునాడు ఉదయముననే స్నానాదులు ముగించుకొని యతి యజ్ఞశాల వద్ద నిలిచినాడు. ఆయన చేతులలో స్వామి సమర్పించిన శంఖ చక్రములున్నవి. అన్నమయ్య హరినామ కీర్తనము చేయుచు యజ్ఞశాల ముందుకు వచ్చినాడు. వైష్ణవ యతి స్వామి చెప్పిన గుర్తులను బాలునిలో చూచినాడు. బాలుడు యతిలో వేంకటేశుని దర్శించినాడు యతికి పాదాభివందనము గావించినాడు. ఘన విష్ణువు వేదోక్తముగ అన్నమయ్యకు పంచ సంస్కారములను నిర్వహించినాడు. ఆనాటి నుండి అన్నమయ్య అన్నమాచార్యు డని ప్రసిద్ధి పొందినాడు.

అన్నమాచార్య చరిత్రమున కొంత గ్రంథపాతమున్నది. ఆయన కొంతకాలము గురు సన్నిధి నుండుట, ఆకాలముననే తల్లి లక్కమాంబ అన్నమయ్య కొరకు వెదకుచు తిరుమలకు చేరుట, కొడుకును తమ ఊరికి రమ్మని పిలుచుట, అన్నమయ్య అంగీకరింపక పోవుట మొదలగు విషయముల ప్రస్తావన కనిపించుట లేదు. ఆయనకు ఒకనాడు స్వామి కలలో కన్పించి

"జనని వాక్యము ద్రోయ జనదు కుమార
పోయిరమ్మనిన నప్పుడు మేలుకాంచ
యాయమ్యతినిఁ గొనియాడి మ్రొక్కుచును
జననియు దాను నిచ్చలుఁ దొంటి పురికి
జనుదెంచి నిజనివాసముఁ బ్రవేశించె"ను.[8]

తమ ఊరికి చేరిన తరువాత అన్నమయ్యకు తల్లిదండ్రులు పెండ్లి ప్రయత్నములు సాగించినారు. అన్నమయ్య ఎల జవ్వనములో ఉన్నను ఆచారముల దాసరయ్య యని కన్యాదానము చేయుటకెవ్వరును సిద్దపడలేదు. కాని పరమాత్ముని యనుగ్రహమున సందేహించిన వారే సంతోషముతో తమ కన్యల నిచ్చుట కంగీకరించిరి. వారిలో నొక్కటి తిరువలుగంటి తిరుమలమ్మ మరియొక కన్య అక్కలమ్మ. ఇట్లు వారికి ఆగమోక్త ప్రకారమున వివాహమైనది. ఆవెనుక శఠగోపముని వద్ద సకల వేదాంత పఠనంబు గావించినాడు.

హరి పూజ, హరి సేవ, హరికీర్తనము హరి మననము, ధ్యానము అనిశము తనకు సకల భోగములుగాగ జీవించుచు వాల్మీకి రామాయణ మెల్ల సంకీర్తనాత్మకముగ వెలయించినాడు. అన్నమాచార్యుని హరి భక్తిని, సంకీర్తన రచనా శక్తిని, గాన రక్తిని తలపోసి ప్రజలాయనను తుంబురుడో, నారదుడో కాక ఈ రూపమున తిరుగు గంధర్వుడోయని ఆశ్చర్యపడసాగిరి. ఆవార విని ఉంగుటూరు నేలుచున్న సాళువ నరసింహ జనపాలుడు అన్నమయ్యను ఆశ్రయించి

"శ్రీకృష్ణు మన్ననఁ గ్రీడి భూచక్ర
మేక చక్రంబుగా నేలిన పగిది
నాలాగు మీ సహాయము నాకు గలుగ
నేలుదు ధర యెల్ల నేక చక్రముగ"[9]—అని

అర్థింపగా అన్నమయ్య నరసింహుని విన్నపము నంగీకరించెను.

సాళువ నరసింహరాయలు భృత్యప్రాయుడై కొల్చిరాగ అన్నమయ్య టంగు టూరికే తెంచి, కేశవమూర్తి ని గాంచి నమస్కరించి యాతని కోవెలదండ తనకు సకల సంపదలతో సవరించియున్న యొక పెద్ద నగరిలో ప్రవేశించినాడు. తన సంపదలన్నియు అన్నమయ్యవేనని రాయలు భావించుచున్నాడు, అన్నమయ్యను హితునిగ, గురునిగ, ఎల్లబంధువులుగ తలంచుచున్నాడు. ఆయన ఆశీః ప్రభావముతో శత్రురాజుల నోడించి రాయలు పెనుగొండ రాజ్యమును చక్కగా పాలించుచున్నాడు.

ఒకనాడు రాయలు అన్నమయ్యను తన కొలువునకు రావించి, మ్రొక్కి కనకాంబరాదుల నొసగి పూజించెను. వెన్నునిపై అన్నమయ్య విన్నవించిన కీర్తనలను వినుటకు రాయలకు బుద్ధిపుట్టినది. ఆసమయమున అన్నమయ్య రసరాగ భావములు రసోల్లిగ కవులెల్ల చేయెత్తి మ్రొక్కునట్లు పాడినాడు. రాయలానంద భరితుడై అన్నమయ్యను ప్రశంసించి పచ్చల కడియాలు, బంగారు వ్రాత పచ్చడాలు, కెంబట్టు కుళ్ళాయి, అంగదంబులును ఘనయాత ప్రతయులు రంగైన వింజామరల తోడు, గిండియును గళాచికయును బహూకరించినాడు. తన పెద్ద నగరి యొద్దనే యొక్క నగరు ననువొంద జూపించి అక్కడ ఉండుమని అర్థించినాడు. వేంకటపతిమీది వినుతులను అన్నమయ్య వలన రాయలు వేడుకతో వినుచుండెడివాడు.

ఒకనాడన్నమయ్య రాయల ఆహ్వానముపై చతురంత యానంబు నెక్కి సంకీర్తన పరులు సేవించి వెంటరాగ రాజాస్థానమునకు వెళ్ళెను. పల్లకిదిగి తన రాక నీక్షించుచున్న రాజును 'శ్రీనివాసోరక్షత'ని దీవించి చేతిలోని తిరుమణి నిచ్చెను. అతడును సాగి మ్రొక్కి పసిడి గద్దె మీద కూర్చుండ బెట్టినాడు. కవులు విద్వాంసులు, గాయకులు, భూపతులు, సామంతులు తన చుట్టు కొలువు దీర్చిన సభలో

> "చెలులార వేంకట శిఖరి నాయకుని
> కలికికిఁ గడ కంటఁ గను బట్టు చెలుపు
> చెలువమే గతి నుండెఁ జెప్పరే"10 యను కీర్తనను

పాడించుకొని ఇది కవిత్వంబని మెచ్చి గర్వించెను.

గర్వాంధుడైన రాయలు అట్టి పద మొక్కటి తనపై చెప్పుమని యర్థించినాడు. అప్పుడన్నమయ్య చెవులిరుగేల మూసికొని హరి ముకుందుని కొనియాడు జిహ్వ రాయలను కొనియాడుట నేరదని పలికినాడు. రాయలవమానితుడై అన్నమయ్యకు

మూరురాయరగండ సంకెలనిడి మొగసాలలో నిడ భటుల కాజ్ఞ యిచ్చెను. బంధితుడైన అన్నమయ్య మురవైరిదలచి 'సంకెలలిడు వేళ' అను సంకీర్తనము నాలపించెను. సంకెలలూడిపడెను. రాయలావార్త విని 'పగగొన్న బెబ్బులి పగిది నేతెంచి' మరల తన సమక్షమున సంకెలలను వేయించెను. రాయల యెదుటనే అన్నమయ్య నవ్వి తొంటి సంకీర్తనమే చేయగ సంకెల లూడి పోయినవి. రాయలు భయమంది అన్నమయ్య చరణములకు మ్రొక్కి-

"అపరాధి నపరాధి నన్నమాచార్య

కృపఁ జూడు నను నీవు కృప శరణ్య"–11 అని ప్రార్థించినాడు.

రాయలు, పట్టమహిషి అన్నమయ్య పాదములను పన్నీటితో కడిగినారు. పల్లకిలో అన్నమయ్యను కూర్చుండ బెట్టి రాయలు తన భుజముతో పల్లకి మోసినాడు. ఆ సమయమున అన్నమయ్య రాయలను క్షమించి హరిభక్తులను బాధ పెట్టవద్దని కృతయుగమున ధ్యానమునకు, త్రేతాయుగమున క్రతువునకు, ద్వాపరయుగమున అర్చనలకు పరమాత్ముడిచ్చెడి యీవులన్నియు జలజోదరుడు నిజ సంకీర్తనమున కలియుగమున అనుగ్రహించునని పలికి రాజాశ్రయము తమ వంటి వారికి మంచిది కాదని భావించి తిరుమలక్షేత్రమునకు తరలినాడు.

ఆ తరువాత అన్నమయ్య స్వామికి 'శృంగార మంజరి'ని సమర్పించినాడు. ఆయన శృంగార సంకీర్తనములను స్వామి వారే మెచ్చుకొనినారు. స్వామి సేవలో మునిగిన అన్నమయ్య మహిమాన్వితుడయ్యెను. ఆయన మహిమలను విని ప్రజలు పరి పరి విధముల దీనులై ప్రార్థించెడివారు. పుల్ల మామిడి చెట్టును తీపి మామిడిగా మార్చుట, గాయకుని పెండ్లికి ధనము సమకూరునట్లు ఆశీర్వదించుట అన్నమయ్య మహిమలలో కొన్ని.

అన్నమయ్య మహిమలను సంకీర్తనములను విని పురందరదాసు తిరుమలకు వచ్చినాడు. పురందరదాసు పాండురంగ విఠల భక్తుడు. కన్నడ దేశమునకు చెందిన భక్తకవి. మహాగాయకుడు. అన్నమయ్య పదకవితా పితామహుడు కాగ పురందరదాసు కర్ణాటక సంగీత పితామహుడు. అన్నమాచార్యుని చరమ దశలో పురందరదాసు అన్నమాచార్యుని దర్శించినట్లు చిన్నన్న రచించినాడు.

"ఏనయసంధ్యలకు నీళ్ళియ్యఁ జేకొనుచు,
దనరు పురందర దాసాహ్వయుండు
పరమ భాగవతుఁడె పరగును నంద
వరకులాగ్రణియైన వైష్ణవోత్తముఁడు
సవరించు మురవైరి సంకీర్తనములు
కు లయంబునఁ బేరుకొన్న మాత్రమున
దలఁచిన భూత భేతాళ పిశాచ
ములు పాఱిపోవ నిమ్మల సుఖం బెసఁగ
విని, కనియును తోన వెఱగంది కొనుచు
చని, తాళ్ళపాక శాసను డన్నమయ్య
వెన్నునిగానె భావించి కీర్తించి
నన్నుతి సేయ నాచార్య వర్యుండు
నతని వితలునిగాననయంబు దలఁచి
ప్రతి లేని గతుల సంభావించె___"[12]

అన్నమయ్య, పురందరదాసుల సమాగమమును కొందరు కర్ణాటక విద్వాంసులు అంగీకరింపలేదు. కాని అన్నమయ్య మనుమడే తాతగారి జీవిత చరిత్రను వ్రాయుచు తెలిపిన విషయము గనుక విశ్వసించడమే సముచితమని అనే కోపపత్తులతో డా॥ ఎస్. గంగప్పగారు నిరూపించినారు.[13]

అన్నమయ్య శృంగార రసరీతిలో కొన్ని, వైరాగ్య రచనతో కొన్ని సారస నేత్రుపై ముప్పది రెండు వేల సంకీర్తనములు రచించినాడు. నవముగా రామాయణ మును ద్విపదలోను, వేంకటాద్రి మాహాత్మ్యమును సంస్కృత భాషలోను రచించి, పంద్రెండు శతకములను, సకల భాషలలో 'ప్రతిలేని నానాప్రబంధములను' పూర్వోక్త మైనట్లు శృంగార మంజరిని రచించినాడు. 'సంకీర్తన లక్షణమును' సంస్కృతములో రచించినాడు. దీని తెలుగు అనువాదము మాత్రము చినతిరుమలాచార్య రచితమై లభిం చుచున్నది. జయదేవ కవి గీత గోవిందము సంకీర్తన లక్షణములో కొనియాడబడినది. అన్నమయ్య ఆంధ్రములోనే కాక సంస్కృతములోను నూర్లకొలది సంకీర్తనములను వేంకటేశాంకితముగ రచించినాడు.

అన్నమాచార్య జీవిత పరిసమాప్తిని గూర్చి శ్రీ కె. శ్రీనివాసులు శెట్టిగారు ఈ క్రింది విధముగ తెలియ జేసిరి.

"అవతార పరి సమాప్తి :– అన్నమాచార్యులు క్రీ.శ 1503 లో నిర్యాణం చెందారు. అది దుందుభి సంవత్సరం. ఫాల్గుణ బహుళ ద్వాదశి. అన్నమాచార్యుడు బాగా వృద్ధుడయ్యాడు. అప్పటికి అతని వయస్సు 95 ఏండ్లు. మెల్లగ పెదతిరుమలయ్యను దగ్గరకు పిలిచాడు. రహస్యంగా ఇలా అన్నాడు. తిమ్మప్పా నేటితో నా సంకీర్తన సమాప్తమౌతుంది. ఇంక దినానికి ఒక్క సంకీర్తన తక్కువ కాకుండ శ్రీనివాసునికి అర్పించే బాధ్యత నీది. ఈ యజ్ఞం నీవే కొనసాగించవయ్యా। అన్నమాచార్యుడు పెదతిరుమలయ్య చేతికి తుంబుర చిరుతలు అందించాడు. తిరుమలయ్య కళ్ళలో నీళ్ళు నిండాయి. అన్నమాచార్యుడు కుమారుని తల నిమురుతూ ఏదో అస్పష్టంగా పలికాడు. అది వేంకటేశ మంత్రం కాబోలు। గంభీరంగా అడుగులు వేసుకుంటూ ఆ కారణజన్ముడు తిరుమల మందిరంలో కలసి పోయాడు. ......... ఏదో ఒక తేజస్సు తండ్రి శరీరం నుండి వెలువడి వేంకటేశ్వరునిలో లీనం కావడం పెదతిరుమలయ్య మనోనేత్రాలకు గోచరించింది.

"ప్రతి బహుళ ద్వాదశి నాడు పెదతిరుమలయ్య ఇలా పాడుకుంటూ ఉండేవాడు.

దినము ద్వాదశి నేడు తీర్థదివసము నీకు
జనకుండ అన్నమాచార్యుడ విచ్చేయవే ॥పల్లవి॥
అనంత గరుడ ముఖ్యులైన సూరిజనులతో
ఘన నారదాది భాగవతులతో
దనుజమర్దనుడైన దైవ శిఖామణితోడ
పెనుగొని యారగించ విచ్చేయవే ॥దినము॥
వైకుంఠాన నుండి యాళువారల లోపలనుండి
లోకపు నిత్య ముక్తుల లోననుండి
శ్రీకాంతతోడ నున్న శ్రీవేంకటేశుగూడి
యీకడ నారగించ నింటికి విచ్చేయవే ॥దినము॥
సంకీర్తనముతోడ సనకాదులెల్లబాడ
పొంకపు శ్రీవేంకటాద్రి భూమి నుండి
లంకె శ్రీవేంకటగిరి లక్ష్మివిభుడనీవు
సంకెల మాయింటి విందులారగించవే ॥దినము॥

అన్నమయ్య జీవిత విశేషములను కేవలము చిన్నన్న వ్రాతల నాధారముగ చేసి కొనియే గాక అన్నమయ్య సంకీర్తనముల నుండి కూడ గ్రహింప వచ్చును. కాని అన్నమయ్య రచనలు ఒక క్రమమున లేవు. అందువలన చిన్నన్న వ్రాతలను బట్టి గ్రహించుటయే సమంజసము

అన్నమయ్య జీవిత విశేషములను గ్రహించిన తరువాత వాగ్గేయకారుడు, సంకీర్తనముల లక్షణములను, సంకీర్తన పరిణామమును గూర్చి తెలిసికొనుట కూడ అవసరమే. ఈ విషయ పరిజ్ఞానము అన్నమయ్య సాహితీ జీవిత పరిశీలనమునకు ఉపకరించుననుట సముచితము.

సంకీర్తనము, పదము, వాగ్గేయకారులను గూర్చి డా॥ వేటూరి ఆనందమూర్తి గారు "తాళ్ళపాక వారి కాలమున సంకీర్తనమునకే పదమని వ్యవహారము. దానికే గేయమనియు నేటి వ్యవహారము. 'కృత సంశబ్దనే' కీర్తించునది కీర్తనము, సమ్యక్ కీర్తనము, సంకీర్తనము. (గీయత యితి గీతం) పాడబడునది గీతము లేదా గేయము కాగా అవఙ్మానస గోచరముగు దివ్యశక్తిని కీర్తించి పాడునది కీర్తనము లేక సంకీర్తనమైనది. ఇటు గీయమానమగు కీర్తనమే భక్తుని హృదయమును పరమాత్మని పాద పాద సన్నిధికి గొంపోవునది. పదగతౌ అని అమరము. అందువలన అట్లు తీసికొని పోవునదే పదమనియు రూఢి కెక్కినది. ఇట్లునాడు కీర్తనము పదములన బరగిన రచన సంగీత సాహిత్యముల సమ్మేళన రూపము. ప్రాచీన లాక్షణికులిందలి సాహిత్యాంశమును 'వాక్' అనియు సంగీతాంశమును గేయమనియు వ్యవహరించిరి. వీనికే క్రమముగా మాతు, ధాతు సంజ్ఞలు కూడ కలవు. ఇట్లు వాగ్గేయ రూపమగు గీత రచన చేయగలవారే వాగ్గేయకారులని వారి నిర్వచనము"[15] అని తెలిపియున్నారు. 'పదగతౌ' అని అమరము అని పలికినారు. కాని అది అమరము కాదు, అమరమునకు గల వ్యాఖ్యలో ఆవిధముగ నుండుటచే వేటూరి వారట్లు పలికి యుండవచ్చును.

వాగ్గేయకారుని గూర్చి శ్రీ బాలాంత్రపు రజనీ కాంతారావుగారు వివరించిన విషయములను డా॥ గంగప్పగారు ఇట్లు తెలిపిరి,

"వాఙ్మాతు రుచ్యతే గేయం ధాతురిత్యభిధీయతే
వాచం గేయంచ కురుతేయః సవాగ్గేయ కారః" పదంలోని

వాక్కు—మాతువు. గేయం ధాతువు. అట్టి వాక్కును గేయమును రచించగలవాడు వాగ్గేయ కారుడని అర్థం. అట్టి వాగ్గేయకారునకుండ వలసిన లక్షణము లివి—— ——

శబ్దాను శాసన జ్ఞానము, అభిధానప్రవీణత, రసభావాలపరిజ్ఞానము, లోకజ్ఞత, అశేషభాషాజ్ఞానంతోబాటు సమస్త కళా శాస్త్రాల్లో అభినివేశమూ, నృత్య గీత వాదాల్లో నేర్పు, మనోహర గాత్రం, తాళలయ జ్ఞానం, కాక్వాదుల వివేచన, ప్రతిభ, సుగ గేయత, దేశీరాగాల్లో సంపూర్ణ జ్ఞానం, వాక్పటుత్వం, సరసత, ఔచిత్య జ్ఞానం, నూత్న ధాతు నిర్మాణక్షమ, ఇతర చిత్త వృత్తుల పరిజ్ఞానం, ప్రబంధ ప్రాగల్భ్యం, ధృతగీతి నిర్మాణంతో పాటు నానాగీతరచనా దక్షత, మంద్ర మధ్యమ తార స్థాయిలలో గమకం ప్రయోగించగల నేర్పు, ఆలాపనలో సంపూర్ణ జ్ఞానం, అవధానం అంటే చిత్తై కాగ్రత అనే గుణాలు కలవాడే ఉత్తమ వాగ్గేయకారుడు. అంటే ఈ వాగ్గేయకార లక్షణాల్ని పరిశీలిస్తే ఉత్తమకవి కుండవలసిన లక్షణాలతో ఏమాత్రం తీసిపోవని తెలు స్తుంది. అంతేగాదు కవికంటె ఉత్తమ వాగ్గేయకారునిలో సంగీతాది కళలలో పరిజ్ఞానం ఉండాలని స్పష్టమవుతుంది."[16]

వాగ్గేయకార శబ్దమును గూర్చి బాలాంత్రపు రజనీ కాంతారావుగారు "సుమారు 16వ శతాబ్దం నుంచీ వాగ్గేయకారుడు అను శబ్దానికి పర్యాయముగా 'బయకారుడు' అనే మాట వ్యవహారంలో ఉంది. స్వరమేళ కళానిధి రచించిన రామామాత్య తోడర మల్లునికి బయకార రామయ్య అని కొన్ని గ్రంథాలలో వ్యవహారం ఉంది. ఈ బయకార శబ్దానికి వ్యుత్పత్తి (తంజావూరి రఘునాథ నాయకుని పేర ఆయన మంత్రి గోవింద దీక్షితుడు రచించాడని చెప్పబడుతున్న) సంగీత సుధలో తృతీయ ప్రకరణంలో ఉంది.

> 'మాతూంశ్చ ధాతూనుభయాన్ కరోతి
> యస్తం విదుర్వోభయ కార సంజ్ఞం
> తమేవ లోకా బయకార నామ్నా
> వదంత్య పభ్రంశ పదేన సర్వే'

మాతువునూ, ధాతువునూ ఉభయమునూ (రెంటినీ) బాగుగా తెలిసినవాడు ఉభయ కారుడు లోకులంతా ఉభయకారుడు అనడానికి బదులు దాని అపభ్రంశమైన బయకార శబ్దంతో పిలుస్తున్నారు."[17] అని తెలియజేసినారు.

వాగ్గేయకార శబ్దమునకు పర్యాయముగ బయకార శబ్దము 16వ శతాబ్దము నుండి వ్యవహారములో ఉన్నట్లు రజనీ కాంతారావుగారు తెలిపినారు కాని బయకార శబ్దమును అన్నమాచార్యుడే ప్రయోగించినాడు. దీనిని బట్టి బయకార శబ్దము అన్నమయ్యకు పూర్వము నుండియే వ్యవహారములో ఉన్నట్లు గ్రహింపవచ్చును.

"ప్రియురాలవై నీకు పెక్కు సేవలు సేయఁగా
నియ్యగారి మాటలాడి నవ్వించేవు
బయకారి వాఁడవని పడఁతులచే వింటి
నియతితో సరివచ్చె నీగుణముకెల్లను"(24_380)

కాని ఇందలి బయకార శబ్దమునకు పైని చెప్పబడిన బయకార శబ్దమునకు అర్థభేదమున్నట్లు గ్రహింపవచ్చును. అన్నమయ్యయే మరొక చోట

"వెలలేని వలపుల వేడుక కాఁడవు
చలమరి చేఁతల జాజర కాఁడవు
పలుకులఁ గరిగించే బయకారివాఁడవు"(25_17)-అని

పేర్కొనినాడు. ఇందలి బయకారివాడు పలుకుల కరిగించువాడు, 'పలుకులఁ గరిగించే బయకారివాఁడవు' అని ప్రయోగింపబడుటచే ఇందలి బయకార శబ్దమును ఉభయకార శబ్దమునకు పర్యాయముగా వచ్చునని ఊహింప వచ్చును.

పదమును గూర్చి డా॥ ఎస్. గంగప్పగారు 'పదం' అంటే సామాన్యార్థంలో పాట అనే వాడుక రాగతాళాలతోను ఉండవచ్చు. లేదా స్వర సహితమూ కావచ్చు. ఇది జానపదుల సాహిత్యంలో స్పష్టంగా తెలుస్తుంది. కోలాట, దంపుళ్ళ పాటల్లో తాళముంటుంది, రాగంతో పాటు. విసర్రాయి, కిపిలి పాటల్లో రాగమే కాని తాళాని కవకాశం ఉండదు. గొంటిలోనులయ ఉంటే తీరుతుంది. 'పదం' పాటమన్నది జన వ్యవహారం."[18] అని తెలిపినారు. ఈపదమునకే తరువాతి కాలమున 'పాట' అనెడి అర్థము రూఢమైనది.

పదమును గూర్చి తెలిసినప్పటికి తాళ్ళపాకవారు సంకీర్తన మనియే వ్యవహరించిరి. తాళ్ళపాక వారికి పూర్వము సింహగిరి నరహరి వచనములను వ్రాసిన కృష్ణమాచార్యుడు కూడ తన వచనములను సంకీర్తనములనియే పేర్కొనినాడు. అన్నమయ్య సంస్కృతములో 'సంకీర్తన లక్షణము'ను వ్రాయగ దానిని తెలుగున కనువదించిన

చినతిరుమలాచార్యులు 'మహనీయంబగు సంకీర్తన నామక పదసంప్రదాయం బెట్టి దనిన' అని సంకీర్తనమును పదమునకు పర్యాయముగ ప్రయోగించినాడు. అన్నమయ్య పద కవితాపితామహునిగ, సంకీర్తనాచార్యునిగ ప్రసిద్ధి పొందినాడు. దీని వలన కూడ పదము-సంకీర్తనము ఒకదాని కొకటి పర్యాయ పదములని గ్రహింపవచ్చును. కాలక్రమములో ఇవి రాగ తాళబద్ధమైన, శృంగార రసమయమైన రచనలుగ స్థిరపడిపోయినవి.

పదకవితాపరిణామమును, తాళ్ళపాక వారి సంకీర్తన సాహిత్యమును గూర్చి శ్రీ.కె. శ్రీనివాసులు శెట్టి గారు "తెలుగు సాహిత్యంలో 'తుమ్మెద పదాలు' ఆదిగా గల పదరచనలు తాళ్ళపాకవారి సంకీర్తనలు లేక పదాలు, క్షేత్రయ్య పదాలు, పలనాటి వీరగాధవంటి సుదీర్ఘమైన గేయ రచనలు, తంవానపదాలు కానవస్తున్నాయి. వీటిలో పద శబ్దానికి గల అర్థ పరిణామం తెలుగులోని పద కవిత్వ వికాసాన్ని తెలియజేస్తుంది. 'తుమ్మెద పదాలు' అంటే పాట అనే సామాన్యార్థమే. తాళ్ళపాకవారి పదాలు లేక సంకీర నల్లో ఆది పల్లవి, చరణాలు అని ప్రత్యేక లక్షణాలతో విలసిల్లి శృంగార పరంగానో ఆధ్యాత్మ పరంగానో రచింపబడిన సంగీతాత్మక రచన అనే అర్థం వస్తుంది. క్షేత్రయ్య పదాలలో ఇది ఒక్క శృంగారానికే పరిమితం. పలనాటి వీరగాధ మొదలైన వాటిలో వీరరసస్ఫోరకమైన గేయాంశం ఉన్న సాహిత్య రచనగా విదితమవుతుంది.

"తాళ్ళపాకవారి సంకీర్తనలు కవిత్వము రాగ తాళాలు పరస్పర సౌహార్దంతో కలసి తయారైన నిండు రచనలు. పల్లవి అను ధ్రువపదము, అను పల్లవి, మూడు చరణములు ఇవి కలసిన పూర్ణ రూపమే సంకీర్తన లేక పదం. దీని స్వరూపం సంకీర్తన లక్షణంలో ఇట్లా వివరింపబడింది.

'పదముల యర్థము పల్లవి
వదలక యన్నిటికి నేక వాక్యతఁజేయన్
గుది గ్రుచ్చినట్లు తగులై
పదము తుదిన్ మఱియు మఱియుఁ బల్లవియమరున్'

"తాళ్ళపాక కవులు తమ రచనలను వర్ణ్య విషయాన్ని రెండు తరగతులుగా విభజించారు. 1) శృంగార సంకీర్తనలు 2) వైరాగ్య సంకీర్తనలు. పదములు శృంగార వధూ మృదు మధుర మనోజ్ఞ వాక్య మిశ్రములైనప్పటికి, విదితార్థ గ్రామ్యోక్తులు పదిలముగా వొంక మెఱిగి పలుక వచ్చునన్నారు. పల్లవనారీ మ్లేచ్ఛాద్యుల్లాన

మనోజ్ఞ బంధురోక్తులు గ్రామ్యాలైనా చెల్లుబడి అవుతాయన్నారు. జగతి గల చెల్లుబళ్ళయి ; నగినగి భాషించునట్టి నానుడి పలుకుల్. తగదన రహిచెడుఁ బువ్వుల సొగసుడు గం బిసికి కంపు మూతిన భంగిన్' అని నానుళ్ళను పలుకుబళ్ళను స్వేచ్ఛగా వాడినారు. వైరాగ్య పదాలు మాత్రం అగ్రామ్య రమ్యములై విష్ణుచరితోదారములై ఉండవలెనన్నారు. వీనికి అధ్యాత్మ సంకీర్తనలనే వ్యవహారం కూడా ఉంది. పదం సంస్కృత ప్రాకృతాలలో కాని, దేశ భాషల్లో కాని రచింపబడవచ్చు. అవి సంప్రదాయ బద్ధమై అలంకారం, చమత్కారం, భావం, రసం, శయ్య మొదలైన కావ్య సామాన్య గుణాలతోనే కాక దైవిక మానుష రచనా పావనములుగా ఉండవలెనన్నారు. బూతుగు కాయం గొరికిన, నీరస తూలంబు దిశల నిండు గతి నిస్సార పదబంధ కవితా పారీణుల పదము హాస్యాస్పదమై ఉండునట.

"లక్షణ భేదాలను బట్టి ఈపదాలను 1. వృత్త పదం 2. నిబంధ పదం 3. చూర్ణ పదం అని మూడు తెఱగులుగా విభజించినారు. వృత్త పదాలు షడ్వింశచ్ఛందో భేదాలకు చెందినవి. యతులు, ప్రాసలు, పదాలు, మాత్రలు, తాళ సంగతులు కలిగినవే నిబంధ పదాలు. తాళ్ళపాక వారి సంకీర్తనల్లో ఇవే కన్పిస్తున్నాయి. గేయ గంధులైన కృష్ణమాచార్యుని సింహగిరి వచనాలు, రాగ తాళ బంధములైన పెదతిరుమలయ్య వైరాగ్య వచన మాలికలు చూర్ణపదశాఖకు చెందినవి. ఇవిగాక దరువులు, ఏలలు, గొబ్బిళ్ళు, చందమామ పదాలు మున్నగు సంకీర్తన భేదాలకు కూడా లక్షణాలు వివరించారు. ఈలక్షణాలకు లక్ష్యాలు కూడా చాల వరకు తాళ్ళపాక వారి సారస్వతంలో కనిపిస్తాయి. ఇవే తర్వాతి పదకర్తలకు శిరోధార్యాలైనాయి."[19] అని తెలిపినారు.

క్షేత్రయ్యకు పూర్వమున్న వాగ్గేయకారులు వారి సంకీర్తనములలో, ముఖ్యముగ మూడు చరణములను వ్రాసెడివారు. త్యాగయ్య, దీక్షితులు మొదలగు ఆధునిక వాగ్గేయ కారుల రచనలలో కొన్నిటిలో ఒకే చరణము కనిపించును. ప్రాచీనుల కీర్తనలలో కొన్నిటిలో ఐదునుండి పదునైన చరణముల వరకు ఉన్నవి. తొలి రోజులలో పదము, సంకీర్తనము ఒకే అర్థమున వ్యవహారములో ఉన్నట్లు పూర్వోక్తము. అవి శృంగార సంకీర్తనములని, అధ్యాత్మిక సంకీర్తనములని రెండు విధములయి తరువాత క్షేత్రయ్య నాటికి శృంగార సంకీర్తనములు పదములని, త్యాగయ్య నాటికి అధ్యాత్మిక సంకీర్తనములు కీర్తనములని ప్రచారములో ఉన్నవి.

ఈ ప్రకరణమున అన్నమాచార్య జీవిత చరిత్రము, రచనలు, వాగ్గేయకార లక్షణములు, పదము, సంకీర్తనము, సంకీర్తన పరిణామము మొదలగు విషయములు వివరించబడినవి. ఈ విషయ పరిజ్ఞానము తరువాతి ప్రకరణములకు భూమికగ ఉండు ననుటలో సందేహము లేదు.

# సూచికలు


1) అన్నమాచార్య జననవత్సర నిర్ణయము, భారతి, ఫిబ్రవరి 1981

2) అన్నమయ్య–త్యాగయ్య పు 2

3) అన్నమాచార్య చరిత్రము పు 12

4) ,, ,, పు 21

5) ,, ,, పు 23

6) ,, ,, పు 25

7) ,, ,, పు 26

8) ,, ,, పు 29

9) ,, ,, పు 31

10) ,, ,, పు 36

11) ,, ,, పు 39

12) ,, ,, పు 49

13) అన్నమయ్య పురందరుల సమాగమం, భారతి, జూన్, 1982

14) అన్నమాచార్యులు : శ్రీ కె. శ్రీనివాసులుశెట్టి : పుటలు 66, 67, 68

15) తాళ్ళపాక కవుల పద కవితలు భాషా ప్రయోగ విశేషాలు పు 2

16) తెలుగులో పదకవిత, పుటలు 17, 18

17) ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము పుటలు–53, 54

18) తెలుగులో పదకవిత పు–8

19) పదకవిత–తాళ్ళపాక కవుల దృష్టి భారతి, మార్చి, 1975.

# 2 వర్ణనలు - లాక్షణికులు

వర్ణన స్వరూపము : "వర్ణన అనగా వర్ణించుట, వర్ణస్తుతౌ (కొనియాడబడునది, కొనియాడునది) అని గురుబాల ప్రబోధిక."[1] ఒక వస్తువునుగాని, వ్యక్తినిగాని, ప్రాంతమునుగాని, సంఘటననుగాది ఇంకను ఇతరములగు అనేక విషయములనుగాని వర్ణించుట వర్ణనయగును. ఈ వర్ణన బాహ్యాకారమునకు సంబంధించినది కావచ్చును లేదా అంతరంగ సౌందర్య దర్శనమునకు సంబంధించినది కావచ్చును. అనగా ఆయా విషయముల బాహ్యాంతర విశేష వివరణమే వర్ణనమని భావింపవచ్చును. ఆయా వర్ణనలతో కూడుకొన్నదే కవిత్వము. అందువల్లనే 'కవయన్తీతి కవయః' (వర్ణించువారు కవులు) అను ఆభాణకము వెలువడినది. వర్ణించువారు కవులు కావున వర్ణనమే కవిత్వమనియు, కవిత్వమే వర్ణనమనియు గ్రహింప వచ్చును.

వర్ణనా నిపుణుడైన వాడే కవియని భామహుని అభిప్రాయము. ప్రతిభావంతుడే వస్తువులను లెస్సగా దర్శింగలడు. లెస్సగ దర్శించినవాడే చక్కగ వర్ణింపగలడు. ఈ విషయములనే డా॥ దివాకర్ల వేంకటావధానిగారు "లోకోత్తర వర్ణనా నైపుణ్యము ప్రతిభైక సాధ్యము. ప్రతిభ దేవతానుగ్రహ సంపాద్యము. దేవతానుగ్రహము తపస్సంపాద్యము. తపస్సు ఋషి వ్యాపారము. అందుచేతనే ఋషికానివాడు కావ్యమును నిర్మింపజాలడను మాట కనిగినది.[2] అని వివరించినారు.

కవియను వాడొక శిల్పి. రూపరహితమైన రాతినేవిధముగ సుందరరూపమైన శిల్పముగ శిల్పి చెక్కునో కవికూడ తనకు పనికి వచ్చిన పదములతో మనోహరమైన వర్ణనలు చేయుటకుపక్రమించును. కవిని చిత్రకారునిగ భావింపవచ్చును. చిత్రకారుడు తనకు నచ్చిన తన భావనకు వచ్చిన విషయములను భిన్న భిన్న వర్ణములతో దర్శనీయముగ ఎట్లు చిత్రించునో కవికూడ అదేవిధముగ తన భావనకు వచ్చిన లేదా అనుభవములో ఉన్న విషయములను శబ్దముల ద్వారా పాఠకుల మనోనయనములకు గోచరమగునట్లు వర్ణించును. నాట్యశాస్త్ర ప్రవీణులైనవారు ప్రదర్శించెడి అనేక భంగిమలను కూడ కవి శబ్దముల ద్వారా ప్రదర్శింపగలడు. అందువలన కవిత్వమనగా అక్షరములతో చెక్కబడిన 'అక్షర శిల్పమనియు' శబ్దములతో చిత్రింపబడిన చిత్ర లేఖనమనియు, పదములతో నర్తింపబడిన నాట్యమనియు గ్రహింపవచ్చును ఒక్క కవిత్వము నాధారముగ చేసికొని

లలిత కళలన్నిటిని ప్రదర్శింపవచ్చును. వర్ణనా నిపుణుడైన కవియొక్క కవిత్వమును చదువుచున్నపుడు శిల్పమును దర్శించిన చిత్ర లేఖనమును వీక్షించిన, నాట్యమును గాంచిన, చలన చిత్రములను చూచిన ప్రకృతి మనోహరమైన దృశ్యములు సాక్షాత్కరించిన యనుభూతిని పొందవచ్చును.

కవి భావమునుండి వెలువడిన ప్రతి శబ్దము వర్ణనగా పరిగణింపబడును. వర్ణనా నిపుణుడైన కవి నిర్మించునది కావ్యము. అటి కావ్యమునందు మనోహరములైన అనేకాంశములు వర్ణింపబడును. కవి తాను వర్ణింపదలచుకొన్న వస్తువును దర్శించినప్పుడు లేక స్పష్టముగ భావించి నప్పుడుమాత్రమే చక్కగ వర్ణింపగలడు. ఆనందప్రదమైన దృశ్యమును తిలకించినప్పుడుగాని, దుఃఖపూరితమైన సంఘటనను దర్శించినప్పుడుగాని, హాస్యపూరితమైన చేష్టలను అవలోకించినప్పుడు గాని, వీరరసపూరితములైన విశేషములను వీక్షించినప్పుడు గాని, భక్తి భరితములైన విషయములను భావించినప్పుడు గాని భావోత్కంఠితుడైన కవి తన అనుభవములను ఇతరులకు పంచగోరి వర్ణించును. అందువలన ఆత్మతృప్తిని పొందును. ఇతరులు కూడ తదానందమునే పొందవలయునని ఆశించును.

సామాన్యమానవుని భావ సంస్కారమునకంటె కవియొక్క భావ సంస్కారము శక్తిమంతమైనదనుటలో సందేహము లేదు. ప్రతివాడును జగత్తును చూచుచునేయున్నాడు, కాని కవి చూపునకు సామాన్య మానవుని చూపునకు భేదమున్నది. దొండపండును గాంచిన సామాన్య మానవునకు దానిలో ప్రత్యేకత గోచరింపదు. కాని కవికి అది యొక నాయిక అధరము వలె భాసించును. తిలప్రసూనమును కాని, సంపెంగ మొగ్గను కాని చూచిన సామాన్య మానవుని భావనకేమియును స్ఫురింపదుగాని కవికి అవి నాయికా నాసికవలె గోచరించును.

అయా వస్తువుల స్వరూప దర్శములోనే గాక సంఘటనలను దర్శించినప్పుడు కూడ సామాన్య మానవునకు కవికి కలుగు భావ వికారమున భేదము కనిపించును. దుఃఖపూరితమైన దృశ్యమును గాంచిన సామాన్య మానవుడు అదృశ్య సంబంధి విషయములకు తనలో తానె బాధపడును కాని ఆవిషయములను అలంకారికముగ తెలియజేయు శబ్దశక్తి అతనికిలేదు. కాని అదే దృశ్యమును దర్శించిన కవి నోటి వెంట అప్రయత్న

ముగ కరుణరస ప్రపూరితములైన శబ్దములు వెలువడి మిగిలిన వ్యక్తులకు కూడ ఆ దృశ్య సంబంధ విషయ సాక్షాత్కారమును కలిగించును. ఈ విధముగనే ఆనందప్రదమైన దృశ్యమును గాంచినప్పుడును ఆయా వ్యక్తుల భావమున భేదము కనిపించును. ఈ భేదమునకు పాండిత్యముగాని విద్యగాని ప్రమాణముకాదు. భావ సంస్కారమే ప్రధాన హేతువు విద్యావిహీనులైన జానపదులెందరో ఆయా వ్యక్తులపై, సంఘటనలపై తమకు తోచినరీతిలో తమకు నచ్చినభాషలో అనేక విషయములను గేయరూపమున చెప్పుటయే దీనికి తార్కాణము. పదకర్తల పేర్లు తెలియని పదములెన్నియో ఈనాటికి కూడ ప్రచారమున ఉండి ప్రౌఢ కవిత్వముతో సరితూగ గలిగిన సామర్ధ్యమును కలిగి యుండుటయే దీనికి నిదర్శనము.

ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసముల త్రివేణీ సంగమమే కవి. కవి ఋషితుల్యుడు గావున ఆయనకు ఏకాగ్రత ముఖ్యము. కవి సృష్టికర్త సదృశుడు. ఇరువురును సృష్టి కర్తలే. ఒకరిది సామాన్య జగత్తు వేరొకరిది సాహిత్య జగత్తు. సామాన్య జగత్తును సృష్టికర్త తనయభీష్టమున కనుగుణముగ సృజించును. ప్రతిభావంతుడైన కవి వర్ణనా సామర్ధ్యమును గూర్చి ఆచార్య కె.వి.ఆర్. నరసింహముగారు "ప్రతి కావ్యమును క్రమబద్ధమైన సూక్ష్మప్రపంచము. ప్రత్యేకమును స్వతంత్రమువగు విశ్వము. అందలి నియమములన్నియు గవి కల్పితములే. అతని నిర్ణయమునకు అడ్డులేదు అతడు కొన్నిటిని మంచివిగ, కొన్నిటిని చెడ్డవిగ, కొన్నిటిని మహనీయములుగ, కొన్నిటిని నీచములుగ, కొన్నిటిని శక్తిమంతములుగ కొన్నిటిని శక్తిహీనములుగ సృజింపగలడు. ఆ సృష్టి అతని యిష్టానుసారముగ సాగును. అతడు మనుష్యులను పర్వతములకంటె నున్నతులునుగ చిత్రింపవచ్చును. అణువు కంటె తక్కువగా జూపవచ్చును. అతడు సృష్టిని నాశనము చేయవచ్చును. నాశనమైన దానికి మరల రూపకల్పన చేయవచ్చును అతని విశ్వమున అశక్యమగునది శక్యము కావచ్చును. అవశ్యకమగునది అనిశ్చితము కావచ్చును. అతడు పలికిన చాలును అట్టే యగును"[3] అని పలికినారు. ఈ విధమైన భావముతో ఉన్నది

'అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః
యథాస్మై రోచతే కావ్యమ్ తథేదమ్ పరివర్తతే' అను శ్లోకము

(అనంతమైన కావ్య ప్రపంచమున కవియే బ్రహ్మ. ఆయన అభీష్టమున కనుగుణముగ

కావ్యము పరివర్తించును.) ఈ విషయమును బట్టి అపారమైన కావ్య ప్రపంచమున కవి తన ఇష్టమున కనుగుణమైన వర్ణనలు గావింపవచ్చునని గ్రహింపవచ్చును.

ఏ కవియైనను వర్ణ్య వస్తు స్వరూపమును స్పష్టముగ తన హృదయ ఫలకము నందు ముద్రించు కొనగలిగిన సమయముననే పాఠకుల మనోనయనములకు ప్రదర్శిత మగు రీతిని వర్ణింపగలడు. ఆ విధముగ వర్ణింపబడినచో అది ఉత్తమశ్రేణికి చెందిన వర్ణనగ పరిగణింపబడును. ఆ విధమైనదే సార్థకమైన వర్ణనగా రాణికెక్కగలదు. కవి కేవలము భావమునకు మాత్రమే ప్రాధాన్యమీయక సందర్భోచితమైన భాషాప్రయోగము కూడ చేయవలెను. ఈ వర్ణనా విధానము ఆయా కవుల బుద్ధి సంస్కారానుగుణముగ ఉండును. ఈ వర్ణించుటలో కవులు పలు పోకడలు పోవచ్చును. కాని ఔచితీ మర్యాద నతిక్రమింపక వర్ణింపవలెను. ఉచితమైన స్థానములో సముచితములైన శబ్దములను ప్రయోగించుటలో కవియొక్క వర్ణనా నైపుణ్యము వ్యక్తమగును. చేతనములను వర్ణించినను అచేతనములను వర్ణించినను ఆయా వస్తువుల స్వరూపములు పాఠకులకు చదివిన వెంటనే, శ్రోతలకు వినిన వెంటనే సాక్షాత్కరింపవలెను.

లలిత కళలతో ప్రముఖమైన కవిత్వమును గూర్చి ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారు "కథాత్మకమగు కావ్యమగుచో ఆ కథాగమనమే గాక అందలి పాత్రల శారీరకమైన అవయవ విక్షేప వర్ణనములును, మానసికములైన భావ వివర్తన వర్ణనలును ఈ చలన కార్యమునకు చెందినవే. కావ్యము కథాత్మకము కాకున్నను స్థిరమైన ఒక వర్ణ్య వస్తువును గూర్చి కవిత్వమును చెప్పునప్పుడు కూడ కవి ఆ వస్తువును నానా విధముల వర్ణించుట దాని చలిత రూపమును చిత్రించుటయే. మేఘ సందేశము లోని మేఘవర్ణనము ఈ చలన లక్షణము కలదే.

"ఒకవేళ వర్ణ్య వస్తువు సహజ సుందరము కాక పోయినను, భావుకుడైన కవిచే భావ్యమానమైనపుడు తదంతర్గతమైన సౌందర్యము అతనికి గోచరించును. అతడా వస్తువును వర్ణించునపుడు చలించునది ఆతడు దర్శించిన సౌందర్యము. ఆ సౌందర్యమునే అతడు మనచే దర్శింప జేయును మొదట మనకు సహజ సుందరముగ కనబడని మూర్తియే ఆ దర్శనము వలన సౌందర్య శోభితమై కనబడును. కనుక సౌందర్యమనగా వస్తుగతమైన సహజ సౌందర్యమైనను కావచ్చును లేదా కవి దర్శించి మనచే దర్శింప జేయు భావిత సౌందర్యమైనను కావచ్చును. ఒక్కొక్కయెడ ఏ వర్ణ్య వస్తువును

లేకయే కేవల భావమే వర్ణింపబడినను, ఆ వర్ణన భావ సౌందర్య చలనమే అగును"[4] అని వివరించినారు.

వర్ణనా నిపుణుడైన కవి ఏ విషయమునైనను మనోహరముగ వర్ణింపగలడు. ప్రతిభావంతుడైన కవి తన ఇష్టమున కనుగుణమైన వర్ణనలు చేయును. కొన్ని సమయములందు కవి సంప్రదాయములను పాటింపవలెనను నియమము కలదు. కాని స్వతంత్ర భావనాకుశలురైన కవులు కొందరు పూర్వ సంప్రదాయములను పాటించుచునే కొన్ని తావుల యందు తామే క్రొత్త దారులు త్రొక్కి స్వతంత్రమైన ఊహలు చేయుచుందురు. దీనిని బట్టి కవుల స్వేచ్ఛా విహారమును గమనింపవచ్చును. ఆయా కవులు నవ్యముగ భావించి పలికిన విషయములు కూడ ప్రశంసనీయములై ఉండుట వలన సాహిత్యములో వానికొక ప్రత్యేకత ఏర్పడి సుస్థిరముగ ఉండును.

వర్ణనా విధానములను, తిక్కన వర్ణనా సామర్థ్యమును తెలియజేయుచు ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారు "కావ్యము నందలి వర్ణనలు వస్తువర్ణనమనియు, రూప చిత్రణమనియు, భావ చిత్రణమనియు, మూడు విధములు. రమణీయములైన సూర్య చంద్రోదయాది ప్రకృతి దృశ్యములును, పాత్రలు వర్తించు రంగస్థలాది సన్నివేశములును వస్తువర్ణనలగును. మరి ఆ రంగమున ప్రవేశించు పాత్రల రూపురేఖలను మనోభావములను వర్ణించుట రూప చిత్రణమగును. అలంకారశాస్త్రమున వీటిలో మొదటి వర్ణన కుద్దీపన విభావమనియు, రెండవ దానికి ఆలంబన విభావమనియు పేర్లు. కథలో ఒక వివాహ ఘట్టము సందర్భించినప్పుడు ఆ వివాహ మంటపమును అందలి వేదిని, నానావిధ మంగళ ద్రవ్య సముచ్చయ స్థితిని, బంధుమిత్ర జన సమావేశమును వర్ణించుట వస్తు వర్ణనము. పెండ్లిపీటలమీద ఆసీనులైన నూతన వధూవరులను వర్ణించుట రూపచిత్రణము మరి వారి మధుర మనోభావ సంచారమును వర్ణించుట భావచిత్రణము. భావవర్ణన కవి యొక్క అంతర జగద్దర్శన నిపుణతకు పరీక్షాస్థానము. సజీవ పాత్ర సృష్టికి ఆదర్శనమే మూలభూతము............

"ప్రత్యక్షముగ శబ్ద చిత్రణ మొనర్చిన నేర్పు ఆయనకే చెల్లును చిత్రకారుడు చిత్రింపలేని, ఛాయగ్రాహక యంత్రమును గ్రహింపజాలని చిత్రములను కేవలము శబ్దములతోనే తిక్కన చిత్రింపగలడు. మూర్తి దర్శనము చేయించుటయే తిక్కనగారి శిల్ప లక్షణము. సంస్కృత కవులలో భట్టబాణుని కాదంబరి ఈ రూపచిత్రణ కౌశలము

నకు ప్రథమోదాహరణము. అయినను అది వచన రచనయే కనుక కొంచెము సుకరమగును. తెలుగులో ఈ ప్రజ్ఞ గలవారు ముగ్గురు నలుగురు మాత్రము గలరు వారిలో తిక్కన కాలమును బట్టియేకాక ప్రతిభను బట్టియు ప్రథముడు. మరియు మూర్తి చిత్రణములో స్థిర రూపమును వర్ణించుట కంటే చరరూపమును వర్ణించుట కష్టమైన పని. రూపగతమైన సహజ సౌందర్యము దాని చరమావస్థలో ద్విగుణీకృతమై మోహనమగును. ఆచరమావస్థను వర్ణించు నేర్పు ఎగిరెడు పక్షిని గొట్టెడు విలుకాని నేర్పు వంటివి"[5] అని వివరించినారు.

పై విషయములలో పింగళివారు ముఖ్యముగ వస్తువర్ణనము, రూపచిత్రణము, భావచిత్రణము అను మూడు విధములైన వర్ణనలను తెలియ జేసినారు. అంతేగాక స్థిర రూపమును వర్ణించుటకంటే చరరూపమును వర్ణించుట కష్టతరమైన విషయమని తెలిపినారు. చరరూపమును వర్ణించుట యనగా చలత్సౌందర్యమును వర్ణించుట. ఇది మహాకవులకు మాత్రమే సాధ్యము. చలత్సౌందర్యమును వర్ణించుటకు వర్ణనా సామర్థ్యమవసరము. చరరూపమును వర్ణించినప్పుడు ఆ రూపము సహృదయుల యెదుట స్పష్టముగ ప్రత్యక్షము కావలెను. అస్పష్టముగ ఉన్నచో అవర్ణనోద్దేశమునకే భంగము కలుగును. ఎగిరెడు పక్షిని కొట్టుటకుపక్రమించిన విలుకానికి ఏకాగ్రత ముఖ్యము. విలుకాడు తన దృష్టిని నిశ్చలముగ ఆ పక్షిని కొట్టుటకు మాత్రమే కేంద్రీకరింతవలెను. అదే విధముగ కవి తాను వర్ణింప దలచుకొన్న వస్తువుపై ఏకాగ్రతతో భావదృష్టిని సారించి వర్ణ్య వస్తు సందర్శనమును స్పష్టము గావింపవలెను. వస్తు వర్ణనము, రూపవర్ణనము, భావ వర్ణనము ముమ్మూర్తులా మూర్తీభవించిన మూర్తియే అన్నమయ్య.

వర్ణనలను గూర్చి డా॥ కేతవరపు రామకోటిశాస్త్రిగారు "ఒక వస్తువునకు సంబంధించిన సూక్ష్మాతి సూక్ష్మములైన బహ్యాంశములు వ్యస్తములై, అప్యవధానముగ పేర్కొనబడి, ఆ వస్తువునకుత్కర్షాపాదకములైనచో నపుడది వర్ణింపబడినట్లు. అనగా నొక వస్తువుయొక్క సమగ్ర స్ఫూర్తిని తత్సంబంధి బహ్యాంశముల చేత కలుగజేయు ప్రయత్నమేది కలదో అది వర్ణనము. సమగ్ర స్ఫూర్తి యనగా తత్కాలము నందా ఫలానా వస్తు వెంతగా స్ఫూర్తిమతి యగుట అవసరమో అంతగానగుట.........

"కాని వర్ణనమన్నది సాధారణముగా నీ యర్థమున దేశమున గ్రహింపబడుట లేదు. సూర్యోదయము, చంద్రోదయము, ఉద్యానవనము, స్త్రీలు—ఈ మొదలైన

విషయముల వర్ణనమే వర్ణనమనుకొనబడుచున్నది. దీనికి హేతువు కావ్యమష్టాదశవర్ణనా సహితమన్న ఆలంకారిక ప్రవచనము యొక్క బలము కావచ్చును. సాధారణముగా మరియు అధికముగా నష్టాదశ వర్ణనములకు నాలంబనములుగా పేర్కొనబడిన వస్తువుల వర్ణనమే వర్ణనమని భావింపబడుచుండుటను గమనించినచో పై హేతువు సత్యమున కొంత దగ్గరగా నున్నదియో తెలియును అందువలననే సాహిత్య విమర్శనము నందును ఋతు వర్ణనము, సముద్ర వర్ణనము, సూర్యోదయ, సూర్యాస్తమయాది వర్ణనములు మొదలైనవి వ్యస్తములుగాతీసి చూపించి ప్రశంసించుట అలవాటయి పోయినది. యదార్థమున కవి మాత్రమే కాదు వర్ణనలు కావ్యమున (కవి చెప్పిన) ప్రత్యంశమునను అనంతముఖమైన వర్ణనము పరివ్యాప్తమై ఉన్నది."[6] అని వివరించినారు.

పైన చెప్పపడిన విషయములను బట్టి కేవలము సూర్యోదయ సూర్యాస్తమయ చంద్రోదయ, ఋతు, సముద్రము మొదలైనవి మాత్రమే వర్ణనలు కాదనియు. ఆయా సందర్భములలో కవి నోటినుండి వెలువడిన ప్రత్యంశమును వర్ణనగా పరిగణింపవచ్చునని గ్రహించుటకు వీలగుచున్నది. ఈ విధముగ వర్ణనకు అత్యంత విస్తృతమైన పరిధిని నిర్ణయింపవచ్చును.

కవులు తమ ఇష్టముల కనుగుణముగ కావ్యములందు వర్ణనలు చేయుటచే అవి అసంఖ్యాకముగ పెరిగినవి. కావ్యములెన్నియో వర్ణనా ప్రధానములై వెలసినవి. కొన్ని సమయములలో కవులు ప్రధాన కథను ప్రక్కకునెట్టి వర్ణనలు చేయుటకు ప్రయత్నించినారు అందువలననే కావ్యములందు వర్ణనలు లెక్కకు మిక్కిలిగ ఉన్నవి. ఈ వర్ణన విషయములలో ఆయాలాక్షణికులు భిన్నమతములను అవలంబించినారు. ముందుగ సంస్కృత లాక్షణికుల అభిప్రాయములను పరికించుట యుచితము.

సంస్కృత లాక్షణికులు వెలువరించిన విషయములను డా॥ అంతటి నరసింహము గారు "కావ్యమునందు వర్ణన లుండవలెనని సంస్కృతాలంకారికులు చెప్పిరి. ఆరవ శతాబ్దివాడగు భామహుడు సర్గబంధమను మహాకావ్యమును చెప్పి అందులో అయిదు వర్ణనలుండవలెనన్నాడు.

సర్గబంధో మహాకావ్యం మహతాంచ మహచ్చయత్
అగ్రామ్య శబమర్ధ్యంచ సాలంకార పదాశ్రయం
మంత్ర దూత ప్రయాణాజీ నాయకాభ్యుదయైశ్చయత్
పంచభిస్సంధిర్యుక్తం వాతి వ్యాఖ్యేయమృద్ధిమత్
(కావ్యాలంకారము 1-19)

మహాకావ్యమునందు నాయకుడు ధీరోదాత్తుడు. పైనిపేర్కొన్న మంత్రదూత, ప్రయాణ ఆజీ, నాయికాభ్యుదయములు కేవలము నాయకునికి సంబంధించినవే.

"దండి తన కావ్యాలంకార సంగ్రహమందు 18 వర్ణనలుండవలెనన్నాడు. ఆ పదు నెనిమిదిలో భామహుడు చెప్పిన మంత్ర, దూత, ప్రయాణ, ఆజి నాయకాభ్యుదయములు గూడ నున్నవి.

నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయ వర్ణనైః
ఉద్యాన సలిల క్రీడామధు పాన రతోత్సవైః
విప్రలంభై ర్వివాహైశ్చ కుమారోదయ వర్ణనైః
మంత్ర దూత్య ప్రయాణాజి నాయకాభ్యుదయైరపి
—దండి కావ్యాదర్శ 1-16, 17....

"దండి తరువాతి కావ్యాలలో నీ లక్షణము తప్పక పాటించుట జరిగినది. సరస్వతీ కంఠాభరణమున భోజుడు వర్ణనల విషయమున నిట్లు చెప్పినాడు (10వ శతాబ్ది)

పురో పవనరాష్ట్రాది సముద్రాశ్రయ వర్ణనైః
దేశసంపత్ ప్రబంధస్య రసోత్కర్షాయ కల్పతే
ఋతు రాత్రిః దివార్కేందూదయాస్తమయకీర్తనైః
కాలః కావ్యేషు సంపన్నైరసపుష్టి ‌నియచ్ఛతి
రాజకన్యా కుమార స్త్రీ సేనా సేనాంగ భంగి భిః
పాత్రాణాం వర్ణనం కావ్యే రససోऽధితిష్ఠతి
ఉద్యాన సలిల క్రీడా మధుపాన రతోత్సవాః
విప్రలంభ వివాహోశ్చ చేష్టాః కావ్యేరసావహాః
మంత్ర ద్యూత ప్రయాణాజి నాయకాభ్యుదయాది భిః

పుష్టిః పురుషకార్యస్య రసం కావ్యేషు వర్ధతి

.... .... .... .... .... .... .... .... ....

తజ్జయాత్ నాయకోత్కర్ష కథనంచ ధినోతినః

— సరస్వతీ కంఠా-పుట 569,70. నిర్ణయసాగర్ ప్రెస్. 2వ ముద్రణ —పైన పుర, ఉపవన, రాష్ట్ర, సముద్ర, ఆశ్రమ, ఋతు, రాత్రిదిన, అర్క, ఇందు రాజకన్య, కుమార, స్త్రీ, సేన, సేనాంగ, ఉద్యానసలిల క్రీడా, మధుపాన, రతి, విప్రలంభ, వివాహ, మంత్ర, ద్యూత ప్రయాణ, ఆజి, నాయకాభ్యుదయము అను వర్ణనలు మొత్తము 26 పేర్కొన్నాడు. ఇతడు భామహునివలెను దండి వలెను దూత్యమనక ద్యూతమనుచున్నాడు. ఆ తర్వాతివాడగు విద్యానాథుడు (14వ శతాబ్ది) తన ప్రతాపరుద్రీయమున 18వర్ణన లుండవలెనని చెప్పినాడు. కాని ద్యూతమునకు మానద్యూతమన్నాడు. ఈ విషయమున నితడు భోజుని అనుకరించినాడు. భామహుడు, దండి, అష్టాదశ శబ్దమును వాడలేదుకాని విద్యానాథుడు పేర్కొన్నాడు.

ఏతానియత్ర వర్ణ్యంతే తన్మహా కావ్యముచ్యతే
ఏషామష్టాదశానాం మైః కైశ్చి దూన మపీష్యతే

ప్రతా. కావ్యప్రకరణం — 71

సాహిత్య దర్పణమున విశ్వనాథ కవిరాజు అష్టాదశ సంఖ్యను మించినాడు. విశ్వనాథుడు 25 వర్ణనలకు పెంచినాడు. అందు 1. సంధ్య 2. రజనీ 3. ప్రదోష 4. ధ్వాన్త 5. వాసర 6. ప్రాతః 7. మధ్యాహ్న 8. మృగయ 9. ముని 10. స్వర్గ 11. అధ్వర అను నవి అష్టాదశలో చేరలేదు. మిగిలిన 14ను అష్టాదశ (దండి) లో చేరియున్నవి. పై విధముగ నిరువది యైదు వర్ణనలను పేర్కొన్న యనంతరము 'ఆదయః' అన్నాడు. అనగా సంఖ్యా నిర్ణయము లేదని యర్థము.

తర్వాతి వాడగు కేశవమిశ్రుడు పై దండ్యాదులు చెప్పిన 18 వర్ణనలతో గాని, 25 వర్ణనలతో గాని గక 34 వర్ణనలుండవలెనని తన అలంకార శేఖరమున వ్రాసినాడు. 1) రాజా 2) దేవి 3) దేశ 4) గ్రామ 5) పురీ 6) సరిత్తు 7) సరస్సు 8) అబ్ధి 9) అరణ్య 10) ఉద్యాన 11) అద్రి 12) ప్రయాణ 13) రణ 14) వాజి 15) హ_ 16) అర్క 17) చంద్ర 18) ఋతు 19) వివాహ 20) స్వయంవర 21) సుర 22) పుష్ప 23) అంబుకేళి 24) సంభోగ 25) విశ్లేష 26) మృగయ 27) ఆశ్రమ

28) ప్రాతః 29) మధ్యాహ్న 30) సంధ్య 31) వయస్సంధి 32) ధాతు 33) వృత్త 34) అభిసారిక. ఇతడుకూడ సంఖ్యా నియమమునుగాని సంఖ్యా క్రమమును గాని పాటించవలెనని చెప్పలేదు"[7] అని వివరించినారు.

**తెలుగు లాక్షణికులు :**

వర్ణనలను గూర్చి తెలుగు కవులు, వెలువరించిన అభిప్రాయములను లాక్షణికులు కూడ గమనించుట యుక్తము. తెలుగు కవులలో అష్టాదశ వర్ణనలు కావ్యములందుండ వలెనని మొదటిమొదటసారిగ చెప్పినది కుమార సంభవ కర్త నన్నెచోడుడని తెలియు చున్నది. ప్రబంధ నిర్మాణ ప్రణాళిక గలవాడు కనుకనే నన్నెచోడుడు అష్టాదశ వర్ణనలను గూర్చి తెలిసినాడు. నన్నయ తిక్కనాదులు అనేకములైన వర్ణనలు చేసిరిగాని అష్టాదశ వర్ణనలను గూర్చి వివరింపలేదు. పాల్కురికి సోమనాధుడు అష్టాదశ వర్ణనలు కావ్యము నందుండవలెనని పలికినాడుగాని వానిని వివరింపలేదు. ఆ తరువాత వెలసిన ప్రబంధ కవులందరు తమకు పూర్వము పేర్కొనబడిన అష్టాదశ వర్ణనలను వర్ణించినారు. అందు వలననే ప్రబంధములు వర్ణనా ప్రధానముగ వెలసినవి.

నన్నెచోడుడు కుమార సంభవము అవతారికలో అష్టాదశ వర్ణనలను గూర్చి

వనజల కేళీ రవిశశి
తనయోదయ, మంత్ర, రతి, క్షితిపరణాం
బునిధి, పుర, ఋతు, పురోద్వా
హ, నగ విరహ దూత్య వర్ణనాష్టాదశమున్" అని పలికినాడు.

పాల్కురికి సోమనాధుడు పండితారాధ్య చరిత్రమున అవతారికలో

సత్కృతియన నూత్న సంగతి దనర
దొమ్మిది రసములు తొలుకాడు దాని
యిమ్మడి వర్ణనలెనగంగ ద్విగుణ
మగు నలంకారముల నలరారు దాని
ద్విగుణార్థ భావముల్ దీటు కొనంగ

తేట తెనుంగున ద్విపద రచింతు" నని నవరసములు, అష్టాదశ వర్ణనలు ముప్పది యారు అలంకారములతో తేట తెనుగున ద్విపదలో సత్కావ్యమును రచింతు నని పలికినాడు.

ప్రబంధ కవులకు పూర్వ లాక్షణికుడైన విన్నకోట పెద్దన కావ్యాలంకారచూడా మణిలో అష్టాదశ పదమును ప్రయోగించినాడు. ఆ తరువాత 16వ శతాబ్దికి చెందిన రామరాజ భూషణుడు కావ్యాలంకార సంగ్రహమున అష్టాదశ శబ్దమును ప్రయోగించి వివరించినాడు.

"ఇంకఁ గావ్య ప్రభేదంబులేర్పఱింతు
వరుస నష్టాదశ విశిష్ట వర్ణనములు
గలుగవలయు మహాకావ్య తిలకమునకు
నెలమిఁ దన్నామధేయంబు లెట్టివనిన"—(165)
"పురసింధు నగర్త్వన శశి
సరసీవన మధు రతి ప్రసంగ విరహముల్
పరిణయ తనయోదయ నయ
విరచన యాత్రాజి దౌత్య విభు వర్ణనముల్ —(166)

—పుర, సముద్ర, శైల, ఋతు, సూర్య, చంద్ర, సరస్సు, వన, మధు, రతిప్రసంగ విరహ, పరిణయ, తనయోదయ, నయ విరచన, యాత్ర అజి, దౌత్య, విభు అను నష్టాదశ వర్ణనలు గలది మహాకావ్యమని తెలిపినాడు. నన్నెచోడుడు దూత్యమనగ రామ రాజ భూషణుడు ద్యూతమని పలికినాడు.

అప్పకవీయమున కావ్యమునందు ఇరువది రెండు వర్ణనలుండవలెనని చెప్ప బడెను.

పురమును ఋతుషట్కమును బ్రియాణంబును
శైలంబు వేటయు సాగరంబు
పౌరసింధు పుణ్యాశ్రమంబును మంత్రంబు
ద్యూతంబు పిదప సద్భుత రణంబు
విజయంబు మద్యపానజ వికారంబును
వనవిహారంబును వారికేళి
కన్యాంగ సౌందర్య కథనంబు హిమకరా
భ్యుదయంబు విప్రలంభోచితంబు

పద్మమిత్రోదయంబును బరిణయంబు
సురతమును దౌహృదంబును సుతజననము
ననగ నిరువది రెండు వర్ణనలు గూర్చి
చెప్పవలయుఁ బ్రబంధంబు శ్రీనివాస" (1-28)

తెలుగు కవులు, లాక్షణికులు 18 అనిగాని 22 అనిగాని సంఖ్యా నిర్ణయమును గావించిరి. సంస్కృతమున విశ్వనాథుడు తప్ప ఎవరును సంఖ్యా నిబద్ధము చేయలేదు. వర్ణనలను గూర్చి సంస్కృత లాక్షణికుల, తెలుగు కవుల లాక్షణికుల అభిప్రాయము లను గమనించిన తరువాత వర్ణనల ప్రయోజనములగూర్చి తెలిసికొనుట అవసరము.

**వర్ణనల ప్రయోజనము :** ఈ వర్ణనల వలన ప్రయోజనమేమి? అను ప్రశ్న కలుగుట సహజము. కవులు తమతమ కావ్యములందు చేసెడి వర్ణనలకు బహుముఖమైన ప్రయోజనమున్నది.

'ప్రయోజన మనుద్దిశ్య న మందో ఽపి ప్రవర్తతే'

(ప్రయోజనమును ఆశింపక మందుడు కూడ ప్రవర్తింపడు) అన్నట్లు కవికూడ ఏదోఒక ప్రయోజనము నాశించియే కావ్యమునందు వర్ణనలు చేయును. కవి యాశించెడు ప్రయోజనము తానువర్ణింప దలచుకొన్న వస్తువు యొక్క రూపమును స్పష్టముగ సహృదయుల యెదుట సాక్షాత్కరింపజేయుట. వస్తుస్వరూపముగ చక్కగ వర్ణింపబడినచో కవియొక్క వర్ణనా సామర్థ్యమునకు వన్నెకలుగును. వర్ణనలను చదివిన పాఠకుల వినిన శ్రోతలకు ఆయా వస్తువులను కన్నులార గాంచిన యనుభూతి కలుగును.

వర్ణనల ప్రయోజనమును గూర్చి ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారు "కవిత్వములో మూర్తి దర్శనము చర్మ చక్షువునకు గాక మనోనయనములకు కలుగుచుండును. మనోగోచరమైన అమూర్తి వాస్తవికముకాదు. ఆదర్శము. దానిని భావించిచూచుటకు భావుకులు మాత్రమే అర్హులుగాని తదితరులు సమర్థులుకారు. భావనాగోచరమైన ఆ మూర్తులు చిత్రలేఖనమునందువలె ఊరకమనకు దర్శన మిచ్చుట మాత్రమేగాక సల్లాప సుఖమునుకూడ కలుగజేయుచుండును. ఒక్కొక్కయెడ ఆమూర్తులను చిత్రకారుడు కూడ చిత్రింపలేడు. మనుచరిత్రలో 'చూచి ముఖం బ్యుత్కటక సూచిత వేగపవార విందియై, లేచి, కుచంబులున్ దురుము లే నడుము నల్లలనాడ...... వెల్లిగొల్పుచున్' అని వర్ణింపబడిన వరూధిని మూర్తిని ఏ చిత్రకారుడు చిత్రింపగలడు?" [8] అని తెలియ

జేసినారు పైన వర్ణింపబడిన వరూధిని ఆకారమును చిత్రకారుడు చిత్రింపగలడేమో గాని 'అందెల' మ్రోతలను వినిపింపలేడు. లేనడుమును, కుచములను తురుమును అల్లలనాడింపలేడు. చిత్రకారుడు స్థిరరూపమును మాత్రమే చిత్రింపగలడు. కవి స్థిర చర రూపవర్ణనా నిపుణుడనుట ప్రత్యక్షరసత్యము.

పై విషయములను బట్టి ఇతర లలిత కళలకు లేని శక్తి కవిత్వమునకున్నదని, ఆయా వర్ణ్య వస్తువుల ప్రస్ఫుటమైన మూర్తులు కవిత్వము వలననే దర్శనీయములగు నని గ్రహింపవచ్చును. ఆయా వర్ణ్య వస్తువుల పరిస్థితులను చక్కగ అవగాహన చేసి కొనుటకు ఆయా కవుల వర్ణనలుపయుక్తములగును. దూరదూర ప్రాంతములలోని విశేషములను అందరును వెళ్ళి దర్శించలేని సమయమున చలన చిత్రములలో చూచి ఆనందించినట్లు, భావాంబరవీధీ విహారులగు విహారియైన కవియొక్క వర్ణనా ప్రపంచమున విహరించిన సహృదయులు ఆయా విశేషములను దర్శించి సంతోషాంతరంగులగుట కవకాశమున్నది. ఆయా కవులు, స్పష్టత, సుబోధకతల కొరకు వర్ణనలు చేయుచున్నట్లు గ్రహింపవచ్చును. ఉపమానోపమేయ భావ సంబంధములు కల్పించి ఆయా విషయ ములను తేలికగా అవగాహన చేసికొనుటకు వీలుగ కవులు వర్ణనలు సాగించుచున్నారు. వర్ణనల వలన వర్ణ్యపాత్రల బాహ్య స్వరూపముగనే గాక అంతరంగిక సౌందర్య దర్శనమునకుఅవకాశము కలుగుచున్నది, మిగిలిన లలిత కళలలోనిది కష్టసాధ్యము.

వర్ణనా నిపుణులైన కవులు ఏ విషయమును గైకొన్నను మనోహరముగ వర్ణింప గలరు. స్వీకరించిన వస్తువు 'రమ్యముగాని, రోతగొలుపునదిగాని, ఉదారముగాని, అధ మముగాని, భయంకరముగాని, ప్రసన్నముగాని, గంభీరముగాని, వికృతముగాని, వస్తువుగాని, అవస్తువుగాని లోకమున కవిచే భావ్యమానమై రస భావమును గలిగింప లేనిదిలేద'ను పలుకులు వెలువడినవి. దీనిని బట్టి ఆయా వర్ణనలు కవుల వర్ణనా సామర్థ్య మును బట్టియే జరుగుచుండెనని గ్రహింపవచ్చును. చెప్పదలచుకొన్న విషయములను సుందరముగ, మనోజ్ఞముగ, ప్రతిభాదర్శకముగ, ప్రభావ పూర్ణముగ చెప్పుటకొరకు కవులు వర్ణనలు చేయుచున్నారని గ్రహింపవచ్చును. ఆయా పాత్రల బాహ్యాంతర ప్రవృత్తులను వ్యక్తము చేయుటకు, ఆయా పాత్రల పట్ల సానుభూతిని కలిగించుటకు ఆయా ప్రాంత, సన్నివేశ, వస్తు విశేషములను వ్యక్తము చేయుటకు కవులు వర్ణనలు చేయుచున్నారని తెలిసికొనవచ్చును.

కథావస్తువు గల కావ్యములందు వర్ణనలు చేయబడినట్లు అన్నమయ్య సంకీర్తనములందు కూడ భిన్న విధములైన వర్ణనలు చోటు చేసుకొన్నవి. అన్నమయ్య కథావస్తువు వేంకటేశ్వరుడు. ఆ స్వామి దివ్య మంగళ విగ్రహము నెన్నిసార్లు వర్ణించినను ఆయనకు తృప్తి తీరదు సరికదా ప్రతి సంకీర్తనము నందును ఏదేనొక ప్రత్యేకతను ప్రదర్శించి వర్ణించుట కుపక్రమించును. స్థిర రూపమునుగాని, చరరూపమునుగాని మనోహరముగ వర్ణింపగలనేర్పు అన్నమయ్యకు వెన్నతో బెట్టిన విద్య. అను నిత్యము దర్శించు శ్రీ వేంకటేశుని దివ్య మంగళ స్వరూప మాయనకు 'ఒకపరికొక పరి యొయ్యారమై మొకమునంగళలెల్ల మొలిచినట్లు' గోచరించును. శ్రీ వేంకటేశుని మాహాత్మ్యమును, ఆ దేవదేవుని అనంత కళ్యాణ గుణ విభవములను అన్నమయ్య మనోహరముగ వర్ణించును. అది ఆధ్యాత్మికము గానిండు, శృంగారము గానిండు వేంకటేశుని ముద్ర ఉండి తీరవలసినదే. శ్రీరాముడు గానిండు, శ్రీ కృష్ణుడు గానిండు ఆయనకు వేంకట రాముడుగ, వేంకట కృష్ణుడుగ దర్శనమిచ్చును.

అన్నమయ్య సంకీర్తన సాహిత్య మొకరత్నపేటిక. అందలి రత్నములన్నియు అత్యంత ప్రభారాగ రంజితమునై వర్ణనాకాంతి పుంజములను వెలార్చుచున్నవి. ప్రతీ సంకీర్తన రత్నము పైనను వేంకటేశుని ముద్ర తప్పకయుండును. వేంకటేశుని ముద్రలుగల సంకీర్తన రత్నమాలికను వేంకటేశునికే అర్పించిన పరమ భాగవతోత్తముడు అన్నమయ్య. వర్ణనా నిపుణుడైన అన్నమయ్య అలమేల్మంగ శ్రీనివాసుల లీలా విహారములను వర్ణించిన తీరు సహృదయ రంజకము. ఆలోచనాత్మకము.

ఈ ప్రకరణమున వర్ణనలను గూర్చి సంస్కృత లాక్షణికుల, తెలుగు కవుల లాక్షణికుల అభిప్రాయములు పరిశీలింపబడినవి. ఈ వివరణ మంతయు అన్నమయ్య వర్ణనా ప్రపంచమున విహరించుటకు మాత్రమే. అద్భుతమైనభావనలతో అత్యద్భుతముగ అన్నమయ్య గావించిన వర్ణనలను తరువాతి ప్రకరణములలో గమనింపవచ్చును.

)—(

# సూచికలు

1. ప్రబంధములలో ప్రకృతి వర్ణనలు. పుట, 8

2. సాహిత్య సోపానములు పుట – 16

3. సాహిత్య దర్శనము పుటలు — 34, 35

4. సాహిత్య శిల్ప సమీక్ష పుటలు — 13, 14

5. ఆంధ్ర సాహిత్య చరిత్ర పుటలు — 233, 235

6. తిక్కన కావ్య శిల్పము పుట – 385

7. ప్రబంధములలో ప్రకృతి వర్ణనలు పుటలు – 111 నుండి 114 వరకు

8. సాహిత్య శిల్ప సమీక్ష పుట – 25

# అన్నమాచార్య సంకీర్తనములలోని

# వర్ణనలు-వర్గీకరణ

ఇంతకు ముందు అన్నమాచార్యుని జీవిత విశేషములు, సంకీర్తనము, వాగ్గేయ కారుడు, సంస్కృతాంధ్రలాక్షణికులు వర్ణనలు గూర్చి వెలువరించిన అభిప్రాయములు వివరింపబడినవి. ఇక అన్నమాచార్యుని సంకీర్తన సాహిత్యమునందలి వర్ణనలను పరిశీలించి వానిని ఎన్ని విధములుగ విభజింపవచ్చునో గమనింప వలసి యున్నది. తాను నమ్మిన భగవంతుని ధ్యానించుటకే, పూజించుటకే కీర్తించుటకే తన జీవితము సంకితము చేసిన అన్నమయ్య తన సంకీర్తనములలో తిరుపతి వేంకటేశ్వరుని వర్ణించి తరించినాడు

పరిచయము : కథ ప్రధానములైన కావ్యములందే వర్ణనలు కాని సంకీర్తనములలో వర్ణనలేమి ? అని ప్రశ్న కలుగ వచ్చును. 'వర్ణసుతౌ' అనుటను బట్టి కొనియాడు బడునది. వర్ణన అని గ్రహింప వచ్చును. అన్నమయ్య తాను నమ్మిన శ్రీ వేంకటేశ్వరుని దివ్యమంగళ స్వరూప వైభవములను తనకు నచ్చిన రీతిలో కొనియాడినాడు. కావున ఆయన కొనియాడిన అంశములన్నియు వర్ణనలే.

నరులపై కవితలల్లుట కిష్టపడక పరలోక సౌఖ్యమునకు ప్రాధాన్యమిచ్చి తాను రచించిన సంకీర్తన సౌగంధిక పుష్పములను శ్రీవేంకటేశ్వరునికే సమర్పించిన ధన్యజీవి అన్నమయ్య. పాల్కురికి సోమన కాలము నాటికే ప్రభాత పదములు, తుమ్మెద పదములు వెన్నెల పదములు మెదలగు పదములు ప్రచారములో ఉన్నను ఆ తరువాతి కాలమున కృష్ణమాచార్యుని సింహగిరి నరహరి వచనములున్నను సరిక్రొత్త రీతిలో అన్నమయ్య సంకీర్తన సాహిత్యమును ప్రవేశ పెట్టినాడు. జానపద సాహిత్యమునకు ప్రౌఢ సాహిత్యమునకు సేతువుగ నిల్చిన పదసాహిత్య పితామహునిగ ప్రసిద్ధి పొందినాడు. ఆయన తన సంకీర్తనము లందు ఆయా సందర్భములలో చేసిన భిన్న వర్ణనల వర్గీకరణమీ ప్రకరణములోని ప్రధానాంశము.

వర్ణనా విధానమనేక విధములుగ ఉండును. పూర్వకవులు చేసిన వర్ణనలను ఆదర్శముగ నిలిపికొని సంప్రదాయ బద్ధముగ రచించుట యొకటి. పూర్వ కవుల సంప్రదాయములకు పూర్తి విరుద్ధముగ రచించుట వేరొకటి. పూర్వ కవుల సంప్ర

దాయములను పాటించుచునే వలసిన తావులందు స్వతంత్రమైన వర్ణనలు చేయుట ఇంకొకటి. అన్నమాచార్యుడీ చూడవ కోవకు చెందినవాడు. పూర్వ కవుల సంప్రదాయములను పాటించుచునే వలసిన తావులందు స్వతంత్రములైన అపూర్వములైన భావములను ప్రకటించి తన భావనాశక్తిని ప్రదర్శించినాడు. ఆవిధముగ వర్ణించుటలోను నిత్య వ్యవహారములో ఉన్న సామగ్రినే తీసికొని చదివిన, వినిని తోడనే ఆయా వర్ణ్య వస్తు స్వరూపములు సహృదయుల యెదుట సాక్షాత్కరించునట్లు వర్ణింప గల నేర్పు అన్నమయ్యకు ఆజన్మ సిద్ధము.

అన్నమాచార్యుడు 32వేల సంకీర్తనములు వ్రాసినట్లు తెలియుచున్నది. ఈ విధముగ వ్రాయుటకు ఆదివన్ శఠ గోపయతి ఉపదేశించిన మంత్రమని, ఆమంత్రాక్షరముల కనుగుణముగ అక్షరమునకు వేయివంతున 32వేల సంకీర్తనముగ రచించెనని శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు వివరించినారు. 'అన్నమయ్య కృతములుగ పేర్కొన బడుచున్న సంకీర్తనములలో సగమునను పైగ నేడు లభ్యమగుటలేదు. సుమారు 12వేల వరకు మాత్రమే లభించినట్లు తెలియుచున్నది. తిరుమల తిరుపతి దేవస్థానముల నారు ఈ సాహిత్యమును సంపుటముల వారిగ ప్రకటించుచున్నారు. ఇంత వరకు 32 సంపుటములు వెలువడినవి. వీనిలో శృంగార సంకీర్తనములే ఎక్కువ ఆధ్యాత్మిక సంకీర్తనములు, శృంగార సంకీర్తనములు చాల వరకు ముద్రింప బడినవిగాని ఇంకను కొన్ని ముద్రణలో ఉన్నట్లు తెలియుచున్నది.

తాళ్ళపాక వారే రాగిరేకుల యందు పేర్కొనినట్లు అన్నమయ్య సంకీర్తన సాహిత్యమును శృంగార సంకీర్తనములు, ఆధ్యాత్మిక సంకీర్తనములని విభజింప వచ్చును. వీనినే శృంగార వనర్ణలు ఆధ్యాత్మిక వర్ణనలని పేర్కొనవచ్చును. అన్నమాచార్యుని సంకీర్తనములను గూర్చి ఆయన మనుమడు చిన తిరుమలాచార్యుడు చెప్పిన పలుకులు ఆయన సంకీర్తనముల స్వరూపమును వెల్లడించుచున్నవి.

అన్నమాచార్యుని సంకీర్తనములను గూర్చి చినతిరులాచార్యుడు

"వేదంబులు పౌరాణిక
వాదంబులు వరకవిత్వ వాణీ వీణా
నాదంబులు ; కృత సుజనా
హ్లాదంబులు తాళ్ళపాక అన్నయ పదముల్"[2]

"శ్రుతులై శాస్త్రములై పురాణ కథలై సుజ్ఞాన సారంబులై
యతిలోకాగమ వీథులై వివిధ మంత్రార్థంబులై, నీతులై
కృతులై వేంకట శైలవల్లభరతి క్రీడా రహస్యంబులై
నుతులై తాళుల పాకయన్నయవచో నూత్న క్రియల్ చెన్నగున్"[3] అని

తెలియజేసినాడు. ఈ పద్యముల వలన అన్నమయ్య సంకీర్తనల తత్త్వము చక్కగ అవగాహనమగుచున్నది. అన్నమయ్య సంకీర్తనములలో లభించిన వానిలో ఆధ్యాత్మిక సంకీర్తనములకంటె శృంగార సంకీర్తనములే ఎక్కువగ ఉన్నవి. శృంగార వర్ణనలను గూర్చి ఇట్లు పరిశీలింప వచ్చును.

## శృంగార వర్ణనలు

భగవంతుని మహత్త్వమును వర్ణించుటకు భక్తుడు శృంగారమునే యేల స్వీకరింప వలెను? అని ప్రశ్న పొడముట సహజము. రసరాజమైన శృంగారమును గూర్చి ఆచార్య పింగళి లక్ష్మీ కాంతముగారు సాహిత్య శిల్ప సమీక్షలో ఈ విధముగ వివరించిరి. "శృంగార రసము ఆది నుండియు చిత్త సుఖము నిచ్చు మాధుర్యము కలది. మరి కావ్యము నందు వలె లోకము నందును ఆద్యంత సుఖదాయకమైనది. తక్కిన రసములు పరిపోషణలోను, చరమ దశలోను మాత్రమే ఆనందము నొసగును. లోకమున వాటి కట్టి ఆనందస్థితి లేదు. దుఃఖము లోకమున దుఃఖమే—— కావున లోకము నందును ష నందును మొదటి నుండియు మనోహరమైన శృంగారము నవరసములలో అగ్రస్థానమున కర్హ మగుచున్నది.

"సర్వప్రాణి సమైక్యమునకు పూలబాటలనదగిన అనురాగ, భక్తి, ప్రేమ, ప్రణయ, వాత్సల్యాది హృదయభావములన్నియు శృంగార గర్భితములై జీవునకు స్వర్గ సుఖము నిచ్చుచున్నవి. ఆ దివ్య సుఖమే జీవేశ్వరైక్య భావనకు, సర్వప్రాణి సమానత్వభావనకు అనుభవమునకు సాధనమగుచున్నది.

"మానవ జీవిత పరమావధి జీవేశ్వరైక్యము శృంగార రసము ఆధ్యాత్మిక సిద్ధికి ఛాయ అగుటయే కాక దానిని ప్రతిఫలింప జేయు ముకురము కూడ అగుచున్నది. శృంగార రసానుభవశాలి తన ఆత్మను పరమాత్మలో సుకరముగ లీనము చేయగలడు. హృదయము ప్రేమపూరితమైనపుడు ఆత్మ భగవంతుని పదముల వ్రాలియుండును." (పుట 149)

పై విషయములను బట్టి జీవాత్మ పరమాత్మల సమైక్యమునకు శృంగారము సహకరించుచున్నదని గ్రహింప వచ్చును. అందు వలననే భగవంతుని మాత్రమే పురుషునిగ భావించి ఇతర జగత్తంతయు స్త్రీ సమానముగ వర్ణించెడి సంప్రదాయమే ర్పడినది. దీనినే మధురభక్తి సంప్రదాయమని వ్యవహరింతురు. లోకములో శృంగారము నీచముగ పరిగణింపబడుచున్నను భగవంతుని విషయమున మాత్రము శృంగారము అత్యుత్తమ భావమని అంగీకరింపబడినది. అనేకులైన భక్తులీ భావము నాశ్రయించి సంయోగ వియోగాది యవస్థలను భావించుకొని పరమాత్మునితో ప్రణయ కలాపములు నిర్వర్తింతురు. ఇది జీవాత్మ పరమాత్మల పరిశుద్ధ దాంపత్యము. ఈశ్వరోన్ముఖమైన ప్రేమయగుటచే దీనిని అమృత స్వరూపమనియు, మధురమనియు, శృంగారోపేతమగుటచే శృంగార భక్తియనియు వ్యవహరింతురు.

భగవంతుని పట్ల ఆయా భక్తులేర్పరచుకొన్న సంబంధములను బట్టి వారి భక్తి భావములు ప్రకటింపబడును. నాయకునిగ, స్నేహితునిగ, పుత్రునిగ, సఖిగ భావించుకొని ఆయాభక్తులు భగవంతుని కొనియాడుట కలదు. అన్నమయ్య కూడ భగవంతునితో అనేకములైన సంబంధములు కల్పించుకొనును. కొన్ని సమయములందు తానే నాయికయై శ్రీవేంకటేశునితో సంయోగ వియోగముల ననుభవించును. మరికొన్ని సమయములందు తానే చెలికత్తెయై నాయికయైన అలమేలు మంగ సందేశమును శ్రీ వేంకటేశునకు, వేంకటేశుని విన్నపములను అలమేలు మంగకు విన్నవించుటకు ప్రయత్నించును. ఇంక కొన్ని సమయములందు తానె తల్లియై బాలుడైన భగవంతునిపై పుత్ర వాత్సల్యమును వ్యక్తము చేయును. ఇంకను కొన్ని సమయములందు జగత్తంతయు స్త్రీ సమానమని భగవంతుడే పురుషుడను భావమును కనబరచు సంకీర్తనములను వెలయించును. ఈ విధమైన మధురములగు సంకీర్తనములు అన్నమయ్య సాహిత్యమున అసంఖ్యాకముగ ఉన్నవి.

శృంగార సంకీర్తనము లందు గ్రామ్యోక్తులుండ వచ్చునని తెలియుచున్నవి. అన్నమాచార్య విరచితములైన శృంగాల సంకీర్తనములందనేక విధములైన వర్ణనలున్నవి. అన్నమయ్య తన సంకీర్తనములలో స్త్రీల కర, చరణ, ముఖ, నేత్రాదుల చలనములకు అనంతభావ పరిపుష్ఠ పరంపరలున్నట్లు వర్ణించెను. పింగళి వారు చెప్పిన వర్ణనా విధానములగు వస్తు వర్ణనము, రూప చిత్రణము, భావ చిత్రణములు అన్నమయ్య

సాహిత్యమునందు అడుగడుగున దర్శన మిచ్చును. ఈవిధమైన స్థూల విభజనములోని వర్ణనా విధానములేకాక ఇంకను వర్ణన లన్నమయ్య సాహిత్యము నందున్నవి.

అన్నమయ్య వర్ణనా ప్రణాళిక అలమేల్మంగా వేంకటేశుల లీలా విలాసముల పైననే ఆధార పడి యున్నదనుటలో సందేహము లేదు. అన్నమయ్య వర్ణనా ప్రపంచమున శ్రీ వేంకటేశుడు నాయకుడు. శ్రీవేంకటేశునితో నానా విధ నాయికలను జోడించి సంయోగ వియోగాది భేదములతో శృంగార వర్ణనలు గావించినాడు.

అన్నమయ్య వర్ణించిన నాయికా నాయకుల లక్షణములు కొన్ని అలంకారశాస్త్రములకు కూడ అందవు. అన్నమయ్య శృంగార సంకీర్తనములలోని వర్ణనా నైపుణ్య మనన్య సామాన్యము. ఆయన గావించిన వర్ణనల నిట్లు పరిశీలింప వచ్చును.

## నాయికా వర్ణన

నాయిక స్వరూపమును: పాంప్రవాయి కోవమానములతో
చలత్సౌందర్యము
మరుని సంపదతో
నవరత్న సమానముగ
నవరస పరముగ
ద్వాదశ రాశుల పరముగ
కనుమలతో

పెండ్లి వస్తువులతో పోల్చి వర్ణించినాడు. నాయికా సింగార వర్ణన కూడ గావించినాడు.

## భిన్నవిధ నాయికలు*4

స్వీయ :- అగ్ని సాక్షిగ వివాహమాడిన యుత్తమురాలగు భార్య స్వీయ.
ప్రౌఢ :- స్మరాంధురాలును, సంపూర్ణ యౌవనము గలిగి ఇంకను అనేక లక్షణములలో ప్రావీణ్యము గలది.
స్వీయ, ప్రౌఢ, ప్రేమగర్వితా
ముగ్ధ :- మృదువైన ప్రణయ కోపము మిక్కిలి లజ్జ గలది
మధ్య :- యౌవనము కామము సమానముగ కలిగి రత్యనంతరము వివశురాలగునది.
మధ్యా ధీర :- భర్త అపరాధ మొనరింపగ ఎత్తి పొడుపు మాటలాడునది.

మధ్య అధీర :- కన్నీటితో పరుష వచనము లాడునది

అన్యోఢ :- ఏదో నెపముతో నటునిటు తిరుగునది

మధ్య-ధీరా-ధీర :- కన్నీటితో కుటిల వచనములాడునది

ప్రౌఢా ధీర :- రతి వేళ నలయించునది.

ప్రౌఢ-అధీర :- నాయకుని పాద తాడనము చేయునది

ప్రౌఢ-ధీరా-ధీర :- మిక్కిలి వంకర మాటలచే ఖేదపరచునది.

## అవస్థా నాయికలు

స్వాధీనపతిక :- భర్తను తన యధీనమున నుంచు కొన్న నతి

వాసక సజ్జిక :- భర్త వచ్చు సమయమునకు తనను, తన గృహమును అలంకరించు కొని సిద్ధముగ ఉండునది.

విరహోత్కంఠిత :- ప్రియుని కొరకు తహతహలాడునది,

విప్రలబ్ధ :- సంకేత స్థలమునకు ప్రియుడు రాకపోవుటచే స్మరార్తి వహించునది

ఖండిత :- ప్రియుడు పరకాంతతో రేయి గడపి సంభోగ చిహ్నములతో ఉదయమున నింటికి రాగా కుందునది.

కలహాంతరిత : కోపమున భర్తకు దూరమై పశ్చాత్తాపపడునది

అభిసారిక :- ప్రియుని వద్దకు తానే స్వయముగ పోవునది లేదా ప్రియుని తన వద్దకు రప్పించుకొనునది.

"ఇట్లు పైని పేర్కొనబడిన యవస్థానాయికలను మరల నవాంతర ప్రకారాంతర భేదములచేత నింకనెన్నో తెలుగుల నగుచున్నారు. ఆయా భేదముల కన్నిటికిని గూడ తాళ్ళపాకవారి పదములలో లక్ష్యములుగా నుదాహరింపదగినవి పుష్కలముగా కలవు. ఆ ప్రయత్నమత్యంత సమగ్రముగా జరుగవలసి యున్నది"[5] అని డా॥ వేటూరి ఆనంద మూర్తిగారు పలికిన పలుకులు ప్రత్యక్షర సత్యములు.

ఆనందమూర్తిగారే మరొక చోట "తాళ్ళపాక కవులందీ పైని చెప్పబడిన చేష్ట విశేష భేదముల మూలమున నేర్పడిన నాయికాభేదములను గూర్చి మాత్రమే కాక కొక్కోక రతి రహస్యాది కామశాస్త్ర గ్రంథములందు ప్రపంచింపబడిన హస్తిన్యాది చతుర్విధ నాయికా భేదములను గూర్చికూడ కొంత తెలియుచున్నది. ఈ విభేదములను

గూర్చి కామశాస్త్ర గ్రంథములందే కాని ప్రాచీనాలంకారిక గ్రంథములందు కానరాదు. శృంగార మంజరీకారు డొక్కడే ఈ భేదములను కూర్చి తొలుత ప్రస్తావించిన యాలంకారికుడు"[6] అని పలికినారు.

అన్నమయ్య ఒక్క నాయిక యందే భిన్న జాతులకు సంబంధించిన నాయికల లక్ష్య లక్షణ సమన్వయము గావించినాడు. శంకిణి, చిత్తిణి, హస్తిణి, పద్మిణి, మోహిణి. ప్రత్యేకముగ చిత్తిణి జాతి స్త్రీ పనులను కూడ వర్ణించినాడు.

ఇంతే గాక ఆయానాయికల స్థితి గతులను పరిశీలించి వారి యవస్థలను బట్టి నాయికా వర్ణనలను ఇంకను విభజింపవచ్చును.

ఓర్పు గలిగిన నాయిక
మోసపోయిన నాయిక
ఆమాయికయైన నాయిక
పతికి స్వాధిన యైన నాయిక
ఆధిక్యము గలిగిన నాయిక
అలుక పొందిన నాయిక
వివిధ లక్షణములు గల నాయిక
సంతోషముతో ఉన్న నాయిక
గయ్యాళియైన నాయిక
పశ్చాత్తప్తయైన నాయిక
పరాకుగా ఉన్న నాయిక
నైపుణ్యము గల నాయిక
బాలెంత రాలైన నాయిక
స్థిర చిత్తముగల నాయిక

— సూక్ష్మముగ పరిశీలించినచో ఇంకను అనేక విధములైన నాయికలు ప్రత్యక్షమగుదురు.

## నాయక వర్ణన

అన్నమయ్య వర్ణనా ప్రపంచమున కలియుగ దైవమైన శ్రీ వేంకటేశుడే నాయకుడు. ఆ దేవదేవుని దివ్య మంగళ స్వరూపమును, వైభవమును ఆధ్యాత్మిక సంకీర్తనము లందు అత్యంత మనోహరముగ అన్నమయ్య వర్ణించినాడు. అక్కడక్కడ శృంగార సంకీర్తనము లందును జగన్నాయకుని స్వరూపమును వర్ణించి తరించినాడు.

నాయకుని వర్ణన ; జాతీయములతో
ఋతు పరముగ
వింత వేడుకలతో
నాయకుని యౌన్నత్యము
నాయకుని సింగారములు
నాయకుని నిర్భీతి
వ్రతనిష్ఠుడైన నాయకుడు

## దక్షిణ నాయక వర్ణన

శ్రీ వేంకటేశుని దక్షిణ నాయకత్వమును కూడ అన్నమయ్య వర్ణించి తరించినాడు. బహు పత్నులు గలిగి అందరి యందును సమానమైన ఆదరము చూపెడి సామర్థ్యము గల వాడే దక్షిణనాయకుడు. ఒకే సమయమున ఎందరో నాయికలను సంతోషపెట్టగల, సంతృప్తి పరచగల సామర్థ్యము గలవాడు దక్షిణ నాయకుడు. దక్షిణ నాయకుడైన శ్రీ వేంకటేశుని దక్షిణ నాయకత్వమును దక్షతతో వర్ణించినాడన్నమయ్య.

దక్షిణ నాయకుని సామర్థ్యము
దక్షిణ నాయకుని చిలిపి చేష్టలు

అన్నమయ్య శృంగార వర్ణనలలో నాయికా స్వరూపమునకు నాయికా నాయకుల శృంగార విషయములకు అధిక ప్రాధాన్యమునిచ్చినాడు. మొత్తము మీద శృంగార సంకీర్తనములందు నాయకుని వర్ణన పరిమితముగ ఉన్నదని గ్రహింపవచ్చును.

## శృంగార భేదములు

"శృంగారము సంయోగము విప్రయోగము అని రెండు విధములు. వీటికే సంభోగ విప్రలంభములు అనియు వ్యవహారము. ఈ సంయోగ శబ్దములకు పామర

వ్యవహారానుసారము 'మిధున క్రీడ' అని అర్థము చెప్పరాదు. దీనికి శాస్త్రీయమును నాగరకమును అయిన అర్థము వేరు. ఏకచిత్తులగు ఇరువురు ప్రాణులు జీవిత పరిపూర్తికై ఒండొరులు కలసి ఉండగోరుట సంయోగము. ఆ కలయికలో పరస్పర దర్శన, స్పర్శనాదికమైన సుఖము కలదు. ఆ సుఖము ఇరువుర చేతను అనుభవింపబడుటమే సంభోగము. ఏ మానవుడును ఏకాకియై జీవితమున పరిపూర్ణ సుఖానుభూతిని పొందజాలడు. పరిపూర్ణ సుఖానుభూతిని పొందజాలడు. పరిపూర్ణతకై ఒక ప్రాణి వేరొక ప్రాణి సహవాసమును అపేక్షించును. ఈ అభిలాషలో పురుష ప్రకృతి స్త్రీ పకృతిని, స్త్రీ ప్రకృతి పురుష ప్రకృతిని ఆకర్షించును. జీవునకు తాత్త్వికములైన పురుష స్త్రీత్వములు లేక పోయినను పురుష శరీర ధారియైన ఆత్మ స్త్రీ శరీర ధారియైన ఆత్మతోడి సంయోగము నభిలషించుటయు, స్త్రీ శరీరి పురుష శరీరిని వాంఛించుటయు జీవునకు పాంచ భౌతికమైన ప్రకృతి తోడి సంసర్గము వలన కలిగిన లక్షణము. అట్టి ఆత్మలు రెండును కలిసి ఏకముగా భాసించుట పేరే అర్ధనారీశ్వరత్వము. శృంగార రస సిద్ధి"[7] అని ఆచార్య పింగళి లక్ష్మీకాంతము గారు పలికినారు.

నాయికా నాయకుల హృదయములలో కలిగెడి సంభోగ సంబంధమైన కామము అనగా అభిలాషను 'రతి' యందురు. ఈ రతి అంకుర, పల్లవ, కలికా, ప్రసూన ఫల భోగావస్థలలో ప్రేమ, మాన, ప్రణయ, స్నేహాను రాగములను పేర్లతో పేర్కొనబడు చున్నది. శృంగార రసము సంభోగ విప్రలంభములని రెండు విధములు. సంభోగ శృంగారము కేవలము సురత రూపములోనే గాక దర్శనము, ఆలింగనము చుంబనము మొదలగు రీతిలో అనేక విధములుగ ఉన్నను సంభోగ శృంగారమనియే వ్యవహారము. విప్రలంభ మనగా వియోగము, ప్రణయ జీవులకు సంయోగ మెంత సుఖకరమో విప్రయోగమంత విషాదకరము. పరస్పర గాఢాను రాగము కల ప్రియులకు కలిగెడి వియోగము మాన ప్రవాస భేధములచే రెండు విధములు. ఆ రెండిటిలో మానమునకు ప్రణయము గాని ఈర్ష్యగాని కారణ మగుట వలన అది మరల రెండు విధములు. అన్నమయ్య సంకీర్తనములందు వియోగాంతముగ రచింపబడిన కీర్తనములు. అతి తక్కువగ ఉండుటచే ఇంకను గల భేదముల వివరణ మనవసరము.

## సంయోగ శృంగార వర్ణనలు

నిరంతరము వేంకటేశుని ధ్యానము నందు మగ్నమానసుడైన అన్నమయ్య అలమేల్మంగా వేంకటేశుల సంయోగ లీలా విలాసముల ననేక రీతులలో వర్ణించినాడు. అన్నమయ్య శృంగార సంకీర్తనము లోక ప్రవాహము. అన్నమయ్య శృంగార సంకీర్తనములను గూర్చి శ్రీ గౌరి పెద్ది రామ సుబ్బ శర్మగారు "ఈ కీర్తనల సముదాయమంతయు శృంగార రసక్షీర సాగరము. ఈ సాగరమున రత్నములు వెదుకువారి వెలితే గాని రత్నములకు వెలితి లేదు"[8] అని పలికిన పలుకులు ప్రత్యక్షర సత్యములు. నాయికా నాయకుల పలుకుల ద్వారా, చెలికత్తెల సంభాషణల ద్వారానే గాక అన్నమయ్య తానే అలమేల్మంగయై సంయోగ శృంగారము సాగించినాడు. అన్నమయ్య శృంగార సంకీర్తనాసాగరమున మునిగిన సహృదయులు కనేక రత్నములు లభించుననుటలో సందేహము లేదు. అన్నమయ్య గావించిన సంయోగ శృంగార వర్ణన నిట్లు విభజింపవచ్చును.

చిగురుటధరమున కస్తురి నిండిన నాయిక
సంయోగ సౌభాగ్యము కలిగిన నాయిక
పరవశురాలైన నాయిక
శృంగార చేష్టలు
సంభోగ సంబంధ ప్రశ్నలు
నాయికలు చెలికత్తెను ప్రశ్నించుట
నాయికా నాయకులను చెలులు ప్రశ్నించుట
నాయిక నాయకునితో
సంభోగపు గుర్తులను చూచిన చెలుల భావము
సంభోగానంతరము నాయిక స్థితి

## విరహ వర్ణనలు

విరహమును గూర్చి డా॥ ముట్నూరి సంగమేశంగారు "ప్రారబ్ధ వశమున పరమాత్మునితో తన కేర్పడిన వియోగమును సహింపలేక కుందుచూ తిరిగి ఆతని దర్శన స్పర్శన సామీప్యసాహచర్యాదులంది అనుభవించి ఆనందించుటకై భక్తుని ఆత్మ తహతహయే ఆధ్యాత్మ దాంపత్యమున విరహమని పిలువబడును. లోకములో శృగాం

రమున సంయోగ వియోగము లెట్లను భూతికి వచ్చి సుఖ దుఃఖాత్మకములై రూపించునో అట్లే అధ్యాత్మ శృంగారమున కూడ జీవాత్మ పరమాత్మల వియోగము విరహ వ్యథ గాను సంయోగము బ్రహ్మానందము గాను భావింపబడుచుండును. ఇది భక్త జీవులందరికి అనుభవైక వేద్యమైన విషయము."[9] అని పలికినారు.

సంయోగ శృంగారమును వర్ణించిన సందర్భములందు సంయోగాంతముగ సంకీర్తనమును రచించుట సహజమే. కాని వియోగ శృంగారమును వర్ణించు సందర్భములందు కూడ ఏదో ఒక విధముగ సంయోగాంతముగ వర్ణించి తరించిన మహా భక్తుడు అన్నమయ్య. సంకీర్తన ప్రపంచమునందును స్వామి తోడి దీర్ఘ కాలిక వియోగమును సహింపలేని సుకుమార హృదయుడు అన్నమయ్య. సూక్ష్మముగ పరిశీలించినచో అన్నమయ్య శృంగార సంకీర్తనములందు వియోగాంతముగ వర్ణింపబడిన సంకీర్తనములు చాల తక్కువగ కన్పించును. విరహమునందే సౌభాగ్యము గలదని పలుకుచు నాయికను యోగి వలె ఉన్నదని వర్ణించినాడు.

విరహములో నాయిక స్థితిని
విరహమే సింగారమని వర్ణించునాడు

## పురుష విరహము

నాయకుని కొరకు నాయిక వేచి యుండుటే కాదు. నాయికా వియోగమును సహింపలేని నాయకుడు కూడా విరహ వ్యథాసంతప్త హృదయుడైనట్లు వర్ణించినాడు.

చెలిపలుకు వలన నాయకుని విరహము, వియోగమున నాయకుని స్థితిని వర్ణించెను.

విరహతాపమునకు నిదానము

చెలుల పలుకులు — శైత్యోపచారములు

## ప్రసంగ వర్ణనలు

ఆయా వ్యక్తుల పలుకుల ద్వారా అనేక విషయములు వర్ణింపబడినవి ఇవి సంవాదాత్మక రచనలు మాత్రము కాదు. ప్రసంగ విషయమును బట్టి శ్రోతను పాఠకుల ఊహకే వదిలి నాడన్నమయ్య. ఈ ప్రసంగములలో శృంగార సంబంధ విషయము లనేకము వర్ణింపబడినవి. ఆ ప్రసంగముల నిట్లు వింగడింపవచ్చును.

నాయిక నాయకునితో .... నాయిక వేరొక నాయికతో
నాయికలు నాయకునితో .... నాయిక చెలికత్తెలతో
నాయకుడు నాయికతో .... చెలికత్తెలు నాయికతో
చెలికత్తె నాయకునితో .... చెలి పలుకుల వలన నాయకుని స్థితి

నాయికా నాయకుల వేడుకలను చూచిన చెలికత్తెలు — మొదలగు రీతిలో అనేకములైన వర్ణనలున్నవి.

## సంవాదాత్మక వర్ణనలు

నాయికా నాయకులకు, అత్తా కోడళ్ళకు బావా మరదళ్ళకు మొదలగు వ్యక్తులకు జరిగిన సంభాషణలను సంకీర్తనాత్మకముగ వెలయించినాడు. ఆయా సంభాషణలు చదువునప్పుడుగాని వినునప్పుడు గాని ఆయా వ్యక్తులు సహృదయుల యెదుట సాక్షాత్కరించుననుటలో సందేహము లేదు. ఆయా వ్యక్తులకు జరిగిన సంభాషణలను అనేక విధములుగ విభజింపవచ్చును.

శ్రీ వేంకటేశుడు — గోపస్త్రీ
శ్రీ వేంకటేశుడు — ఎఱుకత
శ్రీ వేంకటేశుడు — చెంచెత
శ్రీ వేంకటేశుడు — నాయిక
బావ — మరదలు
వదినె — మరది
అత్త — కోడలు
సవతుల సంవాదము మొదలగు రీతిలో ఉన్నవి.

## రాయబార వర్ణనలు

నాయికా నాయకులకు వియోగము కలిగిన సందర్భమున చెలికత్తెల ద్వారా రాయబారములు నడిపించినారు. ఆ రాయబార సంబంధులగు వర్ణనల నిట్లు చెప్పవచ్చును.

నాయిక చెలులతో — చెలులు నాయకునితో

నాయికలు నాయకుని స్నేహితునితో-సాగించిన రాయబార వర్ణనలను అన్నమయ్య వర్ణనా ప్రపంచమున గమనింపవచ్చును.

### దూతీ ప్రబోధము

రాయబారమును నెరపుచున్న దూతికలు చెలికత్తెలు నాయికా నాయకులకు ప్రబోధము చేయుచున్నారు ఒకరి నొకరు కలసికొని ప్రియముగా నుండుమని హితువు చెప్పుచున్నారు. నాయికను కూడినచో నాయకునకు సౌఖ్యము కలుగునని, నాయకుని వద్దకు వెళ్ళవలసినదని నాయికను ప్రోత్సహించుచున్నారు. చెలివలపు పులకరించినది కనుక నాయకుని రమ్మని ప్రబోధించుచున్నారు. ఆ వర్ణనల నిట్లు వింగడింప వచ్చును.

దూతికలు నాయకునితో

దూతికలు నాయికతో — ప్రబలమైన మోహమును ఒకరిపై నొకరికి కలిగించుచున్నారు.

ఈ విధముగ అన్నమయ్య శృంగార సాహితీ వనమున పుష్పితములైన రక రకములైన వర్ణనా పుష్పములను పరిశీలించి అందలి మకరందము నాస్వాదింప వచ్చును.

### ఆధ్యాత్మిక వర్ణనలు

అన్నమాచార్యుని ఆధ్యాత్మిక వర్ణనలను విభజించుట ప్రస్తుతాంశము వేదాంత మునకు, భక్తికి, లోకనింద (సంసారనింద) ఇత్యాదులకు సంబంధించినవి ఆధ్యాత్మిక సంకీర్తనములని, నాయికా నాయక సపత్ని దూతీ వ్యవహారములతో నిండి సంయోగ వియోగ శృంగార సంబంధులైనవి శృంగార సంకీర్తనములని తెలియుచున్నది. శృంగార సంకీర్తనములందు గ్రామ్యములనైనను ప్రయోగింప వచ్చును, కాని ఆధ్యాత్మిక సంకీర్తనములందు గంభీరపద ప్రయోగ మవసరము. ఆధ్యాత్మిక సంకీర్తనములను గూర్చి చిన తిరుమలాచార్యుడు

"దేహాత్మేశ వివేకో
త్సాహంబును లోకవేద ధర్మాధర్మా
ద్యూహాపోహంబులుఁగల
యా హరి సంకీర్తనంబు లధ్యాత్మంబుల్"[10] అని

పేర్కొనినాడు. దీనిని బట్టి దేహము–ఆత్మ–ఈశ ఈ మూడింటి విభాగమునందును లోకమునందు వేదము నందు కాన వచ్చెడి ధర్మాధర్మముల బలాబలములు మొదలగునవి గలిగిన హరి సంకీర్తనములు ఆధ్యాత్మిక సంకీర్తనములన్ని తెలియుచున్నది. ఆధ్యాత్మిక విషయములలో పరిమితముగ మాత్రమే వర్ణనలను గ్రహించుట కవకాశమున్నది. వాని నిట్లు చెప్ప వచ్చును.

సంకీర్తన మాహాత్మ్యము .... హరివాసము
స్వామివారి సర్వాంతర్యామిత్వము .... రక్షకత్వము
ఆదరభావము .... విష్ణు మంత్ర మహిమ
లీలా వర్ణనము .... దివ్యరథము .... దివ్యాయుధములు
దివ్య చక్రము .... శ్రీ హరి పాద మాహాత్మ్యము
అభయ హస్తము .... వాహనము .... శ్రీవారి ఆభరణములు
బిరుదులు—సార్ధకత మొదలగు రీతిలో చెప్పవచ్చును.

## భక్తి వర్ణనలు

'భక్తి' అనునది 'భజ్' ధాతువు నుండి పుట్టినది. 'భజ్' అనగా భజించుట. భగవద్భజనమని యర్థము. సహజముగ చిత్తము పరమేశ్వరుని పాదార విందముల కడకు వెళ్ళుటనే భక్తి యని శంకరాచార్యులవారు పేర్కొనినారు. భగవంతుని యెడగల పరమ పూజ్య భావమే భక్తి. భక్తికి రసత్వమును సిద్ధింపజేసినవారు రూపగోస్వామి మధు సూదన సరస్వతులు. ఈ భక్తి అనేకుల దృక్పథములలో అనేక విధములుగ ఉన్నది. భాగవతకర్త అభిప్రాయములో ఇది తొమ్మిది విధములు.

శ్రవణమ్, కీర్తనమ్ విష్ణోః స్మరణమ్ పాద సేవనమ్
అర్చనమ్ వందనమ్, దాస్యమ్ సఖ్యమాత్మనివేదనమ్"

(సప్తమస్కంధము)

అన్నమయ్య భాగవత కర్త చెప్పిన నవవిధ భక్తి భేదములను వర్ణించినాడు అంతే గాదు ఆయన ఇంకను కొన్ని భక్తి పద్ధతులను పలికి లక్ష్య లక్షణ సమన్వయము గావించినాడు. ఆయన చెప్పిన భక్తి భేదము లిట్లున్నవి.

"ఉన్మాదభక్తి :— హరికిఁగా వాదించుట
పతివ్రతాభక్తి :— పరుల గొలువ కుండుట
విజ్ఞానభక్తి :— ఆత్మఁగనుట
ఆనందభక్తి :— అరమరచి చొక్కుట
రాక్షస భక్తి :— అతి సాహసాల పూజ
తురీయభక్తి :— దాసుల సేవ
తామసభక్తి :— ఒక పని గోరి చేయుట

వైరాగ్య భక్తి :- అతడే గతియని యుండుట
రాజస భక్తి :- స్వతంత్రుడగుట
నిర్మల భక్తి :- శరణనుట
నిజభక్తి :- తట్టుముట్టులేనిది. (2-469)

శ ర ణా గ తి వ ర్ణ న లు

"అన్నమాచార్యుని జీవితమే దీర్ఘ శరణాగతి. పుట్టిబుద్ధిగనిన పదునారవ యేటనే అతడు తన్ను శ్రీ వేంకటేశునికిదాసునిగ, దాసానుదాసిగ శరణాగతునిగ భావించుకొని ఆత్మార్పణ చేసుకొన్నాడు. ఆమీద అహోబలములో వన్ శఠగోప యతీంద్రుని వద్ద వేదాంత మభ్యసించి ఈ శరణాగత తత్వమునే మరింత దిట్టవరచు నొన్నాడు. వైష్ణవ ధర్మములో, అనన్యాశ్చింతయంతో మాంయేజనాః వర్యుపాసతే/తేషాం నిత్యాయభిక్తా నాం యోగక్షేమం వహామ్యహం/ అని చెప్పిన గీతావాక్యముపై విశ్వాసము మెండు. అదిగాక 'సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ/అహంత్వా ం సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి మా శుచః / అనుచరమ శ్లోకమును విశిష్టాద్వైతులు భగవంతుని వాగ్దానముగా విశ్వసించి ఆతని చరణములనే శరణముగాగొని తరింపనెంతురు.......... అన్నమాచార్యుని పదములన్నియూ ఇదే విషయమును కేంద్రబిందువుగా మంచుకొని రచింపబడినవి. పదే పదే అతని ప్రసన్నత గోచరించుచుండును. అడుగడుగున అతని శరణాగతి ధ్వనించును."11

ఈ శరణాగతిని గూర్చి శ్రీ గౌరి పెద్దివారు "ఈ శరణాగతి ఆరు విధములుగ పేర్కొనబడినది.

1. అనుకూల్య సంకల్పము :- శ్రుతిః స్మృతిమమైవాజ్ఞా" అను భగవద్వచనాను సారము శ్రుతి స్మృతులలో చెప్పబడిన నిత్య నైమిత్తికములందు, భగవద్విషయము నందు మాత్రమే శ్రద్ధ గలిగియుండునటుల సంకల్పించుకొనుట.

2. ప్రాతికూల్య వర్జనము :- భగవద్వ్యతిరిక్తములు, భగవద్విరుద్ధములగు విషయ ములను పరిత్యజించుట

3. రక్షస్యతీతి విశ్వాసము :- భగవంతుడు నన్ను తప్పక రక్షించును అనుగాఢశ్రద్ధ

4. గోప్తృత్వవరణము :- నీవుతప్పనాకు వేరు రక్షకుడు లేడు అని భగవంతునే తనకు రక్షకుడుగా నిర్ణయించుకొనుట

5. ఆత్మ నిక్షేపము :— తనకు సంబంధించిన సర్వభారమును(పోషణము రక్షణము ఆపదల నుంచి కాపాడుట, పరమగతికి తీసికొని పోవుట వగైరాలను) స్వామికే సమర్పించుట.

6 కార్పణ్యము :— నేను అకించనుడను. అన్యథాగతి లేనివాడను. నాకునీవే దిక్కు-నన్ను నీవే కాపాడ వలెను. అని తన దీనత్వమును చాటుకొనుట..........

"ఈ ఆరింటిలోను ఆత్మనిక్షేపము అంగిగా తక్కినవి అంగములుగా పరిగ్రహించవలెను"[12] అని వివరించినారు.

అన్నమాచార్యుడు షడ్విధశరణాగతులను చక్కగా వర్ణించినాడు

శరణాగతి పద్ధతులనేకాక ఆధ్యాత్మిక సంకీర్తనములందు దేహము-ఆత్మ-పరమాత్మ- సంబంధములైన విషయములను అన్నమయ్య వర్ణించినాడు. వాని నిట్లు చెప్పవచ్చును.

నరజన్మము, సంసారము, కలియుగము, కులము-గుణము, ఆచరణ ప్రాముఖ్యము, విధి విధానము, దేహము—దేవుడు—జీవుడు, హరిభక్తుడు, బ్రాహ్మణుల లక్షణములు, హరిదాసులధికులను భావము, ఎంత పూజించినను వెలితిగ ఉన్నదనుట— మొదలగు రీతిలో ఆధ్యాత్మిక సంకీర్తనములందసంఖ్యాకములైన వర్ణనలున్నవి.

## వేల్పుల వర్ణనలు

ఇంతకు పూర్వము శృంగార, ఆధ్యాత్మిక వర్ణనలు ప్రత్యేకముగ పరిశీలింపబడినవి. వేల్పుల వర్ణనలనుండి అలంకారక వర్ణనల వరకు శృంగారాధ్యాత్మిక వర్ణనలు కలిపి వివరింపబడును. అనేక ప్రాంతములందు వెలసిన వైష్ణవ మూర్తులను అన్నమయ్య వర్ణించినాడు. ఆయా దేవతలను శృంగార సంకీర్తనములందు, ఆధ్యాత్మిక సంకీర్తనములందు అన్నమయ్య వర్ణించినాడు. కలియుగ వైకుంఠమని ప్రసిద్ధిపొందిన తిరుమల శ్రీనివాసునేకాక అన్నమయ్య ఇతర ప్రాంతములందలి ఇతర వేల్పులను కూడ వర్ణించి తరించినాడు. మూర్తీభవించిన వాగ్గేయకారుడైన అన్నమయ్య ఏయూరికేగినను అచ్చట వెలసిన విష్ణుమూర్తిని కీర్తించుచు విశిష్టాద్వైత తత్వములను విప్పి చెప్పుచు, భక్తినుద్బోధించుచు గొంతెత్తి పాడుచు తన్మయత్వమున గంతులువేసి యాడుచుండును ఏ దేవుని విగ్రహములోనైనను ఆయనకు దర్శనమిచ్చునది శ్రీవేంకటేశ్వర మూర్తియే. అందువలన ఆయన కవితలో రాముడు వేంకట రాముడుగా, కృష్ణుడు

వేంకట కృష్ణుడుగ దర్శన మిత్తురు. అన్నమయ్య గావించిన వేల్పుల వర్ణనలః ట్లు చెప్పవచ్చును.

నరసింహుడు

**అహోబలము** :- కర్నూలు జిల్లా శిరివోలు తాలూకా నల్లమల శ్రేణిలో కలదు. కొండప ఎగువన దిగువన ఆలయములున్నవి.

**దిగువ అహోబలము**

**పెద్ద అహోబలము**

**ఓగునూతుల** :- కడపజిల్లా కడప తాలూకాకు చెందిన చిన్నదాసరి పల్లెకు సమీపమున కొండ లోయలో వేయినూతులు గల ప్రదేశమున్నది. దానినే వేనూతులు కోన, వో నూతులకోన, వోగునూతుల కోనయని పలుతెరగుల పేర్కొందురు.

**కదిరి** :- అనంతపురం జిల్లా కదిరి తాలూకా కదిరి. ఈ గ్రామమునకే ఖాద్రియని వ్యవహారము.

**పేరెవరము** :-

**భువనేశ్వరము**

**మండెము** :- కడపజిల్లా రాయచోటి తాల్లూకా చిన్నమండెము.

**ముడియము** :- కడపజిల్లా జమ్ములమడుగు తాలూకా కుందేరునది యొడ్డున కలదు.

**విజయనగరము** :- బళ్ళారి జిల్లా హోస్పేట తాలూకా హంపి విజయనగర ప్రాంతము.

**వేంకటాద్రి** :- చిత్తూరుజిల్లా తిరుపతి పట్టణము.

**వేదాద్రి** :- కృష్ణాతీరమునందలి వేదాద్రి యేమో-మొదలగు ప్రాంతముల నారసింహుల నవనారసింహులను వర్ణించినాడు.

లక్ష్మీదేవి :

**అహోబలము** :- కొండ చివరనగల ప్రాంతము.

**వేంకటేశ్వరుడు**

తిరుపతి వేంకటేశ్వరునిగూర్చి ప్రత్యేకముగ పేర్కొన వలసిన పనిలేదు.

**కంభము**

**కడప**

కోన :- కడపజిల్లా కడపతాలూకాలోని నందిమండలమునకు దక్షిణమున పాలకొండ పర్వతమందలి కోనలో చక్కని ఊటగల ప్రదేశమున్నది.

చింతకుంట :- కడపజిల్లా జమ్మలమడుగు తాలూకాలో ఒకటి, ప్రొద్దుటూరు తాలూకాలో ఒకటి ఉన్నది.

చెప్పల్లి :- కడపజిల్లా కమలాపురము తాలూకా పెద్ద చెప్పల్లి గ్రామము.

నెలదలూరు :- కడపజిల్లా రాజంపేట తాలూకాలోని నందలూరే నెలదలూరా?

పాలగిరి :- కడపజిల్లా కమలాపురము తాలూకాలో ఉన్నది.

మంపెము :- పూర్వోక్తము.

మతంగాద్రి

విజయనగరము

## శ్రీరాముడు

ఒంటిమెట్టి :- కడపజిల్లా సిద్ధవటము తాలూకా ఒంటిమెట్టి గ్రామము.

గండికోట :- ఘండికోట పేరుతో కడపజిల్లా జమ్మలమడుగు తాలూకాలో ఉన్నది.

గుత్తి :- అనంతపురముజిల్లా గుత్తి తాలూకా గుత్తిదుర్గము.

వావిలిపాడు :- చిత్తూరుజిల్లా వాయిల్పాడు గ్రామము.

విజయనగరము

వేంకటాద్రి

## హనుమంతుడు

కలశాపురము :- అనంతపురము జిల్లా గుంటకల్ దగ్గరఉన్న ప్రసిద్ధ కళశాపురమే ప్రకల వాడుకలో కలశాపురమై ఉండును. అదియే తరువాత కళాపురమైనది.

## దిగువ పట్టణము

ముగాంబది :-మన్నసముద్రమే ముగాంబిది యేమొ

మతంగగిరి :-

విఠలము

విజయనగరము

## శ్రీ కృష్ణుడు

ఆతుకూరు :- నెల్లూరు జిల్లా లోని ఆత్మకూరు ఆతుకూరుగా మారినదేమో

ఉద్దగిరి :- నెల్లూరు జిల్లా ఉదయగిరి తాలూకాయే ఉదయగిరి

గండవరము :- గుంటూరు జిల్లాలో నేడు గుండవరముగ వ్యవహరింప బడుచున్నదే ఈ గండవరము

గండికోట

చాగలమఱ్ఱి :- కర్నూలు జిల్లా చాగల మఱ్ఱి గ్రామము.

తిరుపట్ల

తుమ్మురయారు :- కడప జిల్లా కడప తాలూకాలోని తుమ్మలూరు గ్రామము కావచ్చును.

నల్లబల్లి :- కడప జిల్లా కమలాపురము తాలూకా, పులివెందల తాలూకాలలో చెన్న కేశవాలయములు పలు గ్రామములందు కలవు నల్లబల్లి అచటిదేమో.

పులివెందల :- కడపజిల్లా పులివెందుల తాలూకా కేంద్రము.

మాచనవోలు :- కడపజిల్లా ప్రొద్దుటూరు తాలూకాలోని మాచనపల్లె కావచ్చును.

మాదుపూరు :- కడపజిల్లా సిద్ధవటము తాలూకా

వత్తలూరు :- కడపజిల్లా రాజంపేట తాలూకాలో ఉన్నది.

విజయనగరము

వెలుగోడు :- కర్నూలు జిల్లా ఆత్మకూరు తాలూకా వెలుగోడు.

వేంకటాద్రి

శ్రీరంగము :- ద్రావిడ దేశమున తిరుచ్చినాపల్లి సమీపమునగల సుప్రసిద్ధమగు వైష్ణవ క్షేత్రము.

నందలూరు :- కడపజిల్లా కమలాపురము తాలూకా నందలూరు గ్రామము మొదలగు ప్రాంతములలోని దేవతలను వర్ణించినాడు.*13

## శ్రీకృష్ణలీలావర్ణనలు

అనేక ప్రాంతము లందలి వేల్పులను వర్ణించిన అన్నమయ్య ఆయా వైవము లను పరిమితముగ వర్ణించినాడు. శృంగార సంకీర్తనము లందెక్కువగ, ఆధ్యాత్మ సంకీర్తనములందక్కడక్కడ శృంగార నాయకుడైన శ్రీకృష్ణుని మనోహరముగ వర్ణించినాడు. అన్నమయ్య కృష్ణ చరితమంతటిని రమ్యముగ వర్ణించనాడు. ఇంత

వివరముగ ఇతర వేల్పులను వర్ణింపలేము. అందువలన కృష్ణ సంబంధ విశేషములను ప్రత్యేకముగ గ్రహించు ప్రయత్నము జరిగినవి. శ్రీకృష్ణుని చరితము నిట్లు పరిశీలింప వచ్చును.

శ్రీ కృష్ణ జననము ... బాల్య క్రీడలు
శ్రీ కృష్ణుని గడుసుదనము
యశోద, గోపికలు కృష్ణుని కొరకు అన్వేషించుట
కృష్ణుడు–గోపికలు
గోపికల ఫిర్యాదులు - యశోద సమాధానము
శ్రీ కృష్ణుని లీలలు
శ్రీ కృష్ణుని వైభవము — మొదలగునవి.

## దశావతార వర్ణనలు

శ్రీ వేంకటేశుని వర్ణించుచునే అన్నమయ్య అక్కడక్కడ దశావతారములను వర్ణించినాడు. ఆవర్ణనలనిట్లు చెప్పవచ్చును.

సంస్కృతములో దశావతారముల వర్ణనలు.
తెలుగులో దశావతార వర్ణనలు .... అనునవి.

## అష్టాదశ వర్ణనలు

అష్టాదశ వర్ణనలను గూర్చి వివరణము పూర్వోక్తము ప్రబంధ యుగమున ప్రముఖ స్థానము నాక్రమించుకొనిన అష్టాదశ వర్ణనలను అన్నమయ్య తన సంకీర్తనములందు 'అల్పాక్షరముల ననల్పార్థ రచన' యన్నట్లు పరమ రమణీయముగ వర్ణించినాడు. అన్నమయ్య వర్ణనా నైపుణ్యమునకీ అష్టాదశ వర్ణనలు దర్పణములు. శృంగారాధ్యాత్మిక సంకీర్తనములందు అన్నమయ్య అష్టాదశ సంఖ్యను మించి వర్ణించినాడు. అన్నమయ్య గావించిన అష్టాదశాది వర్ణనల నిట్లు పేర్కొనవచ్చును.

నగరము, అర్ణవము, శైలము, ఋతువులు, సూర్యోదయము, చంద్రోదయము, ఉద్యానము, కందుక క్రీడ, సలిలక్రీడ, రతి, విప్రలంభము లేక వియోగము, వివాహము, కుమారోదయము, కుమార వర్ణన, మాత్య లేక మాత్య, ప్రయాణము, యుద్ధము, నాయకాభ్యుదయము, ఆశ్రమము, దేవివర్ణన సేన, అధ్వరము లేక యాగము, నది, సరస్సు, అరణ్యము, స్వయంవరము, సురవర్ణన, స్వర్గము, అభిసారిక, కోట

సమర విజయము, వేట, వృక్ష, గజ, అశ్వ ప్రస్తావనలు, వసంతము చల్లుకొనుట మొదలగు రీతిలో సంకీర్తన సాహిత్యము నందే అష్టాదశాది వర్ణనలు గావించి తన వర్ణనా సామర్థ్యమును ప్రకటించినాడు.

## జానపద గేయ రీతులలోని వర్ణనలు

అపూర్వమైన సంకీర్తన సాహిత్యమును సృష్టించి ప్రచారమునకు తెచ్చిన సంకీర్తన రచనా సార్వభౌముడన్నమయ్య. ఆయన రచనలన్నియు దాదాపు గేయ రచనలే. ఆయన వ్రాసిన శృంగార మంజరి కూడా రాగ తాళములతో పాడుకొనుటకను కూలమైనదే. లభింపక పోయినను అన్నమయ్య కృతముగ చెప్పబడుచున్న ఆధ్యాత్మ రామాయణము ద్విపద కావ్యముగ వ్రాయబడెనని తెలియుచున్నది. ఈ ఛందస్సు కూడ అది పాడుట కనువైనదే.

ఏ సాహిత్యమైనను ఒక్కసారిగ సుస్థిర రూపమును సంతరించుకొని యవతరించదు. క్రమ క్రమముగ పరిణతి చెంది తరువాత కొంతకాలమునకు మాత్రమే ఒక క్రమబద్ధమైన పద్ధతిలో నిలుచును. అన్నమయ్య వ్రాసిన సంకీర్తన సాహిత్యము పై అనాదిగా ఉన్న జానపద సాహిత్య ప్రభావమున్నదనుటలో సందేహము లేదు. అన్నమయ్య జానపద గేయ రీతులలో సాగించిన వర్ణనల నిట్లు విభజింపవచ్చును.

## స్త్రీల పాటలు

**జోలపాట :-** జోసరచుచు పాడెడి పాటలు

**లాలిపాటలు :-** చిన్న పిల్లలను లాలించుచు, బుజ్జగించుచు పాడెడిపాటలు.

**ఉగ్గు పాట :-** పిల్లలకు ఉగ్గు పెట్టు సమయమున పాడు పాటలు.

**ఉయ్యాల పాట ;** పిల్లలను ఉయ్యాలలో పరుండబెట్టి ఊపుచు పాడెడి పాటలు. పిల్లలకు సంబంధించినవే కాక దేవతామూర్తులను ఉయ్యాలలో బెట్టి ఊపుచు పాడెడి పాటలను కూడ ఉయ్యాల పాటలు గనే పరిగణింపవలెను. వీనినే 'దోల' అనియు వ్యవహరింతురు.

**పెండ్లి పాటలు :-** వివాహ మహోత్సవ సంబంధులే ఈ పాటలు. దివ్యదంపతుల కళ్యాణ మహోత్సవమును కన్నులకు గట్టినట్లు అన్నమయ్య వర్ణించినాడు.

**శోభనపు పాటలు :-** నాయికా నాయకుల వైభవమును ప్రశంసించుచు ముత్తైదువలు పాడెడి పాటలు

జయమంగళములు :- మంగళమును అనగా శుభమును సూచించుటకు పాడబడునవి మంగళములు.

హారతులర్పించుట :- హారతుల నర్పించుచు పాడెడి పాటలు.

నీరాజనము

నివాళి :- దిష్టి తీయుటకై పారాణి పళ్ళెము నెత్తుచు పాడెడి పాటలు

మేలు కొలుపులు :- యోగ నిద్రలో నున్న స్వామిని మేలుకొలుపుచు పాడెడి పాటలు.

ఎచ్చరిక :- స్వామి వారిని హెచ్చరించుచు పాడునవి.

రోకటి పాటలు :- వీనినే దంపుళ్ళ పాటలని కూడ వ్యవహరింతురు. రోకళ్ళతో రోళ్ళ వద్ద జేరిన స్త్రీలు ధాన్యమును గాని, కాయలను గాని దంచుచు పాడెడి పాటలు. ఈ సమయమున స్త్రీలు 'ఇస్, ఇస్' అను ధ్వనులను చేయుదురు కావున వీనిని 'సువ్వి' పాటలనియు వ్యవహరింతురు.

గొబ్బిళ్ళ పాటలు :- గోమయముతో చేసిన ముద్దలను గొబ్బిళ్ళందురు. తెలుగింటి ఆడపడుచులు ధనుర్మాసమున ముంగిళ్ళలో రంగవల్లికలు తీర్చి ఆ ముగ్గుల మధ్య గొబ్బిళ్ళను పూవులతో, పసుపు కుంకుమలతో అలంకరించి పాటలు పాడుదురు. వీనినే గొబ్బిళ్ళ పాటలందురు.

జాజర పాటలు :- సంస్కృతము నందలి 'చర్చరీ' గీతములే జాజరలని పలువురి నమ్మకము. వెన్నె రాత్రులలో, వీణలు మీటుచు, రాణమీరగ రమణులు పాడునవి జాజర పాటలని ప్రతీతి.

అల్లోనేరేళ్ళు :- వెన్నెల వేళలలో స్త్రీలు పాడునవి.

ఏలపాట :- మ్లేచ్ఛ భాషతో కూడి రాగమిశ్రితమై నాయక సంబుద్ధితో ఉండునది ఏలపాట.

తుమ్మెదపాట :- తుమ్మెద ఘుటముతో పాడబడునవి.

చల్ల అమ్మకపు పాట :- చల్లను అమ్మెడు స్త్రీలు పాడునవి.

ఎఱుక చెప్పుట :- భావికథార్థ సూచకములుగ ఉండును. తెలుగునాట 'సోదె' చెప్పుట అని వ్యవహారము. స్త్రీల పాటలు పై విధముగ ఉన్నవి.

## తత్వ గేయములు :-

జీవునికి సంబంధించినది.

సంబుద్ధి పదములు :- మనసా, కర్మమా, దైవమా చిలుకా సంబోధనలతో ఉన్నవి.

కోలాటపు పాటలు :- కోలలను ఆడించుచు పాడు పాటలు

తిరునాళ్ళ పాటలు :- పండుగ సమయమున బృందములు బృందములుగా చేరి పాడు పాటలు.

భజన కీర్తనలు :- భగవద్భజనము చేయుచు పాడునని ఛాంగుబళా.

**ఇతరములు :-** తందాన పదములు, సాసముఖాలు
బొమ్మలాట వారి పాటలు

పిల్లల పాటలు :- పిల్లలకు సంబంధించినవి. చిన్న పిల్లల ఆటలకు సంబంధించిన పాటలు. పిల్లల మానసిక వికాసమునకు అల్లబడిన గేయములను కూడ పిల్లల పాటలు గనే పరిగణింపవలెను.

## కథా గేయములు

నారసింహ విజయము

రామకథ

హనుమత్కథ – మొదలగు రీతిలో అన్నమయ్య గావించిన జానపద గేయ రీతులలోని వర్ణనలను గ్రహింప వచ్చును.

## వర్ణనలలో రసము

భక్తిరస ప్రధానమైన సంకీర్తన సాహిత్యమును సృష్టించిన అన్నమయ్య తన సంకీర్తన సాహిత్యమున ఇతర రసములను కూడ ఆయా సందర్భములందు మనోహరముగ వర్ణించినాడు. రససిద్ధుడైన కవీశ్వరుడు కావుననే అత్యంత సమర్థవంతముగ రసవర్ణనలు గావించినాడు. ఆయా రసములను వర్ణించుపట్ల రసోచితములైన శబ్దములను ప్రయోగించి తన సామర్థ్యమును ప్రకటింప జేసినాడు అన్నమయ్య. అన్నమయ్య గావించిన రసవర్ణనలలో శృంగారము (సంయోగ — వియోగములు) హాస్యము కరుణము, రౌద్రము, అద్భుతము, భయానకము, వీరము, బీభత్సము, శాంతము, భక్తి అను రీతిలో ఉన్నవి.

అలంకారిక వర్ణనలు*[1]

సంస్కృతాంధ్ర భాషా నిష్ణాతుడైన అన్నమయ్య రచనలలో అలంకారిక వర్ణనల సంఖ్య మిక్కుటముగ ఉన్నది. అన్నమయ్య గావించిన అలంకారిక వర్ణనలను స్థూలముగ నిట్లు పేర్కొనవచ్చును

శబ్దాలంకారములు

అర్థాలంకారములు

శబ్దాలంకారములు

వృత్త్యనుప్రాసము :— ఒకటి రెండు మూడు మొదలగు వ్యంజనములకు ఆవృత్తి కలుగుట.

ఛేకానుప్రాసము :— అవ్యవహితములగు వ్యంజనముల జంటలు వ్యవధానము లేకుండ ఆవర్తితములగుట.

యమకము :— సమానమైన వర్ణముల యొక్క జంట కాని సమూహము కాని ఆవృత్తమగుట

అంత్యానుప్రాసము

అర్థాలంకారములు :—

ఉపమ :— ప్రస్తుత వస్తువునకు అప్రస్తుత వస్తువునకు మనోహరముగ పోలికను చెప్పుట.

ఉత్ప్రేక్ష :— ఉపమాన ధర్మ సంబంధము చేత ఉపమేయముగ ఉపమానముగ సంభావింపబడుట

రూపకము:— ఉపమేయమునందు ఉపమానము యొక్క ధర్మమును ఆరోపించుట.

సందేహము :— ఉపమానోపమేయములు కవి సమ్మతమగు సాదృశ్యము వలన ఎచట సందేహము కలుగునో అది.

స్వభావోక్తి :— జాతి గుణక్రియాదులను ఉన్నవి ఉన్నట్లు సుందరముగ వర్ణించుట.

అర్థాంతరన్యాసము :— సామాన్యమును విశేషము చేతకాని విశేషమును సామాన్యము చేత కాని సమర్థించి చెప్పుట.

పరికరము :— విశేషణములను సాభిప్రాయముగ ప్రయోగించుట

భ్రాంతి :— సాదృశ్యము వలన ఉపమేయము ఉపమానముచే మరుగుపడి ఉపమాన ధర్మాను భావము కలుగుట.

ప్రతీపము :- ఉపమానముగ ప్రసిద్ధమైన దానిని ఉపమేయముగ వర్ణించుట

అతిశయోక్తి :- కవి ఊహ వలన ఉపమేయము మరుగుపడి ఉపమానమే ప్రధానము గా ఉండునది.

అపహ్నుతి :- ఉపమేయమును కాదని నిషేధించి సామ్యము వలన ఉపమానారోపము కలిగినచో అపహ్నవము.

విశేషోక్తి :- కార్యోత్పత్తికి వలయు సామాగ్రి ఉన్నను కార్యము జరగకుండుట.

ఉల్లేఖము :- ఒక ఉపమేయమే ఒకానొక ప్రయోజనాపేక్షతో గాని అభిరుచితో గాని శ్లేషతో గాని అనేక విధములుగ ఉగ్గడింపబడును.

వ్యతిరేకము :- ఉపమానము కంటె ఉపమేయమునకు అధిక్యముగాని న్యూనతగాని ప్రతిపాదించుటచే భేద ప్రధానమగు సాధర్మ్య గమ్యమానముగుట.

లోకోక్తి : లోక ప్రవాదనుకృతి లోకోక్తి

పర్యాయోక్తి :- ప్రకృత కార్య వర్ణనచే ప్రకృతమైన కారణము గమ్యమగుట.

ప్రతి వస్తూపమ :- వస్తు ప్రతి భావముతో సామాన్య ధర్మము ఉపమానోపమేయ వాక్యములలో ఉప నిబద్ధమగుటచే ఔపమ్యము స్ఫురించుట

విషయ :- కారణము వలన విరుద్ధ కార్యము జరుగుట, లేక అనర్థము జరుగుట, విరుద్ధములగు రెండు వస్తువు లొకచో చేరుట. విరోధ మూలకము విషమము.

పిహిత :- పరవృత్తాంతము నెరిగిన సాభిప్రాయ చేష్టితమును వర్ణించుట.

వ్యాజనింద :- నిందచే నిందాభివ్యక్తి వ్యాజనింద. మొదలైన రీతిలో అన్నమయ్య అలంకారిక వర్ణనలు గావించినాడు. అన్నమాచార్యుని అలంకారములపై ప్రత్యేక పరి శోధన జరిగినను ఆయన అలంకారిక వర్ణనా నైపుణ్యము గలవాడని తెలియ జేయుటకు మాత్రమే ఆయన గావించిన అలంకారిక వర్ణనలు స్థూలముగ వివరింపబడినవి

ఈ ప్రకరణము అన్నమాచార్యుని శృంగారాధ్యాత్మిక ప్రపంచమునకల వర్ణనల వెన్ని విధములుగ వర్గీకరింపవచ్చునో తెలియ జేయుటకు మాత్రమే ప్రత్యేకముగ వివరింపబడినది. ఇది తరువాతి ప్రకరణమునకు భూమిక వంటిది.

# సూచికలు


1. ఆధ్యాత్మిక సంకీర్తనలు సంపుటి 2, పీఠిక పు—52
2. సంకీర్తన లక్షణము — పు–6.
3. ,, ,, పు–12
4. నాయికల లక్షణములు కావ్యాలంకార సంగ్రహము నుండి గ్రహింపబడినవి.
5. తాళ్ళపాక కవుల పద కవితలు—భాషా ప్రయోగ విశేషాలు పుట 101
6. ,, ,, ,, ,, పుట 109
7. సాహిత్య శిల్ప సమీక్ష పు 155, 156
8. పీఠిక, శృంగార సంకీర్తనములు సంపుటి 12, పు-38
9. అన్నమాచార్య సాహితీ కౌముది పు 17
10. సంకీర్తన లక్షణము—పు 61
11. అన్నమాచార్య సాహితీ కౌముది పుటలు 9, 10
12. ఆధ్యాత్మిక సంకీర్తనములు సంపుటి 2, పీఠిక పుటలు 7, 8.
13. కడప ఊర్ల పేర్లు, డా॥ కేతు విశ్వనాథరెడ్డి,
తాళ్ళపాక కవుల పదకవితలు—భాషా ప్రయోగ విశేషాలు—గ్రంథముల నుండి గ్రహింపబడినవి.
14. అలంకారముల లక్షణములు కావ్యాలంకార సంగ్రహము నుండి గ్రహింపబడినవి.

# అన్నమాచార్య సంకీర్తనములలోని వర్ణనలు

కవిత్వమునకు ప్రధాన ధర్మముగ పేర్కొనబడుచున్న వర్ణనా నైపుణ్యము మూర్తీభవించిన ప్రతిభాశాలి అన్నమయ్య. పరమభక్త శిఖామణియైన అన్నమయ్య 'అడినమాటెల్ల అమృత కావ్యము, పాడిన పాటెల్ల పరమగానమైనది. ఆయన ఆడిన మాటలు పాడిన పాటలు వేంకటేశు లీలా వర్ణనలై ఉక్తి కవిత్వము నందగ్రేసరములై యున్నవి సంస్కృతాంధ్రములలో, సంగీత సాహిత్యములలో ప్రశంసనీయమైన ప్రతిభానైపుణ్యములు గలిగిన అన్నమయ్య శృంగారాధ్యాత్మిక ప్రవృత్తులలో ప్రకాశించెడి సంకీర్తనములను చెప్పినట్లు పూర్వోక్తము. భిన్న విధములుగ వర్గీకరింపబడిన అన్నమాచార్య సంకీర్తనములలోని వర్ణనల సమన్వయమీ ప్రకరణములోని ప్రధానాంశము.

అన్నమయ్య ఏ విషయమును వర్ణింపదలచుకొన్నను ముందుగా తన హృదయమున దాని సుస్పష్ట రూపమును ఏర్పరచుకొని తరువాత పాఠకుల మనోనయనములకు ప్రదర్శితమగురీతిని వర్ణించును. ఆ వర్ణించుటలోను అన్నమయ్య కష్టమైన పదముల పొంతకుపోడు. దీర్ఘ సమాసముల జోలి పట్టించుకొనడు. అందరికి నర్థమగు భాషలో తాను చెప్పదలనుకొన్న భావమును సూటిగ చెప్పగల నేర్పు అన్నమయ్యకు ఆజన్మసిద్ధము. సంస్కృత సంకీర్తనములను కూడ సరళమైన శైలిలో రచించినాడు. సంస్కృతాంధ్రభాషాప్రవీణుడైన అన్నమయ్య చేతిలో ఆయా పదములొదిగి పోవును. శబ్దశాస్త్ర సమగ్ర సౌధాగ్ర శిఖరముల నాధికారిక యుక్తి నరసిన అన్నమయ్యకు పదముల కొరకు ప్రాకులాడవలసిన అగత్యములేదు. సంగీత సాహిత్య ప్రవీణుడైన అన్నమయ్య వర్ణనలు సహృదయుల జిహ్వా రంగస్థలములపై నాట్యము చేయును. శ్రోతల కర్ణపుటములందు ప్రతిధ్వనించు చుండును.

పదకవితా పితామహుడని, పంచమాగమ సార్వభౌముడని ప్రసిద్ధి పొందిన అన్నమయ్య ఏది పలికినను వినవలెననిపించును. చెప్పిన విషయమునే మరల మరల చెప్పదలచుకొన్నచో మాటలను మార్చి నవనవోన్మేషముగ ఒప్పించగల ప్రతిభాశాలి అన్నమయ్య. ఎంత వర్ణించినను వేంకటేశునే వర్ణింపవలెను. ఏమి చెప్పినను ఆ జగన్మోహనమూర్తిని గూర్చియే చెప్పవలెను. ఏమి పలికినను ఆ దివ్య దంపతుల లీలా విశేషములనే విశదీకరింపవలెను. భావగాంభీర్యము అనల్ప కల్పనా వైదుష్యము కల అన్నమయ్య వేంకటేశుని దివ్యమంగళ విగ్రహమును వర్ణించుటలో పలు పోకడలు పోయినాడు.

## శృంగార వర్ణనలు

శృంగారాధ్యాత్మిక తత్వముల పరిచయము పూర్వోక్తము. అన్నమాచార్యుని శృంగార సంకీర్తనములలోని వర్ణనలీ విధముగ ఉన్నవి. శ్రీ వేంకటేశునితో అనేకములైన సంబంధములను కల్పించుకొని ఆయా సంబంధముల కనుగుణమైన వర్ణనలను అన్నమయ్య అసంఖ్యాకముగ చేసినాడు. తాను శృంగార నాయికగా ఉన్న సమయమున 'అక్కరో వేంకటేశుఁడేనమేల్మంగ నిక్కడ నను గూడి యేలినాడమ్మ' అని పలుకును. నాయికల స్వరూపములను మనోహరముగ వర్ణించినాడు.

## నాయికా వర్ణనలు

సాంప్రదాయికములైన ఉపమానములలో నాయికా రూపచిత్ర సాక్షాత్కారమును గావించుచున్నాడన్నమయ్య.

"ఏమని పొగడవచ్చు నిట్టి వింతసింగారము
సేమముతో రమణుఁడ నీ భాగ్యమాయెను ॥పల్లవి॥

కమలము మీఁద రెండు కలువలు వికసించె
జమళి నందు వల్లనే సంపెంగ పూచె
తమితో నాకొట్టఁ గొనఁ దగదొండ పండుపండె
అమరవిన్నియును గూడి యింతి మోమాయెను ॥ఏమని॥

కన్నెయరటులమీఁద కంతుని రథము వాలె
పన్ని సింహమొక్కటి యాపైనెక్కెను
నన్నలనా మెకముపై సరిజక్కవలు రాలె
ఇన్నియును గూడి నింతి రూపమాయెను ॥ఏమని॥

అంచెలఁ గూర్మాలు రెండు హంసలతోఁ బొందుచేసె
పొంక బిసాలు సంకము పొత్తుగూడెను
నించి శ్రీ వేంకటేశుఁడు నీ సందిటఁ బట్టగా
యెంచక వేవురముపై నిందిరాదేవాయెను ॥ఏమని॥ (13-327)

....నాయికా సౌందర్యమును అవరోహణారోహణ క్రమములో వర్ణింపగా నాయిక క్రమక్రమముగ పాఠకుల కన్నుల యెదుట నిలిచినది. తెరను కొద్దికొద్దిగా తొలగించి నటిని రంగస్థలముపై ప్రవేశపెట్టినట్లు నాయిక ఆకారమును క్రమక్రమముగ

వర్ణించినాడు. శబ్దములతో చిత్రములను చిత్రించెడి నేర్పు అన్నమయ్యకు సహజ సిద్ధము.

అన్నమయ్య తన సంకీర్తనములలో సంగీత సాహిత్యములలో సాహిత్యము నకే ప్రాధాన్యము నిచ్చినాడు. అలమేల్మంగ దివ్యలాస్యమును అద్భుతముగ వర్ణించి నాడు. స్థిరరూపముకంటె చరరూపమును వర్ణించుట ప్రతిభా నైపుణ్యమునకు పరీక్షా సందర్భము. రూపచిత్ర సాక్షాత్కారమైన అలమేల్మంగా చలత్సౌందర్యము నీవిధముగ అన్నమయ్య వర్ణించుచున్నాడు.

"శంకరాభరణం :-
అలరులు గురియగ—నాడెనదే
అలకల గులుకుల నలమేల్మంగ ॥పల్లవి॥
అరవిరి సొబగుల నతివలు మెచ్చగ
అరతెర మరఁగున నాడెనదే
వరుసపూర్వ దువాళపు తిరుపుల
హరిఁ గరగంచుచు నలమేల్మంగ ॥అల॥
మట్టెపు మలపుల మట్టెల కెలపుల
తట్టెడి నడపుల దాఁటినదే
పెట్టిన వజ్రపు పెండెపు తళుకులు
అట్టిటు చిమ్ముచు నలమేల్ మంగ ॥అల॥
చిందుల పాటల శిరి పొల యాటల
అందెల మోఁతల నాడెనదే
కందువ తిరువేంకట పతి మెచ్చగ
అందపు తిరుపుల నలమేల్మంగ ॥అల॥ (12-24)

—ఇందు అలమేలుమంగ చేసిన లాస్యము క్రమ పరిణతిలో వర్ణితము. అలకల కులు కులతో, అలరులు కురియునట్లు అలమేలు మంగ ఆడినదట. సాధారణ వ్యవహారములో 'పూవులు రాలుతున్నాయి' అనుట పరిపాటి. కాని అన్నమయ్య అలరులు కురిసినవని వర్ణించినాడు. పల్లవిలో ప్రారంభించిన విషయమును తరువాతి చరణములలో క్రమ క్రమముగ విస్తరింపజేసినాడు. అతివలు మెచ్చుకొనునట్లు, హరికరగునట్లు అరవిరి సొబగులతో అరతెర మరుగున ఆడినదట. తరువాతి చరణములలో తాను ధరించిన వజ్రపు పెండెపు తళుకులు అట్టిటు 'కదలించుచు మట్టెల మ్రోతలతో, తట్టెడి నడకలతో

ఆడిన విషయము స్పష్టము. ముందుగ అలమేలుమంగా లాస్యమునకు కరగి పోయిన హరి తరువాత ఆమె 'చిందుల పాటలకు సిరిపొల యాటలకు అందెల మ్రోతలకు' అభినందించినాడట. అన్నమయ్య అలరులు కురియగ - అలమేలుమంగ ఆడినదని వర్ణించినాడు. ఈ అలరులు ఎక్కడనుండి కురిసినవి అలమేలుమంగ అలకల నుండి కురిసినవా? లేక అతివలు మెచ్చునట్లు, హరి కరిగినట్లు ఆడిన అలమేల్మంగాలాస్యము నకు మెచ్చి దేవతలు కురియించినవా యని సందేహము కలుగును. అలరులు కురిసిన వని అన్నమయ్య వర్ణించినాడు. కావున అదిదేవతలు కురిపించిన పుష్పవృష్టి కావచ్చును సరళ సుందరమైన శైలిలో అన్నమయ్య ప్రకటించిన భావము, ప్రదర్శించిన వర్ణనా నైపుణ్యము సహృదయ హృదయ రంజకము

చెలిపలుకుల ద్వారా నాయికా సౌందర్య సంపదను వర్ణించుచున్నాడు.

"బౌళి :- మోహము సేయించుకొని మురిసేవు
సాహసములెదురా చదురాలి కిపుడు ॥పల్లవి॥
ఒక్క చక్రమె నీకున్నది గాని, యింతి
రెక్కల చక్రాలె పో రెండు గుబ్బలు
.... .... .... .... .... .... .... .... .... .... ....
నీలమేఘము చాయ నీ మేను గాని పెద్ద
నీల మేఘమే పో నెలంత కొప్పు
.... .... .... .... .... .... .... .... .... .... ....
మరుని ప్రతినిధి నీ మహిమగాని ఆ
మరుని సంపదే పోమగువ నేడు ॥మోహ॥" (12-71)

— ఈ సంకీర్తనమున నాయికా నాయకుల సౌందర్య సంపదలో నాయికా సౌందర్యమే అధికమని వర్ణించినాడు.

వేరొక సంకీర్తనమున 'మోమున సింగారములు మొలకెత్తినట్లు'న్న నాయికా సౌంద ర్యమును వర్ణించినాడు.

"ముఖారి :- సెలవుల నొకమాటు చేరినీవు నవ్వితేనే
చెలలేని మహిమల వెన్నెల గాయ

తఱుఁన నీవటు తప్పక సూచితేనే
నిలువెల్లఁజీకటుల నిగ్గుదేరును" (25-35)

—ఇంకను నాయిక మోవి చూపినచో పగడముల సొంపు నిండునని నాయికా సౌంద ర్యమును వర్ణించినాడు.

సందేహ పురస్సరముగ నాయికా వర్ణనను రమ్యముగ

"శ్రీరాగం :— మోతుగ పూచెనో మొల్ల పూచెనో
కాతారపు చెలి కన్నులను
చూతముపూచెనో సురవన్నపూచెనో
ఘాతల నీసతి కాయమున—
పగడము పండెనో పైమోవి పండెనో
అగపడి యీకాంత అధరమున
పొగరునిమ్మలో పోకలు పండెనో
మగువ కిదివో నెమ్మదిఁ జన్నులను—" (26-291)

అని వర్ణించినాడు.

వడ్డించుచున్న నాయిక తన వలపునే నాయకునకు వడ్డించుచున్నట్లు అన్నమయ్యకు కనిపించినది. అందువలన ఆ నాయిక యొక్క సౌందర్యము నీ విధముగ వర్ణించుచున్నాడు.

"ఆందోళి :— ముంగురులఁ గుచ్చిన ముత్యాలు గదలఁగా
బంగారు పువ్వుల చీర పయ్యెద జార
కంగు కంగుమనుచును కంకణాలొరయఁగాను
వుంగరాల వేళ్ళనీ వొడివట్టి జెలియ" (28-212)

—అంతేగాత పెద్ద కొప్పుపై వజ్రముల బిళ్ళలు మెరయఁగ, కమ్మలకాంతి అతిశయించగ, పెనగొన్న హారములు ఉయ్యాలలూగగా పలు మారులు మ్రొక్కినదట. పాలుపైన మాణిక్యపు భుజకీర్తులు వెలయగ ములువాడి చన్నులు మోము కెగరగ కలయుమనుచు కౌగలించినదట. ఈ సంకీర్తనము నందు అన్నమయ్య ఊహాశక్తి నాయిక కొప్పుపైని వజ్రమువలె మెరసి, హారము వలె ఉయ్యాల లూగి చన్నులు మోముకెగరినట్లుగ ఉన్నతోన్నత స్థాయికి చేరుకొన్నది.

మరుని సంపద ప్రస్తావనతో నాయిక వర్ణన గావించినారు.

"శంకరాభరణం :— ఎట్లు గడించు కొంటివే ఇవి చక్కఁదనమంటా
చుట్టములు గావే అవే సూడు బంట్లు
తామరల వంటి వేమో తరుణి నీ కన్నులు ఆ
తామెరలె మరునికి తగ బాణాలు
సోముని వంటిదే నీ సొంపైన మొగము—ఆ
సోముఁడాతనిఁ గలసి జోడౌ తెలుఁగవా ॥ఎట్లు॥
జక్కవల బోలినవి సతి నీ కుచములు
జక్కవలే మరునికిఁ జనవరులు
ఒక్కలి తేంట్లఁ బోలె మేలిమి నీ కురులు
పక్కన నాతని కవి బంట్లౌ తెలుఁగవా ॥ఎట్లు॥
చిగురు బోలినదె చెలియ నీమేను ఆ
చిగురే పో మరునికిఁ జేకత్తులు
నగుతా శ్రీవేంకటాద్రి నాయకునిఁగూడితివే
తగ నీతఁడే యాతని తండ్రౌ తెలుఁగవా ॥ఎట్లు॥ (25—523)

....ఈ సంకీర్తనమున సాంప్రదాయకమైన ఉపమానములను చెప్పుచునే చెలికత్తె నాయికను బోధ చేయుచున్నట్లు పలికి నాయికా వర్ణనము గావించినారు. నాయికమేని సంపద నవరత్న సమానమని తన భావనాశక్తి నీ విధముగ ప్రకటించుచున్నాడు.

"నాదరామక్రియ :— నెంత చక్కఁదనమే నిండు బండారము నీకు
గలిగెఁ గనక లక్ష్మి కాంతుఁడ పై తివి ॥పల్లవి॥
వదతి నెమ్మోమునకు బంగారు గోలు చేరి
వెదలె నెలవి నవ్వే వెండి గనులు
అదియాల మగుమోవి యదె పగడపుఁదీగె
నడుమాల్లఁ దురుమే నీలముల రాశి ॥నెంతి॥
తరుణి పాదపు గోళ్ళు తళుకుల వజ్రములు
పరగుఁ జేతి గోళ్ళే పద్మరాగాలు
అరిది కన్నుల తేట లాణిముత్తె పుసరులు

నరిఁ బచ్చల కొండలు చను మొనలు ॥నెలత॥
చెలితేనె మాటలు జిగిఁ బుష్యరాగాలు
వలపుతెర సిగ్గులు వైడూర్యాలు
తొలఁకు ననురాగాలే దొడ్డ గోమేధికములు
కలిసి తీరెను శ్రీవేంకటేశ కౌఁగిటను ॥నెలత॥ (24—198)

—ఇందు నాయిక ప్రత్యంగ సౌందర్యమును నవరత్నములతో పోల్చి ప్రశంసాత్మకముగ వర్ణించినాడు. ఈ విధముగనే మగువ మాటలను మాణిక్యములతో, పెదవులను పగడములతో, చూపులను నీలములతో, గోళ్ళను వైఢూర్యములతో, నవ్వులను వజ్రములతో, తేనె పలుకులను పుష్యరాగములతో, చెనకులను గోమేధికములతో, చెమటలను ముత్తెపు సరములురతో సంపుటి 29 సంకీర్తనము 30లో అత్యంత మనోజ్ఞముగ వర్ణించినాడు. ఇందలి వైభవమును వర్ణించిన తీరు అన్నమయ్యకు సహజ సిద్ధము. ఇది అనన్య సామాన్యము, అనితర సాధ్యము.

నవరస పరముగ నాయిక వర్ణన మిట్లు చేయుచున్నాడు.

అవధరించగదయ్యా అన్ని రసములు నీవు
తివురము నచ్చెనిదె తేని మోవి రసము ॥పల్లవి॥
చెలియ చక్కఁదనాన శృంగార రసము
వెలయ బొమ జంకెనల వీరరసము
కలయు రతి కాంక్షలను కరుణా రసము
అలరు మైపులకలను అద్భుతరసంబు ॥అవ॥
తరుణి సరసములను తగు హాస్యరసము
పురుషంపు విరహాన భయ రసంబు
బెరయు విబ్బరములను బీభత్సరసము
గరిమ మరు యుద్ధాన ఘన రౌద్ర రసము ॥అవ॥
వనిత ఆనందముల వడి శాంత రసము
ననుపు మంతనములను నవరసములు......" (13—423)

....ఒక్క నాయిక యందే నవరసముల ప్రస్తావనతో నాయిక వర్ణనము గావించినాడు. అన్నిటికంటె 'తివుతనుచు నచ్చెనిదె తేనె మోవి రసము' అని పలికిన పలుకులు సంకీర్తనమున కంతటిని మకుటమై ప్రకాశించుచున్నది.

నాయిక స్వరూపమును వర్ణించుచు నాయిక అవయవములకు జ్యోతిష్యములోని ద్వాదశరాశులకు సాదృశ్యము చెప్పినాడు. ఈ క్రింది సంకీర్తన మా విధమగు వర్ణనతో ఉన్నది.

శుద్ధ రామక్రియ : ఇన్ని రాశుల యునికి యింతి చెలువపురాశి
కన్నె నీరాశి కూటమి కలిగిన రాశి ॥పల్లవి॥

కలికి బొమ విండ్లుగల కాంతకును ధనురాశి
వెలయు మీనాక్షికిని మీనరాశి
కులుకు కుచ కుంభముల కొమ్మకును కుంభరాశి
చెలగి హరి మధ్యకును సింహరాశి ॥ఇన్ని॥
కన్నెపాయపు సతికి కన్నెరాశి
వన్నెమై పైడి దులదూగు వనితకు దులారాశి
తిన్నని వాడిగోళ్ళ సతికి వృశ్చికరాశి ॥ఇన్ని॥
ఆముకొను మెరవుల నొరయు నతివకు వృషభరాశి
గామిడి గుట మాటల సతి కర్కాటకరాశి
కోమలపు చిగురుమోవి కోమలికి మేషరాశి
ప్రేమ వేంకట పతి గలిసె ప్రియ మిధునరాశి॥ఇన్ని॥ (12 143)

....నాయిక ప్రత్యంగ సౌందర్యమును రాశులతో సాదృశ్యము చెప్పి వర్ణించి చివరకు నాయికా నాయకులను మిధునముచేసినాడన్నమయ్య' ఈ విధముగ రాశులతో సాదృశ్యమును వర్ణించుట అపూర్వమని చెప్పవచ్చును. వేరొక సంకీర్తనమున నాయికా వర్ణనను కనుమలతో పోల్చి వర్ణించుచున్నాడు.

"వరాళి ; సొంపుల నీ వదనపు సోముశిల కనుమ
యింపులెల్లఁ జేకొనఁగ నిల్లు నీ పతికి ॥పల్లవి॥
కలికినీ పిఱుఁదనే గద్దెరాతి కనుమ
.... .... .... .... .... .... .... .... .... ....
ఇదివో ని కెమ్మోవి యెఱ్ఱ శిలకనుమ
.... .... .... .... .... .... .... .... .... .... ....

కాంత నీ చిత్తమే దొంగల సానికనుమ
యింతటి వేంకట పతికిరవైనది
పంతపు నీ గుబ్బలే గుబ్బలి కొండ కనుమ
మంతనాల కనుమాయ మగువ నీ పతికి ॥సొం॥ (12–115)

ఈ సంకీర్తనము నందు చెప్పబడిన కనుమలను గూర్చి శ్రీ గౌరి పెద్ది రామ సుబ్బ శర్మగారు ఈ విధముగ వివరించినారు. " 1) దొంగల సాని కనుమ :— ఇది సిద్ధ వటం తాలూకా ఓబుళం దగ్గర వుంది.

2) సోమ శిల కనుమ :— నెల్లూరు జిల్లా సరిహద్దున ఆత్మకూరు తాలూకా – సిద్ధవటం తాలూకా సొద్దులో నున్నది. 3) గద్దె రాతి కనుమ :— ఇది నేడు సుద్ద రాతి కనుమ అని వ్యవహారం. తాళ్ళపాక సమీపంలో ఉంది. 4) ఎల్ల శిల కనుమ :— పోలి అప్పరాజు పేట సమీపంలో 'కడియాల పల్లె కనుమ' అని వ్యవహారంలో వుంది. 5) గుబ్బలి కొండ కనుమ : లంబకనుమ నేడు వ్యవహారం 6) మంతనాల కనుమ : ఇది నడి గడ్డ దగ్గర వుంది. కోడూరు సమీపం. నాగేళ్ళ కనుమ అని నేడు వ్యవహారం.

"ఈ కనుమల విశేష మేమంటే ప్రతి కనుము దగ్గర ఏ వైపుననో ఒక వైపున చెన్నకేశవ స్వామి ఆలయం వుంది నేడు కొన్ని చూడవచ్చును. కొన్ని శిథిలా వస్థ నొంది యున్నవి ఈ కనుమలు షట్చక్రాకృతిలో నున్నవని షట్కోణాంతర్గతము లని పెద్ద లంటారు."[1] అని పలికినారు.

వివాహ సమయమున నాయిక సౌందర్యమును వర్ణించుచు పెండ్లి వస్తువుల ప్రస్తావన చేయుచున్నాడన్నమయ్య. అన్నమయ్య భావనలో నేచే నొక క్రొత్తదనను గోచరించుననుటకీ క్రింది సంకీర్తనము ప్రత్యక్షోదాహరణము.

"ఆందో॥ — ఇదె పెండ్లి లగ్నవేళ యింతికి నీకు
సుదతి మోవి చిగుళ్ళు సోబన పత్రికలు ॥పల్లవి॥
తొయ్యలి చూచిన చూపు తుమ్మెద పేరటాండ్లు
నెయ్యమున నవె నీకు నివాళ్ళు
పయ్యదలో చన్నులు పరగఁ బూజ గుండలు
నియ్యెడఁ గంతకవె నిమ్మపండ్లు ॥ఇదె॥

చెలియ నవ్వేననవు జిగి నీకుఁ దలఁ బాలు
వెలఁగి బువ్వానకవె చిలుపాలు
పలుకుల సరసాలు బలు మంగళాష్టకాలు
మలసి యవె మదన మంత్రాలు ॥ఇదె॥ (22-439)

— అని వర్ణించిన తీరు, అన్నమయ్య వర్ణనా సామర్థ్యము ప్రత్యక్షర సత్యముగ, మనో రంజకముగ ఉన్నది.

ఇంతి సింగార సంబంధ వర్ణన :— సహజ సౌందర్యముగల నాయికకు కృత్రిమమైన ఆభరణము లెందుకని చెలికత్తె "గంధపు పరిమళము నీ మేని పరిమళము కంటె అధికమా ? నీ మోము కంటె అద్దము అపురూపమైనదా ? నీ వ్రేలి గోళ్ళ కంటె ఉంగరములు ప్రకాశములా ? నీ కొప్పుతో నవరము సరి యగునా ? అని నాయికను ప్రశ్నించుచున్నది. అపదమీ విధముగ ఉన్నది.

"భైరవి :— గంధము పూసే వేలే కమ్మని మేన యీ
గంధము మీ మేని తావి కంటె నెక్కుడా ॥పల్లవి॥
అద్దము చూచే వేలే అప్పటప్పటికిని
అద్దము నీమోము కంటె నపురూపమా
ఒద్దికి తామర విరినొత్తే వు కన్నులు నీ
గద్దరి కన్నుల కంటె కమలము ఘనమా ॥గంధము॥
.... .... .... .... ........ .... ....
నవర మేటికే జడియు నీ నెరులకు
నవరము నీ కొప్పు సరి వచ్చీనా
యివలఁ జపులు నీకు నేలే వెంకటపతి
నవరని కెమ్మోవి చవి కంటెనా ॥గంధము॥ (12-2

ఈ సంకీర్తనమున నాయిక అలంకారములను గూర్చి చెప్పుచునే నాయిక సౌందర్య సంపదను మనోజ్ఞముగ వర్ణించినాడు. తనను నాయికగా భావించుకొని అనేక విధముల శ్రీ వేంకటేశునితో శృంగార విహారములు సలిపిన అన్నమయ్య ఇంకను అనేక విధ ముల నాయికా వర్ణనము గావించినాడు.

## భిన్నవిధ నాయికల వర్ణన

అన్నమయ్య గావించిన భిన్నవిధ నాయికలీ విధముగ ఉండిరి.

### స్వీయ :—

"నాదరామ క్రియ :— కల్ల గాదు యిది నీవు గన్నపనే
చెల్లు నీకే యన్నియును చిత్తగించరాదా ॥పల్లవి॥
మొక్కిన నా మొక్కులలోనే మోహమెల్లా గానరావా
చొక్కపు నామనసేమి సోదించేవు
.... .... .... .... .... .... ....
కూడిన నా కూటమిలో గుణమెల్ల గాన రాదా
తోడనే మమ్మెంత తొరలించేవు.
వేడుక మించితివి శ్రీ వేంకటేశ నన్ను నిట్టె
జూడ నలమేల్మంగను చనవులిమ్మికను ॥కల్ల॥ (26_479)

— ఇందలి నాయిక స్వీయ. ఉత్తమ నాయిక యగు అలమేలు మంగయే ఈమె. కనుకనే నాయకుడగు శ్రీ వేంకటేశ్వరునితో 'నా మొక్కులలో' మోహము కాన వచ్చుట లేదా ? ఇంకను అద్దము వంటి నా మనసునేల శోధించెదవు ? మొగమిచ్చ కపు పనులు చేసి నన్ను భ్రమయింపవలెనా ? అట్టి టక్కరి తనములు నాకు తెలియవు నేను నీకు సమర్పించిన కానుకలే ఈ నిజమును చెప్పుచుండుట లేదా ? ఇంకను నా గుణములు ఏమి విమర్శించు కొనుచున్నావు. నీ దాననగునన్నిట్లు రవ్వసేయదగునా ? మచ్చరము లేని దానను మన్నింపవయ్యా. నా గుణములు మన కూటముల, యందే నీ వెరిగితివి కదా ! నేను నీ అలమేలు మంగను. నన్ను పాలించుకొనుము. అని స్వామి వారితో పలికినట్లు అన్నమయ్య మనోహరముగ వర్ణించుచున్నాడు.

### ప్రౌఢ :—

సంపూర్ణ యౌవనవతియై, గడుసు దనము గలిగిన నాయిక నాయకుని ప్రశ్నించు చున్నది. ఈమె జాణ. ప్రౌఢ. మృదుస్వభావుడైన నాయకుని ప్రశ్నించుచున్నది.

"శుద్ధ వసంతం :— ఓరి నీవు నేనేమన్న నోరువలేవా
ఓరాలు నెఱపుదువు పటీ తీసేవా ॥పల్లవి॥
నవ్వులకు నాకొన గోరు నాటించిన యంతలోనే

ఇవ్వల నొచ్చెననేవు యిది యేరా
రవ్వలుగాఁ దొల్లి నీవు రావణునితోఁబోరినది
అవ్వల నే నెంచుకొంటే నరు దయ్యీ రా ॥ఓరి॥
మనసు చూడవలసి చనుగొండల నొత్తితే
కినిసి యంతటిలోనే కిందు పడేవు
వెనుకకు వీఁపున మందరము మోఁచి తచ్చిన
పనులు నిన్నెంచి తేను పచ్చి దేరీతా ॥ఓరి॥
చుట్టమనై నిన్ను రతి సూడు వట్టి కూడి తేను
అట్టె శ్రీ వేంకటేశ అలసేవు
గుట్టునఁ బదారువేలఁ గూడితి వనెడి మాట
యిట్టె నీ మీద మోపితే యేరవయ్యీరా ॥ఓరి॥ (22-90)

— ఇందలి నాయిక నాయకుని గొప్పదనమును నిలదీసి యడుగుచున్నది. నాయక చేష్టలకే నాయకుడు తట్టుకొన లేకున్నాడట ! ఎంతటి ప్రౌఢ ఈ నాయిక ! ఇదే విధమైన నాయికను సంపుటము 25 సంకీర్తనము 558లో కూడ మనోజ్ఞముగ వర్ణించినాడు. స్వీయ, ప్రౌఢ, ప్రేమ గర్వితయైన నాయిక నిట్లు వర్ణించినాడు.

"సావేరి :— నేనెంత కోపినైన నీ కేల చలము
పూనివట్టి నాకు నీవు బుద్ధి చెప్పరాదా ॥పల్లవి॥
బీరము లాడే వారికి బిరుదులే యెక్కుగాక
పోరుపుగల వారికి పోరటున్నదా
నేరుపు గల వాడవు నేనే మనిన నీవు
అరితేరి చుట్టమవై అండ నీ వుండరాదా ॥నేనెంత॥ (26-591)

— నాయికకు కోపము వచ్చినను నాయకుడగు శ్రీ వేంకటేశ్వరుడు శాంత మూర్తియై ఆమెను నవ్వుచు మందలించి యేలుకొన వలెనట ! నేరపు గలవాడవు, తగవరివైన వాడవు అని తప్పంతయు నాయకునిదే యైనట్లు గద్దించుచున్నది.

ముగ్ధ :

"ముఖారి :— మక్కువ చల్లి యాతఁడు మనసెల్ల నిచ్చినాడు
మొక్కలము దీరినాను మోనమేలే

.... .... .... .... .... .... .... ....

శ్రీ వేంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁ గూడినాను
వావులు గలపే తలవంచనేలే
వేవేలు వచ్చె నీకు విభుఁ డాతఁ డైనాడు
కైవశమైన మీఁద కత లేలే" (22–154)

— ఈ సంకీర్తనము నందలి నాయిక క్రొత్తగా అంకురించిన యౌవనము గలదై మిక్కిలి లజ్జతో ఉన్నది. చెలికత్తెలు ముగ్ధ నాయికను మౌనమెందుకని, తలవంచు టెందులకని ప్రశ్నించినారు. ఇదే విధముగ

"నగవె ననుపు నయమె ప్రియము
తెగువే తెలివి దినదినమూ
మగువనఁ జూడరాదా మాఁటాడ సిగ్గువడీని" (27–263) అని ముగ్ధ నాయికా స్థితిని వర్ణించినాడు.

## మధ్య

రత్యనంతరము వివశురాలైన నాయిక నిట్లు వర్ణించుచున్నాడు.

"శంకరాభరణం :— "వెక్కసమగుఁ గుచ విభవములు
అక్కవ పులుఁగుల జగడములే ॥పల్లవి॥
చింత చేతనిదే చెలియ నుదుటిపై
చెంతలఁ జెదరిన చిరు నెరులు
కాంతకన్నులను గండు మీలను
కంతుడు వేసిన గాలములే ॥వెక్క॥
.... .... .... .... .... .... .... ....
తెలి మోవిపై తిరు వేంకటపతి
గుఱుతులు చేసిన కురుఁదసలు
ఒఱగి వివశతల నుండఁగ సురతపు
మఱపులు దెలిపిన మర్మములే ॥వెక్క॥.... (12–174)

— ఇందలి నాయిక రత్యనంతరము ఒఱగి వివశతలలో నున్నదని వర్ణించినాడు. ఈ

సంకీర్తనమున్నసే పెదిరిన నెర్రులను కాంత కన్నులనెడి మీనములకు కంతుడు వేసిన గాలములని ఊహించుట అన్నమయ్య ఊహాశక్తికి ప్రత్యక్షర సాక్ష్యము.

మధ్యా ధీర

"సాడి :- ఇన్నియు నీ కలవాటే ఇంతసేయఁ జెల్లదా
నన్నుమేమి దొడ్డేమి నడినన్ను వారికి ॥పల్లవి॥
చెల్లగా నీకు చెఱగు.పట్టి తియ్యఁగ
గొల్లె తల చీరలందు కొన్న నీ కుమ
చెల్లఁబో నీవు నాతో చేరినవ్వఁ జెల్లదా
తల్లిఁ గూతు నొక్కవావిఁ దగుల నవ్వే నీకు ॥ఇన్ని॥
పెక్కసాన నీవు నన్ను వేసుకొన్నాఁ జెల్లదా
గక్కనఁ బదారు వేలఁగొల్లె కొన్న నీకు
తెక్కలిఁ దిట్టి నా చేత దిట్టించుకోఁ జెల్లదా
పొక్కట నూరు (తి) కోట్ల కోరిచిన నీకు ॥ఇన్ని॥ (26-269)

— ఇందలి నాయిక నాయకునితో ఎత్తిపొడుపు మాటలతో పలుకుచున్నది - కావున మధ్యా ధీర.

మధ్య అధీర

"గౌళ :- పుంగిటిగా నెవ్వతో ప్రియతమున మైత్రి వట్టి
యెంగిలి గందాలు నాపై నేల పూసేవు
పంగెము గలవాఁడవు బాల పడుదువు గాక
నంగనా ఉల్లాంతలు సరవిడి యౌనా ॥ఎందు॥
అనురింపి యేవతోతో అట్టే నీకు నివ్వినట్టి
చెమట కొమ్ముతో న్నా చేత వొత్తేవు
తమి గల వారితో తగిలించు కొని తప్పు
గుమితాన మరచే మాకు గురిగా విచ్చేతవు ॥ఎందు॥ (28-181)

— ఇందలి నాయిక నాయకునితో 'ఎందుకు తెలిసి చేసిన వాడవు నీవేమైనను చేస్తు వచ్చేతవు' అని పరుషోక్తులాడుచున్నది. ఆ నాయకుడు వేరొక నాయికను గూడి

వచ్చినాడు. 'నీవీ విధములైన పనులను చేయవచ్చునా'యని. చిరుకోపమును ప్రవర్శించినది. ఈ విధమైన నాయికనే సంపుటి 12 సంకీర్తన 141లో కూడ వర్ణించినాడు.
అన్యోఢ :- ప్రియుని కొరకు ఎదురు చూచుచున్న నాయికను వర్ణించుచున్నాడు.

''ఆహిరి :- ఈ రీతి వలపు లొకటి కినుమడాయ విభుఁడ
కోరికలు కోటానఁ గోటి పతికాయ ॥పల్లవి॥
సుదతి నీ రాక కెదురు చూచేటి యానలమ
కదిసి నగుమోమెల్లఁ గన్నులాయె
యిదె నీ కడకు నాకె యేతెంచుఁ దమకమున
అదనముని ముంగిలెల్ల నడుగులే యాయ ॥ఈరీ॥''(30_5)

— ప్రియుని సమాగమమునకు నాయిక అటు నిటు తిరుగుచున్నది. ఎదురు చూచి చూచి మోమెల్ల కన్నులయ్యేను. ప్రియుని కడకే తెంచు తమకమున ముంగిట తిరుగుచున్నది. ఈ సంకీర్తనమును చదివినంతనె ముంగిలి ముందు తిరుగుచున్న ముదిత సహృదయుల యెదుట సాక్షాత్కరించిన అనుభూతిని అన్నమయ్య కలిగించుచున్నాడు.

## మధ్య-ధీరా-ధీర

తనను గూడి సంతోష పెట్టుటకు నాయకుడెప్పుడు వచ్చునోయని నాయిక ఎదురు చూచినది. కాని నాయకుడు సంభోగపు చిహ్నములతో నాయిక దగ్గరకు రాగా నాయిక రోదించుచు ఇట్లు పలికినది.

"నిద్దుర కన్నుల రాఁగా నీ మొగము చూచి నేను
అద్దిరా జాగరమంటా నలిగితిరా
చద్ది విడెము పుక్కిట నవరించు కొని రాగా
వద్దిక మాఁటాడ వంటా నున్నారఁటిరా" (26_285)

— నిద్దుర కన్నులతో వచ్చిన నాయకుడు వేరొక నాయిక వద్ద జాగరము చేసినాడని ఈ సంకీర్తనము నందలి నాయిక అలిగినది. 'చద్దివిడెము పుక్కిట నవరించుకొనుచున్న నాయకుని నిందీసి యడుగుచున్న నాయిక నిట్టూర్పులతో సతమత మగుచున్న నాయకుడు సహృదయుల యెదుట సాక్షాత్కరించుచున్నారు.

ప్రౌఢాధీర :- తనను కూడుటకు వచ్చిన నాయకుని తిరస్కరించుచున్నది.

"కాంబోది :- పట్టకు పట్టకురా నా పయ్యెద కొంగు
వెట్టి వలపులు నాపై వెద చల్లవలెనా ॥పల్లవి॥
యింత నీవు సేసి నందు కిట్టె నిన్నుఁ గూడి తేను
యెంత బతిమాలెనని యెంచరా నన్ను
కొంత గొంత నిన్ను నింకాఁ గూరిమి గొసరఁ బోతే
యింతు లెలా నన్నుఁ జూచి యెక సక్కెమాడరా ॥పట్ట॥
.... .... .... .... .... .... .... ....
వావి చూచి నీతో నేను వాసికేఁ బెనఁగఁ బోతే
ఆవలివలి నతులాడరా నన్ను" (26–12)

— ఇందలి నాయిక నాయకునితో తన కొంగును పట్ట వద్దని పలుకుచున్నది.

## ప్రౌఢ-అధీర

నాయిక తన పాదముతో నాయకుని చిమ్మగా నాయకుడు కలత చెందినాడని అన్నమయ్య ఇట్లు వర్ణించుచున్నాడు.

"ఆహిరి :– జట్టి గొనెర నిన్ను జవరాలు
చిట్టంటు చేతలఁ జెలఁగితి వపుడు ॥పల్లవి॥
వాలుక చూపులు వాడఁగ నాటక
సాల లోన నిను జవరాలు
చాలుగ మురియుచు సరుగనఁ జివుకన
కాలఁ జిమ్మినను కలఁగితి వపుడు ॥జట్టి॥ (12–326)

— ఈ సంకీర్తనమున నాయిక పాదతాడనమును ప్రస్తావించినాడు.

## ప్రౌఢ–ధీరా ధీర

'నీ వాడనే యని' నమ్మించి ప్రియములు నెరపుచున్న నాయకుడు తన మాట నిలబెట్టు కొన లేక పోయినాడు. అందువలన నాయకునితో నాయిక మిక్కిలి వ్యంగము గ పలుకుచున్నది.

''గౌళ :– నా వాఁడనే యంటా నమ్మించేవు నన్ను నేఁడు
చేవల నిన్నాపె చూచి సిగ్గు పడనేలయ్యా ॥పల్లవి॥
మంతనాన నీవు నేను మాటలాడు కొన్న వెల్లా

ఇంతలోనె యాపె వినుబెట్టెయ్యా
వింతలైన నా మట్టెలు వేళ్ళఁబెట్టు కొంటివి
వంతుల నాపె చేతికి వచ్చు బెట్లయ్యా ॥నావా॥
పొందుగా నీవును నేనుఁ బూసుకున్న పరిమళ–
మందముగా నాపె మేన నంటు బెట్లయ్యా
కిందటి పూయింట నారగించిన కూరల చవులు
మందలించి యాపె చెప్పే మర్మమేఁటి దయ్యా ॥నావా॥ (24-81)

—— ఇందలి భావము సహ్యాగయ మనోజ్ఞము. ఆలోచనాత్మకము.

## అవస్థా నాయికలు

### స్వాధీన పతిక

పతిని స్వాధీనము చేసుకొనిన నాయికతో చెలికత్తె పలుకుచున్నది

"ధన్నాసి :– ఈతఁడు నీవసమాయ నిఁక నెన్నఁడు
చేతులార పూడి గాలు సేయవమ్మ ఇపుడు ॥పల్లవి॥
నిన్నే చూచీ నాతఁడు నీ మొకమై యున్నవాఁడు
విన్నపాలు సేయ వమ్మ విభునితోను
మున్నని మాఁట లాడఁగా నొసలెల్లఁ జెమరించె
తిన్నని కస్తూరి బొట్టు తిద్దవమ్మా దగ్గరి ॥ఈతడు॥ (27-198)

—— ఈ సంకీర్తనమున నాయకుడు నాయికకు వశమైనట్లు వర్ణితము. నాయకుడు తన ఆధీనమున ఉన్నను నాయిక ఊడిగములు చేయవలెనట ! అవును మరి ! ఊడిగములు చేయుట వలననే ఆ నాయకుడు నాయికకు వశమైనాడు. నాయికకు వశమైన నాయకుడు నాయికనే చూచుచున్నాడని వర్ణింప బడినది. ఇందలి నాయిక 'నున్నని మాటల నాడినది' ఆ నాయిక పల్కిన నున్నని, మృదువైన పలుకులకే నాయకుడు వశమై యుండును.

### వాసక సజ్జిక

సింగార వతియైన నాయిక తనను, తన గృహమును అలంకరించుకొని ప్రియుని కొరకు ఎదురుచూచుచున్నది.

"మాళవి :– తళుకు సూసకపు ముత్యపుఁదలఁబాలతో
నెళుల తురుము వంచినే నెలత ॥పల్లవి॥——

ముచ్చట లేనగవుల ముంగిట ముగ్గులు వెట్టి
నిచ్చ కళ్యాణము లాడీనే నెలంత ॥తఅమ॥" (12-189)

## విరహోత్కంఠిత

నాయకుడు తనకు దూరము కాగ నాయిక విరహముచే బాధ పడుచున్నది. ఆ నాయిక స్థితిని అన్నమయ్య కడు మనోహరముగ వర్ణించుచున్నాడు.

"ఎరవు గడు నతమాయె నిదియె కదవె
అరవీడుచే సొబగులాయె దురముకకు ॥పల్లవి॥
నిక్కముగ ననలమున నీరు జనియించెనను
టెక్కడనె పొడగంటి మిదియుగదవె
పొక్కుచును విరహాగ్ని బొరలగాఁ జెలిమేనఁ
జక్కఁదై పై బొడమె జవ్వాది చెమట ॥ఎర॥
కలుగుననలంబు కడగాలి యనగా నదియ
నెలమి విచ్చట కలిగె నిదియె కదవె
చెలఁగేటి చెలిమేనఁ జిత్తజాగ్నికి తోడు
నిలువ నియ్యక కలిగె విట్టూర్పు గాలి ॥ఎర॥
నీడలు నెండలును నెయ్య మలరగ గూడు
టీడనే పొడగంటి మిదియు గదవె
వేడుకలరంగ దిరువేంకటేశ్వరు గూడి
వాడు చేరగ గలిగె వనిత పరవశము ॥ఎర॥ (14-77)

— ఇందలి నాయిక విరహోత్కంఠిత. ఈమెకు అగ్ని యందు నీళ్ళు విరహపు వేడి గల మేన చెమటలు పుట్టుచున్నవట. ఈ విధముగ విరహోత్కంఠితయైన నాయికను వర్ణించినను సంయోగాంతముగ సంకీర్తనమును రచించినాడు. సంకీర్తనా ప్రపంచము నందును అన్నమయ్య స్వామి విరహమును భరింపలేదనుటకు ఈ సంకీర్తనము సాక్ష్యము. ఈ సంకీర్తనమున నల్లనివాడగు స్వామియు, బంగారు కాంతిగల అమ్మవారు కలసినపుడు నీడ ఎండలను ఉపమానములుగ చెప్పుటలో అన్నమయ్య సౌందర్యోపాసన యందలి యౌచిత్యము అనన్య సామాన్యమని గ్రహింపవచ్చును.

**విప్రలబ్ధ**

తన ప్రియుని కొరకు వేచియున్న నాయిక చెలితో ఇట్లు పలుకుచున్నది.

"వొప్పుఁజెప్పి నాచేతి కుంగరము తానే యిచ్చి
అప్పటి వచ్చేనంటా నానపెట్టెను
కప్పురపుఁ దమ్మలము కందువగా నోరనించె
యెప్పుడు గాని రాఁడో యేమి సేతుఁజెలియా ....
.... .... .... .... ... .... .... ....
చేర నెప్పుడు వచ్చినో చెప్పఁగదే చెలియా" (24-146)

— ప్రియుడు తన నెప్పుడు చేరవచ్చునోయని విప్రలబ్ధయైన నాయిక చెలిని ప్రశ్నించుచున్నది.

**ఖండిత**

పరకాంతతో రేయి గడిపి సంభోగపు గుర్తులతో వచ్చిన నాయకునితో నాయిక ఈ విధముగ పలుకుచున్నది.

"కన్నడ బంగాళము :— నీ కంటె నాపె మేలు నీవాపెకంటె మేలు
యీతడ నాకేల బొంకే విఁకనేఁటి ॥పల్లవి॥
కాయముపై మెత్తి నట్టి గంధపు బేంట్లు రాసె
యేయెడ బెనఁగితివో యెవ్వతె తోడ ॥నీకంటె॥
.... .... .... .... .... .... .... .... ....
కప్పి నట్టి చంద్ర గావి కడు నెరివిసిగెను
వొప్పుగ నెవ్వతె మీద నొర గుంటివో— ॥నీకంటె॥
ముడిచిన తురుమెల్ల మూఁపు మీదికి జారె
వడిగా నెవ్వతెఁ గూడి వచ్చితివో
నడుమ శ్రీ వేంకటేశ నన్ను నిట్టె కూడితివి
కడు నీకు నిందులోనే కలిఁగెగా నేడు ॥నీకంటె॥ (22-320)

— ఈ సంకీర్తనమున నాయిక నాయకునితో 'నీ కంటె నాపె మేలు, నీవాపె కంటె మేలు' అని పలికినది. వేరొక నాయిక నాయకుని కంటె మేలైనదట। ఎందువలన? జగన్మోహన మూర్తియైన వేంకటేశుని కూడినది కావున; వేంకటేశుని పొందు

అందరికిని సులభ సాధ్యము కాదు. కాని ఆ నాయికకు సాధ్యమైనది. అందువలన ఆమె మేలైనది ఇక వేంకటేశుడామె కంటె మేలెందుకయ్యెను ? ఎంతో కాలము నుండి ఎదురుచూచుచున్న తనను ఆదరించి సంతోషపెట్టినాడు. అందువలన వేంకటేశుడామె కంటె ఈమెకు మేలైనాడు. మకుటము వలె ఉన్న ఆపాదము సంకీర్తనమున కంతటికిని శోభ నిచ్చినది. అల్పాక్షరముల ననల్పార్థ రచనా సామర్థ్యము అన్నమయ్యకు అలవోకగా అలవడినదే.

కలహాంతరిత

ప్రియునితో కలహ మాడిన నాయిక తన తప్పు తెలిసికొనినది. కలహము వలన సుఖము లేదని తెలిసికొని కలయిక కొరకు నాయకుని ప్రార్థించుచున్నది. ఆ సంకీర్తన మిట్లున్నది.

"భైరవి :— ఎఱుగక నిన్ను నంటి నిందాఁకాను ; నీ
తెఱుగు సేసితినిఁక నీ వింటికి రావయ్యా ॥పల్లవి॥
నీ మీఁదఁ దప్పు లేదు నిద్దురఁ గంటికి రాదు
దోమటి నవ్వటి నిన్ను దూరకపోదు
దీమసము నాకు లేదు తెగ నాడఁగాఁగాదు
యేమి సేతు నింతట మా యింటికి రావయ్యా ॥ఎఱు॥(26-107)

— కలహము వలన దూరమైన నాయికకు నిద్ర వచ్చుట లేదట. అందువలన నాయకుని తన యింటికి రావలసినదని ప్రాధేయపడుచున్నది. ఈ సంకీర్తన రచనా నైపుణ్యము సహృదయులకు ఆలోచనాత్మకము.

అభిసారిక

ప్రియుని చేరుటకు నాయికకు అడుగడుగున అవరోధములేవట. కాని వలపు సముద్రమును గట్టుట కెవ్వరికిని సాధ్యము కాదు గనుక ఎట్టకేలకు ఆ నాయిక ప్రియుని చేరి ఇట్లు పలుకుచున్నది.

"కొండమలహరి :— కొండఁ గోవిల గుయ్య గుండె వగిలె నీ
యండకు రాగాఁ బ్రాణ మంతలో బ్రదికెరా ॥పల్లవి॥
వలచి నిన్ను వెదకి వడిపే రాగాను
పులి వలె మగ దుండెఁ బోనియ్యక

తలచి నా కంతలో నెతల నొవ్వగాను
చిలుకు బలికలెత్తి సిగ్గు మాలె వలపు
ఏమరించి యింటి వారి నెడపి నేరాగాను
గామైన బిడ్డ యేడ్పె గదలనీక
తామసించి యుండ లేక తల్ల డిల్ల గాను
చీమలు మై వాకినట్టు చిమ్మి రేగె వలపు ॥కొంద॥
వుంతలేక యిప్పుడు నీ వొద్దికి రాగాను
కొంద వలె మరదుండె గోపగించుక
బొందు మల్లి పరపుపై దొరలేటి యిట్టి నన్ను
కొందల రాయడ గూడించె నావలపు ॥కొంద॥ (12_324)

— వలపును నిలుపుట అసాధ్యమని అన్నమయ్య భావన అన్నమయ్యమే ఒక చోట 'పరుగెత్తు పామును ఆపవచ్చును, ఏరును గట్టవచ్చును. సముద్రమును దాట వచ్చును కాని వలపును నిలుపుట యెవ్వరికిని సాధ్యము కాదని' వర్ణించినాడు. నాయకుని వద్దకు వచ్చిన నాయికనిందు వర్ణించినాడు.

వేరొక సంకీర్తనమున నాయకుడే నాయిక వద్దకు వచ్చినట్లు వర్ణించుచున్నాడు వచ్చిన నాయకుడు నాయికను ఆదరింపగ చెలికత్తె ఇట్లు పలుకుచున్నది.

"యేదోవున్న శ్రీ వేంకటేశ్వరుడే యింటికి వచ్చె
అడిగో వాడిగో అంగన నీకు
పాది పంతముల తోడి బలములెంత చూపిన
వీడె మిచ్చి కూడితిరి వేరులయ్యేరా" (14-1)

— వేంకటేశుడే నాయిక ఇంటికి వచ్చుట నాయికకు 'వాడిక' యేమోయన్ని చెలికత్తె పలుకుచున్నది. 'వాడిక' అను పదప్రయోగము వలన ప్రతిదినము క్రమము తప్ప నాయకుడు వచ్చుచుండెనాయని చెలి సందేహము. నాయకుడు వాడుక ప్రకారము వచ్చి కూడుచుండగా వారిద్దరు వేరు కాలేరటి ; తది వారి యను బంధమునకు ప్రతీక. నిత్య వ్యవహారములోని పదములను ప్రయోగించి, అర్థమును స్పష్టము చేయుట అన్నమయ్యకు అలవాటు.

ఈ విధమైన శృంగార నాయికలను గూర్చి మాత్రమే కాక హస్తిణి, చిత్తిణి, పద్మిని, శంఖిని, 'మోహిణి' అను జాతుల స్త్రీలను కూడ అన్నమయ్య వర్ణించినాడు.

ఒక్క నాయిక యందే భిన్న జాతులకు చెందిన స్త్రీల లక్షణములున్నట్లు అన్నమయ్య వర్ణించుచున్నారు. సాధారణముగ అన్నమయ్య సంకీర్తనములలో రెండు పంక్తుల పల్లవి నాలుగు పంక్తులతో కూడిన మూడు చరణములు ఉండును. కాని ఈ క్రింది సంకీర్తనమున పల్లవి గాక ఐదు చరణములున్నవి. అయినను వేంకటేశుని ముద్రను మాత్రము వీడలేదు.

"ఆహిరి :— అన్ని జాతులు తానెయై యున్నది
కన్నుల కలికి మాయ గరచెనో యనఁగ ॥పల్లవి॥
కన్నె శంకిణి జాతి కాబోలు వీఁపునను
సన్నపు మదనాంకములు జడిగొన్నవి
వన్నెలుగ వలరాజు వలపు తలకెక్కించ
పన్నినటు వంటి సోపానము లౌ యనగ ॥అన్ని॥
తెలువ దలపోయ చిత్తిణి జాతిగాఁబోలు
నెలులు విచ్చుచు వీధి నిలుచున్నది
నెఱతనము మరుఁడు తను నింద వేసిన యంప
గఱులిన్నియను లెక్కలు వెట్టు గతిని ॥అన్ని॥
కాంత హస్తిణి జాతి గాఁబోలు కరమూలము
లంత కంతకు నలుపులై యున్నవి
పంతంపు మరుఁడు తన భండార ముంద్లకును
దొంతి గానిడిన కస్తూరి ముద్ర లనగ ॥అన్ని॥
ఘనత పద్మిణి జాతి గాఁబోలు సిలలన
తను వెల్ల పద్మగంధం బైనది
మినుకుగా తామెరలమ్ములనె మేను
కనలించి వడిఁబువ్వు గట్టె నోయనగ ॥అన్ని॥
ఇదియు జగదేక మోహిణి దానె కాఁబోలు
కదలు కనుగవ కెంపు గలిగున్నది

వదల కిటు వేంకటేశ్వరుని కుంకుమ పూఁత
చెదరి చెలికనుఁగొనలఁ జిందెనో యనగా ॥అన్ని॥ (12–123)

—ఈ సంకీర్తనమున ఉత్ప్రేక్షాలంకారముతో నాయికల లక్ష్యలక్షణ సమన్వయము గలిగి మనోహరముగ వర్ణింపబడినది.

ఈ వర్ణనను గూర్చి డా॥ ఆనందమూర్తిగారు "ఈ కవులు పై నాలుగుజాతులతో పాటు 'మోహిణి' యనునొక జాతిని గూడ క్రొత్తగ జేర్చి నారోయేమో। కామశాస్త్ర గ్రంధములందీ 'మోహిని' జాతిపేరు కానరాదు. ఈ పదములందాయా జాతులకు వర్ణితములైన శారీరక మానసిక గుణాదులు కామశాస్త్ర గ్రంధములందును తరువాత శృంగారమంజరి యందును గలయట్లే యున్నవి. తెలుగున నన్నెచోడుని కుమార సంభవము తరువాత నీజాతులను గూర్చి యిట్లు విపులీకరించిన కవులు తాళ్ళపాక వారేయనవచ్చును."[2] అని పలికినారు.

ఈ విధమైన జాతులనే అన్నమయ్య వేరొక సంకీర్తనమున ఇట్లు వర్ణించు చున్నాడు.

"ఆహిరి :— కుందణంపు మైగొల్లెతతా
సెందును బుట్టినియేతరిజాతి ॥పల్లవి॥
కప్పులు దేరేటి కస్తురి చంకల
కొప్పెర గుబ్బల గొల్లెత
చప్పుడు మట్టెల చల్లలమ్మేడిని
అప్పని ముందట హస్తిణి జాతి ॥కుంద॥
దుంప వెంట్రుకల దొడ్డ తురుముగల
గుంపెన నడపుల గొల్లెత
జంపుల నటనలఁ జల్లలమ్మేడిని
చెంపల చెమటల చిత్తిణి జాతి ॥కుంద॥
వీఁపున నఖములు వెడవెడనాఁటిన
కోపపుఁ జూపుల గొల్లెత
చాఁపున కట్టిగఁ జల్లలమ్మేడిని

చాఁపేటి యెలుగున శంకిణి జాతి ॥కుంద॥
గారవమున వేంకటపతి కౌఁగిట
కూరిమిఁ జాయని గొల్లెత
సారెకు నతనితో చల్లలమ్మెడిని
బారఁపు టలపుల పద్మిణి జాతి ॥కుంద॥"(12-92)

—ఈ సంకీర్తనమున కూడ ఆయా జాతి స్త్రీల లక్షణములు ఒక్కగొల్లెత యందున్న వని పలికి చివరగ శ్రీ వేంకటపతికి సుగంధ భరితమైన పద్మినిజాతి స్త్రీలతో సారెసారెకు చల్లను అమ్మించినాఁ డన్నమయ్య.

చిత్తిణిజాతి స్త్రీ చేసెడి పనులను వర్ణించుచున్నాడు. మిక్కిలి ప్రౌఢయైన ఆ నాయిక ఈ విధముగ ప్రవర్తించుచున్నది.

'ఎంత చిత్తిణోయిది నీయిత పెటువంటిదో
చెంతనున్న చెలులెల్లా శిరసులు వంచేరు ॥వల్లవి॥
చిన్న చేతుల నీకొప్పు చెలరేఁగి దువ్వుతాను
.... .... .... .... .... .... .... .... .... .... .... ....
నన్నులనే పొందొదల సాము సేసీని ॥ఎంత॥(28-174)

—అంతేగాక నాయకునితో ఏకతము లాడుచు భుజములొరసుకొనుచున్నదట. నాయకుని మేనెల్ల సింగారించుకొనుచు మర్మములిట్టి సోకించుచున్నదట. నాయిక గడుసుదన మిందు మనోహరముగ వర్ణింపబడినది.

ఈ విధముగనే కొన్ని నాయికల వర్ణనలను అన్నమయ్య ఇంకను అనేక విధములుగ వర్ణించినాడు. అలంకార శాస్త్రములందు చెప్పబడని అసంఖ్యాకమైన నాయికలు అన్నమయ్య సాహితీ ప్రపంచమున దర్శన మిచ్చెదరు. అన్నమయ్య శృంగార సంకీర్తనములలో చెప్పిన విషయములను బట్టి, ఆయా నాయికల స్థితిగతులను పరిశీలించి ఇంకను అనేక విధములుగ వివరింపవచ్చును.

## ఓర్పు గలిగిన నాయిక

నాయకుడే విధముగ ప్రవర్తించినను నాయిక ఉదాసీనముగ ఓర్పు వహించి యున్నదట. ఆమెను చెలులీ విధముగ ప్రశంసించు చున్నారు.

"శోకవరాళి :- ఎంత ఓర్పు గలదానవేమే నీవు
కాంతలెల్లా నీ సుద్దులు కతలుగాఁ జెప్పేరే ॥పల్లవి॥
ఘనమైన విరహాగ్నిఁ గాఁగి యున్నప్పటిఁ బతి
మనసు నొవ్వకుండానే మాటలాడేవే
మొనయక మరుచేత నేటువడి యింకా-నా
తనిలోనే పొందుసేయఁ దమకించేవు ॥ఎంత॥" (22_53)

—ఈవిధముగ ఓర్పు గలిగిన నాయిక వేరొక సతి వద్ద నాయకుడుండగ అతని శరీరమును తాకకుండ పువ్వులు వేయుచున్నదట. నాయకుని పువ్వులతో కూడ బాధించుట కిష్టపడుటలేదీ సాధ్వి. తన యౌవనమంతయు 'పంచపాలై'నను అతనితో నవ్వుచు ఊడిగములు చేయుచున్నదట। నాయకుని కొరకు ఎదురు చూచిన నాయిక యౌవవమంతయు 'పంచపాలై'దని వర్ణించుటలో అన్నమయ్య సాభిప్రాయ పదప్రయోగ నైపుణ్యమభివ్యక్తము.

## మోసపోయిన నాయిక

నాయికను రమ్మని పిలిచి వేరొక నాయికతో నాయకుడుపొందులు చేయుచున్నాడు. నాయకుని పిలుపునకు మోసపోయిన నాయిక యిట్లు పలుకుచున్నది.

"దేవగాంధారి :- ఏల పిలిచేవు నన్ను యింటిలో నేనుండఁగాను
అలనైతేనేమి యింత యగడు గావింతురా ॥పల్లవి॥
పొలసి వేరొకతెతో పొందులు నీవు సేయఁగా
నెలయించే మాఁటాడే దేఁటి నేరుపు
కలసిలోలో మీరు కాఁపురాలు సేయఁగాను
వెలిఁగాచు కుందేటి వీడిడియుఁ గలదా ॥ఏల॥" (28—293)

అంతేగాక "అన్నిటను ఆమెతో పొత్తులు గలసి వీడెములు స్వీకరించెదినీవు నన్నుసైగ చేయవలసిన యవసరమేమి? మీరు మన్ననతో మచ్చికలు చేయుచుండగ నేను చూడవలెనా?" యని ప్రశ్నించినది.

## అమాయికమైన నాయిక

పాప పుణ్యము లెరుగని అమాయికమైన నాయిక తన చెలులతో నీ విధముగ చెప్పుచున్నది.

"దేసాళం :- అడుగరే యీమాట అవునో కాదో
తడయక నా వేడుక తానెఱుఁగడా ॥పల్లవి॥
కుచ్చితము నేరను, కూళతనము నేరను
యిచ్చకము లాడనేర్తు నిట్టె తనకు
మచ్చికతోనప్పటి నామనసేమి సోదించేనే
తచ్చిమాచి నాగుణము తానెఱుఁగడా ॥అడు॥ (29_57)

—అంతేగాక వెక్కసములను, వేషములను ఎఱుగనని మ్రొక్కుట మాత్రమే తెలిసిన దాననని 'సేఁజేసిన సేవ తానెఱుగడా' యని పలికినది.

## పతికి స్వాధీన యైన సతి :

తన సర్వస్వమును నాయకున కప్పగించిన నాయిక ఆయన కనేక పరిచర్య లొనర్చుచున్నది. ఆవర్ణన మిట్లున్నది.

"వరాళి :- నీవేల భ్రమసేవు నేనుండాన నిదివో
సేవ సేసేఁగాని యిట్టె సేయించుకోరాదా ॥పల్లవి॥
కప్పుర విడె మిందె కస్తురి వుండలివిగో
దప్పి దేర్చుకో కొంత దగదొట్టకు
కొప్పు చక్కఁబెట్టుకో గోణము చక్కఁగట్టుకో
అప్పటి మేను గిజిగిజి యై వుందురా ॥నీవే॥" (27-424)

—ఇందలి నాయిక అలసట చెందిన నాయకునకు చల్లని గంధపు పొడినిసారపు పన్నీరు ను అందిచ్చ, వల్లెవాటు సరిగ వేసి కొనుమని చెప్పి, పట్టుపరుపును, నకినల మంచ మును పవళించుట కిచ్చినదట।

## అధిక్యముగల నాయిక

నాయిక గొప్పదనము గూర్చి చెలికత్తె పలుకుచున్నది.

"కేదార గౌళ :- అటది రాజ్యమేలితే అది మంచిదేకాదా
చాటువగా మాకు నిన్ను సాధించనేఁటికి ॥పల్లవి॥
పీఁటపై నున్న దాపె ప్రియుఁడవు నిలుచుండి
మాఁటలాడే వాపెతోను మంచిదేకాదా

…… …… …… …… …… …… …… …… …… …… …… ……

పడ(తి పవ్వళించ(గా పాదాల కాడనుండి
మడిచిచ్చే నాకు నీకు మంచిదే కాదా
వుడుగక నీ వెంత వ్రాతిగాలు నేర్చినాను
కడునీకే లాభమయ్యా కాదన(గనేటికి ॥అ(ట॥ (29_364)

—నాయిక కెంత సేవలు చేసినను నాయకున కంత మేలగునట। ఉరముపై నాయిక ఉన్నది కావున కింద(బడినచో పరులు నొసవచ్చునని చెలి పలుకుచున్నది.

## అలుక పొందిన నాయిక

నాయకునిపై కోపము గలిగిన నాయికతో నాయకుడు పలుకుచున్నాడు.

మోనమున నుండనేలే మొకము వంచగ నేలే
నాన బెట్టితే పలపులు నయ మెక్కీనా
సాన(బట్టే చూపులేలే సమ్మతిగాని నవ్వేలే
………………………… …………………
పెలవి నవ్వితివేలే చేతి వ్రదిలింపులేలే ……"(26_317)

—పంతముతో పలికిన పలుకునకే యింత పరిణామమా యని నాయకుడైన శ్రీ వేంక టేశుడు కోపనయనయైన నాయికతో పలుకుచున్నాడు.

## వివిధ లక్షణములుగల నాయిక

నాయికా నాయకుల కలయికను ప్రోత్సహించుచు చెలులునాయికా లక్షణములను చెప్పుచున్నారు.

"వరాళి :— వద్దనేమా నేము మీరు వావి గూడితే( జాలు
వద్ద( బెట్టు కొనవయ్య వువిదను నీవు ॥పల్లవి॥
నేసవెట్టే దానికి సిగులు వీడు పడును
అసగల దానికి నలవిలేదు
వేసరని దానికి వెసనలయిక లేదు…. …."[-2-513]

—ఈ పదములో ఇంకను "పంతమాడేదానికి పయ్యద జారుచుండునని మంతన మాడే దానికి మై చెమరించునని, చెంతనుండే దానికి కోరిక చిగురించునని, రతిసేసేదానికి మోవిరసము లొలుకునని పలుకుచున్నారు. ఒక్క నాయిక యందే ఆయా సందర్భము లందు ఏఏ విధములైన మార్పులు కలుగునో సహజ సుందరముగ వర్ణించినాడు.

## సంతోషముతో ఉన్న నాయిక

నాయకుడు తన పట్ల చూపుచున్న అనురాగమునకు సంతోష తరంగితయైన నాయిక యిట్లు పలుకుచున్నది.

కేదారగౌళ :- ఎప్పుడు నీ దాననే యిన్నిటా నీ చిత్తము
చప్పుడు సేయుటే కాని సాధించ నేరను ॥పల్లవి॥
చూపులకులోనై సుద్దులకు వెలియై
నీపొందు సేసేను నిచ్చలు నేను.........
పలుగురై పంతానకు మరగై
వలపులు చల్లేను వాసికే నేను
నెలవుల నవ్వులను, చేతులనే పువ్వులను
విలువున వేసేను నెపాలు నేనేరను ॥ఎప్పు॥ (26—374)

—అన్ని విషయము లందును నాయకునకు స్వాధీనమై ఆయన చిత్తమును చప్పుడు చేయుటే కాని 'సాధించ నేరనని' పలుకుచున్నది. 'చిత్తమును చప్పుడు చేయుట' చక్కని పదప్రయోగము. సహృదయ మనోజ్ఞము.

## గయ్యాళియైన నాయిక

నాయకుడెంత అనుకూలముగ ప్రవర్తించినను నాయిక ఆయన పట్ల కోపమును ప్రదర్శించి నేరములు నెరపుచున్నదట. ఆ విషయమునే చెలులిట్లు పలుకుచున్నారు.

శుద్ధ వసంతం :- ఇటువంటి కొత్తలు నే మెఱుఁగమమ్మ
చిటుకుమని నంతనే చిమ్మి రేఁగేవు ॥పల్లవి॥
మన్నించి మాఁటాడే పతిని తిట్టెననేవు
యెంచరాని రాఁగతనమేల పేసేవే
పొంచి పువ్వుల వేసితే బొప్పిగట్టె మేననేవు
నించి యాతఁడందుకే పో నిష్ఠురగునందెను ॥ఇటు॥
పచ్చడము గప్పితేనే బలిమి సేసెననేవు
అచ్చలాన నీవెంత గయ్యాళివే నేఁడు......." [27—271]

—అంతేగాక నాయకుడు నాయిక మోవి యానగా పగ సాధించు చున్నాడని పలుకునట ప్రియముతో చేరదీసినపుడు 'ఈడ్చినాడని' పలుకుచున్నదట ఆ గయ్యాళి నాయిక.

## పశ్చాత్తప్తయైన నాయిక

వేరొకరు చెప్పుచున్నను నాయకుని గుణముల నెరుగలేక పోయితినని నాయిక పశ్చాత్తప్త యగుచున్నది.

"భైరవి :— ఏమి సేయవచ్చు నిఁక నివెల్లా నా నేరములే
దీమసాన లోలోన తెలుసుకోనైతి ॥పల్లవి॥
చెప్పఁగా నీగుణాలెల్లా చెలియ నాతో నాఁడె
నెప్పున నీ సేవ సేయ నేరనైతి
వొప్పగించెఁగా నీ వుంగరము నా చేతికి
చొప్పులవి సాధించి చూడనైతి ॥ఏమి॥
నవ్వెగావూడిగ మాపె నను విన్నూనిట్టెచూపి
ఇప్పన మదమున విచారించనైతి............"(22—5)

—ఎవరెన్ని చెప్పినను యౌవన మదముతో విచారింపలేక పోయితినని, ఇప్పుడైనను తెలిసికొని వేడుకొనుచున్నాను కావున స్వీకరింపుమని ప్రార్థించుచున్నది.

## పరాకుగా ఉన్న నాయిక

ఎవ్వరిని వలచినదో కాని చెలులేమి చేసినను బదులు పలుకుట లేదట। అందు వలన నాయికను చెలులీ విధముగ ప్రశ్నించు చున్నారు.

"శంకరాభరణం :— ఎవ్వనికి వలతువే చెలియా
యెవ్వలిఁ బిలిచిన నెఱుఁగవే చెలియా ॥పల్లవి॥
చక్కఁగఁ బయ్యెద జారిన దెఱఁగవు
యెక్కడ చూచేవే యిటు చెలియా............
జారిన కొప్పునుఁ జక్కఁగఁ బెట్టవు
మీతేవు పరాకున నేమే చెలియా
మాఱు మాటలను మాతో నాడవు
తీఱికలో వెలిఁదిరిగేవే చెలియా ॥ఎవ్వ॥
వెలెయ హారములు వెనుకకు వేసితి
తలఁవెందున్నదె తగఁ జెలియ............(25—535)

—ఈ సంకీర్తనము నందలి నాయిక తానేమి చేయుచున్నదో గమనించుటలేదు. తన

పనుల పట్ల శ్రద్ధ వహించుటలేదు. లోపలకు, వెలుపలకు తిరుగుచున్నది. హారములను చక్కదిద్దుకొనుటలేదు. ఇందు పరాకుగా ఉన్న నాయిక స్థితిని స్వభావ సుందరముగ వర్ణించినాడు.

## నైపుణ్యముగల నాయిక

సతి నైపుణ్యము పెదజల్లి నట్లున్నదని చెలులు పలుకుచున్నారు.

''సామంతం :— సతి విధము నేర్పు పెదజల్లినటులాయ
యితవు లిట మీఁది మేలెట్టు రాఁగలదో ॥పల్లవి॥
కనుచూపు పతిమీద కాయంబు చెలిమీఁద
మనసు కోర్కుల మీఁద మగువకిపుడు.........
నిట్టూర్పు తనువుపై నెరిఁజెక్కు చేతిపై
గుట్టు చన్నుల పయినె కొమ్మకిపుడు
సిగ్గుదన వయసులో చిఱునవ్వు పెదవిలో
నిగ్గురతి కళలలో నెలఁత కిపుడు
అగ్గలపు శ్రీవేంటాధిపతిఁ గూడిమరి
యెగ్గు లెంచదు యీపె యెటువంటి గుణమో ॥సతి॥'' (26–30)

—సీస పద్యమువలె సాగిన ఈసంకీర్తనమునందు నైపుణ్యముగల నాయిక వర్ణితము

## బాలెంతరాలైన నాయిక

ఆడు జన్మము తేలికైనదేమో మరి మగవారు మమ్ములనుపచ్చి చేయుచున్నారని నాయిక పలుకుచున్నది.

''ముఖారి :— ఆఁడు జన్మమే మాకు నాలుడాయనో కాక
పోఁడిమిఁదా మగవాఁడు భువిఁ బచ్చి సేతురా ॥పల్లవి॥
చక్కఁ బొద్దు గుంకదిదె సతులెల్ల నవ్వఁగాను
పక్కనఁ దలుపు మూసీఁ బనోమరి
యెక్కువతోఁ జంటి బిడ్డలిదె చేయి దిగరుతా—
నక్కరతోఁ గొంగువట్టీ నానే లేస్సాయను ॥ఆఁడు॥ (28–128)

—నాయకుడు నాయిక బాలెంతయని విచక్షణ చూపక సతులెల్ల నవ్వుచుండగ తలుపు

మూసినాడట। అంతేగాక అత్త మామలెదుట ఉండగనే సరసోక్తులాడునట। ఇన్ని పను లను శ్రీ వేంకటేశుడుగాన అందరిని మొరిగించి చేయగలిగినాడట। అది శ్రీ వేంక టేశునికే సాధ్యము. అన్నమయ్య ఏ విధమైన వర్ణనలు చేసినను శ్రీవేంకటేశుని లీలా వైభవ ప్రశంసనే గావించుననుటకే విధములైన సంకీర్తనములు ప్రత్యక్ష సాక్ష్యములు.

## స్థిరచిత్తముగల నాయిక

శ్రీవేంకటేశ ధ్యానమగ్న మానసయైన స్త్రీ స్థిరచిత్తముతో ఉన్నది. ఆ నాయిక వర్ణన నిట్లు గావించుచున్నాడు.

"శ్రీరాగం :— తగిలిన మునులే యతనిఁ గందురంటా
మగువ యెవ్వరితోఁడ మాటాడదిపుడు ॥పల్లవి॥
అతుల నిరాహారులతనికిఁ బ్రియులంటా
అతివ నిన్నటి నుండి యారగించదు
తతినడవుల నుండే తపసులే యతనికి
హితులంటా వనములో నెడయదీ తరుణి ॥తగి॥
తలకొన్న యతనిపై తలఁపే పరమంటా
చెలియ చెక్కటనున్న చెయి దియ్యదు
వలనైన యతఁడు దేవతల కొడయఁడంటా
కలికి రేయిఁబగలు కనుముయ్యదిపుడు ॥తగి॥
అదరి జలములలోన నతఁడుండు నంటా
వడియఁజెమట దుడువదు మేనను............" (12-6)

—ఈ సంకీర్తనమున నాయకుని పట్ల అనురాగవతియై అతని సాన్నిధ్యమును పొందు టకు ఎవరెవరేయే పనులను చేయుచుందురో స్థిర చిత్తముతో ఆ పనులన్నియు ఒక్క నాయికయే చేయుచున్నదని వర్ణించినాడు. నిరాహారదీక్షతో అనిమిషత్వము వహించి శరీరమునకు పట్టిన చెమటను తుడువ కుండుటను బట్టి ఆమె శృంగార రసోన్ముఖియైన దని భంగ్యంతరము.

అసంఖ్యాకముగ నాయికా వర్ణనలు గావించిన అన్నమయ్య శృంగార సంకీర్తన ముల యందలి నాయికా వర్ణనలను సూక్ష్మముగ పరిశీలించినచో ఇంకను వింగడించుట కవకాశమున్నది.

## నాయక వర్ణనలు

'వరహరి కీర్తన నానిన జిహ్వా, నరులనుతింపగ నోపదు జిహ్వా' అని ప్రతిన బట్టిన అన్నమయ్య తన జీవితమునంతటిని శ్రీవేంకటేశుని ప్రశంసలకే అంకితము గావించినాడు. శృంగారాధ్యాత్మిక సంకీర్తనములందెన్నియో విధముల వేంకటేశుని దివ్య మంగళ విగ్రహమును వర్ణించినాడు. శృంగార సంకీర్తనములందక్కడక్కడ నాయకుని వర్ణించి తరించినాడు. ఈ క్రింది సంకీర్తనమున శ్రీవేంకటపతి వర్ణన తేట తెలుగు పలుకులతో మనోహరముగ వర్ణించుచున్నాడు.

''ముఖారి :- పొదలు నీ సొబగెల్ల పోదేల కొల్ల
తుదలేని నీ మేలు దొరకెఁగా నాకు ॥పల్లవి॥
ఒడలిపై నీ చెమట పూరు వాడెడు చలమ
జడియు నీ తమకంబు సంత తగరు
కరగంటి నీచూపు కట్టు వదలిన క్రేపు
వడి నిన్నుఁ గరఁగింప వశమా నాకు ॥పొద॥
చిఱునవ్వు నీ పలుకు జిగురు చుట్టిన కండె
తెఱవలకు నీ మోవి తెరువు పెసరు
పఱచు నీ నునుఁ జేఁత బట్ట బాయిటి యీఁత
కలి నిన్నుఁ జైకొనఁగఁ దరమా నాకు ॥పొదలు॥
చెలువంపు నీ చెలిమి చెఱకు పండిన పండు
తెలయపు నీయలుకు తంగేటి జున్ను........"(12-75)

—నాయకుని వైభవమును ప్రజల జిహ్వాగ్రములపై నర్తించుచున్న తెలుగు తేట పలుకు బడులతో కడు మనోహరమైన వర్ణన గావించినాడు. అన్నమయ్య కాయా పదములు 'నేనేవత్తు, నేవత్తు, నేనే, నేనే' యని వచ్చు సంకీర్తనములందొడిగి పోషు ననుట కిది ప్రత్యక్షర నిదర్శనము. ఋతువులతో సాదృశ్యము చెప్పుచు నాయకుని వర్ణన.

"శ్రీరాగం :- కంటి మిదివో నేము కన్నుల పండుగఁగాను
జంటలఁ గొలుపై నీవు చనవియ్యఁ గాను ॥పల్లవి॥
హేమంత కాలము నేఁడు యిటు నీతిరుమేన

ఆముకొని జనియించి నట్లుండెను
భూమిఁగల కప్పురపు పొడిసేసి నిలువెల్లా
నేమముతో నిందరును నీకుఁ జాతఁగాను ॥కంటి॥ (29–142)

—ఇదే విధముగ తట్టు పుణుగు సర్వాంగములపై పూయగా వానకాలము నీలవర్ణము తో తిరుమేన పోనయై కురిసినట్లు చూపట్టెనట।
వింత వింత వేడుకలతో విఱ్ఱవీగుచున్న నాయకుడు
"సౌరాష్ట్రం :— ఎంత మోహమోనీకీ ఇంతి మీఁదను
వింత వింత వేడుకల విఱ వీఁగేవు ॥పల్లవి॥
తరుణి గుబ్బలు నీకు తలగడ బిళ్ళలుగా—
నొరగున్నాడవు వుబ్బున నీవు
దొరవై పయ్యెద కొంగు దోమతెర బాగుగ
సరుగ మాఁటు సేసుక జాణవై వున్నాడఁవు ॥ఎంత॥" (24–139)

—అని వర్ణించుచు ఇంకను నాయకునితో చెలికత్తె "భామినితొడలు నీకు పట్టెమంచముకాగా పట్టుచీర కుచ్చెల పరపుకాగా పవళించితివి గదా।" యని పలుకుచున్నది.

## నాయకుని ఔన్నత్యము

నాయకుని గొప్పతనమేమొకాని ఆయనను దూషించుటకు వచ్చిన నాయిక దీవించినదట। ఆ వర్ణన మిటున్నది.

"వరాళి :— ఎట్టి మొగమాయ కాఁద వేమని చెప్పుదు నిన్ను
తిట్ట వచ్చినట్టి యాపె దీవించె నిదివో ॥పల్లవి॥
జగడించే నటావచ్చియంనకియ తప్పక చూచి
మొగమాటమున నీకు మంచి లోనాయ
వొగరు నీ బాసలు వొప్పగించే నంటావచ్చి
తగిలి నీ మోవి తేనావ పడెను ॥ఎట్టి॥" (27–241)

—నాయకుడింతకు ముందు 'వొగరు బాస లాడెనట. ఆ నాయకుని పలుకులు నాయిక కిష్టము కాదు. అందువలన ఆయన పలికిన పలుకులను ఆయనకే అప్పగించుటకు వచ్చినది. కాని మహిమాన్వితుడైన నాయకుని యౌన్నత్యమునకు ముగ్ధురాలై మోవితేనెకు ఆశపడినదట! వగరు మాటలనాడిన ఆ నాయకుని మోవితేనెకు నాయిక ఆశపడుటలోని అంతర్యము సహృదయ మనోరంజకము.

## నాయకుని సింగారముల వర్ణన

"మాళవి గౌళ :— చెప్పరాదు యీతని సింగారాలు
ముప్పిరిగొని సిరులు ముంచెనో కాని ॥పల్లవి॥
అంతనే కప్పురపు కాఁపులదివో దేవునికి
మెండుకొని అమరెను మేన నెల్లాను
పుండరీకాక్షుడు గాన పొదలి తెల్లని కాంతి
నిండుకొని నిలువెల్లా నెరపెనో కాని ॥చెప్ప॥ (29-148)

—నాయకుని సింగారములు చెప్పుట కలవి కాకున్నవట। అంతేగాక ఆ నాయకుని సింగారములు సిరుల చేత ముంచబడినవట। 'సిరులు ముంచెనో' యను పద ప్రయోగము వలన నాయకుని వైభవము ప్రశంసితము.

ఇంకను మహిమలు చెలఁగినట్లున్న వేంకటేశుని వైభవము నిట్లు వర్ణించుచున్నాడు.

"మాళవి గౌళ :— భావించి చూడరే పడఁతులాల
దేవదేవు మహిమలు చెలఁగినట్లుండెను ॥పల్లవి॥
పరమ పురుషునికి వచ్చు కప్పురపు కాఁపు
తిరుమేన నమరెను తెల్లని కాంతి
ధరలో పాల జలధి తచ్చేటి వేళను
మురిపెమై తుంపురులు ముంచిన యట్టుండెను ॥భావి॥ (29-154)

—అంతేగాక నాయకుని మేనిపై నమరిన నల్లని కాంతి గోవర్ధన మెత్తిననాడు మేఘ కాంతులు తొలికినట్లుండెనట। శ్రీవేంకటేశునకు శింగారించిన సొమ్ములు మేనికిబంగారు కాంతి యమరినట్లుండగ అలమేలుమంగ ఉరమెక్కఁగ వేవేలు సంపదలు వెలసినట్లుండెనట। అన్నమయ్య భావనాబలము నీ సంకీర్తనము ప్రదర్శించుచున్నది.

## నాయకుని నిర్వృతి

నాయకుడు తాను మరుగురుడగుట వలన మన్మధునకు, శశిబావ యగుట వలన వెన్నెల యెండలకు, వాయుజునేలెను గనుకవాయువునకు వెరచుటలేదని మనోహరముగ వర్ణించుచున్నాడు.

"శుద్ధ వసంతం :— మరుగురుఁడట తామర విరి శరములు
ధరతను నేఁచవు తనకేమే..........

వెడ శశి బావట వెన్నెల యెండలు
తడవపు తనువిఁకఁ దనకేమే..........
యేఁకట వాయుజు పేలెఁగనక తనుఁ
దాఁకదు వాయువు దనకేమే..........." (28-84)

నాయకుని విరహమందు భంగ్యంతరము. నాయకుని నిర్భయము వర్ణితము.

## వ్రతనిష్ఠుడైన నాయకుడు

నాయకుని కొరకు నాయిక వ్రతము సల్పుటయేగాదు, నాయకుడే నాయిక కొరకు వ్రతము పట్టినాడట। ఆయన దీక్ష యిట్టిదని చెలులు పలికినట్లు వర్ణించుచున్నాడు.

"ఆహిరి :- ఇంకా నీ చిత్తము కొలఁదిన్నియు విన్నవించితి
వంకల ప్రాయము నీకే వ్రతము పట్టినాడే ॥పల్లవి॥
తరుణి కొప్పు విరులు తనమీఁద రాలుదాఁకా
విరుల ముడువనంటా విభుఁడువేమము సేసె
సురత గంధముమేన చోడు ముట్టినదాఁకా
గరిమఁ బరిమళాల గంధము మైఁ బూయఁడే ॥ఇంకా॥" (28-16)

—ఇంకను పడతి విట్టూర్పులు పైన బారు వరకు సురటి విసరించుకొనుటలేదట। తన చెలి చెమటలు తన మీద చిందువరకు కేళాకూళికి వెళ్ళుట కిష్టపడుట లేదట. తన పడతి వచ్చి పానుపుపై పచ్చిమాటలాడువరకు మౌనముతో నుండి యెవ్వరితోను పలుకుట లేదట.

— వేరొక సంకీర్తనమున నాయకుడు 'మగరూపు నాడు రూపు మక్కళించి తన్ను దగిలిన వారికెల్ల తమిరేపుచున్నాడట. ఆ విషయము నిట్లు వర్ణించుచున్నాడు.

"సతి పయ్యెద చెఱఁగే చక్కఁగాను గప్పుకొని
కతగా నొక్కపక్కనే కౌఁగిలించుక
చతురత చెక్కుఁ జెక్కు జంటగా నదుముకొని
అతివలు కొలువు సేయఁగ నున్నాడితఁడు" (29-224)

## దక్షిణ నాయక వర్ణనలు

ఒక్క సమయముననే నాయిక లెందరినో సంతృప్తి పరచగల దతడే దక్షిణ నాయకుడని పూర్వోక్తము. నిజజీవితములో దక్షిణ నాయకత్వము నెరపిన అన్నమయ్య తన సంకీర్తనా ప్రపంచము నందును ఇష్టదైవము యొక్క దక్షిణ నాయకత్వమును వర్ణించి తరించినాడు. శ్రీవేంకటేశుని దక్షిణ నాయకత్వము నిట్లు వర్ణించుచున్నాడు.

"సా॥ :— ఎంత లేదు నీయా సోదమేమి చెప్పేది
చెంతనుండి నామీఁదఁ జేయి చాఁచేవు ॥పల్లవి॥
వొక్కతెతో మాటాడుతా నొక్కతెతో నవ్వేవు
అక్కరనొకతె వీఁడెమడిగేవు
వుక్క మీరి వొక్కతెను వొడి పట్టి తీసేవు
మక్కువనప్పటిని నామర్మము లంటేవు ॥ఎంత॥
యెవ్వతెనో పేరఁబిల్చి యెవ్వతెనో కూడేవు
దవ్వుల నదెవ్వతెనో తలపోసేవు
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ జెలగించి
చివ్వన నప్పటి నన్నే చేరి కూడేవు ॥ఎంత॥ (25–170)

—నాయకుడు ఇతర నాయికలతో జరిపెన కార్యములను పలుకుచు చివరగా తననుకూడ ఆదరించినందులకు సంతోషించినది.

వేంకట కృష్ణుని దక్షిణ నాయకత్వమునిట్లు మనోహరముగ వర్ణించుచున్నాడు.

"మలహరి :— ఒక్కొక్క సతి నడుమ నొక్కొక్క రూపుగై కాని
యెక్కువై తి కృష్ణా నిన్నెట్ల నమ్మేదిరా ॥పల్లవి॥
మాటలాడే వొకతేతో మళ్ళి చూచేవొకెతను
వోటలేక నవ్వునవ్వే వొకతెతోను.........
కన్నుగీటే వొకతెకుఁ గాఁగిలించే వొకతెను
వెన్నదిన్నమోవిచ్చేవు వేరొకతెకు.........
యెమ్మెల శ్రీవేంకటేశ ఇందరి మమ్ముఁ గూడితి
విమ్ములనే నమ్మితిఁగాకెటుల నమ్మేదిరా ॥ఒక్కొ॥ (28–146)

—శ్రీవేంకట కృష్ణుడొకే పమయమున నాయికలందరిపట్ల ఆదరముతో ప్రవర్తించిన విధమును నాయిక నమ్మియు నమ్మలేకున్నదట।

శ్రీవేంకటేశుడొక్కడే నాయకుడు. అనాథుకుని పలువురు నాయికలు ఏవిధముగ ఒకరికి తెలియక మరియొకరు కూడితిరో హాస్యాత్మకముగ వర్ణించుచున్నాడు.

''ఒకరొకతెనెరఁగకుండా నందె దాగిరి
మొక్కలాన దాఁగిలి మూఁతలాయ రతులు ॥పల్లవి॥
యెక్కువఁ జీఁకటింటిలో యెదురై నీ వుండఁగాను

గక్కన మొక్కితే వచ్చి కౌఁగిటఁ గూడె
అక్కరతో వేరొక్కతె అది యెఱఁగక నీ
వొక్కడ వున్నాఁడవంటా నొనరఁ దాఁగుండెను ॥ఒక్క॥

.... .... .... .... .... .... .... .... .... .... ....

భూపతి చెరువు కాడఁ బొంచి శ్రీవేంకటేశ్వర
యేపున నిన్నుఁగూడిన యింతు లెల్లాను
లోపలనుండి గవాక్షాలు దెరచి తమమోము
లాపొద్దె చూచుకొని యందరును నవ్విరి ॥ఒక్క॥ (22–432)

— ఈ సంకీర్తనమునందలి విషయములు దక్షిణ నాయకుని పట్ల మెలగిన నాయికల స్థితులను చక్కగ వ్యక్తము చేయుచున్నవి.

వేరొక సంకీర్తనమున దక్షిణ నాయకుడైన శ్రీవేంకటేశుడు గావించిన చిలిపి చేష్టల నిట్లు వర్ణించుచున్నాడు.

"రామక్రియ :– కన్నదే కంటి సరుతుఁ గై కొనేవు
యిన్నిటాఁ గలపుకోలు ఇది నీకే కలదు ॥పల్లవి॥
పొరుగాపె నీ తోను పొరచి మాఁటాడితేను
పరగనంతలోఁ గొంగువట్టేవు నీవు
సరుగ వేరొకసతి సాకిరి చెప్ప వచ్చితే
సరుస మాడుతా నాపె చన్నులంటేవు ॥కన్న॥" (27–162)

దక్షిణ నాయకుని గడుసుదనము నిట్లు వర్ణించుచున్నాడు.

"బౌళి :– ఎగసక్కెలే సేసీ నిదే మీతఁడు
నగవు వచ్చీ తన నాఁటకములకును ॥పల్లవి॥
అద్దమునాచేఁ దెప్పించి యండనున్న సతిమోము
నిద్దమై తన మోము నీడ చూచీనే
అద్దిక శ్రీ వేంకటేశుఁ డల్లాకెమేని గంధము
ఉద్దండాన నాకాఁగిట నొనర నంటించేనే ॥ఎగ॥ (24–160)

— ఒక నాయికచేత అద్దము తెప్పించి అందులో తన ప్రక్కనున్న వేరొకసతి మోము చూచుకొన్నాడట! అంతేగాదు ఎక్కడనో జాగరములు చేసివచ్చి వేరొక నాయిక మేన

గంధమును ఈ నాయికకు అంటించుచున్నాడట. నాయకుని గడుసుదనమును సహజముగ వర్ణించినాడన్నమయ్య. ఈ సంకీర్తనమున నాయకుడు తన మోమును వేరొక సతిమోమును చూచుకొను దృశ్యమును అన్నమయ్య వర్ణనా సామర్థ్యమనెడి దర్పణమున సహృదయులకు అందించుచున్నాడనుట సహజోక్తి.

దక్షిణ నాయకుని వర్ణనలలో అక్కడక్కడ సంయోగ శృంగార వర్ణనల ప్రసక్తి వచ్చినను నాయకుని వర్ణనలలో చెప్పుట సముచితమని భావించి యిచ్చట చెప్పుట జరిగినది.

అన్నమయ్య తన శృంగార సంకీర్తనములందు గావించిన భిన్న విధములైన నాయికల వర్ణనలను పరిశీలించి, నాయకుని వైభవమును వర్ణించినతీరును గమనించిన తరువాత వారు శృంగార వియోగావి కార్యకలాపములనే విధముగ నిర్వర్తించిరో, ఆ తీరును అన్నమయ్య వర్ణించిన తీరెట్లున్నదో గమనింపవలసి యున్నది.

## సంయోగ శృంగార వర్ణనలు

"భారతాచార్యుని మతమున (నా.శా. 6_40 41) లోకములో ఏది పవిత్రము, శ్రేష్ఠము, ఉజ్జ్వలము, దర్శనీయముగునో అది శృంగార మనిపించుకొనును. అట్టి శృంగారము భగవన్నిష్ఠమై భక్తి పూతమైనప్పుడది సర్వోత్కృష్టమనుట వేరుగ చెప్ప నక్కరలేదని సిద్ధాంతము. ఈ సిద్ధాంతమే శృంగారము భక్తిసాధనతో నుత్తమోత్తమముగా స్వీకరింపజేసినది. అన్నమాచార్యుని భక్తిసాధనలో శృంగారము ప్రధానముగా రూపొందినది. ఆత్మాశ్రయ పద్ధతిలో రచింపబడుటచే అన్నమాచార్యుని శృంగారకవిత భక్తి భావ బంధురమై, కవి హృదయాను భూతుల నావాత మధురముగా వెల్లడించు చున్నది. కథానిరపేక్షమై, కేవల భావాశ్రిత ప్రసంగ ప్రవణయుక్త రచనమగుటచేత ఈతని రచనలో శృంగారము లౌకిక వాసనలకు దూరమై అలౌకికపుటంచుల వరకు సాగినది.

అన్నమయ్య చెప్పిన దలౌకిక శృంగారము. దీనినే దివ్యదంపతుల ప్రణయ జీవిత వర్ణన మనవచ్చును. అన్నమయ్య గావించిన వర్ణనలలో సంయోగ శృంగార సంబంధులసంఖ్యాకముగ ఉన్నవి. ఆయా సంకీర్తనములందుఅన్నమయ్య ప్రకటించిన వర్ణనా నైపుణ్యము అనితరసాధ్యము. చిగురుటధరమున కెమ్మోవినిండిన నాయికనుచూచి చెలికత్తెలు పలికెడి పలుకులలో సంయోగ శృంగార వర్ణన కడు మనోహరము.

"నాదరామక్రియ :- ఏమొకో చిగురు టధరమున యెడనెడఁ గస్తురి నిండెను

భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా ॥పల్లవి॥
కలికిచకోరాక్షికిఁ గడకన్నులు గెంపై తోఁచిన—
చెలువంబిప్పుడిదేమో చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై నాఁటిన యాకొన చూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు గాదు గదా ॥ఏమె॥
పలఁతికి చనుఁగవ మెఱుఁగులు పైపైఁ బయ్యెద వెలుపల
కడు మించిన విధమేమో కనుఁగొనరే చెలులు
ఉడుగని వేడుకతోఁ బ్రియుఁ డొత్తిన నఖ శశిరేఖల
వెడలఁగ వేసవి కాలపు వెన్నెల కాదుగదా ॥ఏమొ॥
ముద్దియ చెక్కుల కెలకుల ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దిక లాగు లివేమో వూహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపుఁ జెమటల అందము కాదు గదా ॥ఏమొ॥ (12—82)

— ఈ సంకీర్తమున అన్నమయ్య గావించిన శృంగార వర్ణనను శృంగార రసాభిజ్ఞత గలిగిన కొందరు మాత్రమే గుర్తింపగలరచున్నారు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. "ఎఱ్ఱటి పెదవిని నల్ల సిరాతో వ్రాసిన జాబుగా ఉత్ప్రేక్షించుట అందరెరుగుదురు. ఆ నాయిక తనివి తీర కస్తూరీ తిలకాంకితమైన ప్రియుని మోము పలుమారు ముద్దిడుకొనుటచే పెదవిపై నల్ల గుర్తులేర్పడినవని కారణము కూడ తెలియుచున్నది. ఆ పెదవిని జాబుగా ఉత్ప్రేక్షించుటకు తగినన్ని కస్తురి ముద్రలు గలవంటే ఆమె ఎన్నిసార్లు ముద్దిడుకొని యుండవలెనో దానికి తగిన నాయకుని సౌందర్యమెంతో కొందరే గుర్తింపగలరు. అట్లే ప్రియునిపై నాటిన చూపు నిలువున పెరుకుట, దానిచే కన్నెఱ్ఱనగుట దాని వలన అది నెత్తురు మరకగ ఊహించుట పైకి తెలియుచున్నవి. అందులోని ఏకాగ్రత విధి లేక బలాత్కారముతో చూపూడదీయవలసిన దుర్గతి సహృదయైక వేద్యము. పయ్యెదలోని చనుగవమిసిమి బయట పరవులు పెట్టుట అతిశయోక్తియే. కాని దానికి చూపిన హేతువు శృంగార రసనిష్ణాతునకుగాని తెలియరానిది. చనుగవపైన నఖశశిరేఖలు మొలచినవట. ఆ కాంతి వాని వెన్నెలయట. మునుపు నాయికను చూపిన తమకమే

ఇప్పుడు కవి నాయకునకు చూపినాడు. ఆ సమ్మర్దమును సహృదయు లూహింతురు. చెమటబొట్లు ముత్యాల జాలుగా వర్ణింపబడుట కవిలోక సహజమే. కాని ఆ చెమట బొట్లు అధరాస్వాద సమయ సంజనితమైన సాత్త్విక స్వేద రూపముగ వర్ణించుట అనుభవజ్ఞులగు కొందరే గుర్తింతురు. 'కామినా మధురా స్వాదః సురతాదతి రిచ్యతే' అని కామశాస్త్రము. ఇంతలోతైన భావమును సహజాలంకార సమన్వితముగ తేట తెనుగు పదములతో వర్ణించునేర్పు అన్నమయ్యకు దక్క మరొక్కరికి లేదన్న అత్యుక్తి కానేరదు."4

ఇదే విధముగ సంయోగ శృంగారమునే అన్నమయ్య నాయిక సౌభాగ్యమును వర్ణించుచు కడు మనోహరముగ చెప్పినాడు.

"ముఖారి :— చెప్పరాదీ యింతి సిరులు
వొప్పు లిన్నియుఁ జూడ వొరపులో కానీ ॥పల్లవి॥
ముదిత జఘనము మీఁదిమొల నూలి ఘంటలివి
కదలు రవమెట్లుండెఁ గంటిరే చెలులు
మదనుఁడుండెటి హేమమందిరము దిరిగిరా
గదిసి మ్రోసెడి పారిఘంటలో కాని ॥చెప్ప॥...." (12—254)

— కేవలము మొలనూలి ఘంటల రవములను వినిపించుటయేగాక 'కొమ్మ పయ్యెద లోంచి కుచముల రుచి వెలికి జిమ్ముచున్నదని, ఆచిమ్ముట యిమ్మైన మరుధనము రాశులు వోసి చెంగావిచే కప్పినారో యేమోనని', నెలతకంఠము నందు గల నీలమణిహారములు అలరుచు లలితాంగియైన అలమేలు మంగ ప్రాణ వల్లభుడైన వేంకట విభుని కౌగిట నిలిచెనో" యున్నట్లుండెనని వర్ణించినాడు. ఒక వైపున సంయోగ శృంగార వర్ణన గావించుచునే వేరొక వంక నాయిక వర్ణన గావించినాడు

## నాయికను పరవశము చేసిన రీతి

నాయికా నాయకుల శృంగార చేష్టల వలన నాయిక వెరగందినదట. సిరుల పరవశమైనదట. ఆ విషయమునే ఇట్లు వర్ణించుచున్నాడు.

"కన్నడగౌళ :— తురుము నీవియు జార తొయ్యలి వెరగంద
సిరులఁ బరవశము సేసితిగా నీవు ॥పల్లవి॥

.... .... ........ .... .... ....

పడఁతి గుబ్బలు నీకుఁ బాంచజన్యములుగా
కడివోని మొనలోలిఁ గదియ నొత్తి
తడయక మదన యుద్ధము గెలిచితినంటా
వొడలి చెమటలార నూదితిగా నీవు ॥తురుము॥" (12–116)

— అంతే గాదు. నాయిక వీపు పీఠ కాగా తన వాడియైన గోళ్ళతో నాయకుడు మీటి నాడట. అన్నమయ్య ఊహాశక్తి ఈ సంకీర్తనమునందద్భుతముగ ప్రదర్శితమైనది. పడతి గుబ్బలు పాంచజన్యములైనవట. ఎంతటి 'గడుసు' ప్రయోగము! ఇది సహృదయ మనోవేద్యము.

## నాయకుని శృంగారచేష్టలు

నాయిక వద్ద నాయకుడు నెరపిన శృంగార చేష్టలను నాయిక చెలితో చెప్పుచున్నది. ఆ నాయకుడు తన పట్ల ప్రవర్తించిన తీరు తృప్తి నివ్వక పోయినచో రాత్రికి రమ్మని చెప్పి పంపుచున్నది.

"నారాయణి :– నవ్వు నవ్వె రమణుఁడు ననుపుగాఁ బొందు సేసె
రవ్వల నింత చాలదా రాతిరి రమ్మనవే ॥పల్లవి॥
చెక్కునొక్కె, సేసవెట్టె, చేయివేసె బుజముపై
జక్కువ నా చన్నులంటె చాలదా యింత ........
కాలుదొక్కె, కాఁకరేఁచె గన్నులఁ దప్పక చూచె
చాలుగా మాటలూ నాడె చాలవా యింత ........
కొంగు వట్టె—గాఁగిలించెఁ గూడె సమరతులను
సంగతాయనన్నిటాను చాలదా యింత — ॥నవ్వు॥ (26–162)

— నాయకుని శృంగార చేష్టలన్నిటిని క్రమ క్రమముగ వర్ణించి చివరకు సమరతులను గూడించినాడన్నమయ్య.

## సంభోగ చిహ్నములను గూర్చి చెలులు ప్రశ్నించుట

నాయకుని కూడి వచ్చిన నాయికపై కన్పించుచున్న సంభోగపు గుర్తులను గూర్చి చెలులు ప్రశ్నించుచున్నారు. ఆ గుర్తులను కప్పిపుచ్చుకొనుటకు నాయిక ప్రయత్నించు చున్నది. ఆ విషయమిట్లున్నది.

''కాంబోది :- నీ వేల సిగ్గువడేవే నెలఁతా
యీవలఁ జెలికత్తెల మెగ నక్కొ-మూదేసూ ॥పల్లవి॥
చుక్కలవలె నీ మోవి సూదివాటులుండగాను
యిక్కన నీ కెంగేల నేల మూసేవే
తక్కక గజరుఁ జేఁతల వాఁడు నీ మగఁడు
యెక్కడా లేని దాయందు కేమాయనే ॥నీవే॥ (24-7)

— ఇంకను ఆ నాయిక నఖక్షతములను కప్పి పుచ్చు కొనుటకు కస్తురి మెత్తుచున్న దట. అక్కడక్కడ తమ్మచదురులుండగ కుంకుమలు పూసి కొనుచున్నదట నాయిక తన రహస్యమును వెల్లడి చేయకుండుటకు అనేక విధముల ప్రయత్నించుచున్నది. కాని అన్ని విషయముల నెరిగిన చెలులు మాత్రము పసిగట్టి ప్రశ్నించుచున్నారు. నాయిక మాటాడలేకపోవుచున్నది

సంభోగమును సాగించి వచ్చిన నాయికా నాయకులను చెలికత్తెలు ప్రశ్నించు చున్నారు.

''ఆహిరి :- ఏమి సేసుకొంటిరో ఇందాఁకామీరు
అముకొని మిమ్ము నేము అడుగ సిగ్గయ్యీని ॥పల్లవి॥
కొమ్మ కొప్పులో నున్న గొజ్జగఁరేకుల చొప్పు
వుమ్మడి నీ మేనిమీఁద నున్న దిదిగో
కమ్మటి నాపె గుబ్బల కస్తూరి గంధము
దుమ్మురేఁగి వచ్చదానఁ దొప్పఁదోగి వున్నది ॥ఏమి॥'' (28-200)

— ఈ సంకీర్తనమున నాయికా నాయకుల నడుగుటకు సిగ్గుగ నున్నదని పలుకుచు వివరములను చెప్పుమనుచున్నారు. సతి చెవులకు పెట్టిన జవ్వాది కరగి నాయకుని భుజ ములపైకి వచ్చినదట. ఆమె పెదవుల తములపు చదరులు నాయకుని చెక్కులపై కని పించినవట. అలమేలుమంగ లత్తుకరేక నాయకుని నొసలి మీద నిండెనట. ఈ విష యములను గమనించినపుడు అన్నమయ్య సంయోగ వర్ణనా నైపుణ్య 'మౌరా' యనిపించును.

నాయిక చెలిని ప్రశ్నించుట

రాయబారమునకు పోయిన చెలి శృంగారము నెరపి వచ్చినది. సంభోగపు చిహ్నములు చెలిపై కన్పింపగ నాయిక ప్రశ్నించుచున్నది.

"ఆహిరినాట :- ఏమే నమ్మితిఁగదే యింకా నేల దాఁచేవు
చేముంచితివేమో నాకుఁ జెప్పవే యాకతలు ॥పల్లవి॥
కళలు మోమున్నదేరీఁగారీఁ జెంజెమటలు
చెలి నిన్నాతఁ డేమైనాఁ జెనకెనపె
పిలువ నిన్నంపితేను పెనఁగులాడితివేమో
సెలవి నేమి నవ్వేవు చెప్పవే యాకతలు ॥ఏమే॥ (29-24)

— అంతేగాక రాయబారమునకు వెళ్ళి వచ్చిన చెలి యొక్క కొప్పు జారినదట కట్టిన చీర నలిగినదట అతడు 'నిన్నంటెనా' అని అడుగుచున్నది. మోవిపై కెంపులు నిండగ ముడిచిన కొప్పు జారెనట. 'శ్రీ వేంకటేశుడు నిన్ను గూడినాడా' యని నాయిక ప్రశ్నించినది. ఇందు నాయిక చెలిని ప్రశ్నించుచు ముందుగ 'కతలు చెప్పుమన్నది' అయినను చెలి మాటాడలేదు. నాయికకు ఆందోళన ఎక్కువైనది. అతడు 'నిన్నంటెనా' అని అడిగినది. అయినను సమాధానము రాకపోవుటచే 'నిన్ను గూడినాడా' యని ప్రశ్నించినది.

## నాయిక నాయకుని ప్రశ్నించుట

ఎవ్వరి తోడనో సంయోగము నెరపి వచ్చిన నాయకుని 'ఎక్కడ నుండి మా యింటికి వచ్చితివి అని నాయిక ప్రశ్నించుచున్నది. నాయకునిపై సంభోగ చిహ్నములు కనిపింపగ ఈ విధముగ అడుగుచున్నది.

"కన్నుల నిద్దుర దేరీ గట్టినీ తురుముతోఁ
చెన్నగు నీ మొగమున సిగ్గు దేరీని
నున్నని చెక్కుల వెంట నొసలి చెమట గారీ
యెన్నఁగ నీ వున్న జాడ యిది యేటి దయ్యా" (28-343)

— వచ్చిన నాయకుడు పరకాంతతో రేయి గడపినాడు. రాత్రి యంతయు నిద్దుర లేకయే జాగరము చేసినాడు. తాను చేసిన పని నాయికకు తెలిసి పోయినదని సిగ్గు పడుచున్నాడు. నొసలి నుండి చెమట చెక్కుల వెంట కారుచున్నదట ; ఈ చరణములో నాయకుని యాకారమును కన్నులకు గట్టినట్లు వర్ణించినాడన్నమయ్య. నిద్దుర కన్నులతో జారిన తురుముతో వచ్చిన నాయకుడు, నాయకుని స్థితిని గమనించి ప్రశ్నించుచున్న నాయిక సహృదయుల యెదుట సాక్షాత్కరించుచున్నారు. నిద్దుర కన్నులను జారిన

తురుమును చిత్రకారుడు చిత్రింపగలడేమో గాని చెక్కుల వెంట గారెడి చెమటనే చిత్ర కారుడు చిత్రింపగలడు ? ఏ శిల్పి చెక్కగలడు ? చిత్రకారుడు చిత్రింపలేని, శిల్పి చెక్కలేని భావ చిత్రమును సహృదయుల యెదుట సాక్షాత్కరింగునట్లు పరమ రమణీయముగ, అత్యంత సమర్థవంతముగ అన్నమయ్య వర్ణించినాడు.

## సంభోగపు గుర్తులు నాయికా నాయకులపై ప్రతిబింబించుట

రహస్యముగ సంభోగమును సాగించిన నాయికా నాయకులు వెలుపలికి వచ్చినారు. కాని వారి గుర్తులు మారి పోవుటను గమనింపలేకపోయినారు. ఆవిషయమునిట్లు అద్భుతముగ వర్ణించుచున్నారు.

''వరాలి :— మగరూపు నాఁడు రూపు మారుచుకొని రిద్దరు
సొగి సెద్దము చూపరే చూచుకొనే రిద్దరు దామే ॥పల్లవి॥
కలికి కస్తూరి బొట్టు కాంతుని నొసలనంటె
నిలువు నామము పైపై నెలత కంటె
అలివేణి కొప్పు జారి అతని కొప్పుపై వాలె
అంరె నీతన్నిసిక అతని పావటపైని ॥మగ॥
కుంకుమ గుబ్బల పూఁత గురుతు విభుని కంటె
అంతెఁ బతి రొమ్ము బొచ్చు ఆకె కంటెను
కంకణాల గాజుల చేయి ఘనుని సందిటఁ జిక్కె
అంకపు సాముల చేయి ఆకె నందిఁ జిక్కెను ॥మగ॥
మఱె పాదములవె మగిడె నాతని మీఁద
నిట్ట పెద్ద పాదాలు నిలిచె నందు
యిట్టి శ్రీ వేంకటేశుఁ డింతిఁ గూడి పానుపుపై
పట్ట పగలందరిని భ్రమ యించి రిదివో ॥మగ॥" (26—309)

— ఈ సంకీర్తనమున అన్నమయ్య ఊహాశక్తి అత్యద్భుతముగ ప్రదర్శితమైనది. నాయికా నాయకులు ఒకరి రూపు నొకరు మార్చుకొన్నారట ! శ్రీ వేంకటేశుడింతిని గూడి పట్టపగలే అందరిని భ్రమింపజేసినాడట. ఒకరి గుర్తులు మరొకరిపై వచుట వలన గుర్తుపట్టుటకు కష్టముగ ఉన్నదట. సరళమైన పదజాలముతో చెప్పదలచుకొన్న విషయమును సూటిగా చెప్పగలుగునేర్పు అన్నమయ్యకు సహజసిద్ధము.

## నాయిక స్థితి (సంభోగానంతరము)

నాయికా నాయకుల శృంగార నిర్వహణము కాంతలకెల్ల తెలిసి పోయినదట ! ఎంతటి శృంగారవతులైనను ఇంత రట్టు చేసి కొన వచ్చునాయని చెలులు పలుకుచున్నారు.

"జలజాక్షి కొప్పులో నిసంపెంగ పువ్వులు రాలె
పెల్చు దనాన నీవు పెనఁగఁగాను ——
అంగన గుబ్బల మీది హారములు చిక్కువడె
రంగుగా నంటి మంటి సరసమాడఁగా
చెంగటనే గిలికించి చిమ్మిరేఁగ నవ్వించగా
సింగారపుఁ బయ్యెదల్లా చెమటఁదడిసెను" (30_511)

— ఇంకను ఆమని రతులను శ్రీ వేంకటేశుడు నాయిక నలయించగా కామిని నిట్టూర్పుల గాలి విసర జొచ్చెనట. శ్రీ వేంకటేశుడామెను గూడినప్పుడు తొట తొట మోవి తేనెలు ఊరినవట.

పై సంకీర్తనమున అన్నమయ్య నాయిక మోవి తేనెలు ఊరినవని పలికినాడు. అదే విధముగ అన్నమయ్య వర్ణనా ప్రపంచమున భావములు ఊటలు దేరి యుండును. ఆ ఊటకు అంతములేదు. మంచి ఊట గలిగిన 'చెలమ'లో నీరు తోడినకొలది ఊరునట్లు అన్నమయ్య సమర్థవంతముగ పదము తరువాత పదము పలుకుట కాయన భావ క్షేత్రమున పదములూరుచునే యుండును. అన్నమయ్య శృంగార సంకీర్తనము లందు చెప్పిన సంయోగ శృంగార వర్ణనలలో కొన్ని వివరింపబడినవి. పరిశీలించిన కొలది ఇంకను పరిపరివిధముల దర్శన మిచ్చుచునే యుండును.

## విరహ వర్ణనలు

'నవినా విప్రలంభేన శృంగారమ్ పుష్టిమశ్నుతే' అను నాలంకారిక వచనాను సారము శృంగారము విప్రలంభము లేక పుష్టి మంతము కాదని గ్రహింపవచ్చును. నాయికానాయకులకు ఎడబాటు కలిగిన సమయమున ఒకరినొకరు కలసి కొనుటకు పడు తహతహయే విరహము లేక విప్రలంభము. అన్నమాచార్య శృంగార సంకీర్తనము లందక్కడ వియోగ శృంగార వర్ణనలు కనిపించును. సంకీర్తనమును విరహ వర్ణనతో

ప్రారంభించి ఏదో ఒక విధముగ దానిని సంయోగాంతముగ ముగించుటకు ప్రయత్నించును.అన్నమయ్యగావించిన వర్ణనలలో అద్భుతభావ పరిమళమునువెదజల్లుచున్నదనుటకు ఈ క్రింది సంకీర్తనము చక్కని ఉదాహరణము.

"ముఖారి ;— ఇదిగాక సౌభాగ్యమిది గాక తపము మఱి
యిదిగాక వైభవంబింక నొకటి గలదా ॥పల్లవి॥
అతివ జన్మము సఫలమై పరమయోగివలె—
నితర మోహాపేక్షలిన్నియును విడిచె
సతి కోరికలు మహాశాంతమై యిదెచూడ
సతత విజ్ఞాన వాసన వొంతె నుండె ॥ఇది॥
తరుణి హృదయము కృతార్థతఁబొంది విభుఁజింది
పరవశానంద సంపదకునిరవాయ
సరసిజానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భావమాయ ॥ఇది॥
శ్రీవేంకటేశునిఁ జింతంచి పరతత్త్వ-
భావంబు నిజముగాఁ బట్టె చెలియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు తిరమాయ ॥ఇది॥" (12—17)

—"ఇందు ముముక్షువగు యోగి ఉపమానముగా విప్రలంభావస్థలో ఉన్న నాయిక ఉపమేయముగ స్వీకరింపబడెను. యోగికిని వియోగినియగు నాయికకును సమానధర్మము సమానఫలము నిర్దేశింపబడినవి.

''లౌకికమైన భాగ్యముగాని, పారమార్థికమైన తపముగాని ఇహపర సంబంధియగు విభవముగాని ఇంతకంటె (తానిరూపించుదానికంటె) వేరులేదని పల్లవితో నిరూఢిచేయుచున్నాడు. ప్రపంచ సర్వస్వమును వదలిన యోగి పరమాత్మను నిరంతరము భావించినట్లు ఈ వియోగావస్థలో నాయికత్వము నతిదేశించుకొన్న భక్తుడు పరబ్రహ్మమగు శ్రీవేంకటేశ్వరుని నాయకుడుగా తనసర్వస్వముగా భావించుటచే ఐహికాముష్మిక ప్రపంచమోహము, తనకు తానుగ వీడిపోవుచున్నదని ప్రథమచరణ భావము. 'దీని వలన 'ఇహాముత్ర ఫలభోగ విరాగః' అను వేదాంత సోపానము సిద్ధమైనది. ఇంత

పరిపాకము కావలెనంటే సంకల్ప వికలాత్మకమైన మనసు కదలికలేక నిలుపవలెను. అట్లు నిలుపవలెనంటె పూర్వజన్మ భక్తి వాసనాబలము గాఢముగ నుండవలెను గదా! గాఢ విజ్ఞాన వాసనాబలము వలననే మనసు నిలిచి తపము కుదిరి యోగిభావ మేర్పడినదని భావము. ఇది ఒక జన్మలోని సాధనకు కలుగు ఫలితముగాదు. "బహూనాం జన్మనామన్తే జ్ఞానవాన్మాం ప్రపద్యతే' అను గీతావచన రీతిగా ఎన్నోజన్మల సాధనకు ఫలము. భౌతిక శృంగారమునందు గూడ ఈ యేకాగ్రత చూపట్టవచ్చును. కాని దాని యానందము క్షణికము. ఈయేకాగ్రత 'విచిన్తయన్తీ యమనన్య మానసా తపోనిధిం వేత్సి న మాముపస్థితమ్" అను శ్లోకమున (శాకుంతలములో) గుఱుతింపబడినది కాని అన్నమయ్య చెప్పిన పరమాత్మ విషయకమైన ఏకాగ్రతవలని ఆనందము అనంతము, ఫలితము దివ్యమని తేలుచున్నది,

"క్రమముగా రెండవ చరణమున మనోజయము, తన్మయీ భావము వర్ణింపబడినవి. దీనిచే 'శరదమాది సాధన సంపత్తిః' అను వేదాంత సోపానము సిద్ధమైనది. 'నిత్యానిత్య వస్తు వివేకః' అను వేదాంత ప్రథమ సోపానము. ఈ యేకాగ్ర భావనకు ముందే బీజరూపముగ సిద్ధమైనట్లే, మూడవ చరణమున పరతత్త్వ ప్రాప్తి కలిగి దేహి పరమార్థ చరమసోపానము దాటి సాలోక్య సిద్ధినందినట్లర్థమగుచున్నది. దీనితో 'ముముక్షత్వం' అను వేదాంతపు కడపటి మెట్టుదాని సిద్ధియు వర్ణింపబడినట్లయినది."[5] అను శ్రీ గౌరిపెద్ది రామ సుబ్బశర్మగారి వివరణ మిక్కిలి సముచితము.

## విరహములో నాయిక

సంకీర్తన ప్రపంచమునందును స్వామి విరహములు భరింపని అన్నమయ్య అక్కడక్కడ విరహాంతములుగనే వర్ణించినాడు. ఆ విధమగు వర్ణన క్రింది సంకీర్తనముదాహరణ యోగ్యము.

"కన్నడ గౌళ :— తరుణి కనుఁగవ మోడ్పుతగఁ జూడరే
వరుని ఁదనమతి సొలసి వడిఁజూచినట్లు ॥పల్లవి॥
వెలఁది ముక్కున వెడలు వేఁడి నిట్టూరుపుల
చెలువ మెటువలె నుండెఁ జెప్పఁగదరే
చలము కొనునలులకు సంపెంగ పేనుగాలి
కలకంఠి మేనికి కాపిడిన యట్లు........ ॥తరు॥

ఇంతినెన్నుదుటి పై నిపుడు చెదరిన కురులు
వింతలై యెట్లుండె వివరించరే
సంతమై శ్రీవేంకటేశ్వరుఁడు చెలినేఁపుళశి
పంతముడుపఁగదమము పరివిడిచినటు ॥తరు॥" (12-339)

—ఈ సంకీర్తనమున విరహములోనున్న నాయికాస్థితిని మనోహరముగ వర్ణించినాడు. ఉత్ప్రేక్షాలంకారముతో రచింపబడిన ఈసంకీర్తనము విరహాంతముగనే వర్ణింపబడినది ఈవిధముగ విరహాంతములుగ వర్ణింపబడినసంకీర్తనములు అన్నమయ్య సాహిత్యమున అరుదుగా కనిపించును.

వేరొక సంకీర్తనమున వేంకటేశధ్యాన మగ్నమానసయైన నాయిక ఏవిధముగ ప్రవర్తించుచున్నదో వర్ణించుచున్నాడు.

"శంకరాభరణం :— తరుణి నీయలుక కెంతటి దింతి నీ వేళ
గరుణించఁగదర వేంకట శైల నాథా ॥పల్లవి॥
ఒకమారు సంసారమొల్లఁ బొమ్మని తలఁచు
ఒకమారు విధిసేత లూహించి పొగడు
ఒకమారు తనుఁ జూచి వూరకే తలపూఁచు
ఒకమారు హర్షమున నొంది మేమఱచు ॥తట॥ (12-70)

—ఇంకను వేంకటేశునిజూచి నిలువెల్ల పులకించునట, వేరొకసారి సిగ్గుపడి నిలుచునట. ఈవిధముగ విరహముతో బాధపడుచున్ననాయికను చివరికి నాయకుడు అదనెఱిగి పొందిడనాట. 'అదనెఱిగి పొందినాడ'నుట చక్కని పదప్రయోగము.

## విరహమే సింగారము

నాయకుని వీడి యుండుటయే నాయికకు సింగారమాయెనట. ఆ విషయమును
"శ్రీరాగం :— అంగనకు విరహమే సింగారమాయ
చెంగట నీవే యిది చిత్తగించవయ్యా ॥పల్లవి॥
కలికి నిన్నుఁదలఁచి గక్కన లోలోఁగరఁగి
జలజలఁ జెమరించి జలకమాడె
బలుతమ కాన నీకుఁ బక్కన నెదురువచ్చి
నిలువునఁ గొప్పు వీడి నీలి చీర గప్పెను ॥అంగ॥" (27-415)

అని మనోహరముగ వర్ణించినాడు.

## పురుష విరహవర్ణన

నాయికా నాయకులకు ఎడబాటుగలిగిన సమయమున నాయకుడు నాయిక కొరకు ఎదురుచూచును. ఆంధ్ర ప్రబంధములందు కూడ అక్కడక్కడ ఈ పురుష విరహ వర్ణనలున్నవి. ప్రబంధకవులవలె వర్ణనలు గావించిన అన్నమయ్య పురుష విరహమును కూడ వర్ణించినాడు.

"సామంతం :— ఏమిసేతు నమ్మలాల యెందుకొను నాయకుఁడు
ఘూమిలోఁ జెప్పఁ గొత్త యీ పురుష విరహము ॥పల్లవి॥
తొయ్యలిరాకకు పతి తొంగి చూడఁబోతేను
దయ్యము వలెఁ జంద్రుడు తలచూపెను
చయ్యన నందు కతఁడు జడిసి తల వంచితే
నుయ్యివలెనే నూలు కొనె మనసు ॥ఏమి॥
మగువ యెలుఁగు విన మతినాల కించితేను
పగవాని రీతినే పల్కెఁగోవిల
మొగులువలెనే కప్పె ముంచుక విరహము ॥ఏమి॥ (24-157)

—ఈసంకీర్తనమునసనాయకుని విరహము చెనికత్తెకు క్రొత్త గాతోచినదని అన్నమయ్య వర్ణించినాడు. అవునుమరి! నాయకుడైన వేంకటేశ్వరుడు విరహవ్యథా భరితుడగుటయా అని చెలి సందేహము. విరహములో ఉన్న నాయకునకు చంద్రుడు దయ్యమువలె తల చూపగ 'జడిసి తల వంచుకొన్నా'డట: పగవాని రీతిగ పలికిన కోయిల పలుకులను విన లేక చెవులు మూసికొన్నాడట విరహార్తులకు వెన్నెల, కోయిల నాదములు విరోధములే కదా! ఈ సంకీర్తనమున చంద్రునకు 'జడిసి' తలవంచుకొనిన నాయకుడు, కోయిల పలుకులకు తట్టుకొనలేక చెవులుమూసికొనిన నాయకుడు సహృదయుల యెదుట సాక్షాత్క-రించుచున్నాడు. అక్షరమాత్రతో శిల్పములను చెక్కుట అన్నమయ్యకు అలవాటు.

వేరొక సంకీర్తనమున చెలిపలుకుల ద్వారా నాయకునికి విరహ వర్ణనను మనో హరముగ వర్ణించుచున్నాడు.

"అహిపతి శయనంబతితాపంబై
బహువేదన కగపడనట తాను

సీదయగానక నిమిషమె యుగమై
ఖేదంబున మెలగేనట తాను" (12-308)

—ఇందలి నాయకునకు అహిపతి శయనము అతితాపమైనదట. అందువలన అనేక విధముల పరితాప పడుచున్నాడట. నాయిక దయను పొందలేక నిమిషమె యుగమై ఖేదముతో మెలగుచుండెనట.

## విరహతాపమునకు నిదానము

విరహమును భరించలేని నాయికానాయకులనేక విధముల తపించుచుందురు. ఆ విరహతాపమును తగ్గించుటకు చెలికత్తెలనేకములైన హితములు చెప్పుటకు, ఉపచారములను చేయుటకు ప్రయత్నింతురు. ఆ విషయములనే అన్నమయ్య ఆయా తావులలో సహజ సుందరముగ వర్ణించినాడు.

విరహార్తయైన నాయిక తాపముతగ్గుటకు నాయికనిట్లు చేయమని చెలులు పలులు పలుకుచున్నారు.

"తెలుగుఁ గాంబోది ;— విరహమునకు నీవు వెరవవద్దు
గరిమనే పొద్దూ నివే కాపులు నీకును ॥పల్లవి॥
చెంగలువ బంతి నీవు జేతఁ బట్టుకొనవే
సంగతి నాతనిమేనిచాయలు దది
ముంగిటి తామరలురమున నొత్తుకోవే
రంగుగాఁ జెలువుని నేత్రములఁ బోలునవి ॥విర॥(24-14)

—ఇంకను నాయకుని వాహనము పక్షిగావున ముంజేతి చిలుకతో మాటలాడుమని, ఆయన నివాసము కొండలు కావున చనుగొండలు చూపుమని నాయికకు హితము చెప్పుచున్నారు. అంతయును సక్రమముగనే యున్నదిగాన 'చెంగలువ బంతి కాంతుల మేనివాడు వేంకటేశుడని' వర్ణించినాడు. ఇదెట్లు సాధ్యము? నీలవర్ణుడైన వేంకటేశుని ఎఱ్ఱకలువమేని కాంతి కలవాడని అన్నమయ్య ఎందుకు వర్ణించెను? ఇది ఆలోచనాత్మకము. సహృదయ హృదయరంజకము. ఆయన యురమున బంగారుకాంతి గలిగినదేవి నిలిచియున్నది. ఆ బంగారు కాంతి వలననే ఆయన మేను చెంగలువబంతి కాంతులను బోలియున్నది. అన్నమయ్య అందువలననే ఈవిధముగ వర్ణించి తన వర్ణనా నైపుణ్యమును ప్రదర్శించినాడు.

శైత్యోపచారములు

విరహార్తయగు నాయికకు శైత్యోపచారములు చేయుచుండగ ఆమె బాధలు అధికమగుచున్నవట। అవిషయమునే అన్నమయ్య కడుమనోహరముగవర్ణించుచున్నాడు

"కుటిలాలేటికి కోమలి యెడనే
డిటు వలెఁ జేయగనింపౌనా ॥పల్లవి॥
పుప్పొడి చల్లిన బొక్కెటి దేహము
కప్పుర మేటికి గలపేరే........
వెన్నెల బాయట వేగెటి మేనికి
పన్నీరేటికి బామేరే
సున్నపు రాతికి జొబ్బిలినుదకము
నున్నతిఁ జల్లగ నోర్చేనా ॥కుటి॥" (4-93)

—చెలులు కప్పరపు కలపమలదుట, పన్నీరుబూయుట మొదలగునవి చేసి ఆమె విరహమును సున్నపురాళ్ళపై నీళ్ళుజల్లునట్లు, వేన్నీళ్ళ కోర్వని వారిపై నిప్పులు జల్లునట్లు, దొరకనిదైవముతో మాటలాడుటకు శపథము చేసినట్లు బాధలనినుమడింపజేయుచున్నారే కాని ఉపశమంపజేయుటలేదని అన్నమయ్య చక్కటి ఉపమానములతో మనోహరముగ వర్ణించినాడు.

'పన్నీరు చల్లెరా నీపై' (12-81) అను సంకీర్తనమున చెలులు నాయకునకు శైత్యోపచారములు చేసినట్లు వర్ణించినారు.

వేరొక సంకీర్తనమున విరహార్తయగు నాయిక చంద్ర మలయానిలాదులు తన విరహమును ద్విగుణీకృతము గావించుచున్నవని భావించి, తన విరహము తగ్గుటకు వానిని దూషించుటయే మార్గమని తలంచి దూషించుట కుపక్రమించెను. కాని వానిని దూషించుట 'నిన్ను దూషించుకొనుటయే'నని చెలి పలుకుచున్నది. ఆ వర్ణనమిట్లున్నది.

"హిందోళవసంతం :— పతిమీద తమకాన భ్రమసితి వింతేనీవు

అతివరో వెఱ్ఱిపేలే లపేనీవు గావా ॥పల్లవి॥
చందురుఁడితఁడుగాదే సతినీ నెమ్మోముగాని
పొంది నీనీడ జలధి బోడచూపేను
మందానిలుఁడు గాదెపుగువనీ పూర్పుగాని

గంధపుఁగొండఁదాకి కమ్మరానే తెంచెను ॥పతి॥
కోవిల కూతలు గావె కొమ్మనీ యెలుఁగుగాని
యీవలఁ బ్రతిధ్వనులై యెగసె వనానను
పూవుల మొగ్గలుగావె పూఁవనీ చన్నులుగాని
తావుల వసంతమాడఁదలతెత్తెఁ బొదల ॥పతి॥" (26–48)

—ఈ సంకీర్తనమునందలి వర్ణనను బట్టి విరహవ్యథాభరిత మనస్కయైన నాయికకు ప్రకృతి పరితాపమును కలిగించుచున్నదని గ్రహింపవచ్చును. ఆ తాపమునకు తట్టుకొన లేక నాయిక చంద్రుని, మలయపవనుని, పూమొగ్గలను, కోయిల పలుకులను దూషించు చున్నది. అవియన్నియు తన తాపమును ద్విగుణీకృతము గావించుచున్నవని నాయిక భావము. అందుకే వానిని దూషించుట కుద్యమించినది. అన్నమయ్య ఒకేసంకీర్తనమున చంద్ర, మలయపవన, కోయిల దూషణములను నాయిక గావించినట్లు వర్ణించినాడు. తరువాత వెలసిన ప్రబంధకర్తలందరు విప్రలంభ శృంగారమునువర్ణించు సందర్భమున నాయికలచేత చంద్రమనయానిలాది దూషణమును ప్రత్యేక ప్రకరణములలో గావింప జేసినారు. అన్నమయ్య ప్రభావము తరువాతి ప్రబంధకర్తలపై ఉన్నదనుటలో ఆశ్చర్య పడవలసిన అవసరములేదు

విరహార్తుడైన నాయకుని బాధను తొలగింపుమని చెలికత్తె నాయికకు బోధిం చుచున్నది. ఆనాయిక చేయవలసిన పనులను గూర్చి చెప్పుచున్నది.

"దప్పిదేరే మోముతోడ తమకాన నున్నాడు
తప్పులేమియ్యఁగదవే కలికీ
ఇప్పుడు వచ్చితివాతఁడింద్రాఁకొందానొంటనుండె
చిప్పిలు చెమటలార్చి సేదదేర్చవే" (28–133)

—నాయిక వచ్చువరకు నాయకుడు ఒంటిగా కాలము గడిపినాడట అప్పటి వరకు నాయిక కొరకు వేచియున్నాడు. నాయికకు దూరమైన కారణముగ కోరికలకు దప్పి గొనెనట. ఆ కోరికల దప్పిక తీర్చుటకు నాయికను వెళ్ళవలసినదిగ చెలికత్తె చెప్పు చున్నది. విరహానలమున నాయకుని శరీరమున చెమటలు పట్టినవట. ఆ చెమటలార్చి సేదదీర్చుమని చెలికత్తె పలుకుచున్నది.

ఈవిధముగ అన్నమయ్య తనశృంగార సంకీర్తనములందు సంయోగ సంబంధ

విశేషములను, వియోగవమయ పరితాపమును ఆతాపమునకు కలుగచేసిన శైత్యోపచార ములను గూర్చి సహృదయ మనోరంజకముగ వ్యక్తంచినాడు.

## ప్రసంగ వర్ణనలు

అన్నమయ్య శృంగార సంకీర్తనములందు ఆయా వ్యక్తుల ప్రసంగముల మూలమున అనగా వారి పలుకులవలన దర్శనీయములైన వర్ణనలు లెక్కకు మిక్కిలిగ ఉన్నవి. ఈ ప్రసంగములయందు ప్రసంగించెడి వ్యక్తి మాటలు మాత్రమే సహృదయులకు వినిపించును. శ్రోతల నాయా సందర్భములను బట్టి సహృదయులే ఊహించుకొనవలెను. ఇవి సంయోగ వియోగ శృంగార సంబంధులు.

## నాయిక నాయకునితో

శ్రీవేంకటేశునకు సేవచేయవలెననెడి దృక్పథముతో నాయిక తాను నాయకుని పట్ల మెలగగలిగెడు విధమును వివరించుచున్నది. నాయకునితో ఆ నాయిక

"శ్రీరాగం :— ఏమిసేయమనేవయ్యా యింకానన్ను
కామించి నీ మన్ననలు గైకొంటి నేను ॥పల్లవి॥
వొద్దనే గూచుండనా వూకొననానీమాటలు
కద్దు నిజమేయననా కానిమ్మననా...........
పాదాలు పిసుకనా బత్తి సేయనానీకు
సాదువలె నుండనా సమ్మతించనా........ ఏమి॥" (29_206)

—అని పలుకుచున్నది. నాయిక తానేమిచేయుటకైనను సిద్ధమేనని పలుకుచున్నది. నాయకుని అనురాగమును సంపాదించుటకుతాను మెలగగలిగిన విషయములను వివరించు నాయిక ప్రసంగము మనోహరముగ వర్ణింపబడినది.

మన ఇద్దరిలో నేర్పరితన మెవరిదని నాయిక నాయకునితో

"నాదరామక్రియ :_ ఎవ్వరిది నేర్పు మనయిద్దరిలోనా
జవ్వనులిందరుఁ జూచి సంతసించేరు ॥పల్లవి॥
.... .... .... .... .... .... .... .... .... ....
పయ్యెదలోని విడెము పట్టినీ కియ్యరాఁగానే
కొయ్యవై పొదిగి పట్టి గుంపించితివి
చయ్యన బయలు గాఁగా చన్నులకు నీకుళ్ళాయి
వొయ్యనేమాటు నానొర్చుకోవలదా........॥ఎవ॥ (24_52)

— అని పలుకుచున్నది. అంతేగాక కొప్పు పూవుబంతి తీసికొని కానుకిచ్చుటకు వచ్చిన నాయికను కౌగిట నలమినప్పుడు తెరవేసికొనవలదాయని పలికినది. ఈ సంకీర్తనమున నాయికా నాయకులు నెరపని నేర్పరితనములో ఎవరిదినేర్పో నిర్ణయించెడి అవకాశమును అన్నమయ్య పాఠకులకేవదలినాడు.

## నాయిక వేరొక నాయికతో

తన నాయకుని లోజరచుకొనిన వేరొక నాయికతో 'నావద్ద నున్న పతితో నవ్వులు నవ్వుట కెంత చెల్లుబడిగలదానవే' యనుచు ఇంకను

"దేసాళం :- నన్నిట్టె కూడిన వాని నయగారాలఁదెట్టేవు
కన్నెవో యమ్మ యెంత గామిడివే
ఇన్నిటా శ్రీ వేంకటేశు నెలయించి చెనకేవు
నన్నుం బాయలనే సవతి వైతివి" (27-268) అని

'తిట్టిన వెరవకున్న నీ దిట్ట దినమెంతటిదే' యని పలుకుచున్నది. ఈ సంకీర్తనమున ఇరువురు నాయికలు శ్రీ వేంకటేశుని గూడినవారే. కాని ప్రసంగము చేయుచున్న నాయిక వద్ద యిపుడు నాయకుడున్నాడు కాని ఏమియును మాటాడకున్నాడు.

## నాయికలు నాయకునితో

జాణతనము కలిగిన నాయకుని పనులకు తట్టుకొన లేని కోమలులైన నాయికలు

"ఆహిరి :- చిత్తాన నెగ్గు పట్టకు చేతులెత్తి మొక్కేమిదె
కొత్త కొత్త వయసుల కోమలులము —
కెలతుము సొలతుము కేరదము లాడుదుము
వలపులు చల్లుదుము వనితలము
పిలుతుము పేరుకొని ప్రియములు చెప్పుదుము
సళుప్పఁ జూపులఁ జూచి సరస మాడుదుము" (29-25)

అనుచు వినయములు వేడుకతో నవ్వి చనువుగ మొలగెడి జవరాండ్రమని పలుకుచున్నారు.

వేరొక సంకీర్తనమున నాయికలు నాయకునితో ఇట్లు పలుకుచున్నారు.

"శ్రీరాగం :- మరుని నగరి దండ మా యిల్లెఱఁగవా
విరుల తావులు వెల్లి విరిసేటి చోటు ॥పల్లవి॥

పుమ్మిడి సంపెంగ వ్రాయ నున్నతి నీ నాసిక మాయ
కమ్మఁ గలువలు వ్రాయఁ గన్నులాయను ॥సంగ॥" (24–147)

— ఇంకను నాయకుడు శంఖమును వ్రాయగ కన్నె గళమయ్యెనట. జక్క వలను వ్రాయగ చన్నులు, తామరలను వ్రాయగ కరములు, సింహమును వ్రాయగ నడుము, పులినమును వ్రాయగ పిరుదులు, అరటులను వ్రాయగ తొడలు, చిగురులను వ్రాయగ పాదములయ్యెనవి సాంప్రదాయికమైన ఉపమానములతో నాయకుని ప్రసంగము ద్వారా నాయిక రూపమును అత్యంత మనోజ్ఞముగ వర్ణించినాడు.

వేరొక సంకీర్తనమున నాయిక మృదుత్వమును సందేహించుచు నాయికను నాయకుడు ప్రశ్నించినట్లు అన్నమయ్య వర్ణించుచున్నారు.

"చేల కొంగు వట్టి తీసే చీఁదర రేఁగే దానవు
కాలు దొక్కితే నెంత కాఁతాళింతువో
తాలిమి గోర నూఁదితే తప్పించు కొనే దానవు
మేలమాడి పెస్వఁగితే మేను లెంత సేతువో—" (2–521)

— నాయికయైన అలివేలు మంగ మృదుత్వమును నాయకుడైన శ్రీ వేంకటేశుడు సందేహించినట్లు నాయకుని ప్రసంగమును చక్కగ వర్ణించినాడు.

## చెలికత్తెలు నాయికతో

నాయిక తాను చేసిన పనులను గూర్చి చెలులకు వివరింపలేదు. అయినను నాయిక పరిస్థితిని గమనించిన చెలులీ విధముగ ప్రశ్నించుచున్నారు.

"ముఖారి :- మాకేల దాఁచేవే మగువ నీ మోహము
అకట నీ మాటలకు నేమడ్డ మాడేమా ॥పల్లవి॥
నిండిన చెమట నీరు నీ చెక్కుల నుండగ
యెండనేలే నీ మోవి యెదురెదుర ...." (28–5)

— నాయిక ఎంత కప్పి పుచ్చినను చెలికత్తెలు గుచ్చి గుచ్చి ప్రశ్నించినారు.

## చెలికత్తె నాయకునితో

నాయిక పంపగ రాయబార కార్యమును నిర్వహించుటకు వచ్చిన చెలినే నాయకుడాదరించినాడు. అప్పుడు నాయకునితో చెలిగావించిన ప్రసంగ వర్ణన మిట్లున్నవి.

నుఱఁగు మూఁక చింతల మా యిల్లెఱఁగవా
గుఱుతైన బంగారు కొండల నంది
మఱపు వెలివి యిక్కు మా యిల్లెఱఁగవా
వెఱవక మదమఁదు వేఁటాడే చోటు ॥మరు॥
మదనుని వెదపంతె మా యిల్లెఱఁగవా
చెదరియుఁ జెదరవి చిమ్మఁ జీఁకటి
మదిలోన నీ వుండేటి మా యిల్లెఱఁగవా
కొదలేక మమతలు కొలువుండే చోటు ॥మరు॥ ...." (12-282)

— నిరతము శ్రీ వేంకటేశ్వరుని సిరులు నింపబడు చోటు తమ యిల్లని పలుకుచున్నారు. ఇందలి అర్థము సహృదయ హృదయంగమము. ఆలోచనాత్మకము.

## నాయిక చెలికత్తెలతో

నాయకుని దురుసుతనమును గూర్చి చెలికత్తెలతో నాయిక పలుకుచున్నది.

"సాళంగనాట:— అప్పటి నొదఁ బాటెల అతడయ్యా నేనయ్యే
చొప్పులుఁ దప్పులుఁ దీరె వుండరే మీరు ॥పల్లవి॥
బగ్గనఁ దానే యింకఁ బచ్చి తిట్టె తిట్టినాడు
యెగ్గులు సిగ్గులుఁ బాసెనేలే యింక ...." (26-264)

— ఈ సంకీర్తనమున తమ ఒడబాటు ప్రకారము నాయకుడు ప్రవర్తించుట లేకని నాయిక చెలికత్తెలతో పలుకుచున్నది. నాయకుడు సిగ్గు యెగ్గు లేక ప్రవర్తించుచున్నాడట.

## నాయకుడు నాయికతో

నాయకుడు నాయికతో ప్రసంగించెడి సందర్భమున నాయకుని పలుకుల వలన నాయిక రూప మత్యద్భుతముగ వర్ణింపబడినది.

"శ్రీరాగం :— సంగడికి రాఁగదవే సరిచూచేను
యింగిత మెరుఁగు కొంచె నిద్దురికిఁ గూడెను ॥పల్లవి॥
తుమ్మిదలు వ్రాయబోతే తొయ్యలి నీ తురుమాయ
నెమ్మిఁబందురు వ్రాసితే నీ మోమాయనే

"నే వచ్చిన పనేమి నీవు సేసినచే(తేమి
అవల( జెలేమనునో అవునయ్య చాలును ॥పల్లవి॥
పిలిచే వనుంటి( గాని పెన(గే దెఱ(గనైతి
చెలికత్తె( బచ్చిసేయ( జెల్లునా నీకు
తొలుతే వేడుక కాదు దోస మెఱు(గ(దనేటి
పలుకు నీయందే కంటి( బదపయ్య చాలును ॥సేవ॥ (26_169)

— ఈ సంకీర్తనమున నాయిక సందేశమును వినిపింప వచ్చిన చెలిని నాయకుడు కూడగ ఈ చెలి నాయకునితో పలుకుచున్నది. 'నీవు దోష మెఱు(గవనుట కిదియే నిదర్శనమ'ని వ్యంగ్యముగ పలికినది.

## చెలికత్తెల పలుకుల ద్వారా నాయకుని స్థితి

సతి చక్కదనమెంతో గాని ఆ చక్కదనమునకు ముగ్ధుడైన నాయకుడు మోహముతో నాయిక చిత్రమును వ్రాయుచున్నాడట. ఆ విషయమును చెలికత్తెలిటు పలుకుచున్నారు.

"తెలు(గు( గాంబోది : కాంత కన్నులు వ్రాసి కడలు వ్రాయ(గ రాక
చింత తోడ(దల వంచె( జెలివిభు(డు
పంతపు నడుము వ్రాసి బయలు వ్రాయగ రాక
కొంతదదవుస్సురనె( గోమలి ప్రాణేశు(డు ॥సతి॥
కలికి కుచాలు వ్రాసి కఠినము వ్రాయలేక
తలపోయ( బొడ(గె( బంతపు విభు(డు
నలినాక్షి మోము వ్రాసి నవ్వులు వ్రాయగరాక
నిలువున వెరగందె నెల(త రమణు(డు
వనిత కా(గిట దన్ను వ్రాసి రతి వ్రాయలేక
తనువెల్ల మఱచెను తమకమున ...." ॥సతి॥ (29–590)

— ఈ సంకీర్తనమన్నమయ్య భావచిత్ర కౌశలమునకు ప్రత్యక్ష నిదర్శనము. నాయకుడు చిత్రమును గీసేడి విషయమును కన్నులకు గట్టినటు వర్ణించినాడు ఆ నాయకుడు కొన్ని విషయములను వ్రాసి కొన్ని వ్రాయలేక సతమతమగుచున్న చిత్రమును అద్భుతముగ చిత్రించినాడన్నమయ్య.

## నాయికా నాయకుల వేడుకలను చూచిన చెలికత్తెలు

అన్యోన్యానురాగము గలిగిన దివ్యదంపతుల వేడుకలను కన్నులార గాంచుచున్న చెలికత్తెలు ఆ నాయికా నాయకుల నిర్మలమైన అనురాగమును ప్రశంసించు ప్రసంగము గావించినారు. ఆ ప్రసంగ వర్ణన మిటులున్నది.

"మధ్యమావతి:- ఇటువలె నుండ వద్దా ఇద్దరి వేడుకలు
తటుకనఁ జూచి సంతసమాయ మాకు ॥పల్లవి॥
వీఁపున జన్నులు మోపి వెలఁది నీ కొప్పు దువ్వి
అఁపరాని తమి నుబ్బు రంటాను
మోఁపుచు నాకు మడిచి మోవి నందిచ్చే వాపెకు
చేపట్టి వూడిగాలిట్టె సేయించుకొంటాను." (28—319)

— ఈ సంకీర్తనము నందలి నాయికా నాయకులు ఒకరి కొకరు సేవలు చేయుచున్నారు. వారి వేడుకలను గమనించిన చెలికత్తెలు సంతోషముతో ప్రసంగించినారు. ఇందు నాయకుని కొప్పు నాయిక దువ్వుచున్నది. ఆ దువ్వేట కూడ నాయకుని వీపున చన్నులు మోపె దువ్వుచున్నది. తన కొప్పు దువ్వినందులకు కృతజ్ఞతగ నాయకుడు నాయికకు ఆకుమడిచి మోవి నందించుచున్నాడు, ఊడిగములను చేయించుకొనుచునే నాయకుడు నాయికకును సేవలు చేయుచున్నాడు. కాని నాయకుని గడుసుదనమును గమనించినచో నాయకుడు ఆకు మడిచి నాయికకు అందించుటలేదని తమ్ములము మోవిని మాత్రమే అందించుచున్నాడని గ్రహింప వచ్చును. ఈ విధముగ ఒకరికొకరు సేవలు చేసికొనుచు ఆ దివ్య దంపతులు ప్రణయ జీవితమును సాగింతురని అన్నమయ్య భావము. శబ్దములతో చెక్కిన శిల్పము వలె, అక్షరములతో తీర్చి దిద్ద బడిన చిత్రలేఖనము వలె అన్నమయ్య ఈ విషయమును వర్ణించినాడు.

## సంవాదాత్మక వర్ణనలు

ఆయా వ్యక్తులకు జరిగిన సంభాషణలను మనోహరముగ వర్ణించినాడన్నమయ్య. ఈ సంభాషణలు వ్యంగ్యాత్మక ధోరణిలో, హాస్యయుతముగ, ఆయావ్యక్తుల వాక్చాతుర్యముతో సమర్థవంతముగ వర్ణింపబడినవి. ఒకరిని మించి మరొకరు తమ వాజ్నైపుణ్యమును ప్రదర్శించుటకు ప్రయత్నించినట్లు వర్ణించినాడు. ఆయా వ్యక్తులకు జరిగిన సరస సంభాషణల వర్ణనల నిటు గమనింపవచ్చును.

## శ్రీ వేంకటేశుడు—గోపస్త్రీ

సంభాషణాత్మక వర్ణనలలో శ్రీ వేంకటేశునకు గోపస్త్రీకి జరిగిన సంభాషణ లెక్కువగా ఉన్నవి. వేంకటాద్రి బాలుడు గోపస్త్రీతో తన తపస్సేమియు లేదని పలుకు చున్నాడు. ఆ వర్ణన మిటున్నది.

"లలిత :— ఏలే మాకుఁ బాలు లేవటే గొల్లెతా—నీకు
నేలలేవు మమ్ము నిట్టె యేఁచేవు గాక
పాలనేఁ బందుటఁ దలంపవే గొల్లెతా ఆ—
పాలు నీకు నేల మాపాలే కాక బాలుఁడా
కల్లలాట దొర కొంటిగా గొల్లెతె—యేల
పల్లదాలు వేంకటాద్రి పై బాలుఁడా
చెల్లబో నన్నొల్లవటే చిన్ని గొల్లెతా—నీకు
జెల్లు నిట్టె యేమైనఁ జేయవయ్య బాలుఁడా" (12–105)

— శ్రీ వేంకటాద్రి పై వెలసిన గోప బాలునికి గోప బాలికకు జరిగిన సంభాషణ యిది. వాదములో బాలునితో పోటీకి తట్టుకొనలేక చివరగ 'ఏమి చేసినను నీకు చెల్లు బాటగునని' బాలిక పలికినది.

వేరొక సంకీర్తనమున తన యింటికి రావలసినదని గొల్లెత నాయకుడైన వేంకటేశుని ఆహ్వానించుచున్నది. ఆ వర్ణన మిటున్నది.

మతకారి గొల్లెతా మంకులాఁడి గొల్లెతా
రతులకు మా యింటికి రారా గొల్లఁడా
కత కారి వొత్త ఇట్టె కాన వచ్చెనే నేఁడు
చతురతలు మోమున జడిసే రానీకును ....
చనవరి గొల్లెతా చనవిమ్మా గొల్లెతా ....
కెలయక శ్రీ వేంకట గిరి గొల్లడా ...." (25–13)

వేరొక సంభాషణాత్మక వర్ణనలో నాయికా నాయకులు ఒకరిని మించి మరొకరు తమ మాటల మాధుర్యమును వ్యక్తము చేయు చున్నారు. నాయిక ఒకటి పలుకగా దానిని కప్పిపుచ్చి నాయకుడు వేరొకటి పలుకుచున్నాడు. ఆ వర్ణన మిట్లున్నది

''నాట :- మేలురా నీ కతలకు మెచ్చితినేను
మేలము లాడితి నీవు మెచ్చులాఁడి వంటానే ॥పల్లవి॥
వెన్నలేల తీసేవురా చిన్నవాడా నీ—
చన్నులపై వయ్యదేల జారెనే నీకు ........
పుట్టు లేల యెక్కేవురా పుట్టండీఁడా చక్క—
గట్టు కొనె పోఁకముడి కదలెనీకు
వొట్టుక నేనొకటంటే నొకటాడేవు అది
తొట్టి రతుల సిగ్గుల దొడ్డి యంటానే — ॥మేలు॥ (24-186)

— ఇందు నాయకుని వాక్చాతుర్యమును నాయిక మెచ్చుకొనుచున్నది. అందువలననే 'మేలురా నీ కతలకు మెచ్చితి నేను' అని పలికినది. ఉట్టు లెందు కెక్కితివని అడుగగా గట్టిగ పోకముడి కట్టుకొనుమని తన వాక్చాతుర్యమును ప్రకటించుచున్నాడు. అంతేగాక ఇంటిలోని కెంటుకు ప్రవేశించితివని నాయిక అడుగగా ఒంటిగా నుంటినని పలికితివిగా యని సమాధాన మిచ్చినాడు. నాయిక ఇకనేమి మాటాడగలదు ? అందువలననే ప్రశంసించినది.

వేంకటేశుడు — ఎఱుకత

''ముఖారి :- ఎందుకైనాఁ జెప్పేవటే యెఱికత నీవునాకు
యెందుకైనా నోపుదువు యెఱుఁగుదుఁ బదరా ॥పల్లవి॥
మేలుకుఁ జెప్పేవటే మింద యెఱికత నీవు
మేలుసేసితివి రాసీ మీఁదనే నీవు
యేలు భూమికిఁ జెప్పేవా ఇంకా యెఱికత నీవు
యేలు కొంటి భూమిసిరి నాట తొల్లే కదరా ॥ఎందు॥
వచ్చే మీఁది పని చెప్పేవా యెఱికెత నీవు
వచ్చేది కాఁగిలేరా వంతుల నీవు .... ॥ఎందు॥ (28-109)

— ఈ రచనలో నాయిక ఏమియు చెప్పక నాయకుని తీసుకొని పోవుచున్నదని గ్రహింపవచ్చును. అమాయకుడైన నాయకుడు ఎందుకు తీసికొని వెళ్ళు చుంటివని నాయికను ప్రశ్నించినాడు. ఎందుకయినను నాయకుడోర్వగలడని నాయిక నమ్మక.

చివరగ ఏ పని మీద తీసికొని వెళ్ళు చుంటివని యడుగగ వచ్చెడి పని కౌగిలియని వంతు నాయకునిదని గడుసుదనమున నాయిక బదులు పలికినది. ఆ పలుకులకు సంతోషించుట కంటె నాయకుడేమి చేయగలడు ?

## వేంకటేశుడు - చెంచెత

శ్రీ వేంకటేశుడు నాయకుడుగ చెంచెత నాయికగా సంభాషణ సాగించిన వర్ణన మత్యంత మనోహరముగ ఉన్నది.

"సామంతం :— చెల్లెఁ గదె నీ మాట చెంచెత నీకు
చెల్లుబడిగల చోటఁ జెప్ప నేఁటి కయ్యా ॥పల్లవి॥
చిగురుఁ బయ్యెద యేలే చెంచత నీకు
చిగురు మాయడవిలో నేనా నేన
నిగురుఁ బసిఁడి చేల నీకేలయ్యా । మా
పగటు మెరుపు గొంత పసిఁడి రాలె ॥చెల్లె॥ (30-159)

— ఈ సంభాషణాత్మక వర్ణనలో నాయకుడు ప్రశ్నించినపుడు నాయిక సమాధానము చమత్కారముగా నొసగినది. చిగురు పయ్యెదనీ కెందులకని యడుగగ చెంచెతయైన నాయిక 'మాయడవిలో' అనగా ఆమె 'జవ్వన వనములో' అని అంతరార్థము ఆమె జవ్వనవనమందు కావలసిన చిగురున్నదట. పసిడి చేలము నీ కెందులకని నాయకుని ప్రశ్నించినపుడు పగటు మెరుపు కొంత పసిడిరాలెనని నాయకుని చమత్కార సమాధానము.

## వేంకటేశుడు - నాయిక

ఇంతకు ముందు వివరింపబడిన సంభాషణ వర్ణనలలో నాయిక పేర్కొనబడినది. అనగా గోపస్త్రీ, చెంచెత యిత్యాదిగా వివరింపబడినది. కాని కొన్ని వర్ణనలలో నాయిక పేరు ప్రస్తావింప బడలేదు. అందువలన ప్రత్యేకముగ పేర్కొనబడుచున్నది
"నాదరామక్రియః- కానీ కానీ లేవే కలిక—నే
పూని నీతోఁ బలికితే పూఁచి నీవు నగరా ॥పల్లవి॥
.... .... .... .... .... .... .... ....
కాఁగిలించే రావే కాంతా—తొల్లె
కాఁగిటనే వున్న దానఁ గదరా నేను ...." ॥కానీ॥ (26-216)

— కౌగిటి లోనికి రమ్మనిన నాయకునకు నాయిక చమత్కారముగ తొల్లి నీ కౌగిలి లోనే యుంటిని గదాయని పలికినది. మరి నాయకుడేమి మాటాడగలడు ?

అద్భుత భావుకుడైన అన్నమయ్య నాయికా నాయకులొకరి జాణతనముల నొకరు ప్రశంసించుకొను విధమును మనోహరముగ వర్ణించుచున్నాడు.

"ఆహిరి :- బోదువే జాణవు నీవు అన్నిటాను
సాదనా నీవును తొల్లె జాణఁడవురా ॥పల్లవి॥
ఆకసపుఁ గొలనిపై నంటుఁ దామరలు పుట్టె
యీకత చెప్పఁ గదవే యింతిరో నీవు
మే కొని మరువింటికి మిట్టె కోలలైయవి
కూకులు వతులుగా నీ గురి దాఁకురా ॥బోదు॥
అలరిన శశి బింబమందు తేనె పెరవుట్టె
కల విరుపఁగదే నిక్కముగా నీవు
చలమున నదియె చంద్రకళలోని తేటై
వెలకొన నీ నోరు నిండు కొనురా ॥బోదు॥....." (29–350)

— ఈ సంభాషణ వర్ణనలో అన్నమయ్య ప్రదర్శించిన భావుకత అనన్య సామాన్యము అపూర్వము. ఆకాశపు కొలనులో అంటు తామరలు పుట్టెననుట, శశిబింబమందె తేనె పెర పుట్టెననుట అన్నమయ్య ఊహాశక్తికి ఉన్నత పదవిని సంక్రమింప జేయుచున్నవి. కొలనులో తామరలు పుట్టుట సహజమే. కాని సుధాకరమగు శశిబింబము నందు తేనె పట్టున్నదని చెప్పి దానికి కారణము చంద్రకళలోని తేటయని పలికినపుడు సహృదయు లన్నమయ్య కల్పనా పటిమకు, వర్ణనా వైదగ్ధ్యమునకు జేజేలు పలుకక తప్పదు.

నాయికను వశీకరింప జేసి కొనిన నాయకుడు, వశీకృతమైన నాయిక పలికిన పలుకులను చమత్కారముగ వర్ణించుచున్నాడు.

"సామంతం :- అందుకంటినచే నీ యందము లెంచితిఁ గాక
చిందేటి నా మోహము నీచేతఁ జిక్కెఁ గదరా ॥పల్లవి॥
నడుము పిడికెఁ డంత నాతీనీ కుచములైతే
బడి నొకటే పట్టెఁ డంత

యెడ నాయంగములివి యెంత లెంత లైనాను
చిదుముడి నిన్నియు నీ చేతిలోనే కదరా ॥అందు॥ (30-213)

నాయిక శరీరమునందలి అవయవముల పరిమాణములంత విరుద్ధముగ నున్నవేమని నాయకుడు ప్రశ్నింపగ అవి యెంతలైనను నాయకుని చేతిలోనివే కదాయని నాయిక చమత్కారముగ సమాధానమిచ్చినది.

వేరొక సంకీర్తనమున వ్యంగ్యాత్మకమైన ధోరణిలో, హాస్య పూరిత వాతావరణములో నాయికా నాయకుల సంభాషణను వర్ణించుచున్నాడు.

"ముఖారి :- ఏమంటి వేమంటి వెఱ్ఱిగ నేను—వో
కామిని నీకిప్పుడైనఁ గాన వచ్చెఁగా ॥పల్లవి॥
వేలుఁదలుపు మీటిన విటుఁడెవ్వఁడే—వో
తాలిమి నేనే మాధవుఁడను
వాలిన మాధవుఁడ వంటే వసంతుఁడవా—కాదే
గాలింపు చక్రము చేతఁ గలవాఁడనేనే ॥ఏమం॥
ధర చక్రివైతేఁ గుమ్మరవాఁడవా—కాదే
సిరుల భూమి ధరించిన వాఁడనే
శిరసున భూమి మోఁచే శేషుఁడవా—కాదే
అరయ నిన్నియు నేలే హరినే నేను ॥ఏమం॥
వంతులకు హరివైతే వానరమవా—నే
మంతనపు లక్ష్మీ రమణుఁడ నేను—" ॥ఏమం॥ (27-48

— నాయిక ప్రశ్నలకు నాయకుడు సమాధానము చెప్పుచుండగా విపరీతార్థములు దీసి నాయిక పలుచుకున్నది. నాయిక చెప్పిన విపరీతార్థములు పాఠకులకు నవ్వు తెప్పింపక మానవు. స్వామితో చనవు బలసిన నాయిక మాత్రమే ఆవిధముగ మాటాడగలదు. ఈ సంకీర్తనమున స్వామితో చనవు బలసిన నాయికగా అన్నమయ్య సహృదయుల యెదుట సాక్షాత్కరించుచున్నాడు. శబ్ద చమత్కారముతో సాగిన ఈ వర్ణన మనోరంజకమై ఉన్నది.

## బావా - మరదలు

బావ మరదళ్ళ సరస సంవాదమును సరసముగ వర్ణించుచున్నాడు.

"పాడి ; ఏలే యేలే మరఁదలా చాలుఁజాలుఁ చాలును
చాలు నీ తోడి సరసంబు బావా ॥పల్లవి॥
గాఁటపు గుబ్బలు గదలఁగఁ గులికేవు
మాఁటల్ఁ జేటల మరఁదలా
చీటికి మాటికిఁ జెనకేవే వట్టి
బూటకాలు మానిపోవే బావ ॥ఏలే॥
.... .... .... .... .... .... .... .... .... ....
సొక్కపు గిలిగింత చూపుల నన్ను
మక్కువ చేసిన మరఁదలా
గక్కున నను వేంకటపతి కూడితి
దక్కించు కొంటివి తగులైతి బావ ॥ఏలే॥ (12_163)

— గిలిగింత చూపులతో మక్కువ చేసిన మరదలు నాయకుడైన వేంకట పతిని గూడినది. నాయిక 'గక్కున నను వేంకట పతి కూడితివి, దక్కించు కొంటివి' అని పలికినది.

## వదినె — మరది

వదినె మరదుల సంభాషణ వర్ణన మిట్లున్నది.

"శ్రీ :- వొగ్గి నా మాట వినవేవో వదినె
శిగ్గరి మరందివని చెవులు సోకవురా ॥పల్లవి॥
వొద్దకి వత్తునట వేవో వదినె_వోరి
పొద్దువోని మరందివి పొసంగదురా
గద్దించకువే నందె కాద వదినె
ముద్దుల మరంది లింత మ్రొక్కడమేమిటికిరా ॥వొగ్గి॥" (3_144)

— తన మాట వినవలసినదని అడుగుచున్న మరదికి సిగ్గరి మరదివి కాబట్టి 'నీ మాటలు చెవులు సోకవని పలుకుచున్నది. వదినె వద్దకు వచ్చెదననుచున్న మరదిని కుపపొలు గనినదచున్నది.

## అత్తా కోడలు

అత్తా కోడళ్ళ సరస సంవాదమును చక్కగా వర్ణించుచున్నాడన్నమయ్య. ఒకరిని మించి మరొకరు తమ వాక్చాతుర్యము— నీ విధముగ ప్రదర్శించుచున్నారు.

"పాడి :— రావే కోడల రట్టడి కోడల
పోవే పోవే అత్తయ్యా పొందులు నీతోఁ జాలును ॥పల్లవి॥
రంకెలు వేయుచు రాజు లెదుట నీవు
కొంకు గొసరు లేని కోడల
పంకజముఖి నీవు పలుకొద్ద వారిండ్ల
అంకెలఁ దిరిగేవు అత్తయ్యా ॥రావే॥
ఈడాడ నలుగురు నేగురు మొగలతో
కూడి సిగ్గు లేని కోడల
వాడకుఁ బదుగురి వలపించు కొని నీవు
ఆడాడఁ దిరిగేవు అత్తయ్యా ॥రావే॥
బొడ్డునఁ బుట్టిన పూఁ పనికే నిన్ను
గొడ్డేరు తెస్తినే కోడల
గుడ్డము పయినున్న కోనేటి రాయని-
నడ్డగించు కొంటి వత్తయ్యా ॥రావే॥ (12-313)

— లక్ష్మీ సరస్వతుల సరస సంభాషణ యిది. ఒకరి గుణముల నొకరు విమర్శించు కొనుచున్నారు. అత్తను మించిన కోడలు ఈ సంభాషణ వర్ణనలో సాక్షాత్కరించు చున్నది. 'రావే కోడల' అని లక్ష్మీదేవి పలుకగా 'పోవే పోవే అత్తయ్యా' అని సరస్వతి పలికినది. అత్త ఒక్కసారి 'రావే' యనగా కోడలు రెండు సార్లు 'పోవే' అన్నది. ఈ విధముగ పరిశీలించినపుడు సంభాషణాంతము వరకు సరస్వతి వాక్చాతుర్య మద్భుతముగ గోచరించుచున్నది. అవుని మరి పలుకుల తల్లి కదా ! సులభమైన పద జాలముతో సుస్పష్టముగ అర్థమును ప్రసాదించు శబ్దములతో చక్కగా సాగిన సంభా షణాత్మక వర్ణనమిది.

## సవతుల సంవాద వర్ణన

శ్రీ వేంకటేశుని నాయిక లిద్దరి మధ్య సరసముగా సాగిన సంభాషణాత్మక వర్ణన మిట్లున్నది.

"ఎంత నీవు పోతరించి యింపులఁ బెనఁగినాను
వంతులఁ గొంగు వట్టితి వదలకు మనవే ॥పల్లవి॥
కాతరించి రమణునిఁ గల కాలమెల్లా నీవే
చేతఁ జొక్కించు కొంటివి చెప్పేదేమే
యీతల నాతఁడే మాయింటికి విచ్చేసెనేడు
నీతితో ద నిలువక నేనేల విడుతునే ॥ఎంత॥
బలిమితో మగవాని బాసలు చేయించుకొని
యెలయించికై కొంటివి ఇంకానేమె
వలపించి యాతని నా వద్దకి రప్పించు కొంటి
వెలయ భోగించక నీ వెంట నేలంపుదునే

— ఇంకను 'శ్రీ వేంకటేశుని కౌగిట రతులు పొంది యందరిలో మెరసితివేమే' యని యడుగగా 'ముందు ముందె యాతని మోవితేనె పొందితినిగాన పెండ్లాడక మానుదునా' యని సమాధాన మిచ్చినది.

## రాయబార వర్ణనలు

ఒకరి యెడ బాటు నోకరు సహింపలేక పోయిన నాయికా నాయకులు తమతమ సందేశములను చెలిగత్తెలద్వారా పంపుచున్నారు. చెలికత్తెలు రాయబారములు నడిపిన సందర్భమున నాయిక సందేశమును నాయకునకు, నాయకుని విన్నవములను నాయికకు విన్నవించుచున్నారు. ఆ వర్ణనల నిట్లు చెప్పవచ్చును.

తన సందేశమును వినిపింపుమని నాయిక చెలులతో పలుకుచున్నది.

"ఆహిరి :– మరుతంత్రములోన మరఁగేఁటికి
శిరసు వంచి మొక్కెనని చెప్పరే యాతనికి ॥పల్లవి॥
తమి యేల రేఁచీనే తరి తీపేల సేసెనే
సముకాన నున్న దానఁ జనవరిని
కొమరె వయను దానఁగుదురు కౌనె వలపు
చెమటలు మేన నిండెఁ జెప్పరే యాతనికి ॥మరు॥ (24–84)

— అని పలుకుచు ఇంకను చెలిమి చేసిన దానను గాన సేవ చేసెదనని చెప్పి పంపు

చున్నది 'మరుని తంత్రములలో మరగెందులకని' తాను చెప్పదలచుకొన్న విషయము లనన్నిటిని చెప్పి పంపినది. ఈ సందేశమును చెలి నాయకునికి పూర్తిగా వివరించి యుండును.

వేరొక సంకీర్తనమున రాయబారమునకు పోయిన చెలి, నాయిక చెప్పిన సందేశమును పూర్తిగ నాయకునకు విన్నవించి వచ్చినది. ఆ సమయమున నాయిక తన సందేశమును 'సరిగా వినిపించితివా' యని చెలితో పలికి తాను చెప్పి పంపిన విషయ యమును మరల యిట్లు పలుకుచున్నది.

"మంగళకౌసిక ; అంగన నాపతి తోడ నంటివా నీవు
అంగడి కెక్కె వలపు లంటివా నీవు ॥పల్లవి॥
చేతుల మొక్కితినని సిగ్గుతో నుందాననని
.... .... .... .... .... .... ....
నాతలఁ పెఱుఁగుమని నమ్మితి నన్నిటాననని
.... .... .... .... .... .... .... .... ....
నానితిఁ జెమట నని నవ్వులకు లోనని
.... .... .... .... .... .... .... .... ....
వీనుల నాలించుమని విన్నపములి వేయని .... (29-191)

— పలికితివి గదాయని చెలిని వివరమడిగినది.

వేరొక సంకీర్తనమున నాయకుడు తనపట్ల నెరపిన కృత్యములను చెలికి వివరించుచు ఆనాయకునకు తనపట్ల ప్రియము గలిగిన పెండ్లాడు మని పలుకమనుచు చెలిని పంపుచున్నది.

"కాంబోది :— ప్రియము గలిగితే పెండ్లాడు మనవే
నయగారి వాఁడు తాను నన్నేల తడవనే ॥పల్లవి॥
చిన్నదాన నన్నునేల సిగ్గు వరచీనే తాను
చన్నులేల ముట్టీనే సారె సారెకు
కిన్నర వాయించ వచ్చీ కేలు మోగిచితే నన్ను
నన్నలనే మోవి చూపి జాణత నాలాడీనే ॥ప్రియ॥" (28-482)

నాయకునిపై గల అనురాగముతో నాయిక ఏ విధముగ ప్రవర్తించుచున్నదో కార్యభారము నెరప వచ్చిన చెలులు నాయకునితో విన్నవించుచున్నారు.

"శ్రీరాగం :- ఎంతని చెప్పేము నీకు యింతి నీపైఁగల బత్తి
చెంత నీవే చూతువు విచ్చేయవయ్యా ఇంటికి ॥పల్లవి॥
తరుణి ని రూపము తలపోసి తలపోసి
శిరసూఁచి మెచ్చి మెచ్చి చెంగలించును
గరిమ నీ విచ్చిన వుంగరము తప్పక చూచి
మరగి సంతోసాన మనసు గరఁగును ॥ఎంత॥ (29_53)

— ఇంకను ఆ నాయిక నాయకుని సుద్దులను చెలులచే చెవులార విని సెలవివార నవ్వునట. నాయకుడు పంపిన చిలుకతో మాటలాడి వేడుకలతో విఱ్ఱవీగుచున్నదట, నాయకుని రాకకు ఎదురు చూచిచూచి వచ్చుననెడి యాశతో ఆనందించుచున్నదట.

నాయకుని వినయములను చెలులు నాయికతో పలుకుట

"పాడి :— విభుని వినయములు వినవమ్మా నిను
నభియం బడిగి నయ్యోతాను ॥పల్లవి॥
రహస్యమున శ్రీ రమణుడు పంపిన
విహరణ లేకలు వినవమ్మా ........
ఆదిమ పతి నీ యడుగుల కెరగిన
వేదాంత రచన వినవమ్మా ........
కింకరుఁడట నీ కినుక సేతలకు
వేంకట పతి గతి వినవమ్మా ........ ॥విభు॥ (12_308)

— వేంకట పతి సన్నిధి నుండి వచ్చిన చెలులు నాయికకు విభుని వినయములను వివరించుచున్నారు. నాయిక 'కినుక సేతలకు' కింకరుడైన నాయకుడు పంపిన రహస్యపు లేఖల నందించుచున్నారు.

నాయకుని పనుపున వచ్చిన వానితో నాయికలు పలుకుట.

"సామంతం ; ఒద్దేల మొక్కేవో వుద్ధవుఁడా—తన
ఉద్దండాలె చెల్లె నుద్ధవుఁడా ॥పల్లవి॥

ఊరూర వలపులుద్ధవుఁడా నే
మోరుతుమా యిక నుద్ధవుఁడా ...
ఒప్పులర మా పురిసిన పుం
డ్లుప్పులు పెట్టించె నుద్ధవుఁడా ....
గోపికలమమ్ముఁ గూరిమిఁ జిక్కించె
నోపమింతేసి నే ముద్ధవుఁడా ॥ఒద్దే॥
తెగి తన్నుఁ గూడే తెరఁగు దలఁచి
యుగములైనవి ఉద్ధవుఁడా
పగటున మామా ప్రాణము మాకిఁక
నాగరే తీపాయె నుద్ధవుఁడా .... ॥ఒద్దే॥ (12—56)

— వేంకట కృష్ణుని రాయబారిగా వచ్చిన ఉద్ధవునితో గోపికలు పలుకుచున్నారు. ఆ నాయకుడు తమ ప్రేమ యనెడి పుండ్లపై ఉప్పు పెట్టించినాడట. తమ తాపము ద్విగుణీ కృతమైనదని వారి భావము. అంతే కాదు ! ఆ నాయకుని కూడెడి పద్ధతిని తలచి యుగములైనవని పలుకుచున్నారు.

## దూతీ ప్రబోధము

నాయికా నాయకుల సందేశములను ఒకరివి మరొకరి వినిపించుటకు వినియోగింపబడిన దూతికలు ఆయా సందర్భములందు వారికి బోధలు చేసినారు. ఇంతకు ముందు ప్రసంగ వర్ణనలలో, రాయబార వర్ణనలలో నాయికా నాయకులతో దూతికలు ప్రసంగములు వివరింపబడినను ఆయా సందర్భములందు నాయికా నాయకులకు దూతికలు ప్రబోధము చేసిన విషయములు ప్రస్తావింప బడలేదు. వానినిక్కడ ప్రస్తావించుట సముచితము.

## దూతికలు నాయకునితో

వింత వింత పనులను చేయుచున్న నాయకునికి దూతికలిట్లు చెప్పుచున్నారు.

"ముఖారి :— అందుకే పోసీ వద్దికప్పటి నుంటి రాదు
కందువకే విచ్చేసి కైకొనుమీ చెలిని ॥పల్లవి॥
మేకత మాదే నంటా నింతి దగ్గరఁ బిల్చి

కాను మాటలాడి తట కలదా ఇంత
ఆను మది చిమ్మంటా నందుకోఁ బోయి గోర
రేకలంటించి తివట రీతిగాదు సుమ్మీ ॥అందు॥ (28-140)

— నాయకుడు నాయిక పట్ల సరిగా ప్రవర్తించుటలేదట. అందుకే ఆయన వద్దకు వచ్చుట లేదట. అందువలన నాయకుని ప్రవర్తనను మార్చు కొనుమని దూతికలు ప్రబోధించుచున్నారు.

నాయిక సింగారించు కొనుచున్నది. ఆ సింగారము పూర్తి గాక మునుపే నాయకుడు శృంగారము గావించుచున్నాడు. ఆ విధముగ ప్రవర్తించ వలదని దూతిక బోధించుచున్నది.

"మాళవి :- సింగారించు కోనీ రాదా చెనకే విప్పుడే వచ్చి
అంగన నీ చేఁతలకు నోఁగా దనఁజాలదు ॥పల్లవి॥
సుదతి యద్దము చూచి చుక్క బొట్టు పెట్టుకోఁగా
వుదుటున నిప్పుడే వొడి వట్టేవు
పొదిగి కొప్పు నిండా పూవులు ముడుచుకోఁగా
చదురు లాడుత వచ్చి చన్నులంటేవు ॥సింగా॥...." (28-168)

— అంతేగాక కామిని కనుగొనలకు కాటుక పెట్టుకొను చుండగా ప్రేమతో తమ్ములము పెట్టుజకు వచ్చినాడట ఆ చతురుడైన నాయకుడు ।

కోరికతో వచ్చిన కోమలిని ఆదరింపుమని నాయకునికి దూతికలీ క్రింది సంకీర్తనమున బోధించుచున్నారు.

"సాళ ;— ఏమి నవ్వులు నవ్వే వెటిఁ గెటిఁ గుండి నీవు
కాముకురాలైన దానిఁ గాఁగిలించరాదా ॥పల్లవి॥
చెక్కుటి చెమట తోడ చెలినీ వద్దకి వచ్చె
వుక్కు మీరి చనుఁ జన్ను నొరయఁగాను
మొక్కుడైన యాసలతో నెదుట నిలుచున్నది
గక్కన నలపు దీరఁ గాఁగి లించరాదా ॥ఏమి॥" (28-375)

—కోరికతో వచ్చిన కోమలిని గూర్చి నాయకునకు తెలియునట। అందులకే నవ్వులు రువ్వుచున్నాడు. ఆనాయికను గూర్చి పైపైన తెలిసియుండుటగాదు 'ఎఱిగి యెఱిగి' యున్నాడట. అనగా బాగుగా తెలిసికొని యున్నాడని గ్రహింపవచ్చును. నాయకుడు తెలిసికొనిన ఆ నాయిక ఏవిధముగ ఉన్నది? కాముకురాలై యున్నదట. అందువలననే అదనెరిగి యాదరించుమని మాతికలు నాయకునకు బోధించుచున్నారు.

వేరొక సంకీర్తనమున నాయిక సౌందర్యమునకు ముగ్ధుడైన నాయకునకు మాతికలు బోధించుచున్నారు. ఆవర్ణన మిట్లున్నది

"మాళవి గౌళ :— కన్నె చక్కనిదంటాను కడుఁగడుఁ బొగడేవు
వన్నెగా పటము మీఁద వ్రాసుకోవయ్యా
.... .... .... .... .... ... .... .... ....
చెలికొప్పు మూరెఁడంటాఁ జేరి చేరి కొలిచేవు
పిలిచి ముత్యాల సేస పెట్టవయ్యా........" (28-344)

—కన్నె చక్కదనమును ప్రశంసించుటకంటె ఆమె సౌందర్యమును మనసనెడి పటముమీద వ్రాసికొనుమని మాతిక హితవు పలుకుచున్నది. అంతేగాక సుందరమైన వదనమును చూచుటకంటె వేయిమారులు తలపోసి కొనుమని పలుకుచున్నది.

తనను చూచుటకు వచ్చిన నాయికను కాపురములుచేయమని నాయకుడు పలికెనట. అవిధముగ పలుకుట ఉచితమాయని చెలి ప్రశ్నించుచు నాయకుని అట్లు మెలగ వలదని హితవు చెప్పుచున్నది.

"చూపుల వేడుక నిన్నుఁ జూడవచ్చిన దాని
కాపురాలు సేయమంటాఁ గాఁ తాళించేవు
యేపుమీర నిన్ను సుద్దు లిట్టెయడిగేటి దాని
చేపట్టిమోవెల్ల గంటి సేసేవునీవు...."(28-495)

....ఇందలి నాయకుడు వేడుకగా చూడవచ్చిన నాయికను కాపురములు చేయమని 'కాతాళించుచు' సుద్దులడుగ వచ్చిన సుదతి మోవెల్లగంటి చేసినాడట. అట్లుమెలగుట యుచితమా యని దూతి ప్రబోధము.

మృదు స్వభావము గలిగిన నాయిక ప్రౌఢనాయకుడు చేసెడి పనుల కోర్వలేక పోవుచున్నదట। అందువలన చిన్నదాని పట్ల అవిధముగ ప్రవర్తింపవచ్చునాయని చెలి యడుగుచున్నది. అంతేగాదు అట్లుచేయవలదని బోధించుచున్నది.

కన్నుల నవ్వులు దేరీ కాంత నేమేమి సేసితో
పన్నిన యేకత పేఁ బానుపు మీఁద
కిన్నెరకాయ చన్నులు గిజి గిజాయ నిదివో
కన్నె ఇంత తొలుసారేకడుఁ బచ్చిసేతురా...."(58-145)

....పచ్చిపచ్చిగా ప్రవర్తించినచో నాయిక నిలువలేదట. ఎందువలన? కన్నెగావున. అదియును తొలిసారిగావున నాయకుడెట్లుప్రవర్తించినను నాయిక మాత్రము సంతోషించినది. అందువలననే 'కన్నుల నవ్వుల దేరు'చున్నదట. మాటలతో ఆ సంతోషమును ముగ్ధయైన నాయిక వెల్లడించుటలేదు. కన్నులతో మాత్రమే తెలియ చేయుచున్నది. కిన్నెరకాయ చన్నులు 'గిజి గిజి'యైనవి గనుక నాయకుని అట్లు ప్రవర్తింపవలదని మాతిక బోధించుచున్నది.

## మాతికలు నాయికతో

నాయిక అసలే చక్కనిదట. అందునను అలంకరించుకొనినదట. అందువలన దిమ్మరివలె తిరుగవద్దని చెలి బోధించుచున్నది.

"శంకరాభరణం :- దిమ్మరివలెనిటుఁ దిరుగకువే

చిమ్ముల వంపు నీపైఁ జిలికించీఁ గృష్ణుడు ॥పల్లవి॥
మెల్లనేవుద్దాలు వెట్టి మీరిన తురుము వెట్టి
తెల్లని ముత్యాలు గట్టి తిరుగకువే ......" (12-270)

....ఇష్టము వచిననట్లు తిరుగుట మంచిదికాదని అవిధముగ తిరిగినచో శ్రీవేంకటాద్రి ఘనుడు కౌగిద పెట్టునని చెలిపలుకుచున్నది. శ్రీవేంకటాద్రి ఘనుడు చిలిపివాడు. అందముగ ఉన్న నాయికను కౌగిట బెట్టకమానడు. అందువలననే చెలి బోధించుచున్నది. కాని ఆ నాయిక శ్రీవేంకటాద్రిఘనుని సన్నిధి చేరుటకే యట్లు తిరుగుచుండెను కాబోలు కాని అమాయకయైన చెలిఆవిషయమును గ్రహింపలేక నాయికకు హితపు చెప్పుచున్నది.

నాయిక నాయకుని ధ్యానములో మునిగిపోయినది. ఆమె తలపులు పండి నాయకుడు వాకిట నిలిచినాడు. ఆ సందర్భమున నాయికకు చెలి బోధచేయుచున్నది. ఆవర్ణనమిట్లున్నది.

"చెక్కుల వెంటగారే చెమట దుడుచుకోవే
యెక్కడలేని విరహమేల పెంచేవు
చిక్కుపడ్డ నెరిగొప్పు చక్కఁబెట్టుకోఁగదవే
పక్కనవాకిటి కి నీ పతి వచ్చినాడు" (28–262)

....ఇందలి నాయికకు విరహాగ్నిలో చెమటలు పుట్టినవి. నాయకుని కలయవలెనన్న ధ్యానములో చిక్కుపడ్డ కొప్పును చక్కదిద్దుకొనలేదు, అందువలనతే చెలి బోధించినది. ఇంకను జారిన పయ్యెద చక్కబెట్టి కస్తురి బొట్టునిద్ది నేరుపు లెల్లమెరయునట్లు సింగారించుకొనుమని హితవు పలుకుచున్నది.

ఇతర పట్ల ఏవిధముగ అనుకూల వతియై మెలగవలయునో దూతికలు యికకు బోధించుచున్నారు.

''గౌళ :– నేరుపే నిధానము నెలఁతలకు
తారుకాణ నామాట తలఁచుకోవే ॥పల్లవి॥
వినయములేపేసి వేడుక పుట్టించితే
మనసు గరఁగు నిట్టె మగవానికి
యెనయఁ గొలువుసేసి ఇచ్చకమే నెరపితే
ననుపులు సమకూరు నాయకునికి ॥నేరు॥" (29–26)

–అంతేగాక యకుడు చెప్పినట్లుచేసి పాయసప్పుడో కాంతునికి తమకముకప్పుకొనునట. నేర్పరితనముతో నవ్వులు నవ్వి సరసము లాడినచో రతుల కాంక్షలు రమణునికి పుట్టునని పలుకుచున్నారు. నెలతలకు నేరుపే నిధానమట. అందులకు చెలిపలుకులే తార్కాణమట. ఈ యర్థములు గల పల్లవి అత్యంత సమర్థవంముగ రచింపబడి సంకీర్తనమునకంతటికిని శోభ గూర్చినది. ఈ సంకీర్తనమునందలి ప్రబోధము కేవలము ఒక్క నాయికకే గాదు అనుకూలముగ మెలగవలసిన ప్రతి సతికి వర్తించును.

దూతిక చెప్పినట్లే నాయిక ప్రవర్తించినది అమెయనుకూల వర్తనకు మెచ్చి నాయకుడామెనాదరించినాడు. ఆ సంతోషముతో తనమేనిపైని సంభోగపు గుర్తులను చక్కదిద్దుకొనకయే తిరుగుచున్నది. అందువలన దూతిక నాయికకిట్లు బోధించుచున్నది.

"ముఖారి :– మరివెనక నాతోను మాటలాడుదువుగాని
గుఱుతులు దాఁచుకోవే కొమ్మలు నవ్వేరు ॥పల్లవి॥

పిక్కటిల్లఁ జన్నులపై పెనుగొన్నహారాలు
చిక్కువడీ దిద్దుకోవే చక్కఁగానీవు
చుక్కబొట్టు చెమటలఁ జొబ్బిలఁగాఁ గరఁగెను
గక్కన నద్దము చూచి గందము వెట్టుకోవే ॥మతి॥" (29-46)

—చెలిపలుకుల కనుగుణముగ ప్రవర్తించిన నాయికను నాయకుడాదరింపగా ఆవిషయము చెలికి తెలుపుటకు తొందరపడుచున్న నాయిక తన మేని సంభోగపు గుర్తులను పక్కబెట్టుకొనలేదు. ఆ సంతోషమంతటిది. అందువలన నాయికస్థితిని గమనించిన చెలి తనతో తరువాత మాటలాడవచ్చునుగాని ముందుగా గుర్తులను సరిదిద్దుకొనుమని పలుకుచున్నది. ఎందుకా నాయిక గుర్తులను సరిదిద్దుకొనవలెను? గురుతులను దాచుకొనక పోయినచో కొమ్మలు నవ్వుదురట। అందువలన గుర్తులను చక్కదిద్దుకొనుమని హితవు చెప్పినది. నాయిక ఏయే గుర్తులను సరిదిద్దుకొనవలెనో చెలిపలుకుచున్నది. పిక్కటిల్లు చన్నులపై పెనుగొన్న హారములను సరిదిద్దుకొనవలెనట: చెమటలలో చుక్కబొట్టు కరగిపోగా అద్దము చూచి గంధము పెట్టుకొనవలెనట, అంతేగాదు కొప్పులోని సంపెంగలు జారుచుండగా తురుమును ముడుచుకొనుమని కట్టిన చీర వదలుకాగా పోకముడి కానవచ్చుసందర్భమున వడ్డాణమును బిగించుకొనుమని హితవుపలుకుచున్నది.

అన్నమయ్య శృంగార సంకీర్తనములందు గావించిన వర్ణనలు స్థూలముగ వివరింపబడినవి. అన్నమయ్య సంకీర్తనములన్నియు ఆయన గావించిన బహుముఖీనమైన వర్ణనా నైపుణ్యమునకుదాహరణ యోగ్యములే. సంయోగ వియోగ శృంగార సంబంధులగు విషయములను వర్ణించుటపట్ల అన్నమయ్య ప్రదర్శించిన వర్ణనా నైపుణ్యమనన్య సామాన్యము అనితరసాధ్యము. ఆయన ప్రదర్శించిన భావములపూర్వములు. తరువాత ఆయన ఆధ్యాత్మిక వర్ణనా ప్రపంచమున విహరింపవచ్చును.

## ఆధ్యాత్మిక వర్ణనలు

ఆధ్యాత్మిక సంకీర్తనములనుగూర్చిన వివరణము పూర్వోక్తము. ఆధ్యాత్మిక సంకీర్తనములలో అన్నమయ్య ప్రయోగించిన భాష ఉదాత్తమైనది. దేహము-జీవుడు-దేవుడు మొదలగువిషయములకు సంబంధించిన అనేకాంశములు అన్నమయ్య ఆధ్యాత్మ సంకీర్తలములందు వర్ణింపబడెను. అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనములను గూర్చి "శరీర జీవాత్మ పరమాత్మల చర్చయే ప్రధానముగా వేదాంతమునకు సంబంధించినవి. తక్కిన లోకనింద మొదలైనవి. తనకున్న విరక్తికి సూచకములుగా, హేతువులుగా

మాత్రమే ఉపయోగపడుచుండను. జన్మము, మరణము, జ్ఞానము ఇవన్నీ అన్నమయ్య కీర్తనములలో విపులముగ చర్చింపబడినవి. ఈ దేహాత్మిక చర్చ అన్ని వేదాంతములకును సమమైనను ముక్తిస్వరూపము. దానికి సంబంధించిన సాధన సంపత్తి మాత్రము ప్రతి మతమునందును భిన్న భిన్నముగ మారుచుండును మతములెన్నియో పుట్టినవి పుట్టుచున్నవి. చచ్చినవి చచ్చుచున్నవి. కాని శ్రుతి స్మృతి ప్రమాణబలముతో నిలిచిన మతములు ద్వైతాద్వైత విశిష్టాద్వైతములు మూడే. జీవాత్మ పరమాత్మలు శాశ్వతముగ వేరువేరని చెప్పినది ద్వైతము. జీవాత్మ పరమాత్మలకు దశాభేదమేకాని వస్తువు ఒక్కటే అనునది అద్వైతము. జీవాత్మ పరమాత్మలు ఒక్కటే అయినను వాటిసంబంధము శరీర శరీరి భావముతో కూడినది. శరీరి ప్రధానము. శరీర మప్రధానము శరీరము శరీరిని ఆశ్రయించి యుండునది అని చెప్పునది విశిష్టాద్వైత సిద్ధాంతము. ఇదియే అన్నమయ్య మతము."[6] అని గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి వివరణ.

ఆధ్యాత్మిక సంకీర్తనములందు స్వామికిసంబంధించిన అనేకాంశములు వర్ణింపబడినవి. వేంకటేశుని అనంత కళ్యాణ గుణ వైభవములను తనివితీర వర్ణించినాడు. ముందుగ సంకీర్తన మాహాత్మ్యమును గూర్చి అన్నమయ్య వర్ణించిన రీతినితెలిసికొనుట సముచితము.

## సంకీర్తన మాహాత్మ్యము

తనకు పూర్వమాంధ్ర సాహిత్యమున లేని వినూత్న ప్రక్రియను సృష్టించిన ఘనత అన్నమయ్యకే దక్కినది. సంకీర్తన సాహితీ స్రష్టయగుటయే గాక అసంఖ్యాకముగ సంకీర్తనములను రచించి సంకీర్తనాచార్యునిగ ప్రసిద్ధిపొందినాడు. సంకీర్తనమాహాత్మ్యమును అన్నమయ్య వర్ణించిన తీరునిట్లు గమనింపవచ్చును.

"సామంతం :— చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడగించు సంకీర్తనం ॥పల్లవి॥
సంతోషకరమైన సంకీర్తనం
సంతాపమణగించు సంకీర్తనం
జంతువుల రక్షించు సంకీర్తనం
సంతతం దలచుడీ సంకీర్తనం ॥చాలి॥
సామజముగాచినది సంకీర్తనం

సామమున కెక్కుడీ సంకీర్తనం
సామీప్యమిందరికి సంకీర్తనం
సామాన్యమా విష్ణు సంకీర్తనం ॥చాలి॥
జము బారి విడిపించు సంకీర్తనం
సమబుద్ధి వొడమించు సంకీర్తనం
జమళి సౌఖ్యములిచ్చు సంకీర్తనం
శమదమాదులఁజేయు సంకీర్తనం.........॥చాలి॥" (1-347)

—ఈ సంకీర్తనమున అలతియలతి పదములతో సంకీర్తన మాహాత్మ్యమును అన్నమయ్య చక్కగ వర్ణించినాడు.

సంకీర్తన మాహాత్మ్యమునుగూర్చి వేరొక సంకీర్తనమున

"తలఁప వేదశాస్త్రములు గానక
అలరుచు వాల్మీకాదులు
తలకొని హరి మంత్రమె దగఁ బేరుకొని
అలవిమీరఁగడు నధికులైరి" (1-205) అని వర్ణించినాడు.

— వేదశాస్త్రములను గానక వాల్మీకి మొదలగువారు హరి సంకీర్తనమును గావించి కీర్తి ప్రసిద్ధి పొందినట్లు వర్ణించినాడు. ఈ సంకీర్తనమునసేకాంకను

"యితర దైవముల నెఱుఁగనేరక
ప్రతిలేని మహిమఁ బార్వతి
మతి దలఁపుచు హరిమంత్రమె పేర్కొని
సతతము హరులో సగమై నిలిచె" అని వర్ణించినాడు.

హరి వాసము

శ్రీవేంకట నిలయుని నివాసమునుగూర్చి యిట్లు వర్ణించుచున్నాడు.

"శ్రీరాగం :- అదివో అల్లదివో హరివాసము
పదివేల శేషుల పడగల మయము ॥పల్లవి॥
అదె వేంకటాచల మఖిల మున్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివోనిత్య నివాసమఖిలమునులకు
నదెచూడుఁ డదె మొక్కుఁడానందమయము ॥అది॥

వెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము ॥అది॥
కైవల్య పదము వేంకటనగమదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకల సంపదల రూపమదివో
పావనములకెల్లఁ బావన మయము ॥అది॥ (1–23)

—ఈ వర్ణన కన్నులకు గట్టినట్లు, హృదయమునకు హత్తుకొనునట్లు ఉండుట. అన్నమయ్య వర్ణనా నైపుణ్యమునకు, హరివాసముపై ఆయన మనసు నిమగ్నమైన తీరునకు చక్కని నిదర్శనము

## స్వామివారి సర్వాంతర్యామిత్వము

జగమంతయు వ్యాపించియున్న శ్రీవేంకట నిలయుని సర్వాంతర్యామిత్వము నిట్లు వర్ణించుచున్నాడు.

"బౌళి ;— ఎవ్వరిఁ గాదన్ననిది నిన్నుఁ గాదంట
యెవ్వరిఁ గొలిచిన నిది నీ కొలువు ॥పల్లవి॥
అవయవములలో నదిగాదిదిగా
దవిమేలివి మేలననేలా
భువియుఁ బాతాళము దివియు నందలి జంతు
నివహమింతయునూ నీ దేహమేకాన ॥ఎవ్వ॥
.... .... .... .... .... .... .... ....
నీవులేని చోటు నిజముగఁ దెలిపిన
నావలనది గాదనవచ్చును
శ్రీవేంకటగిరి శ్రీనాథ సకలము
భావింప నీవే పరిపూర్ణుడవుగాన ॥ఎవ్వ॥" (1–9)

—ఎవ్వరిని గాదనినను అది భగవంతునే కాదనుటను బట్టి స్వామి సర్వవ్యాపకత్వము వర్ణితము.

ఇంకను స్వామివారి సర్వాంతర్యామిత్వమును 'ఈతఁడఖిలమునకు ఈశ్వరుఁడై సకలభూతములలోను పొదలువాఁడని తాపసోత్తముల చింతా సౌధములలోన దీపించు సుజ్ఞాన దీపమ'ని వర్ణించినాడు. ఇంకను 'అన్నిటా నీవే యుండు వందువుగాన యిన్ని నీవు పుట్టించినవివిసి పొమ్మరే' యని వర్ణించినాడు.

## రక్షకత్వము

జగద్రక్షకుడైన శ్రీవేంకటనాథుని రక్షకత్వము నిట్లు వర్ణించెను.

"గుజ్జరి :— ఇటుగన సకలోపాయములుడిగిన యాశ్వరుఁడే రక్షకుఁడు
తటుకున స్వతంత్రముడిగిన యాత్మకు తగు నిశ్చింతమే పరమసుఖము ॥పల్లవి॥
ఆఁకటి కడుగని శిశువుకు దల్లియడిచి పాలు ద్రాగించినరీతి
యాకడఁ గోరికలుడిగిన యోగికి నీశ్వరుఁడే రక్షకుఁడు
చేకొని బుద్ధెఱిగిన బిడ్డలపైఁ జింతింపరు తొల్లి టివలెఁదల్లులు
యాకొలఁదులనే స్వయత్నదేహాలకీశ్వరుఁడును వాత్సల్యము వదలు ॥ఇటు॥

—ఇందు ఆకలి కలిగినను అడుగని బిడ్డకు పాలుత్రాగించిన రీతిలో కోరికలన్ని వదలిన యోగికి భగవంతుడు రక్షకుడై యోగికోరికలను కోరక పోయినను ఆకోరికలను రక్షకుడైన భగవంతుడు దీర్చునని అన్నమయ్య వర్ణన.

## ఆదరభావము

భక్తమందారుడైన భగవంతుడు ఆయాభక్తులపట్ల చూపిన ఆదర భావములను మనోహరముగ వర్ణించినాడన్నమయ్య.

"గౌళ :— ఏమి వలసిన నిచ్చు నెప్పుడైవను
యేమరక కొలిచిన నీతఁడే దైవము ॥పల్లవి॥
ఘనముగానిందరికిఁ గన్నులిచ్చుఁ గాళ్లిచ్చు
పనిసేయ చేతులిచ్చు బలియుఁడై
తనుఁ గొలువుమని చిత్తములిచ్చుఁగరుణించి
వానర లోకానకెల్ల నొక్కఁడే దైవము ॥ఏమి॥" (1-172).

అనేకులైన భక్తులయందు చూపిన ఆదర భావములు భిన్న రీతులుగ ఉన్నవని ఉదాహరణ పూర్వకముగ వర్ణించుచున్నాడు.

''భైరవి :- అరుదునీ చెరిత్రము హరి నేనిదియే తలఁచుకొని
శరణంటి ఁగావుమిదియ విన్నపము సరిలేరు నీకు ॥పల్లవి॥
పరగనీయకారణ బంధుత్వ మహల్యయందుఁ గంటిమి
అరసి ద్రౌపది యందు నాపదుద్ధారకత్వము మెరయఁగఁ గంటిమి
శరణంటెఁగాచుట ధర విభీషణునందుఁ గంటిమి ॥అరు॥
మును భక్త వత్సలత్వమునీకు శబరియందుఁ గంటిమి
అనాథ నాథుడవు నీవగుట సుగ్రీవునందుఁ గంటిమి
పెనఁగి నిరుహేతుక ప్రేమ పరీక్షితునందుఁగంటిమి
వినుఁ గింకరాధీనుఁడని ప్రహ్లాదుని యందుఁ గంటిమి ॥అరు॥
గోవర్ధనమందు సర్వజీవదయా పరత్వము గంటిమి
భావించి పాండవునందు ప్రతిజ్ఞాపాలకత్వము గంటిమి
దేవశ్రీ వేంకటేశ్వర నీవు ప్రష్ట వరదుఁడ వగుట
తావైన నీ కోనేటి దండ నొనఁగ యందే కంటిమి ॥అరు॥" (2_321)

ఇంకను శ్రీవేంకటనిలయుడు భక్తులసేవిధముగ ఆదరించునో వర్ణించుచున్నాడు

"తల్లియై పోషించు తండ్రియై రక్షించు
వుల్లపుబంధువుఁడై వొడలరయు
మెల్లనె దాతై ఇచ్చు మెలుఁతయై యాదరించు
యెల్ల విధ బంధువుఁడు యీతఁడే పో విష్ణుఁడు" (2-41?)

-అంతేగాక యేలికయై మన్నించునని, యిష్టుడుగా బుద్ధి చెప్పునని, బాలుఁడై ముద్దుచూపునని, దేవుడై పూజగొనునని వర్ణించుచున్నాడు.

## విష్ణుమంత్ర మహిమ

విష్ణునామ మంత్రమును జపించిన వారికి ఇహపర సుఖములు లభించునని వర్ణించుచున్నాడు.

"సాళంగం :— ఉన్న మంత్రాలిందునరా వొగి విచారించుకొంటే
విన్న కన్న వారికెల్ల విష్ణునామ మంత్రము ॥పల్లవి॥
పరగఁ బచ్చకాయతాఁ బరసి పోదు మంత్రము
గరిమ ముట్టంటు లేని ఘన మంత్రము

వరున నెవ్వరు విన్నావాఁడి చెడని మంత్రము
అరయ నిదొక్కటే పో హరినామ మంత్రము ॥ఉన్న॥
యేజాతి నోరికైన నెంగిలి లేని మంత్రము
వోజ దప్పితేఁ జెడక వుండే మంత్రము........॥ఉన్న॥
యిహముఁ బరముఁ దానేయియ్యఁ జాలిన మంత్రము
సహజమై వేదాల సార మంత్రము
బహునారదులెల్ల పాట వాడిన మంత్రము
విహితమై శ్రీవేంకటేశు మంత్రము ॥ఉన్న॥ (2—153)

—ఇంకను 'హరి' యను రెండక్షరములు నుడివిన నఖిల వేదమంత్రములు ధర్మశాస్త్రములు క్రమముగ చదివిన పుణ్యములు కలుగునని వర్ణించినాడు.

ఆపద సమయములందు హరినామము తప్ప వేరు దిక్కులేదని వర్ణించుచున్నాడు

'ముఖారి :— అంకటి వేళల నలపైన వేళలను
తేఁకువ హరినామమే దిక్కు మరిలేదు ॥పల్లవి॥
కొఱమాలి వున్నవేళ కులము చెడిన వేళ
చెఱవడి వొరులచేఁ జిక్కినవేళ
వొఱపైనహరినామ మొక్కటే గతిగాక
మఱచి తప్పిన నైన మఱిలేదు తెరఁగు ॥అంక॥" (1-158)

—ఇంకను ఆపద వచ్చినవేళ, ఆరడి బడినవేళ, పాపపువేళ, భయపడినవేళ, సంకెల పెట్టినవేళ, చంపబిలిచిన వేళ వేంకటేశనామమే విడిపించుటకు గతియని వర్ణించుచున్నాడు.

వేంకటేశుని నామమును జపించుటవలన తన జిహ్వ పావనమైనదని, జన్మ చరితార్థమైనదని వర్ణించుచున్నాడు.

"ముఖారి :— నగుఁ బొల్లఁ బడే నాజిహ్వ
పగటున నిదివో పావనమాయ ॥పల్లవి॥
ఇల నిందరి నుతియించి పెంచువలె
నలినలియైనది నాజిహ్వ
నలినోదరు శ్రీనామము దలఁచిన

ఫలమున కిదివో పావనమాయ ॥నగు॥
॥ ॥ భ్రమపడి మాయపు పరతులం తమ్మతి
నమలి చవులుగొనె నాజిహ్వ
అమర వంద్యుఁడగు హరి నుతియుంచఁగ
ప్రమదము చవిగొని పావనమాయ......॥నగు॥ (1–56)

—ఇంతకు పూర్వము నవ్వుల పాలైన జిహ్వ అమరవంద్యుడగు హరిని నుతియించ గా పావనమైనదని వర్ణించినాడు.

## లీలావర్ణనము

శ్రీవేంకటనాథుని లీలలనంతములు. అవి అన్నమయ్యకు ఏంతగ నోచినవి. అందువలన ఆ లీలా వర్ణనము నిట్లు గావించుచున్నాడు.

"శ్రీరాగం :— ఏది చూచినను గడు నిటువంటి సోద్యములే
మేదినికిఁ గిందు పడి మిన్నందనేలా ॥పల్లవి॥
కరిరాజు గాంచిన కరుణానిధివి నీవు
అరిది నరసింహ రూపైతివేలా
వురగేంద్ర శయనమున నుండి నీవును సదా
గరుడవాహనుడవై గమనింప నేలా ॥ఏది॥
పురుషోత్తమ ఖ్యాతిఁ బొదలి యమృతమువంప
తరుణివై వుండ నిటు దైన్యమేలా
శరణాగతులకు రక్షకుండవై సామ్ము
నీచరణముల కిందైన చలముకొననేలా ॥ఏది॥ (2–140)

—అనుచు నింకను దేవతాధిపుడవై దీపించి యింద్రునికి తమ్మునివైతివిగదా శ్రీ వేంకటాచలమునందు స్థిరుడవై జీవకోట్లలో చిక్కుపడనేలా? యని వర్ణించినాడు. ఇంకను వేంకటేశుని లీలలను

"చిరభోగ సౌఖ్యములఁ జెందెననుభవిగాన
తిరువేంకటాచలాధీశ్వరుండాయ" (1–105) అని వర్ణించినాడు.

## దివ్యరథ వర్ణనలు

స్వామివారి దివ్యరథ సంబంధములగు వర్ణన లక్కడక్కడ ఉన్నవి. దేవదేవుని దివ్యరథము నిట్లు వర్ణించుచున్నాడు.

"సాళంగనాట :— దేవదేవుఁడెక్కెనదె దివ్యరథము
మావంటి వారికెల్ల మనోరథము ॥పల్లవి॥
జగతి బాలులకై జలధులు వేరఁజేసి
పగటునఁదోలెనావైపేడి రథము
మిగులఁగఁ గోపగించి మెరయు రావణుమీఁద
తెగనెక్కి తోలెనిదె దేవేంద్ర రథము ॥దేవ॥
బలిమి రుక్మిణిఁ జెప్పి పతుల గెలిచియెక్కె
అలమేఁగు పెండ్లి కళ్యాణరథము
యెలమి శ్రీవేంకటాద్రి నలమేలు మంగఁ గూడి
కల కాలమును నేఁగె ఘనమైన రథము ॥దేవ॥ (1—400)

వేరొక సంకీర్తనమున శ్రీవేంకటేశుని తేరును గూర్చి వర్ణించుచున్నాడు.

"సాళంగనాట :— ఇదివో వీధి వీధుల నితని తేరు
యెదుట శ్రీవేంకటాద్రినితేరు ॥పల్లవి॥
చట్టువడఁ దోలెనాడు సముద్రాలపైఁదేరు
ఘుట్టుగాఁ దోలెను పౌండ్రకునిపైఁ దేరు
జట్టిగొని తోలె జరాసంధునిపైనదె తేరు
కొట్టితోలె హంసడిభకులపై తేరు "ఇది॥" (2—110)

హరియు సిరియు కలసి వెళ్ళుచున్న తేరు నిట్లు వర్ణించుచున్నాడు.

"గౌళ :— హరియు సిరియు నేఁగేరదివో తేరు
పరంజ్యోతి స్వరూపపు పైఁడి కుండతేరు ॥పల్లవి॥
గరుడ ధ్వజపుతేరు కనకమయపుతేరు
మెరుఁగుల మేఘముల మించు గొణిఁగెల తేరు
నిరుల ధ్రువ లోకపు శిఖరపుఁదేరు ॥హరి॥ (2—368)

ఇంకను దేవదేవుని దివ్యరథమును 1—424, 2—227, 339, 487 మొదలగు సంకీర్తనములందు వర్ణించినాడు.

## దివ్యాయుధములు

శ్రీవేంకటాధిపుడు ధరించిన దివ్యాయుధములను తాళ్ల-సుందరముగ వర్ణించుచున్నాడన్నమయ్య.

"మలహరి :- కోరిమా భుజముల దాగులు మోచుకున్నారము
ధారుణి లోపల మమ్ముదయఁ జూచుఁగాక ॥పల్లవి॥
సతతము హరిచేతి శంఖ చక్రములే
గతియై మా పాలనుండికాచుఁ గాక
అతిశయమైనట్టి అచ్యుతుని ఆయుధాలే
హితవుగ మమ్మునిట్టె యేలుఁగాక
కమలాపతి చేతుల గదా పద్మములు
మమకారముతో మమ్మునన్నించుఁగాక
సమర విజయమైన శార్ఙాది శరములు
తమితోడ మాకు దాపు దండై వుండుగాక ॥కోరి॥
ముంచి శ్రీవేంకటేశుఁడు మెలఁగట్టిన కఠారు
అంచల మాకెల్ల రక్షై అమరుఁగాక.........॥కోరి॥" (2-101)

—శ్రీవేంకటేశుని ఆయుధములను వర్ణించుచునే అవిభక్తులను రక్షించుమని వర్ణించు చున్నాడు,

## దివ్యచక్రము

చక్రహస్తుని చక్రవర్ణన మిట్లున్నది.

"పాడి :- చక్రమా హరి చక్రమా
వక్రమైన దనుజుల వక్కళించవో ॥పల్లవి॥
చుట్టుముట్టి పాతాళముచొచ్చి హిరణ్యాక్షుని
చట్టలు చీరినవో చక్రమా
పట్టిన శ్రీహరిచేతఁ బాయక యీజగములు
వొట్టుకొని కావగదవో వోచక్రమా ॥చక్ర॥ (1-183)

ఇంకను "పానుకొని దనుజుల బలు కిరీటమణుల సానలు దీరిన వో చక్రమా" యని వర్ణించినాడు.

వేరొక సంకీర్తనమున చక్రమునకు నమస్కరించుచు ఇట్లు వర్ణించుచున్నాడు.

"బౌళి :- మొక్కెదమిదివో మూఁడు మూర్తులను
వొక్కరూపమై వొనరెఁ జక్రము ॥పల్లవి॥

చెండిన రావణు శిరోమాలికల
దండల పూజల తఱచుగను
మెండుగఁ గంసుని మెదడు గంధముగ
నిండనలఁదుకొని నిలిచెఁ జక్రము ॥మొక్కె॥" (2-516)

—దివ్య చక్రము కంసుని సంహరించినపుడు ఆ కంసుని మెదడును గంధముగ అలదుకొని నిలిచెనట. మెదడును చక్రమునకు గంధముగ ఊహించిన అన్నమయ్య వర్ణనా సామర్థ్యమమోఘము.

## శ్రీవారి పాదమాహాత్మ్యము

"ముఖారి — బ్రహ్మ గడిగిన పాదము
బ్రహ్మము దానెనీ పాదము
చెలగి వసుధ గొలిచిన నీపాదము
బలితల మోపిన పాదము
తలఁకక గగనము దన్నిన పాదము
బలరిపుఁ గాచిన పాదము ॥బ్రహ్మ॥

కామిని పాపము గడిగిన పాదము
పాము తల నిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపుఁ బాదము ॥బ్రహ్మ॥

పరమ యోగులకుఁ బరిపరి విధముల
వరమొసఁగెడి నీ పాదము
తిరువేంకట గిరి తిరమని చూపిన
పరమ పదము నీ పాదము ॥బ్రహ్మ॥" (1-19)

—నిరంతరము శ్రీవేంకటేశుని పాదారవిందములపై భక్తి సారించి సంకీర్తనము గావించు అన్నమయ్య శ్రీవారి పాదమాహాత్మ్యమును మనోహరముగ వర్ణించినాడు.

వేరొక సంకీర్తనమున ఈ విధముగ వర్ణించినాడు.

"శ్రీరాగం :— ఈ పాదమేకద యిలయెల్లఁ గొలిచినది
యీ పాదమేకదా ఇందిరా హస్తముల కితవైనది ॥పల్లవి॥
యీపాదమేకదా యింద్రరును మ్రొక్కెడిది
యీపాదమేకదా యీగగన గంగ పుట్టినది......
యీ పాదమేకదా యిధరాజా దలచినది
యీపాదమేకదా యింద్రాదులెల్ల వెదకినది......" (1_66)

—ఈ సంకీర్తనమున శ్రీవారి పాదమువలన గగనగంగ పుట్టినదని, ఆపాదమే గజేంద్రుని చేత తలంపబడెనని పలికి ఇంద్రాది దేవతలు కూడ శ్రీవారి పాదమును వెదకినట్లు వర్ణించినాడు.

## అభయ హస్తము

శ్రీవారి అభయ హస్తము నిట్లు వర్ణించుచున్నారు.

"సామంతం ;— ఇందరికి నభయంబు లిచ్చుచేయి
కందువగు మంచి బంగారుచేయి ॥పల్లవి॥
వెలలేని వేదములు వెదకి తెచ్చినచేయి
చిలికి గుబ్బలి కిందఁ జేర్చుచేయి
కలికి యగు భూకాంతఁ గౌఁగిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ వాఁడి చేయి
తనరంగ భూదాన మొసఁగు చేయి
మొనసి జలనిధియమ్ము మొనకుఁ దెచ్చిన చేయి
యెనయ నాఁగేలు ధరియించు చేయి.... ॥ఇంద॥" (1_334)

—ఇంకను తిరువేంకట గిరి దేవుడై ముక్తిమార్గము చూపెడి చేతులని వర్ణించెను.

## వాహనము

గరుడవాహనమును గూర్చి అన్నమయ్య వర్ణించినాడు.

"నాట :— ఇట గరుడని నీ వెక్కినను
పటపట దిక్కులు బగ్గనఁ బగిలె ॥పల్లవి॥
ఎగిసిన గరుడని యేపున 'ధా'యని

జిగి వొలఁక చలుకు చేసినను
నిగమాంతంబులు నిగమ సంఘములు
గగనము జగములు గడగడ వడఁకె                    ॥ఇటు॥
బిరుసుగ గరుడని పేరెము దోలుచు
వెరసి నీవు గోపించినను
సరుస నఖిలములు జర్జరితములై
తిరుపున నలుగడ దిరదిరఁ దిరిగె                    ॥ఇటు॥ (1-92)

— వేంకట రమణుడు 'కెల్లున' గరుడని అధిరోహింపగా రాక్షస సమితి 'ఝల్లనె' నని వర్ణించినాడు. ధ్వన్యను కరణ శబ్దములైన 'వట వట' 'ధాయని' 'గడగడ' 'దిరదిర' ఝల్లనె' అనువానిని ప్రయోగించి 'శబ్దములను' చేయించుచున్నాడు. ఇవి అన్నమయ్య ఊహా శక్తికి 'జేగంటల' వలె ఉన్నవి.

**ఆభరణములు**

శ్రీ వేంకట నిలయుని ఆభరణముల నిట్లు వర్ణించుచున్నాడు.

"మా॥ :- చూడఁ జూడ మాణిక్యాలు చుక్కల వలె నున్నవి
యీడు లేని కన్నులవె యిన చంద్రులు
కంటి కంటి వాఁడె వాఁడె ఘనమైన ముత్యాల
కంట మాలలవె పదకములు నవె
మింటి పొడవై వర్ధి మించు కిరీటమదె
జంటల తెలుగు శంఖ చక్రాలవె ........
పుక్కిట లోకములవె భుజకీర్తులునవె ........
ముంగై మురాలును నవె మొలం కఠారునునదె
బంగారు నిగ్గుల వన్నె పచ్చ బట్టదె
యింగిత మెఱిఁగి వేంకటేశుఁడిదె కన్నులకు
ముంగిటి నిధానమైన మూల భూతమదె                    ॥చూడ॥ (1-183)

— శ్రీవారి ఆభరణములను స్వభావ సుందరముగ వర్ణించినాడన్నమయ్య.

**బిరుదులు – సార్థకత**

శ్రీ వేంకటేశుని బిరుదులను పేర్కొనుచు ఆ బిరుదల సార్థక్యము నిట్లు వర్ణించుచున్నాడు.

"శ్రీరాగం :— బిరుదులన్నియు నీవే బిరుదు లోకములెల్ల
అరయ నీ పాదమందె అణఁగుండెఁ గాన ॥పల్లవి॥
బహు దేవతా సార్వభౌమ బిరుదు నీకె
సహజము నీవు భూసతి పతివి గాన
వహి దేవతా చక్రవర్తి బిరుదు నీకే
విహితము చక్రముచే వెలసేవు గాన ॥బిరు॥
పెనుదేవ శిఖామణి బిరుదు నీకే చెల్లు
ఘన కౌస్తుభ మణిఁ గల వాఁడవు గాన
మును దేవ దేవోత్తముడను బిరుదు నీకే
వనిచెఁ బురుషోత్తమ నాముఁడవు గాన ॥బిరు॥ (2-142)

— ఇంకను దేవ రాహుత్త రాయ బిరుదు రాతి గుఱ్ఱము నెక్కుట వలన, దేవ సింహమనెడి బిరుదు నారసింహుఁడగుట వలన కలిగినవి కాబోలునని వర్ణించినాడు.

## భక్తి వర్ణనలు

భాగవతకర్త అభిప్రాయమున గల నవవిధ భక్తులను వర్ణించి తరించినాడనవి మయ్య అయా భక్తి భేదములను నీ విధముగ వర్ణించుచున్నాడు.

### శ్రవణము

"భైరవి :— ఎంత పుణ్యమో యిటుమాకుఁ గలిగె
చెంతనే నీ కృప సిద్ధించఁబోలు ॥పల్లవి॥
శ్రీపతి మీకథ చెవులను వింటిమి
పాపము లణఁగెను భయముడిగె
తీపుగ తులసీ తీర్థము గొంటిమి
శాపము దీరెను సఫలంబాయ ॥ఎంత॥" (2-322)

—శ్రీపతి కథాశ్రవణము వలన ఎంత పుణ్యమో కలిగినదట. శ్రీపతి కథ వినినంతనే పాపము లణగి పోయి భయముతగ్గి పోయెనట.

### కీర్తనము

"గుండక్రియ :— దాఁచుకో నీ పాదాలకుఁదగ నేఁజేసిన పూజలివి
పూఁచి నీ కీర్తి రూప పుష్పము లివియయ్యా ॥పల్లవి॥

ఒక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించఁగ
తక్కినవి భండారాన దాఁచివుండనీ
వెక్కసమగు నీ నామము వెల సులభము ఫలమధికము
దిక్కై కన్నేలితివిఁక నవితీరని నాథనమయ్యా ॥దాచు॥
నా నాలికపైనుండి నానా సంకీర్తనలు
పూని నాచే నిన్నుఁ బొగడించితివి........" (2-338)

—భక్తులను రక్షించుటకు ఒక్క సంకీర్తనయే చాలునట। భక్తుడు చేసిన పూజలను భగవంతుడు దాచుకొనవలెనట. భగవంతుని నామము వెల సులభమట। కాని ఫలమధిక మట. భగవంతుడే భక్తుని చేత పలికించి పొగడించుకొనెనట.

స్మరణము

''దేవ గాంధారి :- అందుకే నేఁజింతించెదను అచ్యుత నీ శరణాగతుఁడ
నందడి నాభవమింద వల్లనే సఫలం బాయనయ్యా ॥పల్లవి॥
వొక నీ నామము వొగిఁ దలంచిన
అకలంకంబగు నాపాపంబులు అన్నియుఁ బారణోసెసె
అకటా తక్కిన అనంత నామములు
వొకట నుపవాసములున్నవోయయ్యా....॥అందు॥(2-376)

—అచ్యుతునకు శరణాగతుడై చింతించుట వలన తన భవము సఫలంబయ్యెనని వర్ణించుచున్నాడు.

పాదసేవనము

పాదాలంటి మొక్కుదును పరిశుద్ధి దలఁచను
సాధించి కొలువ వత్తు సత్వ చూడను
యేదెసనైన నుతింతు యెంగిలినోరని మాన
పాదుగా విచారించితే బలు మూఢఁడనయ్యా" (2-323)

....పరిశుద్ధిగా భావించుటకు భగవంతుని పాదములనంటి మ్రొక్కుదునని అన్నమయ్య పలికినాడు.

అర్చనము

"నిన్నుఁ బూజించేవారి నిజ పరతత్వమువు
యిన్నిటా నీ దాసులకు నేలికెవు

యెన్నగ శ్రీవేంకటేశ యిహపరములకును
పన్నికాచుకున్న వారి ఫలదాయకుండవు" (2-173)

—దాసులకు ప్రభుడైన శ్రీవేంకటేశ్వరుడు పూజించువారికి నిజ పరతత్వమని వర్ణించుచున్నాడు. ఇహపరములకు కాచుకొన్న వారికి భగవంతుడు ఫలదాయకుడని వర్ణించుచున్నాడు.

### వందనము

"బౌళి రామక్రియ :— నమోనమో లక్ష్మీ నరసింహా
నమోనమో సుగ్రీవ నరసింహా ॥పల్లవి॥
వరద సులభ భక్త వత్సల నరసింహా
నరమృగవేష శ్రీనరసింహా
పరమ పురుష సర్వ పరిపూర్ణ నరసింహా
గిరిగుహావాస సుగ్రీవ నరసింహా ॥నమో॥ (2—348)

....ఇందు భక్తుడైన అన్నమయ్య వరద సులభుడు, భక్తవత్సలుడు, నరమృగ వేష ధారి, పరమ పురుషుడు,సర్వపరిపూర్ణుడు, గిరిగుహావాసుడు. సుగ్రీవుడైన నారసింహానికి వందన మాచరించినాడు.

### దాస్యము

"ఇలనీ దాస్యం బిదె యొకటే
సిలుగుల భవముల జిలుగు మాన్పెనదె చిత్తము తహతీర
యెలమిని శ్రీవేంకటేశ్వర నీవిదె
తలపున బాయక దక్కితివయ్యా" (2—376)

—శ్రీవేంకటేశునకు దాసుడైన అన్నమయ్య తలపును వదలకభగవంతుడే దక్కినాడట.

### సఖ్యము

"పాడి :— బలువగుఁ దనరూపము చూపెన్
కలదింతయు ఘన తెలిగించెన్ పల్లవి॥
పాండవ రక్షణ పరుఁడై నరునకు
నండనే తెలిపె మహామహిమ
దండి విడిచి తన దయతో నరుసుఁ
డుండగ మగఁటిమి నొడఁబరచ్చ జలికె ॥బలు॥

మగుడఁగ కులధర్మములుఁ బుణ్యములు
తెగిపార్థునకుపదేశించెన్........"    (1-296)

— ఇందు నరునకు శ్రీకృష్ణుడు గీతోపదేశము గావించిన వృత్తాంతము వర్ణింపబడినది. నరనారాయణులు జన్మజన్మలనుండి మిత్రులు. అర్జునుడు ధైర్యము సడలియుండగా కులధర్మములను పుణ్యములను ఉపదేశించెనట. శ్రీకృష్ణుడు తన మిత్రుడైన అర్జునునకు గీతోపదేశము చేసినాడు. గావున నిందు సఖ్యభక్తి యున్నది.

## ఆత్మనివేదనము

ఆత్మనివేదనమునకు అన్నమయ్య సంకీర్తనములన్నియు ఉదాహరణ యోగ్యములే మచ్చున కొకటి.

``గుజ్జరి :— అర్తుఁడ నేను నీకడ మెందుమలేదు
మూర్తిత్రయాత్మక మొగిఁ గరుణించవే    ॥పల్లవి॥
సర్వసాక్షివి నీవు సర్వాంత రంగుఁడవు
సర్వ సర్వం వహా చక్రవర్తి
నిర్వాణ మూర్తి నిగమాంత కీర్తి
సర్వాపరాధములు క్షమియింపవే    ॥అర్తు॥
అణువులోపలి నీవు అది మహత్తును నీవు
ప్రణుత శ్రీవేంకట ప్రమర నిలయా
అణిమాది విభవా ఆద్యంత రహితా
గణుతించి నాపాలఁ గలుగవే నీవు    ॥అర్తు॥    (2-382)

....భక్తుడైన అన్నమయ్య అర్తుడని పలికి తనను కరుణించ వలసినదని ప్రార్థించుచున్నట్లు వర్ణించుచున్నాడు.

ఈ విధములైన నవవిధ భక్తి భేదములనే గాక నారదభక్తి సూత్రములలో చెప్పబడిన భక్తి భేదములను కూడ వర్ణించినాడు. అంతేగాదు అన్నమయ్య తానుకొన్ని భక్తిభేదములను పేర్కొని లక్షణములను నిర్వచించి లక్ష్యములను కూడ అనేకములైన సంకీర్తనము లందు వర్ణించి తరించినాడు. వానినిట్లు చెప్పవచ్చును.

## ఉన్మాద భక్తి

హరికిగా వాదింపుట ఉన్మాదభక్తియని పేర్కొని దానినిట్లు వర్ణించుచున్నాడు.

"బౌళి :— ఎండగాని నీడగాని యేమైనగాని
కొండల రాయుడే మా కులదైవము ॥పల్లవి॥
తేలుగాని పాముగాని దేవపట్టయినఁగాని
కాలకూట విషమైన గక్కున మింగిన నాటి
నీలవర్ణుఁడే మానిజ దైవము ॥ఎండ॥
.... .... .... .... .... .... .... .... .... .... ....
పిల్లిగాని నల్లిగాని పిన్నయెలుకైనఁగాని
కల్లగాని పొల్లగాని కాని యేమైనా
బల్లిదుఁడై వేంకటాద్రి పైనున్న యాతఁడేమ
మ్మెల్ల కాలమును నేలే యింటి దైవము ॥ఎండ॥ (1-214)

—ఇందు భక్తుని స్థిర నిశ్చయము తెలుపబడినది. వేంకటేశుడే రూపముననున్నను కొలిచెదనని పలికి భగవంతుని సర్వాంతర్యామిత్వమును భంగ్యంతరముగ వర్ణించు చున్నాడు.

## పతివ్రతాభక్తి

ఇతరులను కొలువననుచు ఇట్లు వర్ణించుచున్నాడు.

"కన్నడగౌళ :— చేసిన నా విన్నపము చిత్తాన బెట్టుకొమ్మీ
వేసరించి యిప్పుడే నే వేఁడు కొంటిఁజూమ్మీ ॥పల్లవి॥
నిన్నే కాని యితరులనేఁ గొలువ నొల్లనంటి
పున్నతి పరద్రవ్యా లొల్లనంటి
అన్నిటా సేసే మతి యప్పటి మాచేయంచు
సన్నల నన్నందుకు నొచ్చమని దూరకుమీ ॥చేసి॥ ...." (2-177)

....శ్రీవేంకటనాథుని తప్ప యితరులను కొలువనని విన్నవించుచు తాను చేసిన విన్నపములను భగవంతుడు చిత్తమున బెట్టుకొనవలసిన వర్ణించుచున్నాడు. ఇతరులను కొలువననుట వలన తన పాతివ్రత్యమును స్పష్టము చేసినాడు.

## విజ్ఞానభక్తి

ఆత్మలో హరిని తెలిసికొని పూజించుట విజ్ఞాన భక్తియని ఇట్లు వర్ణించు చున్నాడు.

"లలిత :— ఆతుమ సంతొస పెట్టుటది యెఱుక, తా
నేతెరువు నొల్ల కుందుటి దియే యెఱుక ॥పల్లవి॥
ముంచిన బంధములలో మునుఁగుడు వడక తా
నంచల విడఁదన్నుటది యెఱుక
చంచలపు విషయాల నగుడు ముగ్గుడుగాక
యెంచి హరిఁదలపోయుటదియే యెఱుక ॥ఆతుమ॥" (1-378)

....బంధములలో చిక్కువడక వానిని విడిచి, చంచలపు విషయములకు దూరమై హరిని దలపోయుటయే విజ్ఞానమని వర్ణించుచున్నాడు.

## ఆనందభక్తి

ఆనందముతో చిందులు త్రొక్కుచు హరిని కీర్తించిన వర్ణన మిట్లున్నది.

''దేసాక్షి :— కనియుండి భ్రమసితిఁ గట్టానేను
యెనలేక గుఱియైతి నిట్టేనేను ॥పల్లవి॥
తోలు నెముకలు గట్టి దొరనంటా మురిసేను
అలుబిడల మఱఁగు ఆహా నేను
గాలియావటించు కొని కాలములు గడిపేను
వోలి బబ్బ్యపాపమందు వోహో నేను ॥కని॥
.... .... .... .... .... .... .... .... .... .... .... ....
నూలికోకఁ గట్టువడి నున్ననై నే మురిసేను
యీలాగు నా బదుకెల్ల యేహీ నేను
పాలించి శ్రీవేంకటాద్రిపతినాకు గలుగఁగ
అలరినై గెలిచితి హైహైనేను ॥కని॥ (2-513)

—శ్రీవేంకటపతి దయగలిగిన భక్తుడగు అన్నమయ్య 'అలరినై గెలిచితి హైహైనేను' అని ఆనందముతో సంకీర్తన మాలపించినాడు.

## రాక్షసభక్తి

అన్నమయ్య సంకీర్తనములలో దీనికి ఉదాహరణము లభింపలేదు.

## తురీయభక్తి

హరిదాసులను సేవించుటయే తురీయభక్తి యని యిట్లు వర్ణించుచున్నాడు.

''దేసాళం :— కైవల్యమున కంటే కైంకర్య మెక్కుడు
శ్రీవిభుఁడవు నీవు మాకుఁ జిక్కే మర్మమిదివో ॥పల్లవి॥

...... ...... ...... ...... ...... ......

హరిప్రసాద జీవినై గర్వించుట కంటే
నరయ నీ దాసుల లెంకౌ టెక్కుడు
పెరవున నీ చెవిలో విన్నపాలు సేయుకంటే
ధరనీ పూజితకాండ్లఁ దలపించు టెక్కుడు ॥కైవ॥ (2–483)

—హరిప్రసాద జీవియై గర్వించుటకంటె హరిదాసుల సేవకుడుగా నుండుటయే అధిక మని తురీయభక్తిని వర్ణించుచున్నాడు.

## తామసభక్తి

ఒక పనిని మాత్రమే కోరి భక్తిని ప్రకటించుటను తురీయ భక్తియని పేర్కొని యిట్లు వర్ణించుచున్నాడు.

''సకలోద్యోగంబులు మాని సకలోపాయంబులు విడిచి
సకలేంద్రియముల జాలటు మాని సకల విషయముల రహితుఁడై
సకలముఁ దనవలె భావించి పర్యాంతరాత్మువు నిన్నుఁ దెలిసి
అకలంకంబున నుండెడి భావంబది యెన్నఁడొకో ॥హరి॥ (2–127)

—ఇంకను పరచింతలలో తడబడక పరమార్గముల తగపడక పరహింసలకు, పర దూషణకు పూనుకొనక వేంకటేశునకే శరణనను చున్నాడు.

## వైరాగ్యభక్తి

అతడే గతియని యుండుట వైరాగ్య భక్తియని నిర్వచించి దానినిట్లు వర్ణించు చున్నాడు.

''ముఖారి :— అతఁడే గతియని యుంటే నన్నిటా మాన్యుఁడు
ఇతరాలు మానఁగానే యీతనికే కలవు ॥పల్లవి॥
శ్రీరమణుని నిత్య సేవలకుఁ దొల్లె
వేరులేని కర్మముల వెట్టి మాన్యము
ఆరీతి నితని భక్తుడై చనవరులకు
ఆరితేరి పుణ్యపాపా లంటి పొటులేదు ॥అత॥'' (2–511)

## రాజసభక్తి

స్వతంత్రుడై పూజించుటయే రాజస భక్తి యని పేర్కొని ఆభక్తిని యిట్లు వర్ణించుచున్నాడు.

"పాడి :— వెన్నలు దొంగిలు నాటి వెట్టివా నీవు
ఎన్నన్న జారగాడు వెఱ్ఱివా నీవు ॥పల్లవి॥
చేరినిన్ను నొల్లనట్టి జీవుల నీ వుదరాన
పేరుఁడవై మోఁచేవు వెఱ్ఱివా నీవు
నారపేరు నుడిగితే నా పేరంటాఁ దగిలేవు
వీరానఁ జుట్టమవై వెఱ్ఱివా నీవు ॥వెన్న॥ (2-32)

—ఇంకను శ్రీ వేంకటేశుడవై వరము లిచ్చుచుంటివి. వెట్టివా నీవు అనివర్ణించినాడు భక్తవత్సలుడగు వేంకటనాధుడు అడిగిన వారికందరికిని వరము లిచ్చుచుండెనట. ఈ సంకీర్తనమునఅన్నమయ్యస్వామితో చనవుబలిసిన స్వతంత్రుడై నభక్తు నిగదర్శనమిచ్చు చున్నాడు. 'నిన్ను నొల్లనట్టి జీవులను నీవుదరము నందు మోయుచుంటి వ'నుచు నీవు వెట్టివాడవని పలికిన అన్నమయ్య స్వామివారి సర్వజీవ సహోదరత్వమును భంగ్యంతర ముగ వర్ణించినాడు

## నిర్మలభక్తి

స్వామికి శరణనుటయే నిర్మలభక్తి యని పేర్కొనినాడు. అన్నమయ్య జీవితమే దీర్ఘ శరణాగతి. శరణాగతుడైన అన్నమయ్య రచించిన సంకీర్తనములెన్నియూ నిర్మల భక్తి కుదాహరణ యోగ్యములై యున్నవి. మచ్చున కొక్కటి.

''సాళంగనాట :— కంటిరా వింటిరా కమలనాథుని శక్తి
వొంటి నితవి శరణ మొకటే వుపాయము ॥పల్లవి॥
.... .... .... .... .... .... .... ....
యీతఁడే వైకుంఠనాధుఁడీతఁడే రమానాధుఁ
డీతఁడే అంతర్యామి యీ చరాచరములకు
నీతఁడే శ్రీవేంకటేశుఁడిహ పరధనము ॥కంటి॥ (2-470)

—కమలనాథుని శక్తి ని కని, విని ఆయనకు శరణననుటయే ఉపాయమని, శ్రీవేంక టేశుడే యిహపర దైవమని వర్ణించెను.

నిజభక్తి

తట్టుముట్టులేనిదే నిజభక్తియని పేర్కొని ఆభక్తి విధానము నిట్లు ప్రకటించు చున్నాడు.

"శ్రీరాగం :- అల్పశక్తి వాఁడ నేను అధిక శక్తివి నీవు
పోల్పనెంత పనికిఁ బూనితి నయ్యా ॥పల్లవి॥
.... .... .... .... .... .... .... .... ....
నాలుక నీకడలేని నామములే నుడిగిని
మేలిమి నీ గుణము లేమిటఁ బొగడుదునయ్యా
.... .... .... .... .... .... .... .... .... .... .... ....

శ్రీకాంతుఁడవైన శ్రీవేంకటేశ నీకు
వూఁకొన నాజన్మ ఫలమొక మొక్కు చాలునయ్యా ॥అల్ప॥" (2-300)

—శ్రీకాంతుడైన శ్రీవేంకటేశునకు ఒక్క మొక్కు మొక్కినచో చాలునట, తనజన్మ సఫలమగుటకు ఈ విధముగా తాను పేర్కొనిన భక్తిభేదముల లక్ష్యలక్షణ సమన్వయ ము గావించినాడన్నమయ్య.

వైరభక్తి

శ్రీవేంకటనాధునకు శత్రువులై తమభక్తిని ప్రకటించినవారి చరిత్రలను అన్న మయ్య వర్ణించుచున్నాడు. ఈ వైరభక్తి వర్ణనలు అన్నమయ్య సాహిత్యమున చాలా పరిమితముగ ఉన్నవి.

"శ్రీరాగం :- వారివారి కర్మములే వారిఁ జుట్టుకొనఁగాను
యీరీతి నీవే వారి యెఱుక మార్పితివి ॥పల్లవి॥
హిరణ్యకశిపు పాటు యెఱఁగడా రావణుఁడు
ధరలో హరికిఁ బగై తానూబొలిసె
విరసపు కంసుగతి వినదా దుర్యోధనుఁడు
సరుఁగ దానూఁ బగై నమసినాడు ॥వారి॥
తెగిమురాసురు జాడ తెలియదా నరకుఁడు
మెగిసి పోటుకుఁబోయి మొక్క పోయను
పొగిసి సోమకుడేన చూడరా దానవులెల్లా
మగిడి మగిడి పోరి మడిసిరిగాక ॥వారి॥

బలిమోయిన తెరువు బాణుడు విచారించడా
బలిమిఁదొడరి భంగపడెఁగాక
యెలిమి శ్రీవేంకటేశా యెవ్వరి నేమనవచ్చు
యెలమి నిప్పటి వారూ నెఱఁగరే కాక ॥వారి॥" (2-308)

....ఈ సంకీర్తనమున శ్రీహరికి శత్రువులై, తమకు పూర్వము వారి చరిత్రలను తెలిసికొనికూడ మరల అట్లేప్రవర్తించి తమ వైరభక్తిని ప్రకటించిరని వర్ణించినాడు.

## శరణాగతి వర్ణనలు

శరణాగతి తత్వము, షడ్విధ శరణాగతి పద్ధతులు పూర్వోక్తము. శరణాగతి పద్ధతులను అన్నమయ్య వర్ణించిన రీతినిట్లు గమనింపవచ్చును.

## ఆనుకూల్య సంకల్పము

భగద్విషయమునందు మాత్రమే శ్రద్ధ గలిగిన వర్ణన మిట్లున్నది.

"రామక్రియ :— నెట్టన శ్రీసతి మగనికి శరణు
దిట్టయై సర్వేశుఁడైన దేవునికి శరణు ॥పల్లవి॥
వెలఁగి జగత్తులకు జీవులకుఁ బ్రాణమై
నెలవై యుండే యతనికి శరణు
తెలివై మఱపై దేహాలలో సూత్రమై
వలనై రక్షించే యట్టి వాని శరణు ॥నెట్ట॥" (2—282)

—ఇంకను చక్కగ వేదములకు, సకల శాస్త్రములకు గురువైన శ్రీవేంకటనాథునకు శరణనుచు భగవద్విషయమునందు మాత్రమే శ్రద్ధ గలిగియున్నట్లు వర్ణించుచున్నాడు.

## ప్రాతికూల్య వరనము

భగవద్వ్యతిరిక్తములు, భగవద్విరుద్ధములగు విషయములను పరిత్యజించుచు పలికిన వర్ణన మిట్లున్నది.

లలిత :- తలఁగరో లోకులు తడవకురో మమ్ము
కలిగిన దిది మా కాఁపురము ॥పల్లవి॥
నరహరి కీర్తన నానిన జిహ్వా
వొరుల నుతియింపఁగ నోపదు జిహ్వా
మురహరు పదముల మొక్కిన శిరము
పరుల వందనకుఁ బరగదు శిరము ॥తలఁ॥" (2—144)

—ఇంకను శ్రీపతిని పూజించిన కరములు యాచకునకు ప్రయత్నింపవని, హరికడ కేగిన కాళ్లు పరుల యిండ్లకు పారవని వర్ణించుచున్నాడు.

## రక్ష్యస్యతీతి విశ్వాసము

భగవంతుడు తప్పక రక్షించునను గాఢశ్రద్ధతో వర్ణించుటయే రక్షస్యతీతివిశ్వాస వర్ణన. ఆవర్ణన మిట్లున్నది.

"పాడి :— వేసరకు పీడెలయనకుము విడువనిన్నిక శరణుచొచ్చితి
నీ సరెవ్వరులేరు వెదకిన నిండు బండికిఁజేట వేఁగా ॥పల్లవి॥
మీరునాకు గంటు నేనేమి సేసినఁ గాతురనియెడి
ధీరతను జము సరకు గొనకే తివిరి సేసితిఁ బాపము
వోర సేయుచు నెంతలేదని వూరకే పీరుంటిరేనియు
వారికిని కొరగాను, నేనెవ్వరిని నెఱుఁగను మిమ్మేకాని ॥వేస॥ (2-35)

—నేనెవ్వరిని ఎరుగను (మిమ్ముతప్ప) అని పలుకుచు భగవంతుడు భక్తుడు తానేమి చేసినను రక్షించునను భావముతో నుండినట్లు వర్ణింపబడినది.

## గోప్తృత్వ వరణము

భగవంతుడు తప్పక వేరొకరు రక్షణ లేరనుభావముతో వర్ణించుట.

"భైరవి :— మఱియెంచూ గతిలేదు మనుపనీవే దిక్కు
జఱసి లక్ష్మీశ నీ శరణమే దిక్కు ॥పల్లవి॥
భవ సాగరంబులోఁబడి మునిగిన నాకు
తివిరి నీ నామమును తేపయే దిక్కు
చివికి కర్మం బనెడి చిచ్చు చొచ్చిన నాకు
జవళి నాచార్య కృప జలధియే దిక్కు ॥మఱి॥" (2-146)

—ఇంకను సంసారమనెడి మంటి కిందటి భక్తునికి భక్తియను బిలద్వారమే దిక్కు' అని 'అన్నిటను అంతరాత్మయన శ్రీవేంకటేశుడే దిక్కు' అని వర్ణించెను.

## ఆత్మనిక్షేపము

తనను రక్షించుటకు తన భారమునంతయు భగవంతునిపై మోపి వర్ణించుట....

"బౌళి :— మరిగితినేమి సేతు మగిడి నే నెందువోదు
నరుస దైవము నీకే శరణు చొచ్చేను ॥పల్లవి॥
తల్లి గోపించి మొత్తినఁదనయుఁడు తల్లికొంగే
యెల్లగాఁబట్టి పెనఁగి యేడిచి నట్టు
వెల్లవిరై హరినీవు విషయాలఁ జిక్కించితే
ఇల్లిదే నిన్నుఁదలఁచి ఇటుదూరే నేను ॥మరి॥
.... .... .... .... .... .... .... .... .... .... .... ....
దైవము దాతవునీవే తల్లివి దండ్రివి నీవే
భావించి చేపట్టితే నీ బంట నేనింతే
శ్రీవేంకటేశ నీవు చేకొని రక్షించఁగాను
జీవుఁడనయిన నేను చెలఁగి మొక్కెను ॥మరి॥ (2–455)

....జీవుడనయిన నేను మ్రొక్కుచుంటిని గావున శ్రీవేంకటేశ! నీవునన్ను రక్షింపవల సినదే అను ప్రార్థనతో సాగినదీ వర్ణన. భగవంతుని తల్లితోను, భక్తుని బిడ్డలతోను పోల్చి సాగించిన వర్ణనమున ఆత్మనిక్షేప మున్నది.

కార్పణ్యము

దీనత్వముతో భక్తుడు భగవంతుని వేడుకొను వర్ణన మిట్లున్నది.

"ఆహిరి :— విడువరాదెంతైన వెర్రివాఁడనైన నీకు
కడవారు నవ్వకుండాఁ గాచుకోనన్నును ॥పల్లవి॥
జ్ఞానము నేనెఱఁగన జ్ఞానము నేనెఱఁగను
మానను విషయములు మరి గెంతైనా.......
అకర్మము నెఱఁగను సుకర్మము నెఱఁగను
ప్రకట సంసారముపై పాటు మానను....—
వెనకఁ గానను ముందు విచారించి కానను
నినుపై దేహధారినై నీకు మొక్కెను
ఘనుఁడ శ్రీవేంకటేశ కన్నులెదుటఁ బడితి
కనిపో విడువరాదు కరుణించునన్నును ॥విడువ॥" (2–2)

— ఇందలి భక్తుడు కడుదీనత్వముతో భగవంతుని ప్రార్థించుచున్నట్లు వర్ణింపబడినది.

ఇంకను ఆధ్యాత్మిక సంకీర్తనములందు దేహము – ఆత్మ – పరమాత్మ సంబంధములైన అనేక విషయములు వర్ణింపబడినవి. అ వర్ణనల నిట్లుచెప్పవచ్చును.
జీవుడు— దేవుడు

## నరజన్మము

నరజన్మము కంటె క్రిమికీటకాదుల జన్మ మేలగునని వర్ణించుచున్నాడు.

"దేసాక్షి :- హీనదశలఁ బొంది యిట్ల నుండుట కంటె
నానా విధుల నున్న నార్ధే మేలు ॥పల్లవి॥
అరుదైన క్రిమి కీట కాదులందుఁ బుట్టి
పరిభవములనెల్లఁ బడితిఁ గాని
యిరవైన చింత నాఁడింత లేదు యీ
నరజన్మముకంటె నాఁడె మేలు ॥హీన॥ (1–3)

—ఇంకను 'హేయమగు జంతువుల యందుబుట్టి పలువేదనలు బడితిగాని నరజన్మలో కలిమిలేములతో నలగి తిరుగుట కంటె నాడే మేలని' వర్ణించెను.

నరుని జీవితము తృప్తిగ సాగుటకే క్రింది విషయములు చాలునని వర్ణించు చున్నాడు.

"గుజ్జరి :— అప్పులేని సంసారమైన పాతేచాలు
తప్పులేని జీతమొక్క-తారమైనఁ జాలు ॥పల్లవి॥
కంతలేని గుడిశొక్క- గంపంతయినఁజాలు
చింతలేని అంబలొక్క- చేరెఁడే చాలు
జంతగాని తరుణి యేజాతైననదెచాలు
వింతలేని సంపదొక్క- వీసమే చాలు ॥అప్పు॥
తిట్టులేని బ్రదుకొక్క- దినమైన నదె చాలు
ముట్టులేని కూడొక్క- ముద్దెడే చాలు
గుట్టుచెడి మనుకుంటే కొంచెము మేలైనఁ జాలు
పట్టి జాలిఁ బడుకంటే వచ్చినంతేచాలు ॥అప్పు॥
లంపట పడనిమేలు లవలేశమేచాలు

రొంపికంబమా కంటె రోయుచేచాలు
రంపపుఁగోరిక కంటే రతివేంకటపతి
పంపున నాతనిఁ జేరే భవమేచాలు ॥అప్పు॥" (1–114)

## సంసారము

సంసారమును గూర్చి 'మంచిదివో సంసారము' అని పలికి ఆ వెనుక మద మత్సరములు మానిన అని వివరించును. సంసారమును ఇట్లు వర్ణించుచున్నాడు.

"భైరవి :– సడిఁ బెట్టెఁ గటకటా సంసారము చూడ
జడధి లోపలి యీఁత సంసారము ॥పల్లవి॥
జమునోరిలో బ్రదుకు సంసారము చూడ
చమురు దీసినదివ్వె సంసారము
సమయించుఁ బెనుదెవులు సంసారము చూడ
సమరంబులోనునికి సంసారము ॥సడి॥
సందిఁ గట్టిన తాడు సంసారము చూడ
సంది కంతలతోవ సంసారము
చందురుని జీవనము సంసారము చూడ
చందమేవలె నుండె సంసారము ॥సడి॥" (1_199)

—అనుచు సంసారము చలువ లోపలి వేడి యనియు వేంకటేశదానులకు సంసారము చలువలకు కడుచలువయని వర్ణించినాడు.

వేరొక సంకీర్తనమున "ఇదివో సంసారమెంత సుఖమోకాని, తుదలేని దుఃఖమును లొదవు గడియించె" (1_308) అని వర్ణించెను.

## కలియుగము

కలియుగమున జలజోదరుడు నిజ సంకీర్తనమున అనుగ్రహించునని పలికిన అన్నమయ్య కలియుగము నక్కడక్కడ వర్ణించినాడు. కలియుగమును గూర్చి

"సామంతం :– కలలోని సుఖమే కలియుగమా, వెన్న
కలలో నెక్కడిదె కలియుగమా ॥పల్లవి॥
కడిగడి గండమై కాలము గడిపేవు
కడుగఁగడుగ రొంపి కలియుగమా

బడలికె వాపవు పరమేదో చూపవు
గడిచీటి యనునీవు కలియుగమా ॥కల॥" (1-118)

అనుచు కలియుగమునందు 'కలలోని సుఖమే' యని వర్ణించెను.

కలికాలములో నెన్నివిపరీతములు జరిగినవో అన్నమయ్య ఈ క్రింది సంకీర్తన మున చక్కగ వర్ణించుచున్నాడు. ఈ సంకీర్తనము వీర బ్రహ్మము గారి కాలజ్ఞాన తత్వములను తలపింపజేయుచున్నది.

"అహిరి :- కటకటా మీరితివి కలికాలమా, పుణ్య
ఘటన గరవెఁబోయెఁ గలికాలమా ॥పల్లవి॥
భూసురుల కామినులు బోయలనాయకులఁ
జేసుకొని యాండ్లై చిచ్చు రికిరి
యీసునను నీ వలన నెక్కువ కులము లెల్ల
కాసుసేయక పోయెఁ గలికాలమా ॥కట॥
అన్నలును జెల్లెండ్లు నాండ్లు మగలునైరి
వన్నెసెడి యతులు ధనవంతులైరి
ఇన్నియును జేసితివి యింకనైనా నీకు
కన్నీరు రాదుగా కలికాలమా ॥కట॥
కోవిదుల మను దొరల కులరాణి వాసములు
త్రోవలనె లంజలై తుద మీరిరి
ఏవంకఁ జూచినా యిట్లనే ధర్మంబొ
గావు వట్టితివిగా కలికాలమా ॥కట॥
పట్టభద్రుల సతులు పలుమారునింద
........................రిపెంబులై దీనులైరి
దిట్టనఁ దిరువేంకటేశ దాసులు నిన్నుఁ
గట్టి వేతురు సుమీ కలికాలమా ॥కట॥" (11-2-77)

—కలికాలములో జరుగుచున్న కార్యములను కన్నులకు గట్టినట్లు అన్నమయ్య వర్ణించినాడు. చివరగ దిట్టలైన శ్రీవేంకటేశదాసులు 'కలికాలమును కట్టివైతురు సుమీ' యని హెచ్చరించినాడు.

## కులము—గుణము

ఏకులమునకు చెందినవాడైనను స్వకర్మమైన ప్రవర్తన లేనిచో అతడు హీనుడని అన్నమయ్య వర్ణించుచున్నాడు.

"సామంతం :- ఎక్కువ కులజుఁడైన హీనకులజుఁడైన
నిక్కమెఱిగిన మహానిత్యుఁడే ఘనుఁడు ॥పల్లవి॥
వేదములు చదివియును విముఖుఁడై హరిభక్తి
యాదరించని సోమయాజి కంటె
యేదియునులేని కులహీనుఁడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుఁడే ఘనుఁడు ॥ఎక్కు॥" (1-318)

—అంతేగాక వేదాంత పఠనంబు గ్రహించి హరిభక్తి లేని సన్యాసి కంటె విష్ణుని వెదకు అంత్యజాతి కులజుడైనను ఘనుడని, శ్రీ వేంకటేశ్వరుని మాహాత్మ్యమును వినియు, చదివియు శ్రీ వేంకటేశుని దాసునిగ బ్రతుక [illegible] వేంకటేశ్వరుని ప్రసాదమును [illegible] నారగించిన యతడే ఘనుడని వర్ణించెను. ఈవిధమైన భావమునే

"పరమము [illegible]
హరిఁ దలఁచలేని [illegible]
మరగి [illegible]
[illegible]" (1-3-9) అను

సంకీర్తనమున వర్ణించినాడు.

## ఆచరణ ప్రాముఖ్యము

మానవుడెన్ని నీతులు చెప్పినను [illegible] ప్రయోజనము లేదని అతడు ఆచరించదగిన విషయములను గూర్చి తెలియజేయుచున్నాడు.

"సామంతం :- ఎంత చదివిన [illegible]
చింతయేల మాను సిరులేల కలుగు ॥పల్లవి॥
ఇతర దూషణములు యెడసినఁ గాక
అతి కాముకుఁడు గాని యప్పుడు గాక
మతి చం[illegible]
[illegible] కలుగు [illegible]

పరధనములయాస పాసినంగాక
అరిది నిందలులేని యప్పుడు గాక
విరసవర్తనము విడిచినఁగాక
పరమేల కలుగు నాపదలేల మాను...... ॥ఎంత॥ (1-62)

—ఇంకను కింక మనసున తొలగి, బొంకుమాటలను విడిచి శంకమాని వేంకటపతి నాత్మ వెదకినప్పుడే జయము గలుగునని వర్ణించుచున్నాడు.

## విధి విధానము

విధికృతము నెదిరించుట యెవ్వరికిని సాధ్యముకాదని వర్ణించుచున్నాడు.

"ముఖారి :— ఎంత సేయఁగ లేదు యిటువంటి విధియభవు
నంత వానిని భిక్ష మడుగుకొనఁజేసె ॥పల్లవి॥
కోరి చంద్రునిఁ బట్టి గురుతల్పగునిఁ జేసె
ఘోర కుడవఁగఁ ద్రిశంకుని వంత్యజునిఁ జేసె
పేరుఁడగునలుఁ బట్టి విద్రూపుఁ జేసె ॥ఎంత॥
అతివ నొడ్డుగఁ జూదమాడ ధర్మజుఁ జేసె
సతినమ్మకొన హరిశ్చంద్రుఁ జేసె
కుతిల పడ సూద్రకుని గొడ్డెముచ్చుగఁ జేసె
మతిమాలి కురురాజు మడుఁగు చొరఁజేసె ॥ఎంత॥
పడని పాట్లఁ బరని బ్రహ్మతల వోఁజేసె
తొడరి కాలుని కాలు దునియఁ జేసె
అడర నీ విధికి విధియగు శ్రీవేంకటేశకృప
పడయ కుండఁగ భంగపడక పోరాదు ॥ఎంత॥" (1-134)

—బ్రహ్మాది దేవతలకు కూడ విధికృతము తప్పలేదట.

## దేహము

దేహము నిట్లు వర్ణించుచున్నాడు.

"బౌళి :— కాయమదే వూరికిఁ గంతలు తొమ్మిది యీయ
పాయక తిరిగాడేరు పాపపు తలారులు ॥పల్లవి॥

కాముఁడనియెడిరాజు గద్దెమీఁద నుండఁగాను
దీము గోపపు ప్రధాని దిక్కులేలీని
కోమలపు జ్ఞానమెల్లాఁ గొల్లఁ బోయనాడనాడ
గామిడులై రింద్రియపుఁగాఁపులెల్లానిదివో ॥కాయ॥" (1-488)

వేరొక సంకీర్తనమున

"యెరవుల దేహలివి నిజమని నమ్మి
యెఱిఁగీ నెఱుఁగ లేరిది యాలా
అరయఁ బరమునకు నాది పురుషుఁడై
పరగు శ్రీవేంకటపతి గలిగుండఁగా" (1-22) అని వర్ణించినాడు.

## దేవుడు — జీవుడు

భగవంతుని యాధిక్యమును భక్తుని దైన్యమును వివరించుచున్నాడు. ఆ వర్ణన మిట్లున్నది.

''గుండక్రియ :- నేనేమిఁ జేయఁగ లేను నీవు పరిపూర్ణుఁడవు
హీనుఁడ నేనధికుఁడ విన్నిటా నీవు ॥పల్లవి॥
దండము వెట్టుటనాది, తప్పులోఁగొనుట నీది
నిండి నీవెప్పుడు దయానిధివి గాన
అండఁబేరు కొంటనాది అందుకు నూఁకొంటనీది
దండియైన దేవ దేవోత్తముఁడవు గాన ......॥నేను॥ (2-433)

—ఇంకను శరణుజొచ్చుట భక్తుని వంతని రక్షించుట భగవంతుని వంతని పలుకు చున్నాడు.

శ్రీపతి శరణాగతి సులభమని అందులకు నారదుడు ప్రహ్లాదుడు, ధ్రువుడు, అర్జునుడు, బలీంద్రుడు వ్యాస సనకాదులు సాక్షియని (2-41) వర్ణించినాడు.

## మంచి మనుజునిలో దేవుడు

దేవుడెక్కడెక్కడనో దూరదూరముగ లేడని మంచి మనుజుని యందే గలడని అన్నమయ్య వర్ణించుచున్నాడు. అనగా దైవము సత్యస్వరూపని అన్నమయ్య భావము ఆ భావముతో యిట్లు వర్ణించుచున్నాడు.

"లలిత :— ఒల్లదు గాక నేఁటిఁ వెుద్దెగింతరు గాక
కొల్లలైన మేలు తన గుణములో నున్నది ॥పల్లవి॥
తలఁచు కొంటేఁ జాలు దైవము మొదవా
(881-1) నిలుచుకు తనలో నే నిండుకున్నాడు
చలపట్టితేఁ జాలు సర్గమేమి దాఁతా
చలివేడి నాలికపై సత్యములో నున్నాదు ॥ఒల్ల॥" (2-7)

....జీవుడు ప్రయత్నింపడుగాని భావించినచో జీవునిలో దేవుడున్నాడని అన్నమయ్య వర్ణించుచున్నాడు.

## మనుజుఁడే దేవుడు (22-1)

మనసు నమ్మనేర్చినచో మనుజుడే దేవుడగునని అన్నమయ్య వర్ణించినాడు.

"లలిత :— మనసు నమ్మ నేర్చితే మనుజుఁడే దేవుఁడౌను
తనలోనే వున్నవాడు తావుకాని దైవము ॥పల్లవి॥
మగనిపై బత్తి తేసి మగువ యొక్కటైతె
తెగి పరలోకము సాధించెనట
...
అగపడి ఘనమోక్షమంద సోదా ... ॥మనసు॥ (2—352)

## మనోగోచరుడే భగవంతుడు

(...) భక్తుడు తన మనసునందు ఏ విధముగ భావించునో ఆరూపములో భగవంతుడు ప్రత్యక్షమగునను భావముతో వర్ణించుచున్నాడు.

"పాడి :— చూచే చూపొకటి సూటి గురి యొకటి
తాచి రెండు నొకటైతే సుండి ॥పల్లవి॥
యేనుగఁ దలఁచితే యేనుగె పొడచూపు
మాను దలంచి నట్టె మానై పొడచూపు
పూనిపెద్ద కొండ దలపోయఁ గొండై ప్రాప్తమౌను
తానే మనోగోచరుఁడు దైవమే సుండి ॥చూచే॥ (2-141)

...అనేకోకము పట్టబయలు దలచగ బట్టబయలుగ అంబుధి దలచగ అంబుధిగను పట్టణము దలచగ పట్టణముగను భావమే శీవాత్ముడై ప్రత్యక్షము పరమాత్మయై ...

వేంకటాద్రిమీఁది శ్రీపతిని దలఁపఁగ శ్రీవేంకటాద్రిమీఁది శ్రీపతిగను గోచరించునని వర్ణించినాడు.

## హరిభక్తుఁడు

హరిభక్తుని లక్షణములవిట్లు చెప్పుచున్నాడు.

"భూపాళం :- ఏకుల జుఁడేమి యెవ్వఁడైన నేమి
ఆకడ నాతఁడె హరి నెఱిఁగిన వాఁడు ॥పల్లవి॥
పరఁగిన సత్యసంపన్నుఁడైన వాఁడె
పరనింద సేయఁడు తత్పరుఁడైన జ్ఞానివాఁడు
అరుదైన భూతదయానిధి యగువాఁడే
పరులు దానేయని భావింపువాఁడు ॥ఏకుల॥ (1-292)

—అని ఇంకను నిర్మలుడై యాత్మరతి గలుగువాఁడు, ధర్మతత్పరబుద్ధి గలిగిన వాఁడు, కర్మమార్గములు గడవనివాఁడు, సతతము నాత్మ నెఱిఁగి మతిలోన పగలేక హితముగ తిరిగుండువాఁడే నిజమైన హరిభక్తుఁడని వర్ణించుచున్నాడు.

హరిని మనమున నిలిపి, నిరంతరమూ దేవుని స్మరించెడి భక్తుఁడు తన దుష్కృత్యమును క్షమింపుమని వేడుకొనుచున్నాడు.

"శ్రీహరి :- అతిదుష్టుఁడ నేనపరాధుఁడను
యితరవివేకమెఱుఁగ నేఁడి ॥పల్లవి॥
ఎక్కడ నెన్నిట యేమి సేసితినో
నిక్కపుఁ దప్పులు నేరములు
గక్కన నిన్నిట కలిగిన నీవే
దిక్కుగా క్షమించ దిక్కేది ॥అతి॥" (1-78)

....అని పలుకుచు పరమపావనుడైన పరమాత్ముని వేడుకొనుటకు 'పాతకుడనై ననేను తగుదునా' యని వేరొక సంకీర్తనమున విన్నవించుచున్నాడు.

"సామంతం :- పరమ పాతకుఁడ భవబంధుఁడ శ్రీ
హరి నినుఁ దలఁచ నేనరుహుఁడనా ॥పల్లవి॥

అపవిత్రుఁడ నేనలసుఁడను
నవగత పుణ్యుఁడ నలసుఁడనే
కపట కలుష పరికర హృదయుఁడనే
నపవర్గమునకు నరుహుఁడనా ॥పర॥" (1–33)

—ఇంకను 'అతి దుష్టుడ నధిక దూషితుడనని, అదయుడనై హత వివేక మతినైతిని. గాన నిను వినుమతింపగ నేనరుహుఁడనా' యని సంశయమును వెలుపరించుచున్నాడు

ఇంకొక సంకీర్తనమున భక్తుడు తన గుణదోషముల నెంచకయే భగవంతుడు వరమీయ వలయునని వేడుకొనుచున్నట్లు వర్ణించుచున్నాడు ఆ వర్ణన మిట్లున్నది.

"శంకరాభరణం :– నీవు సర్వసముఁడవు నీవు దేవదేవుఁడవు
యీవల నాగుణ దోషాలెంచనిఁక నేలా ॥పల్లవి॥
పూవులపైఁ గాసీఁ బొరిముండ్లపైఁ గాసీని
ఆవల వెన్నెల కేమి హాని వచ్చీనా
పావనుల నటుగాచి పాపపుంజమైననన్నుఁ
గావఁగా నీ కృపకునుఁ గడమయ్యీనా ॥నీవు॥" (2129)

....సర్వసముడైన భగవంతుని భక్తుడు ప్రార్థించుట యిందున్నది. గోవుమీద విసరినను కుక్కమీద విసరినను పావనపుగాలికి పాపమంటలేదు. కావున దేవతలను రక్షించిన భగవంతునికి భక్తుని రక్షించినచో దోషము కాదుగదా యని పలుకుచున్నాడు. ఎండ కులజుని యింటిలోను, కులహీనుని ఇంటిలోను ఉండగ హీనము కాలేదు గావున శ్రీ వేంకటాద్రిలో వరములిచ్చిన భగవంతుడు భక్తునిలో నిలిచి వరమీయ వలెనని వేడు కొనుచున్నాడు.

## దైవభావము

ఎవరెవరికి ఏయే పదార్థములు దైవముతో సమానమో అన్నమయ్య చక్కగా వర్ణించుచున్నాడు.

"దేసాక్షి :– అంచిత పుణ్యులకైతే హరిదైవ మవుఁగాక
పంచమహా పాతకుల భ్రమ వాపపశమా ॥అంచిత॥
కానని యజ్ఞానులకు కర్మమే దైవము
అనిన బద్ధులకు దేహమే దైవము

మూనని కాముకులకు మగువలే దైవము
వానిపట్టి వారి భ్రమ మాన్పవశమా ॥అంచి॥" (2–498)

—ఇంకను ఏమియును తెలియని వారికి యింద్రియములు, సంసారికి ఊరిదొర, తామసులకు ధనము, అహంకారులకు తామే, దరిద్రునకు దాత దైవములు కాగ భక్తులకు మాత్రము శ్రీవేంకటేశుడే దైవమని వర్ణించెను.

## బ్రాహ్మణులను గూర్చి

ఎవరు బ్రాహ్మణులో అన్నమయ్య ఈ క్రింది సంకీర్తనమున వర్ణించుచున్నాడు. కులము ప్రధానము కాదని, గుణాధిక్యమునే గణింపవలెనని గుణమునుబట్టి బ్రాహ్మణత్వమును నిర్ణయింపవలెనని వర్ణించుచున్నాడు ఆ వర్ణన మిట్లున్నది.

"శ్రీరాగం :— అణురేణు పరిపూర్ణుడైన శ్రీవల్లభుని
బ్రణుతించు వారువో బ్రాహ్మలు ॥అణు॥
హరినామములనె సంధ్యాది విధులొనరించు
పరిపూర్ణమతులు వో బ్రాహ్మలు
హరిమంత్రవేద పారాయణులు హరిభక్తి
పరులైన వారువో బ్రాహ్మలు ॥అణు॥" (1–365)

....ఇంకను అన్నిటహరిగలడని దేవకీ నందనుడే దేవుడని, ఆదినారాయణుని ఎల్లప్పుడు తమ యాత్మలో నిలిపి, వేదరక్షకుడైన వేంకట గిరీశుని పాదసేవకులుగ మెలగువాడు బ్రాహ్మణులని వర్ణించినాడు.

## హరిదాసులధికులు

హరిదాసులు దేవతలకు కన్నులవంటి వారై అన్నిటను అధికులుగ ఉన్నారని వర్ణించుచున్నాడు.

"మలహరి :— అన్నిటాను హరిదాసులధికులు
కన్నుల వంటివారు కమల జాదులకు ॥అన్ని॥
అందరును సమమైతే నరుహానరుహములేదా
అందరిలో హరియైతే నౌఁ గాక
చెందితో విప్రునిఁదెచ్చి పూజించి నట్టువేతే
పొందుగాని కనకముఁ బూజింపఁదగునా ॥అన్ని॥" (2-170)

—'విప్రునిదెచ్చి పూజించినట్టు' అని తెలిపిన పల్లవులను విప్రకులమున జన్మించిన వానిని అని అర్థముగాదు. విప్రుని లక్షణముల నింతకుముందే వివరించినాడు. ఆ విధమైన లక్షణములు గలవాడు ఏకులమునకు చెందినవాడైనను విప్రుడేనని అన్నమయ్య భావము.

వేంకటేశుని భక్తుల కెదురులేదను భావముతో ఈ విధముగ వర్ణించుచున్నారు.

"భూపాళం :- ఆకాశమడ్డమా అవ్వలయు నడ్డమా
శ్రీకాంతు భజియించు సేవకులకు ॥ఆకా॥
పాతాళ మడ్డమా బలిమధను దాసులకు
భూతలం బడ్డమా పుణ్యులకును
సేతు కైలాసములు చిర భూము లిన్నియును
పైత్రోవలట పరమ భాగవతులకును ॥ఆకా॥ (12–88)

—హరిభక్తులకు పాతాళము కాని భూతలము కాని అడ్డముగాదని 'సేతు కైలాసములు చిరభూము'లని వర్ణించినాడు.

శ్రీవేంకటేశుని పూజించుటకు నానా విధములైన భక్తులు సేవించుటకు వచ్చుచున్న వృత్తాంతమును చక్కగ వర్ణించుచున్నాడు.

"అహిరి :- నానాదిక్కుల నరులెల్ల
వానలలోనే వత్తురు గదలి ॥నానా॥
సతులు సుతులు పరిసరులు బాంధవులు
హితులు గొలువగ నిందరును
శతసహస్రయోజన వాసులు [illegible]
వ్రతములతోడనే వత్తురు గదలి [illegible] (1–346)
ముడుపులు జాళెలు మొగి తలమూటలు
కడలేని ధనము గాంతలును
కడుమంచి మణులు [illegible]
వడిగొని చెలఁగుచు వత్తురు గదలి ॥నానా॥

మగుట వర్ధనులు మండలేశ్వరులు
జగదేక పతులుఁ జతురులును
తగు వేంకటపతి దరుశింపఁగ బహు
వగల సంపదల వత్తురు గదరి ॥నానా॥" (1-345)

— శ్రీ వేంకటేశుని దర్శించుటకు వచ్చిన భక్తులను వారు తెచ్చిన కానుకలను స్వభావ సుందరముగ అన్నమయ్యపై సంకీర్తనమున వర్ణించినాడు.

వేంకటనాధుని తిరునాళ్ళకు మానవ భక్తులే కాదట ; దేవతలు కూడ వచ్చు చున్నారట ; తిలకించుటకు వచ్చిన దేవతలకు వీడ్కోలు చెప్పెడి వృత్తాంతమును అన్నమయ్య యిట్లు వర్ణించుచున్నాడు.

"ముఖారి : భోగీంద్రులును మీరుఁ బోయిరండు
వేగన మీఁదటి విభవాలకు ॥పల్లవి॥
హరుఁడ పోయిరా ; అజుఁడ నీవును పోయి
తిరిగిరా మీఁదటి తిరునాళ్ళకు
సురలు మునులును భూసురలుఁ బోయిరండు
అరవిరి నిన్నాళ్ళు నలసితిరి ॥భోగీం॥
జముఁడ పోయిరా శశియు నీవును బోయి
సుముఖుడవై రా సురలఁ గూడి
గుములై దిక్పతులు దిక్కులకుఁ బోయిరండు
ప్రమదాన నిన్నాళ్ళు బడలితిరి ॥భోగీం॥
నారదసన సనందనాదులు
భూరి విభములతో బోయి రండు
దూరముగాఁ బోకిట్టె తొరలి వేంకటగిరి
జేరి తన్నిట్లనే సేవించుఁడీ ॥భోగీం॥ (1-369)

— వచ్చినవారికి వీడ్కోలు చెప్పుచు, దూరముగ వెళ్ళక వేంకటగిరి పైన నున్న వేంకటపతిని కొలువ వలెనని వేంకటపతియే పలుకుచున్నాడు.

భగవంతునకేది యిష్టమో అది భక్తుని దగ్గర ఉన్నదట । ఆ విషయమునే అన్నమయ్య యిట్లు వర్ణించుచున్నాడు.

"మాళవి గౌళ ; ఎందుకు విచ్చేయనేల ఇన్నియు నాలోనివే.
అంది యివే చేకొనవే అరడి నీకేల ॥పల్లవి॥
కాముకుఁడవై గోపికలఁ బొందఁ బ్రియమైతే
కాముకత్వము నాయందు గల దెంతైనా
గోమున కంసాదులపై క్రోధమే ప్రియమైతే
నాముల క్రోధ మిదివో నాలో నున్నది ॥ఎందు॥" (2–448)

— ఇంకను లోకుల చీరలీకుండు లోభము ప్రియమైనచో లోభము నాలో గలదని, మద్దిమానులు పడగొట్టు మదము ప్రియమైనచో మదమున్నదని, శిశుపాలునిపై మచ్చరము ప్రియమైనచో మచ్చరమున్నదని, శ్రీ వేంకటపతి దాసులపై మోహము ప్రియమైనచో 'దాసుడనని అన్నమయ్య వర్ణించెను.

పురుషోత్తముని సేవింపక మనుజుని సేవలో కాలము వ్యర్థముగ గడిపెడు వారిని అసహ్యించు కొనుచు అన్నమయ్య యిట్లు వర్ణించెను.

"సామంతం : మనుజుఁడై పుట్టి మనుజుని సేవించి
అనుదినము దుఃఖ మందనేలా ॥పల్లవి॥
జుట్టెఁడు గడుపుకై చొరని చోట్లు చొచ్చి
పట్టెఁడు గూటికై బతిమాలి
పుట్టిన చోటికే పొరలి మనసు పెట్టి
వట్టి లంపటము వదలనే రదు గాన ॥మను॥" (1–196)

— అందువలన మనుజుని సేవించి కాలము పుచ్చకఁ అందరిలో పుట్టి అందరిలో బెరిగి అందిరి రూపములు తానైన శ్రీ వేంకటాద్రీశుని సేవించి అందరాని పద మంద వలెనని వర్ణించుచున్నాడు.

జగన్మోహనుడైన జగన్నాథుని ఎంత సేవించినను వెలితిగ నున్నదని అన్నమయ్య వర్ణించుచున్నాడు.

"బౌళి ; జగన్మోహ నాకారచతురుఁడవు పురుషోత్తముఁడవు
వెగటు నానోదంబు ఇది నీ వెలితో నా వెలితో ॥పల్లవి॥

యెన్ని మారులు సేవించినఁ గన్నులూ దనియవు
విన్ననీ కథామృతమున వీనులుఁ దనియవు
సన్నిధిని మిమ్ము నుతియించి సరస జిహ్వయుఁదనియదు
విన్నకన్నది గాదు ఇది నీ వెలితో నా వెలితో ॥జగ॥

.... .... .... .... .... .... .... ....

చెలఁగె నినుసేఁ బూజించి చేతులూఁ దనియవు
చెలువు సింగారంబు దలఁచి చిత్తమూఁ దనియదు
అలరి శ్రీ వేంకట గిరీశ్వర ఆత్మనను మోహించఁ జేసితి
వెలయ నిన్నియుఁ దేరెమును నీ వెలితో నా వెలితో ॥జగ॥ (2–375)

— ఎంత పూజించినను తృప్తి తీరుట లేదట । అది 'నీ వెలితో, నా వెలితో' అని భక్తుడైన అన్నమయ్య ప్రకటించుచున్నాడు.

ఈ విధముగ అన్నమయ్య ఆధ్యాత్మిక ప్రపంచమునగల అనేకములైన వర్ణనలను గమనింపవచ్చును. అన్నమయ్య ప్రతి సంకీర్తనము నందు ఏదేనొక ప్రత్యేకతను ప్రదర్శించి వర్ణించును. అది అన్నమయ్య సహజగుణము.

## వేల్పుల వర్ణనలు

అన్నమయ్య కవితా ప్రవాహ మనేక పాయలుగ ప్రవహించినది. అనేక ప్రాంతములను పావనము చేసినది శ్రీ వేంకటాద్రిపై వెలసిన వైష్ణవ మూర్తులను అన్నమయ్య వర్ణించి తరించినట్లు పూర్వోక్తము. అయా ప్రాంతములందు వెలసిన అయా దేవతా మూర్తులను అన్నమయ్య తనివి తీర వర్ణించిన తీరు నిట్లు పరిశీలింపవచ్చును. ఏ దేవుని వర్ణించినను 'వేంకటపతి' ముద్రను మాత్రము అన్నమయ్య వీడలేదు. అహోబలమున వేదాంతాధ్యయనము గావించిన అన్నమయ్య నరసింహస్వామిని అనేక సంకీర్తనములందు ప్రశంసించినాడు. ఆ వర్ణన లిట్లున్నవి.

## నరసింహుడు

అహోబలము : అహోబలమున వెలసిన నరసింహుని యిట్లు వర్ణించుచున్నాడు.

"నాట ; అహోబలేశ్వరుఁడరి కులదమనుఁడు
మహామహిమలను మలసీ వాఁడె ॥పల్లవి॥

కదలుఁ గన్నులును కరాళ వదనము
గుదిగొను భయదపుఁ గోరలును
అదరు మీసములు నలరఁగ నవ్వుచు
వుదుటు తోడఁ గొలువున్నాడు వాఁడె ॥అహో॥" (2–112)

— అహోబలము నందలి ఉగ్రనారసింహుని వర్ణన మిందున్నది.

దిగువ అహోబలము : అహోబలపు కొండ గుహలోని నారసింహుని వర్ణన మిట్లున్నది.

"రామక్రియ : అల్లవాఁడే గద్దె మీఁద నౌభళపు గుహలోన
యెల్లవారిఁ గరుణతో నేలు కొన్నాడు ॥పల్లవి॥
ఉక్కు గంబమునఁ బుట్టి వుగ్రనారసింహుఁడు
మొక్కలపు హిరణ్యుని ముందల వట్టి
గక్కన గరుపు చించి ఘనమైన పేగులు
వెక్కసపు జంద్యాలుగా వేసుకొన్నాడు ॥అల్ల॥" (11–210)

## పెద్ద అహోబలము

పెద్ద అహోబలములోని పెను నరసింహుని వర్ణన మిట్లున్నది.

"శంకరాభరణం: మలసీఁ జూడరో మగసింహము
అలవి మీఱిన మాయల సింహము ॥పల్లవి॥
అదివో చూడరో ఆదిమ పురుషుని
పెదయౌభళము మీఁది పెను సింహము ...." (1–13)

## ఓగు నూతుల

ఓగునూతలలో వెలసిన అహోబల నారసింహుని వర్ణన మిట్లున్నది.

"ముఖారి : ఇంత కంటె నెవ్వరికి నెచ్చరాదు కుందరాదు
వంతలఁ దగరై తాఁక వచ్చునటయ్యా ॥పల్లవి॥
వోఁగు నూతు లౌభళేశ వొద్దికి నీ చెలి వాసె
పొగిన సభలలోన చలివాసె
రేఁగిన కోపము మాసె రేయే పగలు సేసె
చేఁగల నీకేమి సేసు చెప్ప గదవయ్యా ॥ఇంత॥" (30–178)

కదిరి

కదిరిలో వెలసిన నారసింహుని యవతారము నిట్లు వర్ణించుచున్నాడు.

"నాట : కదిరి నృసింహుఁడు కంభమున వెడలె
విదితముగా సేవించరో మునులు ॥పల్లవి॥
ఫాలలోచనము భయదోగ్ర ముఖము
జ్వాలామయ కేసరములును
కాలరౌద్ర సంఘటిత దంతములు
హేలాగతి ధరియించుక నిలిచె ॥కది॥" (10-32)

— ఇందు కదిరి నరసింహుని రౌద్ర స్వరూపము వర్ణింపబడినది.

పేరెవరము

పేరెవరములోనున్న అహోబలేశునిట్లు వర్ణించుచున్నాడు.

"కాంబోది : ........వెక్కులఁ జెమట గార చెలిపయ్యెద దడిసె
గక్కన నెంత మనసు గరఁచితివో
యెక్కువ శ్రీ వేంకటేశ యీడఁ దెరియవరాన
వొక్కటఁ గూడితివిట్టె వోబుళేశుఁడవై " (38-145)

— ఇంకను సంపుటి 28 సంకీర్తనము 129లో కూడ వర్ణించినాడు.

భువనేశ్వరము

భువనేశ్వరములో ప్రకృతి రమణీయముగ నున్న ప్రాంతమున వెలసిన నారసింహమూర్తి నిట్లు వర్ణించుచున్నాడు.

"బౌళి .... పువ్వుల తోఁటల నీడ భువనేశ్వరము లోన
జవ్వనపు మనుజ కేసరి
ఇవ్వల శ్రీ వేంకటాద్రి నిరవై వరములిచ్చి
నవ్వు మోము తోడ భువనము లేలీ వీఁడే" (11-217)

మండెము

మండెములో వెలసిన శృంగార మూర్తియైన నారసింహుని వర్ణన మిట్లు చేయుచున్నాడు.

"దేశాక్షి : ఎంత మానపతివి నిన్నేమి చెప్పేటి
మంతనము లాడేవు మండెము నారసింహా ॥పల్లవి॥
చేరి విడె మిమ్మంటే సిగ్గులు వడేవు నీవు
వోదినీ సవతెవ్వతైనా వున్నదా యీడ
గోర నిన్ను గీరఁగాను గొబ్బున వేఁడు కొనేవు
ఆరీతు లెవ్వతైనా నిన్నాడు కొనీనా ॥ఎంత॥" (29–214)

— ఇంకను మోము చూచి నవ్వినచో మ్రొక్కుచున్నాడట ! మాటలాడినచో మౌన వ్రతము నవలంబించుచున్నాడట !

వేరొక సంకీర్తనమున యిట్లు వర్ణించుచున్నాడు.

"నవరసాలంకార నారసింహావో
నవనీత చోర శ్రీ నరసింహా
నవగుణి వేంకట నారసింహా వో
నవమూర్తి మండెము నారసింహా" (1-259)

## ముడియము

"సాళంగనాట ; జయమాయె నీకు నాపె సరసముతా
నయగారి ముడియము నారసింహా" (17–39) అని

ముడియములో వెలసిన నారసింహుని శృంగార రూపమును వర్ణించెను.

## వేంకటాద్రి

వేంకటాద్రి నారసింహుని వర్ణన మిట్లున్నది.

"ఆహిరి .... వలపు పై నీకె నీపై పరాకున చెలితోడ
అలిమిటి నిన్నుఁ జూపేకాంత మాడఁగా
మెలయు శ్రీ వేంకటాద్రి మీఁద వచ్చి కూడితివి
చెలఁగు వట్టి చొక్కుతా శ్రీ నరసింహా" (25–161)

— ఇంకను సంపుటి 1– సంకీర్తనములు 281, 421లలో కూడ వర్ణించినాడు.

## వేదాద్రి

వేదాద్రి గుహలో వెలసిన నారసింహుని వర్ణన మిట్లున్నది.

"సాళంగనాట ; ఆదిమ పురుషుడు అహోబలమునను
వేదాద్రి గుహలో వెలసేవాఁడె ॥పల్లవి॥
.... .... .... .... ... .... ....
సేవలు గొనె చెలఁగి సురలచే
శ్రీ వెంకట నరసింహుఁడు. ॥ఆది॥" (9-218)

నవనారసింహులు

ఆయా ప్రాంతములందు వెలసిన నారసింహుని మూర్తుల నిట్లు వర్ణించుచున్నాడు.

"నాట :- నవనార సింహా నమో నమో
భవనాశితీర యహోబలనారసింహా ॥పల్లవి॥
సతత ప్రతాప రౌద్ర జ్వాలా నారసింహా
వితత వీరసింహ విదారణా
అతిశయ కరుణ యోగానంద నరసింహ
మతి శాంతపు కానుగు మాని నారసింహ ॥నవ॥
మరలి బీభత్సపు మట్టెమళ్ళ నరసింహ
నరహరి భార్గోటి నారసింహ
పరిపూర్ణ శృంగార ప్రహ్లాద నరసింహ
సిరుల నద్భుతపు లక్ష్మీ నారసింహ ॥నవ॥
వదన భయానకపు వరాహ నరసింహ
చెదరని వైభవాల శ్రీ నరసింహా
అదన శ్రీ వేంకటేశ అందునిందు నిరవై తి
పదివేలు రూపముల బహునారసింహ ॥నవ॥ (1-453)

— ఈ సంకీర్తనమున నవనారసింహ మూర్తులను వర్ణించుచు నవరసముల ప్రస్తావన గావించినాడు. హాస్య రసము తప్పక మిగిలిన రసముల నన్నిటిని ప్రస్తావించినాడు. ఆయా ప్రాంతములందు వెలసిన నారసింహ మూర్తుల స్వరూపములివి యని వర్ణించినాడు.

## లక్ష్మీదేవి

అహోబలమున వెలసిన లక్ష్మీదేవి వర్ణన మిట్లున్నది.

"రామక్రియ :— గరుడాద్రి వేదాద్రి కలిమి యీపె
సిరులొసఁగఁ జూడరో చింతామణి యీపె ॥పల్లవి॥
.... .... .... .... .... .... .... ....
పాల జలధిఁ బుట్టిన యీపె
లాలిత శ్రీ నరసింహు లక్ష్మి యీపె
.... .... .... .... .... .... .... ....
ఇచ్చటి వేంకటాద్రి నీ యహోబలమునందు
నిచ్చ లూదావు కొనిన విధాన మీపె ...." (11—227)

## వేంకటేశ్వరుడు

కంభము : శృంగార మూర్తియైన కంభము రాయని వర్ణన మిట్లున్నది.

"ముఖారి : కరుణించవయ్య మమ్ముఁ గంభము రాయ
పెరె దేవుని కొలువ పెద్ద కంభము రాయ ॥పల్లవి॥
కలకల నవ్వు దేరెఁ గంభము రాయ ఇంతి
కలికి తనాలు చూడు కంభము రాయ ...." (24—420)

— ఇంకను కలిమి కాంత తొడ యెక్కి కలువ దండ వేసినదట । ఇందలి వర్ణనా చమత్కారమును గమనించినచో కంభము రాయని కాంత ఆయన తొడ యెక్కి దండను వేయుచున్నదని తెలిసి కొన వచ్చును. 'కలువదండ వేసినదని' వర్ణింప వచ్చును కదా । అన్నమయ్య కావున అవిధముగ వర్ణింపడు. తన ప్రత్యేకతను ప్రదర్శింపవలెను కదా । అందువలనే శృంగార మూర్తియైన కంభము రాయునికి కొంత చేత 'అవిధముగ' దండవేయించినాడు.

కడప : కడపలోని వేంకటాద్రి రాయుని వర్ణన మిటున్నది,

"పాడి : కలసి కాఁగిట నిద్దె కడప రాయ నన్నుఁ
గలికిఁ జేసితి వింత కడపరాయ
కల కాలమును మాకు కడపరాయ
కలవు శ్రీ వేంకటాద్రి కడపరాయ—" (24—403)

— ఇంకను కడప రాయుని 24-472, 25-153, 252 సంకీర్తనము లందు వర్ణించినాడు.

### కోన

కోన తిరు వేంగళేశుని వర్ణన మిటున్నది.

"మాళవి గౌళ : కోన తిరు వేంగళేశ కోడె కాడా
అనించేనీ సతి నీపై అప్పటి వలపులు" (29-242)

### చింతకుంట

చింతకుంట కంభము రాయని వర్ణన మిటున్నది.

"సామంతం : ఘనుఁడవు చింతకుంట కంభము రాయ/ మము
గనుఁగొని రక్షించు కంభము రాయ ॥పల్లవి॥
.... .... .... .... .... .... .... .... .... .... .... ....
కమ్మకొనెఁ బులకులు కంభము రాయ
కమ్మని శ్రీ వేంకటాద్రి కంభము రాయ ॥ఘను॥" (29-209)

### చెప్పల్లి

"శంకరాభరణం; కాఁగిలిదే చాలదా కన్నుల మొక్కఁగ నేల
నాఁగు వారే ననుపుల ననుఁ బోటికి
అఁగి కూడితివి నన్ను అలసితి రతులలో
వీఁగేవు చెప్పల్లి శ్రీ వేంకట రామా" (13-307)

— నాయకుడాగి కూడినపుడు నాయిక 'అలసితి రతులలో' అని పలికినది.

### నెలదలూరు

నెలదలూరి చొక్కనాధుని వర్ణన మీ విధముగ ఉన్నది.

"దేశాక్షి : చేరఁ బిలువకే వుంటే సిగ్గయినా విడిచేవు
గారవించినంతలోనే కాలు దొక్కేవు
వోరి శ్రీ వేంకట గిరి నుండి వచ్చి కూడితివి
మేరతో నెలఁదలూరి మేటి చొక్క నాధా" (26-175)

### పాలగిరి

పాలగిరిలోని శృంగారమూర్తి నీ విధముగ వర్ణించుచున్నాడు.

''శంకరాభరణం: కంటిరా నీ గుణమెల్ల కడగడనే
పంటి మోవితేనె కాఁద పాలగిరి రాయఁడా ॥పల్లవి॥

.... .... .... .... .... ... .... .... .... ....

అంతలో మఱచితిరి ఆయము నీ వంటేవని
సంతమైతి నీ కౌఁగిట చాలుఁ జాలురా
యింతటి జాణఁడ నీకు ఇటు మొక్కేరా
పంతపు శ్రీ వేంకటాద్రి పాలగిరి రాయఁడా ॥కంటి॥'' (30-182)

— శృంగారమూర్తియైన పాలగిరి రాయని గుణమెల్ల నాయిక కన్నదట ; ఎక్కడ ? 'పంటి మోవి తేనె కాడ'. నేర్పరియైన నాయకుని పనులకు తట్టుకొనలేని నాయిక నాయకునకు మ్రొక్కుచున్నది.

## మతంగాద్రి

మతంగ పర్వతముపై నున్న శ్రీ వేంకటేశ్వరుని వర్ణన.

''లలిత : మతంగ పర్వతము మాల్యవంతము నడుమ
సతమై శ్రీ వేంకటేశ్వరుఁడున్నవాడు ॥పల్లవి॥
కొలిచిన వారి కెల్లా కోరిన వరములిచ్చి
తలచిన వారినెల్లా ధన్యులఁ జేసి
పొలుపు మిగుల మంచి పువ్వుల తోటల నీడ
విలసిల్లినదివో శ్రీ వేంకటేశ్వరుఁడు ॥మత॥ (10-165)

— మతంగాద్రిపై వెలసిన శ్రీ వేంకటేశ్వరుడు కొలిచిన వారి కెల్లను కోరిన వరములిచ్చి తలచిన వారి నెల్లను ధన్యులను చేయుచున్నారట.

## విజయనగరము

విజయనగరపు వేంకటేశుని శృంగార వర్ణన మిట్లున్నది.

''ధన్నాసి : పూరకే నీ వాడివట్టి పుంతున పెట్టి నితఁడు
గారవపుఁ గాఁగిటను కళ రేఁచవే
కోరి విజయ నగరపు కోనేటి శ్రీ వేంకటేశుఁ
డీతి నిన్ను గూడె నిన్నిటాను మెచ్చవే'' (24-372)

— చెలి పలుకుల మూలమున విజయనగరపు కోనేటి వేంకటేశుని వర్ణన గావించినాడు. నాయికను అన్నిటను శ్రీ వేంకటేశుడాదరించినాడు. కావున మెచ్చుకొనవలసిన దని చెలి నాయికకు చెప్పుచున్నది.

శ్రీరాముడు

వేంకట నాథుని భక్తుడైన అన్నమయ్య శ్రీరాముని కూడా వర్ణించి తరించినాడు. ఆయా ప్రాంతములలో వెలసిన రామమూర్తిని వేంకట రామునిగ వర్ణించినాడు. ఆ వర్ణనలనిట్లు చెప్పవచ్చును.

ఒంటి మెట్ట

"నాట : ఇందులోనే కానవచ్చీ యితఁడు దైవమని
విందువలె నొంటి మెట్ట వీర రఘు రాముని ॥పల్లవి॥
యెందుచొచ్చె బ్రహ్మ వరమిల రావణు తలలు
కందువ రాఘవుఁడు ఖండించినాడు
ముందటి జలధి యే మూల చొచ్చెఁ గొండలచే
గొంది బడఁ గట్టివేసి కోపగించేనాడు ॥ఇందు॥" (1–477)

— బ్రహ్మ వరమున్నను రావణుని తలలను రాముడు ఖండించినాడు కావున యిందులోనే రాముడు దైవమని తెలిసికొనివలెనని వర్ణించినాడు.

గండికోట

గండికోట శ్రీ రాముని శృంగారమూర్తిని వర్ణించుచున్నాడు.

"దేవగాంధారి : రాజవు నీకెదురేది రామచంద్ర
రాజీవ నయనుఁడ రామచంద్ర ॥పల్లవి॥
.... .... .... .... .... .... ....
నా వంటి సీతను నాఁగేటి కొనఁదెచ్చితి
రావాడి తమకముతో రామచంద్ర
యీ వేళ శ్రీ వేంకటాద్రి నిరవై నన్నుఁ గూడితి
చేవదేర గండికోట శ్రీ రామచంద్ర ॥రాజ॥" (25–165)

— ఈ సంకీర్తమున 'నన్ను గూడితి చేవదేర' అని నాయిక పలికినది. 'చేవదేర' చక్కని పద ప్రయోగము.

## గుత్తి

గుత్తిలో వెలిసిన శ్రీ రాముని వర్ణన మిట్లున్నది.

''పాడి : సౌమిత్రి సహోదర దశరథరామా
చేముంచి గుత్తిలో వెలసిన రఘురామా ॥పల్లవి॥
.... .... .... .... .... .... .... ....
రావణాది దనుజహరణ రామా
.... .... .... .... .... .... .... .... .... ....
శ్రీ వేంకటాద్రి మీఁది శ్రీరామా ॥సౌమి॥'' (9-210)

## వావిలిపాడు

వావిలిపాటిలో వెలిసిన రామమూర్తి ని యిట్లు వర్ణించుచున్నాడు.

"బలిమి మించిన దైవికముతో భక్త సులభుఁడు రాముఁడు
నిలిచి తన సరిలేని వేలువు నిగమ వంద్యుఁడు రాముఁడు
మెలుపు శ్రీ వేంకట గిరీంద్రము మీఁది దేవుఁడు రాముఁడు
వెలసె వావిలి పాటి లోపల వీర విజయుఁడు రాముఁడు'' (2-178)

## విజయనగరము

విజయ నగర రాముని ఆలంకారిక వర్ణన మిట్లున్నది.

''పాడి : రాముఁడు లోకాభిరాముఁడు త్రైలోక్య
ధాముఁడు రణరంగ భీముఁడు వాఁడె ॥రాము॥ ....
బలుఁడు యిన్నిటా రవి కులుఁడు భావించని
ర్మలుఁడు నిశ్చలుఁడవి కలుఁడు వాఁడే
వెలసి శ్రీ వేంకటాద్రి విజయనగరములోన
తలకొనెఁ బుణ్య పాదతలుఁడు వాఁడే ॥రాము॥'' (2-219)

## వేంకటాద్రి

వేంకటాద్రిపై వెలసిన వేంకట రాముని వర్ణన మిట్లున్నది.

"సాళంగనాట ; శరణు శరణు విభీషణ వరదా
శరధి బంధన రామ సర్వ గుణ స్తోమ ॥పల్లవి॥
.... .... .... .... .... .... .... .... .... ....

శంకర చాప భంజక జానకీ మనోహర
పంకజాక్ష సాకేత పట్టణాధీశ
అంకిత బిరుద శ్రీ వేంకటాద్రి నివాస
ఓంకార రూప రామ పురు సత్య కామ ॥శర॥" (2–220)

ఈ విధముగా శ్రీ రాముని వర్ణనలు మొత్తము మీద శృంగార సంకీర్తనము లందుకంటె ఆధ్యాత్మిక సంకీర్తనము లందధికముగ ఉన్నట్లు గమనింపవచ్చును.

## హనుమంతుడు

### కలశాపురము :

"పాడి : కలశాపురము కాడ గంధపు మాకుల నీడ
నలరేవు మేలు మేలు హనుమంతరాయ ॥పల్లవి॥
సంజీవి కొండ దెచ్చి సౌమిత్రి బతికించితి
.... .... .... .... .... .... .... .... .... ....
లంకసాధించితివి సీలావులెల్లాఁ జూపెంచితివి
కొంకక రాముని సీతఁ గూరిచితివి
లంకెల సుగ్రీవునికి లలిఁ బ్రధాని వైతివి ॥కలశా॥
.... .... .... .... .... .... .... .... .... ....
దిక్కులు గెలిచితివి ధీరతఁ బూజ గొంటివి
యిక్కువతో శ్రీ వేంకటేశ్వర బంటవైతివి ....'' (9–232)

— హనుమత్కథ ఈ సంకీర్తనమున స్థూలముగ వర్ణింపబడినది.

### దిగువ పట్టణము

దిగువ పట్టణమున (తిరుపతి) వెలసిన హనుమంత రాయుని వర్ణన మిట్లున్నది.

''రామక్రియ ; మగటి మిగల హనుమంతరాయ
దిగువ పట్టణములోని దేవ హనుమంత ॥పల్లవి॥
చక్కఁగా దోఁక చాఁచి జంగపెట్టి చేచాఁచి
అక్కజపు ప్రతాపపు హనుమంతుఁడా
రక్కసుని దునుమాడి రాముని దేవులకు
దిక్కై వుంగర మిచ్చిన దేవ హనుమంత ॥మగ॥'' (2-260)

మంగాంబుధి

"శంకరాభరణం: ఏలవయ్యా లోకమెల్ల యిట్టి రాము దేవేసవే
నీలవర్ణ హనుమంత నీకు మాకు రక్ష ॥పల్లవి॥
అంగపు నీ తేజమున కగ్ని దేవుడు రక్ష
శృంగారమున కెల్లా శ్రీ పతి రక్ష
మంగాంబునిధి హనుమంత నీకే కాలము
చెంగట శ్రీ వేంకటాద్రి శ్రీ రామరక్ష ...." (11-164)

మతంగగిరి

మతంగగిరిపై నున్న పెద్ద హనుమంతుని వర్ణన మిట్లున్నది.

"నాట : అందరిలోనా నెక్కుడు హనుమంతుడు
కందువ మతంగ గిరి కాడి హనుమంతుడు ॥పల్లవి॥
కనక కుండలాలతో కౌపీనము తోడ
జనియించినాడు యీ హనుమంతుడు
ఘన ప్రతాపము తోడ కఠిన హస్తాలతోడ
పెనుతోక యెత్తినాడు పెద్ద హనుమంతుడు ॥అంద॥" (2-207)

ఇంకొక కీర్తనమున 'ఏమని నుతింప వచ్చు నితని రూపము' (11-350) అని వర్ణించినాడు.

వితలము

వితలములోని ఆంజనేయుని స్వభావోక్తిలో వర్ణించుచున్నాడు.

"సాళంగనాట : మొక్కరో మొక్కరో వాడె ముందర నిలుచున్నాడు
యెక్కువ రాముని బంటు యేకాంగ వీరుడు ॥పల్లవి॥
పెనచి తొడలు దాక పెద్ద పదకము వేసె
తనువుపై వేలాడే దండల తోడ
అనయము శ్రీ వేంకటాద్రి దేవుని బంటు
వెను బలమై యున్నాడు వితలములోనను" (9-12)

విజయనగరము

విజయనగరము నందలి అంజనా సుతుని వర్ణన మిట్లున్నది.

"శంకరాభరణం: అంజనా సుతుఁడితఁడా అక్షర మర్దనుఁడితఁడా
సంజీవిని కొండఁ దెచ్చె సారెనితఁడా
భంజించెఁగాలనే మిని పంతమున నితఁడా
రంజిత ప్రతాప కపిరాజ సఖుఁడితఁడా ....
చిరంజీవి యీతఁడా జితేంద్రియుఁడితఁడా
సురలకు పకారపు చుట్ట మీతఁడా
నిరతి శ్రీ వేంకటాద్రిని విజయ నగరములో
నరవి వరములిచ్చీ నందరికి నితఁడా" (2-223)

## శ్రీకృష్ణుడు

ఉద్దగిరి : ఉద్దగిరి కృష్ణుని వర్ణనలనేక సంకీర్తనములందున్నవి. మచ్చున కొకటి
"మన్ననలు నాకు నిచ్చి మదమెంత యెక్కించీనే
కన్ను సన్నలనే యేమి గారవించీనే
వున్నతి శ్రీ వేంకటేశుఁడుద్ద గిరి కృష్ణుఁడై
నన్నుఁగూడె తన పొందు నమ్మికైన దానను" (30-369)

## గండవరము

"శ్రీరాగం : లాలనుచు నూచేరు లలన లిరుగడల
బాల గండవర గోపాల నినుఁబాల ...." అని వర్ణించినాడుఁ

దీనిని అన్నమయ్య వర్ణనగా అన్నమాచార్య చరిత్ర పీఠిక. పుటలు 63-64లలో కీ॥శే॥ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు పేర్కొనినారు.

## గండికోట

గండికోట కేశవుని శృంగార చేష్టలీ క్రింది సంకీర్తనమున వర్ణింపబడినవి.
"మన్ననలనే చొక్కి మంత నాన నీ వొద్ద
కిన్నెర వాయించితి వేల్లు రేఁగి
చన్నుల పై నీవు లేత చందురుల నించితివి
కన్నుల మెచ్చితి నోయి గండికోట కేశవా" (24-367)

ఇంకను గండికోట కేశవుని 26-50, 29-323 సంకీర్తనములలో వర్ణించినాడు.

చేఁగలమఱ్ఱి

చేగలమఱ్రిలోని చెన్న కేశవుని యిట్లు వర్ణించుచున్నారు.

భైరవి : ఇచ్చలోనిదాన నేను ఇన్నిటా నీకు
గుచ్చు లేమిటికిరా చేఁగల మఱ్రి చెన్నుఁడా ॥పల్లవి॥
అరితేరి కతలెల్లా నడుగుతా నన్ను నీవు
చేరి యానపెట్టకురా చెప్పేఁగాని
దూరుసేయ కిఁక నైనా దోసము లేదనరా
సారెసారె నీకు మొక్కి జట్టి గొనే నేను ॥ఇచ్చ॥" (25-162)

తిరుపట్ల

తిరుపట్ల మదనగోపాలునికి జోలపాడిన విధమును వివరించు సంకీర్తనమిట్లున్నది.

"అంగుగాఁ దాళ్ళపాకాన్నయ్యచాల
శృంగార రచనగాఁ జెప్పెనీ జోల
సంగతిగ సకల సంపదల నీ వేళ
మంగళము తిరువట్ల మదన గోపాల" (అన్నమాచార్య చరిత్ర పీఠిక పు. 62)

తుమ్మలూరు

"మిగులనన్నుఁ గూడి మేను మఱచినప్పుడే
నగకుండఁ దగదా నేనగితిఁ గాక
చిగురుమేని తుమ్మలూరి చెన్నుఁడా శ్రీ వేంకటేశ
తగఁబంత మిచ్చి తేనే దక్కి మెచ్చితిఁగాక" (38-179)

నల్లఁబల్లి

"నల్లఁబల్లి చెన్నుఁడా నవ్వేవు సారె సారె
ఇల్లిదె చూతువు గాని యిందు రావోయి
గొల్లదొమ టాయ నేఁడు కోరి నీతో సరసాలు
చల్లవేఁడి చేసుకొంటే చాలులేవోయి" (10-161)

పులివెందల

"వెలి నవ్వేల వదారు వేలఁ బెండ్లాడితివి
బలిమి కాదవు గావా భావించినదే

మాచనవోలు

"కౌఁగిలించితే నిన్నుఁ గాదనఁగఁగలనా
లోఁగి యందులకే చొక్కి లోనౌదుఁ గాక
నాఁగులెల్ల ఁదీర మ్మాఁచన వోలి చెన్నుఁడవై
నూఁగితి శ్రీవేంకటేశ మోవి యిచ్చేఁగాక" (27-495)

... అని శృంగార సంకీర్తనమున వర్ణించినాడు.

మాడుపూరు

అన్నమయ్య తల్లి మాడుపూరు కేశవస్వామి భక్తురాలంట. ఆవూరి చెన్నకేశవునే అన్నమయ్య వర్ణించుచున్నాడు.

"పాడి :- చేరి యందెల మోతలతో చెన్నకేశవా
యీరీతి మాడుపూరిలో నిట్లాదేవా ॥పల్లవి॥
మున్నుయశోద వద్దను ముద్దుగునిపాడితివి
వన్నిరేపల్లె వీధులఁ బారాడితివి
పిన్నపై గోపాలులతోఁ బిల్లదీవులాడితివి
యెన్నిక మాడుపూరిలో నిట్లాదేవు ॥చేరి॥ (8-179

ఇంకను 13-47 లోను వర్ణించినాడు. అందెల మోతలతో మాడుపూదితో నాడుచున్నది చెన్నకేశవుడిని అన్నమయ్య వర్ణించుచున్నాడుగాని బాల్యమున అవియన్నియు మాడు పూరిలో అన్నమయ్య ఆడియుండును।

వత్తలూరు

వత్తరి కేశవునితో గోపికలిట్లు పలుకుచున్నట్లు వర్ణించుచున్నాడు.

"బౌళి : వత్తలూరి కేశవా వెన్నెలీడఁ జేసేవా
బత్తిగల వాఁడ వౌదు పట్టకువయ్యా ॥పల్లవి॥
పిల్లఁగోపి వింటిమి బిరుదులు గంటిమి
చల్లలమ్మఁబోవలెఁ జాలునయ్యా
చెల్లునీకుఁ జేఁతలు చెక్కులెల్ల రోఁతలు
పల్లదాలు యిఁకనేల పదవయ్యా ॥వత్త॥" (28-106 )

## విజయనగరము

విజయనగరమున వెలసిన బాలకృష్ణుని వర్ణన మిట్లున్నది.

"మతంగ కౌశికి :- పదుచు( జేతలు గావు బాలకృష్ణుడు
తొదికేమోవి పంటి కై దుండగపు( గృష్ణుడు" (17-121)

## వెలుగోడు

వెలుగోటి కేశవుని వర్ణనమిట్లు సాగించుచున్నాడు

"రామక్రియ :- కేవల కృష్ణావతార కేశవా
దేవసేవ లోకనాథ దివ్యదేహ కేశవా ॥పల్లవి॥

.... .... .... .... .... ... .... .... .... .... ....

కింకర బ్రహ్మాది గణకేశవ నా
మాంకిత వేంకటాద్రి కేశవ
కుంకుమాంక వక్ష వెలిగోట కేశవ సర్వ
శంకాహరణ నమోజగదేక కేశవా ॥కేశ॥" (11-96)

## వేంకటాద్రి

వేంకటాద్రి వెన్నముద్ద కృష్ణుని వర్ణన మీ విధముగ ఉన్నది.

"బలిమి( గా(గిట నించి పాయకిదే కృష్ణుడు
తిలకించి చూపుచూచీ దిట్ట కృష్ణుడు
కలసి మన్నించె నిదే కైవసమై కృష్ణుడు
వెలసి శ్రీవేంకటాద్రి వెన్నముద్ద కృష్ణుడు" (24-370)

## శ్రీరంగము

శ్రీరంగము నందలి రంగనాధుని అత్యంత ప్రతిభావంతునిగ, భావుకునిగ అన్నమయ్య వర్ణించుచున్నాడు.

"అహిరి :- తొల్లియును మర్ణాకు తొట్టెలనె యూ(గెగన
వెల్లువిడి నూ(గిని శ్రీరంగ శిశువు ॥పల్లవి॥
అదివో కమలజాని తిరువారాధనంబన(గ
అదన( గమల భవాండమను తొట్టెలన్

ఉదధులు తరంగముల నూఁచఁగా నూఁగీని
చెదరని సిరులతోడ శ్రీరంగ శిశువు ॥తొల్లి॥
వేదములె చేరులై వెలయఁగ శేషుఁడే
పాదుకొను తొట్టెలై పరగఁగాను
శ్రీదేవితోఁ గూడి శ్రీవేంకటేశుఁడై
సేదదేరెడి వాఁడె శ్రీరంగ శిశువు ॥తొల్లి॥ (11-2-1)

—ఇది జానపద గేయ రీతులలోని 'ఉయ్యాల'కు సంబంధించిన గేయముల వంటిది.

సంబటూరు

జాజర పాటలు పాడి నవ్వులు నవ్వెడి సంబటూరి చెన్నుని వర్ణన మిట్లు చేయుచున్నాడన్నమయ్య..

"సామంతం :— ఎంత వాఁడ వయ్య నిన్ను నే మనేము
సంత కూటముల వాఁడ సంబటూరి చెన్నుఁడా ॥పల్లవి॥
నోగకన్నులను(ఁ) జూచి సొలపుల మాటలాడి
వాగుపు గొల్లెతలను వలపించేవు
జాగుల నవ్వులు నవ్వి జాజర పాటలు పాడి
బాగుగానప్పటిఁ గొంత భ్రమయించేవు ॥ఎంత॥" (20-245)

....ఈ సంకీర్తనమున 'జాజర పాటలు పాడి నాయకుడు భ్రమయించుచున్నాడని గ్రహింపవచ్చును. జాజర పాటలను పురుషులు కూడ పాడెదరని దీని వలన తెలిసికొన వచ్చును. సంబటూరి చెన్నుని ఇంకను 27-498 లోను 29-554 లోను వర్ణించినాడు.

ఈ విధముగ అన్నమయ్య కేవలము శ్రీవేంకటాద్రి మీది శ్రీనాథుని కొలుచుట యేగాక ఆయా ప్రాంతములందు సంచరించి ఆయా ప్రాంతములందలి వేల్పులను వర్ణించి, ఆయా ప్రాంత ప్రజలకు విశిష్టాద్వైత మత విశేషములను వివరించుచు జీవితమును సాగించెనని గ్రహింపవచ్చును. తాను పర్యటించిన క్షేత్రములందు వెలసిన విష్ణుమూర్తులను శృంగారాధ్యాత్మిక సంకీర్తనములందు వర్ణించి తరించినాడు. తరువాత శ్రీకృష్ణ లీలా వర్ణనలను గ్రహింపవచ్చును.

## శ్రీకృష్ణ లీలావర్ణనలు

అన్నమాచార్యుడు వాత్సల్య భక్తి వర్ణన కాలంబనముగ శ్రీకృష్ణుని బాల కిశోర రూపములనే గ్రహించెను. ఒకసారి యశోదగను వేరొకసారి గోపికలలో నొకతెగను తనను భావించుకొని కృష్ణవర్ణనలు చేయుటకుపక్రమించెను. మధుర భక్తి వర్ణించు సందర్భమున అన్నమయ్య నాయికయై భగవంతునితో శృంగార విహారములు గావించు టకు ప్రయత్నించును. అన్నమయ్య శృంగారాధ్యాత్మిక సంకీర్తనము లందక్కడక్కడ శ్రీకృష్ణుని వర్ణనలు గావించినాడు. అవి ఒక క్రమమునలేవు. అయినను వానినన్నిటిని ఒకచోట చేర్చి శ్రీకృష్ణుని చరిత్రను గమనింపవచ్చును. కృష్ణ చరితము నిట్లు పరిశీలింప వచ్చును.

## శ్రీకృష్ణ జననము

శ్రీకృష్ణ జననమీ లోకమున అసాధారణమైన ఘటనగా భావించి అన్నమయ్య అనేక విషయములను ప్రస్తావించుచు శ్రీకృష్ణ జననము నత్యంత స్వభావ సుందరముగ వర్ణించుచున్నాడు.

"సాళంగనాట ; దేవతలు గెలువరో తెగి దైత్యులు పారరో
భావించనింతటిలో భూభార మెల్లనణఁగె ॥దేవ॥

నేడు కృష్ణుఁడు జనించె నేఁడే శ్రీజయంతి
నేఁడే రేపల్లెలోన నెలవైనాడు
వేడుకయే యశోదకు బిడ్డఁడైనాడి దెనేఁడు
పోడిమి జాతకర్మ మొప్పుగ నాయనేఁడు ॥దేవ॥

ఇప్పుడిదె గోవుల నిచ్చెను పుత్రోత్సవము
ఇప్పుడు తొట్టెల నిడి రింపు లెల్లాను
చెప్పరాని బాలలీల సేయఁగల దెల్లాఁజేసి
కప్పెను విష్ణుమాయలు గక్కన నేఁడిపుడు ॥దేవ॥

ఇదివో వసుదేవుని ఇంటి చెరలెల్లఁ బాసె
ఇదివో దేవకి తపము ట్టె ఫలించె

చెదరకతా నిలిచె శ్రీ వేంకటాద్రి పైనిదె
యెదనలమేలు మంగ యెక్కివున్నదిదివో ॥దేవ॥" (2-478)

—ఈ సంకీర్తనమున కృష్ణ జననమునేకాక జాతకర్మ, పుత్రోత్సవాది వృత్తాంతములను కన్నులకు గట్టినట్లు వర్ణించినాడు. ఎందరెందరో గోపకాంతలు పుత్రోత్సవమునకు వచ్చి బాలుని తొట్టెలలో నిడిరట.

కృష్ణుడు పుట్టిన వృత్తాంతమును వసుదేవునకు విన్నవింపుమని గోపికవలె పలుకుచున్నాడన్నమయ్య.

"ధన్నాసి :— గాదిద గూయకుండఁ గంసుఁదెలియఁగ కుండ
వేడుక వసుదేవునకు విన్నవింపరో ॥గాడి॥
దేవతలు జయవెట్ట దేవకి గర్భమునందు
యీవేళ నేనుగ బిడ్డఁడిదె జనించె
పూవుల వాన గురిసె భూభారమెల్లఁదీరె
వేవేగ నొజ్జలు వేళ చూడరే ॥గాడి॥" (28-92)

....కంసునకు తెలియకుండ వసుదేవులకు విన్నవింపుమన్నాడు.

కృష్ణావతారమును గూర్చితమతో తాము గోపికలు సంతోషముగ మాటలాడుకొనుచున్న వృత్తాంతమును నిట్లు వర్ణించుచున్నాడు.

"పళవంజరం : వింటిరటే చెలులాల వేడుక సంతోసవార్త
యింట నింట వూరనెల్ల యిదేసుద్ది
కోమలి దేవకి కొడుకుఁ గంటే రేపల్లెఁ
బ్రేమతో వసుదేవుఁడు పెంపఁ బెట్టి వచ్చెనట
గామిడై యశోద కూఁతుఁ గంసునికిఁ జూపెనట
ఆ మగువ కంసునికి నద్దలించినదట ॥వింటి॥
శ్రావణ బహుళాష్టమి నవరేతిరి కాడను
ఆవేళ రోహిణి మంచిదైన పొద్దానను

కావింప మేనమామకు గండమట యాతఁడే
దేవరటి బాఁపలెల్లా దిక్కులఁ జెప్పిరి ॥వింటి॥

——అని కృష్ణుని జననానంతరము జరిగిన విశేషముల నన్నిటిని చక్కగ, స్పష్టముగ వర్ణించినాడు.

శ్రీకృష్ణుడు జనియించినాడు గావున పండుగ జేయురోయని గోపికలు పలుకు చున్నట్లు అన్నమయ్య వర్ణించుచున్నాడు.

"సాళంగనాట ; జగములెల్లా నీదేరే జయవెట్టిరిందరును
తగనేఁడు కృష్ణావతార మాయ నిదివో ॥జగ॥
అచ్చుతుఁడు జనించె నద్దమ రేతిరికాడ
ముచ్చిమిరా కాసులు ముట్టువడిరి
వచ్చిగాను లోకులాల పండుగ సేయరోనేఁడు
అచ్చపు కృష్ణావతార మాయ నిదివో ॥జగ॥" (10–20)

——ఇంకను అనేక సంకీర్తనములందు కృష్ణావతార వర్ణనలు గావించినాడు

## బాల్య క్రీడలు

బలరామ కృష్ణుల బాల్య క్రీడలను అన్నమయ్య మనోహరముగ వర్ణించినాడు. బలరామ కృష్ణులిద్దరును ఆటలాడుకొనుచు ఒకరితో నొకరిట్లు మాటలాడుకొనుచున్నారు,

"రామక్రియ ; అనుచు నిద్దరు నాడే రమడల వలెనే
మొనసి యివెల్లాఁ జూచి మ్రొక్కిరి బ్రహ్మాదులు
రాముఁడ పండ్లు నాకు రండు వెట్టరా
యేమిరా యిట్లానె నాకు యిత్తువా నీవు
ప్రేమపు తమ్ముఁడగాన పిన్ననే నీకు
యీమాట మఱవకు యిందరా కృష్ణుడా ॥అను॥
యెక్కిన పుట్టిపై నన్ను నెక్కించరా వోరి
వుక్కునఁ బడేవు రాకు వద్దురా నీవు
పక్కున మొక్కేరా నీపయిఁడి కాళ్ళకు వోరి
అక్కతోఁ జెప్పేఁగాని అందుకోనే రారా ॥అను॥

యెవ్వరు వొడవో నరినిటు నిలు తము రావోరి
నివ్వటిల్ల నీవింత నిక్కి చొద్దురా
రవ్వల శ్రీవేంకటాద్రి రాయుఁడనేరా అయితే
యివ్వల నీకంటేఁబెద్ద యిది నీ వెఱఁగవా ॥అను॥" (2-14)

—గ్రామీణ వాతావరణములో బాలుర క్రీడలను చూచుచున్నట్లు అనుభూతిని కలిగించు చున్నాడన్నమయ్య. 'రాముడు నాకు రెండు పండ్లు పెట్టరా' యని కృష్ణుడడిగినపుడు 'నాకును' ఆ విధముగనే యిచ్చెదవుకదా! యని బలరాముడు షరతు పెట్టినాడు. తెలివి గల వాడైన కృష్ణుడు ఆ విషయమును కప్పిపుచ్చి 'నీకు తమ్ముడను' గదా! యనిపలికి నాడు. అనగా ఇవ్వడము జరుగదని వ్యంగము. ఈ మాట మరువ వద్దని' పలికి బలరాముడు కృష్ణునకు పండ్లు పెట్టినాడు. ఇక్కడ మరల సందేహము ఏమాట మరువ వద్దని బలరాముడు పలికినాడు. పండ్ల నిచ్చిన మాటయాలేక 'నీకు తమ్ముడను గదా' యను మాటయా? తమ్ముడనని మరువ వద్దనియే బలరాముని భావము. దానినే శ్రీకృష్ణుడు గ్రహించినాడు. అందువలననే సంకీర్తనాంతమున శ్రీకృష్ణుడునేను వేంకటాద్రి రాయుడనని పలికినపుడు బలరాముడు 'నేనునీంటె పెద్దవాడను' అనిపలుకగా కృష్ణుడు మరల మాటాటలేదు.

అల్లరి కృష్ణునకు అందరును స్నేహితులే. ఎక్కడకు వెళ్ళినను గోపబాలురు కృష్ణుని వెంట గుంపులు గుంపులుగ బయలు దేరుదురు. చాటుగా పాలుత్రాగుటకు పోవునపుడుకూడ కృష్ణుడు తన బృందములను వెంటబెట్టుకొని వెళ్ళును. ఆ విషయము నన్నమయ్య యిట్లు వర్ణించుచున్నాడు.

"కుత్తుక బంటి దాఁకా గూనలో పాలెల్లాఁదాగి
యెత్తుక వున్నాఁడు మొగమిందాఁకాను
యెత్తుకొనఁ బిలిచితే యెంతైనాఁ గదలడు
వొత్తి పట్టి వూఁదుకొనీ వొకచేత నేలను
పెరుగు మీఁగడ లెల్లి పిన్నవాండ్ల కందిచ్చి
దొరవలె లోననుండి తొంగి చూచీని" (26—450)

కృష్ణుడు ఉట్లు గొట్టెడి యాటను ఈ విధముగ నాడుచున్నట్లు అన్నమయ్య వర్ణించుచున్నాడు.

"వీథుల వీథుల నెల్ల వీఁడె కృష్ణుఁడు
అటగొని మెలసీని అల్లవాడె కృష్ణుడు....
చక్కిలాలు నురుగులు జలజల రాలఁగాను
వుక్కుమీరి కొట్టీఁ గృష్ణుడు చెల్లాను" (28-240)

ఇంకను శ్రీకృష్ణుడు గోపబాలకులతో కూడి బిళ్ళ గోట్లు, పుట్టచెండ్లు, సముద్ర బిళ్ళలు, సిరిసింగనవత్తి గచ్చకాయలు (10-172) మొదలగు క్రీడలను ఆడినట్లు అన్నమయ్య వర్ణించినాడు.

"శంకరాభరణం :— సారెకు నంటకురే జడనందురు
ధీరుఁడాతఁడున్నతప్పు దేహియట ॥సారె॥
బాయిటఁ బెట్టకురే పశులు పారెడి పొద్దు
వోయమ్మ బాలులకు నొప్పదందురు
.... .... .... .... .... .... .... .... .. ....
పంచల దిప్పకురే పాములు వెళ్ళేటి పొద్దు
కొంచెపు బాలులఁ దైకొనునందురు
.... .... .... .... .... .... .... ... .... ....
అలమి పట్టకురే అంటఁగా కుందెడివారు
తొలరమ్మ బాలులకు దోసమందురు ...॥సారె॥" (1-247)

—ఈ సంకీర్తనమున కృష్ణునకు సంబంధించిన యంశములను చెప్పుచునే ప్రతి తల్లి తమ బిడ్డల పట్ల వహింపవలసిన జాగ్రతలను అన్నమయ్య ధ్వనింపజేయుచున్నాడు.

కృష్ణుడాకలితో నిద్రించి వేకువజామున లేచి యశోదను అన్నమడిగినాడు. ఆ సమయమున అన్నమయ్యయే యశోదయై ఆ వృత్తాంతము నిట్లు వర్ణించుచున్నాడు.

"తెలుగుఁ గాంబోది ; ఎట్టు నిద్దిరించెనో యీరేతి రెల్లాను
పట్టిమట్టుక పయ్యెద పదఁదీసి కృష్ణుఁడు ॥ఎట్టు॥
కడువేకువను లేచి యాకలయ్యీనని
కడుపాకచేఁబట్టి నాకొంగొక చేతఁబట్టి
అడిగినన్నము కృష్ణుఁడప్పుడే దూడరే ॥ఎట్లు॥" (22-420)

— ఇంకను పెరుగు చిలుకుచుండగా కురుచ మాటలతో ముద్దు గునియుచు కవ్వపు కోల బట్టి వెన్న బెట్టుమని యడిగినాడట. తనకు పెట్టిన వెన్నను తోడి బాలకులకిచ్చి తాను మాత్రము దొంగిలించి యారగించినాడట ! అవును మరి ! ఆవిధముగ చేసి నప్పుడే ఆయనకు తృప్తి. ఈ సంకీర్తనమున స్వభావోక్తిలో శ్రీకృష్ణుని వృత్తాంతము సహజ సుందరముగ వర్ణించినాడు. కన్నులు పులుము కొనుచు, కడవొక చేత బట్టి వెన్నను అడుగుచున్న శ్రీ కృష్ణుడు అన్నమయ్య భావనా బలమున సహృదయుల యెదుట సాక్షాత్కరించుచున్నాడు.

— ఇదే భావమును వేరొక సంకీర్తనమున ఈ విధముగ వర్ణించుచున్నాడు.

"భూపాళం : ముద్దు గారఁ నిదె ముంగిట నిలుచున్నాడు
వొద్దికేఁగి చెలులెల్ల వూరడించరే ॥ముద్దు॥
వేఁకువ జామున లేచి వేడుక క్రిష్ణుడు తల్లి
ఆఁకలయ్యీ ననుచు వొయ్యనె మంచము దిగి
కాఁకలతో పసివాడి కన్నులు పులుము కొంటా
యేఁకరుచు నున్నవాఁడు యెత్తు కోరే బిడ్డని ॥ముద్దు॥ (30-160)

గడుసుదనము

శ్రీ కృష్ణుని చిలిపి చేష్టలిన్నియని యెన్నికకు రానివి. ఆయన గడుసుదనమును గోపికల పలుకులతో నిట్లు వర్ణించుచున్నాడు.

"మేఘరంజి : ఓయమ్మ చూడఁ గదరె వుద్దగిరి కృష్ణుఁడు
సేయు చేఁత లెల్లాను చెప్ప సిగ్గయ్యీనే
చూడ బాలుఁడు గాని సుదతుల గాఁగిళ్ళఁ
గూడేవేళ పాయపు కొమారుఁడే
వాడలఁ గాచే వేళ వాడ గొల్లఁడై యుండుఁగాని
యెదఁ బిక్కఁ బెట్టు కొంటే యింటి మగఁడానే ॥ఓయ॥ (22-433)

— ఇంకను వేడుకతో గోపికలు వెన్నముద్దలు చేయుచుండగా వెనుకగా వచ్చి చన్నులంటుచున్నాడట ! జోడై ఒకరొకరు సుద్దులు చెప్పేదివేళ కోడెకాడై కొప్పులు పట్టుచున్నాడట ! విడెములు చేయుచు ఆకులు మడుచు కొనగా గట్టిగా కళలు రేగ కౌగిలించుచున్నాడట !

— వేరొక సంకీర్తనమున ఇంటిలో నున్న గోపికను కృష్ణుడీ విధముగ చేయుచున్నాడని గోపిక పలుకుల ద్వారా యిట్లు వర్ణించుచున్నాడు.

"ముఖారి : ఎఱుఁగ గొల్లపడుచ నిల్లు గాచుకుండఁగాను
మఱి కృష్ణుఁడు వచ్చి నామయి చెమరింపించెనే ॥ఎఱుగ॥
పాపట దువ్వేనంటా బాసికము గట్టినాఁడే
చాఁపే నంటా చేత నేసలు చల్లెనే
కాఁపురాలు సేతమని కాఁగిలించు కొనెనే
మాపుదాఁకా నేమో సేసి మనసు గరఁచెనే ॥ఎఱు॥ (24–18)

— ఇంకను కైదండ పట్టుదునని కంణము గట్టినాడట ! జూదములాడెదనని రొమ్ముల చోటు గీరినాడట ! శోధించెదనని ఒడి చూపుమని పులుకలు రేపినాడట ! ఇంకను కృష్ణుని యాగడములను యిట్లు వర్ణించుచున్నాడు.

" కూయఁగఁ గూయఁగఁ గోకలు దొంగిలె
వోయమ్మ వీఁడెంత వుద్దండీదే " (27–248)

## అన్వేషణ

ఒక్కొక్క సమయమున కృష్ణుడు తల్లికి కనిపించడు. ఆటలు కొరకరిగిన కృష్ణుడు ఇంటికి రాకయే కాలము గడుపును. వేరొకసారి వచ్చినట్లె వచ్చి వెంటనే వెడలి పోవును. ఆ సమయమున కృష్ణుని కొరకు తల్లి అన్వేషించును. ఇంటినుండి అప్పుడే బయటకు వెళ్ళినాడు. తల్లి వెంబడించినను అందుటలేదు. ఆ సమయమున యశోద ప్రక్కనున్నవారితో కృష్ణుని పట్టుకొనుమనుచున్నది. అన్నము నడిగి అంతు లేకుండ వెళ్ళుచున్నాడట. ఆ విషయమునే అన్నమయ్య యిట్లు వర్ణించుచున్నాడు.

"అహిరి : అంటఁబారి పట్టుకోరె అమ్మలాల యిదె
వెంటఁ బాయనీడు నన్ను పెద మాయతురము ॥అంట॥
కాఁగెడు పెరుగు చాడె కవ్వముతోఁ బొడిచి
లేఁగల దోలుకొని అలిగి పోయీని
రాఁగతనమున వాఁడె రాతిరి నారగించడు
అఁగి నన్నుఁ గూడడిగె నయ్యో ఇందాఁకను ॥అంట॥" (28–122)

— కృష్ణుడు తల్లిపై అలిగి, పెరుగు కొరకు పోయి, ఊరగాయలను కలచి పెట్టి, చేతిచట్టి పారవేసి వెళ్ళుచున్నాడట.

అరగించకయే ఆటల కొరకు కృష్ణుడు వెళ్ళినాడట. ఆ సమయమున తల్లి యిట్లు పలుకుచున్నది,

''సామంతం : ఆదే నంటా వచ్చె నారగించ లేదింకా
వాడ వార చేడెలాల వనజాక్షుఁజూపరో ॥ఆదే॥
మందనున్న పసులాల మంచి గోపబాలులాల
కందర్పు గురుఁడు వచ్చెఁ గంటిరా మీరు
కెందమ్మి వనము లాల కృష్ణుఁడు యమున లోన
చిందుల నీఁదాడు నటచెప్పరో సుద్దులు ॥ఆదే॥" (28–139)

— కృష్ణుని కొరకు అన్వేషించుచున్న యశోదను చూచి గోపికలు నవ్వు చున్నారట. అందువలన యశోద యిట్లు పలికినదని వర్ణించుచున్నాడు.

''సాళంగం : కామినులాల మీ కన్నులో బట్టఁడా బాలుఁ
డేమమ్మా నవ్వేరు వీఁడే మాయ నమ్మా ॥కామి॥
చూడగలవాఁడు చేతఁజూపఁ గలవాఁడు వీఁడు
యేడ నెవ్వరై నాఁ గంటి నెత్తుకోఁ దగువాడు
జాడతో రూపురేకా సాదించ రానివాడు
యీడనే మాపసి బాలుఁడే మాయనమ్మ ॥కామి॥"(28–121)

ఎంత వెదకినను కృష్ణుడు కనిపింపలేదు. అందు వలన యశోద ఆ పనిని చెలుల కప్పగించుచునిట్లనినది.

"మేఁచ బౌళి : వెదకరే చెలులాల వీది వీదులను వీని
కదిసి ముద్దాడిన దాఁకాఁ గలిఁగీ జిత్తము ॥వెద॥
యేకడ మాటలాడీనో యింతక నేఁడింట నుండే
అక్కరతో పదినూరు లారగించును
చొక్కపుఁ గృష్ణుఁడు యెందుఁ జూచీనో వినోదాలు
చిక్కపుఁ గచ్చుకాయలు చేతనే మీటుచును ॥వెద॥

.... .... .... .... .... .... .... .... .... ....
యెంత సంతసమైనదో ఇండ్లిండ్ల వెన్నలు దిని
రంతులోఁ బిడుచులతో రాయిడించఁడు
ఇంతలో శ్రీ వేంకటేశుఁడెదురుగా వచ్చి తన్ను
మంతనానఁ గాఁగిలించి మాయ చూపెను ॥పెద॥" (30-185)

— శ్రీ కృష్ణుని కొరకు వెదుకుచున్న యశోదను కృష్ణుడెదురుగా వచ్చి, కౌగిలించు కొనినాడు. ఆ తల్లి పుత్ర గాత్ర పరిష్వంగముతో పులకరించి పోయినది.

కృష్ణుని కొరకు తల్లి యశోద మాత్రమే కాదు. గోపికలు కూడా అన్వేషించి నారు. ఆ విషయము నీ విధముగ వర్ణించుచున్నాడు.

"దేసాళం : వలసి వచ్చితి నేను వానికిఁ గాను
నెలవై మీ గొల్లవాడనే తానుండు నంటా ॥వల॥
చెందమ్మి కన్నులవాఁడు చేతి పిల్లఁ గోవి వాఁడు
యిందు వచ్చెఁగంటిరా యేమిరే యమ్మా
మంద పసుపుల వాఁడు మకరాంకముల వాఁడు
యెందు నున్నాడు చెప్పరే యేలదాఁచే రమ్మా ॥వల॥" (24-14)

## కృష్ణుడు–గోపికలు

శ్రీ కృష్ణుని యాగడములకు అంతము లేదు. కృష్ణుని యాగడములను మాను కొనవలసినదని గోపికలు పలుకు చున్నారు. ఆ విషయము నీ విధముగ వర్ణించు చున్నాడు.

"అహిరి నాట : ఇందరముఁ బైకొంటే నేమి సేసేవు
చెంది నీ కిప్పుడే చాటి చెప్పేతిఁ జుమీ ॥ఇంద॥
చీరలియ్య గదవోయి సిగ్గరి గొల్లెతలము
చేరి మమ్ము సేల కాకు సేసే వోయి
బారెడేసి నెరులివె పైఁ గప్పు కున్నారము
కేరి కేరి యంత కిలకిల నవ్వేవోయి ॥ఇంద॥
చేతులెత్తి మొక్కుమని చెప్పేవు పలుమారు

కాత రీఁడ పొదువు దగ్గర రావోయి
జాతిగాఁ దమ్మి పువ్వులఁ జాటు పెట్టుకున్నారము
యేతరి చేతలు మాతోనేల సేసేవోయి ॥ఇంద॥" (28–315)

— ఈ భావమునే వేరొక సంకీర్తనమున ఈ విధముగ వర్ణించుచున్నాడు.

"తోరిడి : ఏమి దలఁచు కొంటివో ఇన్నాళ్ళకు
నీ మన సింతటనె తనివిఁ బొందెనా ॥ఏమి॥
వూరకే కొలనిలోన నోలలాడే మగువల
చీరలేల తీసితివి చిన్నారివాడా
చేరి యంతటనుఁ బోక చేతులెత్తి మొక్కుమనే
వేర యెంత కెత్తు కొంటి వేడీ కొత్తరా ॥ఏమి॥
బాలుఁడవై మాయిండ్ల పాలారగించి ఇంకా
పాలిండ్లపై చూపు పచరించేవా
చాలదంటా మా కేలు చాఁచి యందు కొమ్మనేవు
మేలుమేలు నీ గుణాలు మెచ్చితిమిరా ॥ఏమి॥" (30–56)

— ఈ సంకీర్తనముల యందలి యర్థములు సహృదయ మనోజ్ఞములై, ఆలోచనాత్మకములై యున్నవి.

## గోపికల పిర్యాదులు

శ్రీ కృష్ణుని యాగడములను వివరించుటకు యశోద వెళ్ళవలయుని సంకల్పించుకొనిన గోపికలు ముందుగ తమలో తామే కృష్ణుని యాగడములను చర్చించుకొనుచున్నారు. ఆయా విషయములను గోపికలు పలుకుచున్న వృత్తాంతము నన్నమయ్య వర్ణించుచున్నాడు.

"కేదార గౌళ : మీరు సాక్షి మీరు సాక్షి మేమేమీననేము
చేరి చూడరమ్మ వీని చెలువఁడియమ్మా ॥మీరు॥
పిన్నవాఁడు నిద్రవోఁగ పెనచి కూఁకటతోడ
పన్నిలేఁగ తోఁక గూడ బంధించి కప్పె
వున్నతిఁ దొలఁగ వాని వూళ్ళెల్లా బోఁగివోయ
కన్నెలార ఈ కృష్ణుఁగంటిరమ్మా ॥మీరు॥

లేఁగల నన్నిటి నేము లేవక తొల్లె పిడిచె
ఆఁగి పట్టఁ బోతేను అప్పుడే తాగడె పెట్టి
రాఁగ తనాననున్నాడు రాచ బలువమ్మా ॥మీరు॥
వారము సేసే మనుచు వడినింటి వారమెల్లా
కూరలు పాళాలు దొంతిఁ గూడఁ బెట్టితే
ఆరగించి వేలుపుల అలికి వూసి కుడిపీ
కూరిమి శ్రీ వేంకటాద్రి గోవిందుడమ్మా ॥మీరు॥" (2–165)

— ఇంకను శ్రీ కృష్ణుడు అనేకములైన ఆగడములు చేయుచుండగ తట్టుకొన లేని గోపికలు యశోద కిట్లు విన్నవించుచున్నారు.

"లలిత : చూతువు రావమ్మ నీ సుతుని యశోదమ్మ
బూతుఁల దిట్టీ వద్దంటే పొలఁతుల నెల్లను ॥చూతు॥
పొడవాటి వుట్లెక్కి బుడుగుల తోడివెన్న
తొడకి పెట్టీ తన తోడి వారికి
కడవల పాల మీగడలు దేవుకతిని
కడుకుఁ బాలెల్లాఁ గార కంతలు సేసీని ॥చూతు॥
అక్కజపు రోళ్ళెక్కి అట్టుగపై దాఁచిన
చక్కిలాలు నురుఁగులుఁ జవి గొనీని
వెక్కసానఁ బట్టరాక పీదుల పారాడుతాను
మొక్కలాన నెత్తుకొంటె ముద్దులు వెట్టీని ॥చూతు॥
పన్నరు దొంతులెక్కి బానల పెరుగునేయి
చెన్నుమీర నారగించి చేరినవ్వీని
అన్నిటా శ్రీవేంకటేశుఁడల మేల్ మంగ విభుఁడు
వన్నెలఁ గ్రిష్ణుఁ డింటింటి వాకిఁట బొంచీని ॥చూతు॥" (30-267)

— వేరొక సంకీర్తనమున అన్నమయ్య గోపికయై కృష్ణుని చేష్టలను యశోదకు విన్నవించుచున్నాడు.

"శంకరాభరణం: ఏమమ్మ యశోద యిదె నీ బిడ్డఁడు
గామిడి తనాల గదిసీ వీఁడె ॥ఏమ॥
గొల్లల్యఁ దానును గోపిక లిండ్ల
కొల్లగా నుట్లు గొట్టీ వీఁడె
పల్లవాన వారి పాలిండ్ల మీఁదట
చిల్లర సేఁతలు సేసీ వీఁడె ॥ఏమి॥" (25–258)

— ఇదే భావమును సంపుటి 29– సంకీర్తనము 331లో వర్ణించినాడు.

— ఇంకొక సంకీర్తనమున గోపికలు శ్రీ కృష్ణుని చేష్టలను వివరించు వృత్తాంతము ను రూపచిత్ర సాక్షాత్కార పరముగ వర్ణించుచున్నాడు.

"భైరవి : పుడమిలోన మగలు గలుగు పొలఁతులకును దిరుగఁబాపె
అడవి వారి నుండ నియ్యఁడమ్మ నీ కొమారుఁడు ॥పుడమి॥
భారమైన కుచభరంబుపై చెరంగు జార నొకతె
జారుఁ జూపులాఁడి మంచి సొళంగపు టెలుఁగున
కోరో చల్ల యనుచు మెరుఁగుఁ గుచము లదర మెట్టినడవ
గోరితీసి పారి తెంచె కొమ్మ నీ కుమారుఁడు ॥పుడమి॥" (12_241)

— ఇంకను వేంకటేశుడనేననుచు వేరొక వనిత మోవి గంటి చేసినాడట ।

ఇన్ని యాగడములు చేయుచున్న కృష్ణుడిట్టి వాడని గోపికలు పలుకుచున్నారు.

"బౌళి ; ఓయమ్మ నీలిబిడ్డఁడోయమ్మా
యీయెడ యశోదనీ పెట్టు గంటివమ్మా ॥ఓయ॥
గాలి గొట్టై తిరిగిన గామిడి వాఁడోయమ్మా
గోల వలె నుండుఁగాని కోడెకాఁడమ్మా
తాలిమి యించు కాలేని తరువరి వాఁడమ్మా
ఆలరీఁడు నీబిడ్డఁ డదె బుద్ధి చెప్పరో ॥ఓయ॥" (28_69)

— అనుచు కృష్ణుని చేష్టల నేకరువు పెట్టుచున్నారు. ఇక యశోద ఓర్చుకొనలేక పోయినది. గోపికలను సమాధాన పరచి పంపించదలచినది.

## యశోద సమాధానము

మాతృత్వము మూర్తీభవించిన యశోద తనబిడ్డ తప్పేమియు లేదని, తప్పంతయు గోపికలదేనని పలుకుచున్నది. ఆపలుకుల నన్నమయ్య యెంత మనోహరముగ వర్ణించినాడో ఈ క్రింది సంకీర్తనమును గమనించినచో గ్రహింపవచ్చును.

''శుద్ధదేశి : కానరటె పెంచరటె కటకటా బిడ్డలను
నేను మీ వలెనే కంటి నెయ్యమైన బిడ్డను ॥కాన॥
బాయిటఁ బారవేసిన పాలు వెన్నలును
చేయి వెట్టకుందురా చిన్ని బిడ్డలు
మీ యిండ్లు జతనాలు మీరు సేసికొనక
పాయక దూరలేలే ప్రతిలేని బిడ్డను ॥కాన॥
మూసిన కాఁగుల నేయీ ముంగిటి పెరుగులూ
ఆస పడకుందురా ఆదే బిడ్డలు
వోసరించి మోనపోక వుండలేక మీరు
సేసేరింతేసి దూరు చెప్పరాని బిడ్డను ॥కాన॥
చొక్కమైన కొప్పెరల జున్నులు జిన్నులను
చిక్కన విడుతురా చిన్ని బిడ్డలు
మిక్కిలి పూజలు సేసి మెచ్చించఁ దగదా
యెక్కువైన తిరువేంకటేశుఁడైన బిడ్డని ॥కాన॥ (12-253)

— సరళమైన పదములతో చక్కగ సాగిన వర్ణనిమిది. తన బిడ్డ తప్పు లేదని పలికి తిరువేంకటేశుడైన తన బిడ్డను పూజలు చేసి మెచ్చుకొనవలెనని పలుకుచున్నది. ఈ సంకీర్తమున అన్నమయ్యయే యశోదయై దర్శన మిచ్చుచున్నాడు.

గోపికలు కృష్ణుని గేలి చేయుచున్నారు. ఆ విషయమును సహింపలేని యశోద పలుకులను

"దేసాళం : చెల్లని చేఁతలు మీరు సేసేరుగాక
గొల్లెతలు హరితోడ గోసనాస యేఁటికె ॥చెల్ల॥
బాలుని నవ్వకురమ్మ పాల దొంగ వీఁడంటా

యేలే మీతో పిన్నవాడు ఇంత కోపునా
గేలి సేయికురే యమ్మ గిరలు మోయఁ దీసెనంటా
నీల వర్ణుఁ డిందు నెల్లా నేర్చ వచ్చెనా ॥చెల్లి॥" (28_70)

అని వర్ణించినాడు.

గోపికలకు సమాధానము చెప్పి పంపినది గాని తన పుత్రుని అదుపులో పెట్టుటకు ప్రయత్నించినది అయినను ఆటల కొరకరిగిన శ్రీ కృష్ణుడు అద్భుతములను ప్రదర్శించుచున్నాడు.

## మహిమలు

శ్రీ కృష్ణుడు మహిమాన్వితుడు శైశవకాలమునే పూతనను చంపి, మద్దులను విరిచి, శకటా సురుని సంహరించినాడు. ఆ వృత్తాంతముల నిట్లు వర్ణించుచున్నాడన్నమయ్య.

"లలిత ; ఈడ నుండె నిందాఁకా నింటి ముంగిట
ఆడ నెందుఁ బోడుగద అప్పుడే యీ కృష్ణుఁడు ॥ఈడ॥
చేడ పూతకిఁ జంపె నింత పిన్నవాఁడంటా
ఆడు కొనే రదే వీధి నందరుఁ గూడి
.... .... .... .... .... .... .... .... ...
మరలి యప్పటి వాఁడె మద్దులు విరిచెనంటా
పరువులు వెట్టేరు పడఁతు లెల్లా
————————————
వింత గాఁగ నొక బండి విరిచెనప్పటి నంటా
రంతుసేసే రదివో రచ్చలు నిండి ॥ఈడ॥" (2–65)

వేరొక సంకీర్తనమున గోపికలు పలుకుల వలన కృష్ణుని మహిమల నిట్లు వర్ణించుచున్నాడు.

"ఆవుల పెయ్య విడిచె నవినేఁడోడి తేఁబోతే
నీ వలా దూడలఁ దెచ్చి యింటిలోఁ గట్టి
దావతి నింతా వెదకి తలుపు దెరచితేను
శ్రీ వేంకటేశుని మాయ జిక్కిలోన నున్నవి" (26–332)

శ్రీ కృష్ణుడు బాల్య క్రీడల సందర్భమున ప్రదర్శించుచున్న మహిమలను అన్నమయ్య ఈ విధముగ వర్ణించుచున్నాడు.

"సాళి : అనరాదు వినరాదు ఆతని మాయలునేఁడు
దినదిన క్రొత్త లాయ ద్రిష్ట మిదే మాకు ॥అన॥
ఆడెడి బాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్ల నోర దుమ్ములు చల్లి
యీడ మాతోఁ జెప్పఁ గాను యిందరముఁ గూడిపోయి
చూడఁబోతే పంచదారై చోద్యమాయ నమ్మా ॥అన॥
తీఁటకుఁ గాక బాలులు తెగివా పోఁగా
పాటించి యీ సుద్దివిని పారితెంచి చూచితేను
కోటికోటి సొమ్ములాయ కొత్తలోయమ్మా ॥అన॥" (2-167)

— ఈ విధముగ శ్రీ కృష్ణుడు ప్రదర్శించుచున్న మహిమలకు ప్రజలాశ్చర్యచకితులై, ఈ క్రింది విధముగ పలుకుచుండిరని వర్ణించుచున్నాడు.

"కాళింగుని మెట్టెనట కంసుఁబొరి గొనెనట
పాలించి సురలఁజే పట్టెనట
యీ లీల శ్రీ వేంకటాద్రి నిరవైన దేవుఁడట
యేలెనట పదారు వేలింతులనిందరిని" (27-385)

— శ్రీ కృష్ణ లీలా విహార వర్ణన లనేక విధములుగ వర్ణించిన అన్నమయ్య శ్రీకృష్ణుని వైభవమును కూడా సంకీర్తనములలో వర్ణించినాడు.

## వైభవము

శ్రీ కృష్ణుని వైభవమును బ్రహ్మాదులు కీర్తించుచున్నట్లు వర్ణించుచున్నాడు.

"మలహరి : పాలదొంగ వద్ద వచ్చి పాదేరు తమ
పాలిటి దైవమని బ్రహ్మాదులు ॥పాల॥
రోలఁ గట్టించుక పెద్ద రోలలుగా వాపోవు
బాలుని ముందర వచ్చి పాదేరు

ఆలకించి వినుమని యంబర భాగమునందు
నాలుగు దిక్కుల నుండి నారదాదులు ॥పాం॥ (1-311)

— ఇంకను నోరు నిండ చొల్లు గారుచు ధూళి మేనితో పరుగులు పెట్టుచున్న బాలుని వద్ద శేషాదులు వేదములు చదువుచు పాడుచుండిరని, ముద్దులు మోమున గారగ మూలలు మూలల దాగెడి బాలుని వద్ద తిరువేంకటాద్రీశుడితడని సనకాదులు పాడుచుండిరని వర్ణించెను.

శ్రీ కృష్ణుని వైభవమును వేరొక ఆధ్యాత్మిక సంకీర్తనమున యిట్లు వర్ణించు చున్నాడు.

"సామంతం : అందరికాధారమైన ఆది పురుషుడీతడు
విందై మున్నారగించె విదురుని కడ నీతడు ॥అంద॥
సనకాదులు గొని యాడెడి సర్వాత్మకుడీతడు
వనజ భవాదులకును దైవంబైనతడీతడు
యిన మండలమున జెలగేటి హిత వైభవుడీతడు
మును వుట్టిన దేవతలకు మూలభూతి యీతడు ॥అంద॥" (1-351)

— ఇంకను ఆ పరమాత్ముడే సిరులొసగి యశోద యింట శిశువయ్యెనని, ఆవుల మందలలోచరించి గోపికలకు చనువులిచ్చి కుచేలుని యటుకుల నారగించెనని ; పంకజ భవునకు బ్రహ్మ పద మొసగి సంకీర్తనాచార్యులచే ప్రశంసలు పొంది వేంకట గిరిమీద వెలుగొందుచున్నాడని వర్ణించెను. ఇందలి సంకీర్తనాచార్యుడు అన్నమాచార్యుడే.

బాలకృష్ణుని వైభవములను గ్రహింపలేని వారు మోసపోయి కాలము గడిపిరని, ఆ కృష్ణుని సేవకులై బ్రతుకుట మంచిదని వివరించుచున్నాడు.

"లలిత ; ఏల మోసపోయిరొకో యెంచి యాకాలపువారు
బాలకృష్ణుని బంట్లై బ్రదుక వద్దా ॥ఏల॥
పసుల గాచే వాని బ్రహ్మ నుతించెనంటేను
దెసల దేవుడే యని తెలియ వద్దా
సిసువు గోవర్ధనాద్రి చేత బట్టి యెత్తెనంటే
కొసరీతని పాదాలే కొలువ వద్దా ॥ఏల॥" (1-503)

— అనుచు నింకను నరునకు విశ్వరూపమును చూపిన నరహరియని నమ్మవలదా యని, చక్రము చేత బాణుని నరికెను గావున శరణు వేడవలెనని తెలియ జేసినాడు. ఈ విధముగ శ్రీ కృష్ణునకు సంబంధించిన అనేకములైన విషయములను వర్ణించి తరించినాడు అన్నమయ్య. తరువాత అన్నమయ్య దశావతారములను కొనియాడిన విధమును గమనింపవచ్చును.

## దశావతార వర్ణనలు

శ్రీ వేంకటేశుని పాద కమల ధ్యాన మగ్న మానసుడైన అన్నమయ్య తన ఆధ్యాత్మిక శృంగార సంకీర్తనములందక్కడక్కడ సంస్కృతాంధ్ర భాషలలో దశావతార వర్ణనలు గావించినాడు.

### సంస్కృతములో

"వరాళి : దోలాయాంచల దోలాయాం హరే దోలాయాం ॥దోలా॥
మీన కూర్మ వరాహా మృగపతి అవతారా
దానవారే గుణశౌరే ధరణి ధర మరుజనక ॥దోలా॥
వామనరామ రామ వరకృష్ణ అవతారా
శ్యామలాంగా రంగ రంగా సామజ వరద మురహరణ ॥దోలా॥
దారుణ బుద్ధ కలికి దశ విధ అవతారా
శీరపాణే గో సమాణే శ్రీ వేంకట గిరి కూట నిలయ ॥దోలా॥"
(3–374)

ఇంకను వేరొక సంకీర్తనమున సంస్కృతములో అతి విపులముగ దశావతార వర్ణనలు గావించినాడు.

"కేదారగౌళ : దశ విధాచరణం తన్న భవతి
దశవిధా వస్థార్థం తే తత్ర ॥దశ॥
స్థాపయి ష్యామి వేదాన సితివ్యాజేన
దీపితోయం మత్స్య దేహః పురా
వ్యాపారోయ మేవం నచలరుణ్యా
మాప జలధౌకేళి రుచయే తత్ర ॥దశ॥...."(12–374)

— ఇత్యాదిగ కచ్ఛప, కిటి, నారసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, బుద్ధ, కల్క్యవతారములను వర్ణించినాడు.

తెలుగులో

"అరుదైన భవమూరుడగు సీతఁడు" (11–2–8) అను సంకీర్తనములో 'అవతారాలు' అను శీర్షిక క్రింద విపులముగ దశావతార వర్ణనలు గావించినాడు. మిగిలిన అన్ని సంకీర్తనములందును శబ్ద చమత్కారములతో, అలంకార సంపదతో అల్పాక్షరముల ననల్పార్థ రచనా సామర్థ్యమును ప్రదర్శించుచు వర్ణించినాడు. తెలుగులో గావించిన దశావతార వర్ణన సంకీర్తన మొకటి యిట్లున్నది.

"మాళవి గౌళ : ఇట్టి మమ్ము రక్షించుట యేమి దొడ్డ నీకు నేఁడు
బట్టబాయిటనే నీవు పది రూపులైతివి ॥ఇట్టి॥
చదువుల చిక్కు దిద్ది చక్కఁగఁ జేసితివి
మొదలఁ గుంగిన కొండ మోఁచి యెత్తితి
పొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి
అదనునఁ బ్రహ్లాదునట్టె మన్నించితివి ॥ఇట్టి॥
అడుగుల మూటనే యఖిలము గొలచితి
బడి బడినే రాచపగ సీఁగితి
బెడిదపు లంక విభీషణు నేలించితివి
అదరి పాండవుల దిక్కై నిలిచితివి ॥ఇట్టి॥
త్రిపుర కాంతల గుట్టు దీర బోధించితివి
వుపమఁ గలికి రూపై యున్నాడవు
ఇపుడు శ్రీ వేంకటేశ యేలితివి లోకాలెల్ల
యెపుడు మానుతులకు నిరవైతివి ॥ఇట్టి॥" (2–503)

— ఇందు

"మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చవామనః
రామోరామశ్చ రామశ్చ బుద్ధః కల్కిరేవచ" అను దశావతార

క్రమము పాటింపబడినట్లు స్పష్టము. ఈ క్రమమును పాటించుచునే వేరొక సంకీర్తనమున వర్ణించుచున్నాడు.

"లలిత : తెప్పగా మర్రాకు మీఁదఁ దేలాడువాఁడు
ఎప్పుడు లోకములెల్ల నేలేటివాఁడు ॥తెప్ప॥
మోఁత నీటి మడుగులో యీఁత గరచిన వాఁడు
పాఁతగిలే నూతి కింద బాయని వాఁడు
మూఁతి దోసి పట్టి మంటి ముద్ద పెల్లగించువాఁడు
రోఁతయైన పేగుల పేరులఁ గలవాఁడు ॥తెప్ప॥
కోడికూఁత నోరివాని కుట్టి తమ్ముఁడైన వాఁడు
బూడిద పూసిన వాని బుద్ధులవాఁడు
మూడ వన్నెలేటి వెంట మాయలఁదగిలినవాఁడు
దూడల నావులఁగాచి దొరయైనవాఁడు ॥తెప్ప॥
ఆకసానఁ బారే పూరి అతివల మానములు
కాకు సేయు వాఁడు తురగముపై వాఁడు
ఏకమై వేంకటగిరి నిందిరా రమణిఁ గూడి
యేకాలముఁబాయని యెనలేని వాఁడు ॥తెప్ప॥ (12–195)

ఇదే విధముగ ఇంకను 1–192, 1–75, 26–82, 28–135 మొదలగు సంకీర్తనములయందు దశావతార వర్ణనలద్భుతముగ చేయబడినవి. ఈ విధముగ అన్నమయ్య అనేకములైన వర్ణనలు గావించినాడు.

## అష్టాదశ వర్ణనలు

అష్టాదశ వర్ణనల ప్రాముఖ్యము ప్రబంధ యుగమున మిన్నుముట్టినది. ఆయా ప్రబంధ కర్తలు వర్ణనా ప్రధానములైన కావ్యములను వెలువరించినారు. ఆయా లాక్షణికుల మతములలో 'అష్టాదశ' వర్ణనల విషయమున ఏకాభిప్రాయము లేదను విషయము పూర్వోక్తము. పదకవితా సార్వభౌముడైన అన్నమయ్య తన సంకీర్తనము లందు అష్టాదశ సంఖ్యను మించి వర్ణనలు గావించినాడు. ఆయన రచించిన శృంగారాధ్యాత్మిక సంకీర్తనములను పరిశీలించినచో అన్నమయ్య సాగించిన అష్టాదశాది వర్ణనలు సాక్షాత్కరించును. దీనివలన అన్నమయ్య పద రచనలోనే అష్టాదశ వర్ణలు చేసిన రీతి స్పష్టము కాగలదు.

## నగరము

తన తరువాతి కాలమున ప్రకరణములుగ విభజింపబడిసాగిన నగర వర్ణనను అన్నమయ్య కూడ తన సంకీర్తనము లందు గావించినాడు. తిరుపతి వర్ణన మీ విధముగ నున్నది. మలహరి :

తగ నూట యిరవై యెనిమిది తిరుపతులఁగల స్థానికులును చక్రవర్తి పీఠకములును
అగణితంబైన దేశాంత్రుల మఠంబులును నధికమై చెలువొందగాను
మిగుల నున్నతములగు మేడలును, మాడుగులు మితిలేని దివ్య తపసులున్న
గృహములును
వాగి నొరసఁ బెరుమాళ్ళ వునికి పట్టయివెలయు దిగువ తిరుపతి గడవఁగాను
బుగులు కొను పరిమళముల పూఁవుఁదోఁటలును పొందైన నానా విధంబుల
వనంబులును
నిగిడి కిక్కిరిసి పండిన మహా వృక్షముల నీడలను నిలిని నిలిచి
జగతీ ధరుని దివ్య సంపదలు గల నగరు నరుగననుఁ గానరాఁగాను" (1-227)

## అర్ణవము

హరి భక్తిని ఓడగ వర్ణించుచు సముద్ర ప్రస్తావన మీ క్రింది విధముగ చేయుచున్నాడు.

"గుండక్రియ : హరి భక్తి వోడ యెక్కి నట్టి వారలే కాని
తరఁగు మొరఁగులను దాఁటలే రెవ్వరును ॥హరి॥
నిండుఁ జింతా జలధికి నీళ్ళు దన చిత్తమే
దండి పుణ్య పాపాలే దరులు
కొండల వంటి తరళ్ళు కోరికలెందు చూచినా
తండు ముందు పడేవాడే దాఁటలేరెవ్వరును ॥హరి॥
ఆపదలు సంపదలు అందులోని మకరాలు
కాఁపురపు లంట టాలెక్కై యెత్తులు
చాపలపు గుణములే సరిఁజొచ్చే యేరులు
దాపు పండ చేకొని దాట లేరెవ్వరును ॥హరి॥

నెలవై పుట్టు సగ్గులే నిచ్చలుఁ బోటునుఁపాటు
బలువైన యాఁశే బడబాగ్ని
యెలమి శ్రీ వేంకటేశ హితులకే కాల్నడ
తలఁచి యితరు లెల్ల దాఁటలేరెవ్వరును ॥హరి॥" (2-56)

— శ్రీ వేంకటేశుని ధ్యాన మగ్నులైన వారు మాత్రమే 'చింతా జలధిని దాటగలరట। ఈ కీర్తన అన్నమయ్య ఊహా శక్తికి నిదర్శనము. ఆశను బడబాగ్నిగ వర్ణించుటచే అన్నమయ్య వర్ణనా నైపుణ్య 'మౌరా' యనిపించుచున్నది.

## శైలము

తిరుమల వర్ణన మిట్లు చేయుచున్నాడు.

"ఆహిరి : తోరణములే దోవెల్లా
మూరట బారట ముంచిన లతల
కూరిమి మటములు గోపురంబులును
తేరు పడగలే తెరువెల్లా
కోరిన పండ్లు గురిసేటి తరువులు
తోరములైన వెదురు జొంపములు ॥తోర॥
ఆటలుఁ దిరుపులు నందపు టురుపులు
పాటలు వన వైభవమెల్లా
కూటువ నెమళ్ళ కోవిల గుంపుల
పేటలఁ దేటల పెనుఁ గూటములు ॥తోర॥
పింజా మరలును విసన కఱ్ఱలును
గొంజె గొడుగులే కొండెల్లా
అంజన గిరి రాయడు వేంకటపతి
సంజీవని వరుషల కొదవఁగను ॥తోర॥" (1-119)

— ఇదే విధముగ "అదివో అల్లదివో హరి వాసము ; పదివేల శేషుల పడగల మయము ; అదె వేంకటా చలమఖిలోన్నతము" అని వర్ణించినాడు.

ఋతువర్ణన

అన్నమయ్య ఒక్క సంకీర్తనమునందే ఋతువులను వర్ణించి యల్పాక్షర ముల ననల్పార్థ రచన యను పలుకులను సార్థకము గావించినాడు. నాయిక యందే ఋతుసంపద సంతతిని వర్ణించి తన వర్ణనా నైపుణ్యమును ప్రకటించినాడు. స్వతంత్ర మైన ఊహాశక్తితో అపూర్వమైన కల్పనా పటిమతో అన్నమయ్య యిట్లు వర్ణించు చున్నాడు.

"శుద్ధ వసంతం : కాలములారును గలిగె నీకునిదె
బాలిక యందే పైపై నీకు ॥కాల॥

సతికొప్పు విరులు జలజల రాలిన
లతల వసంత కాలము నీకు
కతగా తన మై కాంకలు చూపిన
అతి వేసవి కాల మప్పుడే నీకు ॥కాల॥

కౌంగిట చెమటల కదునిను దడపిన
కాంగల తొలకరి కాలమది
పీంగని చూపుల వెన్నెలం జల్లిన
రాంగిన మతికి శరత్కాలంబు ॥కాల॥

లంచపుం బులకల లలన నీరతుల
కంచపు హేమంత కాలమది
యెంచగ శ్రీవేంకటేశ వలపుసతి
వంచ శిశిరకాల వైభవమాయ ॥కాల॥" (26-88)

....ఈ సంకీర్తనమున నాయకుడైన వేంకటేశ్వరునకు నాయికా సౌందర్య సౌకుమార్య ములను, ఆమెతోడి పొందుల యందలి యానందమును గూర్చి చెలికత్తె వివరించు చున్నది. నాయిక కొప్పుమందలి విరులు రాలుట వసంతమనియు. ఆమె తను వల్లరి యందలి తావుల వలన కలుగు వేడి వేసవి యనియు కౌగిటులయందు నాయకునిపై ప్రాలెడి స్వేద బిందువులు తొలకరి జల్లులనియు, ఆమె చూపుల జల్లులు శరత్కాలపు వెన్నెలలనియు ఆమె రతుల యందు నింపెడి పులకలే హేమంత కాలమనియు ఆమె

వలపుల వంపులే శిశిరకాల వైభవమనియు, సఖి నాయిక యందు నిండియున్న ఋతు సంపదనుచెప్పుచు ఆతనికి ఆమెపై మోహము రెట్టించునట్లు చేయుచున్నది. అన్నమయ్య ఆలంకారిక వర్ణనా నైపుణ్యమునకీ సంకీర్తనము ప్రత్యక్షోదాహరణము. ప్రబంధకవు లెందరో ప్రత్యేక ప్రకరణములను గావించి ఋతువర్ణన చేయగా అన్నమయ్య ఒక్క సంకీర్తనమునసే మనోహరముగ వర్ణించినాడు. అన్నమయ్య నాయికా, నాయక పర ముగ ఋతువర్ణనము గావించిన సంకీర్తనములింకను (29–142) (22–428) ఉన్నవి.

## సూర్యోదయము

మేలుకొలుపు పాటవలెఉన్న ఈక్రింది సంకీర్తనమున అన్నమయ్య సూర్యోదయ వర్ణన గావించుచున్నాడు.

'కన్నులు దెరవక కమల బాంధవుఁడు
వెన్నెల రేణువు వెలయదిదె
అన్నువ మలసీ నరుణోదయ మిదే
మిన్నక నీవిటు మేలుకొనవే....
తెల్లని కన్నులు దెరవక విరియఁగ
నొల్లక జలజము లున్నవివే
.... .... .... .... .... .... .... .... ....
తెరవగు రెప్పలఁ దెల్లవారవలె
తెరవక చీఁకటి దీరదిదె
తెరఁగు వేంకటాధిప నీ వెఱుఁగుదు
మెఱుఁగులు చల్లుచు మేలుకొనవే" (1–139)

—అరుణోదయమైనను చీకటి పోవుటలేదట। వేంకటాధిపుడు రెప్పలను దెరచినప్పుడే తెల్లవారునట।

## చంద్రోదయము

నాయిక పరముగ చంద్రోదయ ప్రస్తావన మీ క్రింది సంకీర్తనమున చేయబడి నది. చెలిపలుకులతో సాగిన దీ వర్ణన.

"ఆహిరి :–	ఆకెపను నీకుఁ బాయని చుట్టరికము గన
	చేకొందు విప్పుడే విచ్చేయవయ్యా	॥ఆకె॥

సంతతముఁ గలువలివి చందురుని రాకలకు
వింతగాఁ బైపైనే వికసించును
యింతి యీ కనుఁగవ లివియైతే- నీవదన
కాంతి చంద్రుఁడు రాక కడు విరియవు ॥అకె॥" (29-584)

—నాయకుని వదన చంద్రుని ఉదయము జరిగినప్పుడే కాంతకలువ కన్నులు వికసించు వర్ణించెను.

## ఉద్యాన వనము

నాయిక సింగారవనమును పెంచినదట। ఆవనములో నాయకుని వేడుకలతో విహరించుమని చెలి పలుకుచున్నది. ఆ వర్ణన మిట్లున్నది.

"వరాళి :— వినోదించవయ్యా ఇందు వేడుక నేసీనీకు
ఘన సింగార వనము కామిని పెంచెనయ్యా ॥వినో॥
తెగరాని యాసలు తీగెలు వారగాను
జిగిమించి చింతలు చిగిరించఁగా
నిగిడి నివ్వెరగులు నీడలు గప్పఁగాను
తగు సింగారవనము తరుణి పెంచెనయ్యా ॥వినో॥(24-118)

—ఇంకను 'చిత్తమే జొంపాలు గట్టి చీకట్లు గొనగ, కోరిక విరులు గుత్తులై మించగ, చెమటల పూవుదేనెలు గురియగ' కొత్త సింగారవనమును పెంచినదట.

ఉద్యానవనములో విహరించుచున్న సమయమున జరిగిన విశేషమును

"నిక్కపు పూలు గోయుచు నీరెండ గాయఁగాను
పక్కన కృష్ణుని నీడ పడఁతి గని
అక్కడ నేతెంచి వద్ది యంగనఁ గూడఁగాను
వెక్కసాన మెచ్చెను శ్రీవేంకటాద్రి కృష్ణుఁడు" (27-457)

....ఈ సంకీర్తనమున అన్నమయ్య భావచిత్రమును తళుక్కున మెరిపించుచున్నాడు. పూలు గోయుటకు వెళ్ళిన నాయికను అనుసరించి నాయకుడైన కృష్ణుడు వెళ్ళినాడు కాని ఆ నాయిక గమనింపలేదు. వెంటనే 'నీరెండ గాయగా' కృష్ణునినీడను చూచినది. నాయిక పూలుగోయుచున్న వృత్తాంతమును, నీరెండలో నీలవర్ణుడైన కృష్ణుని రూపమును అన్నమయ్య సహృదయుల యెదుట సాక్షాత్కరింప జేయుచున్నాడు.

సలిల క్రీడ

చెలికత్తెల ప్రోత్సాహముతో జలక్రీడకు సిద్ధమగుచున్న నాయికా నాయకుల జాణతనమును నిర్ణయింపలేకున్నారు చెలులు. ఆవిషయము నిట్లు వర్ణించుచున్నారు.

దోసిట నీరు నించె తొయ్యలి మోము గడుగ
ఆ సమయాన కృష్ణుడు అటువెనుకనుండఁగా
వోసరి యాతని నీడ దోసిటిలోఁగననీరు
వాసిఁగాళ్ళఁ జల్లు కోఁగా వడినవ్వె కృష్ణుడు" (27-457)

....ఇందలిభావ చిత్రణమద్భుతము. అత్యంత ప్రశంసనీయము. మోము గడిగిగొనుటకు నాయిక దోసిటిలోనికి నీరుతీసికొన్నది. ఆసమయమున కృష్ణుకు వెనుకనే ఉన్నాడు. ఆ కృష్ణుని నీడ దోసిటి నీళ్ళలో పడినది. వెంటనే నాయిక సిగ్గుపడి తనకాళ్ళపై చల్లకొన్న సమయమున కృష్ణుకు నవ్వినాడు. కృష్ణుడే కాదు ఈ చిత్రమును దర్శించిన సహృదయు లందరు నవ్వక తప్పదు.

జలక్రీడలలో నాయకుడు గావించిన గడుసు చేష్టలను నాయిక యిట్లు పలుకుచున్నదని అన్నమయ్య వర్ణించుచున్నాడు.

"రామక్రియ :— ఆడినట్టే ఆతవీఁడు అద్దములో నీడవలె
జాడలతో కన్నులనె సన్న సేసినె ॥ఆడి॥
కోరి జలకము కేళాకూళినే నాడగాను
అరసి తా నీఁద వచ్చీ నాడ కేతాను
తారసిలి సిగ్గుతోనేఁ దామెర మొగ్గలంటితే
సారపుఁ గమలాలంటాఁ జన్నులంటీనె ॥ఆడి॥ (18-100)

— ఈ సంకీర్తనమును చదివిన వెంటనే జలకములాడుచున్న నాయికా నాయకులు సహృదయుల యెదుట సాక్షాత్కరింతురనుట అతిశయోక్తి కాదు.

రతి

ఇంతకు పూర్వమే సంయోగ శృంగార వర్ణనల సందర్భమున అనేక వర్ణనలు పరిశీలింపబడినవి. అయినను 'రతి' అష్టాదశ వర్ణనలో నొకటి కనుక మచ్చునకొక్క సంకీర్తనము.

"ఆహిరి :- చెప్పఁ గొలఁదులు గావు చెలియ సింగారమిది
చొప్పుగా నిందరికి సూచనలై నిలిచె ॥చెప్ప॥
వెలది కుచముల మీఁది వెలిపెంపు పయ్యదిదె
యెలమిఁబోలింపరే యెట్టున్నది
కులికి పతిఁ గలియుచోఁ గురియుఁ జెమటల జడి
మెలఁగి కొండల మెయిలు మేసినట్లాయ॥చెప్ప॥" (25-559)

—ఇంకను సుదతి నెన్నుదిటి పైనున్న కుంకుమ బొట్టు నాయకుని గలసినప్పటివేళ మదనరాగము మలసినట్టు; సతి తురుములోని విరులు రాలుట శ్రీవేంకటేశ్వరునిపై సేస చల్లినట్లు భాసించెనట। ఎంతటి పరమ రమణీయమైన భావుకత। మేఘము కొండలను తడిపినట్లు కాదట। మేసినట్లున్నదట। 'మెయిలు మేసినట్లు' అని చెప్పుట అన్నమయ్యకే సాధ్యము 'చెలియ సింగారములు చెప్పఁగొలఁదులు గావు' అని చెలి పలికినట్లు అన్నమయ్య శృంగార వర్ణనలు చెప్పకొలదులుకావు.

## విప్రలంభము

ఈ వర్ణనలుకూడ పూర్వోదాహృతములే యైనను అష్టాదశ వర్ణనలలో నిదియు నొకటి గావున నొక్క సంకీర్తనమును గమనింపవచ్చును.

"శ్రీరాగం :- చలిగాలి వేఁడేల చల్లీనె కప్పురపు
మలయజము తానేల మండీనే ॥చలి॥
వాయెత్తి చిలుకేల వదరీనె పలుమారు
కోయిలలు దామేల గొణఁగీనే
రాయడికి నలులేల రాసీనెమాతోను
కాయజుఁడు తానేల కసరీనె ॥చలి॥
ఏకాంతముననేల యెదురై తి సే తనకు
లోకాధిపతి కేల లోనైతినే.... ॥చలి॥" (12-191)

.... .... .... .... .... .... .... ....

—ఏకాంతములో లోకాధిపతికి ఎదురైనంత మాత్రముననె మలయజము మండుచు కాయజుడు కసరుచు నుండెనట। చలిగాలి వేడిగా ఉన్నదట। అవునుమరి। విరహానలమున చలిగాలి వేడిగా మారియుండును. ఈ సంకీర్తనము 'లోకాధిపతి' సాభిప్రాయ పద ప్రయోగము. అక్కడక్కడ పురుష విరహ వర్ణనలు కూడ ఉన్నవి.

## వివాహము

అలమేల్మంగా వేంకటేశుల వివాహ వర్ణన మిట్లున్నది.

"రామక్రియ :— గరుడ ధ్వజంబెక్కె కమలాక్షు పెండ్లికి
పరుష లదివో వచ్చెఁ బైపై సేవించను ॥గరు॥
పాడిరి శోబాన నదే భారతియు గిరిజయు
ఆడిరి రంభాదులైన అచ్చరలెల్ల
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి
వేడుకలు మీరఁగ శ్రీవిభుని పెండ్లికిని ॥గరు॥
కురిసెఁ బువ్వుల వాన కుప్పలై యెందు చూచిన
మెరసె దేవదుందుభి మోఁత లెల్లను
బరసె సంపద లెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి
తిరమై మించిన దేవదేవుని పెండ్లికిని ॥గరు॥
వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల
పోసిరదే తలఁబాలు పుణ్యసతులు
అసల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁదాను
సేసలు వెట్టిన యట్టి సింగారపు పెండ్లికి ॥గరు॥ (8–21)

....ఇంకను "పసిడి యక్షంతలివె పట్టరో వేగమె రారో
చెనల పేరంటాడ్లు దేవుని పెండ్లికిని" (8-194) అనుచు
వర్ణించినాడు.

## కుమారోదయము

కృష్ణ జననమిట్లు వర్ణింపబడెను.

"పాడి :— శ్రావణ బహుళాష్టమి యిదివో
అవలఁ జంద్రోదయం బదివో
యీవేళ నడురే యిప్పుడే రోహిణి
దేవకి కొడుకు గనె దేవుఁడు వీఁడె.........
సరివసుదేవు సంతోషమిదివో

మరులు గొల్పే హరి మాయదివో
విరిసెను కాంతల వెలుఁగదివో
పురుషోత్తముఁడై పుట్టెను వీఁడే...." (28–29)

–ఈ విధమైన వర్ణన లింకను 25_257; 2_478 మొదలగు సంకీర్తనము లందున్నవి.

## దూత్యము లేక ద్యూతము

రాయబార వర్ణనలలో యింతకు ముందే పేర్కొనబడినవి. అయినను అష్టాదశ వర్ణనలలో నొకటిగావున నొక్క సంకీర్తన

"కురంజి :– కానుక లందుకోవయ్యా కతలేమి యడిగేవు
మానాపతులము నేము మరి దూరరాము ॥కాను॥
వంచన సేయఁగరాదు వలపు పెట్టనిదొ
పొంచి వేసెనిదే చెలి పూవుల బంతి
ముంచిన సిగ్గయితేను మెదలఁబెట్టని కోట
మించి కాంతల కే పొద్దూ నీమీఁదనే యూట ॥కాను॥" (2_69)

....నాయిక వలపును వివరించుటకు వచ్చిన దూతికలు పై విషయములను నాయకునకు విన్నవించుచున్నారు. నాయకునిపై నాయికకు గల వలపు పెట్టని దొంతియట। పొంతి నమర్చవలెనన్న ఎంతో శ్రమించవలెను. కాని నాయకుడు శ్రమింపకయే నాయిక వలపు పెట్టని దొంతియైనదట। నాయకుని భాగ్యమంతటిది।

## ప్రయాణము

శ్రీవేంకటనాథుని ప్రయాణ వర్ణన మిట్లున్నది.

"ముఖారి :– అన్నిచోట్లఁ బరమాత్మ నీవు
యిన్ని రూపుల భ్రమ యింతువుగా ॥అన్ని॥
పాల జలనిధినుండి బదరీవనాన నుండి
ఆలయమై గయలోఁ బ్రయాగనుండి
భూలోక నిధివై పురుషోత్తమాననుండి
వేల సంఖ్యల రూపై విచ్చేతుగా ॥అన్ని॥
వుత్తర మథురలో నయోధ్యలోపలనుండి
సత్తైన నందవ్రజాన నుండి

చిత్తగించి పంచవటి సింహాద్రిలోననుండి
పత్తుగా లోకములు పావనము సేయఁగను ॥అన్ని॥

వైకుంఠము నుండి కమలజలోకాన
మోవఁగ శ్రీరంగమున నుండి
యీవల నావల నుండి యీ వేంకటాద్రిపై
నీవే నీవే వచ్చి నెలకొంటి గా ॥అన్ని॥" (1–278)

వేరొక కీర్తనమున వేంకట నాథుని ప్రయాణ వర్ణన మిట్లున్నది.

"అలసూర్య వీధి నేఁగి నాదిత్యుని తేరిమీఁద
కలికి కమలానంద కరుఁడు గాన..........
యింతుల మనోవీధి నేఁచి మరుని తేరిమీఁద
సంతతా రతిప్రియుఁడటు గాన" (1–424)

## యుద్ధము (ఆజి)

శ్రీవేంకటాధిపుని పంపున విష్వక్సేనుడు గావించిన యుద్ధమును అన్నమయ్య ఇట్లు వర్ణించుచున్నాడు.

"బౌళి :— ఆర్పులు బొబ్బలు నవెవినుఁడు
యేర్పడ నసురల నిటువలె గెలిచె ॥ఆర్పు॥

కూలిన తలలును గుఱ్ఱపు డొక్కలు
నేలపైఁ బారిన నెత్తురును
వోలిఁ జూడుఁడిదె వుద్ధగళ లీరణ
కేలిని విష్వక్సేనుడు గెలిచె ॥ఆర్పు॥

పడిన రథంబులు బహుదండములు
కెడసిన గజములు గొడుగులును
అడియాలములివె అక్కడవిక్కడ
చిడుముడి విష్వక్సేనుఁడు గెలిచె ॥ఆర్పు॥

పగుల పగుల వృషభాసురునిఁ జంపె
పగసీఁగె ఆతని బలముతో.... ॥ఆర్పు॥" (2–108)

—పైరొక సంకీర్తనమున 'సమసె రావణుఁడు సమరము లోపల

అమరులు కడుముదమందిరి మెర్తసి' (11-1-228) అని వర్ణించినాడు.

## నాయకాభ్యుదయము

శ్రీవేంకటనాథుని దశావతారములను ప్రస్తావించుచు ఆయన అభ్యుదయము నిట్లు వర్ణించుచున్నాడు.

"సామంతం :- హరి నీ ప్రతాపమున కద్దమేది లోకమున
సరివేరీ నీకు మరి సర్వేశ్వరా ॥హరి॥
నీవుసీళ్ళు నమలితే నిండెను వేదములు
యీవలఁ దలెత్తితేనే యింద్ర పదవులు మించె
మోవ మూఁతి గిలిపితే మూఁడులోకాలు నిలిచె
మోవిఁ బారనవ్వితేనే ముగిసి రసురులు ॥హరి॥" (2-156)

## ఆశ్రమ వర్ణన

మున్యాశ్రమములను గూర్చి అన్నమయ్య సంకీర్తనములందు ప్రత్యేకముగ వర్ణించినట్లు కన్పింపదు. తిరుమల వర్ణన సందర్భమున వల్లవరాయని మటము ప్రస్తావన మున్నది. అది యిట్లున్నది.

"మెక్కువల కెక్కుపై యెసగి వెలసిన పెద్ద
యెక్కుడతిశయముగా నెక్కినంతటి మీఁద
అక్కజంబైన వల్లవ రాయని మటము" (1-227) అని మాత్రము వర్ణింపబడెను.

## కుమారవర్ణన

బాలకృష్ణుని వర్ణన మిట్లున్నది.

"దేవగాంధారి :- తొడఁబడ నందునుడి దొంగాడివి
వెడఁగుఁ గొప్ప శిరసు వెన్నముద్ద కృష్ణుఁడు ॥తొడి॥
అదిగొనినే రాఁగా నఱచేతి వెన్నముద్ద
పాదుకొన నోరనిండాఁ బావుకొన్నాఁడు
సాదించి నా మాఁటాడఁవెన్నయియ్య వచ్చీఁ జేతికి॥తొడి॥ (26-450)

—ఇంకను కుత్తుకబంటి వరకు పాలుత్రాగి పెరుగు మీగడలను పిన్నవాండ్ల కిచ్చిపోర వలెనుండి తొంగిచూచుచున్నాడట।

## దేవివర్ణన

అన్నమయ్య సంకీర్తనములందెన్నియో అలమేల్మంగా వర్ణన సంకీర్తనము లున్నవి. మచ్చునకొక్క శృంగార సంకీర్తన.

"సౌరాష్ట్రం :— ఇదివో మంచివేళ యిఁకనెన్నఁడు
యెదుటనే మరుని జయించవచ్చు నిపుడు ॥ఇది॥
కాంత నిలువెల్లానీకు కనకపు రథము
బంతినున్న పిఱుఁదులే బండికండ్లు
పొంతనున్న కుచములే పూవుల గుత్తులునీకు
ఇంతటను మరుని జయించవచ్చు నిపుడు.... ॥ఇది॥" (20-375)

—అంతేగాక వెలది పయ్యద కొంగు విజయధ్వజము కాగా కనుబొమలు సింగిణి విండ్లట। అలరిన చూపులు అక్షయ బాణములు కాగా చెలగిన పెనుగొప్పు శిఖరమైన దట। రథికుడైన శ్రీవేంకటేశ్వరుఁడు మరుని తప్పక జయించగలడట! చూపులను అక్షయబాణములుగ వర్ణించుటలో అన్నమయ్య వర్ణనా నిపుణత్వమవగత మగుచున్నది. అవునుమరి। అలమేల్మంగ చూపులు అనిమిషత్వమును వహించినవికదా। అందువలననే ఆ విధముగ వర్ణించినాడు. ఈ సంకీర్తనమందలి అన్నమయ్య వర్ణనా విధానము ఆలోచనాత్మకమై, ఆనందదాయకమై యున్నది.

## సేన

అన్నమయ్య శ్రీవేంకటనాథుని సైనిక బలము నిట్లు వర్ణించుచున్నాడు.

"మాళవి :- గరుడధ్వజుని దండు గదిలె రాకాసులపై
అరదము దోలవో దయ్యాన దారకా
ధరమెల్లఁ గుమ్మెలై పాతాళమదే కానవచ్చె
తురగములఁ దోలవో దుమ్ములు రేగగను.........
దనుజాంతకుని సేన దగ్గరి నడవఁ జొచ్చె.........
చొనిపి రొప్పవో తేరు సుమంతుఁడా
గునిసి దిగ్గజములు గొబ్బున మొగ్గతిలెను
కినిసి వగ్గములు విగించవా వయిపైన......." (10-21)

## అధ్వరము లేక యాగము

అన్నమయ్య జ్ఞానమును యజ్ఞముతో అభేదముచెప్పి ఈ విధముగ వర్ణించు చున్నాడు.

"పల్లవి :- జ్ఞాన యజ్ఞ మీగతి మోక్ష సాధనము
నానార్థములు నిన్నే నడిపె మాగురుఁడు ॥జ్ఞాన॥
అలరి దేహమనేటి యాగశాలలోన
బలువై యజ్ఞానపు పశువు బంధించి
జలసి వైరాగ్యపు కత్తులఁ గోసి కోసి
వెలయ జ్ఞానాగ్నిలో వేలిచె మాగురుఁడు ॥జ్ఞాన॥
మొక్కుచు వైష్ణవులనే మునిసభ గూడపెట్టి
చొక్కుచు శ్రీపాద తీర్థ సోమపానము నించి
చక్కఁగా సంకీర్తన సామగానము చేసి
యిక్కువతో యజ్ఞము సేయించెఁ బో మా గురుఁడు ॥జ్ఞాన॥
తదియ్య గురుప్రసాదపు పురోడాశమిచ్చి
కొదసీర ద్వయమను కుండలంబులు వెట్టి
యెదలో శ్రీవేంకటేశునిటు ప్రత్యక్షము జేసె
యిదివో స్వరూప దీక్ష యిచ్చెను మా గురుఁడు ॥జ్ఞాన॥ (2_148)

—ఈ సంకీర్తనము అన్నమయ్య వైదుష్యమునకు నిదర్శనము. జ్ఞాన యజ్ఞము మోక్షసాధనమని చెప్పుటలో అన్నమయ్య ప్రత్యేకత విదితమగుచున్నది.

—ఇంకను అన్నమయ్య కామయాగమును (12_223) జవ్వన యాగమును (12_228) వర్ణించినాడు.

## నది

ఆకాశగంగ ప్రస్తావన నొక సంకీర్తనమున చేసినాడు. ఆవర్ణన మిట్లున్నది.

"ప్రాకటంబైన పాప వినాశనములోని
భవమగు దురితములు పారుచునుండ
ఆకాశగంగ తోయములు సోఁకిన భవము
లంతంత వీఁడి పారఁగను.... ...." (1_227)

## సరస్సు

తెప్పల కోనేటి వర్ణన మిట్లున్నది.

"గుండక్రియ :- దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మా
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా ॥దేవు॥
ధర్మార్థ కామమోక్షతతులు నీ సోబనాలు
అర్మిలి నాలుగు వేదాలదె నీ దరులు
నిర్మలపు నీ జలము నిండు సప్త సాగరాలు
కూర్మము నీ లోఁతు వోకోనేరమ్మా ॥దేవు॥
తగిన గంగాది తీర్థములు నీ కరళ్లు
జగతి దేవతలు నీజల జంతులు
గగనపుఁ బుణ్యలోకాలు నీదరి మేడలు
మొగి నీ చుట్టు మాఁకులు మునులోయమ్మా ॥దేవు॥ (2-420)

—ఇంకను వైకుంఠ నగరము వాకిలే యాకారమని, వేకాను పుణ్యములే జీవభావమని వర్ణించెను.

## అరణ్యము

జవ్వనమును అడవిగ భావించి నాయికయందు అరణ్య వర్ణనమును మనోహరముగ సాగించినాడన్నమయ్య. ఆ వర్ణన మిట్లున్నది.

"శ్రీరాగం :- అతడు చొచ్చిన వేళ నలరు యడవి
సతినీదు మురిపెంపు జవ్వనపు టడవి ॥అత॥
గురు కుచము గిరుల నెక్కువైన యడవి
తరుణంపు బాహులతల యడవి
పురిగొన్న వాలుఁ జూపుల లేటి యడవి
గరిమతోఁదను తావి కప్పురపుటడవి ॥అత॥
గనియైన నెరుల చీఁకటి పెను యడవి
ఘనమైన జఘన కందకము లడవి
నునుపు నడపుల యేనుక పెద్ద యడవి
వెనకు నట్టు నడిమి సింహపుటడవి ॥అత॥........" (12-153)

— అపూర్వములైన భావములతో అనితర సాధ్యముగ సాగిన ఈ వర్ణన అన్నమయ్య ఊహాశక్తికి తార్కాణము. అడవితో అభేదము చెప్పి నాయిక వర్ణనను గావించినాడు అన్నమయ్య దేనిని వర్ణింప దలచుకొన్నను ఏదోనొక ప్రత్యేకతను ప్రదర్శించుననుట కివి నిదర్శనము.

అన్నమయ్య అక్కడక్కడ రామునిపై చెప్పిన సంకీర్తనములందు సీతాస్వయంవరం ప్రసావనమున్నది.

"అలికై విల్లు విఱిచె వాలికై యమ్ము వేసిన
వాఁడు మగఁటిమి గలవాఁడా వీఁడు" (2-226)
"మునుప దశరథరాముఁడవై తమ్ములునీవు
జనించి తాటకఁజంపి జన్నము గాచి
వెనుకొని హరువిల్లు విరిచి సీతఁ బెండ్లాడి" (2-275)

....అని మాత్రమే సీతాస్వయంవర ప్రస్తావనమున్నది.

## సురవర్ణన

అన్నమయ్య సంకీర్తనమున లన్నియు దీనికి ఉదాహరణ యోగ్యములని ప్రత్యేకముగ చెప్పవలసిన యవసరములేదు. అష్టాదశ వరనలలో నిదియును ఒకటిగా పరిగణింపబడినది గావుననిట స్వీకరింపబడినది.

"తెలుఁగు కాంబోది :- చూచి మోహించకుందురా సురలైన నరులైన

దాసీ నీవు ముందరఁ బ్రత్యక్షమైనను ॥చూచి॥
బాగీరధి పుట్టిన పాదపద్మములు
భోగపుమరుని జన్మభూమి నీ తొడలు
యోగపు నవ బ్రహ్మలుండిన నీ నాభి
సాగర కన్యక లక్ష్మి సతమైన వురము ॥చూచి॥
అందరి రక్షించేటి అభయ హస్తము
కంద నసురలఁ జంపే గదా హస్తము
నందడి లోకముల యాజ్ఞా చక్రహస్తము
చెంది ధ్రువు నుతియించఁ జేయు శంఖహస్తము ॥చూచి॥

సకల వేదములుండేటి చక్కని నీమోము
వొకపై తులసిదేవి వుండేడి శిరసు
ప్రకటపు మహిమలఁ బాయని నీ రూపము
వెకలి శ్రీవేంకటాద్రి విభుఁడ నీభావము ॥చూచి॥" (2-403)

—ఈ సంకీర్తనమున శ్రీవేంకట నాయకుని దివ్య రూపమును అన్నమయ్య వర్ణించినాడు. సురవర్ణన కావున పాదపద్మముల నుండిసాగి, శిరసుతో ముగిసినది. అత్యంత సమర్థముగ అల తియలతి పదములతో అన్నమయ్య వర్ణించినాడు.

## స్వర్గము

స్వర్గ వర్ణన కూడ అష్టాదశ వర్ణనలలో నొకటి. ఈ క్రింది సంకీర్తనము సురపుర వైభవ వర్ణన గావించుచున్నాడు.

"ఎక్కడి సురపుర మెక్కడి వైభవ
మెక్కడి విన్నియు నేమిటికి
యిక్కడనే పరహితమునుఁ బుణ్యము
గక్కునఁ జేయఁగఁగలదిహపరము........" (1-88)

—వేంకటాద్రి ఇహలోక స్వర్గమని అన్నమయ్య భావము: అందువలన పై రీతిగ వర్ణించినాడు.

## అభిసారిక

అష్టవిధ శృంగార నాయికలలో అభిసారిక యొక్కటిగా పేర్కొనబడును అష్టాదశ వర్ణనలలోను పరిగణింపబడుచున్నది. చెలికత్తెల పలుకులద్వారా నాయకుని యన్వేషంపుము దగ్గరకు వచ్చిన వనిత స్థితిని వర్ణించుచున్నాడు.

"కదిసి యన్నిటాను చక్కని వాడవని
సుదతి యొక్కతెనిన్నుఁ జూడ వచ్చెను
చదురు లాడఁగనీవు జాణఁడవని చెప్పఁగా
అదిగో నీతో మాటలాడ వచ్చెను" (28-324)

—ఇంకను రాజసముతో నాయకుడు కొలువుండగా మొగముచూచి మొక్కవచ్చెనట. చుట్టరికపు మేన దానినని తమిరేప వచ్చెనట. నాయకుడేకాంతముగ పానుపుపై నున్న సమయమున నవ్వుచు చేరెనట.

కోట

రాజులు నివసించెడి కోటలను వర్ణింపకపోయినను, అన్నమయ్యకు ఆధ్యాత్మిక ప్రపంచమున కనిపించిన దేహమనెడి కోటను వర్ణించుచున్నాడు.

"కాంబోది ;— చెల్లె నెక్కి కొంటిమిగా జీవుఁడ యీదలు కోటా
బల్లిదుఁడ నీకునేఁడు పట్టె మాయఁ గోటా ॥చెల్లె॥
తొమ్మిది గవనులైన దొడ్డ తోలుఁగోటా
కొమ్మల చవుల మూల కొత్తళాన కోటా
వమ్ములేని మెదవంపు వంకదార కోట
పమ్మి పగవారి నెల్లా పట్టుకొన్న కోటా ॥చెల్లె॥
తలవాకిలి దంతపు తలుపుల కోటా
తలిరుఁ జేతుల పెద్దదంతెనాల కోటా
వెలిఁనూసలనే దండు విడిసిన కోటా
గులుగై యింద్రియములు కొల్లగొన్నకోటా ॥చెల్లె॥
నడ చప్పరములనే నలువైన కోటా
జడిసిన చెవులమించు సవరణకోటా
పడని పాట్లఁబడి ఫలియించెఁగోటా
యెడమిచ్చి శ్రీవేంకటేశుఁడేలెఁగోటా ॥చెల్లె॥" (2–84)

సమర విజయము

సమర విజయ సంతోషముతో సైన్యము పలికెడి పలుకులతో సమర విజయ వర్ణన గావింపబడెను. అది యిట్లున్నది.

"మాళవి ;— పగగొని మానక వచ్చి నెత్తురెప్పుడును
తెగికొనుఁడానె తిత్తి తిత్తి తిత్తి
తగుమహోదరుపీఁపు ధణధణమని వాఁగి
బిగియించరే తోలు బింబిం బింబిం బింబింబిం........
మురదనుజుని పెద్ద మొదలి యెముకఁదీసి
తురులూదరే తుత్తు తుత్తు తుతుత్తు
తిరు వేంకట గిరి దేవుఁడు గెలిచిన న
మరమునను మమ్మ మమ్మ మమ్మ సుమ్మమ...." (1–120)

—సైనికుల సంతోషమును ధ్వన్యనుకరణ పదప్రయోగముతో హృదయంగమముగ వర్ణించినాడు.

## కందుక క్రీడ

నాయికా నాయకులు పువ్వుల బంతులతో క్రీడించు వృత్తాంతము నిట్లు వర్ణించు చున్నాడు.

"కలువ పువ్వులబంతి కన్నుల నదుముకొని
బలువుగ నిన్నువేసెఁ బడఁతి యిదె
సొలసితాఁ జూచినట్టి చూపులు నీకుఁ దెలిపె
సళుపు మరునమ్ములు సాక్షివెట్టినట్లు" (13-82)

వేరొక సంకీర్తనమున

"పువ్వుబంతిఁ గొని చెలి పూఁచి నిన్ను వేయఁగాను
యెవ్వరి సాకిరి వెట్టి యేమి సేసేవు
జవ్వనికి నీ విచ్చిన చనవింతె కాక అది
చివ్వన నూరీవారెంత సేయ వచ్చేరా" (27-179)

అని వర్ణించినాడు.

## వేటవర్ణన

అన్నమయ్య గావించిన వేట వర్ణన మిట్లున్నది.

"కన్నడగౌళ :— కాలాంతకుఁడను వేఁటకాఁడెప్పుడుఁ దిరిగాడును
కాలంబనియెడి తీవ్రపు గాలి వెరవెరగి ॥కాలా॥
పరమ పదంబను చేనికి పసిగొను నరమృగములకును
తరిమిడి, సంసారపుఁబోదములనె యాఁగించి
పురవడిఁ జేసిన కర్మపుటురులు దరిద్రంబను వల
వొరపుగ మాయను పోఁగులు వొక వెరవుల వేసీ ॥కాలా॥" (1-299)

—రూపకాలంకారమున సాగిన ఈ కీర్తన అన్నమయ్య భావుకతకు నిదర్శనము.

## వృష, గజ, అశ్వ ప్రస్తావనలు

వృష, గజాశ్వముల వర్ణనలుకూడ అష్టాదశాది వర్ణనలలో చేరియున్నవి. ఆ వర్ణన లిట్లున్నవి.

"పక్కని జన్మపు సంసార వృక్షమునకు
పక్కవ ఫలము నీవు భావింపఁగా
మక్కవఁ గర్మమనెడి మత్త గజమునకుసు
యెక్కిన మావటీఁడవు యెంచగ నీవు ....
పట్టమైన చిత్తమనే తేజి గుఱ్ఱమునకు
వొట్టుక రేవంతుఁడవు వుపమింప నీవు ...." (2–274)

— సంసార మనెడి వృక్షము, కర్మ మనెడి మత్తగజము, చిత్తమనెడి గుఱ్ఱములను వర్ణించి అన్నమయ్య తన ప్రత్యేకతను ప్రదర్శించినాడు.

## వసంతము చల్లుకొను వర్ణన

నాయికా నాయకులు వసంతమును చల్లుకొనెడి వృత్తాంతమును అన్నమయ్య యిట్లు వర్ణించుచున్నాడు.

"హిందోళం : వనితకుఁ బతికిదె వసంతము
దిన దినము నమరె తిరుమల మీఁదను ॥వని॥
పుప్పొడి వసంతము పోసఁగె రమణునికి
కప్పుర వసంతము కాంతకును
కొప్పెరల నెదురుగఁ గుంకుమ పన్నీరు నించి
కుప్పెలఁ జల్లు లాడేరు కోనేటి కాడ ॥వని॥
జవ్వాది వసంతము చతురుఁడు గైకొనె
పువ్వుల వసంతము పొలఁతి కిదె
రవ్వగా బండ్లపై రాసులు వోసుక
నవ్వుతా వేటులాడేరు నడిమి చింతాడ ॥వని॥" (26–49)

— ప్రతిదినము వనితకు పతికి తిరుమల మీద వసంతోత్సవము జరుగుచున్నదని అన్నమయ్య వర్ణించినాడు.

ఈవిధముగ పదకవితాసార్వభౌముడైన అన్నమయ్య సంకీర్తనములలోనే అష్టాదశాది వర్ణనలు గావించి తన వర్ణనా నైపుణ్యమును ప్రకటించినాడు.

## జానపద గేయ రీతులలోని వర్ణనలు

శ్రీ వేంకటేశునిపై అవధులు లేని భక్తి ప్రపత్తులతో పాటలు పాడి మెప్పించి పరమ పదము నందిన భక్తాగ్రేసరుడన్నమయ్య. ఆయన భాష ప్రజల భాష. ఆయన భావము లనంతములు. శబ్ద ప్రయోగ విషయములో కాని భక్తి భావ ప్రకటనలో కాని అంతటి సౌందర్య దృష్టి గల భక్త కవి యాంధ్ర సాహిత్యమున మరొకరు కనిపించ రనుట అతిశయోక్తి కాదు. వేదాంత సంబంధములగు అనేక విషయములను ప్రౌఢ రీతిలో తెలియ జేసిన అన్నమయ్య సామాన్య ప్రజానీకమునకు సంబంధించన సాహితీ రీతిలో కూడ వర్ణనలు సాగించినాడు. అనగా జానపద గేయ రీతులలోని వర్ణనలను కూడా అన్నమయ్య సంకీర్తన సాహిత్యమున గమనింపవచ్చును. ముందుగ స్త్రీల పాటలను గూర్చి ముచ్చటించుట సముచితము.

### జోలపాట

అన్నమయ్య జోలపాటను గూర్చి కీ॥ శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠికలో (పుట—61—62) నిట్లు వివరించినారు.

"జోవచ్చు తానంద జోజో ముకుంద
రావె పరమానంద రామ గోవింద ॥జో॥
అంగజుని గన్న మాయన్న యిటు రారా
బంగారు గిన్నెలోఁ బాలు పోసేరా
దొంగ నీవని సతులు పొంగుచున్నారా
ముంగిట నాడరా మోహనాకారా ॥జో॥
గోవర్ధనం బెల్ల గొడుగుగాఁ బట్టి
కావరమ్మున నున్న కంసుఁ బడగొట్టి
నీవు మధురా పురము నేలఁ జేపట్టి
ఠీవితో నేలిన దేవకీ పట్టి ॥జో॥
అంగుగాఁ దాళ్ళపాకాన్నయ్య చాల
శృంగార రచనగాఁ జెప్పె నీ జోల
సంగతిగ సకల సంపదల నీ వేళ
మంగళము తిరుపట్ల మదన గోపాల ॥జో॥

అన్నమాచార్యుని ఆధ్యాత్మిక సంకీర్తనము లందొక జోలపాట

"జోజో యని మీరు జోల పాడరో
సాజపు జయంతి నేడే సఫల మిందరికి" (9_182) అని సాగినది.

లాలిపాట

అన్నమయ్య లాలిని గూర్చి కీ॥శే. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారిట్లు వివరించి నారు. "తంజావూరి పుస్తకశాల నుండి యిటీవలఁ గొన్ని తాళ్ళపాక సంకీర్తనములు వ్రాయించి తెప్పించితిమి అందు మీఁది జోల వంటి దొక లాలి కలదు. దానఁగూడ గండవరపు బాల గోపాలుని నామాంక మున్నది గాని శ్రీ వేంకటేశ్వర స్వామి నామాంకము గానరాదు. అన్నమయ్య పేరందు లేక పోయినను గండవరము తాళ్ళపాక వారికిఁ జెల్లుచు వచ్చిన గ్రామమని తెలియుటచేఁ దిమయూరి స్వామి మీఁద నన్నమాచార్యుఁడో తత్పుత్ర పౌత్రులో దానిని రచించి యుందు రనుకొంటిని అది యిది.

"శ్రీరాగం. జంపెతాళం : లాలను నుచు నూపేరు లలన లిరు గడల
బాల గండవర గోపాల నినుఁ జాల ॥లాలి॥

ఉదుటు గుబ్బల సరము లుయ్యాలలూగ
పదరి కంకణ రవము బహుగతుల మ్రోఁగ
వొదిగి చెంపల కొప్పు లొక్కింత వీఁగ
ముదురు చెమటలు నళికములు తొప్పఁదోఁగ ॥లాలి॥

సొలపు తెలిగన్నుఁగవ చూపులిరువంక
మలయు రవళులకుఁ బలు మాఱును బెళంక
కొలఁది కోవిల గములు క్రోలు మదనాంక
ములఁ గ్రేణి సేయు రవములు వడిఁ దలంక ॥లాలి॥

........................................

లలనా జనాపాంగ లలిత సుమచాప
జలజ లోచన దేవ సద్గుణ కలాప
తలఁపు లోపల మెలఁగు తత్వ ప్రదీప
ధళిర గండ వరేశ పరమాత్మరూప ॥లాలి"॥[7]

— ఈ విధముగ లాలిపాట రచనము సాగినది.

**ఉగ్గుపాట**

'భైరవి : ఉగ్గు పెట్టరే వోయమ్మా చె
యొగ్గ నిదె శిశువోయమ్మా ॥పల్లవి॥
కడుపులోని లోకమ్ములు గదలీ
నొదలూఁ జకురే వోయమ్మా
తొడికెడి నరుగనఁ డొలఁగఁ దీయరే
వుడికెడి పాలివి వోయమ్మా ...
తొయ్యలు లిటు చేతుల నలఁగించక
వుయ్యాల విడచే వోయమ్మా ....
క్రొయ్య మాటలను క్రొందల తిమ్మని
నొయ్యద తిట్టకు రోరమ్మా ॥ఉగ్గు॥" (12_97)

— ఉగ్గు కొరకు శిశువు చెయ్యొగ్గుచున్నాడట ; అందువలన ఆ బాలునికి ఉగ్గు పెట్ట వలసినదిగ చెప్పుచున్నారు. ఈ వర్ణన స్వాభావికమై సర్వజనామోదకరమై ఒప్పుచున్నవి.

**ఉయ్యలపాట**

స్త్రీలు బాలుని ఉయ్యాల నూపుచు లాలిలాల్లి యనుచు పాడుచున్నారు. మగువలు ఉయ్యాల నూపెడి దృశ్యమును కన్నులకు గట్టినట్లు వర్ణించుచున్నాడు.

''శంకరాభరణం : ఉయ్యాలా బాలునూఁ చెదరు కడు
నొయ్య నొయ్య నొయ్యనుచు ॥ఉయ్యా॥
బాల యవ్వనలు పసిఁడి వుయ్యాల
బాలుని వద్దఁ బాడేరు
లాలి లాలి లాలి లాలెమ్మ యెల్ల
లాలి లాలి లాలి లాలనుచు ॥ఉయ్యా॥" (12_246)

— ఇంకను కనుదమ్ముల నవ్వులతో, మట్టెల మ్రోతలతో అందెల ఘలఘలలతో ఉయ్యాల నూపెడి స్త్రీలు పాడుచున్నట్లు వర్ణించెను.

కమనీయ మూర్తియైన వేంకట శైలపతిని ఉయ్యాల నూచెడు దృశ్యమును పెద్ద పాటలో మనోహరముగ నిట్లు వర్ణించుచున్నాడు.

''ఆహిరి :   అలరఁ జంచలమైన ఆత్మలందుండనీ
యలవాటు సేసె నీ వుయ్యాల.
పలుమారు నుచ్ఛ్వాస పవన మందుండ నీ
భావంబు వెలిసె నీ వుయ్యాల   ॥అల॥

ఉదయాస్త శైలంబు లొనరఁ గంభములైన
వుడు మండలము మోచె నుయ్యాల
అదన నాకాశ పదమడ్డ దూలంబైన
అఖిలంబు నిండె నీ వుయ్యాల
పదిలముగ వేదములు బంగారు చేరులై
పట్ట వెరపై తోఁచె నుయ్యాల
వదలకిటు ధర్మ దేవత పీఠమై మిగుల
వర్ణింప నరుదాయ నుయ్యాల
మేలు కట్లయి మీకు మేఘమండల మెల్ల
మెఱుఁగునకు మెఱుగాయ నుయ్యాల
నీల శైలము వంటి నీమేని కాంతికిని
నిజమైన తొడవాయ నుయ్యాల
పాలిండ్లు గదలఁగాఁ బయ్యదలు రాఁపాడ
భామినులు వడినూఁచు నుయ్యాల
వోలి బ్రహ్మాండములు వొరగు నోయని భీతి.
నొయ్య నొయ్యన వూఁచిరుయ్యాల   ॥అల॥

కమలకును భూ సతికి కదలు కదలుకు మిముఁ
గౌగిలింపఁగఁ జేసె నుయ్యాల
అమరాంగనలకు నీ హావ భావ విలాస
మందంద చూపె నీ వుయ్యాల
కమలాస నాదులకుఁ గన్నులకు పండుగై
గణుతింప నరుదాయ నుయ్యాల
కమనీయమూర్తి వేంకట శైలపతి నీకు
కడువేడుకై వుండె నుయ్యాల   ॥అల॥'' (1–67)

— ఒక ప్రక్క వేంకటేశుని మహత్త్వము, వేరొక వంక స్త్రీల ఉయ్యేల నూపెటి దృశ్యము పరమ రమణీయముగ వర్ణింపబడినది. ఉయ్యాలలో నున్నది కేవలము వేంకటేశుడే కాదు 'కమలకును భూ సతికి కదలు కదలుకు మిమ్ము కౌగిలింపగ జేసె' అను పలుకుల వలననిది స్పష్టము.

## పెండ్లి పాటలు

పెండ్లికి వచ్చిన పేరటాండ్రను పాడవలసినదిగ తోడి వారు ప్రోత్సహించు చున్నారు.

'సాళంగనాట : పేరటాండ్లు పాడరే పెండ్లివేళ
సారె సారె నిద్దరికి సంతోష వేళ ॥పేర॥
పాలవెల్లి కూతురుకు పసుపులు నలచరే
చాలించరే జోలి పీడు చదివే వేళ
పాలుపడి పరపులు పరచరే దేవునికి
నాలుగో దినము నేడు నాగవెల్లి వేళ ॥పేర॥'' (26–182)

వేరొక పెండ్లి పాట యిట్లున్నది.

''మాళవి : తలుము సూసకపు ముత్యపుదలం బాలతో
నెఱుల తుఱుము వంచీనే నెలంత ॥తలుము॥
పచ్చం దోరణముం బలుకు లింటికని
పచ్చి ముత్యాలనే కట్టె బాసికము
ముచ్చట లేనగవుల ముంగిట ముగ్గులు పెట్టి
నిచ్చ కళ్యాణము లాడీనే నెలంత ॥తలుము॥ (12–169)

— ఇంకను పెండ్లిపాటలు 12_185, 186, 26_182లలో వర్ణింపబడెను.

## శోభనపు పాటలు

''వసంతం : శోభనమే శోభనమే
వైభవాల పావనమూర్తికి ॥శోభ॥
అరుదుగ మును నరకాసురుచెను
సిరులతోం జెరలు దెచ్చిన సతుల
పరవపు వయసుల పదారు వేలను

సొరిదిం బెండ్లాడిన సముఖునికి ॥శోభ॥
చెంచిన వేడుక శిశుపాలుఁడు
అంచి పెండ్లాడఁగ నవగళించి
వించువలెనె తావిచ్చేసి రుకుమిణి
నంచపిఁ బెండ్లాడిన సుముఖునికి ॥శోభ॥" (12_18)

వేరొక పాటలో పిలువక వచ్చిన పేరటాండ్రు శోభన గీతములను పాడుటను వర్ణించుచున్నాడు.

"పిలువక వచ్చితిమి పేరటాండ్లము
సొలసి సొలసి మీపైన సోబానఁ బాడేము" (24_53) అని వర్ణించినాడు.

జయమంగళములు

శ్రీ వేంకటాచల వల్లభుడైన శ్రీనివాసునకు జయమంగళములను అర్పించినాడు అన్నమయ్య. ఆ జయమంగళముల పాటలిట్లున్నవి.

''లలిత : మంగళము గోవిందునకు జయమంగళము గరుడ ధ్వజునకు
మంగళము సర్వాత్మునకు ధర్మ స్వరూపునకూ జయజయము
ఆదికిని నాదైన దేవున కచ్యుతున కంబోజ నాభున
కాది కూర్మందైన జగదాధార మూర్తికిని
వేద రక్షకునకును సంతత వేద మార్గ విహారునకు బలి_
భేదికిని సామాది గాన ప్రియ విహారునకు ॥మంగ॥" (1–46)

— వేరొక సంకీర్తనమున సృష్టికి నాది మూలమైన సర్వేశ్వరునకు జయమంగళము నర్పించుచున్నాడు.

''గుండక్రియ : జయమంగళము నీకు సర్వేశ్వరా
జయ మంగళము నీకు జలజ వాసినికిని ॥జయ॥
శరణాగత పారిజాతమా
హరి నసురుల పాలి భూతమా
అరుదైన సృష్టికి నాదిమూలమావో
హరినమో పరమ పుటాల వాలమా ॥జయ॥'' (2–431)

హారతులర్పించుట

"లలిత : అంగన లీరే యారతులు

అంగజ గురునకు నారతులూ ॥అంగ॥

శ్రీదేవి తోడుతఁ జెలఁగుచు నవ్వే

ఆదిమ పురుషుని కారతులూ

మేదినీ రమణి మేలములాడె

ఆదిత్య తేజున కారతులూ ॥అంగ॥

సురలకు నమృతము సొరిది నొసంగిన

హరికిదివో పనిఁడారతులూ

తరమిది దుష్టుల దనుజాళ నడచిన

అరి భయంకరున కారతులూ ॥అంగ॥ (25–346)

— అనుచు నిత్య కళ్యాణ విధులై వెలిగెడి అలమేల్మంగా వేంకటేశులకు హారతు లర్పించుచున్నారు.

నీరాజనము

నాయికకు నీరాజన మర్పించుట ఈ క్రింది సంకీర్తనమున ప్రశంసింపబడినది.

"మంగళ కౌశిక : క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని

నీరజాలయునకును నీరాజనం ॥క్షీరా॥

జలజాక్షి మోమునకు జక్కవ కుచంబులకు

నెలకొన్న కప్పురవు నీరాజనం

అలివేణి తురుమునకు హస్తకమలంబులకు

విలువ మాణిక్యముల నీరాజనం ॥క్షీరా॥" (26–295)

— ఇంకను చరణ కిసలయములకు, సఖియ రంభోరులకు నిరతమగు ముత్యాల నీరాజన మర్పింపబడినది. నీరాజనమే అయినను వర్ణన అనన్య సామాన్యము.

నివాళి

పేరెవరములో వెలసిన అహోబిలేశునకు నివాళు లర్పించుటను వర్ణించినాడు.

''మలహరి : నిచ్చ నిచ్చఁ జేకొను నివాళి
యిచ్చఁ బేరెవర మోహనలేశ నివాళి ॥నిచ్చ॥
సొలపుల వాలుక చూపుల నెత్తేరు
నెలఁతలు నీకిదె నివాళి
వలయపు కంకణ రవంబుల నెత్తేరు
నిలువుఁ బయ్యెదల నివాళి ॥నిచ్చ॥
గక్కన సరసపు కప్పురపు నవ్వుల
నిక్కుచు నెత్తేరు నీకు నివాళి .... ॥నిచ్చ॥ (28_129)

అని పేరెవరములోని ఓబుళేసునకు నెలతలు నివాళు లిచ్చిన విధమును వర్ణించినాడు.

## మేలుకొలుపులు

శ్రీ వేంకటాద్రి మీది బాలకృష్ణుని యోగనిద్ర చాలించి మేలుకొనుమని అన్నమయ్య యిట్లు వర్ణించుచున్నాడు.

''భూపాళం : మిన్నక వేసాలు మాని మేలు కోవయ్యా
నన్నల నీ యోగ నిద్ర చాలు మేలు కోవయ్యా ॥మిన్న॥
ఆవులు పేయలకుఁగా నఱచీఁ బిదుకవలె
గోవిందుఁడ యింక మేలు కొనవయ్యా
ఆవలీవలి పడుచులాటలు మరిగివచ్చి
త్రోవగాచు కున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా ॥మిన్న॥
.... .... .... .... .... .... .... .... .... ....
వాడల గోపిక లెల్లా వచ్చి నిన్ను ముద్దాడఁ
.... .... .... .... .... .... .... .... .... ....
తోడనే యశోద గిన్నెతోఁ బెరుగు వంటకము
యీడకుఁ దెచ్చి పెట్టె నిఁక మేలుకోవయ్యా ॥మిన్న॥" (1–374)

ఈ సంకీర్తనమున ముందు ముందుగ ఎన్నో విషయములను చెప్పి బాల కృష్ణుని మేలుకొలుపుటకు ప్రయత్నించినను కృష్ణుడు మేలుకొనలేదు. అందువలననే చివరగ యశోద పెరుగు వంటకములను తెచ్చినది గావున మేలుకొనుమని పలికినాడు. ఇప్పుడే కృష్ణుడు తప్పక మేలుకొనును.

వేరొక మేలుకొలుపు గీతిక యట్లున్నది.

"భూపాళం :– మేదిని జీవులఁ గావ మేలు కోవయ్యా
నీ దయే మాకెల్ల రక్ష నిద్రమేలు కోవయ్యా ॥మేది॥
తగు గోపికల కన్నుదామరలు వికసించె
మిగుల సూర్య నేత్రుఁడ మేలుకోవయ్యా ... " (1–376)

— అంతేగాక రాక్షసులనెడి తిమిరము విరియగ పరంజ్యోతియైన పరమాత్ముని మేలు కొనుమని పలుకుచున్నాడు. ఇంకను 24_338, 4–151, 2_436, సంకీర్తనములు మేలుకొలుపు గీతములే,

## ఎచ్చరిక

అన్నమాచార్యునిచే రచింప బడిన 'ఎచ్చరిక' కీర్తనను కీ॥శే॥ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠికలో నిట్లు వివరించినారు.

"మాళవిరాగం : శరణు శరణు సురేంద్ర సన్నుత శరణు శ్రీ సతివల్లభా
శరణు రాక్షస గర్వ సంహార శరణు వేంకట నాయకా ॥శర॥
కమల ధరుఁడును కమల మిత్రుఁడు కమల శత్రుఁడు పుత్రుఁడు
క్రమముతో మీ కొలువు కిప్పుడు కాచినా రెచ్చరికయా ॥శర॥(పుట_67)

— ఈ సంకీర్తనము నేటికిని భజన పద్ధతిలో సాగుచున్నట్లు ప్రభాకరుల వారే పలికినారు.

## రోకటిపాటలు

సుదతులు 'సువ్వి సువ్వి' యనుచు రోకళ్ళతో దంచెడి దృశ్యము కంటికి కట్టినట్లుండి హృదయ ఫలకముపై చెరగని ముద్ర వేయునట్లు వర్ణించిన తీరు గమనింప వచ్చును.

"కేదార గౌళ ; సువ్వి సువ్వి సువ్వని
సుదతులు దంచెద రోలాల ॥సువ్వి॥
వనితల మనసులు కుందెన చేసిటు
వలపులు తగనించో లాల
కను నన్నుల నెదు రోకండ్లను

కన్నుల దంచెద రోలాల ॥సువ్వి॥
బంగారు చెరగుల పట్టు పుట్టములు
కొంగులు మూలఁగ నోలాల
అంగన లందరు నతి వేడుకతో
సంగడి దంచెద రోలాల ॥సువ్వి॥....
కప్పుర గందులు కమ్మని పువ్వులు
చప్పరములలో నోలాల
తెప్పలుగా రతిఁ దేలుచుఁ గోసే
ఉప్పనిఁ బాడెద రోలాల ॥సువ్వి॥" (12–353)

వేరొక సంకీర్తనమున కృష్ణజననమును 'సువ్వి' పాటలో వర్ణించుచున్నాడు.

"భూపాళం : సువ్వి సువ్వి సువ్వాలమ్మ
నవ్వుచు దేవకి నందనుఁ గనియె ॥సువ్వి॥
శశివొడచె అల నంబులు గడచె
దిశల దేవతల దిగుళ్ళు విడిచె
కావిరి విరిసె కంసుడు గినిసె
వావిరిఁ బువ్వుల వానలు గురిసె ॥సువ్వి॥" (22–361)

అధ్యాత్మిక సంకీర్తనమున రోకటి పాట నిట్లు వర్ణించుచున్నాడు.

"కేదార గౌళ : పరమాత్ముని నోరఁ బాడుచును యిరు–
దరులు గూడఁగఁ దోసి దంచిమాయ ॥పర॥
కొలఁది బ్రహ్మాండపు కుంచెనలోన
కులికి జీవులను కొలుచునించి
కలికి దుర్మోహపు రోఁకలి వేసి
తలఁచి తనువుల దంచీ మాయ ॥పర॥" (1–130)

— ఆధ్యాత్మిక పరముగ సాగిన ఈ సంకీర్తనమునందు అన్నమయ్య ప్రదర్శించిన భావముల పూర్వములై, మనోహరముగ నున్నవి.

గొబ్బిళ్ళపాట

శ్రీ వేంకట కృష్ణునకు కొండలరాయునకు అభేదము పాటింపబడి సాగినదీ గొబ్బిళ్ళపాట.

"దేసాళం : కొలని దోఁపరికి గొబ్బిళ్ళో యదు
కులస్వామికి గొబ్బిళ్ళో ॥కొల॥
కొండ గొడుగుగా గోవులఁ గాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్ళో
దుండగపు దైత్యుల కెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్ళో ॥కొల॥
.... .... .... .... ... ... .... .... .... ....
దండి వైరులను తఱమిన దనుజుల
గుండె దిగులునకు గొబ్బిళ్ళో
వెండిఁ బైఁడి యగు వేంకట గిరిపై
కొండ లయ్యకును గొబ్బిళ్ళో ॥కొల॥" (12–98)

జాజర పాటలు

జాజర పాట వర్ణన మిట్లున్నది.

"హిందోళ వసంతం ; జగడపుఁ జనవుల జాజర
సగినపు మంచపు జాజర ॥జగ॥
మొల్లలు దురుముల ముడిచిన బరువున
మొల్లపు సరసపు మురిపెమున
జల్లనఁ బుప్పొడి జారఁగ బతిపై
చల్లే రతివలు జాజర ......... ... ॥జగ॥" (12–274)

నాయిక పలుకులలో జాజరపాట నిట్లు వర్ణించుచున్నారు.

"ముఖారి ; చాలుఁజాలు నీ జాజర నన్ను
జాలిఁ బరచె నీ జాజర
వలపు వేదనల వాడేను యీ
తలనొప్పులచేఁ దలఁకేను

పులకల మేనితోఁ బొరలేను కడుఁ
జలిగొని చల్లకు జాజర ॥చాలు॥" (12_232)

పెలికత్తెల పలుకులలో జాజర పాట యిట్లున్నది.

"పాళ .... మరుఁడు విల్లందుకొనె మచ్చికలు గూడఁ జేసె
పొరి పొరి సిగ్గులనే వుప్పొడిరాలె
ఇరవై శ్రీ వేంకటేశ యీకె నిచ్చె కూడితివి
నరుగ మీమీఁద మీరే చల్లరయ్యా జాజర" (24_249)

అల్లోనేరేళ్ళు

ప్రసిద్ధమైన అల్లోనేరేళ్ళు పాట యిట్లున్నది.

"దేసాళం : నెయ్యము అల్లో నేరేళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో ॥నెయ్య॥
పలచని చెమటల బాహుమూలముల
చెలమల లోనాఁ జెలువములే
ధళ ధళ మను ముత్యపుఁ జెఱఁగు సురటి
దులిపేటి నీళ్ళ తుంపిళ్ళో ॥నెయ్య॥.... (13–179)

— ఇంకను 'విన్నవించరో' యీ మాఁట వీనులఁబట్టి గాని
అన్నిటా వెన్నెల నాఁడే యల్లు నేరేళ్ళ" (22–547) అని వర్ణించినాడు.

ఏలపాట

తానే నాయికయై భగవంతునితో విరహము ననుభవించుచు ఏలపాటనిట్లు పాడుచున్నాడన్నమయ్య. సుదీర్ఘమైన ఏలపాట రచన కడు రమణీయముగ సాగినది. మచ్చునకు కొన్ని చరణములు.

"దేసాళం : మేడలెక్కి నిన్నుఁ జూచి కూడేననే యాసతోడ
వాడు దేరి వుస్సురందురా—వేంకటేశ
యాడ నుంటి విందా కానురా ........
నిండఁ బూచిన మానిపై గండుఁ గోవిల గూయఁగా
నిండిన నీ యెలుఁ గంటాను—వెంకటేశా

అందకు నిన్ను రమ్మంటిరా ........
అవిన తుమ్మెదలు నీ—మేని కాంతిఁ బోలునవి
పూని చేతఁ బట్టఁ బోగాను_వెంక టేశా
సూనాస్త్రుని వేగులాయరా
.... .... .... .... .... .... .... .... .... ....
బొండుమల్లె పానుపుపై—నుండ నిన్నుఁ బాడిపాడి
ఏందు జాగరము లుంటిరా _ వెంక టేశ
యెండలాయ వెన్నెలలురా ....
చిలుకలు మనలోన — కలసిన యట్టివేళ
పలుకు రతి రహస్యాలు _ వెంక టేశ
తలఁచి సేఁదల వ్రాఁతురా
ముమ్మాటికి నీబాసలే — నమ్మి వున్న దాన నేను
కుమ్మరించరా నీ కరుణ_వెంక టేశ
చిమ్ముఁ జీఁకటెల్లఁ బాయను —" (13—223)

— ఈ వర్ణనను గమనించిన తరువాత ప్రబంధ కర్తలందరు నాయిక విరహావస్థను వర్ణించు సందర్భమున అన్నమయ్య భావ వీధిలో సంచరించిరనుటలో సంశయము లేదన వచ్చును.

## తుమ్మెదపాట

నాయికలు తుమ్మెదపై నెపముపెట్టి శ్రీ వేంకటగిరి నాథుని దలచిన వృత్తాంతము నిట్లు వర్ణించుచున్నాడు.

"శ్రీరాగము : తొల్లింటి వలెగావు తుమ్మెదా ၊ ఇంక
నొల్లవు గామన్ను వో తుమ్మెదా
తోరంపు రచనల తుమ్మెదా ၊ ఇంక
దూరేవు గొందులే తుమ్మెదా ၊
దూరిన నెరుగవు తుమ్మెదా మమ్ము
నోరగఁ జూడకుమో తుమ్మెదా ၊ ॥తొ॥

తొలు ప్రాయపు మింద తుమ్మెదా ! కడు
దొలిచేవు చేగలే తుమ్మెదా
తొలుకరి యెఱుగవె తుమ్మెదా_యిక
నులికే వుమముగని వో తుమ్మెదా ॥ ॥తో॥
దొరవు వెంకటగిరి తుమ్మెదా_మా
తురుమేల చెనకేవు తుమ్మెదా ॥
దొరకె నీ చనువులు తుమ్మెదా_యింక
నొరులెరింగిరి కటవో ॥ వో ॥ తుమ్మెద ॥తో॥" (4-9)

— వేంకట గిరి నాధుని తుమ్మెదగా భావించి ఆయనతో చనవు లభించినదని వర్ణింప బడిన పై సంకీర్తనము సహృదయ రంజకముగా సాగినది.

## చల్ల అమ్మకపు పాట

చల్లనమ్ముచున్న పడతి యిట్లు పాడుచున్నదని వర్ణించుచున్నాడు.

"పాడి : మూల మూల నమ్ముడుఁజల్ల ఇది
రేలుఁ బగలుఁ గొనరే చల్ల ॥మూల॥
పిక్కటిల్లు చన్నుల గుబ్బెత వొకతి కడుఁ
జిక్కనిది చిలికిన చల్ల
అక్కనఁ జెమటగార నమ్మీని యిదీ
యెక్కడఁ బుట్టదు గొనరే చల్ల
.... .... .... .... .... .... .... .... ....
అంకుల కరముల వొయ్యారొకతి కడు —
జంకెనఁ జిలికిన చల్ల
వేంకటగిరి పతి వేడుకది
యింకానమ్మీఁ గొనరే చల్ల ॥మూల॥" (12-229)

— ఇంకను నెలజవ్వని యొకతె నేర్పుతో చిలికిన చల్లను కొనుమని పాడుచున్నది.

చల్లనమ్ము పడతిని యిట్లు వర్ణించుచున్నాడు.

"శుద్ధదేశి : మొలమారి గొల్లెత మురియుచును
వలవంతఁ దిరిగీని వాడవాడలను ॥మొల॥

సంపెఁగల తురుముతో చల్లలమ్మి నిదివో
వంపు మోపు గొల్లెత వాడలను ...." (12_372)

ఎఱుక చెప్పుట

శ్రీ వేంకటేశునకు ఎఱుకత ఎఱుక నిట్లు చెప్పుచున్నదని మనోహరముగ వర్ణించుచున్నాడు.

"తెలుగు కాంబోది : ఏరుక చెప్పే నీ యిచ్చ యెల్లా నెరుఁగుదు
మెరుగైన సొమ్ము లిచ్చి మెచ్చవయ్యా నన్ను ॥ఎరు॥
చేతికి కల పలము చెప్పే రావయ్యా నీకు
ఘాతలఁ బరాంగనలఁ గాఁగి లింతువు
ఈతలఁ గన్నుల మేలిటు చెప్పేరావయ్యా
నూతకపు మానములు చూడగలదిఁకను ॥ఎరు॥
మోవి లక్షణాలు నీకు మోవఁ జెప్పేరావయ్యా
చావనొక్క రాకాసి చన్ను దాగితి
వావిరి నీపాదముల వ్రాఁతల జయము చెప్పే
బావి మడుగున నొక్క పాము దొక్కితివి ॥ఎరు॥
ఇంగితాకార భాగ్య మిటు చెప్పే నీవురాన
నంగన మోహించి పాయక యున్నది
తంగని శ్రీ వేంకటేశ తలఁపు చెప్పే నన్నుఁ
బొంగుచుఁ గూడి యిట్టె పోననే వయ్యా ॥ఎరు॥" (13_312)

— తనను కూడిన వేంకటేశుడు ఇంక ఎక్కడికి పోనని చెప్పుననుటలో ఎఱుకత ప్రత్యేకత స్ఫురించుచున్నది. అన్నమయ్యామె ఎఱుకతమై వర్ణించినట్లున్నది.

తత్వగేయములు

జీవుని గూర్చి యిట్లు వర్ణించుచున్నాడు.

ఆహిరి : ఇందు నందుఁ దిరుగుచు నెవ్వరి వాఁడవు గాక
బందె పసురమువై తి బాఁపు జీవుఁడా ॥ఇందు॥
తోలు బొక్కలోనఁ జొచ్చి తూలేటి యాఁకలి చేత
పాలుమాలి యందరికి బంటు బంటవై

ఘనుడగు తిరువేంకట పతిని గనని జన్మము 'వృధా'యనుచున్నాడు.

"ముఖారి :— పెరవుల నొరపులు వ ధావృధా
ధరపై మరియుంతయును వృధా　　॥పెర॥
దయక చేసిన దానంబులు వృధా
పెడనెడ నెఱిఁగిన యెఱుక వృధా
పొడలిలోని హరి నొనరిఁ గమతిలోఁ
దడవని జీవమె తనకు వృధా　　॥పెర॥"　　(1—217)

సంబుద్ధి పదములు

మనసా

"అహిరి :— పారకు మీ వోమనసా పంతము విడువకు మీ మనసా
పారిన నీవే బడగయ్యేదవు చేరువ నాఁడె చెప్పనె మనసా　　॥పారకు॥
.... .... .... .... .... .... .... .... .... .... .... .... .... .... ....
కన్నుల సంగాతము సేయకుమీ కళవళించకుమి వోమనసా
వన్నెల మాటలు చెవులబెట్టక వాసి విడువకుమి వో మనసా
మున్నిఁటి సురలు బ్రహ్మాదులకైనను ముక్తి సాధనము వోమనసా
వెన్నుని వేంకటగిరిపతిఁ దలఁచుము వేసారకుమీ వోమవసా　　॥పార॥
(1—188)

అని సాగిన ఓ రచన.

కర్మమా

"శ్రీరాగం :— ఎన్ని బాధలఁ బెట్టి యేఁచెదవు నీవింక నెంతకాలము దాఁకఁ గర్మమా
మన్నించు మనుచు నీ మఱుఁగు చొచ్చితిమి మామాటాల కించవో కర్మమా
ప్రతిలేని-దురితముల పాలుసేయక నన్నుఁ బాలించ వైతివో కర్మమా
తతితోడ నాత్మ పరితాపంబు తోడుతను తగులాల సేసితో కర్మమా...."　　(1—284)

దైవమా

"ముఖారి :— ఏమీ నెఱుఁగని నాకేడ పుణ్యము
తామసుంతఁ జూమ్మి ముందరనున్న దైవమా　　॥ఏమీ॥
పాతకపుఁ జేతులనే పట్టినన్నుఁ బొలించు

ఘాతుకుఁడ నాకు నెక్కుడి పుణ్యము
చేతనముఁ బోదిసేయు చిత్తము నీదెకాన
రాతిబొమ్మఁ జూమ్మి భారము నీది దైవమా ॥ఏ॥ (1-286)

—అనుచు సంసార జలధిలో మునిగెటి 'నాకెక్కుడిపుణ్యమని' వాపోవుచున్నాడు.

## చిలుకా

జీవాత్మను చిలుకగా సంబోధించుచు మనోహరముగ తత్త్వ బోధ గావించు చున్నాడు.

"అహిరి :- జీవాతుమై యుండు చిలుకా - నీ
నావలికి బరమాత్ముఁడై యుండు చిలుకా ॥జీవా॥
ఆతుమ పంజరములోన నయముననుండి నా—
చేతనే పెరిగిన చిలుకా
జాతిగాఁ గర్మపు సంకెళ్ళఁ బడికాలఁ
జేతఁ బేదైతివే చిలుకా ॥జీవా॥
భాతిగాఁ బదుపులు పగలు రేలును నా—
చేత నేరిచి నట్టి చిలుకా
రీతిగా దేహంపు రెక్కల చాటున నుండి
నీతుకోరువ లేని చిలుకా ॥జీవా॥
బెదరి అయిదుగురికిని భీతిఁ బొందుచుఁ గడుఁ
జెదరఁగఁ జూతువే చిలుకా
అదయు లయ్యిన శత్రు లారుగురికిఁ గాక
అడిచి పడుదువేనీవు చిలుకా ॥జీవా॥ ......" (1-50)

—ఇంద్రియము లైదింటికిని భీతీ పొందుచు, కామక్రోధాది యరిషడ్వర్గములకు అదరి పడుట యెందులకని ప్రశ్నించుచున్నాడు. శ్రీవేంకటాద్రిని చిత్తములో దలచి అద్వైతములో దలచి ఆ దైవమును సేవింపుమని బోధన.

## కోలాటపు పాటలు

అన్నమయ్య సంకీర్తనములను పరిశీలించినపుడు కాంతల కోలాట వర్ణనమే కనిపించినది. ఆ వర్ణన మిట్లున్నది.

"బౌళిరామక్రియ :— వాఁడె వాఁడే అల్లరి వాఁడదివో
నాఁడు నాఁడు యమునా నగరిలోన ॥వాఁడే॥

కాంతల వలయపు కంకణ రవముల
సంతంత్రఁ గోలాట మాడఁగను
చెంతన నడుమను శ్రీరమణుఁడమరె
సంతతపుఁ జుక్కలలో చంద్రునివలెను ॥వాఁడే॥

గోపిక లీరీతిఁ గోలాట మాడఁగ
యేపున శ్రీవేంకటేశ్వరుఁడు
ఓపెలమేల్మంగ, నురమున నిడుకొని
దీపించె మణులలో తేజము వలెను ॥వాఁడే॥ ॥25_341)

వేరొక సంకీర్తనమున వనితలకోలాట వృత్తాంతమును రూపచిత్ర సాక్షాత్కార మగునట్లు వర్ణించినాడు అన్నమయ్య.

"వసంతం :— వేడుక వసంతము వేళనిడే
వాడ వాడల వెంట వనిత లాడేరు ॥వేడు॥

కేలుఁగేలు జట్టు పట్టి కెందామర మోములెత్తి
కోలఁగోలఁ దాఁకఁ జేసి గుంపు వాయక
చాలుకొని యిద్దరేసి జంటలై సతులు గూడి
వోలివేరొక తెకోల నొడ్డుతా నాడేరు
పాలిండ్లు గదలఁగ బయపైన తురుములు
చీలుచు సోలుచుఁ గొంత వెనుకకును
మేలిమి పిఱుఁదులతో మెరయును మురియుచు
కోలలఁ బెడమరలి కోలాట మాడేరు ॥వేడు॥" (25-349)

—ఇంకను ఒంపొరుల మొగములు కన్నుల దేలించి చూచి పదతాళగతులకు పదతు తెల్లరు అలమేల్మంగ వేంకటేశులు వేడుకగా చూచుచుండగ ముందట నాడుచున్నారని వర్ణించినాడు. ఈ సంకీర్తనమున అన్నమయ్య ప్రదర్శించిన వర్ణనా నైపుణ్యము అద్భుతమై అనితర సాధ్యమై యున్నది. ఆయా కాతంలు కోలలతో నాడుచున్న నృత్యమును సహృదయుల మనోరంగ స్థలములపై ప్రదర్శించుచున్నాడు అన్నమయ్య.

## తిరునాళ్ళ పాటలు

"లలిత :- ఎందునీకుఁ బ్రియమో యీ తెప్పతిరునాళ్ళు
దిందుపడె సిరులతో తెప్ప తిరునాళ్ళు ॥ఎందు॥
పాలజలనిధిలోఁ బవ్వళించి పాముతెప్పఁ
దేలుచున్నదది దెప్ప తిరునాళ్ళు ....... (2-143)

తిరునాళ్ళవేడుకలను అలమేల్మంగా వేంకట విభులు తిలకించిన వృత్తాంతము నిట్లు వర్ణించుచున్నాడు.

"సామంతం :- అప్పుఁడు వేంకట రాయుఁడలమేలు మంగఁగూడి
కుప్పలుగా భోగించీఁ గోట తిరునాళ్ళు ॥అప్ప॥
చీని చీనాంబరముల సింగారపుమేడనుండి
పీనుల సన్నగాళెలు వినుకొంటాను
పూని విహరించి వచ్చి పొందుగా నుయ్యాల లూఁగి
కోనేటి దరి మెరసీఁ గోడ తిరునాళ్ళు ॥అప్ప॥
అముకొన్న పన్నీటనద్దిన దుప్పటి తోడ
దోమటి పూవు దండలు మూలాడఁగా
కోమలపు చెలుఁగుల కొమ్మలు లావులు వాడ
గోమున నవధరించీఁ గోడ తిరునాళ్ళు ॥అప్ప॥" (24-281)

—ఇంకనువారు అడుగడుగులకు విడెము లందుకొనుచు భాగవతులెదయక కీర్తించు చుండగ గొడుగులు చామరము లిచ్చు చుండగా వినోదించినారట। అంతేకాదు నానా వాద్యములతో నట్టువరాండ్రు నాట్యము లాడగ, మంచి మంచి పాత్రలాడుటను చూచి ఆవెనుక కోలాటములను తిలకించి మెచ్చినారట. తరువాత 'వరుసతో విద్వాంసుఁడివారు తాళము లొత్తుచు' ద్రావిడమున ప్రశంసింపగ పప్పులు నిద్దెనలు పానకములు ఫలములు అప్పటప్పటికిని ఆరగింపుచు చెప్పరాని మహిమలతో చెలగుచున్నారట।

## భజన కీర్తనములు

శ్రీవేంకటేశుని సేవించిన వారికి చేటులేదని భజన కీర్తనమున నిట్లు వర్ణించు చున్నాడు.

"రామక్రియ : చాలెద నిదియే సత్యము సుండో
చేటు లే దీతని సేవించినను ॥చాలె॥
హరి నొల్లని వారసురులు సుండో
సురలీతని దాసులు సుండో
పరమాత్ముఁడితఁడె ప్రాణము సుండో
మఱుఁగక మఱచిన మఱి లేదిఁకను ॥చాలె॥
....... ....................................................
యిహ పర మొసఁగను యీతఁడె సుండో
వహినుతించెఁ బార్వతి సుండో..........." (2-164)

—అని శ్రీవేంకట రమణుడు భక్తుల కొరకేమహీధరమున నిలిచినాడని వర్ణించినాడు

## చాంగుబళా కీర్తన

"పాడి :- చక్కని తల్లికి చాంగుబళా తన
చక్కెర మోవికి చాంగుబళా ॥చక్క॥
కులికేటి మురిపెపుఁ గుమ్మరింపుఁదన
సళుపుఁ జూపులకు చాంగు బళా........" (12-107)

## ఇతరములు

## తండాన పాట

"బౌళి :- తందనాన అహితందనాన పురె
తందనాన భళా తందనాన ॥తంద॥
బ్రహ్మమొకటె పర బ్రహ్మ మొకటె పర
బ్రహ్మమొకటె పర బ్రహ్మ మొకటే ॥తంద॥
నిండార రాజు నిద్రించి నిద్రయు నొకటే
అండనే బంటు నిద్రదియు నొకటే
మెండైన బ్రాహ్మణుఁడు మెట్టుభూమియొకటే
చండాలుఁడుండేటి సరిభూమి యొకటి ॥తంద॥" (2-385)

—ఇంకను కీటకములకు, పశువులకు అనుగు దేవతలకు కామ సుఖము, ధనాఢ్యునకు నిరుపేదకు దివారాత్రములు, శిష్ట దుష్టాన్నములు దిను నాకలి, సుగంధ దుర్గంధములపై

ప్రసరించు వాయువు ఏనుగుమీద, శునకముపై పొడము ఎండలు సమానమని వర్ణించి నాడు. అన్నమయ్య సర్వ సమానత్వ భావమీ సంకీర్తనమున ప్రకటింపబడినది.

## సొసముఖాలు

"ధన్నాసి :— సందడి విడువుము సొసముఖా
ముందర ధరునకు మజ్జన వేళా ॥సంద॥
అమరాధిపు లిడుఁడాల వట్టములు
కమలజ పట్టము కాళాంజి
జమలి చామరలు చంద్రుఁడ సూర్యుఁడ
అమర నిడుఁడు పరమాత్మునకు ॥సంద॥" ( —12)

వేరొక సంకీర్తనమున సింగార మూర్తి చిత్తజ గురుడునైన శ్రీ వేంకటపతికి 'సొసముఖా' పలికిన విధమునిట్లు వర్ణించుచున్నాడు.

"సామంతం :—పూవుల తెప్పల మీఁద పొలఁతులు నీవునెక్కి
పూవులాకసము మోవఁ బూఁని చల్లుచు
దేవ దుందుభులు మ్రోయ దేవతలు గొలువఁగా
సావధానమగు నీకు సొసముఖా" (2-471)

## బొమ్మలాటవారి పాటలు

జగన్నాటక సూత్రధారియైన శ్రీవేంకట నాథుని బొమ్మలాటవానిగా భావించి అద్భుతముగ వర్ణించుచున్నాడు అన్నమయ్య.

"కన్నడ గౌళ :— ఆటవారిఁ గూడి తౌర
ఆటవారిఁ గూడి అన్నిచోట్ల బొమ్మ—
లాటలాడించ నధికుండ వైతివి ॥ఆట॥
గురుతరమగు పెద్ద కొట్టాము లోపల
తిరమైన పెనుమాయఁ దెరగట్టి
అరయన జ్ఞానము లవి యడ్డముగఁ జేసి
పరగ సుజ్ఞాన దీపములు ముట్టించి ॥ఆట॥
తోలు బొమ్మల దొరకని గడియించి
గాలిచేత వానిఁ గదలించి

పూలేటి రసములు తొమ్మిది గడియించి
నాలుగు ముఖముల నలువున నాడించ ॥ఆట॥
నిన్నె సెతురు గాని నీకేమి నీలేరు
మన్నించు పాతలు మరిలేరు
యెన్నగదిరు వేంకటేశ్వర నీదాను
లున్నతులై నిన్నునుబ్బించి పొగడగ ॥ఆట॥" (2-163)

తిరువేంకటగిరి నిలయుని నాటకమే నిజమని నమ్మిన బొమ్మలాట వారి పలుకు లనిట్లు వర్ణించుచున్నాడు.

"వరాళి :- హో హో హో హో యమ్మలాల బొమ్మలాట వారము
యూర సాన మమ్ము నిట్టె యేమిసేసేరు ॥పోరా॥
ఊరులేని పొలిమేర వాడలు మోచుకొని సేము
తేర దేహమెక్కుకొని తిరిగేము .........
మాటులేని మాటుదెచ్చి మరుగు వెట్టుక వట్టి
మేటాన మేట్ల వలె మెరసేము
గాటమైన తిరువేంకట గిరి నిలయుని-
నాటకమే నిజమని నమ్మికనున్నారము ॥పోరా॥" (1-73)

—బొమ్మలాట వారి పాటలను గూర్చి అన్నమయ్య పైన తెలిసిన విషయములు ప్రశంస నీయములై యున్నవి.

పిల్లల పాటలు

శైశవ దశలోని వారికి సంబంధించిన సంకీర్తనములు అన్నమయ్య సాహిత్యమున అక్కడక్కడ కనిపించుచున్నవి. శ్రీకృష్ణుని బాల్య క్రీడలకు సంబంధించిన వర్ణన మిట్లున్నది.

"దేవక్రియ :- విచ్చన విడినె యూడీ వీడే కృష్ణుడు
వొచ్చములేని వాడు వుదగిరి కృష్ణుడు ॥విచ్చ॥
గల్లు గల్లు మనగాను గజ్జెల నందెల తోడ
బిల్లగోట్లాడీని పిన్న కృష్ణుడు
తెల్లు రేగి వీధులనుగేరి పుట్టచెండులాడీ

బల్లిదుఁడు గదవమ్మ బాల కృష్ణుఁడు ॥పిప్ప॥
తమితోడ గోపాలులు తానుఁగూడి ముంగిటను
సముద్ర బిల్ల లాడీ సాధు కృష్ణుఁడు
చెమటఱగార సిరి సింగన వత్తియాడీ
గుమితాన వీఁడేయమ్మా గోపాల కృష్ణుఁడు ॥పిప్ప॥
వుదుటునఁ బారి పారి వుద్దగచ్చ కాయలాడి... ..." (13-172)

శ్రీకృష్ణుడు ఉట్లు గొట్టిన వృత్తాంతమును అన్నమయ్య యిట్లు వర్ణించినాడు.

"సామంతం :- చూడఁ బిన్నగాని సుద్దులు పెద్దలు
కూడి పట్టఁ బట్ట గొట్టీ గోవిందుఁడు ॥చూడ॥
పాలవుట్టిఁ గొట్టె వెన్న వుట్టి
వేలాడగాఁ గొట్టె వెన్నవుట్టి
కేలు దాఁచి కొట్టె తేనెవుట్టి........ (27-1:7)

—ఇంకను 'చక్కిలాల వుట్టని, నేతివుట్టని, పంచదార వుట్టని, పెరుగువుట్టని పార పప్పు వుట్టని' జార గొట్టినాడని వర్ణించెను.

దోబూచి

"ధన్నాసి :- బండి విరిచి పిన్నపాపలతో నాడి
దుండగీడు వచ్చె దోబూచి ॥బండి॥
పెరుగు వెన్నలుఁ బ్రియమున వేఁ
మరుముచ్చి లించు మాయకాఁడు
వెరవునఁదన విధము దాఁచుకొని
దొరదొంగ వచ్చె దోబూచి ॥బండి॥
.... .... .... .... .... .... .... ....
గొల్లవల్లెలో యిల్లిల్లూ చొచ్చి
కొల్లలాడిన కోడెకాడు
మెల్లయినా వేంకటేశుఁడు అదె
తొల్లిటి దొంగ వచ్చె దోబూచి ॥బండి॥" (12-127)

—శ్రీకృష్ణుని లీలలుపై సంకీర్తనమున ప్రకటింపబడినవి.

## కూగూగు

అదుగో అడుగోయను పదమే కూగూగు యైనదని యూహింపవచ్చును. దీనికి సంబంధించిన సంకీర్తన మిట్లున్నది.

"శంకరాభరణం : గుఱుతెఱిగిన దొంగ కూగూగు
గుడిలోన దాగిని కూగూగు ॥గుఱు॥
నెలతల దోచేసి నీళ్ళాడ గానె
కొలని దరిని కొంగ కూగూగు
బలుపైన వుట్ల పాలార గ్రింవేవి
కొలది మీఱిన దొంగ కూగూగు" (4–56)

ఈ విధముగ పిల్లలకు సంబంధించిన పాటలను వర్ణించినాడు.

## కథాగేయములు

అన్నమయ్య సంకీర్తనము లందంతట కథాగేయములు కన్పించుచున్నవి. ముచ్చటగా మూడు కథలు

## నరసింహవిజయము

నరసింహ విజయ కథా గానమును అన్నమయ్య ఆలపించిన విధమిట్లున్నది. రూపచిత్ర సాక్షాత్కార వర్ణనయిది.

"సాళంగనాట : శరణవి బ్రదుకరో జనులాల
గరిమ మెరసె నిదె కనక సింహము ॥శర॥
అహరహమును బ్రహ్లాదుడు దొరకొని
బహువిధముల హరి మహిమలు వొగడగ
కహకహ హిరణ్యకశిపుడు నగి, హరి
సహజమేది యనుచు చఱచె గంభము ॥శర॥
.... .... .... .... .... .... .... .... ....
జిఱిదప్ప చూపుల మిణుగురు లెగయగ
పుడమి యదర మూర్పులు చెలగ
గడ గడ వణకి దిక్కటములల్లాడగ
వెడలె గంభమున విజయ సింహము ॥శర॥

నగవుల నుడివడె నభోంతరంబులు
పొగ లెగసెను బొమముళ్ళ
పగటు నార్పులను పగిలెను కొండలు
వెగటుగ వెడలెను వీరసింహము ॥శర॥

.... .... .... .... .... .... .... .... ....

పెదపెద కోఱల పిడుగులు రాలగ
తుద నఖముల నెత్తురు దొరుగ
గుది కొను కసరుం గులగిరు ల్మాటాడ
వుదయించె నదివో వుగ్రసింహము ॥శర॥

.... .... .... .... .... .... .... .... .... ....

అప్పుట హిరణ్యా నదరంటఁబట్టి
యిప్పుడఁ దొడపై నిడివించి
తుచ్చి వాని పేగులు జంద్యములుగ
విచ్చి వేసుకొనె విష్ణు సింహము ॥శర॥
పొగిడిరి దివిజులు భువనములు వెలసె
పగయుడిగి చెలఁగెఁ బ్రహ్లాదుఁడు
మిగుల శాంతమున మించె శ్రీ వెంకట
నగమున నహోబల నారసింహము ॥శర॥ (8–239)

— సుదీర్ఘముగా సాగిన ఈ కథా గేయమున హిరణ్యకశిపుని నారసింహుడు తుద ముట్టించిన విధమును కన్నులకు గట్టినట్లు వర్ణించినాడు. శకకవి భాగవతమున జేసిన వర్ణన మిచ్చట స్ఫురింపక మానదు. ప్రౌఢ కవుల వర్ణనలకు మించినట్లున్నది వర్ణన.

## రామకథ

రామాయణమును ద్విపద కావ్యముగ రచించిన అన్నమయ్య 'రామ కథను' సంకీర్తనాత్మకముగ వెలయించినాడు. రామాయణ వృత్తాంతము నంతటిని ఒకే సంకీర్తనమున చక్కగ వివరించి అల్పాక్షరముల ననల్పార్థ రచనా నైపుణ్యమును ప్రకటించినాడు.

సాళంగనాట

రాముఁడిదే లోకాభిరాముఁ డితడు
గోమున పరశురాము కోపమార్చెనటరే ॥రాము॥
యీతఁడా తాటకిఁ జించె యీ పిన్నవాఁడా
ఆతల సుబాహుఁ గొట్టి యజ్ఞముఁ గాచె
చేతనే యీ కొమరుఁడా శివుని విల్లు విఱిచె
సీతకమ్మఁ బెండ్లాడె చెప్పఁ గొత్త గదవె ॥రాము॥
మన కౌసల్య కొడుకా మాయా మృగము నేసె
దనుజుల విరాధుని తానే చెఱిచె
తునుమాడె నేడు దాళ్ళు తోడనే వాలి నడఁచె
యినకులుఁ డితఁడా యెంత కొత్త చూడరే ॥రాము॥
యీ వయసు తానే యీ యెక్కువ జలధి గట్టి
రావణు జంపి సీత మరలఁ దెచ్చెను
శ్రీ వేంకటేశుఁడితఁడా సిరుల నయోధ్య యేలె
కావున నాటికి నేఁడు కంటి మిట్టె కదరే ॥రాము॥ (1–474)

— ఈ విధముగ రామకథాగానము గావించినాడు.

## హనుమత్కథ

కలశాపురములోని హనుమంతుని వర్ణన చేయుచు హనుమత్కథ నిట్లు వివరించు చున్నాడు అన్నమయ్య.

"మాళవి : కలశా పురము కాడఁ గాచుకున్నాఁడు
వలసిన వరాలిచ్చీ వాయునందనుఁడు ॥కల॥
మాయా బిలముచొచ్చి మగుడి యంబుధిలోని-
చాయా గ్రహముఁ జంపి చయ్యన దాఁటి
ఆయెడ లంకిణిఁ గొట్టె యంతలో జానకిఁగని
వాయు వేగాన వచ్చిన వాయు నందనుఁడు ॥కల॥
కడలి దరి నుండి కపులతోఁ గూడుకొని

పడ దీరఁగా మధు వనము చొచ్చి
బడి రామునికి సీతా పరిణామ మెల్లాఁజెప్పె
వడిగల వాఁడితఁడు వాయునందనుఁడు ॥కల॥
రావణాది రాక్షసుల రామునిచే సాధింపించి
ఆ విభుని సీతఁ గూర్చి అయోధ్యనుంచె
శ్రీ వేంకటేశుఁ గొల్చి శిష్ట రక్షణమునకై
వావిరి నిలుచున్నాఁడు వాయునందనుఁడు ॥కల॥" (2–216

— ఈ విధముగ అన్నమయ్య సంకీర్తన సాహిత్యము నందు జానపద గేయ రీతుల లోననేకములైన వర్ణనలు గావించి తన వర్ణనా నైపుణ్యమును ప్రకటించినాడు.

## వర్ణనలలో రసము

'వాక్యమ్ రసాత్మకమ్ కావ్యమ్' అను విశ్వనాథుని నిర్వచనము ప్రకారము రసాత్మకమైన వాక్యమే కావ్యమని గ్రహింపవచ్చును. రసము కావ్య సౌందర్య పరిపోషకమునకు మూలభూతమైనదగుటచేత రసము లేనప్పుడు కావ్య సౌందర్యము లోపించుననియు, రసవంతముకానిది కావ్యము కాదనియు విశ్వనాథుని అభిప్రాయముగ తెలిసికొనవచ్చును. ప్రతిభావంతుడైన కవి రసోచితములైన శబ్దములను ప్రయోగించి సుందరమైన రచలను వెలువరించును. ఇచట రస శబ్దమును కేవలము నవరసములకే గాక భావ తదాభాసాదులకు కూడ అన్వయించుకొనవచ్చును. రససిద్ధుడైన కవీశ్వరుడగు అన్నమయ్య తన శృంగారాధ్యాత్మిక సంకీర్తనములలో నవరసములతో కూడిన సంకీర్తనముల నెన్నెటినో రచించినాడు. భక్తి రస ప్రధానమైన అన్నమయ్య సంకీర్తనములందు తదితర రసములలో సాగిన వర్ణనల తీరును గమనించుట ప్రస్తుతాంశము.

రససంఖ్యను గూర్చి భిన్నాభిప్రాయము లున్నవి. నవరసములు అనెడి వ్యవహారము ప్రసిద్ధము. లాక్షణికులలో పలువురి అభిప్రాయము కూడ ఈ విధముగనే యున్నది. ఈ రస సంఖ్య మొదట కొందరిచే ఎనిమిదిగా తెలుపబడి, తరువాత కొందరి దృష్టిలో తొమ్మిదియై. ఆ తరువాత మరికొందరి దృష్టిలో పదియైనది. ఇంకను తరువాత కొందరు ఆ సంఖ్యను పెంచుటకు ప్రయత్నించినారు.

అయా లాక్షణికుల వాదములను పునరుక్తము చేయుట కంటె కేవలము అధిక సంఖ్యాకుల ప్రచారములోనున్న దశవిధ రస భేదములను ప్రస్తావించుట యుచితము. శృంగారము, హాస్యము, కరుణము, రౌద్రము, అద్భుతము, భయానకము, వీరము, బీభత్సము, శాంతము, భక్తి అనునవి దశవిధ రసములు. అన్నమయ్య సాగించిన రసోచితములైన వర్ణనలను ఈ విధముగ గమనింపవచ్చును.

శృంగారము

అన్నమయ్య శృంగార రచనను ప్రస్తావించుచు శ్రీ గౌరి పెద్ది రామ సుబ్బ శర్మ గారిట్లు వివరించినారు. "తన నొక నాయికగా భావించుకొని, స్వామిని నాయకునిగా మనసున నిలిపికొని పురుషుడై దొడ్డ సంసారియైన తాను తనయందు పుంస్త్వమేలే నట్లు, ఆడదనమె నిండు కొన్నట్లు అంత తన్మయీభావముతో ఈ కీర్తనలను రచించి నాడు. కొన్ని పట్టుల పరిశీలించునప్పుడు, భౌతిక సుఖములను రెండు చేతుల జుర్రు కొను రసిక స్త్రీలకు కూడ మనసు కందని శృంగార మర్మములను తెచ్చి పెట్టు కొన్న నాయికాత్వము గల ఈతడు వర్ణించుట చూడగా ఎంత యోగికైనను ఈ తన్మయీ భావము కుదరదని ఊహింపవలసియున్నది."[8] అన్నమయ్య సంకీర్తనములందు శృంగార సంకీర్తనలే ఎక్కువగా నున్నవని, అవి శృంగార వర్ణనలలో సంయోగ వియోగాది భేదములతో నున్నవని పూర్వోక్తము. అన్నమయ్య శృంగార వర్ణన లింతకు పూర్వమే చెప్పబడినను మరల ఇచ్చట శృంగార రసమును వర్ణించిన తీరును గమనించు పట్ల ఉదాహరించుట సముచితమే యగును. అన్నమయ్య శృంగార రసోచితములైన వర్ణన లిట్లున్నవి.

శ్రీ వేంకటేశుడు నాయికను ఆదరించినాడట. ఆ విషయమును అన్నమయ్య యిట్లు వర్ణించుచున్నాడు.

"రామక్రియ :- భూపతి చెరువు కాడఁ బొంచి తిరువేంకటేశుఁ
దేపున నన్నేల యించి యెంత చేసెనే ॥భూప॥
యిట్టె సింగారించుకొని యింటికి నే రాఁగాను
గుట్టు తోనె వచ్చితా నాకొంగు వట్టెనే
వొట్టు వెట్టి నేఁడన్ను వొద్దనఁ గానే పైఁడి
పట్టె మంచ మెక్కించుక పచ్చి చేసెనే ॥భూప॥ (30–489)

— తనను నాయకుడాదరించిన తీరును నాయిక చెలికత్తెలకు వివరించుచున్నది. ఇంకను నాయకుడా నాయికతో వెన్నెలలో మట్టెల మోతలతో మెలగుచున్నప్పుడు మేలమాడినట్లు, నాయిక సిగ్గుతో తప్పించుకొని యుండగా గుబ్బల మీఁద గురుతులు నించినట్లు ముసుగుతో మేడ మీద నెక్కఁగా నన్ను చేసి మోవి చవి గొనినట్లు, కలకం నవ్వగ శ్రీ వేంకటేశుడు కలసినట్లు నాయిక తెలిపినది. నాయకుడు గావించిన శృంగారపు చేష్టలిందు క్రమముగ వర్ణింపబడినవి.

అన్నమయ్య శృంగార సంకీర్తనా సాహిత్యమున విరహాంతముగ వర్ణింపబడిన సంకీర్తనములు చాలా తక్కువ. విరహాంతముగ వర్ణింపబడిన ఈ సంకీర్తనమును గమనింపవచ్చును.

"సాళంగం : అప్పటి నుండియుఁ జూడ రమ్మలాల
ఒప్పగింత మిఁక పతికువిద విరహము ॥అప్ప॥
పొంతనే తామరలైతే పొద్దు గూఁకిన మీఁద
అంతఁ దెల్లవారు దాఁకా సరమోడ్చును
ఇంతి కనుఁదామరలయితే రేయి వగలు
యెంతైన మొగియుట యెఱుగ మెప్పుడును ॥అప్ప॥" (30–151)

— ఇంకను జక్కవల జంట ఒకవేళ గూటిలో దాగి యుండును గాని చెలి చను జక్కవలు పయ్యద గూటిలో దాగినట్లు కనుపించుట లేదని వర్ణించినాడు.

## హాస్యము

అన్నమయ్య రచనలలో నటనట హాస్య రస పూరితములైన వర్ణనలు కనిపించుచున్నవి.

"నాట : పోరి నీకును వీఁగి పోయిన దానవులు
బిరుదు లుడిగి వోడ బేహారులైరి ॥పోరి॥
మకుటాలు దీస జటా మకుటాలు గట్టుకొని
వెకలి రిపులు ముని వేషాలైరి
మొకములను సోమపు మొకములు వెట్టుకొని
అకటా కొందరు రిపు లాట వారైరి ॥పోరి॥

పేడలు విడిచి సంకెఁ బేయలు మెడ వేసుక
సాదెను కొందరు శివ పత్తులైరి
వీరపు సాములు మాని పెద్ద గడ సాము నేర్చి
తోరపుఁ బగతు లెల్ల దొమ్మరులైరి ॥పోరి॥" (2—246)

— ఇంతను కొందరు రిపులు సింగినాదము లూదు కొనుచు జోగులు కాగ, ఇన్నియును మాని కొందరు శ్రీ వేంకటేశుని శరణు జొచ్చిరట । ఈ సంకీర్తనమున శత్రువుల స్థితిని హాస్యయుతముగ వర్ణించినాడు అన్నమయ్య.

వేరొక సంకీర్తనమున దయనీయమైన స్థితిలో ఉన్న నాయకుని యిట్లు వర్ణించుచున్నాడు.

"చేసన్న సేసి యొకతె చెట్టి వట్టి తీసె నిన్ను
ఆసల వొకతె నిన్ను వద్దె నవ్వెను
యీ సందుల నీ మనసు యిరుమొన సూదాయ
నేనల యిద్దరి చేతఁ జిక్కెఁగా నీతురుము" (27—229)

— నాయకుని తురుము నాయికల చేత చిక్కినదట । ఈ స్థితిని గమనించిన సహృదయులకు నవ్వురాక మానదు.

**కరుణము**

భక్తుని దైన్యము వల్ల కరుణభావము కలుగునట్లు వర్ణించుచున్నాడు.

"ఆహిరి : విడువ రా దెంతైనా వెట్టివాఁడనైన నీకు
కడవారు నవ్వకుండాఁ గాచుకో నన్నును ॥విడు॥
వెనకఁగానను ముందు విచారించి కానను
నిను పై దేహధారినై నీకు మొక్కెను
ఘనుఁడ శ్రీ వేంకటేశ కన్నులెదుటఁబడితి
కనిపో విడువ రాదు కరుణించు నన్నును ॥విడు॥" (2-2)

**రౌద్రము**

అహోబల నరసింహుని రౌద్రరూపమును అన్నమయ్య అనేక సంకీర్తనము లందు వర్ణించినాడు. రౌద్ర రసోచితములైన శబ్దములతో రౌద్ర స్వరూపుడైన నారసింహుని వర్ణన యిట్లు చేయుచున్నారు.

"నాట : ఇలయును నభమును నేక రూపమై
జలజల గోళ్ళు జళిపించితివి ॥ఇల॥

.... .... .... .... .... .... .... .... ....

రొప్పుల నూర్పుల రొచ్చుల కసరులు
గుప్పుచు లాలలు గురియుచును
తప్పిన దెబ్బలి కనరు హుం కృతుల
దెప్పరప సురల ధృతి యణఁచితివి ॥ఇల॥

.... .... .... .... .... .... .... .... ....

అహోబలమున నతి రౌద్రముతో
మహామహిమల మలయుచును
తహ తహ మెదపుచుఁదగు వేంకటపతి
యిహముఁ బరము మాకిపు డొసఁగితివి ॥ఇల॥ (1-85)

—— ఈ విధముగ దెబ్బలి హుంకృతులతో అసురుల నణచిన అహోబల స్వామి వర్ణన గావించినాడు.

అద్భుతము

శ్రీ వేంకట కృష్ణుని కృత్యములను అద్భుత రసములో నిట్లు వర్ణించుచున్నాడు

"దేసాక్షి :- అనరాదు వినరాదు ఆతని మాయలు నేఁడు
దినదిన క్రొత్తలాయ దృష్ట మిదే మాకు ॥అన॥
అదెవి బాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్ల నోరదుమ్ములు చల్లి
యీడ మాతోఁ జెప్పఁగాను యిందరమూఁ గూడిపోయి
చూటబోతే పంచదారై చోద్యమాయనమ్మా ॥అన॥
తీట తీగెలు సొమ్మంటా దేహము నిండాఁ గట్టి
తీఁటకుఁ గాక బాలులు తెగి వాపోగా
పాటించి యీ సుద్ది విని పారి తెంచి చూచితేను
కోటికోటి సొమ్ములాయ కొత్తలోయమ్మా ॥అన॥" (2-167)

— అలతి యలతి పదములతో అద్భుతమైన భావములతో కవితను చెప్పుటలో అన్నమయ్య సిద్ధహస్తుడనుటలో ఈ సంకీర్తనము సాక్ష్యముగ నిలుచుననుటలో విప్రతిపత్తి లేదు.

భయానకము

అహోబలేశ్వరుని భయంకరమైన రూపమును అన్నమయ్య కన్నులకు గట్టినట్లు వర్ణించుచున్నాడు. ఆనారసింహుని అన్నమయ్య వర్ణించిన తీరునిట్లు గమనింపవచ్చును.

"నాట :— అహోబలేశ్వరుఁడరికులదమనుడు
మహామహిమలను మలసీ వాఁడె ॥అహో॥
కదలుఁ గన్నులును కరాళవదనము
గుదిగొను భయదపుఁ గోరలును
అదరు మీసములు నలరఁగ నవ్వుచు
పుదుటు తోరఁ గొలువున్నాఁడు వాఁడె ॥అహో॥
అతిసిత నఖములు ననంత భుజములు
వితత పరాక్రమ వేషమును
అతుల దీర్ఘ జిహ్వాయుఁ గడు మెరయఁగ
మితిలేని కరుణ మెరసీ వాఁడే ॥అహో॥" (2_112)

....అరికుల దమనుడైన అహోబలేశ్వరుని భయంకరమైన రూపమును వర్ణించుచునే కరుణామూర్తి యని పలుకుచున్నాడు.

వీరము

శ్రీవేంకటపతియే అహోబలపు పొలమున వెలసినాడని, ఆ దేవ శిఖామణి వీరత్వమును

"నాట :— దేవ శిఖామణి దివిజులు వొగడఁగ
వేవేలు గతుల వెలసీ వాఁడే ॥దేవ॥
వీదుల వీదుల వెనఁ దురగముపై
భేదిల బల్లెము బిరబిరఁ దిప్పుచు
మోదముతోడుత మోహన మూరితి
యేదెస చూచిన నేఁగీ వాఁడే ॥దేవ॥" (2—39)

అని వర్ణించి ఆ వీరమూర్తిని సహృదయుల ఎదుట సాక్షాత్కరింప జేయుచున్నా డన్నమయ్య.

## బీభత్సము

నాయికా నాయకుల శృంగారమును వర్ణించు సందర్భమున బీభత్సమును వర్ణించినాడు.

"బౌళి :- ఇప్పుడును గల్ల నిజమేదదిది మాకు
కొప్పు పువ్వులు రాలెఁ గొనరు పైననఁగా ॥ఇప్ప॥
కాంత నీ నెన్నుదుటి కమ్మఁ గస్తూరి బొట్టు
పంతమునఁ జెలుల విటు భ్రమ ఇంచెనే
కంతు సమరము గెల్చి కడసారెఁ బగదీర
ఇంత నెత్తురున బొట్టిడు కొనిన గతిని ॥ఇప్ప॥
పడఁతినీ పురముపై వచ్చి వగడపు దండ
బడిబడినే మమ్మునిటు భ్రమ ఇంచెనే
కడలేని చలిగాలిఁ గలని లోపల గెల్చి
వెడఁబేగు జంధ్యములు వేసితినో యనఁగ ॥ఇప్ప॥" (28-18)

—ఈ సంకీర్తనమున 'నెత్తురున బొట్టిడు కొనుట, పేగు జంధ్యములు వేసికొనుట' అను విషయముల ప్రస్తావన వలన జుగుప్స కలుగుచున్నది. కావున దీనిని బీభత్స రస పూరితమైన వర్ణనగా పరిగణింపవచ్చును. ఇందు అన్నమయ్య ప్రదర్శించిన ఊహా శక్తి అద్భుతము.

## శాంతము

అహోబిల నరసింహుని అనేక విధముల ప్రస్తుతించిన అన్నమయ్య శాంత మూర్తిని కూడ వర్ణించినాడు.

"పొగిడిరి దివిజులు భువనములు వెలిసె
పగయుడిపి చెలఁగెఁ బ్రహ్లాదుఁడు
మిగుల శాంతమున మించె శ్రీవేంకట
నగమున నహోబల నారసింహము" (8-239)

—హిరణ్యకశిపుని చంపిన రౌద్రమూర్తి యగు నారసింహుఁడే తరువాత శాంత స్వరూపుడైనట్లు, ఆ దేవదేవుని శాంతస్వరూపమును అన్నమయ్య పై సంకీర్తనమున వర్ణించినాడు.

## భక్తి

భక్త కవియైన అన్నమయ్య చెప్పిన శృంగారాధ్యాత్మిక సంకీర్తనములన్నియు భక్తి రస ప్రపూరితములే. శృంగారమైనను, అధ్యాత్మికమైనను ఆయా సంకీర్తనములందు భక్తి రస ప్రవాహము సాగుచునే యుండును. అన్నమయ్య రచించిన సంకీర్తనములన్నియు దీనికి ఉదాహరణ యోగ్యములే. భక్తి రసమునుగూర్చి ఇక్కడ చెప్పవలయును గనుక మచ్చున కొక్కటి.

"లలిత :- షోడశ కళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి ॥షోడ॥

అలరు విశ్వాత్మున కావాహన మిదె సర్వ
నిలయున కాసనము నెమ్మి నిదె
అలగంగా జనకున కర్ఘ్య పాద్యా చమనాలు
జలధి శాయికిని మజ్జన మదె ॥షోడ॥

వర పీతాంబరునకు వస్త్రాలంకార మిదె
సరి శ్రీమంతులకు భూషణములివె
ధరణీధరునకు గంధ పుష్ప ధూపములు
తిరమిదె కోటి సూర్యతేజునకు దీపము ॥షోడ॥

అమృత మథనునకు నదివో నైవేద్యము
గమిఁ జంద్రనేత్రునకుఁ గప్రవిడెము
అమరిన శ్రీవేంకటాద్రిమీఁది దేవునికి
తమితోఁ బ్రదక్షిణాలు దండములు నివిగో ॥షోడ॥" (2-134)

ఈవిధముగ రసస్వరూపము నెరిగిన అన్నమయ్య ఆయారసములను వర్ణించుపట్ల రసోచితములైన శబ్దములను ప్రయోగించ తనశబ్ద ప్రయోగ దక్షతను ప్రదర్శించి రససిద్ధుడైన కవీశ్వరునిగ ప్రసిద్ధి పొందినాడు.

## ఆలంకారిక వర్ణనలు

కవిత్వమునకు శబ్దార్థములు శరీరము. ఈ శరీరముసౌందర్య వంతముగా ఉండ వలయునన్న అలంకారములవసరము. మానవ శరీలమునకు అలంకారములే విధముగ శోభనుగూర్చునో అదే విధముగ కవిత్వమునకు అలంకారములందము కూర్చును. ఇవి ప్రధానముగ శబ్ద అర్థాలంకారములని రెండు రకములు. శబ్దాలంకారములు కవిత్వ బహిరవయవ భూషణ ప్రాయములు కాగ. అర్థాలంకారములంతరంగ సౌందర్య పరి పోషకము లగును. సహజ సిద్ధమైన సౌందర్యమును ద్విగుణీకృతము గావించుటకు అలంకారములు పనికి వచ్చును ఇవి పరిమితముగ ఉండుట మంచిది. అలంకారము లపరిమితమైనచో సహజ సౌందర్యమునకే భంగము వాటిల్లును. అందువలన కవులు కూడ తమతమ కవిత్వములయందు పరిమితమైన అలంకారములను ప్రయోగించి తమ కావ్యకన్యకలను శోభాయమానముగ దిద్ది తీర్చుటకు ప్రయత్నింతురు.

శబ్దార్థముల తత్వమును పూర్తిగ ఆకళింపుజేసి కొనిన పదకవితా పితామహుదగు అన్నమయ్య తన సంకీర్తనములను అలంకారికముగ రచించినాడు. ప్రతి సంకీర్తనము నందు ఏదేనొక అలంకారము దర్శన మిచ్చును. అన్నమయ్య ఆయా సందర్భములందు గావించిన అలంకారికములైన వర్ణనలను గమనించుటయే ప్రస్తుతాంశము. ఉదాహరణకు కొన్ని ప్రధానములైన అలంకారికములు మాత్రమే గైకొనబడనవి.

### బ్దాలంకారములు

### వృత్త్యను ప్రాసము

"దానవారె గుణశౌరే ధరణీధరమరుజనక" (2–373) అనుచరణములో సాధు రేఫ అనేక పర్యాయములు పునరుక్తమై శ్రుతి శుభగముగ నున్నది గావున దీనిని వృత్త్యను ప్రాసముగ చెప్పవచ్చును.

### ఛేకానుప్రాసము

"ధన్నాసి :— ధరణీధర మందర ధర నగధర
చిర కౌస్తుభ ధర శ్రీధరా
.... .... .... .... .... .... .... .... .... ....
భవహర మురహర భక్త పాపహార
భువన భారహర జురహర" (1–26)

—పై చరణములలో ధర, హర అను నక్షరములు వెంటవెంటనే వచ్చి వీనులవిందుగ నున్నవి కావున ఛేకానుప్రాసము.

యమకము

అన్నమయ్య శృంగార మంజరిలో యమకము నిట్లు వర్ణించుచున్నాడు.

'లేమా! విలాసంబు లేమావి మంచి
లేమావిఁ జేడాప లేమాయటంచు" (పు—6)

—ఇందు లేమాయను సమానమైన వర్ణముల జంటను ఆ వృత్తముచేసి అర్థభేదమును కూడ కలిగించినాడు.

అంత్యానుప్రాసము

అన్నమయ్య సంకీర్తనములలో అంత్యానుప్రాసమునకు ఉదాహరణయోగ్యములైన సంకీర్తనము లసంఖ్యాకములు. నాయిక నాయకునితో ప్రసంగించెడి పలుకులలో మనోహరముగ అంత్యానుప్రాసమును పాటించినాడు. ఆ సంకీర్తన మిట్లున్నది.

"భైరవి :— ఊరకుండవయ్య, చాలునో యయ్య
నేరుపనవౌదువయ్య, నే వెఱతునయ్యా ॥ఊర॥
అయ్యనీకు దండమయ్య ఆఁతకునే నోపనయ్య
పయ్యద ముట్టకువయ్య పచ్చిగానయ్యా
గయ్యాళి నేనౌదు నయ్య కల్లలాడేవాఅయ్యా
దయ్యమెట్టెఁగిత్తేఁ జాలు దానికేమయ్యా ॥ఊర॥" (28—125)

—అనుచూ రచన సాగించి 'మోనాన నుండేనయ్య మోవి నాకీవయ్య' అని పలికినదని ముగించినాడు. పై సంకీర్తనమున 'అయ్య' అను పదమును పాదమధ్యమున, అంతమున ప్రయోగించి తన ఆలంకారిక రచనా నైపుణ్యమును వ్యక్తము చేయుచున్నాడు. ముందుముందుగా ముగ్ధగా పలికిన నాయిక నాయకుడు కల్లలాడినచో గయ్యాళిని కాగల నని పలికినది. చివరగా మౌనము వహించి నాయకుని మోవి కోరినది.

విశేష్యమును ముందుచెప్పి వరుసగా విశేషణములను ప్రయోగించి అంత్యానుప్రాసములో నిట్లు వర్ణించుచున్నాడు.

"పాడి :— రాముఁడు లోకాభిరాముఁడు త్రైలోక్య
ధాముఁడు రణరంగ భీముఁడు వాఁడె ॥రాముఁడు॥

వరుఁడు సీతకు ఫలాదరుఁరు మహో[గపు
శరుఁడు రాక్షస సంహరుఁడు వాఁడే
స్థిరుఁడు సర్వగుణాకరుఁడు కోదండ దీక్షా
గురుఁడు సేవక శుభకరుఁడు వాఁడే ॥రాముఁడు॥" (2_219)

—పై సంకీర్తనమున పల్లవిలోను, చరణములోను ప్రారంభమున, మధ్యలో ఆయా పంక్తులలోని ప్రాసములు ఒకే రీతిగ వినిపించుచు మనోహరముగ వీనుల విందుగ నున్నవి. ఈవిధమైన శబ్దాలంకారములు అన్నమయ్య సాహిత్యమున లెక్కకుమిక్కిలిగ నున్నవి.

ఒకటి మూడు పాదములలో ఒకరీతిగ రెండు నాలుగు పాదములలో ఒకరీతిగ అంత్యాను ప్రాస వర్ణన మిట్లున్నది.

"ఇత్తితో రమణుఁడు నీ పానుపుపై నున్నవాఁడు
చిత్తమురా విన్నపాలు సేసుకొనవే
హత్తి నీతో సమేళమై యిప్పుడున్నవాఁడు
గుత్తపు గుబ్బల నొత్తి కొసరఁగఁ గదవే" (29_17)

ఒకటి రెండు మూడు పాదములలో ఒక విధముద నాలుగవ పాదమున వేరొక విధముగ అంత్యానుప్రాసము పాటింపబడిన సంకీర్తన మిట్లున్నది.

"వేడుకకు తోడువచ్చి వెనక తియ్యగరాదు
వాడికకుఁ జోటిచ్చి వద్దనరాదు
పాడిచెప్పేనని వచ్చి పక్షపాత మాడరాదు
తాడుపై తపసు నీవే తలచుకోవయ్యా" (29_231)

....సంకీర్తనమంతయు ఈ విధముగనే సాగినది. చక్కని నీతులతో సాగిన ఈ సంకీర్తనము నందలి అంత్యాను ప్రాసము మనోహరము.

పల్లవిలో పాటింపబడిన అంత్యానుప్రాసము ప్రతి చరణము నందలి రెండు, నాలుగు పాదములతో పాటింపబడినది. ఆ వర్ణన మిట్లున్నది.

"దేసాళం :- మటిసీసు వేళలేదా మగువలాల
మెఱిశాతఁడే మన్నించీ మిమ్ము సవతులాల ॥మఱి॥

అలు మగఁడు నున్నారు అదివో ఏకతమున
యేల తొంగి చూచేరే యింతులాల

.... .... .... .... .... .... .... .... .... ....

అలకించే రదియేమె అతివలాల ॥మఱి॥

.... .... .... .... .... .... .... .... .... ....

గలబి సేయకురే కాంతలాల

.... .... .... .... .... .... .... .... .... ....

తలుపేల తెరచేరె తరుణులాల ॥మఱి॥" (29-2)

—మగువలార అనుటకు బదులు మగువలాల అని సంబోధించి సంకీర్తనాంతమువరకు ఆ విధముగనే సాగించి శ్రుతి శుభగత్వమును కూర్చినాడు అన్నమయ్య.

మూడవ చరణమునందలి మూడవ పాదమున తప్ప అన్ని పాదము లందును ఒకే విధమైన అంత్యానుప్రాసముతో రచించినాడు. ఈ క్రింది సంకీర్తనమున ఆ వర్ణన మిట్లున్నది.

"హిందోళ వసంతం :- తక్కినవారికినేల తమక మమరు
పెక్కనవు వారికిని పేదక్కలిదె యమరు ॥తక్కి॥
చనువుగల వారికిని సరసమాడిన నమరు
ననుపు గల వారికిని నగవులమరు
మనవిగల వారికిని మంతనంబులు నమరు
వనులు గల వారికిని పైకొనుటలమరు ॥తక్కి॥ (29-263)

—ఈ సంకీర్తనమున కలవారికిని, అమరు అను పదములను ప్రయోగించి వీనుల విందుగ వర్ణించినాడు దీనిని గమనించినపుడు 'ప్రతిభగల వారికిని' ఈ విధములైన వర్ణన 'లమరు'నని చెప్పుట సముచితము.

అన్నిపాదములందును అంత్యాను ప్రాసము పాటింపబడిన వర్ణన మిట్లున్నది.

యిట్టె యలమేలుమంగ యేకత మాడేవేళ
చుట్టిరా నంగరంగాలు చూచేవేళ
మెట్టి శ్రీవేంకటపతి పెరసి యేఁగే వేళ
చెట్ట పట్టాలతో రతిఁజెలఁగు నీవేళ" (30-119)

ఏ చరణమునకా చరణమునకే అంత్యాను ప్రాసము పాటింపబడిన వర్ణన మిట్లున్నది.

"చెలికి నీవు బత్తి చేసిన చేఁతలు
తలకొని యేపొద్దుఁ దలపోఁతలు
వెలరేగి మరుఁడు వ్రాసిన వ్రాఁతలు
కొలఁది మీరిన నీ కొన గోరిగీఁతలు
ఆకెతోడనీవు సారె చాడిన యట్టి మాఁటలు
కైకొని నమ్మెనవె బంగారు మూఁటలు...." (30_350)

— ఈ విధముగ పరిశీలించినచో అన్నమయ్య సంకీర్తనా సాహిత్యమున అంత్యాను ప్రాసము పాటింపబడిన సంకీర్తనములు అసంఖ్యాకముగ దర్శన మిచ్చును.

## అర్థాలంకారములు

కవిత్వముయొక్క ఆంతరంగిక సౌందర్యపరి పోషకములైన అర్థాలంకారము లలో అన్నమయ్య వర్ణనలు సాగించినాడు. ఆ వర్ణనలనిట్లు చెప్పవచ్చును.

## ఉపమ

అన్నమయ్య సంకీర్తన సాహిత్యమున ఉపమాలంకారములు లెక్కకు మిక్కిలిగ మన్నవి. మచ్చున కొక్కటి.

"బౌళిరామక్రియ :- వాఁడే వాఁడే అల్లరి వాఁడదివో
నాఁడు నాఁడు యమునా నగరిలోన ॥వాఁడే॥
కాంతల వలయపు కంకణ రవముల
నంతంతఁ గోలాట మాడఁగను
చెంతన నడుమను శ్రీరమణుఁడమరె
సంతతపుఁ జుక్కలలో చంద్రునివలెను ॥వాఁడే॥
మగువలు ముఖపద్మములు దిరిగిరా
నగపడి కోలాట మాడఁగను
నిగిడీ నడుమనదె నీలవర్ణుఁడు
పగటుతోఁగమల బంధువి వలెను ॥వాఁడే॥" (25_342)

—ఈ సంకీర్తనమున ఉపమాలంకారము చక్కగ పరిపోషింపబడినది. కాంతల నడుమున నున్న శ్రీరమణుడు చుక్కలలో చంద్రునివలె అమరినాడట! ఆదే విధముగ మగువల ముఖపద్మములు తిరిగిరాగ నీలవర్ణుడు కమల బంధుని వలె నిగిడినాడట!

ఉత్ప్రేక్ష

"శ్రీరాగం :.... వదన చందురునిపై వాసన కస్తురి బొట్టు
ఎదురుచున్నది చూడరే చెలులాల
పదిరి రాహువుఁ దన్నుఁ బట్టినట్టి బిగదీర
పదిలాన తామగుఁడఁ బట్టిన యట్లుండె ....
చల్లగాఁ జెలి చెక్కులఁ జల్లిన కప్పుర ధూళి
జల్లన రాలీ చూడరే సతులాల
కొల్లలుగా నయన చకోరములు వెన్నెలలు
వొల్లనె తనిసి వెళ్ళను మిసి నట్లుండె" (13–184)

— ఈ సంకీర్తనమున అన్నమయ్య ఊహాశక్తి అద్భుతముగ నున్నది. వదన చందురునిపై కస్తురి బొట్టు చెదరుటను రాహువుని చంద్రుడు పట్టినట్లు ; వెన్నెలలను చకోరములు వెళ్ళను మిసినట్లు ఊహించగల నేర్పు అన్నమయ్యకే చెల్లినది.

రూపకము

అధ్యాత్మిక సంకీర్తనమున ఆశక్తుడైన భక్తుని స్థితిని రూపకాలంకారములో వర్ణించుచున్నాడు అన్నమయ్య

"కాంబోధి : సంతలే చొచ్చితిఁగాని సరకుఁ గాననైతి
యింతటి శ్రీహరి నీవే యిటు దయఁజూడవే ॥సంత॥
కాంత చనుగొండలు కడకు నెక్కితిఁగాని
యెంతైనా మోక్షపు మెట్లు యెక్కలేనైతి
అంతట జవ్వనమనే అడవి చొచ్చితిఁగాని
సంతత హరి భక్తనే సంజీవి గాననైతి ॥సంత॥
తెగి సంసార జలధిఁ దిరుగు లాడితిఁగాని
అగడై వైరాగ్య రత్నమదిదేనైతి
పొగరు జన్మాల రణ భూములు చొచ్చితిఁగాని
పగటుఁ గామాదుల పగ సాధించనైతి ॥సంత॥" (2–27)

— ఇంకను తనువనెడి కల్పతరువు నెక్కితిని గాని విజ్ఞాన మనెడి ఫలమును కోయ లేక పోయితినని ఆ భక్తుడు మొర పెట్టుకొనెడి విధమును రూపకాలంకారములో మనో హరముగ వర్ణించినాడు. అన్నమయ్య సాహిత్యమున రూపకాలంకారములు మిక్కుట ముగనే యున్నవి.

## సందేహము

నాయిక చక్కదనమును గూర్చి గలిగిన సందేహమును అన్నమయ్య ఈ విధముగ వర్ణించుచున్నాడు.

"శ్రీరాగం : ఏరు పరచి చెప్పరే యింతి చక్కదనములు
పూరకే యీ రెంటికిని నొనరె నీ భావము ॥ఏరు॥
తుమ్మిదలో నీలాలో తొయ్యలి నెరిగురులు
పమ్మి యద్దమో చంద్రుడో పసనిమోము
వుమ్మిడి దిల పుష్పమో వొగి సంపెంగో ముక్కు
కమ్మటి గలువలో గండు మీలో కన్నులు ॥ఏరు॥" (29-72)

— ఇంకను జవరాలి చన్నులు జక్కవలో నిమ్మపండ్లోయని, చేతులను బిసములో తీగెలోయని, పిరుదులను ఇసుక దిబ్బలో చక్రము లోయని, తొడలు అరటులో కరి కరములోయని, పాదములు చెందమ్ములో, చిగురోయని సందేహ పురస్సరముగ కవి సాంప్రదాయములలో నాయిక వర్ణనను మనోహరముగ చేసినాడు.

## స్వభావోక్తి

బాలకృష్ణుని స్వభావము నిటు వర్ణించుచున్నాడు.

"భూపాళం : ముద్దు గారగా నిదె ముంగిట నిలుచున్నాడు
వొద్దికేగి చెలులెల్ల పూరడించరే ॥ముద్దు॥
వేకువ జామున లేచి వేడుక క్రిష్ణుడు తల్లి
ఆకలయ్యీ ననుచు వొయ్యన మంచము దిగి
కాకలతో వసివాడి కన్నులు పులుము కొంటా
యేకరుచు నున్నవాడు యెత్తు కోరే బిడ్డని ॥ముద్దు॥" (30-160)

— ఇది శ్రీ కృష్ణ లీలా వర్ణనములలో ఉదాహరింపబడినది.

స్వభావోక్తి అలంకారములో నాయికా నాయకులు భోజన మారగించెడి దృశ్యము నిట్లు వర్ణించుచున్నాడు.

"కప్పిన కుచగిరులు కాన రాఁగా మూసుకొంటా
నప్పటి దప్పుల కూర లందీఁ జెలి
అప్పుడె శ్రీ వేంకటేశుఁడాయాలకే చే చాఁచె
దెప్పరపుఁ గందువలె దేలించెనదివో" (26_21)

— ఈ చరణమును చదివిన సమయమున సహృదయ పాఠకులకు కుచగిరులను మూసుకొనుచు కూరలందించుచున్న నాయిక, అప్పుడే చేయి చాచిన నాయకుడు ప్రత్యక్షమగు ననుటలో సందేహము లేదు.

## అర్థాంతరన్యాసము

శంకరాభరణం : సరిమోహాలిద్దరికి సాటికిఁ బెనఁగఁ జొచ్చె
వరుసతో జవ్వనము వా పెరుఁగునా ॥సరి॥
పొంచి నీతో నవ్వఁబోతే పోఁకముడి నాకు జారీ
నించి యంతలోఁ జెమట నీకుఁ గారీ
పంచలఁ జెలులివి చూచి పకపక నవ్వేరు
చించుకొని వలపులు సిగ్గెరుఁగునా ॥సరి॥" (25_430)

— ఈ సంకీర్తనమున సరిమోహము లిద్దరికి పెనగిన విశేషమును జవ్వనము వావెరుగునా యనెడి సామాన్యముతోను, నాయిక పోకముడి జారుట, నాయకునకు చెమట గారుట అనెడి విశేషములను వలపులు సిగ్గెరుగునా యనెడి సామాన్యము చేతను సమర్థింప బడుటచే ఇది అర్థాంతరన్యాసము.

## పరికరము

విశేషణములను సాభిప్రాయముగా ప్రయోగించి ఆలంకారిక వర్ణనా నైపుణ్యమును ప్రకటించుచున్నాడు అన్నమయ్య.

"కమలాక్షి గనక యీ కన్నీటి కొలను దగు
తమకపు మేని కాఁక తగదు గాని
తమిఁ గీరవాణి గాన తగుఁబొదలు మాటలు
అమరౌ(ర)వు ? చెదరిన యట్టి నెఱిపురులు" (30_120)

— ఇందు కమలాక్షి, కీరవాణి యను విశేషణములు సాభిప్రాయముగ ప్రయోగింప బడుటచే పరికరాలంకారమైనది.

## భ్రాంతి

నాయకుని భ్రమ నిట్లు వర్ణించుచున్నాడు అన్నమయ్య

"కోవిల కూఁతలు విని కొమ్మ పిలిచీనంటా
దావతితో రమణుఁడు దగ్గరఁబోయి
ఆవల నొక నెమలి అంతలో నేఁగఁగఁజూచి
వేవేగ చెలియంటా వెంటఁ గూడఁబారె —
కీరము వేరొకచోటఁ గెలయుచు నుండగాను
చేరబోయి సతియందుఁ జెలఁగీ నంటా
నీరులో తామర మీఁది నిండు దుమ్మెదలఁ జూచి
కోరి యింతి ముఖమంటాఁ గొలనిలో దుమికె" (13-299)

— ఈ సంకీర్తమున భ్రాంతితో తడబడుచున్న నాయకుడు సహృదయుల యెదుట సాక్షాత్కరించుచున్నాడు. అన్నిటికంటె హృదయంగమముగ తామరలమీది తుమ్మెద లను చూచి తన ప్రేయసి ముఖమని భ్రమించి కొలనిలో దుమికిన దృశ్యము పాఠకులకు నవ్వు తెప్పింపక మానదు.

## ప్రతీపము

"చందురుఁడు నెమ్మోము చల్లు వెన్నెలయేనవ్వు
తటి పూవుగుత్తులే తగు నీ చన్నులు
చల్లిగా లినీ పూర్పు, సంపెంగ నీ నాసికము"

— ప్రసిద్ధములైన ఉపమానములను ఉపమేయములుగ చెప్పుటచే దీనిలో ప్రతీపా లంకార మున్నట్లు గ్రహింపవచ్చును.

## అతిశయోక్తి

అహోబల నరసింహుని రూపము నిట్లు వర్ణించుచున్నాడు.

"చుక్కలు మొల పూసలు సూర్యచంద్రులు కన్నులు
దిక్కులు చేతులెండలు దివ్యాయుధాలు

మిక్కుటపు వేదములు మించుఁ గొస వెంట్రుకలు
రక్కసులఁ జెండే విదారణ సింహమునకు"

— చుక్కలను మొలపూసలుగా వర్ణించుట అతిశయోక్తి.

అపహ్నుతి

"హిందోళ వసంతం ; పతిమీఁద తమకాన భ్రమ సితి వింతే నీవు
అతివరో వెఱపేలే ఆపే నీవు గావా ॥పతి॥
చంద్రుఁ డితఁడు గాఁడే సతి నీ నెమ్మోము గాని
పొంది నీ నీడ జలధిఁబొడ చూపెను
మందానిలుఁడు గాఁడె మగువ నీ వూర్పుగాని
గంధవుఁ గొండఁ దాఁకి కమ్మరా నే తెంచెను ॥పతి॥ (26–48)

— సతి నెమ్మోము జలధిలో పొడ చూపినది గాని చంద్రుడు కాదని మగువ నిట్టూర్పు లేగాని మందానిలుడు గాదని చెలి పలుకుల వలన తెలియజేయబడినది గావున నిది అపహ్నుతి.

విశేషోక్తి

కారణమున్నను కార్యోత్పత్తి జరుగుట లేదని ఈ సంకీర్తనమున వర్ణించు చున్నాడు.

"సామంతం : తరుణి జవ్వనపుఁ దపము సేయఁగను
వరుస తోడ జాతి వైరము లుడిచె ॥తరు॥
జక్కవ పులుగులు జంట వాయవిపె
గక్కున వెన్నెల గాసినను
యెక్కడఁ గోవిల యెలుఁగులు చెదరవు
గుక్కక వానలు గురిసినను ॥తరు॥
గుంపు దుమ్మెదలు గొబ్బున చెదరవు
సంపెగ తావులు చల్లినను
ముంపున చకోరములు వసివాడవు
పొంపుఁ గళల పెను సూర్యుఁడుండఁగను ॥తరు॥" (24–167)

— ఈ సంకీర్తనమున వెన్నెల కాసినను జక్కవల జంటలు పాయకున్నవని వర్ణించు టను బట్టి కారణమున్నను కార్యోత్పత్తి జరుగకున్నదని గ్రహించుట వలన దీనిని విశేషోక్తిగ చెప్పవచ్చును. ఇట్లే మిగిలినవి.

### ఉల్లేఖము

"బౌళి : ఎంత మాత్రమున నెవ్వరు దలఁచిన అంత మాత్రమే నీవు
అంతరాంతరము లెంచి చూడఁ బిండంతే నిప్పటి యన్నట్లు ॥ఎంత॥
కొలుతురు మిము వైష్ణవులు కూరిమితో విష్ణుఁడని
పలుకుదురు మిము వేదాంతులు పరబ్రహ్మంబనుచు
తలఁతురు మిము శైవులు తగిన భక్తులను శివుఁడనుచు
అలరి పొగడుదురు కాపాలికులు ఆది భైరవుఁడనుచు ॥ఎంత॥ (2-393)

— ఈ సంకీర్తనమున ఒక్క దైవమనే వివిధ మనస్తత్వములు గల భక్తులు రక రకములుగ భావించి సేవించుటను బట్టి దీనిలో ఉల్లేఖాలంకారమున్నటు గుర్తించ వచ్చును.

### వ్యతిరేకము

ఆధ్యాత్మిక సంకీర్తనమును అన్నమయ్య వ్యతిరేకాలంకారములో నిట్లు వర్ణించు చున్నాడు.

"బౌళి ; పురుషుండని శృతి వొగడీనట ఆ పురుషుడు నిరాకారమట
విరస వాక్యము లొంటొంటికి నివి వింటే నసంబద్ధములు ॥పురు॥
మొగమున బ్రాహ్మలు మొలచిరట ఆ మూరితి అవయవ రహితుఁడట
తగు బాహులను రాజులట ఆతత్వమే యెంచఁగ శూన్యమట
పగటున తొడలను వైశ్యులట ఆ బ్రహ్మము దేహము బయలట
అగపడి పాదాల శూద్రులట అతని రూపము లేదట ॥పురు॥ (2-252)

— చాతుర్వర్ణ్య వ్యవస్థను గూర్చి చెప్పుచు వ్యతిరేకాలంకారములో హృదయంగ మముగ వర్ణించినాడు.

### లోకోక్తి

అనేకములైన లోకోక్తులచే ఆలంకారికముగ చెప్పబడిన సంకీర్తనమిట్లున్నవి.

''శుద్ధవసంతం : చిక్కవడ్డ పనికిఁ జేసినదే చేఁత
లెక్కలేని యప్పునకు లేమే కలిమి ॥చిక్క॥
తగవులేమి కెదిరి ధనమే తన సొమ్ము
జగడ గానికి విరసమే కూడు
తెగదెంపులేమికి దీనగతే దిక్కు
బిగువుఁ గూటికి వట్టి బీరమే తగవు ॥చిక్క॥
.... .... .... .... ... .... .... .... ....
యెదురు లేమికి దమకేదైనఁ దలపిది
మదమత్తునకుఁ దన మఱపే మాట
తుది పదమునకుఁ జేదోదైన విభము
పదిలము శ్రీ వేంకట పతియే యెఱుక ॥చిక్క॥'' (2–63)

## పర్యాయోక్తి

దేవ దేవుని వర్ణించుచు సూటిగా వర్ణింపక మార్గాంతరముగ పలుకుచున్నాడు.

''లలిత : వాదులేల చదువులు వారు చెప్పినవే కావా
వాదులేల మీ మాట వారి కంటే నెక్కుడా ॥వాదు॥
నాలుగు వేదాల బ్రహ్మ నలినెవ్వని సుతుఁడు
వాలిన పురాణాల వ్యాసుఁడెవ్వని దాసుఁడు
లీల రామాయణపు వాల్మీకి వసిష్ఠులు
ఆలకించెవ్వనిఁ గొల్చి రాతఁడే పో దేవుడు ॥వాదు॥'' (2–404)

## ప్రతివస్తూపమ

నాయికా నాయకుల పంతములు చెల్లుటను ప్రతివస్తూపమాలంకారములో వర్ణించుచున్నాడు.

''కాయములో కరుఁగు కనుచూపులో మెరఁగు
చేయి చెక్కు వెరగు చెలియకదె
పాయములో బిగువూ పచ్చిమోనా నగవూ
యీ యెడ నీకే చెల్లె యింతి మనోహరుఁడా'' (27–461)

— ఇంకను పలుకుల కొదలు పయ్యెదలోవదలు అలకల కదలు అతివయని నిలువు తమకము నిట్టూర్పు గమకము శ్రీ వేంకటేశునకు చెల్లినవని వర్ణన.

## విషమ

అనను రూపములైన వానికి సంబంధ మెట్లు కుదిరినదని వర్ణింపబడుట విషమా లంకారము. ఆ వర్ణన మిట్లున్నది.

"ఒకటొకటి గూడ దోయమ్మ నీ యందే
సకలము నెటువలె సంతము సేసితివె ॥ఒక॥
తానకపు నీకు చాలు దంతి కుంభాలఁ బోలితే
యీ నడును సింహము నేల పోలెనే
అనిపట్టి నీ కన్నులంబు జాలఁబోలితేను
ఆననము చందురుని నదియేల పోలెనే ॥ఒక॥" (30–204)

## పిహిత

పరవృత్తాంతమును తెలిసి కొనిన నాయిక సాభిప్రాయ చేష్టిత మీ క్రింది సంకీర్తనమున వర్ణింపబడినది.

''సామంతం ; ఎటువంటి వోజ యీ పెకెటు వంటి వొడికము
కుటిల కుంతలి నీకే కోషలిగాఁదగును ॥ఎటు॥
నీవు మోము చూచి తేను నీ చేతికి బాగాలిచ్చి
కావించి యాకు మడిచి కాచుకున్నది
ఆ వేళ మోము చూచి అటు నీవు నివ్వితేను
పూవులు నీకు ముడిచీ బుజము మాటునను ॥ఎటు॥ (30–342)

— నాయకుని అభిప్రాయమును గమనించిన నాయిక ప్రవర్తించిన తీరు వర్ణింపబడుటచే పిహితాలంకారము

## వ్యాజనింద

"ముఖారి ; సేవింతురా యితనిఁ జెలఁగిపరు । లిట్లనే
కావించె మమ్ము నెక్కడి దైవ మితఁడు ॥సేవిం॥
పాలవని యితఁడెఱుఁగు పాల బవళించగో
పాలుఁడని నేమితని భజియించగా
పాలుపడి తల్లి చనుఁబాలు నహితంబనే
కాలమునుఁ బాపె నెక్కడి దైవ మితఁడు ॥సేవిం॥
పుట్టింపఁ దానె మటి పురుషోత్తముఁడు మంచి
పుట్టు వొసఁగి ననుచుఁ బూజించఁగా

పట్టుకొనిమము దెచ్చి బలిమి పుట్టువులెల్ల
గట్టి పెట్టించె నెక్కడి దైవ మితఁడు ॥సేవి॥ (1_293)

—మేము తెలివి చాలక సేవించితిమి. ఇతరులు సంతోషించి ఇట్లు కొలుతురాయని తాత్పర్యము. తల్లిసాలే యెప్పటికిని లేకుండచేసెనను నింద: ముక్తి కర్తలై పున ర్జన్మము లేని వారినిగ చేసెనని మెప్పుఇందున్నవి. ఇట్టిదైవ మింకొకడులేవని భావము. కావున నిది వ్యాజనింద.

అన్నమయ్య సాహితీ సముద్రమును ఇంకను పరిశీలించినచో వినూత్న కాంతి పుంజములను వెదజల్లెడి అలంకారములు లభించుననుటలో సందేహము లేదు. అన్నమయ్య అలంకారిక వర్ణనా చిపుణుడని తెలియజేయుటకు మాత్రమేకొన్ని అలంకారములు వివరింపబడినవి.

ఈప్రకరణమున అపారమైన అన్నమయ్య సాహితీ ప్రపంచమున గల వివిధములైన వర్ణనలు పరిశీలింపబడినవి. వర్ణనా నైపుణ్యము మూర్తీభవించిన అన్నమయ్య రచించిన శృంగార, ఆధ్యాత్మికమైన సంకీర్తనములలో నాయికా నాయకుల వర్ణనలు సంయోగ వియోగాది శృంగార వర్ణనలు ప్రసంగ వర్ణనలు, సంభాషణాత్మక వర్ణనలు, రాయబార వర్ణనలు దూతీ ప్రబోధ వర్ణనలు ఆధ్యాత్మిక వర్ణనలు, వేల్పుల వర్ణనలు, అష్టాదశ వర్ణనలు, జానపద గేయ రీతులలోని వర్ణనలు, రసవర్ణనలు, అలంకారిక వర్ణనలు, బహుముఖముగ పరిశీలింపబడినవి. అన్నమయ్య సాహిత్యమొక సముద్రము. ఆ సముద్రము నందలి వర్ణనా రత్నముల నన్నిటిని వెదకి సంపాదించుట కష్టసాధ్యము. అన్నమయ్య సాహితీ నందనోద్యానమున వెల్లి విరిసిన సంకీర్తన పుష్పములలో మకరందము 'మస్తుగ' ఉన్నది. అన్నమయ్య తనకు నచ్చిన రీతిలో, తాను మెచ్చిన పద్ధతిలో సృష్టించిన సాహితీ విహాయస పథమున వెలసిన ప్రకాశవంతమైన నక్షత్రములను లెక్కించుట కష్టసాధ్యము. అవి ఎల్లప్పుడు తమతమ కాంతి పుంజములను అన్ని దిక్కులకు వెదజల్లుచునే యుండును.

# సూచికలు

1. పీఠిక, శృంగార సంకీర్తనములు సంపుటి 12 పుటలు, 39,40
2. తాళ్ళపాక కవుల పద కవితలు – భాషాప్రయోగ విశేషాలు పు. 104
3. అన్నమయ్య డా॥ ముట్నూరి సంగమేశం పు. 27
5. శృంగార సంకీర్తనములు సంపుటి 12, పుటలు. 36, 57
4. ,, ,, ,, పుటలు. 17,19,20
6. ఆధ్యాత్మిక సంకీర్తనములు, సంపుటి 1, పీఠిక పుటలు 21,22
7. అన్నమాచార్య జీవిత చరిత్రము పీఠిక పుటలు. 63,64
8. శృంగార సంకీర్తనములు సంపుటి 26, పీఠిక పుట. 23

# 5. అన్నమయ్య - ఇతర కవులు

ప్రకృతిని అనుకరించుటయే కళ. కళ అనునది అనుకరణ ప్రధానమైనదిగ పేర్కొనబడినది. ఆంధ్ర సాహిత్యముకూడ సంస్కృత భారతమును అనువదించుట తోడనే ఆరంభమైనది. అనువాదముతో ఆరంభమైన ఆంధ్ర సాహిత్యమున వెలసిన కవులు తమ పూర్వ కవులను అనుసరించి తరువాతి కవులకు మార్గదర్శకులై విరాజిల్లి నారు. ఈ అనుకరణలను గూర్చి శ్రీ గౌరిపెద్ది రామ సుబ్బశర్మగారు ఈ విధముగ పలుకుచున్నారు. "సమాన విషయమును వర్ణించునపుడు భిన్న కాలములందలి కవులకు గూడ భావైక్య మేర్పడవచ్చు. దానిని భావ సంవాదమన్నారు పెద్దలు.

''సంవాదాస్తు భవన్త్యేవ బహుళ్యేన సుమేధసామ్
నైకరూపతయా సర్వేతే మంతవ్యావిపశ్చితా" (ధ్వన్యాలోకము ఉద్యోతము4శ్లో)

తరువాతివారు పూర్వకవుల గ్రంథములను చూడకుండ వచ్చుగూడ. కానీ తరువాతి వాడిపై అనుకరించనాడను అపవాదము రాకతప్పదు. అనువాదముగానీ, అనుకరణము గానీ పంచమహాపాతకాలలో చేరవని మనము గుర్తింప వలసియున్నది. అనుకరించు వానిలో స్వతంత్ర భావనా బలమూ, ఇతరత్రా ప్రతిభోన్మేషము కనబడినచో అంతటి వానిచేత గూడ ననుకరింపబడిన పద—భావ—సంఘటనా—అలంకార సమావేశ మాధు ర్యము గలవాడని అనుకార్యునికి కీర్తి చేకూరునుగాని అనుకర్తకు తక్కువ దనము రాదు. 'భోజనం దేహి రాజేంద్ర ఘృత సూప సమన్వితమ్ మాహిషంచ శరశ్చంద్ర చంద్రికా ధవళం దధి' వలె పరభాగము మాత్రము సారవంతమై సొంతము నిస్సార మైనపుడు ఆకవి నుద్ధరించు వారుండరు. కావున సహజ ప్రతిభా సంపన్నునికి అనుకర ణము దోషముగాదు. అట్లు చూచినచో వాల్మీకికి తరువాత కవియే లేడు. కాళి దాసాది సంస్కృత కవులకూ నన్నయాది తెలుగు కవులకు గతియేది? కావుననే సంస్కృతాంధ్ర కవులందరూ తమ ప్రాచీనులను నిర్భయముగ పొగడుచు తమ స్వతంత్ర ప్రతిభతో ప్రతిష్ఠితులైనారు."[1]

పదకవితా పితామహుడైన అన్నమయ్య సంకీర్తన రూపముగ సాహిత్యమును వెలువరించినను ఆయా కవుల ప్రభావము అన్నమయ్యపై ఉన్నట్లు, అన్నమయ్య రచనా ప్రణాళికను అనుసరించి తరువాతి కవులు రచనలు చేసినట్లు గమనింపవచ్చును.

అన్నమయ్య ప్రబంధయుగమునకు కొంచెము పూర్వకాలమున వెలుగొందినాడు. ఆయా విషయములను వర్ణించు పట్ల అన్నమయ్యకు ఇతర కవులకు, సంకీర్తన కర్తలకు సామ్యములు కనిపించునని చెప్పుటలో సందేహమనవసరము. అన్నమయ్యకు ఇతర కవులకు, సంకీర్తన కర్తలకు రచనా విధానమునగల పోలికలను పరిశీలించుటయే ప్రస్తుత ప్రకరణ ప్రధానోద్దేశము.

ఆంధ్ర సాహిత్యమున ఆదికవి నన్నయ. నన్నయకు పూర్వము తెలుగులో కవిత్వమున్నను అదియొక క్రమబద్ధమైన పద్ధతినగాని, కథారూపమున గాని లేకుండుటచే సంస్కృతమునుండి తెలుగున కనువాదము చేయబడిన ఆంధ్ర మహాభారతమునే ఆది. గ్రంథముగ గుర్తించి ఆంధ్ర సాహిత్యమున నన్నయనే ఆదికవిగ నిర్ణయించినారు తనకు పూర్వమున్న భాషకు సుస్థిర రూపమును సంతరింపజేసి గ్రంథరూపముగ ఆంధ్ర సాహిత్యమును నన్నయ వెలువరించినటులనే అన్నమయ్య తనకు పూర్వమున్న వచన గీతములకంటె భిన్నముగ సంకీర్తన సాహిత్యమును వెలువరించి పదకవితా పితామహుడని, సంకీర్తనాచార్యుడని బిరుదములను పొందినాడు. నన్నయ సకలనీతి సారమైన భారత రచనకు పూనుకొనగ, అన్నమయ్య శ్రీవేంకటేశుని గుణగానముచేసి ప్రజలను భక్తిమార్గమున కున్ముఖులను గావించుటకు ప్రయత్నించినాడు.

నన్నయ తరువాత భారత రచన గావించిన తిక్కనకు అన్నమయ్యకు కూడ అనేక సందర్భములలో పోలికలు కనిపించును. తిక్కన అన్నమయ్య లిరువురు తెలుగు జాతీయములను తమతమ కవిత్వములయందు కుప్పలు కుప్పలుగ క్రుమ్మరించినారు వీరు నిత్య వ్యవహారములలో ఉన్న పద జాలములతో, నిరంతరము ప్రజల జిహ్వాంచలములపై నాట్యమాడెడు పలుకుబడులతో కవితా వ్యవసాయమును సాగించి విశేషముగ పంటలు పండించిన కృషీవలులు. వీరి భాషా ప్రయోగమునందలి సామ్యములను శ్రీగౌరిపెద్దివారు శృంగార సంకీర్తనలు 17వ సంపుటి పీఠికలో వివరించినారు. సరళమైన పదములతో కవితా రచన సాగించిన వీరిరువురు ఆయా సందర్భములయందు తమతమ సంస్కృత భాషా పాండిత్యమును ప్రకటింపజేసెడు రచనలుకూడ చేసినారు. ప్రాత పడిన మాటల పొంతకుపోని ఈ ఉభయ భాషావిశారదుల కవితాశారదా నిరంతరము శరచ్చంద్రికలను వెదజల్లుచునే యుండుననుటలో సందేహములేదు.

ప్రబంధ పరమేశ్వరుడైన ఎఱ్ఱన విరచితమైన హరి వంశములోని శ్రీ కృష్ణ వర్ణనలకు అన్నమయ్య చేత రచింపబడిన శ్రీకృష్ణ గుణగాన సంబంధి కీర్తనలకు అక్కడక్కడ సామ్యములు కనిపించును. నాచనసోముని రచనలకు అన్నమయ్య సంకీర్తనములకు సామ్యములు కలవని కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిట్లు వివరించినారు. "వేమనపుఁ జారివార (వారలార అనుటకు) కట్టివార (వారలార అనుటకు)ఇట్టి ప్రయోగము నాచన సోమనయు 'వెఱ్ఱివార పిడుగు ప్రేసినఁ దలఁబొప్పి యాగునే'అని చేసెను. నాచన సోముని యసుకృతులీ సంకీర్తనములలో ఁజాలగలవు. 'ఎదిరి కిన్మ్రదచువాడు తనకుఁ దగరంబు సరదుటెంతటి ఖరమ్ము' నాచన సోముని నానుడి యిది. ఎనలేక మెరికి యినుమడిచే వానికి తనకు తగర మదువఁదద వయ్యానా' అని సంకీర్తనమువ కెక్కినది"[2]

ప్రబంధ సాహితీ మార్గదర్శకుడుగా పేర్కొనబడిన కవి సార్వభౌముడైన శ్రీనాథుఁడు చేసిన వర్ణనలకు అన్నమయ్య శృంగారమంజరియందును, సంకీర్తనములలోను చేసినవర్ణనలకు సామ్యమున్నది. ఇంచుమించు సమకాలికులుభక్త కవి శిఖామణులైన అన్నమయ్య పోతనల కవిత్వములలో అనేకములైన సామ్యములు కనిపించుచున్నవి.వీరిరువురును ఇహలోక సౌఖ్యములను తృణీకరించి పరలోకసౌఖ్యమునకు ప్రాధాన్యమిచ్చి పరమ భాగవతోత్తములుగ ప్రసిద్ధిపొందినారు. అన్నమయ్య శృంగార మంజరిలోను, సంకీర్తనములయందును వర్ణించిన వనవిహార, విరహ, శైత్యోపచార, చంద్ర మలయానిలాది దూషణ వర్ణనలను తరువాతి ప్రబంధ కర్తలందరు అనుసరించినారు. అందువలననే డాక్టర్ ముట్నూరి సంగమేశంగారు "అన్నమయ్య శృంగార మంజరి ప్రణాళిక మీదనే భట్టుమూర్తి వసుచరిత్ర కావ్యమంతా అల్లబడింది. ఇక పదాలు పద బంధాలు, జాతీయాలు, పలుకుబళ్ళు, అలంకారాలు, భావశిల్పం మొదలైన విషయాల్లో ప్రబంధకవులందరు తాళ్ళపాక కవులకు ఋణపడ్డవారే"[3] అని తెలుపుట సముచితము.

ఆయా కవులకు అన్నమయ్యకు రచనా విధానమునగల సామ్యములను పరిశీలించినచో అనేకములైన విషయములవగతమగును. నాయికా నాయకులను వర్ణించు సందర్భమునగాని, భక్తి భావములను ప్రకటించు సందర్భమునగాని అన్నమయ్యకు ఇతర కవులకు అనేక విషయములలో పోలికలున్నవి. ఆ పోలికలనిట్లు పరిశీలింపవచ్చును.

## నాయికా వర్ణన

సాంప్రదాయికోపమానములతో నాయికా స్వరూపమును అన్నమయ్య ఈవిధముగ వర్ణించెను.

తుమ్మిదలు వ్రాయబోతే తొయ్యలి నీతురుమాయ
నెమ్మిఁజందురు వ్రాసితే నీమోమాయనే
వుమ్మడి సంపెంగ వ్రాయ నున్నతి నీ నాసిక మాయ
కమ్మఁ గలువలు వ్రాయఁ గన్నులాయను...." (24-447)

—ఇంకను గళమును శంఖముతోను, స్తనములను జక్కవలతోను కరములను తామర లతోను, నడుమును సింహముతోను, పిరుదులను పులినముతోను. తొడలను అరటుల తోను పాదములను పల్లవములతోను పోల్చి వర్ణించినాడు.

అన్నమయ్యకంటె పూర్వుడుగ పేర్కొనబడుచున్న నన్నెచోడుడు కుమార సంభవమున పార్వతి వర్ణనను

"అలకేశి లక్తకాదల పాదతలములు ...నజానకైనఁ బొగడనరిదిగాదె"(8-16) అని చేసినాడు. వేరొకచోట పార్వతి మేనకలను ''ఇట్లు పుష్ప స్తబక భరానమ్ర కల్పలతిక లొంతొంటిఁ బెనఁగునట్లున్నవ కౌఁదీఁగలు సోఫులాడ నొంటొరుల నందంద కౌఁగలించుకొని మేనక మనోరాగంబున నిక తనయ వీడుకొని చనియె"(9-144) అని వర్ణించెను.

అల్లసాని పెద్దనామాత్యుడు వరూధినిని ''అతడావాత ........ శిరోరత్నమున్" (మనుచరిత్ర 2-25) అని సాంప్రదాయికోపమానములతో వర్ణించెను. వసుచరిత్రలో రామరాజు భూషణుడు గిరికను ''వనిత పాదంబులు ప్రవాళంబులై మించు ... ... .... నలువ నిర్మింపబోలు" (2-33) అని వర్ణించినాడు.

అన్నమయ్య నాయికా సౌందర్యమును నవరత్నములతో పోల్చి వర్ణించిన విష యము పూర్వోక్తము. ఈ విధముగనే విజయ విలాసమున చేమకూర వేంకటకవి నాయికను వర్ణించినాడు. ఆ వర్ణన మిట్లున్నది.

''పడఁతి నెమ్మోమునకు బంగారు కళలు దేరీ
వెడలే సెలవినవ్వే వెండి గనులు
అడియాలమగు మోవి యవెపగడపుఁ దీగె
నిడువాలుఁ దురుమే నీలమురాశి
తరుణి పాదపు గోళ్ళు తళుకుల వజ్రములు
పరగుఁ జేతి గోళ్ళె పద్మరాగాలు...." (24-108)

విజయ విలాసమున చేమకూరి వేంకటకవి

"కం॥ అలుకలు నీ లములధరం
బలకగడము గోళ్ళు ముత్తియంబులటంచున్
దెలుపమును విందుఁ జిలుకల
కొలికి తెలుంగెల్లఁ బూసగ్రుచ్చిన రీతిన్" (2-79)

అని వర్ణించినాడు. వీరిరువురి వర్ణనలలోను అన్నమయ్య వర్ణనమే ఆధిక్యమును సంత రించుకొన్నదని వేరుగ చెప్పనక్కరలేదు.

ఋతుపరముగ నాయికను అన్నమయ్య, ఆయన కుమారుడు పెద తిరుమలయ్య వర్ణించినారు. వీరిరువురుమ ఒకరినిమించి మరియొకరు చేసినట్లున్నది.
అన్నమయ్య నాయికను వర్ణించిన విధమిట్లున్నది.

"కాలములారునుఁ గలిగెనీకు నిదె
బాలకి యందే పైపై నీకు ॥కాల॥
సతికొప్పు విరులు జలజల రాలిన
లతల వసంత కాలము నీకు
కతగాఁదనమై కాఁకలు చూపెన
అతివేసవి కాల మప్పుడే నీకు ॥కాల॥" (26-86)

పెదతిరుమలయ్య నాయికను వర్ణించిన తీరు ఈ విధముగ ఉన్నది.

"అంగన విభుఁ గూడేదదియే కాలమోకాక
అంగజానకిది కాలమాయనో కాక ॥అంగ॥
చెలియ చెంపల నుండి సేవంతి రేకులేరాలె
అలరు వసంత కాలమాయనో కాక
కలికి కన్నుల నుండి కన్నీటి బొట్లు లాలె
యెలమి వాన కాలమిది యోకాక ॥అంగన॥" (23-522)

నాయికను వర్ణించుపట్ల ప్రత్యంగ సౌందర్యమును అన్నమయ్య వర్ణించి నాడు. అన్నమయ్య ఒకే సంకీర్తనమున నాయికా స్వరూపమును వర్ణింపగ తరువాతి ప్రబంధకవులు ఆయా శరీర భాగములను ప్రత్యేకముగ వర్ణించినారు. తురుమును నెమలి పింఛముతో పోల్చి అన్నమయ్య, శ్రీనాథుడు వర్ణించినారు.

అన్నమయ్య తురుమును గూర్చి ఈ విధముగ వర్ణించుచున్నాడు.

"ముఖారి :— కొలనిలోన మునుగోపికలు
మొలక నవ్వులతో మ్రొక్కిరిసీకు ॥కొ॥
పిరుదులు దాపిన పింఛపుటలకల
తురుములు వీడంగ తొయ్యలులు... " (3–182)

శ్రీనాథుడు శృంగార నైషధమున

"నెమలి పింఛంబుతోడ సివేణి రమణి" (3–159) అన వర్ణించివాడు.

అన్నమయ్య తురుమును రాహువుగా భావించి ఈ విధముగ వర్ణించుచున్నాడు.

"వనిత లావణ్యంపు వదన శశికలములు
చను గిరులపై నేల జారిపడెనే
వెనుకఁ దురుమను రాహువేవేలు రూపులై
తనర ముఖచందురుఁడు తలఁకడు గదా" (12–348)

ఈ విధమైన భావముతోడనే ముద్దుపళని రాధికాసాంత్వనమున

"ముఖ చంద్రమండలంబును గ్రహింపగవచ్చు
పెనురాహునోయన వేణి యమరె" (1–64)

అని వర్ణించెను.

కర్ణములను శ్రీకారముతో పోల్చి అన్నమయ్య
"చెక్కుటద్దముల దిది శ్రీకార కర్ణములదీ" (24–164)
"నునుఁ బూవుకలువలు నూలుకొన్న శ్రీకారాలు" (24–219)
అని వర్ణించినాడు. ఈ విధమైన భావముతోడనే రామరాజు భూషణుడు వసు చరిత్రమున నిట్లు వర్ణించినాడు.

"పదమెత్తం గలహంస లీల" (3–59) అను పద్యమున
"శ్రుతి చూపన్ శ్రీ విలాసంబు" అని వర్ణించినాడు.

నాయికా నాసికములు అన్నమయ్య

"అదె తిలపుష్పంబింత నాసికము" (8–48) అని వర్ణింపగా శ్రీనాథుడు శృంగార నైషధమున

"మరుని తిల పుష్ప తూణమీ మగువనాస" (3–169) అని వర్ణించెను.

స్తనములను వర్ణించు సందర్భమున అన్నమయ్య

"మొగమున కెగరెడి మొనవాఁడి గుబ్బల" (12–261) అని,
"పొలుపైన మాణికపు బుజకీర్తులు వెలయ
ములు వాఁడి చన్నులు మోము కెగర" (28–212) అనియు

వర్ణించినాడు. ఈ విధమైన భావముతోడనే విజయ విలాసకర్త

"తళుకు మొగమున కెగయ గుబ్బల బెడంగు" (2–20) అనివర్ణించినాడు.

నాయికా నడుమును గూర్చి అన్నమయ్య

"నన్నమాయ నెన్నడుము చన్నుదోయి ఘనమాయ
కన్నియ కీ రెండు నంగములే కావా
యెన్నసేల యిందులోని యెచ్చుకుందులాయనంటా
పన్ననవారి భాగ్యమింతేకాక" (30–113) అని వర్ణించినాడు.

ఈవిధమైన భావముతో కవికర్ణ రసాయనమున సంకుసాల నృసింహకవి

"ఒత్తుకొనివచ్చు కటి కుచో ద్వృతిఁ జూచి
తరుణి తను మధ్య మెచటికో తలఁగిపోయె
నుండె నేనియుఁ గనఁ బడకున్నెయహహ
యుద్ధతుల మధ్యఁ బేదలకుండఁ దరమె" (3–26) అని అర్థాంతర

న్యాసాలంకారమున చక్కగా వర్ణించినాడు.

ఈవిధమైన భావముతో విజయ విలాసకర్త

"కదు హెచ్చు కొప్పు దానిన్
గదవన్ జనుదోయి హెచ్చు కటియన్నిటికిన్
కదుహెచ్చు : హెచ్చులన్నియు
నడుమే పసలేదుగాని నారీమణికిన్" (1–104) అని వర్ణించెను.

నాయికా నాయకుల వర్ణనలలో భ్రాంతిని ఆయా కవులు మనోహరముగ వర్ణించినారు. శృంగార శాకుంతలమున పిల్లల మర్రి పినవీరభద్రకవి నాయిక ముఖమును పద్మముగా భావించిన తుమ్మెదల స్థితిని

"వీనులకుఁ బండువుగాగ వీరి పాట
లాలకించెదఁగాకని యదీప్సఁదుండె

నంతనొక తేఁటి వచ్చి శకుంతలా ము
ఖాంబుజమునందు ముసరిన నలఁత నొంది" (2-67) అని వర్ణించినాడు.

పద్మమును నాయిక ముఖముగా భావించిన నాయకుని చేష్టలను అన్నమయ్య

"సోగల నందుఁ గొలని సొంపు దామెరం జూచి
బాసలం జెలిమోమని పట్టంబోయెఁ గృష్ణుఁడు''(3-191) అని
"సిరులో తామర మీఁది నిండు తుమ్మెదలఁజూచి
కోరి యింతి ముఖమంటాఁ గొలనిలో దుమికి"(13-299) అనియు

మనోహరముగా వర్ణించినాడు. ఈ చరణములలో సరస్సు నందలి పద్మమును, పద్మమునందలి తుమ్మెదాలను చూచి ప్రేయసి ముఖముగా నాయకుడు భావించినట్లు స్పష్టము దీనికంటె భిన్నముగ చక్రవాక పక్షి యొకటి నాయిక వదనాంబుజము పొంతనున్న కుచమును చక్రవాకముగ భావించి జతగూడినదని మనోహరముగ కవికర్ణ రసాయనమున సంకుసాల నృసింహకవి వర్ణించినాడు. ఆ వర్ణన మిట్లున్నది.

"ఒత్తిగిలి యీఁది నీటిపై నొంటిఁ దోచు
కొమ్మ వదనాంబుజము పొంత కుచము గాంచి
కవదొఱంగిన చక్ర వాకంబొకండు
తోడి ప్రియ సతియని ప్రీతిఁ గూడుకొనియె" (4-23)

—అద్భుతమైన భావచిత్రమిది. 'వదనాంబుజము పొంతకుచము' అని వర్ణించుటను బట్టి ఆకుచము మోమున కెగరినదని గ్రహింపవచ్చును.

పద్మమును ప్రేయసి ముఖముగా భావించిన నాయకుని స్థితిని సత్యభామా సాంత్వనమున లింగనమఖి కామేశ్వరకవి

"కమ్మ తామరగాంచి నెమ్మోము గానెంచి
మనసారఁ దాని మూర్కొనగఁబోదు" (3-53) అని నాయకుడు పలికినట్లు వర్ణించినాడు.

నాయిక నడకలను నెమలి నడకలతో పోల్చి అన్నమయ్య

"ఆ వేళ నొక్క నెమలి యాడ నేగంగా జూచి
భావించి చెలియనుచుఁ బట్టంబోయెఁ గృష్ణుడు" (3-191) అని

''అవలనొక్క చెమలి అంతలోనేగ్రగంజూచి
వేవేగ చెలియంట వెంటఁ గూడఁబారె'' (13_299) అనియు వర్ణించి

నాడు. నాయిక నడకలను నెమలి నడకలతోం పోల్చిపాడురంగ మాహాత్మ్యమున తెనాలి రామకృష్ణుడు

''గతి మధ్య స్తన కుంతల స్తబక వీక్ష గర్వ దుర్వార........ ......

బర్హి మృగేంద్ర. కుంభి చమరీ యూథంబు నేణంబులప్ (3—86)అని క్రమాలంకారమున వర్ణించినాడు.

నాయికస్థితిని వర్ణించుపట్ల అన్నమయ్యకు, చేమకూర వేంకకటకవికి పోలికలు కనిపించుచున్నవి. నాయిక స్థితిని అన్నమయ్య ఈవిధముగ వర్ణించుచున్నాడు.

''పొ॥ : ఎందుకని సిగ్గువడే వేమేనీవు
కందువ నా పచ్చడము కప్పుకోవేలయిపుడు ॥ఎందు॥
మదిత జారిన కొప్పు ముడుచుకోఁగడ్రగితే
వదలి పయ్యద కానవచ్చెఁ జన్నులు
అద చక్కఁ బెట్టు కొనేనంటాఁ గొంగు బిగించితే
పొరిగి కట్టిన యట్టి పోకముడి వీడెను ॥ఎందు॥
పరుగ నావలిపెమే చక్కఁ గట్టు కొనఁగాను
గరిమఁ దొడల నిగ్గు గానవచ్చెను
పరగ నందుకు లోఁగి పావట దువ్వుకొంటే
కరమూలముల సొంపు గడు బయలాయను ॥ఎందు॥
చెలరేగి యందుకు నవ్వి చేతి విడెమిచ్చితేను
పులకలే నీ మర్మములు దెలిపె
అలమితి నందుకుగా నట్టి శ్రీవేంకటేశ్వర
చెలపల చెమటలు చెమరించె నీకును ॥ఎందు॥ (24_134)

ఈ దేభావమును విజయ విలాసకర్త

శయ్యకుఁ దార్పగాఁ దుఋముజాతె; నందంతటఁ జక్కదిద్దఁబోఁ
బయ్యెద జాతె; నయ్యదిరిపాటున గ్రక్కున నీవిజాతెఁరా
జయ్యెద నవ్విలాసిని యొయారమఁ జూచి కవుఁగలించె, నౌ

నెయ్యెద మేలె చూతురు గణింపరు జాలులు జారుపాటలన్" (1_172)

—అని వర్ణించినాడు. అన్నమయ్య భావమునకు అనుగుణముగనే ఈ వర్ణనసాగినది. నాయిక స్థితినే అన్నమయ్య

"సింగారపుఁ గొప్పు వంగి చిమ్మిరేఁ గెదమకము
సంగతిగా నీవు చేయి చాఁచఁగాను
వుంగిటిగొని చెక్కుల నుమ్మగిలేఁబులకలు
చుంగుల కొనగోళ్ళు సోఁకఁగాను" (27_114) అని వర్ణించెను.

ఈ విధమైన భావము తోడనే విజయ విలాసకర్త

"నెఱికొప్పు కొనగోర నిమిరినయంతనే
తళుకు లే ముద్దుఁ జెక్కిలి చెమర్చె
తళుకు లే ముద్దుఁ జెక్కిలి నొక్కి నంతనే
వలిగుబ్బ చనుఁగవ పులకరించె" (3–222)

అనుచు ముక్తపదగ్రస్తాలంకారమున మనోహరముగ వర్ణించినాడు.

బాలింతరాలైన నాయికను అన్నమయ్య

"చక్కఁ బొద్దు గుంకదిదె సతులెల్ల నవ్వఁగాను
సక్కనఁ దలుపు మూసీఁ దనోమరి
యెక్కువతోఁ జంటి బిడ్డలిదె చేయిదిగరుతా—
నక్కరతోఁ గొంగు వట్టీనాపీ లెస్సాయను" (28_128) అని వర్ణింపగా క్షేత్రయ్య

పట్టకురా రొమ్ము—పాలంటుజేతుల
ఎట్టు లోరుదు పరు—లేమందురు
వట్టిపోతే మెర పెట్టును పసిబిడ్డ
అట్టె మనసు బిగబట్టుకో రెడ్డెల్లు (సీ.గి. 129)

—అని వర్ణించినాడు.

అభిసారిక నాయికను అన్నమయ్య

'వలచి నిన్ను వెదకి వడినేరాఁగాను
పులివలె మగడుండెఁబోనియ్యక.... ....

ఏమరించి యింటి వారి నెడపి నే రాఁగాను

గామైన బిడ్డ యేడ్చెఁ గదలనీక........

కొండలరాయడ నిన్నుఁ గూడించె నావలపు" (12_324) అని వర్ణింపగా క్షేత్రయ్య 'చూడరె అది నడచె హొయలు — సుదతి జేయుజాడలు' అను సంకీర్తనమున వర్ణించెను. ఈ విధమైన భావముతోడనే ముద్దు పళని రాధికా సాంత్వనమున

"మగడైతే యేవేళ నుండుచునుండును

నూమగారంతకు మంట్లమారి

పెదబావ గారైతె బెబ్బులి వలె యూఁ

బిన బావచే కత్తి వెట్టడవల.........

నేను నిమఁ జేర నీవందు దానిఁగోర'' (4-81) అని వర్ణించెను.

రత్యనంతరము నాయిక స్థితిని అన్నమయ్య

"ఏమొకో చిగురుటదరమున ఎడనెడకస్తురినిండెను'' (12_82) అని వర్ణింపగా క్షేత్రయ్య

'మగువతన కేళికా మందిరము పెడలెన్'' (సీ.గి. 19) అని వర్ణించినాడు. వసుచరిత్రకారుడు కూడ ఈ విధమైన భావము తోడనే నాయిక స్థితిని

''సోలుచుఁ జెలికెదురాడక

తూలుచుఁ గై దండ యొసగు తొయ్యలి మేనన్

వ్రాలుచుఁ జింతా జలనిధి

దేలుచు గై సేయు సఖులఁదెగడుచుఁ గంటన్ (3_331) అని వర్ణించినాడు.

విరహమున నాయికా నాయకులు చిత్రములు గీసెడివృత్తాంతమును అన్నమయ్య ఇతర కవులు వర్ణించినారు. నాయకుని వృత్తాంతమును అన్నమయ్య

''కాంత కన్నులు వ్రాసి కడలు వ్రాయఁగరాక

చింత లోడ తలవంచె చెలి విభుఁడు

.... .... .... .... .... .... .... ....

వనిత కౌఁగిట ఁదన్ను వ్రాసి రతి వ్రాయలేక

తను వెల్లమఱచెను తమకమున'' (29_590) అని వర్ణింపగా నాయిక వృత్తాంతమును కవికర్ణ రసాయన కర్త

వదనము వ్రాసి తోనగరువంబునఁ జెందనకేళి సల్పుచున్
హృదయము వ్రాసిన నిలువేదిక వుంగిటఁ జిక్కఁ జేర్చుచున్
బదములు వ్రాసి తోన కర పద్మములం బ్రియమారనొత్తుచు,
న్పదతి వతిప్లిఖించు మతిమూడనెఱుంగదు కోర్కి పెక్కునన్"(3-80)

అని వర్ణించినాడు.

నాయకుని విషయమును వర్ణించుచు క్షేత్రయ్య "ఏమి సేయుదు మోహమెటు వలె దీరు (సీ.గి. 168) అను పదములో నాయిక ముఖారవిందమును చిత్రించినను వాసనలు గూర్చలేక పోయితినని అదే విధముగ కనులలో బెళుకు చూపులు. లోగళము కోకిల పలుకులు, నాగబంధములో పిలుపు తెలివిని వ్రాయలేక పోయితినని' నాయకుడు భావించినట్లు మనోహరముగ వర్ణించినాడు.

## నాయక వర్ణన

నాయకుని వైభవమును అన్నమయ్య

"తరుణి గుబ్బలు నీకుఁ దలగడ బిళ్ళలుగా
నొరగున్నాఁడవు వుబ్బన నీవు"(26-136) అని వర్ణింపగా

ముద్దు పళని రాధికా సాంత్వనమున

"తరుణి లేనును తొడలత్తల కగడ దిండ్లాయె
వెలఁది గుబ్బలు చెంప బిళ్ళలాయె" [3-40] అని వర్ణించెను.

నాయకుని గడుసుదనమును అన్నమయ్య

"కై దండ వట్టేనంటా కంకణము గట్టెనే
జూదా లాడేనంటా రొమ్ముచోటు గీరెనే
.... .... .... .... .... .... .... .... .... .... ....
మొగము చూతు మనుచు మోవి పొత్తు గలపెనే (24-18) అని

వర్ణింపగా మను చరిత్రకారుడు

దట్టంబు నీ కట్టి నట్టి చెంగావికి
బాగుగాదని కేలఁ బయట నిమిరె
మృగనాభి మకరికలఁ గ్రపము మించె
నని మూదు కొనుచుఁ జెంబన మొనర్చె" (6-8) అని వర్ణించినాడు.

నాయకుని విరహమును అన్నమయ్య

'కోవిల కూతలు విని కొమ్మ విలిచీ నంటా

దావతితో రమణుఁడు దగ్గర దోయి' [13_299] అని వర్ణింపగా

వసుచరిత్రకారుడు

'ఉసురనుఁ గన్నుమోడ్చుఁ దలయూచుఁ దలంచు నగుం జెమర్చును

దైసలు గనుం గొనుం బొరలులేచు వడంకుఁ జలింపకుండు [4-81]

అని వర్ణించినాడు. పురుష విరహమునే విజయ విలాస కర్త

'ఎక్కడఁ జూచినైనఁ దరళేక్షణ వచ్చె నటంచులేచు, నే

దిక్కున నల్కుడైన సుదతీమణి మాటని యాలకించు........[3-6]

అనుచు వర్ణించినాడు.

## శైత్యోపచారములు

నాయికా నాయకులకు ఎడబాటు కలిగిన సమయమున విరహమును తొలగించుటకు సాగించిన శైత్యోపచారములను అన్నమయ్య శృంగారమంజరిలో "శశికాంత సౌధాంతరముల........ అనుచు శైత్యోపచారాదులు సేయ' [పుట 11] అనియు 24–114, 30_417 సంకీర్తనములలోను శైత్యోపచారములను వర్ణించినాడు. ఈ విధమైన భావముతోడనే శ్రీనాథుడు శృంగారనైషధమున

'గొజ్జఁగనీరు సల్లె నొక కోమలి' [2_140] అను పద్యమున వర్ణించినాడు. ఈ విషయములనే కవికర్ణ రసాయన కర్త 'స్వర్ణ కుంభములకు వర్ణన లేపనములుగ జన్నులఁ; గుంకుమంబలఁది' (3_123) అని వర్ణించినాడు.

ఇదే విధముగ కళాపూర్ణోదయకర్త

"అప్పుడు బోండ్లు వెండియు బ్రయత్నముతో బలుమాఱు పీనులం

గప్పురమూఁది పూవిసన కట్టులు గొజ్జఁగనీట మాటికిం'' [6_252]

అని వర్ణించినాడు. ఈ భావముల తోడనే విజయ విలాసకర్త

పన్నీటం జలకంబులార్చి .................' అనుచు వర్ణించినాడు.

ఎన్ని విధముల శైత్యోపచారములను చేసినను తాపము ఉపశమింపకపోగా అధికమైనదనికూడ ఆయా కవులు వర్ణనలు చేసినారు. తాపము తగ్గుటకు నాయకుడే సరియైన ఔషధమని అన్నమయ్య

నిక్కి విరహిననున్న నెలఁతకు పతివచ్చి

చెక్కులు నొక్కినఁ గాని సేద దేరదు" [29_219] అని వర్ణింపగా

విజయవిలాసకర్త

క్రాగియున్నదీ మిగుల నంగంబు సూడఁ
గలవరించుచున్నది కలదొయేమొ
సోఁకుఁ దల్ల సన్యాసికే చూపవలయు
భామనని పల్కె నానత్యభామ నగుచు' [3_35] అని వర్ణించినాడు.

## దూతీ ప్రబోధము

దూతీ ప్రబోధమును అన్నమయ్య ఈ విధముగ వర్ణించుచున్నాడు.

కప్పుర మియ్యగవద్దా కాఁగిలించుకొనవద్దా
యిప్పుడె శ్రీవేంకటేశుఁడెనసె నిన్ను' (27–345)

—ఈవిధమైన భావములతోదనే కళా పూర్ణోదయకర్త

గా రామునఁ దోద్తాదన
రారమ్మనఁడనుచు మగిడి రానేటికిఁ గ
ర్పూరంబు తోడి బాగా
లీరాదో యూకు మడిచి యీరాదొ చెలీ' అని వర్ణించినాడు.

కోమలియైన నాయిక పట్ల నాయకుడు దుతుసుగా ప్రవర్తించరాదని చెలి పలుకు చున్నట్లు అన్నమయ్య

"సిగ్గరి పెండ్లి కూఁతురుఁ జిందువందుగాఁ దీతురా
వొగ్గి రొమ్ము మీఁద పెట్టుకుండుట గాక
కగ్గులేని కెమ్మోవి కడుఁ బిప్పి సేతురా" (24_19) అని వర్ణించినాడు.

ఈవిధమైన భావము తోడనే విజయ విలాస కర్త.

"పాటల బింబాధరి కని
గాటుల కోపదగని పలువగలఁ దెలుపంగా
నేటికిఁ నెలింగినదువుము
మీటిన విచ్చు చనుదోయి మీ చేతిదికన్" (3_213) అని వర్ణించినాడు

ఈ విధముగ పరిశీలించినచో నాయికా నాయకుల వర్ణనలలో అన్నమయ్యకు ఇతర కవు లకు ఇంకను అనేక సామ్యములు గోచరించును.

## శ్రీకృష్ణలీలావర్ణనలు

శ్రీ కృష్ణుని చరిత్రమును వర్ణించు సందర్భమున అన్నమయ్యకు ఇతర కవులకు పోలికలు కనిపించుచున్నవి. శ్రీ కృష్ణుని జన్మ వృత్తాంతమును హరివంశమున ఎఱ్ఱన "మహిత శ్రావణమేచకాష్టమి నిశామధ్యంబునం ............" (5–118) అని వర్ణింపగా అన్నమయ్య

"శ్రావణ బహుళాష్టమి నవరేతిరి కాడను
ఆ వేళ రోహిణి మంచిదైన పొద్దూనట" (24–.7) అని

వర్ణించినాడు. శ్రీ కృష్ణుని జనన వార్త ప్రజలకు తెలిసిపోయినది. ఆ సమయమున గోపికలు

"వింటి రచే చెలులాల వేడుక సంతోస వార్త
యింట నింట వూర నెల్ల యిదే సుద్ది" (24–27) అని పలుకుచున్నట్లు

అన్నమయ్య వర్ణించినాడు. ఈ విధమైన భావమునే పోతన భాగవతమున

"ఏమి నోము ఫలమొ యింత ప్రొద్దొకవార్త
వింటి మఱలలార ! వీనులలర" (10–183) అని వెలువరించినాడు.

శ్రీకృష్ణుని బాల్య క్రీడలను ఎఱ్ఱన

"ఓలి గట్టిన యుట్లకు నుఱికి పెద్ద
బానలందున్న వెన్నలు బావు కొనుచు
నుద్దులను వ్రచ్చి బానలనురఁ ద్రోచి
సురుఁగుఁ జెలికాండ్రకెల్లనుఁ జాఱవిడచి" (5–208) అని

వర్ణింపగా అన్నమయ్య

"పాలు పెరుగులు పెద్ద పరఁటుల వెన్నలు
సోలిగొన్న దొంతులలో జుర్రు కొనీని
కోలల గోపాలులకు గొబ్బున వంచి పోసీని
చాలునన్నా మానడు జాణకాడు కృష్ణుఁడు" (28–240) —

అని వర్ణించినాడు.

అన్నమయ్య శ్రీ కృష్ణునకు

''జోజో యని మీరు జోలపాడరో
సాజపు జయంతి నేడే సఫల మిందరికి" (9-172) అని

జోలపాడగ పోతన

''జోజో కమల దళేక్షణ ........... జోజో కృష్ణా'' (10-1-190)

అని పాడినాడు. జోల పాటలకు శ్రీ కృష్ణుడు నిద్రింపగ మేలు కొలుపు గీతికను అన్నమయ్య

"మిన్నక వేసాలు మాని మేలుకోవయ్యా
సన్నల నీ యోగ నిద్ర చాలు మేలుకోవయ్యా'' (1-374) అని

పాడగా పారిజాతాపహరణమున నంది తిమ్మన

''మేల్కనుము దేవ ! యివె రా
చిల్కలును మొగిచియున్న చెలువలఁ దమకుం
బల్కఁ నేర్పగ ముద్దులు
గుల్కెడు పల్కులను మేలుకొలిపెడు కృష్ణా" (2-68)

అని మేలుకొలుపు పద్యము నాలపించినాడు

తన కుమారునకు దృష్టి దోషము వాటిల్ల కుండుటకు యశోద తీసికొనెడి జాగ్రత్తలను పెరియాళ్వారులు 'ఓ మహాశయా ! ఈ సంజ వేళ నాలుగు త్రోవలు కలిసిన చోటికి వెళ్ళకుము. ప్రజల దృష్టి తగులును. నా వద్దకు రమ్ము. దృష్టి దోష పరిహారార్థమై ఈ కంకణమును ధరింపుము.'[4] అని వర్ణించినారు. ఇదే భావమును అన్నమయ్య "బాయిటఁ బెట్టకురే పక్షులు పారెడి పొద్దు" (12-247) అని వెలువరించినాడు.

శ్రీ కృష్ణుని ఆగడములను ఒక గోపిక యశోదకు విన్నవించిన వృత్తాంతమును పెరియాళ్వారులు "నేఁడు నేను దేవునకు పూజ చేసి కొనవలెనని తలంచి నైవేద్యమునకై లడ్లు, మిఠాయిలు, అన్నము, పప్పు, క్షీరాన్నము మొదలగు వానిని తయారు చేసి యుంచితిని. ఇంతలో నీ కుమారుడు వచ్చి ఆ పదార్థముల నన్నిటిని తినివేసినాడు. అంతేకాదు ఇంకను కావలయునని అడుగుచున్నాడు"[5] అని వర్ణించినారు. ఈ విషయములనే హరివంశమున ఎఱ్ఱన

"నాయింటందిది గడవల .... ... కేరుచు వచ్చున్" (5-215)

''అసురయె కాక సీత నయుఁడంగ యేదిది బానలందు....జెప్పుమా (5_217)

— అను పద్యములందు వర్ణించినాడు.

అన్నమయ్య ఈ విషయములనే ''చూతువు రావమ్మ నీసుతుని'' (30_267) అను కీర్తనమున వర్ణించినాడు. వేరొక సంకీర్తనమున అన్నమయ్య శ్రీ కృష్ణుని ఆగడములను

''పిన్నవాడు నిద్రవోఁగ పెనచి కూకటి తోడ
వన్ని లేఁగ తోఁకఁ గూడ బంధించి కట్టె'' (2-165) అని

వర్ణింపగ భాగవతమున పోతన

నమ్మి నిదురవోవ నాపట్టి చుంచుమా
లేఁగ తోఁక తోడ లీలఁ గట్టి'' (10_321) అని వర్ణించినాడు.

శ్రీ కృష్ణుని ఆగడములను చెప్పుచున్న గోపికలకు సమాధానముగ హరి వంశమున ఎఱ్ఱన యశోద యిట్లు పలికినదని వర్ణించినాడు.

"మీ సేగు లెల్ల నచ్చెద
వేసరకుఁడు మీరు లేక వేగునె మాకున్
జేసెం జేయఁడు బాలకుఁ
డాసురపుం బనులు నిజములని యెదుర్కలలే" (5_233)

—ఈ విషయమునే అన్నమయ్య 'కానరటె పెంచరటె కటకటా బిడ్డలను .... మీ యిండ్లు మీదు జతనాలు సేసుకొనక' (12_253) అని యశోద పలికినట్లు వర్ణించినాడు.

శ్రీ కృష్ణుని కొరకు గోపికలు అన్వేషించిన వృత్తాంతమును అన్నమయ్య ఈ విధముగ వర్ణించినాడు.

''చెందమ్మి కన్నులవాఁడు చేతిపిల్ల గోవివాఁడు
యిందు వచ్చెఁ గంటిరా యేమిరే యమ్మా
మంద పసువుల వాఁడు మకరాంకముల వాఁడు
యెందు నున్నాడుఁ చెప్పరే యేలదాఁచే రమ్మా'' (24_14)

— విషయమునే భాగవతమున పోతన

నల్లని వాఁడు పద్మనయనంబుల వాఁడు కృపారసంబు పైఁ
జల్లెడు వాఁడు మౌళి పరివర్తిత పింఛము వాఁడు నవ్వురా
జిల్లెడు మోమువాఁడొకఁడు చెల్వల మాన ధనంబు దెచ్చెనో
మల్లియలారా మీ పొదల మాటున లేడు గదమ్మ చెప్పరే"(10-1-1010)

అని కడు మనోహరముగ వర్ణించినాడు.

శ్రీ కృష్ణుని మహత్వమును భారతములో తిక్కన
"ప్రాణంబుతోఁ గూడ రక్కసి చన్నులు
పాలు ద్రావిన ప్రౌఢ బాలుఁడితఁడె"
(ఉద్యోగపర్వము 3-160)

అని వర్ణింపగ అన్నమయ్య

"యేడ పూతకిఁ జంపె నింత పిన్నవాఁడంటా" (2-65) అని వర్ణించెను. ఇదే భావమును భాగవతములో పోతన

"పీఁచే రక్కసి విగత జీవిగఁ జన్ను
బాలు ద్రావిన మేటి బాలకుండు" (10-1-1249) అని వర్ణించినాడు. ఈ విధముగ శ్రీ కృష్ణ లీలా వర్ణనలలో ఆయా కవులకు పోలికలున్నవి.

## భగవంతుడు - భక్తుడు

భగవద్గీతాకారునకు అన్నమయ్యకు ఆయా సందర్భములలో సామ్యములు కనిపించుచున్నవి. అన్నమయ్య కొన్ని గీతాశ్లోకములను సంకీర్తన రూపమున వెలువరించినాడు. భగవద్గీతలోని

"వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరోఽపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్యన్యాని సంయాతి నవాని దేహీ (2-22)
"నైనం ఛిన్దన్తి శస్త్రాణి
నైనం దహతి పావకః
నచైనం క్లేదయన్త్యాపో
న శోషయతి మారుతః" (2-23)

"అచ్ఛేద్యో ఒయ మదాహ్యో ఒయం
అక్లేద్యో ఒ శోష్య ఏవచ
నిత్య స్సర్వ గతః స్థాణుః
అచలో ఒ యం సనాతన ః" (2-24) — అను

శ్లోకములలోని భావమును సంకీర్తన రూపములో ఈ క్రింది విధముగ అన్నమయ్య వివరించుచున్నాడు.

"శ్రీ : దేహినిత్యుఁడు దేహములనిత్యాలు
యీహల నా మనసా యిది మరువకుమీ ॥దేహి॥
గుదిఁ బాత చీరమాని కొత్త చీర గట్టినట్టు
ముదిమేనుమాని దేహి మొగిఁ గొత్త మేను మోచు
అదనఁ జంపఁగ లేవు ఆయుధము లితనిఁ
గదిసి యగ్నియు నీరు గాలియుఁ జంపఁగలేవు ॥దేహి॥
యీతఁడు నరకు వడఁ డీత డగ్నిఁ గాలడు
యీతఁడు నీట మునుఁగ డీతఁడు గాలిఁ బోఁడు
చేతనుఁడై సర్వగతుండౌ చెలియించఁడేమిటను
యీతల నవాది యీతఁడిరవు గదలడు ॥దేహి॥ (2-419)

భగవద్గీతలో

"జాతస్యహి ధ్రువో మృత్యు ః
ధ్రువం జన్మ మృతస్యచ
తస్మాద పరిహార్యే ఒ ర్థే
నత్వం శోచితు మర్హసి" (2-27) అని చెప్పబడగా

"పుట్టిని వానికి నెల్లా భువి మరణము నిత్య—
మట్టె చచ్చిన వారి కవ్వల జననము
పుట్టని నాఁడై తేను పొడగానరాదు మేను
కొట్టఁ గొనఁ గానరాదు కొన్నాళ్ళే కాని" అని అన్నమయ్య వర్ణించి నాడు. భగవద్గీతలోని

"మాయాతతమిదం సర్వం
జగదవ్యక్త మూర్తి నా
మత్‌స్థాని సర్వభూతాని
నచాహం తే ష్వయస్థితం" (9-4)
''నచమత్ స్థాని భూతాని
పశ్యమే యోగమైశ్వరమ్
భూత భృన్నచ భూతస్థో
మమాత్మా భూత భావన :" (9-5) — అను శ్లోకభావముల

కనుగుణముగ అన్నమయ్య ఈ క్రింది సంకీర్తనమును రచించెను.

''లలిత : అనియాన తిచ్చెఁ గృష్ణుఁడర్జునునితో
వినిఁ యాతని భజించు వివేకమా ॥అని॥
భూమిలోను చొచ్చి సర్వ భూత ప్రాణుల నెల్ల
దీమ సాన మోచేటి దేవుఁడ నేను
కామించి సస్యములు గలిగించి చంద్రుఁడనై
తేమల బండించేటి దేవుఁడ నేను ॥అని॥
దీపనాగ్నినై జీవదేహములయన్నములు
తీపుల నరగించేటి దేవుఁడ నేను
యేపున నిందరిలోని హృదయముల లోన నుందు
దీపింతుఁ దలఁపు మరపై దేవుఁడ నేను ॥అని॥" (2-438)

— ఈ విధముగ పరిశీలించినచో భగవద్గీతలోని అనేకములైన అంశములను అన్నమయ్య సంకీర్తన రూపమున వెలయించి ప్రచారము గావించెనని గ్రహింపవచ్చును.

భగవంతుని తల్లిగా, తండ్రిగా భావించిన అన్నమయ్య

"తల్లి గోపించి మెత్తినఁ దనయుఁడు తల్లి కొంగే
యెల్లగాఁ బట్టి పెనఁగి యేడిచినట్టు
.... .... .... .... .... .... .... .... ....
కన్నతండ్రి బాలునిఁ జంకం బెట్టి దించితేను
కొన్నేసి విలుచు ముద్దుగునిసినట్టు ....(2-455) అని వర్ణింపగా త్యాగయ్య

"తల్లి దండ్రిఁ బ్రోవకుంటె తనయునికే ద్రోవ" (1-137)
'తల్లి గొట్టితే సరగున బాలుఁడు పద'
పల్లవములు విడచునా'' (1-66) అని వర్ణించినాడు.

భగవంతునకు భక్తునకు గల సంబంధమును అన్నమయ్య

''తల్లియై పోషించు తండ్రియై రక్షించు
వుల్లపు బంధువుఁడై వొడలరయు
మెల్లనె దాతై ఇచ్చు మెలుఁతయై యాదరించు
యెల్ల విధ బంధువుఁడు యీతఁడే పో విష్ణుఁడు ॥తల్లి॥
యేలికయై మన్నించు నిష్టుఁడై బుద్ధి చెప్పు
చాలుమానిసియై యంచలఁ దిరుగు....'' (2-417) అని వర్ణింపగ

భాగవతమున పోతన

''చెలికాడ రమ్మని చీరు నన్నొకవేళ
మన్నించు నొక వేళ మఱఁది యనుచు
బంధు భావంబునఁ బాటించు నొక వేళ
దాతయై యొక వేళ ధనములిచ్చు
మంత్రియై యొకవేళ మంత్రమాదేశించు
బోధియై యొక వేళ బుద్ధి సెప్పు ....'' అని అర్జునుడు పలికినట్లు

వర్ణించెను.

భగవంతుని గూర్చియే సాగిన రచనలలో కవులనేకులకు సామ్యములు కనిపించు చున్నవి. ప్రబోధ చంద్రోదయమున నంది మల్లయ్య, ఘంట సింగయలు

''ఎవ్వని యందు విశ్వముదయించు నడంగుఁదలంప నీజగం
బెవ్వని దీప్తిఁ గానఁ బడు ....'' (5-82) అని రచించినారు.

అన్నమయ్య

''వేదం బెవ్వని వెదకెడిని
ఆదేవునిఁ గొనియాడుఁడీ ॥వేదం॥
అలరిన చైతన్యాత్మకుఁ డెవ్వడు ....'' (1-5) అని రచించినాడు.

ఇదే విధముగ భాగవతమున పోతన

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీలమై" (8–73) అని రచన సాగించినాడు. ఈ విధముగనే ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయలు

"ఎవ్వని చూడ్కిఁ జేసి జనియించు జగంబు వసించు నిజ్జగం
బెవ్వని యందు డిందు మఱి యెవ్వని యందిది...." (5–43)– అని రచించినాడు. శ్రీవారి పాదమును గూర్చి అన్నమయ్య

"ఈ పాదమే కదా యిలయెల్లఁ దొలిచినది
యీ పాదమే కదా ఇందిరా హస్తముల కితవైనది" అని వర్ణింపగా

భాగవతములో భక్తపోతన

"ఈ చరణంబులే యిందు నిధాననా
సనకాది మునియోగ సరణి నొప్పు ........
నీ పాద తలములే యెలనాగశ్రుతివధూ
సీమంత వీధులఁ జెన్ను మిగుల" (10–పూ–1030)

అని రచించినాడు.

దేవదేవుని పూజింపని వారిని గూర్చి అన్నమయ్య ఇట్లు వర్ణించినాడు.

"నిన్నుఁ జూడని కన్నులు నీచువలకన్నలు.
చిన్ని నీ కథలు వినని చెవులు రాట్నపుఁ జెవులు
వున్నతి నీ కడకు రాకున్న కాళ్ళు మరగాళ్ళు
సన్నుతి సేయని జిహ్వ సరినువ జిహ్వ....
చేరి నిన్నుఁ బూజించని చేయి దంతెనపు చేయి
తారి నీకు మొక్కనట్టి తలయే పెడతల
సారె నీ ముద్రలేని భుజములు బద్భుజములు
తేరి నీ దాస్యము లేని దేహము సందేహము" (2–450)

ఈ విధములైన భావముల తోడనే భాగవతమున పోతన ఇట్లు వర్ణించుచున్నాడు.

"కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే
పవన గుంభిత చర్మ భస్త్రిగాక
వైకుంఠు పొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమ ధ్వని తోడి ఢక్కగాక

హరి పూజనంబు లేని హస్తంబు హస్తమే
తరుశాఖ నిర్మిత దర్విగాక
కమలేశుఁ జూడని కన్నులు కన్నులే
తను కుడ్యజాల రంధ్రములు గాక".... (7–170) అనియు

"సంసార జీమూత సంఘంబు విచ్చునే
చక్రి దాస్య ప్రభంజనము లేక" (7-171)
'కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వజిహ్వ (7–169) అనియు వర్ణించి

నాడు. భక్త కవి శిఖామణులైన అన్నమయ్య పోతనల రచనలలో అనేకములైన సామ్యములు గోచరించుచున్నవి.

రాజ్యకాంక్షతో బంధుత్వమును కూడ పరిగణింపని వారిని గూర్చి అన్నమయ్య

"దేహ మిచ్చిన వానిఁ దివిరి చంపెడి వాఁడు
తోడఁబుట్టిన వాని తొడరి చంపెడివాఁడు
.... .... .... .... .... .... .... .... ....
కొడుకు నున్నత మతిఁ గోరి చంపెడివాఁడు
.... .... .... .... .... .... .... .... ....
తల్లి జంపెడివాఁడు తలఁప దుష్టుఁడుగాక
యెల్ల వారలకెల్ల నెక్కుడట—" (2–235) అని వర్ణింపగా

పోతన భాగవతములో

'తల్లిదండ్రి నైనఁ దమ్ములన్నల
సఖులనైన బంధుజనులనైన
రాజ్య కాంక్షఁ జేసి రాజులు చంపుదు
రవనిఁ దఱచు జీవితార్థులగుచు' (19–55) అని వర్ణించెను.

నరుల నుతింప నిచ్చగించని భక్త కవులెందరో ఆంధ్ర సాహిత్యమున వెలసినారు. రాజులిచ్చెడి ద్రవ్యముల కాశపడక స్వతంత్రమైన జీవితమునే గడుపుటకు నిశ్చయించుకొనినారు. నరులను పొగడుటకు ఇష్టపడని అన్నమయ్య

"నరహరి కీర్తన నానిన జిహ్వ
వారుల నుతింపగ నోపదు జిహ్వ" (2–144) అని పలుపగా కవి కర్ణ రసాయన కర్త

నరగుణాంకిత మయ్యెనే సరసకృతియు
దూష్యమగు శునిధృత గత దుగ్ధమట్లు" (పీఠిక–26) అని స్పష్టము చేసినాడు. ఈ విధముగనే పోతన "బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్యకన్యకన్" అను పద్యముతో "సత్కవుల్ హాలికు లైననేమి?" అని పలికినాడు. ధూర్జటి "రాజుల్మత్తులు వారిసేవ నరకప్రాయంబు" అని పలికినాడు.

కులము కంటె గుణము ప్రధానమని భగవద్గీతలో
"విద్యావినయ సంకన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శునిశ్చైవ శ్వపాకే చపణ్డితాః సమదర్శినః (5–18) అని చెప్పబడగా సింహగిరి నరహరి వచనములను వ్రాసిన కృష్ణమాచార్యులు "దేవా! విష్ణుభక్తి లేని విద్వాంసునికంటె హరికీర్తనము వియు నతఁడె కులజుండు శ్వపచుండైననేమి? ఏ వర్గంబైననేమి? ద్విజుని కంటెనతడె కులజుండు"* అని పలికినాడు. ఇదే భావమును అన్నమయ్య

'ఏకులజుఁడేమి యెవ్వడైననేమి
ఆకడ నాతఁడె హరి నెఱిఁగినవాఁడు' (1–292) అని
'వేదములు చదివియు విముఖుఁడై హరిభక్తి
యాదరించని సోమయాజికంటె
యేదియును లేని కులహీనుఁడైనను విష్ణు
పాదములు సేవించు భక్తుఁడే ఘనుఁడు' (1–318) అనియు తెలియ జేసినాడు. ఇంకను

'నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్రదియు నొకటే
మెండైన బ్రాహ్మణుఁడు మెట్టు భూమి యొకటే
చండాలుఁడుండేటి సరిభూమి యొకటే' (2–385) అని వివరించినారు.

అన్నమయ్య తిక్కనల భావములను గూర్చి శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారిట్లు తెలియజేసినారు.

'సాళంగం : చేకొంటి నిహమే చేరిన పరమని
కైకొని నీవిందు కలవే కాన ॥చేకొంటి॥

— — — — — — — —

నలుగడ మించిన నా జన్మాదులు
పలుమరు లిటు నీ పంపులివి
యెలమిని శ్రీ వేంకటేశ్వర నీవిఁక
వలసినప్పుడే వరములు నాకు ॥చేకొం॥(ఈ సంపుటము పాట 517)

—ఈపాట విన్నప్పుడు పదిహేను పర్వముల మహాభారతమును ఏకదీక్షతో రచించిన తిక్కన చెప్పినమాట జ్ఞాపకమునకు వచ్చుచున్నది.

చం॥ పరమ పదాప్తి హేతువగు భారత సంహిత శౌనకాది భూ
సురవరులింపునం గరఁగుచొప్పునఁ జెప్పిన, వారు మోదసం
భరితతఁ బొంది యక్కథకు బ్రాఁతిగ నర్చితుఁ జేసిరర్మిలిన్
హరిహరనాథ సర్వభువ నార్చిత నన్ దయఁ జూడు మెప్పుడున్'
(భారతము. స్వర్గా. 94)

—ఈమాటలను పలికిన తిక్కనభావము అన్నమయ్య భావము ఒకటిగనే తోచుచున్నవి. అదయకు ఫలితమేదో కూడ ఆయన పేర్కొనలేదు. ఇంతనిరీహముగ రచన సాగించిన తిక్కనయే అన్నమయ్యకు భాషావిషయము లందును, భావ సంపద యందును మార్గ దర్శకుడైనాడని మన మూహింపవచ్చు.'7

## అన్నమయ్య ఇతర పదకర్తలు :

అన్నమయ్య వర్ణించిన భక్తి వర్ణనల కనుగుణముగ ఆయన తరువాత వెలసిన తాళ్ళపాక కవులుకూడ అనుసరించి నారనుట సత్యము. అన్నమయ్య

తనువే గుడియట తలయే శిఖరమట
పెను హృదయమే హరి పీఠమటా
కనుఁగొన చూపు లే ఘన దీపములట
తన లోపలి యంతర్యామికిని"[2—82]అని వర్ణింపగా పెదతిరుమలయ్య

'గుజరి : (ఏకతాళి) :- శ్రీవేంకటగిరి దేవా నా దేహంబు నీ వుండేడి నిత్యనివాసంబు
నాజ్ఞాన విజ్ఞానంబులు నీయుభయ పార్శ్వంబుల దీపంబులు....
(వేంకటేశ్వర వచనములు 1) అని తెలియజేసినాడు.

భక్తి భావములను ప్రకటించు సందర్భమున కృష్ణమాచార్యులకు, అన్నమయ్యకు పోలికలు కనిపించుచున్నవి. కృష్ణమాచార్యులు "దేవా! పెద్దతనంబు సేసి మిమ్ము మెప్పించెదనంటినా, జాంబవంతుండు మీ సన్నిధినే యున్నాఁడే. బుద్ధిని నే మెప్పించెద నంటినా విభీషణుండు మీ సన్నిధినే యున్నాడే దేవా బంటు దనంబు సేసి మెప్పించెద నంటినా యంజనా సుతుండు హనుమంతుండు మీ సన్నిధినే యున్నాడే........" అని వర్ణింపగా అన్నమయ్య

"వారిధి దాటి మెప్పించ వాయుజుఁడనే గాను
సారెఁజవుల మెప్పించ శబరినే గాను
బిరాన సీత నిచ్చి మెప్పించ జనకుఁడ గాను
యేరీతి మెప్పింతు? నన్ను నెట్లు గాచేవో" అని వర్ణించినాడు.

హరిభక్తులను గూర్చి కృష్ణమాచార్యులు 'దేవా ఓ దివ్య జ్ఞాన మెఱుఁగువారు పరమజ్ఞానులు. పరమానంద స్వరూపులు వైకుంఠపుర నివాసులు. వారే పరమ పావనులు. కోటి యజ్ఞ కర్తలు.'[9] అనితెలిపినారు. ఈవిధమైన భావముతోడనే అన్నమయ్య

నిర్మలులు వీరు నిత్య సుఖులు
కర్మ దూరులు విష్ణు కైకర్యపరులు' అని వర్ణించినారు.

పశ్చాత్తప్తుడై కృష్ణమాచార్యులు

'దేవా! నిత్య పదంబైన మీ దివ్యనామ సంకీర్తనఁ బఠింపనేరక సర్వదేవతలు సాక్షియైన భర్త విడచి పర పురుషుంగోరు వ్యభిచారిణి విధంబున నున్నవాడను. నన్ను గృతార్థుఁజేయవే. అనాథపతీ స్వామీ సింహగిరి నరహరి నమోనమో దయానిధి'[10] అని పలుకగా అన్నమయ్య జీవుని గూర్చి

'చేసుకొన్న యిల్లాలు చేరువనే వుండఁగాను
వేసరక వెలయాలి వెతకినట్లు
యేసుల శ్రీ వేంకటేశ మీదాస్యమే వుండఁగా
వాసిఁ బరులఁ గొలువ నేవత్తఁ గోరీ జీవుఁడు' (2-103)అని తెలియ

జేసినాడు.

వైరభక్తిని గూర్చి కృష్ణమాచార్యులు

'దేవా.........హిరణ్యాక్ష, హిరణ్య కశిపులు రావణ కుంభకర్ణులు శిశుపాల దంత వక్త్రులు శ్రీ వల్లభుని చక్రముచేత హతమగుట నెఱుంగరా?'[11] అని వివరింపగా అన్నమయ్య

హిరణ్య కశిపు పాటు యెఱుఁగడా రావణుఁడు
ధరలో హరికి పగై తానూఁ బొలిసె
విరసపు కంసుగతి వినఁడా దుర్యోధనుఁడు
సరుఁగ దానూఁ బగై సమసినాడు.' (2–308) అని వర్ణించినాడు. ఈ విధముగ వీరిరువురి రచనలలో అనేకములైన సామ్యములు కనిపించుచున్నవి.

భక్తి భావములను ప్రకటించు సందర్భముననే తాళ్ళపాక అన్నమయ్య కంటె దాదాపు రెండు శతాబ్దములు పూర్వీకుడైన యథావాక్కుల అన్నమయ్యకు తాళ్ళపాక అన్నమయ్యకు రచనా విధానమున శైవ వైష్ణవ భేదములున్నప్పటికి పోలికలు పెక్కు తావులలో గలవని శ్రీ గౌరిపెద్ది రామ సుబ్బశర్మగారు తెలియజేసినారు.[12]

అన్నమాచార్యుల అనంతరము వెలసిన కవయిత్రి తరిగొండ వెంగమాంబ.శ్రీ వేంకటాద్రిదేవుని అనేక విధముల ప్రశంసించినది. అన్నమాచార్యుల ౘరి ప్రభావము తరిగొండ వెంగమాంబా రచనలపై ఉన్నదని తెలియ జేయుచున్నారు డా॥ కె. జె. కృష్ణమూర్తి గారు. 'ఈ కవయిత్రి అన్నమాచార్యాదులు రచించిన ఆధ్యాత్మిక కీర్తనలలో ప్రసిద్ధి చెందిన 'నారాయణతే నమోనమో' 'శరణు శరణు సురేంద్రవందిత' 'జయజానకీ రమణ జయ విభీషణ శరణ' ఇత్యాదిగేయాల ఫణితులను తాను రచించిన యక్ష గానాలన్నిటిలోను చక్కగా సమర్థవంతంగా అనుకరించింది. అంతేగాక అన్నమయ్యను 'పూర్వకవిస్తుతి'లో పేర్కొని కొనియాడిన ఏకైక కవయిత్రి తరిగొండ వెంగమాంబయే' [13] అని తెలియజేసినారు.

అన్నమయ్య సమకాలికులైన శ్రీపాదరాయలు పురందరదాసులు అన్నమయ్యతో సమానమైన భావములుగల సంకీర్తనములు రచించినారు. వీరి రచనలను తులనాత్మకముగ పరిశీలించుచు శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారిట్లు తెలియజేసినారు.

'అన్నమయ్య : ఎలమితో శ్రీవేంకటేశ్వరు గొలువలేక
పొలము రాజుల వెంట పొయ్యేవుగా' 11–3–138

అంటే శ్రీ పాదరాయలు "ఆగదేకు రాజ్యభోగ గళెన గెందు
ఈగ నాను బేడ బిదుదిల్ల' (నాకు రాజ్యభోగాలు కావాలన్న

నెపంతో నేనిప్పుడు రాలేదయ్యా) అంటాడు
అన్నమయ్య కాకాసుర వృత్తాంతాన్ని పేర్కొంటూ
కాకాసురు దోషము కడకు పరిహరించి
చేకొంటివి శరణంటే చేరి మగుడ
ఈకడ మానేరములు ఇంతకంటె నెక్కుడా
నికే, నే శరణము నీవు మమ్ము గాతు' (9_126) అన్నారు.

ఈగాధనే శ్రీపాదరాయలు 'హక్కియ మేలుళ్ళ దయ నమ్మ మ్యాలె
ఇక్కదేకె హూదెయో విధియే' సామాన్యమైన పక్షిపై నీ
వుంచిన దయ మాపై ఎందుకు చూపలేదయ్యా అంటారు' 14

అన్నమయ్య పురందరులపై తులనాత్మక పరిశీలన చేసిన డా॥ కె.
సర్వోత్తమన్‌గారు తెలిపిన విషయములనే జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారిట్లు తెలిపినారు.

'అన్నమయ్య : ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము (6_104)
పురందరులు : సుమ్మనే బరువుదే ముక్తి
అన్నమయ్య : కంటి నఖిలాండ కర్త నధికుగంటి 11_2—58
పురందరులు : కణ్ణారె కండె నచ్యుతున
అన్నమయ్య : పారకుమీ ఓ మనసా పంతము విడువకుమీ ఓ మనసా
పురందరులు బేడమనవె బేడి కొంబెనోనాను
కొడదిరు కపటది మనవె'15 అని తెలియ జేసినారు.

అన్నమయ్య క్షేత్రయ్యల భావములలోకూడ అనేకములైన సామ్యములు కని
పించుచున్నవని శ్రీ బాలాంత్రపు రజనీ కాంతారావుగారు తెలియజేసినారు. అవి
యిట్లున్నవి.

'అన్నమయ్య : నాకుం జెప్పరె వలపు నలుపో తెలుపో
క్షేత్రయ్య : వలపనే దెటువంటి వస్తువో తెలియదే
అన్నమయ్య : అవదాని బ్రతుకింత అరడికబా
క్షేత్రయ్య : ఆడపుట్టువు పుట్టినన్నాల యింతుర

అన్నమయ్య : ఏమిసేతు నా భాగ్యము యెరింగి యెరుంగనీదు
క్షేత్రయ్య : ఏమిసేతు కన్నెప్రాయమునెత జేపె దైవము'[16]

అన్నమయ్య, సారంగపాణి రచనలలో కూడ అనేకములైన సామ్యములు కని పించుచున్నవి. శృంగార భావములలోగాని, ఆధ్యాత్మిక భావములలోగాని పోలికలు దర్శనమిచ్చుచున్నవి. తాము నమ్మిన భగవంతుని తప్ప వేరొక దైవమును పూజింప మని ఇరువురును సమాన భావములతో పలికినారు. అన్నమయ్య

నిన్నేకాని యితరులనేఁ గొలువ నొల్లనంటి
వున్నతిఁ బరద్రవ్యాలొల్ల నంటి
అన్నిటా నేనే మఱి యెప్పటి మాటే యంచు
నన్నులనన్నందుకు నొచ్చమని దూరకుమీ' (2-177) అని పలుకగా

సారంగపాణి

'వేణు గోపాలుని విడువము – మరి
వేరే వక్కరిపేరు నుడువము........
నారాయణ దివ్య నామము యె
న్నటికీ మరువ మీ నీమము
తారక మిది మాకు క్షేమము శ్రీ
ధరుని సేవే పూర్ణకామము' (కీర్తన 158) అని పలికినాడు.

శ్రీపతి పూజనుగూర్చి అన్నమయ్య

'మలహరి :- అతి సులభంబిది యందరి పాలికి
గతియిది శ్రీపతి కైంకర్యంబు ॥అతి॥
పాలసముద్రము బలిమి దచ్చికొని
తాలిమి దేవతలమృతమును
నాలుకనిదె హరినామపుటమృతము
యేల కానరో ఇహపర సుఖము ॥అతి॥' (2-10) అని తెలుపగా

సారంగపాణి

'అన్నిటికి సులభ మార్గము సుమీ
హరి నామ స్మరణా
పన్నగ శయనుడైన వేణు గో
పాలుని సన్నిధి జేరేటందుకు' (కీర్తన – 183) అని స్పష్టము చేసినాడు.

ఇంకను అన్నమయ్య జానపద గేయ రీతులలో వర్ణనలు సాగించినట్లు సారంగ పాణికూడ ఎచ్చరిక, లాలిపాట, జయమంగళముల రచించినట్లు తెలియుచున్నది.

అన్నమయ్య త్యాగయ్యలను గూర్చి తులనాత్మక పరిశీలనము గావించిన డా॥ కె. సర్వోత్తమన్‌గారు అనేక విషయములను తెలియ జేసినారు. "అన్నమయ్య దొడ్డ వాడు కావడానికి దొరల గొలువ నవసరము లేదనగా, త్యాగయ్య 'నిధి సుఖమా రాముని సన్నిధి సుఖమా' అని పలికినాడు. అన్నమయ్య త్యాగయ్య లిరువురూ తమ తమ మహిమలను ప్రదర్శించినవారే. ఇరువురూ దేశ సంచారము చేసి ఆయా క్షేత్రము లందలి దేవతలను కొనియాడినవారే. అన్నమయ్య 'నేనొక్కడ లేకుండితే నీ కృపకు పాత్రమేది, పూని నావల్లనే కీర్తి గొందేవు నీవు' అనగా త్యాగయ్య 'నే పొగడకుంటే నీకేమి కొదవో - నీవు లేక త్యాగరాజు నీ గుణముల నెటు బాడును'[17] అని తెలియ జేసినారు అన్నమయ్య త్యాగయ్యలను గూర్చి డా॥కె. సర్వోత్తమన్‌గారు "అన్నమయ్య త్యాగయలిద్దరు జానపద గేయ ఫణితుల్ని అసరాగా గ్రహించి కీర్తనలెన్నో వ్రాశారు. వాటిలో లాలిపాటలు, జోలపాటలు, మేలుకొలుపులు, శోభనాలు, ఉయ్యాల పాటలు, పెండ్లి పాటలు, ధవళాలు, మంగళాలు, భజనకీర్తనలు ప్రధానమైనవి. కాకపోతే అన్న మయ్య తానొక్కడే పాడుతూ క్రమంగా తన పాటల్ని భజన పాటలుగా వ్యాప్తి పొందేట్టు చేశాడు. కాని త్యాగయ్య ఉంఛ వృత్తి చేబట్టటంతో బ్రతికున్న రోజుల్లోనే అపారమైన శిష్యవర్గం అండదండలతో భజన సంప్రదాయానికే ప్రాధాన్యమిస్తూ కీర్తన లు పాడే విధానాన్ని శాశ్వతం చేయగలిగాడు."[13] అని తెలిపినారు.

అన్నమయ్య సాహిత్యమునకు ప్రథమ స్థానం సంగీతమునకు తరువాతి స్థానము కల్పించి రచన చేయగా త్యాగయ్య సంగీతమునకు ప్రాముఖ్య మిచ్చి సాహిత్యమునకు తరువాతి స్థాన మొసగినాడు. అందువలననే 'అన్నమయ్యాది సాహిత్య భాష'. త్యాగయ్యాది సంగీత భాష అను పలుకులు వెలువడినవి. అన్నమయ్య త్యాగయ్యలను గూర్చి "అన్నమయ్య అచ్చమయిన వాగ్గేయ కారుడు. త్యాగయ్య ధాతు కల్పనా దక్షుడు. ఆంధ్ర వాగ్గేయకార ఆకాశంలో అన్నమయ్య త్యాగయ్యలు సూర్యచంద్రులు."[19] అని డా॥ కె. సర్వోత్తమన్ గారు పలుకుట సముచితము.

ఇంతకు ముందే బాలాంత్రపు రజనీకాంతరావుగారు డా॥ కె. సర్వోత్తమ్‌గారు మొదలగువారు అన్నమయ్యకు ఇతర సంకీర్తన కర్తలకు రచనా విధానము నగల సామ్యములను పరిశీలించినారు. అన్నమయ్యకు ఇతర సంకీర్తన కర్తలకు రచనా విధానము గల సామ్యములే గాక ఆయా కవులకు అన్నమయ్యకు ఉన్న పోలికలీ ప్రకరణమున స్థూలముగ పరిశీలింపబడినవి. ఈ విషయము ప్రత్యేకముగ పరిశీలింపవలసి యున్నది. అన్నమయ్యకు వివిధ భాషలలోని వాగ్గేయకారులకు గల సామ్యములను గూర్చి "అన్నమాచార్యుల సంకీర్తనలు—ఇతర వాగ్గేయకారులు, తులనాత్మక అధ్యయనం" అను పేరుతో డా॥ ఎస్. గంగప్పగారు పరిశీలనము చేయుచున్నట్లు తెలుపుట ముదావహము.[20] ఈ విధమైన తులనాత్మక పరిశీలన ఆయా కవుల సంకీర్తనకర్తల రచనా విశేషముల అవగాహనకు ఎంతగానో ఉపకరించును. అన్నమయ్య రచనలను ఇతర సంకీర్తనకర్తల రచనలను తులనాత్మకముగ పరిశీలించినపుడు ఆంధ్ర వాగ్గేయ కార వియన్మండలములో అన్నమయ్య చుక్కలలో చంద్రునివలె ప్రకాశించుచుండునని చెప్పుట సహజోక్తి.

# సూచికలు

1. శృంగార సంకీర్తనములు సంపుట 12 పీఠిక పు 41,42
2. అన్నమాచార్య జీవిత చరిత్రము పీఠిక పుటలు. 106
3. అన్నమాచార్య సాహితీ కౌముది ఉపోద్ఘాతము పు. 1
4. ఆళ్వారులు—దివ్య ప్రబంధములు పుట. 272
5. ,, ,, ,, 279
6. సింహగిరి వచనములు పుట 9
7. ఆధ్యాత్మిక సంకీర్తనములు సంపుటి 3, పీఠిక పుటలు 46,48
8. సింహగిరి వచనములు పుట 5
9. ,, ,, ,, 11
10. ,, ,, ,, 35
11. ,, ,, పుట 20,21
12. ఆధ్యాత్మిక సంకీర్తనములు సంపుటి 2, పీఠిక.
13. స్వర్ణోత్సవ సంచిక, తిరుమల తిరుపతి దేవస్థానము_తెలుగువెలుగులు పు 136
14. ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక (3—10—84) పుట_10
15. ,, ,, ,, ,, 14
16. ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము పు 222,223
17. ఆంధ్రప్రభ, సచిత్రవారపత్రిక 3_10_84. పు 72_73.
18. అన్నమయ్య త్యాగయ్య పు_31
19. ,, ,, పు_33
20. తెలుగులో పదకవిత, ప్రస్తావన పు XIX

— ం —

# 6. ఆంధ్ర సాహిత్యములో అన్నమాచార్యుని స్థానము

"నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై వెలుఁగొందు
సత్యాత్ముఁడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు—సం
స్తుత్యుఁడీ తిరువేంకటాద్రి విభుఁడు" (1–75) అని

భక్తి పారవశ్యమున కొనియాడిన అన్నమయ్య సంకీర్తనా సాహిత్యమును సృష్టించి సంకీర్తనాచార్యునిగ, పద కవితా పితామహునిగ ప్రసిద్ధి పొందినాడు. శ్రీ వేంకట నాథుని మొట్టమొదటగా కొనియాడిన ఆంధ్ర కవీశ్వరుడగు అన్నమయ్య అనేకములైన సంకీర్తనములను రచించినను తన పేరును ప్రస్తావింపలేదు. అన్నమయ్య తరువాత వెలసిన సంకీర్తన కర్తలెందరో తమ సంకీర్తనముల యందు తమ నామములను ప్రస్తావించినారు. అన్నమయ్య చెప్పిన సంకీర్తనములన్నియు మంత్రములని ప్రతీతి. మంత్రములలో వ్యక్తి నామమును పేర్కొనరాదు కావున అన్నమయ్య ఆ విధముగ రచించెనని వినికిడి.

"పలికింతువు అక్షరముల పరగనవే వ్రాయింతువు
వెలయఁగ నీవే వెలిగా వేరొకటి నేఁజేయఁజూమీ" (2_269) అని

పలికి అసంఖ్యాకముగ సంకీర్తనములను రచించి పదకవితాపితామహునిగ, సంకీర్తనాచార్యునిగ ప్రసిద్ధి పొందిన విషయములు తెలిపి ఆంధ్ర సాహిత్యములో అన్నమాచార్యుని స్థానమును నిర్ణయించుట ప్రస్తుత ప్రకరణ ప్రధానాంశము.

''మాళవి : హరి నెఱుఁగని జన్మమది యేలా ఆ—
సరుగ నాతఁడు లేని చదువేలా ॥హరి॥
దయ దొలఁగిన యట్టి తపమేలా
భయము లేని యట్టి భక్తేలా
ప్రియము మానినయట్టి పెనఁగేలా మంచి—
క్రియా విరుద్ధపు కీర్తనలేలా ...." (2-414)- అనుచు

రచన సాగించిన అన్నమయ్య హరి నెరుగని జన్మము వ్యర్థమనుచున్నాడు. మంచి క్రియలకు విరుద్ధములైన కీర్తనలు కూడ వ్యర్థమనుచున్నాడు. జీవులు మంచి క్రియలకు

బద్ధులై భగవంతుని కీర్తించవలెనని అన్నమయ్య ప్రబోధము. కీర్తికాంక్షలేని, ఇహ లోక సౌఖ్యములను తృణీకరించిన అన్నమయ్య తన జీవితమునంతటిని తిరుమల వేంకటనాథునకే అంకితము గావించినాడు.

"ఇప్పుడిటు కలగంటి నెల్లలోకములకు
నప్పుడగు తిరువేంకటాద్రీశుఁ గంటి" (1–38) అనుచు

సంకీర్తన రచనను కొనసాగించి పదకవితా పితామహుఁడని ప్రసిద్ధి పొందినాడు. ఆయన పద కవితా పితామహత్వము నిట్లు పరిశీలింపవచ్చును.

## పదకవితాపితామహుఁడు

అన్నమాచార్యుని పదకవితాపితామహుఁడనుటకు అనేకములైన కారణములున్నవి. ఆంధ్ర సాహిత్యములో అపూర్వమైన పదకవితా ప్రక్రియను ప్రారంభించుటయే దీనికి ప్రధాన కారణము. అన్నమయ్య కంటె పూర్వము పదకవిత లేదా ? అను ప్రశ్న కలుగుట సహజము. ఉన్నది అనియే సమాధానము. మరి ఆయన కంటె పూర్వము పదకవిత ఉన్నప్పుడు ఆయనను పదకవితాపితామహుఁడనుట సముచితమా ? యని సందేహము. సమంజసమేనని సమాధానము. దాని నిట్లు పరిశీలింపవచ్చును. నన్నయనాడు ఆంధ్ర సాహిత్యము ఆరంభమైనను శ్రీ కృష్ణదేవరాయల యుగమున వెలసిన పెద్దనకు 'ఆంధ్ర కవితా పితామహుఁడని' బిరుదమున్నది. ఆంధ్ర కవిత్వము నారంభించిన నన్నయ కులేని బిరుదమీ పెద్దనకేల కలిగినది ? అని ప్రశ్న పుట్టక తప్పదు. తనకు పూర్వ సాహిత్యమునలేని ప్రబంధ సాహిత్యమునకు పునాదులు వేయక పోయినను సలక్షణ మైన ప్రబంధ రాజమగు 'మనుచరిత్రము'ను రచించినాడు. కావుననే పెద్దనకు 'ఆంధ్ర కవితా పితామహుఁడ'ను బిరుద మన్వర్థమైనదని సమాధానము. ఇదే విధముగ ధర్మవరం రామకృష్ణమాచార్యులవారు 'ఆంధ్ర నాటక పితామహుఁడ'ని కోలాచలం శ్రీనివాసరావు గారు ఆంధ్ర చారిత్రక నాటక పితామహుఁడని ప్రసిద్ధి పొందినారు. ఇక అన్నమాచార్యునికి గల పదకవితా పితామహబిరుదము యొక్క సార్థక్యమును గూర్చి పరిశీలింప వలసి యున్నది.

పదకవితను గూర్చి ఆచార్య తూమాటి దోణప్పగారు "జానపద స్వభావులైన జనులు తమ ఆశల, ఆశయాల కనురూపంగా ఉత్సవాంకంగానో, ఉత్సాహాంకంగానో

తరాలతరబడిగా నుడుగు మీద నుడుగుగా పడుగు పేకలా అల్లుకుంటూరాగా రూపెత్తిన వాఙ్మయ సర్వస్వం దేశి కవితలో అనిబద్ధరీతికి చెందుతుంది. తెలుగులోని పదకవిత నిబద్ధపద్ధతికి చేరుతుంది.

"జానపదుల బాణీ - భాష - భావం - ఛందస్సు సంగీతం వగైరాలవి అను సరిస్తూ జానపద కవితా రసలోలుపులైన వాగ్గేయకారులు నీతి, భక్తి, శృంగార, వైరాగ్య పారమ్యాలయిన విషయాలను ఎన్నిక చేసి ధాతు మాతువులన్న చట్రంలో బిగించిన రచనా విశేషం 'పదకవిత' అని పదుగురాడు మాట"[1] అని 'మేలిపలుకు' పలికినారు.

పదకవితను గూర్చి డా॥ ఎస్. గంగప్పగారు "పద పద్య కవితలలో పద కవిత్వమే ముందావిర్భవించిన దనడం సర్వజనాంగీకృత విషయం. ప్రాక్తన మానవుడు సుఖ దుఃఖాది అనుభూతులను పొందినప్పుడు తదనుగుణంగా ఆడిపాడుకొనడంలోనే ఈ పద కవిత పుట్టింది. అదే కాలాంతరంలో సంస్కరింపబడి మరో విధంగా పద్యకావ్యంగా ప్రౌఢ కావ్యంగా పండిత కావ్యంగా అంగీకరించబడి గౌరవ పాత్ర మైనది. పదకవిత పండితామోదముద్ర నెంత మాత్రము పొందకపోయినా విద్వ ద్గోష్ఠులలో ప్రస్తావించ బడకపోయిన, రాజ గౌరవం సంపాదించకపోయినా దాని దారినది నడుస్తూనే ఉంది. అభివృద్ధి చెందుతూనే ఉంది సామాన్య ప్రజల మన్ననలకు పాత్రమవుతూనే వుంది. చివరికి రాజ గౌరవం కలిగిందమేకాదు, పండితులు సైతం సమాదరించడం జరిగింది."[2] అని తెలిపినారు.

ఏ సాహిత్యములోనైనను పద పద్య సాహిత్యములలో పదమే ముందు ఆవిర్భవించినదను విషయము సర్వజనాంగీకృతమైన విషయమని తెలియుచున్నది. నన్నయతో ఆంధ్ర సాహిత్యము ఆరంభమైనను నన్నయకంటె పూర్వము పదకవిత ఉన్నదను విషయము మరువరానిది. ఆంధ్ర కవిత్వము నన్నయ నాడే ఘటోత్కచుని యౌవనమువలె ఒక్కసారిగ వెలువడినదని చెప్పుట సాహసమే యగును. నన్నయకంటె పూర్వము తెలుగు ప్రజల భావములు పదముల రూపమును ప్రచారమున ఉండెననుట నిస్సందేహము. దీనినే పద సాహిత్యమని దేశి సాహిత్యమని వ్యవహరించినారు.

నన్నయ కంటె పూర్వము తరువోజ, సీసము, మధ్యాక్కర మొదలైన దేశి సాహిత్యచ్ఛందోరీతులు శాసనములలో కన్పించుచున్నవి. పాల్కురికి సోమన ప్రభాత

పదములు, తుమ్మెద పదములు, వెన్నెల పదములు, పర్వత పదములు, ఆనంద పదములు, నివాళి పదములు, గొబ్బి పదములు మొదలగు పదములను శ్రీశైల పర్వతారోహణ చేయు భక్తులు పాడినట్లు తెలిపినాడు. నాచన సోమన 'జాణలు మెత్తురు జాజర పాట' అని పేర్కొనినట్లు ప్రసిద్ధము.

12వ శతాబ్దిలో సింహగిరి నరహరి వచనములను వ్రాసిన కృష్ణమాచార్యులు తన రచనలను వచన సంకీర్తనములని పేర్కొనెను. 'వేదంబు తెనుగు గావించి సంసార భేదంబు' మాన్పిన కృష్ణమాచార్యుల వారి తోడనే వచన కవితా పద్ధతి ఆరంభమైనది. "అహోబలం, సింహాచలం మొదలైన దేవాలయాల్లో 13, 14వ శతాబ్దాల్లో కృష్ణమాచార్యుని నామ సంకీర్తనలు సంకీర్తనం చేయబడుతూండేవని వేటూరి వారు శాసనాధారాల్ని చూపించారు"[3] అని డా॥ ఎస్. గంగప్పగారు పేర్కొనినారు. కృష్ణమాచార్యుని తరువాత యాగంటివారి పదాలు ప్రచారములో ఉన్నట్లు తెలియుచున్నది. శ్రీనాధుని కాలములో కూడ పదకవితలో ప్రచారములో నుండెననుటకు ఆయన రచించిన 'పలనాటి వీర చరిత్ర'యే సాక్ష్యము.

తాళ్ళపాక అన్నమయ్య అవతరణము తెలుగు పద కవితకు వసంతకాలమైనది. ఆయన రాకతో పదసాహిత్యములో నూతన కాంతులు వెల్లివిరిసినవి. పద సాహిత్యము కొత్త రూపును సంతరించుకొన్నది. సరికొత్త ఊపును అందుకొన్నది. ఉన్నత స్థాయికి చేరుకొన్నది. ఏ పద సాహిత్యమునను, ఏ కవియు వెలువరింపలేని శృంగారాధ్యాత్మిక సంకీర్తనములను అన్నమయ్య రచించినాడు. కలియుగ దైవమైన తిరుమల శ్రీనివాసునిపై వేలకొలది సంకీర్తనములను రచించి తరించిన భక్తాగ్రేసరుడు అన్నమయ్య. అన్నమాచార్యుని ప్రతిభను సంకీర్తనల ప్రాముఖ్యములను గూర్చి డా॥ పి.వి. రాజమన్నారుగారు "అన్నమాచార్యుడు పరమ భక్త శిఖామణి. మహాపండితుడు. రసికాగ్రగణ్యుడు. సంగీత సాహిత్యములు రెండింటను ఔన్నత్యమును సంపాదించి ఆ రెండును శ్రీ వేంకటేశ్వరునకు ధారవోసి ధన్యుడైనవాడు.

"సంకీర్తనములంటే చులకనగా చూచుట కొందరి మతము. సంకుచిత దృష్టియే దానికి కారణము. సంకీర్తనములు గేయములు ఉత్తమ సాహిత్యానికి చేరినవే. నిస్సందేహముగ కీర్తనలో ఉన్న ఏకాగ్రత ఇతర కావ్య రూపములో లభింపదు. అందు

చేతనే కీర్తన అత్యంతానంద దాయకము. సంకీర్తనములో సంగీత సాహిత్యములు మిళితమై యుండుటచే ఆకర్షణ శక్తి హెచ్చు. కీర్తన హృదయ తంత్రులను స్పందింప జేయునట్లు పద్య గద్యాదులు లేయనేరవు."4 అని పలికినారు.

అన్నమయ్య తరువాం తాళ్ళపాక కవులైన పెద తిరుమలాచార్యులు, చిన తిరుమలాచార్యులు సంకీర్తనములు రచించినట్లు తెలియుచున్నది. చిన్నన్న ద్విపద కావ్యములను రచించినట్లు స్పష్టము. వీరి తరువాత నారాయణ తీర్థులు, సిద్ధేంద్రయోగి, క్షేత్రయ్య కంచెర్ల గోపన్న, మునిపల్లె సుబ్రహ్మణ్యకవి, విజయ రాఘవుడు, వేంకటమఖి, సారంగ పాణి, త్యాగయ్య మొదలగువారు ప్రసిద్ధి పొందిన పదకవులు.

అన్నమాచార్యుని కంటె పూర్వుడైన కృష్ణమాచార్యులవారిని ఆంధ్రదేశములోని భజన సంకీర్తనములకు పితామహుడని డా॥ వేటూరి ఆనందమూర్తి గారు వివరించినారు.5 భజన సంకీర్తన పద్ధతులకు కృష్ణమాచార్యులనే పితామహునిగ పేర్కొని నప్పటికి తెలుగులో వినూతనమైన నిబంధ పదకవితా ప్రక్రియకు సుస్థిరమైన రూపమును కల్పించినది తాళ్ళపాక వారే అని పేర్కొన వచ్చును. తాళ్ళపాక వారికి అంతకు పూర్వము వెలసిన సంస్కృత కర్ణాటాది భాషలలోని వాగ్గేయ కారుల రచనలు చాలవరకు మార్గదర్శకములై ఉండుననుట నిర్వివాదమైన అంశము. అన్నమయ్య జయదేవుని అష్టపదుల వంటి రచనలు చేసినాడు.

ఆంధ్ర సాహిత్యములోని అపూర్వమైన పద సాహిత్యమును సృష్టించి, అధిక సంఖ్యలో కీర్తనములను రచించి ఆ తరువాత వెలసిన ఎందరో పదకవులకు మార్గదర్శకునిగ అన్నమయ్య విశిష్టతను సంపాదించుకొనినాడు.

అద్భుతములైన భావములతో అపారమైన సంకీర్తన సాహిత్యమును సృష్టించిన అన్నమయ్య పదకవితా పితా మహత్వమును గూర్చి పుట్టపర్తి నారాయణాచార్యుల వారు" అన్నమయ్య చిన్ననాటినుండి 'అడిన మాటెల్ల నమృత కావ్యముగ పాడిన పాటెల్ల పరమ గానముగ నమరినవాడట ! ఈ యుత్ప్రేక్ష ఎట్లున్నను శ్రీపాదరాయల పదములే రచనోత్సాహమును గల్పించి యుండును. తన చుట్టూనూ వినబడుచున్నవా పాటలేగదా ! అన్నమయ్య పద్యములెందు కల్లలేదు ? అల్లిన నెందుకు వ్యాప్తికి రాలేదు. నా దృష్టిలో దానికిఁ గారణమిది. శ్రీ పాదరాయల యొఅవదిలో నాతఁడొకటి

రెండు పాటలు తమ యూరి చెన్నకేశవునిపై పదములు బాడి యుండుసు. ఆయూరి 'బాగు బాగ' ని యుందురు. ఆయుత్సాహమల్లే సాగి 'పద కవితా పితామహుండగు' వరకు పోయి యుండును. వాస్తవమున కన్నమయ్య సంతరించుకొన్న సామగ్రి యంతయు కావ్యకర్త కుండవలసినది. చేసినది పదరచన. కావ్యకర్త గావలసినవాడు పదకర్త యైనాడు. అతడు వేసిన తప్పటడుగు మన భాగ్యమైనది. లేకున్న అన్నమయ్య గూడ ఒక నాచన సోమనాథుడై యుండెడివాడు. ఆ బిరుదులు లేవు గాని ఆతని వలెనే యితడును "సాహిత్య రస పోషణుడు" "సంవిధాన భూషణుడు–సకల భాషా చక్రవర్తి"[6] అని పలికినారు.

ఈ విషయములను నారాయణాచార్యులవారు సమంజసముగ వివరించినారు. పద్య కవి కావలసిన అన్నమయ్య పదకవి యగుట మన మహా భాగ్యమని పలికినారు. నిజమే ! అన్నమయ్య ముందు పద్యకవి. ఆ తరువాత పదకవి. అన్నమయ్య తిరుపతి కొండ నెక్కునప్పుడు అలసి నిద్రించిన సమయమున జగదంబ ప్రసాద ప్రభావముతో 'పద్యశతము' చెప్పినాడు. ఆ తరువాత అఖిలాండ కర్తయైన శ్రీ వేంకటేశ్వరుని దర్శించి సంకీర్తనము చేసినాడు. ఆనాటి నుండి పరమేశ్వరునిలో ఐక్యమగు నాటి వరకు దినమున కొక్క సంకీర్తనకు తక్కువ గాకుండ రచించి స్వామికి అర్పించినాడు. శ్రీనివాసుని నందకాంశమున జన్మించిన అన్నమయ్య ఆనాటి నుండి సంకీర్తనాచార్యుడైనాడు. తన తరువాత వెలసిన పదకవులకు అన్నమయ్య సంకీర్తనములే ఆదర్శప్రాయములైనవి. పద కవితా వృక్షమునకు అన్నమయ్య సాహిత్యము తల్లి వేరు వంటిది. పద కవితా సౌధమునకు పునాది అన్నమయ్య సాహిత్యము. పద కవితా ప్రవాహమున పయనించిన నావికులనెడి సంకీర్తన కర్తలకు అన్నమయ్య సాహిత్యము దిక్సూచియైనది. అందు వలననే ఆంధ్ర పద కవిత్వమున విశిష్ట స్థానమును పొంది, పద కవితా పితామహుడని గణుతి కెక్కినాడు.

అన్నమయ్య కేవలము పదకవితా పితామహునిగ సంకీర్తనా చార్యునిగ ప్రసిద్ధి పొందుటయే గాక ఇంకను అనేక విధముల తన ప్రతిభా నైపుణ్యములను ప్రకటించినాడు. సంకీర్తన కర్తగ అన్నమయ్య ప్రదర్శించిన వర్ణనా నైపుణ్యము పూర్వోక్తము. అన్నమయ్య అనేకములైన లక్షణములతో అపారమైన ప్రతిభను ప్రదర్శించినాడు. ఆ విషయములనిట్లు పరిశీలింపవచ్చును.

## ద్విపద కావ్య కర్తగ

ప్రజానీకమునకు సులభముగ అవగాహన మగుటకు అన్నమయ్య సంకీర్తనములు రచించుటయే కాదు 'ద్విపద'లలో కూడ కావ్యములు వెలువరించినాడు. అన్నమయ్య ద్విపదలలో రచించిన రామాయణము లభింపక పోవుట తెలుగు వారి దురదృష్టము. కాని అన్నమయ్య సంకీర్తనాత్మకముగ వెలయించిన 'రామ కథ' మాత్రము లభ్యమగుచున్నది. ఈ సంకీర్తనములలోను 'కృష్ణకథ'ను వివరించినట్లు అనేకాంశములతో 'రామకథ'ను వివరింపలేదు. అల్పాక్షరములలో అనల్పార్థ రచనా నైపుణ్యమును ప్రదర్శించి సంకీర్తనాత్మకముగ రామకథను వివరించినాడు.

అన్నమయ్య రచించిన వేరొక ద్విపద కావ్యము శృంగార మంజరి. శ్రీనాథుడు శృంగార నైషధమును వ్రాయగ అన్నమయ్య శృంగార మంజరిని రచించినాడు. ఇది ప్రబంధ 'ఫక్కి'లో వ్రాయబడినది. తరువాత వెలసిన ప్రబంధ కర్తలెందరికో మార్గదర్శకమైనది. దోహద క్రియలు, నాయికా నాయకుల వనవిహారము విరహము, శైత్యోపచారములు మొదలగు వర్ణనలతో మనోహరముగ సాగినదీ కావ్యము. విస్తృతమైన ప్రణాళికతో రచింపబడిన ప్రబంధములకే మాత్రము తీసిపోనిది శృంగార మంజరి. తేట తెలుగు పలుకులతో శ్రీ వేంకటేశ్వరునకు అంకితముగ అన్నమయ్య చెప్పిన శృంగార రచనము ఈ శృంగార మంజరి ద్విపద కావ్యము.

## శతకకర్తగ

బాలుడైన అన్నమయ్య తిరుపతి కొండపై శయనించిన సమయమున జగదంబ అలమేలు మంగ తినిపించిన ప్రసాదాన్నములు ప్రభావముతో 'సరస కవిత్వ వాచా ప్రౌఢి మెరయగ' అళువుగ ఒక్క శతకమును చెప్పినట్లు పూర్వోక్తము. 'వేంకటేశ్వరా' మకుటముతో అన్నమయ్య ఈ శతకమును అలమేలు మంగకు అంకితముగ చెప్పినాడు.

"అరిసెలు నూనెబూరియలు నౌగులు చక్కెర మండెగల్ వడల్
బురుడల పాలమండిగల పూపము లయ్యల మేలు మంగ నీ
కరుదుగ విందు వెట్టు పరమాన్న చయంబులు సూపకోటిమున్
నిరత వినిర్మలాన్నములు నేతుల సోనల వేంకటేశ్వరా"7

"అమ్మకు తాళ్ళపాక ఘనుడన్నడు పద్య శతమ్ము సెప్పెగో
కొమ్మని వ్రాక్రప్ప సూనముల గూరిమితో నలమేలు మంగకున్
నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మ కల్పముల్
సమ్మద మంది వర్ధిలను జవ్వన లీలలు వేంకటేశ్వరా" [8]

అని చంపకోత్పల మాలలతో అలమేలు మంగకు పద్యశతము నర్పించినాడు. ఆ తరువాత అన్నమయ్య పండ్రెండు శతకములను చెప్పినట్లు తెలియు చున్నది. కాని ఆ పండ్రెండు శతకములలోను మనకు లభించునది ఒక్క శతకము మాత్రమే. అదియే వేంకటేశ్వర శతకము. అన్నమయ్య స్వామిపై చెప్పిన శృంగార ఆధ్యాత్మిక సంకీర్తనములను ఆయన సంతతి రాగిరేకులలో భద్రపరచినట్లు శతకములను భద్రపరుపలేదు కాబోలు ! లేక రాగిరేకుల కెక్కించినను శ్రీ కామిసెట్టి శ్రీనివాసులుశెట్టి గారు పలికినట్లు "రాగం విలువ తెలియని జాతి రాగి కోసం వానిని కరగించుకొన్నది"[9] కాబోలు !

## బహుభాషావేత్తగ

"కల భాషలను నానా ప్రబంధముల్ చేసి" అని చిన్నన్న చెప్పుట వలన అన్నమయ్య బహుభాషా పాండిత్యమును గమనింపవచ్చును. చిన్నన్న 'సకల భాషలను' అని పేర్కొని నాడే కాని ఆ భాషా వివరణమును మాత్రము ప్రస్తావింపలేదు. అన్నమయ్య సకల భాషలలోను అనేకములైన ప్రబంధములను రచించినాడట ! అనేకములైన ప్రబంధములను రచించుటకు కావలసిన పాండిత్యము అన్నమయ్య కున్నదని గ్రహింపవచ్చును బహుశ ! అన్నమయ్య అష్ట భాషలలో ప్రబంధములను రచించి యుండవచ్చును. ఈ ప్రభావము తోడనే చిన తిరుమలాచార్యుడు అష్ట భాషా దండకమును రచించినాడేమో !

అన్నమయ్య తేట తెలుగు మాటలతో సంకీర్తన సాహిత్యమును సృష్టించుటయే గాక సంస్కృత భాషాపాండిత్యము తోడను సంకీర్తనములను రచించినట్లు తెలియు చున్నది. సంస్కృత భాషా సంకీర్తనములను కూడ యతి ప్రాస నియమముల కనుగుణముగనే రచించినాడు. సంస్కృతాంధ్ర భాషాధికారియైన అన్నమయ్య సంస్కృత సంకీర్తనములను గూర్చి డా.కె. సర్వోత్తమున్ గారు ప్రత్యేకాధ్యయనము చేయుచున్నట్లు తెలియుచున్నది.[10]

అన్నమయ్య సంస్కృత సంకీర్తన రచనలలో శ్రుతి శుభగత్వమధికము. శబ్దాలంకార రచనా సామర్థ్యముతో అన్నమయ్య వేంకట కృష్ణుని

"కురంజి : మందర ధర మధు సూదన
నందగోప నంద నా
నరసింహ గోవింద నవనీ తానంద
హరి ముకుంద నయనార వింద
కరి వరద గరుడ గమన రూప
గురు చాపా యదుకుల దీపా ॥మంద॥" (1-267) అని

వర్ణించినాడు

రౌద్రమూర్తియైన నారసింహుని

"శ్రీరాగం : ఫాల నేత్రానల ప్రబల విద్యుల్లతా
కేళీ విహార లక్ష్మీ నారసింహా ॥ఫాల॥
దారుణోజ్జ్వల ధగద్ధగిత దంష్ట్రానల వి-
కారస్ఫులింగ సంగ క్రీడయా
వైరి దానవ ఘోర వంశ భస్మీకరణ-
కారణ ప్రకట వేంకట నారసింహా ॥ఫాల॥" (1-281)

అని వర్ణించినాడు. వేరొక సంకీర్తనమున వేంకట రాముని

"దేవ దేవం భజే దివ్య ప్రభావం
రావణాసురవైరి రఘుపుంగవం" (1-314) అనుచు కీర్తించినాడు.

అంజనీ పుత్రుడైన హనుమంతరాయుని

"దేశాక్షి : సీతా శోక విఘాతక వో-
పాతాళ లంకా పతి విభాళా ॥సీత॥
హనుమంతరాయ అంజనీ తనయవో
వనధి లంఘన గాత్ర వాయుపుత్ర
యిన కులాధిప నిజహిత జగన్నుత
వనజోదర సేవక సత్వధనికా ॥సీతా॥" (1-366)

అని ప్రశంసించినాడు. దివ్య భాషలో వేంకటాద్రి మాహాత్మ్యము రచించినాడట । ఇ యును అలభ్యమే.

అన్నమయ్య తెలుగు నుడికారమును వశీకరించుకొని వర్ణించిన తీరు ఆయన చేసిన బహు ముఖీనములైన వర్ణనలలో ప్రదర్శితమయ్యెను. సంస్కృతాంధ్రములలో సంకీర్తనములు రచించుటలో అన్నమయ్య ప్రకటించిన భావము లనన్య సామాన్యము లై యున్నవి.

## లక్షణకర్త

సుమారు 32 వేల సంకీర్తనములను రచించి సంకీర్తనాచార్యునిగ ప్రసిద్ధి పొందిన అన్నమయ్య సంకీర్తనా లక్షణమును సంస్కృతములో రచించినట్లు తెలియుచున్నది. ఇది అలభ్యము. కాని దీనికి అనువాదమైన సంకీర్తన లక్షణము తెలుగులో చిన తిరు మలాచార్య కృతమై లభించుచున్నది. దీనిలో

> "భరతాదుల గ్రంథంబుల
> విరచించిన లక్షణములు వేంకట భూమీ
> ధరవర కీర్తన లక్ష్యము
> లురు పదకవితా పితా మహుండేర్పరచెన్" 11

అని చిన తిరుమలాచార్యుడు పేర్కొనినాడు.

అన్నమయ్య సంస్కృతములో రచించిన సంకీర్తన లక్షణమునకు పెద్ద తిరు మలాచార్యుడు వ్యాఖ్యానము వ్రాయగా చిన తిరుమలయ్య పద్య రూపమున చెప్పు చుంటినని పలికినాడు. తాతగారి సంస్కృత గ్రంథము లభింపకపోయినను మనుమని ఆంధ్రీకృతి లభించుచున్నది. సంకీర్తన లక్షణములలో చెప్పిన అనేకములైన లక్షణ ములకు లక్ష్యములుగ అన్నమయ్య సంకీర్తనములు రచించినాడు.

## వ్యక్తిత్వము

పదకవితా పితామహునిగ, ద్విపద కావ్య కర్తగ, శతక కర్తగ, బహు భాషా వేత్తగ, లక్షణ కర్తగ సమున్నత స్థానము నాక్రమించు కొనిన అన్నమాచార్య వ్యక్తిత్వమును తెలిసికొనుట యెంతయునవసరము. అన్నమయ్య వ్యక్తిత్వమును తెలిసికొనుటకు ఆయన జీవిత చరిత్రము, సంకీర్తనములు ఆధారములగు చున్నవి.

జీవిత చరిత్రలో వివరింపబడిన విషయములు పూర్వోక్తము. ఆయన రచించిన సంకీర్తనముల ద్వారా ఆయన వ్యక్తిత్వమును కొంతవరకు గ్రహించుటకు ప్రయత్నింపవచ్చును.

శ్రీ వేంకటేశ్వరుని నందకాంశమున జన్మించిన అన్నమయ్యకు తిరుమలనాథుని భక్తి రసమును తల్లి ఉగ్గుబాలతో రంగరించి పోసినది. శ్రీనివాసుని పైని భక్తి అన్నమయ్యకు నరనరములలో జీర్ణించుకు పోయినది. అందువలననే గడ్డి తీసికొని వచ్చుటకు వెళ్ళిన బాలుడు వేంకట నగమునకు చేరుకొని భక్తి పారవశ్యములో అలమేల్మంగా విభుని ఆరాధించినాడు. అహోబలమున విశిష్టాద్వైత సిద్ధాంతములను పూర్తిగా ఆకళింపు జేసికొనినాడు. అత్యంత సమర్థవంతములైన సంకీర్తనములను రచించి తమ ఇలవేల్పుగు శ్రీ వేంకటేశునకే అంకిత మిచ్చినాడు. వేంకట నాథుని ప్రసక్తి లేకుండ ఒక్క సంకీర్తనమును కూడ రచింపలేదు.

నరులపై కవిత అల్లుటకు ఇష్ట పడలేదు. ఇహలోక సౌఖ్యమును తృణీకరించినాడు. అంతయును పరమేశ్వరుని అధీనమని నమ్మినాడు. పరమేశ్వరుని ఆజ్ఞ లేక జీవుడు ఏ పనిని చేయలేడని భావించినాడు. అందువలననే 'హరియే సకల క్రియలై తృప్తి యిచ్చుఁగాక (2-126) అని పలికినాడు. అంతే గాదు

"యేవల నరుఁడు లేక యేద్దేతా దున్నునా
నీవు సేయించక వేరేనేఁ బుణ్యము చేసేనా
దేవుఁడ సూర్యుఁడు రాక తెల్లవారు నారేయి
వేవేగ నీ కృపఁ గాక విజ్ఞాని నౌదునా" (2-130) అని

పలికినాడు. ఈ చరణమున దైవమును నరునితో పోల్చి జీవుని ఎద్దుతో పోల్చినాడు. నరుడు లేక ఎద్దు పొలమును దున్నలేని రీతిలో దేవుడు చేయించకయే జీవుడు పుణ్యము చేయలేడట. అదే విధముగ దేవుడనెడి సూర్యోదయము కాకయే అజ్ఞానమనెడు రేయి తెల్లవారదని పలుకుచున్నాడు. ప్రతీకాత్మకముగ పలికిన ఈ పలుకులు అన్నమయ్య వ్యక్తిత్వమునకు ప్రత్యక్షర సాక్ష్యములు. పరమేశ్వరుని పాదారవిందములపై భక్తి నిలిపిన అన్నమయ్య 'నమ్మిన వొకటే నాకు ని శరణము' (2-74) అని పలికినాడు భగవంతుని శరణుకోరి సేవించిన అన్నమయ్య

"సామంతం: బలువుఁడు హరిఁజే పట్టితిని
తలచిన దెల్లా దక్కెను నాకు ॥బలు॥
దురిత ధ్వంసుఁడు దుఃఖ విదారుఁడు
అరి భయంకరుఁ డచ్యుతుఁడు
సిరివరుఁ డితనిఁ జేకొని కొలిచిన
పరమ సుఖమె పో భయ మెక్కడిది ॥బలు॥" (2–77)—

— అని భయము లేదని పరమ సుఖమే దక్కినదని కీర్తించినాడు.

అన్నమయ్య నరులను అసహ్యించుకొనుచు సంకీర్తనములు రచించినాడు. కాని ఆ కాలముననే కొందరు నరులు ఇతరులను సేవించుటను చూచి అన్నమయ్య

"శంకరాభరణం: ఛీఛీ నరుల దేటి జీవనము
కాచుక శ్రీహరి నీవే కరుణింతు గాక ॥ఛీఛీ॥
అడవిలో మృగజాతియైనఁ గావచ్చుఁగాక
వడి నితరులఁ గొలువఁగ వచ్చునా
పుడమిలో పక్షియై పుండనైనా వచ్చుఁ గాక
విడువ కెవ్వరినైనా వేఁడ వచ్చునా ॥ఛీఛీ॥" (1–397)—

అని పలికినాడు. ఎంతగా నరుల జీవనమును అసహ్యించుకొనినను శ్రీహరి ఆ నరులను కరుణింపవలెనని కీర్తించినాడు.

ఇద్దరాండ్రను గట్టుకొని సంసారమును సాగించిన అన్నమయ్య సంసార జీవితము పట్ల విముఖత వ్యక్తము చేసినాడు.

'ఇదివో సంసార మెంత సుఖమోకాని
తుదలేని దుఃఖమను తొడవు గడియించె" (1–308) అని

పలికినాడు. అంతేకాదు 'మంచిదివో సంసారము' అని సంసారమును గూర్చి మంచిగ పలుకుచు వెంటనే 'మదమత్సరములు మానిన' అని స్పష్టము చేయును. ఇతరులకు సంసారము 'జమునోరిలో బ్రదుకు, చమురు తీసిన దివ్వెకాగా వేంకటేశు దాసులకు మాత్రము చలువలకు కడు చలువ యని విశదీకరించును.

రామాయణ భారత భాగవతములను పూర్తిగ ఆకళింపు జేసికొనిన పరమ భక్తాగ్ర గణ్యుడు అన్నమయ్య.

ఈనాడు సమతా వాదముగ చెప్పబడుచున్న సర్వమానవ సమానత్వమును 15వ శతాబ్దిలోనే అన్నమయ్య వివరించినాడు. జాతి, కులములకు ప్రాధాన్యము నివ్వరాదని అన్నమయ్య ప్రబోధము. భగవంతుని దృష్టిలో సకల జీవరాసులు సమానమేనని అన్నమయ్య భావము. అందువలన మానవుడు కులమునకు ప్రాధాన్యము నీయక గుణమునే గణింపవలెనని సూచించినాడు. ఈ విధమైన భావము తోడనే

"నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే
చండాలుడుండేటి సరిభూమి యొకటే (2–385) అని వివరించినాడు.

ఇంకను

"వినియుఁ జదివియు రమా విభునిఁ దలఁపక వృథా
తనువు వేఁపుచుఁ దిరుగు తపసి కంటె
చనవుగల వేంకటేశ్వర దాసులకు వెంటఁ
బని తిరుగు నధముఁడే బ్రాహ్మణోత్తముడు" (1–329) అని

కులము కంటె గుణము మిన్నయని బోధించినాడు.

అన్నమయ్య రచనల ననుసరించి కొందరు సంకీర్తనములు రచించినట్లు తెలిసి అన్నమయ్య వారిని

"వెర్రులాల మీకు వేడుక కలిగితేను
అర్రువంచి తడు కల్లంగరావా" (2–494) అని—

పలికినట్లు విమర్శకుల భావన. ఈ కీర్తన పెద తిరుమలాచార్యుని రచనయేమోనని డా॥ వేటూరి ఆనందమూర్తి గారి భావన.[12] ఇది సమంజసము కావచ్చును. అన్నమయ్య సంకీర్తనములలో తన పేరును ఎక్కడను ప్రస్తావింపలేదు. కాని ఈ సంకీర్తనమున

"ఎన్నగ శ్రీ వేంకటేశుఁ దాళ్ళపాక
అన్నమాచార్యులు అఖిల దిక్కులు మెచ్చ" అని పేర్కొనుటను బట్టి

దీనిని అన్నమాచార్య కృతనుగ గ్రహించుట సముచితము కాదు.

అన్నమయ్య మహిమాన్వితుడని పూర్వోక్తము. అన్నమయ్య మహిమలను వినిన ప్రజలు వారి కోరికలను దీర్చుమని ప్రార్థించెడివారట. తన చుట్టును చేరి కోరికల నడుగుచున్న జనులతో విసిగిపోయిన అన్నమయ్య

"పొసగ దేవుఁడిచ్చినా పూజారి వరమీడు
విసిగినే విడిచినా విడువరు లోకులు
కొసరేరు ముసిరేరు కోరికఁ దీర్చుమనేరు
పసిలేని పనులకు బడలనే నోపను" (8-2‌40) అని పలికినాడు.

అన్నమయ్య అవసాన దశలో తనను వేంకటేశుని సన్నిధికి జేర్పుమని కోరుచున్నాడు. దేవదేవుని సాయుజ్యమును సంపాదించుటకు తనను వేంకటేశు సమీపమున చేర వేయుమని పలుకుచున్నాడు. ఆ సంకీర్తన మిట్లున్నది.

"పిన్ననాటి నుండి తన పెంచిన యీ దేహము
మున్నిటి వలె గాదు ముదిసీని
.... .... .... .... .... .... .... .... ....
కింకపు కిసరు చేత కీడైన దేహము
వంకపు తెరువుల వడి సీని
యింక నీ విధి చేత నెప్పుడేదఁ బడునో
వేంకటేశుఁ జేరఁబడ వేయఁగదరే" (1-305)

ఈ విధముగ జీవితమును సాగించిన అన్నమయ్య స్వార్థమును త్యజించి, పరమాత్మని పూజించి తన జీవితమునంతటిని శ్రీనివాసునికే అంకితము గావించినట్లు స్పష్టము కాగలదు.

## ఆంధ్ర సాహిత్యములో అన్నమాచార్యుని స్థానము

అన్నమాచార్యుని వ్యక్తిత్వమును భిన్న కోణముల నుండి పరిశీలించిన సందర్భమున ఆయనకు ఆంధ్ర సాహిత్యమున గల స్థానమును కూడ చర్చించుట అవసరమే యగును.

ఆంధ్ర సాహిత్యములో నన్నయను ఆదికవిగ పేర్కొనినట్లు పదసాహిత్యములో అన్నమయ్యను ఆదికవిగ చెప్పవచ్చును. నన్నయ కంటె పూర్వము ఆంధ్ర సాహిత్య మున్నను సుస్థిర రూపమును పొంది గ్రంథరూపముగనున్న ఆంధ్ర భారతమే ఆది గ్రంథముగ పరిగణింపబడి నన్నయ ఆదికవిగ ప్రసిద్ధిచెందినాడు. ఆదే విధముగ అన్నమయ్యకంటె పూర్వము కృష్ణమాచారుర్యుల వచన సంకీర్తనములున్నను ఆది పాడుకొనుట కనువైన సంకీర్తన సాహిత్యమును సృష్టించినాడు. కావున అన్నమయ్యను పదసాహిత్యములో ప్రథమ కవిగ పేర్కొన వచ్చును.

జానపద గేయ రీతులలో వర్ణనలు సాగించి దేశి సాహిత్యమునకు విశిష్ట స్థానమును సంక్రమింపజేసినాడు. అన్నమయ్య వెలువరించిన దేశి సాహిత్యములో పురుషుల పాటలు, స్త్రీల పాటలు, పిల్లల పాటలు మొదలైన రీతిలో బహుముఖముగ ఉన్నవి. అన్నమయ్య కంటె పూర్వము పాల్కురికి సోమన కాలమున తుమ్మెద పదములు, వెన్నెల పదములు మొదలగునవి ప్రచారములో ఉన్నవని తెలియుచున్నది గాని అవి లభింపలేదు. ఇంకను నన్నెచోడుని కాలమున అంకమాలికలు, గౌడు గీతములు మొదలగునవి ప్రచారములో ఉన్నవని తెలియుచున్నది గాని ఆ పదములు కూడ లభింపలేదు. వారు పేర్కొనిన ఆయా దేశి సాహిత్య ప్రక్రియలు కాల గర్భమున కలసి పోయినవి. రంగనాథరామాయణము ద్విపదలలో రచింపబడి బహుళ ప్రచారమును పొందినది. శ్రీనాథుని 'పల్నాటి వీర చరిత్రము' కూడ ద్విపదలలో వ్రాయబడి పాడుకొనుట కనుకూలముగనే యున్నది. అన్నమయ్యకూడ ద్విపద రామాయణమును రచించినట్లు తెలియుచున్నది. గాని ఆది అలభ్యమని పూర్వోక్తము. కావున దేశి సాహిత్యములో భిన్న రూపములతో కూడిన గేయములను వెలువరించిన మొదటికవి అన్నమాచార్యుడేనని గ్రహింపవచ్చును. అంతకు పూర్వము జానపదులలో ఆయా పాటలు ప్రచారములో ఉన్నను సుస్థిరమైన రూపములలో లభించిన దేశి సాహిత్యపు పాటలు అన్నమయ్యవే నని గ్రహింపవచ్చును.

కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వరుని భక్తి పారవశ్యముతో కొనియాడిన మొట్టమొదటి తెలుగుకవి అన్నమాచార్యుడేనని చెప్పవచ్చును. అన్నమయ్యకు పూర్వము భక్తకవులు వెలసినను శ్రీనివాసుని వర్ణించిన వారు కన్పింపరు. అన్నమయ్య తరువాత తిరుమల రాయని తాళ్ళపాక వంశీయులు కొనియాడినట్లు తెలియుచున్నది. అన్నమయ్య

కు కొంచెము తరువాతి కాలమునకు చెందిన తుళువాన్వయ సంజాతుడగు సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో శ్రీవేంకటేశుని వర్ణించి తరించినాడు. అతరువాత కళాపూర్ణోదయదయములో సూరన స్వామి పుష్కరిణిని, తిరుమల క్షేత్రమును, శ్రీవేంకటేశుని దివ్యలీలా విగ్రహమును మనోహరముగ వర్ణించినాడు. తాళ్ళపాక వారితోపాటు తిరుపతి కొండపై నివసించెనని చెప్పబడుచున్న తరిగొండ వెంగమాంబ కూడ వేంకటేశ్వరుని అనంత భక్తి భావముతో కీర్తించినది. ఈవిధముగ పద్యకవులెందరో కొండల రాయని వర్ణించినట్లు తెలియుచున్నది. కాని మున్మొదట వర్ణించిన అన్నమయ్యను మించి వర్ణించిన వారు మాత్రము ఆంధ్ర సాహిత్యమునకనిపించరనుట అతిశయోక్తి కాదు. అన్నమయ్య ఛాయలకుకూడ మిగిలిన కవులురాలేక పోయినారు. అన్నమయ్య నోటివెంట వేంకటేశుడే పదములను పలికించినాడట. ఆయన పలికించిన పలుకులనే అన్నమయ్య వ్రాసినాడట. వర్ణింప వలసినది అలమేల్మంగా వేంకటేశ్వరులనే యైనను సహృదయ మనోజ్ఞముగ కొనియాడిన అక్షర శిల్పి అన్నమయ్య. ఆంధ్ర సాహిత్యమున శ్రీవేంకటేశుని వర్ణించిన కవులందరికంటె అన్నమయ్య అగ్రస్థానమున నుండెననుట సహజోక్తి.

సంకీర్తనాచార్యుడైన అన్నమయ్యయే శ్రీవేంకటేశ్వరుని తొలిసారిగ సంకీర్తన రూపమున వర్ణించిన తెలుగుకవి. ఆ తరువాత వెలసిన పదకవులెందరో శ్రీవేంకటనాధుని వర్ణించి తరించినారు. అన్నమయ్య రచనా వైదుష్యమును ప్రశంసించుచు ఆరుద్రగారు "వైష్ణవాన్ని బమ్మెర పోతరాజుగారు పద్యకావ్యాలలోరచిస్తే అన్నమయ్య పదకవిత్వంగా రూపొందించారు. విశిష్టాద్వైతాన్ని మతంగా స్వీకరించి నందువల్లనే అన్నమయ్య ఈ సాహసాన్ని చేశారు. ఏమంటేఆనాటికే పదకవిత్వమంటే పండితులకు ఈసడింపు. తెలుగు పండితులు ఏమనుకొన్నాసరే ద్రావిడవేదంతో, తమిళకవిత్వంతో ప్రత్యక్ష సంబంధమున్న విశిష్టాద్వైతాన్ని స్వీకరించిన అన్నమయ్య ఆభాషలోని మధుర భక్తినంతా అనుభవించి తత్తుల్యమైన గేయాలను తెలుగులో వ్రాయాలనుకొని ప్రపంచంలోని ఏమొదటి రకం కవిత్వానికీ తీసిపోని రచనలు చేశారు.

"తమిళంలో కవిత్వమంటే పాటలే. వాటికిసాహిత్య గౌరవముంది. అన్నమయ్య సంకీర్తనలను ఉత్తమసాహిత్యం అనకపోతే అనని వాళ్ళదేలోపం."[13] అని పలికినారు. ప్రపంచములోని ఏ మొదటిరకమైనకవిత్వమునకు అన్నమయ్య సాహిత్యము

తీసిపోదనిచెప్పినారు. అన్నమయ్యకవితాప్రపంచమున విహరించినసహృదయులకుఆయన కవితా మహత్త్వము అభివ్యక్తము కాగలదు. అన్నమాచార్యుని ఆచార్యత్వమును కీ.శే రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు "తెలుగులో పదకవిత్వం రచించిన వారిలో ఇతని కంటే ప్రాచీనులు మనకు గోచరింపరు. గేయకవిత మనుష్యులకు పరమ ప్రాచీనమైన రచన. నిజమే కనుక, ఇతర భాషలవలె తెలుగులోనూ అనాదిగా పాటలు రచించిన స్త్రీ పురుషులు ఎందరో ఉండి ఉంటారనేది సంభావ్యమే కానీ అవన్నీ కాలగర్భంలో మరుగున పడిపోయినవి. ఉన్నవాని కాల ప్రమాణం మనకు తెలియదు. కృష్ణమాచార్యుని సింహగిరి వచనాలు అన్నమయ్యకు ముందే పుట్టినా అవి గేయ రచనలే ఐనా అవి అంగాంగి విభాగం లేక అఖండ గద్యధారగ, గేయగంథులుగా మాత్రమే ఉన్నవి."[14] అని పలికినారు దీనిని బట్టి అన్నమయ్యకు గల స్థానమును మనమూహింపవచ్చును. పదకవులపంక్తిలో మొట్టమొదటి 'పీట' అన్నమయ్యదేనని గ్రహింపవచ్చును. అన్నమయ్య రచనా సామర్థ్యమును ప్రశంసించుచు రాళ్ళపల్లి వారు "అన్నమాచార్యుల పదకవితలో మనలను సంక్రమించి పరవశపరిచే భావబలం, భాషతీర్పు, అనుభవాలలోతు – వైవిధ్యం – ఇంకే పదకవి రచనలోనూ కానరాదు."[15] అని పలికినారు. ఈ పలుకులననుసరించి అన్నమయ్య పదకవుల పంక్తిలో అధిష్ఠించినది ఎత్తైన 'పీట' అని గ్రహింపవచ్చును.

అన్నమయ్య తరువాతి తిరుమలనాథుని కీర్తించిన పదకవులలో క్షేత్రయ్య, మునిపల్లె సుబ్రమణ్యకవి త్యాగయ్య మొదలగువారు ప్రసిద్ధులు. ఎవరేవిధముగ వర్ణించినను అన్నమయ్య రచనా వైదుష్యపు సమీపమునకు కూడ ఇతర పదకవులు చేరలేకపోయినారు. అన్నమయ్య ప్రకటించిన భావములు, చేసిన కల్పనలు, గుప్పించిన పలుకుబళ్ళు అసంఖ్యాకములు. అనన్య సామాన్యములు. ఆచంద్ర తారార్కములు. సహజ సిద్ధమైన కవితా శిల్పముతో, పదునైన భావనా శక్తితో అనుభవాల వైవిధ్యముతో అన్నమయ్య సాగించిన కవితా వ్యవసాయము ప్రశంసనీయము. అన్నమయ్య ఆధిక్యమును గొనియాడుచు శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారు తెనుఁగు పదములను జోడించుటలో దిక్కునకుఁ గుడిచేయి యన్నమయ్య భావనా ప్రపంచములో విశృంఖలములుగాఁ తిరుగాడు నన్నమాచార్యులను దిక్కన్న తేరిఁగూడ చూడలేడు. అతని చేతిలో భాష మైనము వలె వంగును. ఆ కవి యొక్కొక్క భావమొక్కొక్క నందన వనము.

అన్నమయ్యలోఁ గవిత్వమును వెదకుట సముద్రమునకేత పెత్తుట. అది సర్వాంగీణమైన చక్కెరబొమ్మ. ఎక్కడ తీపుగానుండదు. ఇక నాతని సంగీతం : తాళ్ళపాక వారి రచనలు అర్థభావ ప్రధానములు. త్యాగరాజువలె నాద ప్రధానములుగావు. వారి రచనలకు సంగీతమల్పమైన యుపస్కారము ఇతర భజన కీర్తనలలో నున్నంత సంగీతవాసనగూడ తాళ్ళపాక వారిలో దొరుకుట కష్టమే. వారి జాతీయములు — నానుడులు — అనేక ప్రబంధములకు జీవనౌషధములు. ఒక్కొక్కసారి యొక్కొక్క గంధర్వుడు భూలోకమున నవతరించును. అన్నమయ్య యట్టి గంధర్వుడు. ఆ జన్మలో నా గంధర్వుడు ముక్తినందెను "[16] అని వివరించినారు. వీరిమాటల నాలకించినపుడు అన్నమయ్య మహోన్నతమైన కవితా స్వరూపము సహృదయుల యెదుట సాక్షాత్కరించును. అన్నమయ్యను మూర్తీభవించిన తెలుగు దనముగ భావింపవచ్చును. అన్నమయ్యసాహితీ వ్యవసాయమంతయు దేశీయ రీతులలోనే సాగినది. ఆయన పదములలో అడుగడుగున సామెతలే దర్శనమిచ్చును. తెలుగు జాతీయముల నాకళింపు చేసికొనిన ఈదేశికవితా కృషీవలుడు పదసాహిత్యమున 'పూటి'గ పంటలను పండించినాడు. సంగీతమయము, సరసము కోమలమునైన అన్నమయ్య దేశి కవిత సహృదయ హృదయ రంజకము. ఆలోచనామృతము.

అన్నమాచార్యుని శృంగార ఆధ్యాత్మిక సంకీర్తనములు కేవలము ఊహాజనితములు కావు. భక్తిభావము పెల్లుబికి కవితావేశము పొంగి పొర్లిన ప్రవాహము ఆయన సంకీర్తనములు. శృంగార సంకీర్తనమును చెప్పినను ఆధ్యాత్మిక సంకీర్తనమును చెప్పినను ఏదేనొక ప్రత్యేకతను ప్రదర్శించి సరస హృదయుల మది నాకర్షించునట్లు చెప్పగల నేర్పు అన్నమయ్యకు ఆజన్మ సిద్ధము. అన్నమయ్య శృంగార సంకీర్తనమును చదువుచున్న విరాగియైనను భావోన్ముఖుడు కాక తప్పదు. అతని శృంగార రసాబ్ధిలో నోలలాడ వలసినదే. పద్మమునందలి మకరందము నాస్వాదించుటకు ప్రయత్నించు బంభరము వలె అన్నమయ్య శృంగార రచనా పద్మమునందలి మకరందమును గ్రోలుటకు పాఠకుని మనస్సనెడి బంభరము ప్రయత్నింపక మానదు. అదే విధముగా సంసార సాగరములో శృంగార రసమున నోలలాడు గృహస్థుడైనను అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తన విన్న వెంటనే విరాగికాక తప్పదు. దీని సారమే సంకుసాల నృసింహకవి కవికర్ణ రసాయనమున

"యతి విటుడు గాకపోవు పెట్లస్మదీయ
కావ్యశృంగార వర్ణనాకర్ణనమున
విటుడు యతిగాక పోరాదు వెసమదీయ
కావ్యవైరాగ్య వర్ణనా కర్ణనమున" (అవతారిక – 22)

—అని రచించిన పద్యమని భావింపవచ్చును.

అన్నమయ్య తరువాత వెలసిన పదకర్తలకెందరికో మార్గదర్శి. ఈయన సాగించిన శృంగార సంకీర్తన రచనా విధానము క్షేత్రయ్య, సారంగపాణి మొదలగు పదకవులకు ఆదర్శవంతమైనది. ఆధ్యాత్మిక సంకీర్తనములు మునిపల్లె సుబ్రహ్మణ్య కవి రచించిన అధ్యాత్మిక సంకీర్తనములకు, కంచెర్ల గోపన్న సంకీర్తనలకు, నాదోపాసకుడైన త్యాగయ్యకు ఆధారములైనవి.

పద కవిత అన్నమయ్య కాలమున అత్యంత గౌరవాదరములకు పాత్రమైనది. పదకవితకు కనకాభిషేకము జరిగిన కాలమది. సాక్షాత్తు సాళువ నరసింగ భూపాలుడు అన్నమయ్య పాదములను పన్నీటితో కడిగి, ఆయన ఎక్కిన పల్లకిని నరసింగ భూపాలుడే ఒకప్రక్క మోసినాడట. అన్నమయ్యనాడు ప్రారంభమైన పదకవితా వృక్షము తరువాతి కాలమున శాఖోపశాఖలుగ విస్తరిల్లినది.

అన్నమయ్య ప్రభావమితరులపై ఉండుటను బట్టియే బాలాంత్రపు రజనీకాంత రావు గారిట్లు పలికినారు. "అన్నమాచార్యుడు నారు పోయని తెలుగు గేయక్షేత్రమున క్షేత్రయ్య పదోద్యానముగాని, త్యాగరాజు కీర్తనాబృందావనము గాని ప్రభవించెడివి కావు అంటే ఎంత మాత్రము అతిశయోక్తి కాదు."[17]

ఈ విషమును పరిశీలించినపుడు అన్నమయ్య రచనానైపుణ్యము అనన్య సామాన్య మని వ్యక్తమగును. పదకవితా సముద్రమున నింగివరకు ఎగిరిన కెరటమే అన్నమయ్య శబ్దార్థాలంకార రచనా నైపుణ్యముతో ఆంధ్ర శారదకు వినూత్నకాంతులు విరజిమ్మెడి ఆభరణములను అలంకరింపజేసిన ఆలంకారికుడు అన్నమయ్య తెలుగు నుడికారములను పలుకుబడులను కుప్పలు కుప్పలుగ క్రుమ్మరించిన జాతీయకవి. పదకవితా పృధీశ్వరులకు సార్వభౌముడు. భక్తి భావములను గుప్పించి, భక్తి సిద్ధాంతములను చర్చించి నాస్తికులను కూడ ఆస్తికులునుగ చేయుగలిగిన భక్తకవి శిరోమణి అన్నమయ్య వేంకటేశునిపై అసంఖ్యాకముగ అద్భుతముగ సంకీర్తనములను రచించి వన్నెలోసు

వాసిలోను మేటి సంకీర్తన కర్తగ ప్రసిద్ధి పొందినాడు. సంకీర్తనములకు లక్షణ గ్రంథమును రచించిన ఖ్యాతి అన్నమయ్యకు దక్కినది. వేదాంత సారమును సంకీర్తన రూపమున అందించిన ఘనత అన్నమయ్యకే చెల్లినది. తిరుపతి క్షేత్రమున అనేక ఉత్సవములను ప్రారంభించి వానికి సంబంధించిన సంకీర్తనములను రచించిన ప్రశస్తి అన్నమయ్యకు లభించినది.

"అచ్యుత నామమె పో అధికపు ధనము" (8_27) అని కీర్తించిన నిరాడంబరుడు అన్నమయ్య. ఆధ్యాత్మిక విజ్ఞానముతో అపారమైన ప్రతిభను చేకూర్చిన వాగ్గేయకారుడు. లక్షణ శుద్ధిగలిగిన రసజ్ఞ మనోజ్ఞమైన సంకీర్తనములను వెలయించిన సంకీర్తనాచార్యుడు. తెలుగువారి ఇలవేలుపైన తిరుమల నాథుని దివ్య మంగళ స్వరూపమును తీయతీయగ వర్ణించిన తెలుగుతల్లి ముద్దుబిడ్డ అన్నమయ్య.

"సులభమా యిందరికిఁ జూడ సులభము గాక
కలిగె మీ కృపనాకుఁ గమలా రమణా" యని పలికిన ధన్యజీవి.

తెలుగువారి భక్తి గీతములను భూ, నభోంతరాళములలో ప్రతిధ్వనింపజేసిన గాయకోత్తముడు. ఇహలోకమున భక్తి సామ్రాజ్యమును అమోఘముగ పరిపాలించి పరలోక భక్తి సామ్రాజ్యము నేలుటకుపయనము గట్టిన పరమాత్మని ఆస్థాన కవి అన్నమయ్య. భక్తి భావము,తెలుగుదనము సంకీర్తన రచన ముమ్మూర్తుల మూర్తీభవించిన మూర్తియే అన్నమయ్య.

అన్నమయ్య గావించిన వర్ణనలలో మౌలికత ఈ సిద్ధాంత వ్యాసమున స్పష్టీకరించుటకు ప్రయత్నము జరిగినది.

సుకృతులవలన రససిద్ధుడైన కవీశ్వరుడు అన్నమయ్య.

# సూచికలు


| | | | |
|---|---|---|---|
| 1. | తెలుగులో పద కవిత – మేలి పలుకు | పుటలు | VII, VIII |
| 2. | ,, ,, ,, | పుట | 19 |
| 3. | ,, ,, ,, | పుట | 30 |
| 4. | స్వర్ణోత్సవ సంచిక తి.తి.దే. తెలుగు వెలుగు | పుట | 117 |
| 5. | తొలి సంకీర్తన కవులు | పుటలు | 19, 20. |
| 6. | తెలుగులో పదకవిత(ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ | పుట | 2 |
| 7. | వేంకటేశ్వర శతకము | పద్యము | 50 |
| 8. | ,, ,, | ,, | 100 |
| 9. | అన్నమాచార్యులు | పుట | 64 |
| 10. | అన్నమయ్య – త్యాగయ్య | (అనుబంధము) | |
| 11. | సంకీర్తన లక్షణము | | 13 |
| 12. | తొలి సంకీర్తన కవులు | పుట | 38 |
| 13. | సమగ్రాంధ్ర సాహిత్యం | పుట | 160 |
| 14. | స్వర్ణోత్సవ సంచిక, తి.తి.దే.-తెలుగు వెలుగులు | పుట | 119 |
| 15. | ,, ,, ,, ,, | పుట | 121 |
| 16. | తెలుగులో పదకవిత | పుటలు | 30, 31 |
| 17. | శృంగారాధ్యాత్మిక సంకీర్తనములు ప్రథమసంపుటి | పుట | XXX |

# ఉపయుక్త గ్రంథ సూచిక


1. అన్నమాచార్యులు, తాళ్ళపాక: ఆధ్యాత్మిక సంకీర్తనములు : I, II, V, VI, VII, IX, X, XI సంపుటములు

శృంగార సంకీర్తనములు :

III, IV, XII, XIV, XV, XVII, XVIII, XIX, XX, XXI, XXII XXIV, XXV, XXVI, XXVII, XXVIII, XXIX, XXX సంపుటములు.

2. అన్నమారాధ్యకవి: యథావాక్కుల: సర్వేశ్వర శతకము
3. అప్పారావు, విస్సా క్షేత్రయ్య పదములు 1950
4. డా॥ అరుణకుమారి, ఎ. ఆంధ్రవాఙ్మయమున చారిత్రక కావ్యములు 1978
5. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ; సాహిత్యోపన్యాసములు - 3, క్షేత్రయ్య పద సాహిత్యము 1963
6. ఆంధ్ర సారస్వత పరిషత్తు; తెలుగులో పదకవిత 1973
7. డా॥ ఆనందమూర్తి, వేటూరి; తాళ్ళపాకకవులు-వివిధ సాహితీప్రక్రియలు 1974
8. ,, ,, ,, తాళ్ళపాక కవుల పదకవితలు భాషా ప్రయోగ విశేషాలు 1976
9. ,, ,, ,, తొలి సంకీర్తన కవులు 1975
10. ఆరుద్ర: సమగ్రాంధ్ర సాహిత్యం (ఆరవ సంపుటి) 1965
11. ఎఱ్ఱాప్రెగడ ; హరివంశము 1967
12. కృష్ణమూర్తి, కె.వి. శ్రీఅన్నమయ్య 1956
13. కామేశ్వర కవి లింగనమఖి ; సత్యభామా సాంత్వనము 1937
14. కుమారస్వామి, బి. క్షేత్రయ్య పదములు సర్వసాహిత్యములు 1968
15. డా॥ కులశేఖరరావు, ఎమ్. సింహగిరివచనములు(కృష్ణమాచార్యప్రణీతము) 1980
16. డా॥ గంగప్ప. ఎస్: క్షేత్రయ్య పదసాహిత్యం 1974
17. ,, ,, క్షేత్రయ (సమాచార పౌర సంబంధశాఖ ప్రచురణ)
18. ,, ,, కోలాచలం శ్రీనివాసరావు నాటక సాహిత్యసమాలోచనము 1977
19. ,, ,, సారంగపాణి పదసాహిత్యం 1980
20. ,, ,, తెలుగు వాగ్గేయకారులు 1980
21. ,, ,, తెలుగులో పదకవిత 1983

22. గోపాలకృష్ణయ్య, వడ్లమూడి : శృంగార పదములు 1972
23. ,, ,, శ్రీగీతగోవిందము, గీతశంకరము 1972
24. డా॥ గోపాలకృష్ణారావు, కె. ఆంధ్ర శతక సాహిత్యవికాసము 1976
55. గోపాలస్వామి ; కూర్మా, వేణు. తెలుగు వాఙ్మయము సంగ్రహ చరిత్ర 1960
26. చిన తిరువెంగళనాథుడు, తాళ్ళపాక : శ్రీ అన్నమాచార్యుల జీవిత చరిత్రము 1978
27. చెన్నారెడ్డి, జీరెడ్డి : తాళ్ళపాకవారి పాటలు Vol II 1946
28. జగన్నాథరావు, మంచాళ : ఆంధ్రుల సంగీతకళ 1975
29. ,, ,, అన్నమాచార్యులవారి ఆధ్యాత్మిక సంకీర్తనములు ప్రథమ సంపుటి
30. జోగారావు, యస్వీ : ఆంధ్రయక్షగాన వాఙ్మయ చరిత్ర 1961
31. తాళ్ళపాకవారి లఘుకృతులు 1938
32. తిమ్మన, నంది ; పారిజాతాపహరణము 1961
33. ఆచార్య దోణప్ప, తి : ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణము 1969
34. నన్నెచోడుడు : కుమార సంభవము 1972
35. డా॥ నరసింహం, అంతటి : ప్రబంధములలో ప్రకృతి వర్ణనలు 1979
36. నృసింహకవి, సంకుసాల : కవికర్ణ రసాయనము 1916
37. డా॥ నాగయ్య, జి. ద్విపదవాఙ్మయము 1967
38. నారాయణాచార్యులు, పుట్టపర్తి : వాగ్గేయకారులు పదకృతి సాహిత్యం 1975
39. ప్రమీలాదేవి, మంగళగిరి ; భారతీ కళాతరంగిణి 1932
40. పినవీర భద్రకవి, పిల్లలమఱ్ఱి : శృంగారశాకుంతలము 1930
41. పెదతిరుమలాచార్యులు, తాళ్ళపాక : శృంగారాధ్యాత్మిక సంకీర్తనములు XXIII 1976
42. పెద్దనామాత్యుడు, అల్లసాని : స్వారోచిషమనుచరిత్రము 1060
43. పోతన, శ్రీమదాంధ్ర మహాభాగవతము : సప్తమ, అష్టమ దశమస్కంధములు 1968
44. మల్లయసంది, సింగయఘంటు. ప్రబోధ చంద్రోదయము (ఆంధ్ర సాహిత్య అకాడమీ)

45. ముద్దుపళని : రాధికా సాంత్వనము
46. రజనీకాంతరావు, బాలాంత్రపు : ఆంధ్రవాగ్గేయకారచరిత్రము 1975
47. రమణయ్య, ఎన్.వి.వి. కడపశిలా శాసనములు పగయిరా Nc. BLIX
48. రామకృష్ణకవి, తెనాలి : పాండురంగ మాహాత్మ్యము 1952
49. డా॥ రామకోటిశాస్త్రి, కేతవరపు : తిక్కన కావ్య శిల్పము 1973
50. డా॥ రామతారక పరబ్రహ్మశాస్త్రి, సన్నిధానము, ఆంధ్ర సారస్వతము నందలి అద్వైత కావ ములు 1981
51. డా॥ రామరాజు, బిరుదురాజు : తెలుగు జానపద గేయ సాహిత్యము 1978
52. రామరాజ భూషణుడు : వసుచరిత్రము 1954
53. రామలక్ష్మి, ఆరుద్ర : తాళ్ళపాంరుని పలుకుబళ్ళు 1971
54. రామలింగస్వామి, గ్రంధి : జయదేవుల చరిత్రము 19[illegible]6
55. ఆచార్య లక్ష్మీకాంతం, పింగళి : ఆంధ్ర సాహిత్య చరిత్ర 1976
56. లక్ష్మీరంజనం, ఖండవల్లి : ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము 1965
57. లక్ష్మీరంజనం, బాలేందుశేఖరం : ఆంధ్రుల చరిత్ర సంస్కృతి 1951
58. వరదాచార్యులు, ధనకుదరం : శ్రీరామానుజకీర్తి కౌముది 1981
59. ,, ,, ఆళ్వారులు—దివ్య ప్రబంధములు 1970
60. విజ్ఞాన సర్వస్వము, తెలుగు సంస్కృతి-3 1959
61. డా॥ విద్యావతి, వి తాళ్ళపాక కవుల సాహిత్య సేవ 1979
62. డా॥ విశ్వనాథరెడ్డి, కేతు : కడప ఊర్ల పేర్లు 1976
63. వీరభద్రశాస్త్రి, కల్లూరి : త్యాగరాజ కీర్తనలు—విశేషవివరణము. ప్రధమ సంపుటి 1975
64. ,, ,, ,, ,, ,, ద్వితీయ సంపుటి 1978
65. వెంకటకవి, చేమకూర — విజయవిలాసము 1968
66. డా॥ వేంకటావధాని, దివాకర్ల - ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము 1967
67. వేంకటేశ్వర్లు, పుల్లాభొట్ల — ఒక కవి పుంగవులు 1981
68. శ్రీకృష్ణదేవరాయలు — ఆముక్తమాల్యద
69. శ్రీనాథుడు — శృంగార నైషధము
70. శ్రీనివాస చక్రవర్తి — క్షేత్రయ్య పదాలు 1966
71. శ్రీనివాసులు శెట్టి, కె. అన్నమాచార్యుల సంకీర్తనములు(కూర్పు) 1977

72. ,, ,, అన్నమాచార్యులు 1982
73. శ్రీరమణ సత్సంగమం - దాక్షిణాత్య భక్తులు
74. శేషయ్య, చాగంటి — ఆంధ్రకవి తరంగిణీ 6,7,8 సంపుటములు 1961
75. డా॥ సంగమేశం, ముట్నూరి. అన్నమాచార్య సాహితీ కౌముది 1931
76. ,, ,, ,, అన్నమయ 1983
77. డా॥ సర్వోత్తమన్. కె. అన్నమయ్య—త్యాగయ్య — 1983.
78. సారంగపాణి పదములు
79. సీతాపతి, గిడుగు : క్షేత్రయ్య పదములు — 1952
80. డా॥ సుందరం. ఆర్.వి.యస్. తెలుగు సాహిత్యంలో దేశకవిత — 1970
81. డా॥ సుజాతారెడ్డి ఎం ; మనువసు చరిత్రల తులనాత్మక పరిశీలనము—1981
82. సుధాకర్‌రెడ్డి, తిరుమూరు నాదయోగి త్యాగయ్య—1981
83. సుబ్బరామ దీక్షితులు ; సంగీత సంప్రదాయ ప్రదర్శిని—1973
84. డా॥ సుబ్బరాయుడు జె.వి : ద్విపద రామాయణ భారతి—1981
85. డా॥ సుబ్రహ్మణ్యం, జి.వి : ప్రథమాంధ్ర మహాపురాణము—1973
86. డా॥ సుశీల, టి : ఆంధ్ర ద్విపద సాహిత్య చరిత్ర—1979
87. సూరన. పింగళి — కళాపూర్ణోదయము—1980
88. సూర్యనారాయణ శాస్త్రి, ఖండవిల్లి ; భక్త పోతన-మహాభాగవతరచన—1977
89. సూర్యనారాణమూర్తి జోస్యుల : క్షేత్రయ్య — 1968
90. ,, ,, అన్నమయ్య ,,
91. ,, ,, త్యాగయ్య ,,
92. సోమనాథుడు, పాల్కురికి, బసవ పురాణము—1952

లక్షణ గ్రంథములు

93. అప్పకవి, కాకునూరి : అప్పకవీయము
94. ఆచార్య నరసింహం. కె.వి.ఆర్. సాహిత్య దర్శనము—1979
95. పెద్దయ మహాకవి, విన్నకోట — కావ్యాలంకార చూడామణి—1972
96. రంగాచార్యులు, చలమచర్ల : ఆంధ్ర ప్రతాప రుద్ర యశోభూషణము—1944
97. ఆచార్య లక్ష్మీకాంతం, పింగళి : సాహిత్య శిల్ప సమీక్ష—1966
98. వెంకటరామశాస్త్రి : భాషాకువలయానందము (ఆంధ్రీకృతి)—1968
99. వెంకటరాయశాస్త్రి, వేదం : ఆంధ్ర సాహిత్య దర్పణము—1935

100. వేంకటావధాని, దివాకర్ల : సాహిత్య సోపానములు—1970

101 సూర్యనారాయణశాస్త్రి, సన్నిధానము : కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యానము —1970

సంస్కృత గ్రంథములు

102. భగవద్గీత – తిరుమల తిరుపతి దేవస్థానము వారి ప్రచురణ—1979

103. భాగవతము – శ్రీధరీయ, వీరరాఘవీయ వ్యాఖ్యాద్వయ సహితము—1929

104. జయదేవుడు – గీత గోవిందము

105. నారాయణ తీర్థులు – కృష్ణలీలా తరంగిణి

పత్రికలు

106. ఆంధ్రప్రభ – వారపత్రిక 3–10–84

107. భారతి – మాసపత్రిక – ఆగస్టు 1953

108. ,, ,, ,, 1971

109. ,, ,, నవంబరు–1971

110. భారతి మాసపత్రిక మార్చి 1975

111. ,, ,, జూన్ 1982

112. ,, ,, ఫిబ్రవరి 1984

ప్రత్యేక సంచికలు

113. అర్చన : ఆచార్య విస్సా అప్పారావు గారి శతజయంత్యుత్సవ సంచిక 1984

114. విక్రమ సంవత్సరాది సంచిక. ఆంధ్రపత్రిక – 1940

115. స్వర్ణోత్సవ సంచిక – తిరుమల తిరుపతి దేవస్థానము – 1934

ఆంగ్ల గ్రంథములు

116. Hundson W.H. : An Introduction to the study of Literature — 1955

117. Goswamy O: : The History of Indian Music — 1961

118. Moulton R G. : The Modern study of Literature—1915

119. Nilakanta Sastry K.A. : A History of South India–1966

120. Sambamurthy P. : South Indian Music – Parts 1,2,3&4 1935

121. Sitapati G V. : History of Telugu Literature

122. Varadachari K C. : Bhakti Cult in South India – 1957

123. Winternitz : A History of Indian Literature – 1959



## *Dr. G. SAMBASIVA RAO :*

## ANNAMACHARYA SANKEERTHA NAMULALONI VARNANALU

| | | |
|---|---|---|
| జననము | : | 1-06-1958, వేజండ్ల, చేబ్రోలు మండలము, గుంటూరుజిల్లా |
| జననీ జనకులు | : | పార్వతమ్మ, అయితమరాజు |
| విద్యాభ్యాసము | | |
| ప్రాథమిక విద్య | : | వేజండ్ల, గుంటూరుజిల్లా |
| ప్రాథమికోన్నత విద్య | : | నారాకోడూరు, గుంటూరుజిల్లా |
| ఉన్నత విద్య | : | జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంగంజాగర్లమూడి, గుంటూరుజిల్లా |
| కాలేజీ చదువు | : | హిందూ కళాశాల, గుంటూరు |
| ఎం. ఏ. | : | 1980లో సర్వ ప్రథమునిగా నాగార్జున విశ్వవిద్యాలయము, నాగార్జున నగర్, గుంటూరు<br>ఎం.ఏ లో సర్వ ప్రథమునిగా ఉత్తీర్ణత సాధించినందుకు, కీ.శే. శ్రీమతి బాలిశెట్టి వెంకట సుబ్బమ్మ, మెమోరియల్ గోల్డ్‌మెడల్ |
| పిహెచ్.డి. | : | 1985లో, నాగార్జున విశ్వవిద్యాలయము |
| ఉద్యోగము | | |
| ఆంధ్రోపన్యాసకునిగా | : | 1985 సెప్టెంబరు నుండి 1988 జూలై వరకు, సప్తగిరి కళాశాల విజయవాడ |
| ప్రస్తుతము | : | ఆంధ్రాలయోలా కళాశాల, విజయవాడ |
| ఇతర రచనలు | : | అముద్రితాలు:<br>1. ప్రాచీనాంధ్ర కవయిత్రుల స్త్రీవ్యథా చిత్రణం<br>2. అన్నమయ్య భక్తి పరిమళ<br>3. సాహితీ సౌరభం (వ్యాస సంపుటి) |